# Telugu kāvyāvatarikallō Iṣṭadēvatāstuti - pariṇāmakramaṁ

## (Nannaya nuṇḍi Nēṭidāka)

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the degree of

Doctor of Philosophy

In

Telugu

Researcher

**BOLUGADDE ANIL KUMAR**

**(10HTPH12)**

Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad- 500046

December- 2017

# తెలుగు కావ్యావతారికల్లో ఇష్టదేవతాస్తుతి- పరిణామ క్రమం

# (నన్నయ నుండి నేటిదాక)

**పిహెచ్. డి పట్టం కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం**


**పరిశోధన**

**బోలుగద్దె అనిల్‌కుమార్**

**(10HTPH12)**

**తెలుగుశాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు – 500046**



**డిసెంబర్ - 2017**

# DECLARATION

I, **Bolugadde Anil Kumar** hereby declare that this dissertation entitled **Telugu kāvyāvatarikallō Iṣṭadēvatāstuti - pariṇāmakramaṁ (Nannaya nuṇḍi Nēṭidāka)** submitted by me under the guidance and supervision of Prof. **S. Sarath Jyotsnarani** is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

**Date:**

Signature of the Student

Name: Bolugadde Anil Kumar

Registration No. 10HTPH12

# CERTIFICATE

This is to certify the Thesis entitled **"Telugu kāvyāvatarikallō Iṣṭadēvatāstuti – Pariṇāmakramaṁ (Nannaya nuṇḍi Nēṭidāka)"** submitted by **Mr. Bolugadde Anilkumar,** bearing **Regd. No. 10HTPH12** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-9(1st) of the thesis.)

1. **"Iṣṭadēvatāstutulu –Pariṇāmakramaṁ"** (ISSN no_ 2456-4702),9th chapter Pg.NO.108-109, **"Bhavaveena"** monthly magazine (Vol.14, issue. 11(3), November -2017), Edited by Dr. B. Venkataswamy (Chief Editor), 2/11 Brodipet, Guntur-2.
2. **"Iṣṭadēvatāstutulu – kavula vibhinna dṙkkōnālu"** (ISSN no_ 2456-4702), Pg.No.36-37, **"Bhavaveena"** monthly magazine (Vol.14, issue. 12(1), December -2017), Edited by Dr. B. Venkataswamy (Chief Editor), 2/11 Brodipet, Guntur-2.

**B. Presented in the following conferences:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapter-8(2nd) of the thesis.)

1. **"Telugu kāvyā vāñmayaṁlō Iṣṭadēvatāstutula pātra"** (National), summary, Conducted by TTD & Kurthala Peetham, Thirunalveli(Dt), Tamilanadu on 9th to 11th October 2016.

2. **" Iṣṭadēvatāstutulu-viśēṣāmśālu"** (International), 8th Chapter. Conducted by Dept. of Telugu, Madras University, Channai, on 1st to 2nd March 2017.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil program and the M. Phil degree was awarded.

| Course Code | Name | Credits | pass/fail |
|---|---|---|---|
| 1. HT 600 | Research Methodology | 5.00 | PASS (A) |
| 2. HT 601 | History of Telugu Research | 4.00 | PASS (A) |
| 3. HT 602 | Studies in Specialized Area | 3.00 | PASS (A+) |
| 4. HT 603 | Broad Field | 4.00 | PASS (A+) |
| 5. HT 780 | Dissertation | 16.00 | PASS (A) |

| Prof. S. SARATH JYOTSNARANI | Prof. T. RAMAKRISHNA | Prof. PANCHANAN MOHANTY |
|---|---|---|
| **Research Supervisor** | **Head, Telugu** | **Dean, Humanities** |

# " కృతజ్ఞతలు "

కేవలం పిల్లలమీద ప్రేమతో నిష్కళంక హృదయులై ననుగన్న నా తల్లిదండ్రుల పాదపద్మములకు ప్రణమిల్లుతున్నాను.

డాక్టరేటు పొందాలన్న నా కలలను నిజం చేస్తూ, నేను పి.హెచ్. డి చేయడానికి అవకాశమిచ్చిన హైదరాబాదు విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతల నర్పిస్తున్నాను.

"జ్యోత్స్నా విగ్రహవతీ మానవతాయాః " అన్నట్లు కేవలం మానవత్వానికి తప్ప వర్గవైషమ్యాలకు అందని మా గుర్వాణి, మా పాలిటి అను నిత్యవాణి, నా ఆసాంత పరిశోధనాకృషికి పథదర్శకులుగావ్యవహరించిన శ్రీమతి ఆచార్య శరజ్యోత్స్నారాణి మేడం గార్కి కృతజ్ఞతాంజలులను సమర్పిస్తున్నాను.

నా పరిశోధన సవ్యంగా సాగడానికి కారకులైన తెలుగు శాఖాధిపతి తుమ్మల రామకృష్ణ సార్ గార్కి, వ్యాకరణాల విలువదెల్పిన రేమిళ్ళ వేంకట రామకృష్ణ శాస్త్రి గార్కి, ఆప్యాయంగా పలుకరించే గడ్డ అరుణకుమారి మేడం గార్కి, పిల్లలమర్రి రాములు సార్, దార్ల వేంకటేశ్వర్లు సార్, భుజంగరెడ్డి సార్ గార్లకు నా నమోవాకములు. నా విద్వత్తుకు వన్నెతెచ్చే అపూర్వ సలహాదారులైన దేవారెడ్డి విజయలక్ష్మి మేడం, పమ్మి పవన్ కుమార్ సార్ గార్లకు అయిదు పది చేస్తున్నాను.

నాకు ముగురమ్మలుగా దర్శనమిచ్చి నా ఉన్నతిని కాంక్షించే మా ఉషారాణిబాయి మేడం, శ్రీమతి పై. పద్మావతి మేడం, శ్రీమతి రాధారాణి మేడం గార్లకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

అనునిత్యము నాతో ఊసులాడుతూ నన్ను ప్రేరేపిస్తున్న మా భారతీ రమేశ్ అక్కయ్య, లక్ష్మీ అక్కయ్యలకు, ప్రియమిత్రుడు జానకీ రామరాజుకు, నాకు ఆలంబనగా నిలబడి నాఅభివృద్ధే తన ధ్యేయంగా భావించే రథబంధకవి శ్రీ తిరువాయిపాటి చక్రపాణిగార్కి, ప్రోత్సాహశీలురు మల్లు వెంకటరెడ్డి గార్కి, నిచ్చెనమెట్ల వేంకటేశ్వరగుప్త గార్కి, పోలూరు విజయభాస్కర్ గార్కి, కృతజ్ఞతాభి వందనాలను అర్పిస్తునాను.

ఇక ఈ పరిశోధనకోసం పుస్తకాలను సేకరించి, కొండంత అండగా నిలబడి, సుమధుర ఫణితిలో అక్షరాలను కూర్చిన డా. మునిగోటి సుందరరామ శర్మగార్కి, శతకోటి వందనాలర్పిస్తున్నాను.

ఎన్నో సందేహాలను నివృత్తి చేస్తూ నాకు విద్యాభిక్షను ప్రసాదిస్తున్న ఆచార్య రాణి సదాశివమూర్తిగార్కి, అవధాని డా.ఆశావాది ప్రకాశరావు గార్కి, సాంప్రతి సురేంద్రనాథ్ గార్కి, డా. ఎస్. శాంతమ్మ మేడం గార్కి, అప్పలనాయుడు సార్, గౌరీశంకర సార్ గార్కి, నర్రెడ్డి రామలింగారెడ్డి సార్ గార్కి, మనోజ్ సార్, పై.కృష్ణారెడ్డి, ఎస్ ప్రభాకర్ రెడ్డి, సి. గిరిధర్ రెడ్డి సార్ గార్లకు వేలవేల వందనాలతో కృతజ్ఞతల నర్పిస్తున్నాను.

నా పరిశోధనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ సెలవ్.........

*"సత్యే సర్వం ప్రతిష్ఠితం"*

ఇట్లు,
బోలుగద్దె అనిల్ కుమార్

# సంకేతాక్షర పట్టిక

| క్ర.సం. | సంక్షిప్తాక్షరం. | సంపూర్ణ రూపము. |
|---|---|---|
| 1 | అ | అధ్యాయము |
| 2 | స /సర్గ | సర్గ |
| 3 | పర్వ | పర్వము |
| 4 | భార | భారతము |
| 5 | భాగ | భాగవతము |
| 6 | పద్య | పద్యము |
| 7 | వచ | వచనము |
| 8 | రామా | రామాయణము |
| 9 | చాటు | చాటువులు |
| 10 | సేక | సేకరణ |
| 11 | వే.ప్ర.శా | వేటూరి ప్రభాకర శాస్త్రి |
| 12 | చాటు | చాటు పద్య మణి మంజరి / చాటువులు |
| 13 | ఉపో | ఉపోద్ఘాతము |
| 14. | పీ/పీఠి | పీఠిక |

| | | |
|---|---|---|
| 15 | ప్రభా. ప్ర | ప్రభావతీ ప్రద్యుమ్నము |
| 16 | ప్రక | ప్రకరణము |
| 17 | శ్రీ సూ. ఆం ని | శ్రీ సూర్య రాయ ఆంధ్ర నిఘంటువు. |
| 18 | తి తి దే | తిరుమలతిరుపతి దేవస్థానములు |
| 19 | వచ | వచనము/లు |
| 20 | అనిరుద్ధ | అనిరుద్ధ చరిత్రము |
| 21 | ఆముక్త | ఆముక్తమాల్యద |
| 22 | తె వి పీ. | తెలుగు విజ్ఞాన పీఠము |
| 23 | హరిశ్చంద్ర | హరిశ్చంద్రనలోపాఖ్యానము |
| 24 | ఉత్తర హరి | ఉత్తరహరివంశము |
| 25 | కంకంటి | కంకంటి పాపరాజు |
| 26 | అమ | అమరకోశము [గురుబాల ప్రబోధ వ్యాఖ్య] |
| 27 | కాశీ | కాశీఖండము |
| 28 | హర | హరవిలాసము |
| 29 | అవ | అవతారిక |

# “తెలుగు కావ్యావతారికలలో ఇష్టదేవతాస్తుతి – పరిణామక్రమము”

## (నన్నయ నుండి నేటి వరకు)

## విషయ సూచిక

పుటసంఖ్య


కృతజ్ఞతలు

సంకేంతాక్షర పట్టిక

ప్రవేశిక

| | | |
|---|---|---|
| **I.** | **<u>ప్రథమాధ్యాయము</u>** | **1–38** |
| 1. | కావ్యావతారికలు | 1–1 |
| 2. | అవతారిక–అర్థం–నిర్వచనం–ప్రాశస్త్యం | 2–6 |
| 3. | అవతారికలపై జరిగిన కృషి | 7–12 |
| 4. | కావ్యావతారికలు – విశేషాంశములు | 13–37 |
| 5. | అవతారికలు ప్రయోజనాలు | 38–38 |
| **II.** | **<u>ద్వితీయాధ్యాయము</u>** | **39–93** |
| 2. | తెలుగు కావ్యావతారికలు – కావ్యారంభ పద్యాలు | 39–40 |
| 2.1 | తెలుగు కావ్యావతారికలు – శ్రీకార ప్రయోగ పద్యాలు | 41–56 |
| 2.2 | తెలుగు కావ్యావతారికలు – శ్లోకారంభ పద్యాలు | 57–61 |
| 2.3 | తెలుగు కావ్యావతారికలు – ఆశీర్నమస్క్రియా పద్యాలు | 62–74 |
| 2.4 | తెలుగు కావ్యావతారికలు – వస్తునిర్దేశ పద్యాలు | 75–93 |
| **III.** | **<u>తృతీయాధ్యాయము</u>** | 94–123 |
| 3 | తెలుగు కావ్యావతారికలు – ఇష్టదేవతా స్తుతులు | 94–98 |
| 3.1 | తెలుగు కావ్యావతారికలు – ఇష్టదేవతా స్తుతి – అర్థం నిర్వచనం | 99–105 |
| 3.2 | తెలుగు కావ్యావతారికలు – వర్ణనా నిపుణత | 106–116 |
| 3.3 | తెలుగు కావ్యావతారికలు – నన్నయ అందించిన వినిర్మాణం | 117–123 |

| | | | |
|---|---|---|---|
| | **IV.** | **చతుర్థాధ్యాయము** | **124-178** |
| | 4 | తెలుగు కావ్యావతారికలు - శైవసంబంధ స్తుతులు | 124 |
| | 4.1 | తెలుగు కావ్యావతారికలు - గణేశ స్తుతులు | 125-146 |
| | 4.2 | తెలుగు కావ్యావతారికలు - ఈశ్వర స్తుతులు | 147-162 |
| | 4.3 | తెలుగు కావ్యావతారికలు - పార్వతీదేవి స్తుతులు | 163-167 |
| | 4.4 | తెలుగు కావ్యావతారికలు - సుబ్రహ్మణ్యస్వామి స్తుతులు | 168-171 |
| | 4.5 | తెలుగు కావ్యావతారికలు - వీరభద్రుని స్తుతులు | 171-172 |
| | 4.6 | తెలుగు కావ్యావతారికలు - వీరశరభమూర్తి స్తుతులు | 173-174 |
| | 4.7 | తెలుగు కావ్యావతారికలు - భైరవస్వామి స్తుతులు | 175-176 |
| | 4.8 | తెలుగు కావ్యావతారికలు - శివలింగ స్తుతులు | 177-178 |
| **V.** | **పంచమాధ్యాయము** | | **179-201** |
| | 5 | తెలుగు కావ్యావతారికలు - శాక్తేయ సంబంధ స్తుతులు | 179-182 |
| | 5.1 | తెలుగు కావ్యావతారికలు - శాక్తేయ స్తుతులు | 183-192 |
| | 5.2 | తెలుగు కావ్యావతారికలు - మాతృకా శక్తుల స్తుతులు | 193-195 |
| | 5.3 | తెలుగు కావ్యావతారికలు - జ్యేష్ఠాదేవి స్తుతులు | 196-197 |
| | 5.4 | తెలుగు కావ్యావతారికలు - గంగాదేవి స్తుతులు | 197-201 |
| **VI.** | **షష్ఠాధ్యాయము** | | **202-290** |
| | 6 | తెలుగు కావ్యావతారికలు - వైష్ణవ సంబంధ స్తుతులు | 202-204 |
| | 6.1 | తెలుగు కావ్యావతారికలు - విష్ణుమూర్తి స్తుతులు | 205-214 |
| | 6.2 | తెలుగు కావ్యావతారికలు - లక్ష్మీ స్తుతులు | 214-227 |
| | 6.3 | తెలుగు కావ్యావతారికలు - ఆదిలక్ష్మీ స్తుతులు | 227-229 |
| | 6.4 | తెలుగు కావ్యావతారికలు - శ్రీ నరసింహస్వామి స్తుతులు | 230-233 |
| | 6.5 | తెలుగు కావ్యావతారికలు - శ్రీ రాముని స్తుతులు | 234-240 |
| | 6.6 | తెలుగు కావ్యావతారికలు - సీతాదేవి స్తుతులు | 240-243 |
| | 6.7 | తెలుగు కావ్యావతారికలు - హనుమంతుని స్తుతులు | 244-250 |
| | 6.8 | తెలుగు కావ్యావతారికలు - లక్ష్మణస్వామి స్తుతులు | 251-251 |
| | 6.9 | తెలుగు కావ్యావతారికలు - భరత స్తుతులు | 252-252 |
| | 6.10 | తెలుగు కావ్యావతారికలు - శత్రుఘ్న స్తుతులు | 252-252 |
| | 6.11 | తెలుగు కావ్యావతారికలు - శ్రీ కృష్ణుని స్తుతులు | 253-258 |
| | 6.12 | తెలుగు కావ్యావతారికలు - రుక్మిణీదేవి స్తుతులు | 258-261 |

| | | |
|---|---|---|
| 6.13 | తెలుగు కావ్యావతారికలు – సత్యభామా స్తుతులు | 261-262 |
| 6.14 | తెలుగు కావ్యావతారికలు – బలరాముని స్తుతులు | 262-264 |
| 6.15 | తెలుగు కావ్యావతారికలు – ఆదిశేషుని స్తుతులు | 264-266 |
| 6.16 | తెలుగు కావ్యావతారికలు – గరుత్మంతుని స్తుతులు | 267-270 |
| 6.17 | తెలుగు కావ్యావతారికలు – విష్వక్సేనుని స్తుతులు | 271-273 |
| 6.18 | తెలుగు కావ్యావతారికలు – శ్రీవేంకటేశ్వర స్వామి స్తుతులు | 274-276 |
| 6.19 | తెలుగు కావ్యావతారికలు – అలమేలుమంగాస్తుతులు | 277-280 |
| 6.20 | తెలుగు కావ్యావతారికలు – పంచాయుధములస్తుతి | 280-284 |
| 6.20.1 | తెలుగు కావ్యావతారికలు – పాంచజన్య స్తుతి | 284-285 |
| 6.20.2 | తెలుగు కావ్యావతారికలు – నందక స్తుతి | 285-286 |
| 6.20.3 | తెలుగు కావ్యావతారికలు – కౌమోదకీ స్తుతి | 286-287 |
| 6.20.4 | తెలుగు కావ్యావతారికలు – శార్ఙ్గస్తుతి | 287-287 |
| 6.20.5 | తెలుగు కావ్యావతారికలు – సుదర్శన స్తుతి | 287-290 |

**VII. సప్తమాధ్యాయము** **291-363**

| | | |
|---|---|---|
| 7. | తెలుగు కావ్యావతారికలు – ఇతరదేవతా స్తుతులు | 291-291 |
| 7.1 | తెలుగు కావ్యావతారికలు – బ్రహ్మ స్తుతులు | 291-303 |
| 7.2 | తెలుగు కావ్యావతారికలు – సరస్వతీదేవి స్తుతులు | 304-317 |
| 7.3 | తెలుగు కావ్యావతారికలు – పరబ్రహ్మ స్తుతులు | 317-318 |
| 7.4 | తెలుగు కావ్యావతారికలు – నిర్గుణబ్రహ్మ స్తుతులు | 319-321 |
| 7.5 | తెలుగు కావ్యావతారికలు – త్రిమూర్తుల స్తుతులు | 321-324 |
| 7.6 | తెలుగు కావ్యావతారికలు – దత్తాత్రేయుని స్తుతులు | 325-325 |
| 7.7 | తెలుగు కావ్యావతారికలు – హరిహరనాథ స్తుతులు | 325-327 |
| 7.8 | తెలుగు కావ్యావతారికలు – సూర్యుని స్తుతులు | 327-332 |
| 7.9 | తెలుగు కావ్యావతారికలు – చంద్రుని స్తుతులు | 332-336 |
| 7.10 | తెలుగు కావ్యావతారికలు – నవగ్రహాల స్తుతులు | 336-348 |
| 7.11 | తెలుగు కావ్యావతారికలు – అష్టదిక్పాలకుల స్తుతులు | 348-357 |
| 7.12 | తెలుగు కావ్యావతారికలు – మన్మథుని స్తుతులు | 358-360 |
| 7.13 | తెలుగు కావ్యావతారికలు – హరిభక్తుల స్తుతులు | 360-363 |
| 7.14 | తెలుగు కావ్యావతారికలు – హరభక్తుల స్తుతులు | 363-363 |

| | | | |
|---|---|---|---|
| VIII. | **అష్టమాధ్యాయము** | | **364–406** |
| | 8. | తెలుగు కావ్యావతారికలు – ఇష్టదేవతా స్తుతులు – విశేషాంశములు | 364–368 |
| | 8.1 | తెలుగు కావ్యావతారికలు – భావి కథార్థ సూచనలు | 369–371 |
| | 8.2 | తెలుగు కావ్యావతారికలు – ఛందో విశేషాంశాలు | 371–375 |
| | 8.3 | తెలుగు కావ్యావతారికలు – అలంకార విశేషాంశాలు | 375–388 |
| | 8.4 | తెలుగు కావ్యావతారికలు – వ్యాకరణ విశేషాంశాలు | 389–391 |
| | 8.5 | తెలుగు కావ్యావతారికలు – ఆలంకారిక ప్రయోగాలు | 392–395 |
| | 8.6 | తెలుగు కావ్యావతారికలు – కవుల ఊహా వైదగ్ధ్యము | 396–406 |
| IX. | **నవమాధ్యాయము** | | **407–443** |
| | 9. | తెలుగు కావ్యావతారికలు – ఇష్టదేవతాస్తుతి పరిణామక్రమము | 407–419 |
| | 9.1 | తెలుగు కావ్యావతారికలు – సంస్కృత కావ్యాలప్రభావము | 419–420 |
| | 9.2 | తెలుగు కావ్యావతారికలు – దేవతాస్తుతి పరిణామము | 420–436 |
| | 9.3 | తెలుగు కావ్యావతారికలు – స్తుతులు–పరమప్రయోజనాలు | 437–400 |
| | 9.4 | తెలుగు కావ్యావాతారికలు – దేవతాస్తుతులు–ఆధ్యాత్మికత | 441–443 |

**అనుబంధము I**

1. దేవతా స్తుతులు – సంగణనయంత్ర శాస్త్ర పరిశోధన – సమన్వయము
2. అక్షరాలలో కనిపించే అక్షర రూపాలు

**అనుబంధము II**

1. పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాలు
2. జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాలు

**ఉపయుక్త గ్రంథాలు**

* * *

## "తెలుగు కావ్యావతారికలలో ఇష్టదేవతాస్తుతి – పరిణామక్రమము"

### *సిద్ధాంతవ్యాస సంక్షిప్త పరిచయము.*

### ప్రవేశిక

సాహిత్యము అనంత సాగరము. అందులో కవికి కనిపించేవి కొన్ని. విమర్శకునికి లభించేవి మరిన్ని. కవికి పండితునికి మధ్య కొంత అర్థ భేదము కలదు. కవి సాధారణముగా ఊహలను చేయును. పండితుడు తర్కించును మరియు విమర్శించును. తోచిన భావములను కూర్చుట కవి పని. అందులో సరిగనున్న విషయములేమి? శాస్త్రములోని విషయములనుసరించి కవి కావించిన కల్పనలు ఒప్పా ? లేక తప్పా? అని చూచువాడు పండితుడు /విమర్శకుడు. కొన్ని సందర్భములలో కవి కన్నా మిన్నయగు విషయవివేచన కలిగియుండు/డవలసినవాడు విమర్శకుడు. విమర్శకుడు/ పండితుడు /పరిశోధకుడు సద్విమర్శనాదృష్టితో కవియొక్క కర్మ యగు కావ్యమును పరామర్శించినపుడు కావ్యములోని ఘనమైన విశేషములు మరియు కల్పనలు సాధారణ పాఠకునికి చేరే అవకాశము, సామాజిక ప్రయోజనము కలిగే అవకాశము కలదు. ప్రతి నిత్యము మనము చూచు సూర్యోదయ, అస్తమయములు కవి ఊహలలో ప్రతిబింబించు తీరు మనోహరముగా కన్పించవచ్చు.

సాహిత్యములోని మర్మములు ఇతర ధర్మములు, చమత్కారములు సాంఘికపరమైన కట్టుబాట్లు, ఆచార వ్యవహారములువాటి విషయములను పరిశీలించి వాటిలోని మంచిని గ్రహించి భవిష్యత్తును సుందరముగా మలచుకొను అవకాశము లభ్యమగును.

పరిశోధనా దృష్టితో పరిశీలించినచో అనేకములగు అద్భుత విషయములు సాహిత్యములో తెలిసికొను అవకాశము కలుగును. అందులకనుగుణముగా సంక్షిప్తముగా నా సిద్ధాంతము యొక్క లక్ష్యమును వివరించు ప్రయత్నము చేస్తాను.

***0.1 పరిశోధనాంశ వివరణ*** **[Description of the Title] : - ఆదికవి నన్నయ్య నుండి నేటి పలువురు కవీశ్వరుల కావ్యములందలి 'అవతారికలలో ఇష్టదేవతా స్తుతులు' యెట్లు ఆరంభమై ప్రవర్ధమానమైనవి అను విషయమును గ్రహించి వాటిలో నాకు లభ్యమైన విషయములను ప్రస్తావించెదను. క్రమముగా కవులు తమ అవతారికలలో దేవతా స్తుతులను వివిధ రూపాలలో పెంపైన విషయము పలు ఆసక్తికర విశేషాలను ఆవిష్కరించుటకు నాకు అవకాశము కలిగినదని భావించుచున్నాను. పూర్వము ఈ రంగములో పరిశోధనలు చేసిన మహనీయులు ఎందరో కలరు.**

**మహాకవి కాళిదాసు తన రఘువంశమహా కావ్యములో అన్నట్లు....**

**"క్వ సూర్యప్రభవో వంశః క్వచాల్పవిషయా మతిః,**
**తితీర్షుర్దుస్తరం మోహాదుడుపేనాస్మి సాగరమ్"**
**"మందః కవియశః ప్రార్థీ గమిష్యామ్యుపహాస్యతామ్**
**ప్రాంశులభ్యే ఫలే లోభాదుద్బాహురివా వామనః"**
**"అథ వా కృతవాగ్ద్వారే వంశేస్మిన్పూర్వసూరిభిః**
**మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మే గతిః "**

**ఇంతవరకు తమ పరిశోధన ఫలములను సాహితీ సరస్వతికి సమర్పించిన వారి అడుగుజాడలలో పయనించినపుడు అనేక విషయాలు ఆవిష్కరింపబడును. పైన చెప్పినటుల అనంతమగు సాహితీ సాగరములో ఈదిన వారు, పలు అనర్ఘరత్నములు సేకరించి, భారతీదేవికి సమర్పించినవారు ఎందరో ఉన్నారు. ప్రస్తుతము నా ధ్యేయము సాహితీ సాగరములో పలు రత్నాలను వెలికి తెచ్చిన వారి మార్గములో పయనించి నా శక్తి మేరకు మరికొన్ని కోణములలో మరికొన్ని విషయములను సాధించు మార్గములో**

ఒక ప్రయత్నమిది. వాస్తవములో పరిశోధనలో వస్తువు ఒక్కొక్క సందర్భములో ఒక్కటే అయినా ఇతరుల దృష్టిలోనికి రాని 'అంశము/ల ను' చేజిక్కించుకోగలిగితే అది నిజముగా ఆ సాహితీపిపాసికి లభించగల మహద్భాగ్యము.

***0.2 పూర్వపరిశోధనల సమీక్ష*** [ Review of Literature] :- నన్నయాదులు తమ కావ్యములను/ గ్రంథములను ఆరంభించుటకు తత్కార్య నిర్విఘ్న పరిసమాప్తికై చేసిన ప్రార్థనలు 'ఇష్టదేవతా స్తుతుల' రూపములుగా గుర్తింపబడినవి. తొలిగా ఇట్టి కార్యమును ఆరంభించినవారు డా.గూడూరు నాగయ్య గారు. వారు 1960 ప్రాంతములో 'నన్నయ భారతావతారిక' గురించి ఒక వ్యాసము వారి ఆచార్యులగు డా. జి. ఎస్ రెడ్డి గారి ప్రోత్సాహముతో కావించినారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు "ఆంధ్ర కావ్యాలలో అవతారికలు" అను అంశమును ఇచ్చి ఒక పోటీని ఏర్పాటు చేయగా, నాగయ్య గారి గ్రంథము ఆ పోటీలో ఉత్తమమైనదిగా ఎన్నిక కావడంజరిగినది. ఇట్టి చక్కని పరిశోధానాంశము పై పిదప పలువురు పరిశోధనకై స్వీకరించి వివిధకోణాలలో పరిశోధనలు సాగించి సారస్వతమూర్తికతి సుందరమైన అలంకారాలు సమర్పించారు. ఇందులో ముఖ్యంగా అవతారికలలో వివిధ విశేషాలను భిన్న విభిన్నకోణాలలో వివరించడము విశ్లేషణ చేయడము గమనించ గలము. పలు గ్రంథములిందుకు సహకరించినవి. అందులో అతి ముఖ్యముగా కొన్ని పేర్కొనదగినవి ఇవి.....

[అ] డా. గూడూరు నాగయ్య గారి 'తెలుగు కావ్యావతారికలు'

[ఆ] డా. దీనావతిగారి 'కావ్యావతారికలు ఆంధ్రదేశ చరిత్ర [క్రీ.శ.1600 వరకు]

[ఇ] శ్రీ బి శ్రీరాములు గారి 'తెలుగుకవుల ఇష్టదేవతాస్తుతులు –విశేషాలు' సి.వ్యాసము

[ఈ] శ్రీ దొప్పలపూడి ప శామ్యూల్ గారి 'అవతారికల్లో ఇష్టదేవతా స్తుతులు' సి.వ్యాసము

[ఉ] కీ.శే. సి బి పి అప్పారావుగారి 'ఆంధ్ర కావ్యములు – అవతారికలు'

[ఊ] డా.పి. నరసింహారెడ్డిగారి ప్రాచీనాంధ్రకవుల ఇష్టదేవతా స్తుతి మొదలగునవి.

**0.3. *పరిశోధనాంశ సైద్ధాంతిక/శాస్త్ర నేపథ్యం* [Theoretical Approach] :-**

నన్నయ్యగారి తర్వాత పలు కావ్యములు వివిధ రూపములలో వెలువడినవి. అందులో అధికముగా చంపూరీతిలో మరికొన్ని వచనరహితముగా, పూర్వ గ్రంథములకు అనువాదములు, మరికొన్ని స్వతంత్రములు. కవులు తమప్రతిభతో మూల విషయమును మరింత అందముగా పెంచినవి మొదలైనవి. భారతాదులు అనువాదాలు కాగా, స్వతంత్రపోకడలతో రామాయణమును పలు రీతులుగ రాయడం కలదు. కంబ రామాయణము, మొల్లరామాయణము, మొదలుకొని అధునాతన కవులవరకు ఇట్టి ప్రక్రియలను ప్రయోగించినారు. తర్వాత చారిత్రిక పురుషుల గాథలను కావ్యరూపాలలో ప్రస్తావించుట చూడగలము. ఇక శాస్త్ర మర్యాదలను ఆధారముగా చూసినపుడు లభ్యమగు విశేషాలు కొన్ని కలవు. ఇందులో పద్యముల ఆరంభము, శ్రీకార ప్రయోగము, గణముల గుణగణాలు ఇత్యాదిగా పరిశీలనలో చోటు చేసుకోవడము విశేషమనవచ్చు. కవులు కావించిన పలు దేవతా స్తుతులు ఒక క్రమములో చెందిన మార్పులను తదితర విశేషములను పరిశీలనాదృష్టితో పరికింపవచ్చును. నూతన ఆవిష్కరణలు లభించవచ్చు/ చేయవచ్చును.

నన్నయ్య గారు భారతారంభమును సంస్కృత శ్లోకముతో ప్రారంభించినాడు. ఆ సంప్రదాయమును పలువురు కవులు పాటించినారు. తద్భిన్నముగా పద్యములను కొందరు కవివరేణ్యులు కూర్చడము చూడగలము. నన్నెచోడకవి తన 'కుమారసంభవ' కావ్యములో శివుని మూడు పద్యాలలో స్తుతించినాడు. శివుని భక్తుడు కావటము

కావచ్చు. ఆయన ఆనాడు ఆచారములోనున్న పద్ధతిలో కాక తెలుగులోనే కావ్యరచన ఆరంభించడము చూడగలము. శ్రీకారము వాడినాడు. 'మ'గణమునూ ప్రయోగించినాడు.

కానీ సాధారణముగా ప్రయోగముచేయబడుచుండిన ఉత్పలమాల/ శార్దూల వృత్తాలనుగాక విశేషముగా స్రగ్ధరా వృత్తమును [మ ర భ న య య య – అను గణాలు కలది] ప్రయోగించినాడు. ఇదొక ప్రత్యేకత. కవుల ఊహలకు కొత్త చిగుళ్ళు తొడగడము ఆరంభమైనదనడానికి సూచన కావచ్చు. అచ్చ తెనుగు కావ్యములు వెలువడినవి. నీలా సుందరీపరిణయములో కూచిమంచి తిమ్మన గారు

శ్రీకారమునకు బదులుగా 'సిరి' ['శ్రీ' కి వికృతియగు 'సిరి'ని వాడటమైనది]

**0.4.** ***పరిశోధన సమస్య/విషయం- స్వరూప నిర్ణయం*** **[ The Research subject /problem and Frame work] :-** తొలుదొల్త పరిశోధనలో ఉన్న సమస్య లేక విషయము ఏమిటి? దానిని గుర్తించుట, ఆపై ఆ సిద్ధాంత వ్యాస స్వరూప నిర్ణయము చేయుట ఒక బృహత్తర విషయము. ఈ విషయపరముగా నాకు లభించిన సూచనల మేరకు కొంతవరకు 'తెలుగు కావ్యావతారికలలో ఇష్ట దేవతా స్తుతులు – పరిణామక్రమము' [నన్నయ్య నుండి నేటి వరకు] అను విషయముపై పరిశోధన చేయవలెనని నిర్ణయము తీసుకొనుట జరిగినది. ఇప్పటికే వేరొక చోట చెప్పినట్లు కొందరు ఈ కోణములో పరిశ్రమించి నారు. ఆ పరిశ్రమ నాకు కొంత అండగా నిలచినది. స్తుతులను వివరించు పద్ధతిలో, విశ్లేషించు రీతిలో / తీరులో మరికొంత మెరుగులు దిద్దు అవకాశమున్నదని భావించినాను. సరిగమల గరిమ నెరిగిన వాగ్గేయకారకుల దృష్టికి, కవుల దృష్టికి, సంప్రదాయమును పాటించు పెద్దల దృష్టికి కొన్ని పోలికలు లభించినవి. ఇది పరిశోధన విషయ స్వరూప నిర్ణయములోవిషమముగా కాక సహకరించినవి. నిత్య జీవితములో సాధారణముగా పాటింపబడు/ ఆచరింపబడు మంత్రాలు, పూజాది కార్యక్రమములలో పేర్కొనబడు స్తుతులు కొంతవరకు ప్రభావము చూపినవని నా

భావన. కనుకనే కొందరు కవులు తమకు లభించిన వారసత్వ రూపములోని విజ్ఞానమును పద్యములలో ప్రవేశ పెట్టినారు.ఇది స్వరూప నిర్ణయ విషయ వివరణ.

**0. 5. *ఊహా ప్రతిపాదన* [Hypothesis] : -** సిద్ధాంతవ్యాసములో సాహిత్యము దాని స్వరూపము మరియు సంగీతమునకు కల సంబంధము మున్నగువాటిని చిత్రించుకోవలసి వచ్చినది. నన్నయ్య గారి భారత రచనకు ప్రధానముగా కొన్ని లక్షణాలు చెప్పడమున్నది. 'అక్షర రమ్యత' అందులో ఒకటి. కొంతమంది దీనిని 'అక్షత నాదము' అనుట కలదు. వాస్తవమునకు కాళిదాసమహాకవి, వాక్ + అర్థము లను మిశ్రమముగా చేసి 'వాగర్థావివ సంపృక్తౌ' అనినాడు. కాలక్రమములో 'నాదము/సంగీతము' ను కూడా కవులు తమకావ్యములలోనికి చొప్పించినారు. భాగవతములో [గజేంద్రమోక్షణ కథా సందర్భములో] తుమ్మెదల ఝుంకారము " అంగీకృత రంగన్మాతంగీ మదగంధమగుచు తద్దయుపేడ్కస్ సంగీత విశేషంబుల భృంగీగణ మొప్పె మ్రాను పెట్టెడు మాడ్కిస్' అనగా 'అటజని కాంచిన', అల్లసానివారి ప్రవరునికి హిమగిరులపైనుండి క్రిందకు దుముకు సెలయేళ్ల లహరుల సవ్వడిలో 'మృదంగ నాదములు' వినిపించినవి. రామరాజభూషణుని కావ్యనిర్మాణము వివరించ పనిలేదు. "పల్కుచెలికి పాలిండ్లజోడై సంగీత సాహిత్యములు సకలామోదక వృత్తగతులస్" రూపింప చేశాడు. మరికొందరు శబ్దముపై చమత్కారము జేసినారు. సంగీతశాస్త్ర మర్యాదననుసరించి 'శంకరాభరణము' ఒక రాగము పేరు. శంకరునికి ఆభరణము అనగా సర్పము అని అర్థము చెప్పవచ్చును. సర్పము అను సందర్భములో శంకరాభరణము అని చమత్కరించుట కలదు. సారమతి అనునది ఒక రాగము పేరు. నన్నయ భట్టు ప్రయోగించిన 'సారమతిం కవీంద్రులు' అనుశబ్దమును గ్రహించి 'సారమతి యగు త్యాగరాజు' 'సారమతి'యను రాగ కృతిలో ఇట్లు చెప్పినారనినారు. ఈ రీతిగా ఒక శబ్దములోని మరొక అర్థమును గ్రహించి శ్లేషాలంకారముగ ప్రయోగించుట

లేక వాడడము చూడగలము. 'హరి' శబ్దముపై పోతనగారి ప్రయోగము ఇందులకొక ఉదాహరణ. "హరిసుతు పరిచరుగాగొని,హరిసుతుదునుమాడి పనిచె హరిపురమునకున్ హరిమధ్యను హరిసుతునకు, హరిరాజ్య పదంబు నిచ్చె హరివిక్రముడై" అని 'హరి'కిగల పలు అర్థాలతో, చమత్కారముతో ముచ్చటైన పద్యాన్ని రాయటం రాసినారు.

మరెందరో మహానుభావులు తమ రచనలలోపలు విషయాలు ప్రస్తావించినారు. బిల్హణీయములో ఇట్టిదే మరొకటి పేర్కొనవచ్చు. ఇందులో కూడా 'హరి' శబ్దముపైన చేయబడిన చమత్కారమును చూడగలము. "హరితనయ హృదయసారసహరికి, మహాసూనృత జిత హరి, కతితేజః పరిహసిత హరికి, భవగజహరికి, సదా పాదపంకజా నతహరికిన్"

***0.6. అధ్యయన పరిధి*** **[ Limitations ] :-** అనంతమైన సాగరము వంటిది సాహిత్యరంగము. తెలుగులో రాజరాజనరేంద్రుని కోరిక మేరకు మహాభారత రచన ప్రారంభించిన ఆదికవి నన్నయ్య గారు పేర్కొనినట్లు, 'అమలినతారకా సముదయంబుల నెన్నను...' విధాతృనకైన వీలుకాదనినచో పరిమిత మతియైన నేను కొంత పరిధిని నిర్ణయించుకొని ఈ అధ్యయనమును సాగించినాను. ఇందులో పలు ప్రాచీన గ్రంథాలు, ప్రబంధాలు, మరిన్ని నవీన కావ్యములు, ఇతర వ్యాసములు కలవు. తవ్వేకొద్దీ చలమలో ఊరే నీటిలాగ, చదివేకొద్దీ లభించే విలువైన సాహిత్యపు విలువలు పెరుగుచూ పోయినవి. విషయము విపులమైనది. నావద్దనున్న కాలము అతిపరిమితమైనది. కనుకనే పరిధిని పరిమితము చేయవలసి వచ్చినది. కావున దాదాపు 250పైగా సంప్రదించినాను. ఆయా పుస్తకములను అందలి ఇష్టదేవతాస్తుతుల పరిశీలనను

చేసినాను. నా మతికి లభ్యమైన విశేషములను ప్రస్తావించినాను. వాస్తవమునకు ఇంకెంతో 'చేయవలసినది ఉన్నది' అని నా అభిప్రాయము.

0.7. *పరిశోధన లక్ష్యం* [ Aim of the Research] :- కావ్య అవతారికలలో ఇష్టదేవతా స్తుతులలో మరిన్ని విశేషములను వెలికి దీయుట నా యొక్క పరిశోధన లక్ష్యము. నాగయ్యగారినుండి తర్వాత అవతారికలలో ఉన్నవి కొన్ని పద్యములైనా వాటిలోనున్న ప్రత్యేకతలను పలువురు ప్రస్తావించుట తెలిసినది. కొందరు చారిత్రిక విషయములను వెలికిదీసినారు. మరికొందరు సాంఘిక విషయములను ప్రస్తావించినారు. భక్తిపూర్వకమగు దేవతా స్తుతులలో వారి వారి సిద్ధాంతములను ఒక పద్ధతిగా పేర్కొనినారు. ఆయా సమయములలో కృతికర్తలు, ఒకే దేవతామూర్తిని స్తుతించిన వేర్వేరు విధములుండుట గమనించగలము. సరస్వతిని క్షోణితలంబు నెన్నుదురు సోకగ.. అని స్తుతించిన పోతన ముచ్చటపడి ఎర్రాప్రగడ పద్యమైన 'అంబ నవాంబుజోజ్జ్వల...పద్యాన్ని గ్రహించుట.... సారస్వత మూర్తి యగు శారదాంబను శ్రీనాథ మహాకవి కొన్ని సందర్భాలలో పెద్ద సీసపద్యములో స్తుతించుట, సరససద్గుణ నికురంబ యగు ఆ అంబను ఒక సందర్భములో ఒక చిన్న కందపద్యములో నుతించుట ఇట్టివన్నీ లక్ష్యసాధనలో శోధన చేయగా లభిస్తాయి. ఇది పరిశోధన పరమ లక్ష్యముగా పరిణామము చెందగలదు.

0.8. *సమాచార సేకరణ* [Material Collection] :- ఈ సిద్ధాంతమును సిద్ధము చేయుటకు పలు గ్రంథములు చదివినాను. ఇందులో కొన్ని వ్యాఖ్యానసహితమైనవి.

మరికొన్ని వ్యాఖ్యానరహితమై కేవలము మూలమాత్రముగ ఉన్నవి. పలు ప్రాచీన, నవీన గ్రంథములు ఉపకరించినవి. ఇందులకు కొన్ని గ్రంథాలయాలు, మిత్రుల సహాయము, పలు గ్రంథముల మూలములు వాటికి సంబంధించిన వ్యాఖ్యలు, ఇతర ప్రత్యక్ష, పరోక్ష వివరణలు ఎన్నో సమాచార సేకరణలు, విశ్లేషణలకు ఉపకరించినవి కలవు. కొన్ని సందర్భాలలో వాగ్గేయ కారకుల రచనలు ఉపకరించినవి. ఇది చాలా విశేషముగా నేను చెప్పదలచినాను. సమాచారమును సేకరించుట ఒక ఎత్తుకాగా ఆ సేకరింపబడిన సమాచారమును వింగడించి వివిధ అధ్యాయములలో అమరించుట మరొక ఎత్తు. ఒక కవి అనేక రూపములలో వివిధ గ్రంథములలో ఒక దేవతను స్తుతించుట కనిపించును. చదువులతల్లి శారదను శ్రీనాథ మహాకవిస్తుతించిన తీరు ఇందుకొక ఉదాహరణ. గణపతిని విఘ్ననాయకునిగా కవులు స్తుతించుట, సరస్వతీ స్తుతిని చేయుట జరిగినది. మరి కొందరు ఇట్టి స్తుతులలో కొందరు కవులు భక్తితో పాటు రక్తి కూడా యుక్తమని యథాశక్తిగా ప్రయుక్తము చేయుట కలదు.

## 0. 9. *సమాచార వర్గీకరణ, విశ్లేషణ* [Classification of Data and Analysis] :

సమాచారము/ విషయము సేకరించుట ఒక ఎత్తు. దానిని వింగడించి ఒక పద్ధతిలో వర్గీకరించుట, విశ్లేషించుట మరొక బృహత్తర కార్యము. వ్యాసమును సిద్ధము చేయు నపుడు ఒక ప్రణాళిక చేసుకొని, ఆ ప్రణాళికననుసరించి వివిధ దేవతా స్తుతులను సేకరించి, ఆయా కవుల అభిరుచులను వారి స్తుతులనుండి గ్రహించి, స్తుతులను చేయు రీతులను పరిశీలించి వివరములను/ విశ్లేషించి లిఖించుట అసాధారణముగా తోచినది. సాధారణముగా గణపతిని కొందరు తప్ప అందరూ స్తుతించినారు. చదువులతల్లి యను భావనతో సరస్వతిని కూడా పలువురు సత్కారులు నుతించినారు. ఇచట మరొక విషయము ప్రత్యేకముగా పేర్కొనతగినది. కవులు తాము ఏ సంప్రదాయమునకు చెందిన వారో [వైష్ణవ, శైవ ఇత్యాది] వారు తమ

దైవములను నుతించుట, ప్రస్తావించుట... మున్నగు విషయాలను పరిశీలన చేయడమైనది.

**0. 10. *<u>పరిశోధనగ్రంథ ప్రణాళిక</u>* [The Plan of Thesis] : -** నా ఈ పరిశోధనా పరమైన వ్యాసమును పది భాగములుగా విభజించినాను. క్రమముగా వివరాలు ఇవి.

**ప్రథమాధ్యాయము**లో కావ్యావతారికల అర్థము, నిర్వచనము, ప్రాశస్త్యము, విశేషాంశాలు, ప్రయోజనములు చర్చించడమైనది.

**ద్వితీయాధ్యాయము**లో కావ్యారంభ పద్యాలు, శ్రీకార పద్యప్రయోగాలు, శ్లోకారంభముతో కూడినవి, ఆశీర్నమస్క్రియా, వస్తునిర్దేశరూపములోనున్నవాటిని పరిశీలించడమైనది .

**తృతీయాధ్యాయము**లో ఇష్టదేవతాస్తుతులు - 'స్తుతి' అర్థనిర్వచనము, వర్ణన, నన్నయ ఇట్టి స్తుతి విషయములో అందించిన వినిర్మాణాదులు వివరించడమైనది.

**చతుర్థాధ్యాయము**లో ప్రముఖముగా శైవ సంబంధ స్తుతులు – ఇందులో గణపతి, ఈశ్వర, పార్వతీదేవి, సుబ్రహ్మణ్య, వీరభద్ర, వీర శరభ, భైరవ, శివలింగ స్తుతులు విశ్లేషించడమైనది.

**పంచమాధ్యాయము**లో శక్తిమూల స్వరూపమైన శాక్తేయసంబంధ స్తుతులను, మాతృకా మూర్తుల, జ్యేష్ఠాదేవీ, గంగాదేవ్యాదుల స్తుతులను ప్రస్తావించుట జరిగినది.

**షష్ఠాధ్యాయము**లో వైష్ణవ సంబంధ స్తుతులను, ఇందులో విష్ణు, లక్ష్మీ, ఆదిలక్ష్మి, స్తుతుల తోపాటు విష్ణు అవతార సంబంధములైన, రామ, సీత, హనుమ, గరుడ, కృష్ణ, రుక్మిణీ, బలరామాదులతోపాటు శంఖచక్రాది పంచాయుధముల స్తుతులను పేర్కొనుట జరిగినది .

సప్తమాధ్యాయములో ఇతరదేవతా మూర్తుల స్తుతులను అనగాఇంతవరకు ప్రస్తావనలోనికి రాని విధాత, శారదా, పరబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ, త్రిమూర్త్యాత్మక, దత్తాత్రేయ, నవగ్రహ, మదన, అష్ట దిక్పాలకులను, హరి, హర భక్తులను తమతమ అవతారికలలో కల్పనా దక్షులైన కవులు కావించిన స్తుతుల వివరాలను విచారించుట చేయడమైనది.

అష్టమాధ్యాయములో ఇతర విశేషాంశములతోపాటు, క్రాంతదర్శనులైన కవులందించిన అవతారికలలో, భావికతార్థ, వ్యాకరణ విశేషములు, ఆలంకారిక ప్రయోగాలు, వారిఊహా వైదగ్ధ్యము మున్నగు వివరాలు విశ్లేషింపబడినవి.

నవమాధ్యాయములో తెలుగు అవతారికల పరిణామక్రమము , సంస్కృత భాషాప్రభావము అసలు యీస్తుతుల పరమ ప్రయోజనము మొదలైనవాటిని చర్చించడమైనది.

****@****

# ప్రథమాధ్యాయము

## కావ్యావతారికలు

శ్రీ

# "తెలుగు కావ్యావతారికలలో ఇష్టదేవతా స్తుతి - పరిణామ క్రమం"

## (నన్నయ్య నుండి నేటి వరకు)

## I - ప్రథమాధ్యాయము.

1.*కావ్యావతారికలు* : - **విశ్వశ్రేయమును** కాంక్షించునది కావ్యము. కావ్య నిర్మాత కవి. వేదములు, పురాణములు, కావ్యములు - అని సాహిత్యమును మూడు విధములుగా విభజింప వచ్చును. మానవునకు చేయదగు "కర్తవ్యమును" ఈ మూడునూ బోధించును. ఇందు విషయము ఒకటే యైనను వివరించు/ విశదీకరించు విధానములందు వ్యత్యాసాలు కలవు. ఒక వ్యక్తికి – తన ప్రభువునకు, తన మిత్రునకు, తన కాంతకు గల సంబంధమును సమీక్షించినపుడు కొన్ని ప్రత్యేక లక్షణాలు ప్రత్యక్షమగును.

వ్యక్తికి – ప్రభువునకు మధ్య గల అంతరము అత్యంత అధికము.

వ్యక్తికి – మిత్రునికిని మధ్య గల అంతరము మధ్యమము లేక సాధారణము.

వ్యక్తికి – కాంతకు మధ్య గల అంతరము అత్యంత అల్పము.

కనుకనే వీనిని 'పూవు-తావి' గ చెప్పడము భావ్యమే. కవికుల గురువైతే వ్యక్తికి కాంతకు మధ్యగల అంతరము అల్పమైనదని విడదీయరాని బంధమని "వాగర్థా విన సంపృక్తౌ" [1] యని పేర్కొనుట జగమెరిగినదే! జగత్పితరులు అర్ధనారీశ్వరులు .

కనుకనే - 'కర్తవ్యోపదేశము'ను వేదములు ప్రభువులవలె శాసించునని, పురాణములు సూచించునని, తెలిపి పిదప కావ్యములు కాంతావిలాసములై భాసించి తన్మార్గమునకు మరలించి అందే పయనింపజేయుననుట కలదు.

కావ్యమహిమల గూర్చి ఇట్లు చెప్పడము చూడగలము. కావ్యమనగా 'రమణీయార్థమును ప్రతి పాదించు శబ్దము ' అని పెద్దలు వక్కాణించినారు. అట్టి కావ్యములను అవతరింప చేయునవి '***అవతారికలు***'

---

పాద సూచికలు : - [1] కాళిదాసమహాకవి రఘువంశం మొదటి శ్లోకం.

శా. వేదంబుల్ నృపశాసనంబులు సుహృ ద్విజ్ఞాపనంబుల్పురా
ణాదిగ్రంథములంగనాజన విలాసాలాప లీలాసమ
ప్రాదుర్భావములౌర ! కావ్యములు, కర్తవ్యోపదేశక్రియా
వాద ప్రక్రియలెన్నఁ గావ్యమహిమల్వర్ణింపగా సాధ్యమే? [1]

## 1.1 *అవతారిక –అర్థం-నిర్వచనం-ప్రాశస్త్యం* :-.

అవతారికలు అనగా తరింప {దాటింప} చేయు లక్షణములు కలవి. “స తరతి స తరతి, స లోకాంస్తారయతి” యని నారద భక్తి సూత్రం 5 చెప్పినది. ఇక శబ్దపరముగా చూచినపుడు “తౄ” ధాతువు నుండి *తర* వెలువడినది . అనగా దాటుట/ తరించుట. దాని రూప నిష్పన్నము ఇట్లు చెప్పడం గలదు. “తౄ” అను ధాతువునకు”ఇక” ప్రత్యయము చేరగా ధాతువు యందలి “ఋ” అను అచ్చునకు వృద్ధి వచ్చి “{ఋ = ఆర్ } ‘తారిక’ యై, దానికి “అవ” అను ఉపసర్గ ముందు చేరగ “అవతారిక” యను రూపము ఏర్పడినది.
‘అవ’ అనగ -> దిగుట. ‘దిగుట’ ఎచటకు? అను ‘ఆకాంక్షకు’ సమాధానము -‘క్రిందకు’. ఇప్పుడు నిర్వచనము అవతారయతీతి > ‘అవతారికా’ ఐనది. దేనిని? ఇది మరొక ప్రశ్న. దీనికి సమాధానము – “కావ్యము”ను లేక “కథ”ను/ “కబ్బము”ను. కావ్య ఆరంభములో చేయబడు రచన “అవతారిక”. ఇది ఎందులకు? అనగా పైనున్న దేవతలను ప్రసన్నము చేసికొనుటకు. అవతరణీ - “అవతరతి గ్రంథః అనయాః” (అవతౄ కరణే ల్యుట్). ప్రస్తుతింప బడినపిదప, ప్రసన్నమైన దేవతలు, ప్రస్తుతించిన వారలకు, తమవంతు

కృపను జూపి, సాయమును చేయుదురని ఆశ/నమ్మకము. ఆశ/నమ్మకము - మానవుల మనుగడకు దివిటీ వంటిది.
ఇక కావ్యమును అవతరింప చేయుటకు తొలుత చేయు ప్రార్థన /ప్రస్తుతి అవతారికలో తొలి విషయము.

-----------------------------------------------------------------------------------

పాద సూచికలు : - [1] శారదామూర్తి (రామరాజభూషణుడు)/నరసభూపాలీయం / ఉపోద్ఘాత/ పద్యము 25

కవి తాను తరించుటయేగాక , తన కావ్యమును చదువు పాఠకులను కూడ రంజింప {తరింప} జేయును. ఇచట కవి తాను ఆనందమంది ఇతరులను ఆనందింప జేయుటగ కూడ చెప్పవచ్చును . తరింపజేయుట అనగా లక్ష్యమును చేర్చుట. సాహిత్యమను ఆనందాబ్ధిలో ఓలలాడి లేక ఈదులాడి ఆవలి తీరమునకు చేరుట తరణము.

కనుక కావ్యములకు మూలాధారములు "అవతారికలు". అని నిర్ణయమైనది .

[1 ] సప్తస్వరములకు "స" [షడ్జమము] ఎట్లు మిగత "రి, గ, మ, ప, ద, ని," {2} యను స్వరములకు ఆధారముగా వర్తిల్లునో అట్లే అవతారిక కావ్యమునకు ఆధారము మరియు మూలము. { It is base and foundation }. అట్టి అవతారికలు తెలుగు కావ్యములందు ఎట్లు నిర్మితమైనవో వాటి స్వరూప విశేషాదుల వివరణమే ఇప్పుడు మనము ప్రస్తావించెదము. అదే ఈ వ్యాసోద్దేశము.

అవతారిక రూపము ఎట్లు నిష్పన్నమైనదో ఇంతకూ మునుపు చూచినాము. అవతారిక ఆంధ్ర కావ్యములలోని ఒక విలక్షణమగుసాహిత్య సంప్రదాయముగా చెప్పడం జరిగింది. కావ్య నిర్మాత తన కృత్యాది యందు చెప్పిన లేక వ్రాసిన తదుత్పత్తి క్రమమునే అవతారిక యని భావించవచ్చును.

అవతారికను 'అవతరణిక' అని కూడ వ్యవహారములో నున్నట్లు చూడగలము. 'అవతరణిక' అనునది సంస్కృత పదము. దీనికి వి. యస్ ఆప్టే మహాశయుడు తన నిఘంటువు లో ఇట్లు నిర్వచించినట్లు తెలియుచున్నది .

{ The practical Sanskrit –English Dictionary} ఈ రీతిగా వివరణ / నిర్వచనము ఇచ్చినారు. " "అవతరణికా" - 1. A short prayer at the beginning of a work, which is supposed, causes the divinity so addressed to descend from heaven; 2.Introduction, Preface.

---

పాద సూచికలు : - [1]. సంగీత విద్యా దర్పణము. ఏకా సుబ్బారావు. ప్రాథమిక సమాచారము.[2]. రి =రిషభము[వృషభ ధ్వని ] గ = గాంధారము[మేక అరపు] మ =మధ్యమము [క్రౌంచపక్షి స్వరము] ప= పంచమం [వసంతర్తు కోకిలధ్వని]., ద= ధైవతం [అశ్వ స్వరం] ని=నిషాదం [ఏనుగు ఘీంకారం]

ఇంతేగాక అవతరణి/ అవతరణిక అను పదమునకు పీఠిక, ఉపోద్ఘాతము, అనుక్రమము, పరిపాటి  మొదలైన అర్థములు చెప్పడము గలదు. కానీ వీటిని తుల్యార్థములు అనలేము.  పీఠిక అనినపుడు గ్రంథము మొదట వ్రాసెడు దాని పుట్టు పూర్వోత్తరములు, పరిపాటి అనగ  అనుక్రమము / సొరిది  యని,  సొరిది =వరుస, క్రమము అను రూపములున్నవి. అవతారిక అసలు కావ్య ఆరంభము. మిగత ఆముఖము,ప్రస్తావన,మనవి మాటలు  ఇత్యాదులు.... పుస్తకము అచ్చు వేయటం నేర్చిన పిదప కొద్దిమంది కవుల / పండితుల అభిప్రాయములు సేకరించి చేయుచున్న ఒక  ప్రక్రియ యనడం సముచితమే.పలువురు పరిశోధకులు అవతారికా సంప్రదాయములు ఎట్లు ఆరంభమైనవో తెలియ చెప్పినారు.

ఆచార్య డా. గూడూరు నాగయ్య గారు ఎం.ఏ., పి.హెచ్ డి.,  తమ తెలుగు కావ్యావతారికలు అను గ్రంథములోతెలుగునకన్న పూర్వమే, కన్నడ, తమిళ  కావ్య సంప్రదాయములలో  ఈ అవతారికల ప్రయోగమునందు యున్నవని, నన్నెచోడుని  కుమార సంభవమున ‘కన్నడ కావ్యావతారిక ప్రభావము’ స్పష్టముగ కలదని తెలిపినారు. పొన్న, రన్న, పంప మొదలగు కన్నడ భాషా పండిత, కవుల కాలముననే ఈ పద్ధతి సంపూర్ణత పొందినది యనడం కలదు. కారణమేదైనా తెలుగు భాషయందు తిక్కన వరకు పీఠికలను తల పెట్టినవారు కారు. తిక్కన తర్వాతనే ఈ సంప్రదాయము అభివృద్ధి చెందినదని తెలిపినారు. కానీ ఆంధ్రమహా భారతము ఆరంభించిన నన్నయ రచనలోనే అవతారిక పెక్కు పద్యములలో పలు అంశములతో కూర్పబడినదని మనము చూడగలము. నన్నయ్యకు పూర్వము ఆంధ్రమున కవిత్వమున్నదని, భావించినను, చక్కని కావ్యము లభించని కారణమున, సంస్కృత కావ్య,నాటకముల మరియు ప్రాకృత గ్రంథముల, ఇతర  భాషలైన తమిళ, కన్నడ దేశ భాషా కావ్యములలోని కొన్ని లక్షణములను కొంతవరకు పరిశీలించి యుండవచ్చునని చెప్పడము కలదు. తమిళ  సాహిత్యములో, తెలుగు వారికి శ్రీ కారమెట్లు ముఖ్యమో, ఆరంభమునందు ఒక చోట “ఉలగ”[లోకము] ప్రశంస యుండుట ఆనవాయితీ. భారతదేశ భాషలలో తమిళము పిదప తెలుగు కన్నా మునుపటిది కన్నడ భాష. కన్నడ భాషలో కవిరాజ మార్గము అనునది మొదటిది. పద్య రూపమందలి సాహిత్య లక్షణ గ్రంథముగా గుర్తింపు గలది. ఇందులో కావ్యాదిలో మంగళాచరణము, పూర్వ కవి స్తుతి, సభావర్ణన, సుకవిత్వ ప్రాప్తి విధానము, అపండిత నింద, కుకవి నింద, సుకవి కావ్య ప్రశంస మొదలగు

విశేషములతో యుక్తమైన అవతారిక యున్నట్లు తెలియుచున్నది. దేశీయ భాషా కవితలలో అవతారికా రచనకిది 'ఆది' యని ప్రస్తావించబడటము గమనించగలము. మరియు శ్రీ కారముతో కృతినారంభించు సంప్రదాయము కన్నడ సాహిత్యములో గలదు. వాస్తవములో ఏదేని ఒక 'సంప్రదాయము' ఆరంభమైన పిదప అనేక విషయములను, విశేషములను ఇతరములను తనలో కలుపుకొనుచు ముందుకు సాగిపోవును. ఇది నిత్యసత్యము. 'జీవనదులు' ఎట్లు తమ ఆరంభమునందు సెల ఏళ్లవలె కుల్యలుగా అవతరించి ప్రవహించి, ప్రవహించి అనేక ఇతర ప్రవాహములను తమలో కలుపుకొని వృద్ధి చెంది, విశాలమైన గంభీరమైన సాగరుని చేరునటుల, అవతారికలు కూడ అట్టి మార్పులను పొందుతూ నూతన ఆవిష్కరణలను చేయుచు సాగినవని చెప్పటములో అతిశయోక్తి ఆవంతయైన లేదన వచ్చును.

అవతారిక యనగా గ్రంథముఖమున వ్రాయబడిన తదుత్పత్తి క్రమము. పిండితార్థము - కావ్యములో తద్విషయ ప్రస్తావనను సూచించునది, మరియు గ్రంథాదులందలి పీఠిక, పరిపాటి, వ్యాఖ్యానాదులతో రాబోవు వాక్యాన్వయము తెలుపుటకై ముందు వ్రాయబడు సందర్భసూచక వాక్యము/వివరము, అని పేర్కొనుట చూడగలము.. అది కొందరి మతము లేక భావము అనవచ్చు. ఒక విధముగా చెప్పవలెనంటే సంస్కృత నాటకములందు ప్రయోగింపబడు లేక ప్రాయోజితమగు నాంది వలె తెలుగు కావ్యములందు అవతారికలు అట్టి పాత్రను పోషించు ననవచ్చును.

'నాంది' అనగా శబ్దరత్నాకర కారకుని ప్రకారము దేవతలు,బ్రాహ్మణులు లోనగువారు చేయునట్టి ఆశీర్వాదము, లేక నాటక ప్రారంభమునందు చెప్పబడు మంగళ శ్లోకము లేక పద్యము. నాంది శ్లోకము ఆశీర్వాద లేక నమస్క్రియా రూపమున యుండును. ఇందు శబ్దముచే లేక అర్థముచే కొంతవరకు ప్రదర్శింప బోవు నాటక ఇతివృత్తమును స్ఫురింప జేయును. అది ఒక లక్షణము. నాంది అంతమున సూత్రధారుడు రచయిత గూర్చి పరిచయము చేయుట మరియొక లక్షణము. కొంతవరకు ఇట్టి లక్షణములు అవతారికలలో కనిపించుట గలదు.

"కావ్యము" యనగా కబ్బము లేక ప్రబంధము. ఇది వివిధ అర్థ ప్రతిపాదికముగా, విజృంభించిన రసములతో, భావ విశేషములతో, శోభించునది. కావ్యమునకు తత్సమముగా, వైకృతముగ "కబ్బము" చెప్పబడినది.

కం. వివిదార్థ దీపకము, మూ
డవ కబ్బమధర్వమయ ముదంచితరసభా
వ విశేష భూషితంబై,
భువి నెనుబది యేడు వృత్తముల శోభిల్లున్. [1]

తెలుగు సాహిత్యమును పరిశీలించి చూచినపుడు అవతారికలలో పలు రీతులుగ అనగా ఆశీస్సులుగానో, నమస్సులతో, లక్ష్య నిర్దేశములుగానో పద్యములు కనిపించును. వాటిని ఒకింత పరిశీలించెదము. కృతిపతికి అభిమాన దైవతములను స్తుతిస్తూ ఆరంభించడము , తన కిష్ట దైవత ప్రార్థనా రూపముగా ప్రార్థించడము, కావ్యార్థ సూచనగా చెప్పడము ఇత్యాదులు గలవు. కావ్యావతారికలను పరిశీలించినచో కొన్ని విషయములు సాధారణముగా ప్రస్తావింపబడిన తీరుతెన్నులు అవగతమగును. వాటిలో కొన్ని ఇట్లు గలవు.

1 ] ప్రార్థన [ఇష్టదేవత , ఇతర దేవతల]

2 ] కృతిపతి వంశ ప్రస్తావన, ప్రశంస, ఘనత

3 ] పూర్వకవి స్తుతి, {సంస్కృత, తెలుగు} తన కవితా ప్రశంస

4 ] కుకవి నింద,

5 ] కవి స్వవంశ ప్రతిభ ప్రస్తావన, గోత్రాదుల విషయము

6 ] షష్ఠ్యంతములు

7 ] కొన్ని సందర్భములలో స్వప్న వృత్తాంతాలలో ., ఆశ్వాస అంతములో తమ రచనా ప్రశస్తి, మొదలగునవి మరియు ఇతరములు చూడగలము.

మరి కొందరి మత ప్రకారము మొట్టమొదట సంస్కృత భాషా ప్రభావం వల్ల

[1] మంగళాచరణ,

[2] ప్రస్తావన,

[3] ప్రయోజనములు,

---

పాద సూచికలు : - [1]కావ్యము - పరమయోగివిలాసము 2 ఆ.

[4]కావ్యకారణమైన విషయములు,

[5] కావ్య స్వరూపము,

[6] గుణదోష విచారణ

మున్నగునవి అవతారిక వంటి వాటిలో పొందుపరచటం తగునంటారు.

వాస్తవమునకు భాషాపరమైన భేదము మాత్రమేనని పై రెండు అభిప్రాయముల మధ్య పెద్ద వ్యత్యాసము లేదని చెప్పవచ్చును.

1 .2 *అవతారికలపై జరిగిన కృషి :-* అవతారికలలో మనకు కనిపించు అంశములను పరిశీలించుటకు ముందుగ అవతారికలపై జరిగిన కృషిని కొంత ప్రస్తావింతము.

స్థూలముగా యాభై సంవత్సరముల నుండి జరిగిన కృషిని చూస్తే లభించు వివరాలు ఇలా విపులీకరించవచ్చు.

తమ గురువర్యులు ఆచార్య జి. ఎస్. రెడ్డి గారి ప్రోత్సాహముతో, 'నన్నయ భారతావతారిక', తో ఆరంభమైన పరిశీలన, తదుపరి "ఆంధ్ర కావ్యాలలో అవతారికలు" అను ఒక సిద్ధాంత గ్రంథమును కూర్చుటకు మార్గమును ఏర్పరచినది. ఈ గ్రంథము చక్కని విమర్శనాత్మక గ్రంథముగా గుర్తింపబడినది. పారితోషికమును కూడ సంపాదించుకున్నది. ముఖ్యముగ అప్రస్తుత అంశములను తగ్గించి రచనా శిల్పమును మలచి, సాధ్యమైనంతవరకుదోషములను పరిహరించి, విషయ దృష్టితో సమ్యగ్ వివేచనముతో పాఠకుల మనసులలో నిలచే ప్రయత్నముగ దీనిని తీర్చినారు. ఇందులో అతి విస్తృతముగా పరిశీలించిన విశేషములివి.

అవతారిక నిర్వచనము, సంస్కృత ప్రాకృత కావ్యములలో కృత్యారంభము, తమిళ కన్నడ భాషలలో అవతారికల వివరములు, ఆంధ్ర కావ్యావతారికలలో సంప్రదాయములను, వాటి ప్రాముఖ్యత, కావ్యారంభమునందు శ్రీకారాది ప్రయోగములు, ఆరంభపద్య గణములు మొదలగు విషయములతో పాటు ఇతరములను వ్రాసినారు. అందులో దేవతాస్తుతి, గురుస్తుతి, పితృ ప్రశంస వీటితో పాటు, సుకవిస్తుతి, కుకవి నింద, కావ్యోత్పత్తి ప్రశంసలను వివరించినారు. కవితయొక్క శిల్పము, చమత్కారాలు, వర్ణనలు, కవుల కావ్యానుభూతి, భాష, సత్కృతి లక్షణములు, అనువాద ప్రశంసాదులు, కథ, నాయకుని విషయము, గ్రంథ అంకితము, కృతిపతి, వంశవర్ణనలు, కృతికర్త వంశాదులు, పూర్వీకులు, షష్ఠ్యంతములు

వాటి వివరాలు, కథా సూత్ర ప్రశంసలను విస్తారముగా విశ్లేషించినారు. అవతారికలలో లభించు చారిత్రిక ఆధారములు, పూర్వ కవుల, వారి కృతుల ప్రస్తావనలు గలవు. ఇతర విశేష
అంశములతో ఏర్చి కూర్చిన వ్యాసము పరిశీలనారతులకు చక్కని ప్రయోజనకారి.

డా.[శ్రీమతి] బంధకవి(మానాప్రగడ) దీనావతి గారి" కావ్యావతారికలు – ఆంధ్రదేశ చరిత్ర (క్రీ.శ.1600 వరకు) " సిద్ధాంతవ్యాసము, సాహిత్యాభిరుచి గలవారికి ఒక పసందైన విందు. డాక్టరేటు వచ్చిన దాదాపు మూడు దశాబ్దాల పిదప, వ్యాసకర్త తమ అలసత్వాన్ని, జడత్వాన్ని వదిలించుకొని, ప్రచురించినట్లు తెల్పినారు. డా. దీనావతి గారు తొలుతనే తమ గ్రంథములో ఇట్లు పేర్కొన్నారు. " తెలుగు సాహిత్య అకాడమీ అవార్డు పొందిన డా. జి. నాగయ్యగారు తెలుగు కావ్యావతారికలనే గ్రంథంలో వివరంగా చర్చించారు. నా సిద్ధాంత వ్యాసం ముఖ్యంగా చరిత్రకు సంబంధించినది కాబట్టి అవతారికలోని మిగిలిన అంశాల గురించి చాలా క్లుప్తంగా చర్చించాను." భారతదేశ చరిత్ర గురించి, అవగాహన లేని వారు, చరిత్ర రచనా సూత్రాల పేరిట వాస్తవాలను వక్రీకరించి ప్రపంచమునకు తప్పుడు సమాచారమును ఇస్తున్నారని, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు చెప్పినది కఠోర సత్యం. ఆయన ఇలా నుడివినారు. "పౌరాణికాంశాల్ని, ఇతిహాసికాంశాల్ని, కావ్యగతాంశాల్ని, ప్రామాణికంగా స్వీకరించరాదని, అవి ఊహాపోహలతో కూడుకొన్నవని చరిత్రను ఆధునిక సామాజిక శాస్త్రాలతో అధ్యనం చేయాలని, ఒక వాదం విపరీతంగా ప్రచలితంఅవుతున్న సందర్భంలో లోకం వెలుగు చూస్తున్న గ్రంథం ఇది.సరియైన సమయంలో వచ్చిన మంచి గ్రంథం ఇది". "విదేశీ చరిత్రకారులు పక్షపాత దృక్పథంతో మన చరిత్రను రచించారని, మనల్ని కించపరిచి, వారినే గొప్పగా చెప్పుకొన్నారనీ, ఆ కారణంగానే మన చరిత్రను మనమే తిరిగి వ్రాసు కోవాలనీ, సత్య చరిత్రను వెలికిదీయాలనీ, ఆలోచిస్తూ, శోధిస్తూ అనేక గ్రంథాలను భారతీయ భాషల్లో ప్రచురించి లోకం వెలుగుచూసే విధంగా {కృషి} చేస్తున్న సందర్భంలో డా.దీనావతి గారి ఈ గ్రంథం వెలికి రావడం ముదావహం." అని కూడా శ్లాఘించారు.

కావ్యము అనగా ఏమిటి? అను విషయమును గురించి కొంత వివరణ విశ్లేషణ చేద్దాము. పరమయోగి విలాసములు చెప్పబడిన వివరణ కొంత చూచినాము. తొలి కవి యైన

నన్నయ భట్టారకుడు భారతములో ఉట్టంకణము చేసిన విషయమునొక పర్యాయము చూద్దాము.

కం. " ఏయది హృద్యమపూర్వం

బేయది, యెద్దాని వినిన నెఱుక సమగ్రం

బై యుండు నఘ నిబర్హణ

మేయది? యక్కథయ వినగా నిష్టము మాకున్" [1]

కావ్యమునకు వలసిన  లక్షణాలు ఏవని పరిశీలించి చూడగా మనోహరమైన కథ, క్రొత్తదనము, దానిని చదివిన / వినిన సంపూర్ణమైన జ్ఞానములభ్యమగునో, పాపములను తొలగించునో అట్టి కథతో కూర్చబడినది ఉత్తమ కావ్యమనబడును. పూర్వ లాక్షణికులు పేర్కొనిన కావ్య ప్రయోజనాలు సమకూరినప్పుడు అది వ్రాసినవారికి, విన్నవారికి, అందరికి ఆనందము కలిగించును. కావ్య ప్రయోజనములు ఇట్లు వక్కాణింపబడుట తెలిసినదే! మమ్మటుని కావ్యప్రకాశ నిర్వచనమును  సరించి,

" కావ్యం యశసే(అ)ర్థకృతే, వ్యవహారవిదే, శివేతరక్షతయే,

సద్యః పరనిర్వృతయే, కాంతా సమ్మిత తయోపదేశయుజే" [2]

కనుక కావ్యములు  మునుపు వివరించిన రీతిలో వేదములు నృప శాసనములవలెగాక, హితులు చెప్పే పురాణములవలె గాక, అంగనాజనములౌ ప్రియ కాంతలవలె విలాసాలాపములతో, కర్తవ్యోపదేశములు చేయు ప్రక్రియలో మహామహితాన్వి తములైనవి. అవి వ్యవహార / లోక జ్ఞానమును అందించుచూ, శివేతరములగు వాటినుండి రక్షించుచూ, యశమును, అర్థమును  {ధర్మ అర్థ కామ మోక్షములను చతుర్విధ పురుషార్థములను} ఇచ్చునట్టివైనవి 'కావ్యములు'

శా.   'వేదంబుల్ నృపశాసనంబులు సుహృ ద్విజ్ఞాపనంబుల్పురా

ణాదిగ్రంథములంగనాజన విలాసాలాప లీలాసమ

ప్రాదుర్భావములౌర ! కావ్యములు, కర్తవ్యోపదేశక్రియా

వాద ప్రక్రియలెన్నఁ గావ్యమహిమల్వర్ణింపగా సాధ్యమే' [3]

---

పాద సూచికలు : -  [1] కవిత్రయ/భారతము /ఆది/I  {2} కావ్య ప్రకాశం/ మమ్మటుడు కావ్య నిర్వచనం  [3] నరసభూపాలీయం/ శారదామూర్తి /ఉపో/25

"ప్రాచీనాంధ్ర కవుల ఇష్ట దేవతా స్తుతి" అను పేరుతో డా.పాపిరెడ్డి నరసింహారెడ్డి గారు రెండు వందలకు పైగా పద్యములను సేకరించి సమర్పించినారు. ఈ ప్రయత్నములో వారు వందకు పైగా గ్రంథములను సంప్రదించినారు.

తిరిగి వారే "ప్రాచీనాంధ్ర తెలుగు కావ్యాల్లో కృతికర్త – కృతిభర్త " అను శీర్షికతో రమారమి ఒక వంద గ్రంథములను పరిశీలించి కావ్య నిర్మాత యగు కవుల విషయము, కృతులందుకొన్న కృతిభర్తలను గూర్చి విపులముగా వివరించినారు. కర్తలగు కవుల స్వవంశ వర్ణనలు గోత్రాదులు, పూర్వీకులు, ఇతర అంశములను చూడగలము. కృతిభర్తల ఆర్థిక స్థితి సాహిత్యముపట్ల వారికిగల అభిమానము, కవుల పట్ల గల ఆదరము, కళాపోషణ, సమాజ సేవ మున్నగు వాటిని వివరించారు. *"ప్రాచీనాంధ్ర తెలుగు" ప్రయోగము కొంత విచారింప వలసియున్నది. ఆంధ్ర మరియు తెలుగు రెండూ పర్యాయపదాలుగానే వాడుకలో గలవు*.

తరువాత ప్రస్తావించ వలసినది –"ఆంధ్ర కావ్యములు – అవతారికలు" కూర్చినట్టి రచయిత కీ.శే. సి.బి.పి. అప్పారావు గారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాద్

వీరి గ్రంథమును, 2012 సం.లో ప్రచురించినారు . విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరిశివారెడ్డి తమ ముందుమాటలో "ఒక జాతి యొక్క సర్వతోముఖ సంస్కృతి, చరిత్రల ను తెలుసుకోవడంలో ఆ జాతి సాహిత్యం ముఖ్యస్థానం ఆక్రమిస్తుంది. భారతీయ భాషలలో కావ్యానికి ప్రత్యేక స్థానం ఉంది". అంటూ, మరియు " కావ్య నిర్మాణంలో అవతారికా విభాగమే లేనిచో ఏంతో సమాచారం మరుగునపడి ఉండేది. కావ్య ప్రశస్తి, కృతిపతి వివరాలు, కవి స్వవిషయాలు, పూర్వకవులకు శ్రద్ధాంజలి మొదలయినవి కవుల అవతారికలలో పొందు

పరిచారు. అంతేకాకుండా ఈ అవతారికలు దేశ చరిత్ర పునర్నిర్మాణంలో ఎంతగానో ఉపయోగపడుతాయి" అని వ్రాసిన విషయము కూడా చూడగలము. అప్పారావు గారు తమ గ్రంథములో, "ప్రాచీన తెలుగు కవిత్వము – లబ్ధ సారస్వతము, ఆంధ్రకావ్యముల నిర్మాణ క్రమము – అవతారికలు అను అంశములతో ఆరంభించి, ఆదిమ చాళుక్యుల, కాకతీయులపాలన, పిదప వారి పతనాంతర కాలములోని విషయములను చర్చించినారు. అటు తర్వాత శ్రీనాథుడు –సమకాల కవులు – వెలుగుజూచిన కావ్యములు – అవతారికలు,

ఆపై విజయనగర సామ్రాజ్యము(న) వెలసిన కావ్యములు – వెలుగు జూచిన కావ్యములు అవతారికలు, విజయనగర సామ్రాజ్య పతనానంతర కాలము – వెలుగుజూచిన కావ్యములు – అవతారికలు 18,19 శతాబ్దములు – సంస్థానాధిపతుల పోషణకాలము – వెలుగుజూచిన కావ్యములు – అవతారికలు" అను కాలానుగుణమైన విషయ విశ్లేషణలతో అవతారికల స్వరూపమును గూర్చి మనకు సమాచారమును అందించినారని నిర్ణయింపవచ్చును. వారి ప్రకారము "ఆంధ్ర మహాభారతము వ్యాస ప్రోక్తమైన సంస్కృత భారతమునకు తెలుగు సేత. కానీ సంస్కృతములో పైన జూపిన కవిత్వ లక్షణ విభాగము లేదు. కన్నడభాషలోను అట్టి విభాగము లేదు. ఆంధ్రభాషలో ప్రథమ కావ్యము వెలసినదాది ఇట్టి విభాగమును పాటించుట వలన ఇది కేవలము "దేశీసంప్రదాయము" గా తెలుగు కవులు రూపొందించిరని చెప్పవలసియున్నది". అని అవతారికలను గురించి భావించినట్లు తెలియును.

ఆచార్య జి.వై. ప్రభావతీదేవి పర్యవేక్షణలో పి.హెచ్.డి. పట్టము కొరకు పరిశోధనా వ్యాసమును సిద్ధము చేసిన వారు శ్రీ దొప్పలపూడి పరిశుద్ధ శామ్యూల్. ఈ వ్యాసమును పట్టము కొరకై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయమునకు సంర్పించినారు. ఈ వ్యాసములో అవతారికా నిర్వచమును, ఇష్టదేవతా స్తుతులను ప్రస్తావించినారు. గణపతి ప్రాశస్త్యము,ఇష్టదేవతా స్తుతులలో ప్రస్తావనకు వచ్చిన గణపతి స్తోత్రములు, విరించిని అతని సృష్టి వైవిధ్యమును వివరించి, బ్రహ్మకు గావించిన స్తుతులను చూపడం గలదు. ఇష్టదేవతలలో శ్రీ మన్నారా యణుని అతని ఇతర అవతారమూర్తులగు వరాహ, శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీవెంకటాచలపతి స్వరూపములను చిత్రించిన పలువురికవుల స్తోత్రరూప పద్యములను పరికింపగలము. తర్వాత శివుని సంబంధమగు ప్రస్తావనలో ఇష్టమైన దేవునిగా శివునిగురించిన స్తుతులు, వాటితో పాటుగ, ఇతర రూపములలో కనిపించు ఆతని అంశాలగు వీరభద్ర, భైరవ,వీరశరభ మూర్తులను మనకు సాక్షాత్కారింప జేసినారు. చదువుల తల్లి యైన సరస్వతి ప్రాశస్త్యము ఇష్టదేవతలలోఆమె స్తుతులు మరియు సంపత్కారిణియగు లక్ష్మికి అభినుతులు సమర్పించినారు. దానితోపాటు ఆదిలక్ష్మిని, ఆమె అంశలు గలిగిన, సీతా, రుక్మిణి, అల(రు)మేలుమంగాదులను ప్రస్తుతించిన స్తుతులు పేర్కొనినారు. అటుపై పర్వతరాజ పుత్రి పార్వతిని,ఆమె ప్రాశస్త్యమును తెలిపినారు ఇతర దేవతా స్తుతులలో శ్రీరామ పరివారము, అందులో లక్ష్మణ, భరత, శత్రుఘ్న, ఆంజనేయ,

ఆదిశేష, గరుడ, విష్వక్సేనాదులను గూర్చితెలిపినారు. విష్ణువు యొక్క ఆయుధములైన పాంచజన్య, నందక, కౌమోదకి, సుదర్శన, శార్ఙ్గముల స్తుతులు కలవు. తర్వాత మన్మథుని కందుని, గంగను, సూర్య, చంద్రాదులను, నవగ్రహాలను, కశ్యప, సత్యభామలతోపాటు, దరిద్రదేవత (జ్యేష్ఠాదేవి)ను పేర్కొన్న స్తుతులను ప్రస్తావించినారు ఇష్టదేవతా స్తుతులవలన కలుగు ప్రయోజనములు వివరించినారు. పాల్కురికి సోమనాథుని బసవ పురాణము, పండితారాధ్య చరిత్రాదులు, భాస్కర రామాయణము మొదలైన కావ్యావతారికా భాగాలను శ్రీ తేరాల సత్యనారాయణశర్మ గారు, “అవతారికలు – చరిత్ర” అను గ్రంథమందు సమీక్షించినట్లు గలదు. తమ ఎం.ఫిల్. పట్టము కొరకై, సి. హెచ్. సీతాలక్ష్మిగారు ‘తెలుగు కావ్యావతారికల్లో సాహిత్య విమర్శ’ అను సిద్ధాంత వ్యాసాన్ని సిద్ధము చేసినారు. ఆతర్వాత పరిశీలించిన విషయముల ననుసరించి, లభ్యమైన వాటి ప్రకారము ఈ స్తుతిపరముగా జరిగిన కృషిలో భాగమైనది – ఆచార్య మసన చెన్నప్ప గారి పర్యవేక్షణలో పి.హెచ్.డి. పట్టం కోసం సమర్పింపబడిన సిద్ధాంతవ్యాసము. దీని పరిశోధకుడు శ్రీ బి.రాములు. ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు సమర్పింపబడినది. గ్రంథ నామము> “ తెలుగు కవుల ఇష్టదేవతా స్తుతులు – విశేషాలు”. ఇందలి కృషిని కొంత ప్రస్తావింతము. ఈ వ్యాసములో  శ్రీ బి. రాములు గారు ‘దేవతలు – ప్రస్తావన’ అను అంశముతో ఆరంభించి, కావ్యావతారికలలో-- ఆరంభపద్యము శ్రీకారముతో నుండుట మొదలుగా, వాటిపై జరిగిన కృషి., స్తుతిపద్యాలు, శార్దూల, ఉత్పలమాల, వృత్తాల ప్రయోగము, తొలి పద్యములుగా స్తుతులు గావింపబడిన, వైష్ణవ, శైవ సంబంధమైన రచనలు, వాటి వాటి ప్రత్యేకతలు, ఇతర ఇష్ట దేవతా నుతులు, వస్తునిర్దేశనము మున్నగునవి విశ్లేషించినారు. స్తుతులలో వర్ణనలు, దేవతలలో కాలానుగుణముగా నిర్మితమైన విభజన, స్తుతివిధానము, ఛందోరీతులు, కవుల ఊహలు, కవితా ప్రౌఢిమ- ఇతర విశేషాలు – ప్రయోజనములు మున్నగువాటిని విస్తృతముగా ఏర్చి నేర్పుతో కూర్చినారు.  ఈ విధముగా అవతారికల సంబంధ మైన కృషిని గుర్తించవచ్చు. ఇది కాక మరి కొంతమంది కూడా ఈ అంశముపై ఇతర కోణములలో సాహిత్యాభిరుచితో వ్యాసములు వెలయించుటకు, పరిశోధించి మరిన్ని సొగసులను తెలుగు సారస్వతమూర్తికి అందించు  లేక  అలంకరించు  అద్భుతమైన  అవకాశములు గలవు.

1.3 *కావ్యావతారికలు - విశేషాంశాలు* : - కావ్యావతారికలలో ప్రస్తావించిన అంశములను ఇపుడు పరిశీలిద్దాము. ఇందులో పలు తెరగులలో కావ్యావతారికల విశేషములు ప్రస్ఫుటమగుచున్నవి.

*ప్రార్థన:* - అసలు ప్రార్థన అనగా వేడుట, కోరుకొనుట, అడుగుట.. కావ్యనిర్మాత యగు కవి ఎవరిని అడుగవలెను? ఎందుకు అడగవలెను? ఏమి అడగవలెను? మొదలగు ప్రశ్నలకు కొంతవరకు సమాధానమిట్లు చెప్పుకోవచ్చును. కావ్య నిర్మాణమును చేయ తలపెట్టుట రెండు విధములుగా జరుగుటకు అవకాశము కలదు. ఒకటి కవి తనకు తానే కావ్యమును కూర్చు అవకాశము. రెండవది వేరొకరు, అనగా తనను పోషించుచున్న పాలకులుగాని, సన్నిహితులుగానీ, కోరినపుడు వారిని తృప్తి పరచుటకై కవి, కావ్యమును కూర్చుట. అసలు సాహిత్యమును మిక్కిలి జాగ్రత్తగా పరిశీలించినచో కొన్ని వివరములు మనకు లభింపగలవు. మొదట రచనలు , ఆశ్రమములలో గ్రథితములు. రామాయణమును ఆది కావ్యముగా చెప్పడము, ఆదికవిగ వాల్మీకిని భావించడము తెలిసినదే. వ్యాస మహర్షి భారతమును కూర్చిన విషయములోను, (సంఖ్యా పరమైన శ్లోకసంఖ్య /ప్రక్షిప్తములను పక్కకు పెడితే) సందేహము లేదు. వీరిరువురూ ఆశ్రమజీవితమును గడుపుచూ అచ్చటనే రామాయణ భారత ఇతిహాసములను లిఖించినారు. దీనిని “ఆశ్రమ కవితగా” చెప్పవచ్చును.

వాస్తవమునకిది సంస్కృత లౌకికసాహిత్య ఆవిర్భావము. అప్పటికి వేదము లఖితములు.

తర్వాత పుట్టుకొచ్చినది “ఆశ్రిత కవిత్వము” – అనగా కవులు రాజాస్థానములలో లేక ఇతరుల పోషణలో ప్రాపును /ఆశ్రయమును పొంది /సంపాదించి (ఆశ్రయమిచ్చిన) వారిని కీర్తిస్తూ కొంతవరకు సాహిత్యమును సృజించిన కాలము. తర్వాత కాలము నీరీతిగా “ఆత్మాశ్రయకవిత” గ చెప్పవచ్చు. ఈ కాలములో కవి కవితను వ్రాయటమే కాకుండా, దానిని ముద్రించి పంపిణీ చేసికొనుట, పంచుట, అమ్ముకొనుట కూడ చేసుకొనవలసిన పరిస్థితులను మనము చూస్తున్నాము. వీటికి అక్కడక్కడ కొన్ని మినహాయింపులు ఉండవచ్చు. ఇక మనము పరిశీలించుచున్న అంశము తెలుగు కావ్యములకు పరిమితమైనది. అంతకు మునుపున్న సాహిత్యమును చరిత్రకారులకు వదలి, భారతానువాదమును ఆధారముగా గ్రహించి చూసినపుడు, తెలుగు కావ్య సాహిత్య వెలుగులు ప్రసరించినది నన్నయ్యగారి నుండి, ఆయన రాజరాజమహేంద్రుని

ఆస్థానమునందలి కవి. అనగా 'ఆశ్రితకవితా' కాలముతో తెలుగు కావ్యము ఆరంభమైనది. కనుక కవితారంభము పోషించు వారికి తృప్తి కలిగించు విధములో జరిగినది. మహాభారతము చంద్రవంశ రాజుల ఘనత/చరిత కలది.

కనుకనే తనకుల బ్రాహ్మణుని, అనురక్తుని, అవిరళ జపహోమ తత్పరుని, విపులశబ్ద శాసనుని, సంహితాభ్యాసుని,.......నన్నపార్యునితో, వరచళుక్యాన్వయాభరణుడైన రాజరాజనరేంద్రుడు, పెక్కు ఉదాత్త, రసాన్విత, కావ్య నాటకాదులను తెలిసినవాడు, విమలమతితో అనేక పురాణములు విన్నవాడు, ఆగమముల యెడ భక్తి కలవాడు. అయినా పార్వతీపతి పదాబ్జముల ధ్యాన పూజాదికముల యెడ, భారత శ్రవణాసక్తియు, ఇతర లక్షణములతో పాటు కలిగి యున్నవాడు కనుకనే...... నన్నయ్యకిట్లు విన్నవించినాడు.

" హిమకరుదొట్టి పూరుభరతేశ కురుప్రభు పాండు భూపతుల్
క్రమమున వంశ కర్తలనగా మహి నొప్పిన యస్మదీయ వం
శమున, ప్రసిద్ధులై, విమల సద్గుణ శోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్" [1]

నన్నయ - దానికి అంగీకరించినారు. తర్వాత జరిగినది ఆంధ్రమహాభారత నిర్మాణము. ఇక ఇప్పటికి మహాభారత వివరాలు, తదితర వర్ణనలు, విషయములు ప్రక్కన పెడదాం. ప్రార్థన అనునది కవి తన స్వంత నిర్ణయము ననుసరించి లేదా పోషకుని కోరిక ననుమోదించి కావ్యమును ఆరంభించును. "గ్రంథనిర్విఘ్న సమాప్తి" నాకాంక్షిస్తూ శ్రేయస్సులను కోరుకొనుచూ, నమస్కార రూపమునచేయు ఆది రచనయే ప్రార్థన.

పరిమితులు గల జీవాత్మ పరిమితులు లేని పరమాత్మను ప్రధానముగా ఇష్ట దైవ రూపములో కావలసినదానినాశించి కోరుటే – ప్రార్థన. కృతిపతికి క్షేమస్థైర్యముల ప్రసాదించ వేడుట మొదలుగా విషయములను ఇచట చూడగలము. స్తుతులలో పలు రీతులను పాటించుట గలదు. వాటిని ఆయా సందర్భములందు ప్రస్తావించెదము. తెలుగులోమహా భారతం కవిత్రయంచే రచింపబడినది. నన్నయ్య గారు ఆది, సభా పర్వములను ఆరణ్య

---

పాద సూచికలు : - [1] కవిత్రయు/భారతము /ఆది/I/

పర్వమునందు కొంత భాగము వ్రాయగా, ఆరణ్య పర్వ శేషమును ఎర్రన పూరించారు. కవిబ్రహ్మగా స్తుతింపబడు ఉభయకవిమిత్రుడు కొట్టరువు తిక్కన సోమయాజి, 18 పర్వములు గల శ్రీమదాంధ్ర మహాభారతములో, నాల్గవదియగు విరాటపర్వము నుండి స్వర్గారోహణపర్వము వరకు గూర్చినది ఎల్లరకు తెలిసిన విషయమే.

శ్రీమదాంధ్రమహాభారతమును ఆదికవి నన్నయ్యగారు ఆరంభించినారు. తొలి పర్వమగు ఆదిపర్వమును నన్నయ్య గారు శ్లోకముతో ఆరంభించినారు. శ్రీవాణీ యని అమృతమయ ముఖముతో నన్నయగారు ఏ సుమూహూర్తమున అన్నారో గాని తమ భారతావతారికలో నాందీ వాక్యమై ఆనాటి నుండీ నేటి/ మొన్నమొన్నటి వరకు తెలుగు కావ్య సంప్రదాయములో శ్రీ కారమై కావ్య శీర్షికలలో తొలి స్థానము సంపాదించుకున్నది.త్రిమూర్తులను వారి దారలను స్తుతించుట ఇచ్చట గలదు. ఆ శ్లోకమిది.

"శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితావస్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకంధరా శ్శ్రేయసే." [1]

ఇది సంస్కృత భాషలో నిర్మితమైనది. ఇది శార్దూల విక్రీడితమను వృత్తము. మ,స,జ,స,త, త, గ- యను గణములచే కూర్చబడినది. ప్రాస, యతి నియమములు అనుసరణ లేదు. 19 వ ఛందము "అతిధృతి"అను వర్గమునకు చెందినది. మంగళకరమైనదిగ భావింపబడు 'శ్రీ' కారముతో ప్రారంభింప బడినది. ఇందు హరి, హర, బ్రహ్మలు స్తుతింప బడినారు. మరియు విశేషముగా శ్రీ [లక్ష్మి], వాణి [సరస్వతి], గిరిజ [పార్వతి] మూర్తులు క్రమముగా వక్షములో హరి, అంబుజభవుడు[బ్రహ్మ] ముఖమందు, హరుడు సగము శరీరము నిచ్చిన విషయమును ప్రస్తావించడము చూడగలము. ఇచట ఆశీస్సు రూపంలో పద్య ప్రక్రియ ప్రారంభమైనది.లాక్షణికుల ప్రకారం "నాటకంలో నాంది"

---

పాద సూచికలు : - [1 ] కవిత్రయ భారతము /ఆది పర్వము/ తొలి శ్లోకం.,

వంటిది ఆరంభము లో గల పద్యము/శ్లోకం. ఆ లక్షణం ఇట్లు చెప్పబడింది.

" ఆశీర్న మస్క్రియా వస్తు నిర్దేశోవాపి తన్ముఖం"

పద్యము నడక గంభీరముగ [శార్దూలము] పెద్దపులి నడకను అనుసరించినట్లుండును.

తిక్కనామాత్యులవారు తాము విరచించిన విరాట పర్వమును ఇట్లు ఆరంభించినారు.

ఉ ." శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు పర తత్వము గొల్తు నిష్టసిద్ధికిన్" .[1]

"హరిహర"రూపమునందలి పరతత్వమును "ఇష్టసిద్ధికై" కవి తన లక్ష్యముగ పేర్కొనెను. 'ఇష్టసిద్ధి' యనునపుడు విహిత కార్యము కొరకు చేయుపని. దాని 'లక్ష్యము' చేరుటకు-అని తెలియును. విశ్వశ్రేయము కోరునది కావ్యము – అని ముందే చూచి యున్నాము,.

'శ్రీ' యను నామముతో నున్న గౌరవర్ణముగల పార్వతి యను అందమైన స్త్రీ యని చెప్పబడినది.పెద్దలు 'నారాయణు'నకు 'నారాయణి'కి వ్యత్యాసము లేదందురు. పురుషోత్తముడైన నారాయణుని మాయా స్వభావమే నారాయణి. 'శ్రీ' యనగా "శ్రయతి హరిమితి శ్రీ" యనినపుడు విష్ణువునాశ్రయించునది - శ్రీ ఇందు లక్ష్మి మరియు పార్వతి యను రెండు రూపాలు సాక్షాత్కారమైనవి.

శ్రీ అను పదమునకు నానార్థములు గలవు. అందులో కొన్ని ... లక్ష్మి, సంపద. ఐశ్వర్యము, వృద్ధి, త్రివర్గము,శోభ, పార్వతి, అలంకరణము, కీర్తి, బుద్ధి, సరస్వతి, విషము, ఉపకరణము, మారేడు వృక్షము... మొదలగునవి.

వాడుకలో ఒక కార్యమును ఆరంభించినారని తెల్పుటకు ..... ఫలానా కార్యమునకు శ్రీ కారము చుట్టబడినదని అనటం అందరికీ తెలిసినదే.

---

పాద సూచికలు : - [1 ] కవిత్రయ భారతము/ విరాటపర్వం/తొలి పద్యము

'శ్రీ'- యనుఒక రాగము కలదు. ఇది మంగళ కరమైన, ఘన రాగాముగా కూడ గుర్తింపు పొందినది. ఈ రాగము 22 వ మేళకర్త రాగమగు "ఖరహరప్రియ" యందలి జన్య రాగము.(1)

ఆదికవి నన్నయ్యగారు ఆరంభించిన భారతము తొలి పద్యము – పూర్తిగ సంస్కృత భాషలో నున్నది. అది ముందే చూచితిమి. ఇచట తిక్కనగారు చక్కగ తెలుగులో కూర్చిన పద్యములో కొంత సంస్కృత భాషను వాడినారు. అది ఆనాటి సాంఘిక పరిస్థితులను బట్టి హైందవమతభిన్నతలలో ఐకమత్యమును చాటుటకు లేక తీసుకురావటానికి కావచ్చు. శివ వైష్ణవ మతముల మధ్య గల భేదమును తొలగించి భావ పరముగా అవి రెండు ఒకటే యని చెప్పే ప్రయత్నముగా కూడా అనే ఆలోచన యనవచ్చు. ఇక వాడబడిన పద్యము సంగతి చూస్తే , పద్యము ఉత్పలమాల – భ,ర,న,భ,భ,ర వ- యను గణములతో కూడినది. యతి స్థానము 1 – 10 అక్షరములకు చెల్లించవలెను.ఇది 20 వ ఛందమగు "కృతి"యను ఛందోరీతికి చేరినది. ఉత్పలమాల యనగా కలువల హారము. కలువ చంద్రోదయమైనపుడు వికసించును. మనసుకు ఆహ్లాదము కూర్చువాడు చంద్రుడు. మనసుకు హాయి కూర్చుటే కావ్య పరమావధి కదా! మనః కారకుడు చంద్రుడు యని జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతము.

ఉత్పలమాల కూడా అట్టి ఆహ్లాదము కలిగించునదే యని కూడా వ్యాఖ్యానము చేయవచ్చు.
"శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయ[గ్]o శివః" [1] –
అనునప్పుడు శివుని హృదయము విష్ణువని , విష్ణువు హృదయం శివుడని చెప్పడం కలదు. అనగా ఇద్దరి మధ్య భేదము లేదని పిండితార్థము. దేశముయొక్క, అందలి జనుల యొక్క క్షేమము కోరుటయే ప్రథమ కర్తవ్యము గనుక ఆ దృష్టిలో అలోచించి చేసినదే 'ఉత్తమ కార్యము'. ఆ దృష్టిలో చేయబడినదే 'ఉత్తమ కావ్యము' కూడ అనటం సముచితము. ఆనాటి పరిస్థితి లో దేశమునందు మతపరమైన అంతరాలు, ముఖ్యముగా శైవ మరియు వైష్ణవ సిద్ధాంతములు దేశ ప్రగతికి ఐక్య స్థితికి కొంత ప్రమాదకరముగా ఉండినట్లు చెప్పవచ్చు.

---

పాద సూచికలు: - [1 ] సంధ్యోపాసన విధి : గీతాప్రెస్ గోరఖ్ పూర్ ప్రచురణ పుట/ 87 .

సంగీత త్రయమందు ఒకరైన కాకర్ల త్యాగరాజస్వామి "ఎవరని నిర్ణయించేదిరా?" [1] అను కృతిలో శ్రీరాముని గురించి పల్కుతూ ఇట్లు ప్రస్తావిస్తారు.

శివ పంచాక్షరి లోని "మ" మరియు అష్టాక్షరి లోని "రా" యను రెండు అక్షరాల రూపమే "రామ" శబ్దము.

అదే రీతిలో ఉమేశ రమేశ తత్త్వముల రూపమే 'హరిహరనాథుడు'. అసలు పరతత్త్వమునకు రూపము లేదు. లోక వ్యవహారమునందు మాత్రమే ఈభేదములు/ లక్షణములు చూడబడుచున్నవి. పండితుల వ్యాఖ్యలు వారి వారి అనుభవము ననుసరించుచుండును . అందులకే "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" యని పేర్కొవడం చూడగలము.

చరిత్ర ప్రస్తావన: -

భారత దేశ చరిత్ర నిర్మాణానికి అధికముగా సహకరించునది సాహిత్యము. రాతి శాసనాలపై, రాగి రేకులలో, తాళ పత్రములలో, అచ్చటచ్చట కవుల మాటలలో తటిత్తుల వలె తమను గురించి తాము చెప్పుకొన్న కొన్ని సంగతుల ద్వారా ఈ దేశ చరిత్ర కూర్చబడినది. దీనికి ఈ దేశవాసుల, జీవన విధానము, జీవితము గూర్చిన ఆలోచనావిధానము గూర్చి కొంత వివరణము తెలుసుకొనవలయును. తొలుతనుండి భారతీయులకు ఆధ్యాత్మిక భావన/ చింతన పై మక్కువ ఎక్కువ. మనిషి జీవితమునకు అవసరమైనంత వరకే ప్రకృతిని వాడుకొన్నారు. అత్యంత గౌరవముతో ప్రకృతిని ఆరాధించారు. పంచభూతములైన పృథివ్యాపస్తేజోవాయురాకాశములను దేవతా స్వరూపములుగా తలచినారు. భౌతిక విషయాలు శాశ్వతం కాకపోవడం చూచినారు. తమ ఉనికి ఈ విశ్వంలో ఎంత అల్పమో గ్రహించారు. ఈ జీవనవిధాన సూత్రాలలో క్రమంగా మార్పులు చోటు చేసుకొన్నాయి. శ్రీమదాంధ్ర మహాభారతంలో ఇట్లు చెప్పడం చూడగలము. తమను తాము పొగడుకొనుట, తెగడుకొనుట ., అట్లే ఇతరులను పొగడుట మరియు నిందించుట తగనిపని, అని పూర్వీకులు చెప్పిన దానిని వీరనుసరించినారు.

---

పాద సూచికలు: - [1] త్యాగరాజస్వామి కృతులు, రాగం > దేవామృతవర్షిణి, ఆది తాళము

ఆ. అన్య కీర్తనంబు నన్యనిందయు తన్ను పరగ పొగడికోలు ప్రబ్బికోలు

ఆపగాతనూజ, ఆర్యవృత్తములు గా వనిరి వీని నాద్యులయిన మునులు.[1]

కనుకనే తమ పిల్లలకు నామకరణము చేయునప్పుడు దేవతల పేర్లను వాడుకొన్నారు. ఇది ఒక రకమైన విషయము. తమ పిల్లలను పిలిచినపుడు పరోక్షముగా దైవ నామ స్మరణ కూడా జరుగును. 'యేకక్రియా ద్వ్యర్థి కరీ' -అన్నట్లు. ఒకే ప్రయోగం, రెండు లక్ష్యాలు / కార్యములు అనిన విధముగా.

ఈ సందర్భములో మరొక విషయము కూడా మనము చూడగలము. పెద్దవారి పైగల అభిమానము, భక్తి, గౌరవముల కారణముగా తాత పేరునే మనవడికి పెట్టుట చూడగలము.

ఒక ఉదాహరణ చూడుడు. తొలితెలుగు సంకీర్తనాచార్యుడైన తాళ్ళపాక అన్నమయ్య చరిత్ర విషయము:- భరద్వాజఋషి..తద్వంశమున..నారాయణుడు [1] -> విఠలుడు [1] →నారాయణుడు [2] -> విఠలుడు [2] -> నారాయణుడు[3]-> నారాయణ సూరి → అన్నమాచార్యులు . ఇచ్చట ఏడు తరముల వంశ చరిత్రలో నారాయణుడు పేరుతో ముచ్చురు, విఠల నామముతో ఇరువురు గలరు. అన్నమాచార్యులవారి తండ్రి పేరులో కొంత వైవిధ్యము కలదు. నారాయణ సూరి యని.

*ఐతే ఇది ఈదేశములోనే కాదు. మనల్ని కడపట పరిపాలించిన ఆంగ్లేయ పాలకుల విషయములోనూ యున్నదను విషయమును మనము గుర్తుంచుకొనుట కొంతమేర అవసరమే. జార్జి 1, జార్జి 2, ఎలిజబెత్1 , ఎలిజబెత్2 మొదలగునవి ఇటువంటివే!*

కావ్యావతారికల పరిశీలన వలన కలుగు కొన్ని ప్రయోజనాలను ఇపుడు పరిశీలిద్దాము. అవతారికలను కొద్ది జాగ్రత్తతో పరిశీలించినచో పలు విశేషాలు మనకు తెలియును. అవి పరిష్కృతము చేయునపుడు వచ్చు పలు సందేహములకు సరియగు సమాధానములను, ఆధారములను చూపి చరిత్ర నిర్మించుటలో గల అనేక చిక్కు ముడులను విడదీసి సరియగు చరిత్ర నిర్మాణమునకు చక్కగా ఉపయోగపడును. కొందరి రచనలలో విశేషాలు తెలియును

---

పాద సూచికలు: - [1] కవిత్రయమహా భారతము> సభా ద్వితీయ/ 49

కుమారసంభవము నందలి కొన్ని పద్యములలోని సంక్షిప్త భావము ఇట్లుగలదు.

*"నన్నె చోడుడీపద్యములలో తాను కాశ్యపస గోత్రుడైన కరికాల వంశమునకు చెందినా సూర్యవంశపు క్షత్రియుడననియు, తండ్రి పాకనాటి యందు ఇరువది యొక్క వేయిటిని పాలించిన చోడబల్లియనియు, తల్లి హైహయాన్వయ వంశమునకు చెందిన శ్రీసతి యనియు, ఆమె చోడబల్లి అగ్రమహిషి యనియు, తాను ఒఱయూరికధిపతియు, టెంకణాదిత్యుండను బిరుదుగల వాడననియు, వివిధ యజ్ఞములు జేసి పవిత్రీ కృత దేహుడయినాననీ చెప్పుకొనెను. తాను రచించిన కుమారసంభవము గురువున కంకితముగా రచించినట్లు వ్రాసుకొనెను" [1]*

మరొక ఉదాహరణ చూడుడు - శ్రీమదాంధ్రభాగవత కర్తయై సహజపాండిత్యముచే ప్రతిభావంతుడైవెలసిన పోతన కవి ఇట్లు చెప్పడము చూడగలము.

మ. "ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీయుర్విం బురాణావళుల్ [2]
తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్"

ఇచ్చట భాగవతమును తన పూర్వ జన్మ కృత పుణ్యవిశేష బలిమి కారణముగా నన్నయాదులు తెలుగులోకి సంస్కృతము నుండి, పురాణాదులు అనువదించుచు, భాగవతమును అనువదించలేదని తెల్పుకోవటం జరిగింది. భాగవత ఆంధ్రీకరణ చేయటముద్వారా పునర్జన్మ లేకుండా చేసుకోవటం ఆయన అభిలాష. భారతము తెలుగులోనికి అనువదింపబడిన పిదపనే భాగవతానువాదము జరిగిందని చెప్పే చారిత్రిక సత్యాన్ని ఈరీతిగా గుర్తించుటకు అవతారికలు దోహదం చేయును.

పోతన గారు కూడా తమ భాగవతమును ఒక లక్ష్యమునాశించే చేసిననారు. తొలి పద్యమిది.

---

పాద సూచికలు :- [1] సి.బి.వి. అప్పారావు ఆంధ్ర కావ్యములు – అవతారికలు పుట 43.
[2] పోతన భాగవతం ప్రథమ స్కంధము, 21పద్యము.

శా. "శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ లోక ర[1 ]
కైకారంభకు భక్త పాలన కళా సంరంభకున్ దానవో
ద్రేక స్తంభకు కేళి లోల విలసద్దృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండ కుంభకు, మహా నందాంగనా డింభకున్."

పోతన గారి దృష్టి/ లక్ష్యము కైవల్య పదము చేరుట. పునర్జన్మ లేకుండా చేసుకొనుటే పూర్వీకుల దృష్టి. అందులకే వారు పరితపించినారు. పలు పలు విధములుగా ప్రయత్నించినారు. శ్రీరాముడు సీతాసహితుడై భద్రమూర్తిగా ధ్యానమందున్నపుడు పోతన కనుగవకెదురుగ కనిపించినారు. తనను తాను రామభద్రునిగా పరిచయము గావించుకొని భాగవతమును తనకంకితమిమ్మని కోరుటయే గాక, పోతన గారికి వలసిన భవహర స్థితి కూడా కలుగునని ఆనతినిచ్చినాడు.

సుకవి స్తుతి : - పూర్వ కవి శేఖరులను పలువురు స్తుతి గావించినారు. వారిలో భక్తి భావముతో రామాయణం రాసినట్టి మహిళా మణి ఆతుకూరి మొల్ల. ఆమె పూర్వ కవులను {సంస్కృత , తెలుగు} ఈ రీతిగా స్తుతించారు -

సీ. సుర సన్నుతజ్ఞాను సువివేకి వాల్మీకి, నఖిల వేదాగమాభ్యాసు వ్యాసు,
ఘోరాంధకార ప్రభారవి భారవి, సత్కాంతిహిమకర శ్లాఘు మాఘు,
వివిధ కళాన్విత విఖ్యాతి భవభూతి, ప్రకట కార్యధురీణు భట్ట బాణు,
మానినీలోక సమ్మదముద్రు శివభద్రు, కవితారసోల్లాసు కాళిదాసు
తే. స్తుతగుణోద్దామునాచన సోము , భీము నవ్యమంజుల వాగ్ధుర్య నన్నపార్య
రసికుడైనట్టి శ్రీనాథు రంగనాథ తిక్కకవిరాజు భోజు నుతించి మించి[2].

కం. తొల్లిటి ఇప్పటి సత్కవి వల్లభులను రాసికవినుత వాగ్విభవ కళా
మల్లుల కవితా రచనల బల్లిదులైనట్టి ఘనుల భక్తిగా దలతున్. [3]

---

పాద సూచికలు: [1] పోతన భాగవతం ప్రథమ స్కంధము, 1పద్యము. [2 ] మొల్ల రామా అవతా. 9 పద్యం [3 ] మొల్ల రామ ఆశ్వా.1 పద్యం 10.,

చక్కగ పూర్వ సంస్కృత భాషా కవులను వారితో పాటు తెలుగు కవులను , వారి వారి ప్రత్యేక ప్రతిభా పాటవములతో ప్రస్తావించడం ఈ కవయిత్రి నేర్పు. ఐతే కవివరులను కాలానుగుణముగా పేర్కొనలేదు అని భావించవచ్చు. మొత్తంపై భక్తితో "తొల్లిటి, ఇప్పటి" కవులను " కళామల్లులు" గా చిత్రీకరించింది.

ఇట్టి పలు ఉదాహరణలు మనం చూడగలము. తోటి కవులకు ఒక్క మనవి కూడా చేసింది . తానూ గోపవరపు శ్రీకంఠమల్లేశు వరముచేత కవిత్వము చెప్పుచున్నట్లు, చదివినదానిని కాదని, లక్షణ గ్రంథ గంధవాసన చూడనిదాననని సవినయముగా మనవి చేసినది. చూడుడు.

కం."చెప్పుమని రామచంద్రుడు సెప్పించిన పలుకు మీద చెప్పెద నేనె
ల్లప్పుడు నిహపరసాధన మిప్పుణ్యచరిత్ర, తప్పులెంచకుడు కవుల్" [1]

మహా భారతము ఆరంభించిన నన్నయ్య గారు తన రాజైన రాజరాజమహేంద్రుని ఘనతను ప్రస్తావించడమిట్లుగలదు. రాజలోక భూషణుడు, జయశాలి, శౌర్యుడు, అపరాజితుడన్నారు.

ఉ . " రాజకులైకభూషణుడు రాజమనోహరుడన్యరాజ తే
జో జయశాలి శౌర్యుడు విశుద్ధయశశ్శరదిందుచంద్రికా
రాజిత సర్వలోకు, డపరాజిత భూరి భుజాకృపాణ ధా
రాజల శాంత శాత్రవ పరాగుడు రాజమహేంద్రు డున్నతిన్ ".[2]

ఇది తనను పోషిస్తున్నట్టి రాజు యెడల చూపిన అభిమానము. మరియు నన్నయనుద్దేశించి పరమ ధర్మ విదుడైన రాజరాజ నరేంద్రుడు చెప్పిన తీరు పేర్కొనుట జరిగినది.

పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నారాయణుని వలె, వాఙ్మయధురంధరుండగు నారాయణభట్టు తోడై యుండగ,రాజరాజనరేంద్రుని కోరికననుసరించి చంద్రవంశమునకు చెందిన వారి పూర్వీకులైన కురువంశం వారి కథ యగు మహాభారతమును, నానారుచిరార్థసూక్తినిధి, సారమతియైన నన్నయ్యభట్టు,

---

పాద సూచికలు :- [1 ] మొల్ల రామా అవతా[13].

పాద సూచికలు : - [2 ] కవిత్రయ భారతం ఆది.ఆశ్వా.1 లో/ 3 వ పద్యము

ప్రసన్న కథనముతో, అక్షరరమ్యతతో విరచించినాడు. ఆ భారతము బహుయాగ ఫలంబులను ఇచ్చునట్టిది. భారతమను సముద్రమును తరించుట విధాతకైనను సులభము కాదట! భారతమును, తొలితెలుగు సంకీర్తనాచార్యుడగు తాళ్ళపాక అన్నమాచార్యుడు అనినట్లు ' ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే'. అది ధర్మశాస్త్రముగా, వేదాంతముగా, నీతి శాస్త్రముగా, మహా కావ్యముగా, లాక్షణికుల లక్ష్య గ్రంథముగా, ఇతిహాసముగా, బహుపురాణ సముచ్చయముగా, ప్రశంసింపబడినట్టి 'పంచమ వేదము'. దానిని వివిధ తత్త్వవేత్తవేది, ఆదిముని, పరాశరాత్మజుడు, శుకుని తాత, విష్ణు సన్నిభుడు, కృష్ణ ద్వైపాయనుడు యైనట్టి వ్యాసముని విశ్వజనీనముగా నిర్మించినాడు.

నన్నయ్య సంబంధ విషయములు కొంత వరకు చూడగలము. నన్నయ్య గోత్రాదులు గలవు, మాతాపితరుల మాట కానరాదు.

సీ. తన కుల బ్రాహ్మణు ననురక్తు నవిరళజప హోమ తత్పరు విపుల శబ్ద {1 }
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాదినానా పురాణ విజ్ఞాననిరతు
బాత్రు నాపస్తంబ సూత్రు ముద్గల గోత్రజాతు సద్వినుతావదాత చరితు
లోకజ్ఞు నుభయ భాషా కావ్య రచనాభి శోభితు సత్ప్రతి భాభియోగ్యు
ఆ. నిత్యసత్యవచను, మత్యమరాధిపాచార్య సుజను,నన్నపార్యు జూచి
పరమ ధర్మ విదుడు వరచళుక్యాన్వయాభరణుడిట్లు లనియె కరుణతోడ.

ఇక మరొక అంశమును కొంత పరిశీలిద్దాము.

"కుకవి నింద"

కొందరు కవులు /కవయిత్రులు పూర్వకవులను పేరుపేరునా స్తుతించినారు. సుకవి వందనము గావించిన సందర్భము :

కం. జాతుల వార్తల నుపమల
రీతుల పదబంధముల ధరిత్రీ తల వి
ఖ్యాతిగ కృతులొనరించు పు
రాతన నూతన కవీశ్వరావళిగొలుతుస్. [2 ]

---

పాద సూచికలు : [1] కవిత్రయ భారతం ఆది.ఆశ్వా.1 లో/ 9 వ పద్యము. [2 ] వైజయంతీ విలాసము అవ-12.,

అనుచు, చక్కని పదబంధములను వాడుచు విఖ్యాతిగ కృతులను కూర్చిన వారిని 'సుకవులు'గ భావించి కీర్తించడముతో పాటుగ కుకవులను నిందించటము చూడగలము. అట్టి కుకవులెవరనగా గణలక్షణములు తెలియక తప్పుగా కూర్చిన వారు. గుణ శుద్ధి లేని వారని తిరస్కరించటము కూడ చూడగలము.

తే. పొత్తమున నుండు శల్యంబు లెత్తిపైచి
శాస్త్ర యుక్తిని గొని భేషజంబు సేయ
గ తగు నాక్షేప జీవన కవుల దీర్ఫ
జనదు కృతుల, నమంగళ జనులు వారు.[1]

మంచిని విడచి తప్పులను ఎన్నువారు అమంగళ కారులుగ భావించడము కలదు.

కం. శుద్ధ పదయుక్తిదొఅగి య
బద్ధమును నిబద్ధిగా నిబద్ధినొగి మహా
బద్ధముగా గను కుకవుల
నౌద్ధత్యము మాను కొరకు నభినందితుస్ [2 ]

ఇచట విశేషముగా కుకవులు అనవసరమైన ఔద్ధత్యము మానుకొనినచో, కుతర్కములను మాను వారికి నమస్కారమనినారు. వాస్తవమును అవాస్తవముగా, అవాస్తవమును వాస్తవమని తెలప ప్రయత్నించు వారలకు అభినందనాలనుచూ వింతగా, ఒకింత వ్యంగ్యంగా చేసిన కుకవినింద అనవచ్చును.

మరొక వర్గము వారు కుకవుల ప్రస్తావన చేయడం ఇట్లు చూడగలము.

కవుల స్వవంశ ప్రస్తావన: - కావ్య నిర్మాతలగు కవులు తమ గురించి కొంత చెప్పడము సహజము, అవసరము కూడ. అందులో పలు కావ్యములను కూర్చిన వారు స్వోత్కర్ష అధికముగా గావించిన సందర్భములు మనకు అక్కడక్కడ కనిపించును. తమ ప్రతిభకు మరెవ్వరూ సాటి రారన్నట్లుగా చెప్పుకొనడం కూడా చూడగలము.

మరి కొంతమంది కవులు తమకు ప్రత్యేక అభిమానపాత్రులైన వారి గురించి విశేష విశేషణములతో స్తుతించిన సందర్భములు కూడా చూడవచ్చును.

---

పాద సూచికలు : [1 ] రాధికాస్వాంత.అవ/6. [2 ] శ్రీ సీ.రా సంవా.పీఠిక 13 పద్యం.

కానీ కొందరి విషయములలో ఇది కొంత ఎక్కువగా ఉండటము చూడగలము. మనుచరిత్ర మనకందించిన అల్లసాని పెద్దన గారు, తమ గ్రంథములో మొదటి ఆశ్వాసము చివర ఇట్లు తెలుపుకొన్నారు.

" ఇది శ్రీమదాంధ్ర కవితా పితామహ సర్వతో ముఖాంక పంకజాక్ష పాదాంబుజాధీన మానసేందిందిర నందవరపుర వంశోత్తంస శఠకోప తాపస ప్రసాదాసాదిత చతుర్విధ కవితామతల్లికాల్లసాని చొక్కయా మాత్య పుత్ర పెద్దనార్య ప్రణీతంబైన....."[1]

మరియు రాయలవారే భువనవిజయమను పేరు గల కొలువులో అందరి సమక్షములో

తే. " సప్త సంతానములలో ప్రశస్తి గాంచి,
ఖిలము గాకుండునది ధాత్రి కృతియు గాన,
కృతి రచింపుము మాకు శిరీష కుసుమ
పేశల సుధామయోక్తుల పెద్దనార్య" [2]

అని యనడమే కాకుండా పెద్దన గూర్చి ఇలా కూడా పల్కినటుల చూడగలము.

కం. ' హితుడవు, చతురవచోనిధి వతుల పురాణాగమేతిహాసకథార్థ
స్మృతి యుతుడ వాంధ్ర కవితా పితామహుడ వెవ్వరీడు పేర్కొన నీకున్' [3]

మనుచరిత్ర రచించుటకు ప్రయత్నించిన వెంటనే రాయలవారు పెద్దనను సత్కరించినది, పెద్దన కవిత ఘనతను శ్లాఘించినది మరియు పెద్దనను గురించి అతనే చెప్పుకొన్న విషయములు పైన చూచినాము. ఇందులో రాయల వారు తమకు ఇచ్చిన గౌరవము, తన రచన శిరీష కుసుమ పేశల మని చెప్పినటుల తెలియగలము.

తాను చతుర్విధ కవితలల్లగలవాడనని, శఠకోప తాపసి ప్రసాదము పొందినవాడని , తన తండ్రి అల్లసాని చొక్కయామాత్యుడని వివరించినటుల చూచినాము. అన్నిటికినీ మించి పెద్దన రాయలవారికి హితుడు మరియు చతుర వచోనిధి, పురాణ ఆగమ ఇతిహాసముల అర్థముల స్మృతి యుతుడవని సంభావించినట్లు, అతనికి సాటి ఎవ్వరూ లేరని ప్రశంసలను ఇచ్చినారు. ఐతే, సప్త సంతానములు ఏవి యని పరిశీలించితే, పలు అంశములు మనకు

---

పాద సూచికలు : - [1] అల్లసాని వారి మనుచరిత్ర : ఆశ్వాసం1/ 84 [గద్యము] ,
[2] పీఠిక 14 [3] అల్లసాని వారి మనుచరిత్ర : ఆశ్వాసం1 పీఠిక లో , 15 పద్యము

కనిపించును . సప్త సంతానములు అనినపుడు ఆయా వ్యక్తుల అనుభవము రీత్యా వేరువేరు వస్తువులను చెప్పడం కలదు. సప్త సంతానములనగా ప్రజోపయోగముగా చేయబడిన పనులని చెప్పవచ్చును.

అవి క్రమముగ

[1] తటాక నిర్మాణము (చెరువుల త్రవ్వించుట),

[2] ధన నిక్షేపము (డబ్బును భద్రపరచుట),

[3] అగ్రహార ప్రతిష్ఠ (పుర హితమును కోరువారికి గృహనిర్మాణం ),

[4] దేవాలయ ప్రతిష్ఠ ( గుడి కట్టుట),

[5] వన ప్రతిష్ఠ ( అడవుల పెంపకము),

[6] ప్రబంధరచన (కవిత్వము వ్రాయుట /వ్రాయించుట)

[7] స్వసంతానము (పుత్రులు సంతానముగ కలిగియుండుట) {1}

" తనయుడు చెఱువును కావ్యంబు నిధానము గుడి వనంబు భూదేవస్థా

పనమును ననునియ్యేడును, జను శాస్త్రములందు సప్త సంతతులనగన్ "{2}

సప్త సంతానములలో కృతి ప్రశస్త మనుచు పూర్వము చెప్పబడిన పద్యమిది. " ఇల సప్త సంతానములలోపల కావ్యము దక్క దేవభవనాదుల్ ఖిలములగు కొన్ని వర్ణంబుల కానీ, చంపువు రచించె భోజుండెఱుకన్" [3].

భాషా పోషకులుగా విలసిల్లిన రాజులు మున్నగువారికి కృతిపతిత్వమును గైకోవడములో కొంత ఆనందము ఒక రకమైన గర్వము / అతిశయము కూడా ఉండి ఉండుననవచ్చును. సప్త సంతానములను గురించి మరొక వ్యక్తీకరణ ఇట్లు కలదు. "సప్త సంతానాలు యశస్సును చిరస్థాయిగా [చాలాకాలము] నిలుపుతాయి. కాబట్టి ఎందరో పరిపాలకులు సప్త సంతానాలను లేక అందులో కొన్నిటినైనా పొందటానికి ధనమును వ్యయము / ప్రయత్నాలు చేసినారు. ' 'పుత్రః కృతిస్తటాకశ్చ నిధానం శివమందిరం

వనం విప్రాగ్రహారశ్చ సప్తసంతాన ముత్తమం' [4] అని .శా. శ 1291 [క్రీ.శ.1369 ]

--------------------------------------------------------------------------------

పాద సూచికలు : - [1] గాజుల సత్యనారాయణ పెద్దబాలశిక్ష పుట:274 [2] మరియు [3] అప్పకవీయము లోఆశ్వాసం 2/15 మరియు 17 పద్యములు. [4] పుట 93/సామాజిక జీవనం/ కడపజిల్లా శాసనాలు, సంస్కృతి చరిత్ర. డా. అవధానం ఉమామహేశ్వర శాస్త్రిగారి సిద్ధాంత వ్యాసం. శ్రీ. కృ. దే. రా.వి.వి., అనంతపురం].

నాటి పోరుమామిళ్ల శాసనం, సప్త సంతానాల పట్టిక నిస్తూ 'భవదూర మహీపతిని ఏతాదిక సత్పుణ్య కర్తగా అభివర్ణించింది. ఇందులకు కారణం బహుశః ఇట్లు చెప్పవచ్చు. " ధర్మాచరణం స్వర్గ ప్రాప్తికి మూలం.

మానవుడు తన జీవితములో అనుభవించే భౌతిక సౌఖ్యములు, సంపదలు ఏవీ శాశ్వతం కావు. ఆచరించిన, అనుసరించిన ధర్మమొకటే శాశ్వతమైనది. పూర్వీకులు ఆధ్యాత్మికవాదులు. వారు భౌతిక వాదులు కారు. 'అనిత్యాని శరీరాణి, విభవో నైవ శాశ్వతః నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః" అని భావించినారు.

మొదట నన్నెచోడుడు తన కుమార సంభవములో సప్త సంతానములను గురించి "పూనిమహాగ్రహార వరపుత్ర సమున్నతి దేవతాలయో ద్యాన తటాక సత్కృతి నిధానము లాశశి తారకంబు సుస్థానములై మహింబరగునని" [1] చెప్పగా, మంచన కవి తన కేయూర బాహు చరిత్రలో ఈ విషయమును ఈరీతిగా ప్రస్తావించినారు.

'"నందనుడు వనము నల్లిల్లు నిధి సుర
గృహము, చెఱువు, మేలికృతి యనంగ
జగతి వెలయు సప్త సంతానములు, వీన
పుణ్యమును యశంబును పొందవచ్చు'[2]

అని అక్కడితో ఆగక మరి కొంత వివరణ ఇవ్వడము కలదు.

కం. 'సొమ్ములలో ముప్పోర్చు జ
గమ్మెల్లను సోడుముట్టగా చేయును. శ్లా
ఘ్యమ్మగు వస్తువు,నగుటస్
కమ్మని కనకమ్ము కాదె కవిత తలంపస్' [3].

మరికొంత విశదముగా చెప్పిన మరొక మాట కలదు. వననిధి తటాక దేవ భవనములు పుణ్యదములు. వీటిని ప్రతిష్ఠించిన గాని ప్రజలు తెలిసికోలేరు. సరసకవిత సకలదిశలకుచని గౌరవమందును.

---

పాద సూచికలు : - [1] నన్నెచోడుడు/కుమార సంభవము/1-46, [2,3] మంచన కవి/ కేయూర బాహు చరిత్ర/ ప్రథమా/8పద్యము ,9, 10 [పద్య భావాలు]

*కావ్య వస్తు వివేచనము* : - ఈ విషయ పరముగానొక ఉదాహరణనిట్లు చూపవచ్చు.

శా. ప్రఖ్యాతంబన మిశ్ర బంధ మన నుత్పాద్యం బనంగా త్రిధా [1]
వ్యాఖ్యాతంబగు వస్తువందు మఱి యధ్యాహారముం జేయగా
ప్రఖ్యాతం బితి వృత్తమైన కృతి చెప్పన్ వక్తకున్ శ్రోతకున్
విఖ్యాతిం గలిగించు పుణ్య మహిమన్ విశ్వంభరా మండలిన్.

కం. శృంగారము ముఖ్యం బగు
నంగియు నంగములు దలప నవ్య రసములున్
సాంగమగునేని టంకము
బంగారముతోడి యొఱ ప్రబంధము వొందున్. [2]

గీ. కథ ప్రసిద్ధియు,మిగుల శృంగారవతియు
పరిగణింపంగ శ్రీ మహా భారతమున
కథిత యైన శకుంతలాఖ్యాన భంగి
నది ప్రబంధంబుజేయు ప్రఖ్యాతి నొంద. [3]

సీ. సర పువ్వులుగ మాలకరి పెక్కుతెఱగులవిరులనెత్తులుగ గావించినట్లు
కర్పూర కస్తురికా వస్తు వితతిచే శ్రీఖండ చర్చ వాసించినట్లు
ఒడికంబుగా గంధవొడికి నానాసూన పరిమళంబులు గూడ పఱచినట్లు
సరఘులు వివిధ పుష్ప మరంద లవములు గొనివచ్చి తేనియ గూర్చినట్లు

గీ. భారత ప్రోక్త కథ మూల కారణముగ,
కాళిదాసుని నాటక క్రమము కొంత
తావ కోక్తికి నభినవ శ్రీ వహింప ,
కూర్మి కృతి సేయు నాకు శాకుంతలంబు” [4]

మహాభారతము నందలి ఒక కథను గ్రహించి, కాళిదాసుని నాటక క్రమమును కొంత చేర్చి అభినవ రీతిలో తీర్చినాడు పిల్లలమఱ్ఱి. వక్తకు, శ్రోతకు, విఖ్యాతి కలిగించు విధములో శృంగార శాకుంతలమును కూర్చి కృతిపతి యైన చిల్లర వెన్న మంత్రికి అంకితమిచ్చినాడు.

---

పాద సూచికలు:- [1,2,3,4] పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుని శృంగార శాకుంతలము అవతారిక లో24 -27 పద్యాలు.

కావ్య వస్తువును కృతి భర్త కోరి మరీ వ్రాయించు కొన్న విషయమును ఇచట ప్రస్తావించడము చూడవచ్చును. ప్రసిద్ధ శృంగార కథ యైనది శాకుంతలము.

రాయల వారు రాజులలో కవి. చక్కని సంగీతజ్ఞాని, సాహిత్య అభిమాని. రాయలకాలము పలురీతులుగ ప్రజల క్షేమము కోరిన సమయము. ప్రజలు సుఖజీవనము గడిపినారు. అంగళ్ళ రత్నాలు పోసి అమ్మినారని చీకు చింతలు లేక బ్రతికిన కారణముగ తెలుగు భోజుడని కీర్తించినటుల వినడం కలదు. అందులకే 'రాయలనాటి రసికత' యని ప్రసిద్ధ విమర్శకులు రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ పేర్కొనుట కలదు.

తమ 'ఆముక్త మాల్యద' అనబడు విష్ణు చిత్తీయము కూర్చిన వాడు రాజకవి యైన రాయలు. ఆంధ్ర పంచ కావ్యములలో ప్రౌఢమైనది. చక్కగ ప్రకృతిని పరిశీలించి కూర్చిన రచనగ, తెలియగలము. రాయల వారి స్వంత రచనలో పలు విషయముల ప్రస్తావనము జరిగినది." పలు విషయములతో కూడుకున్నది.

ఆ. తెలుగదేల యన్న, దేశంబు తెలుగేను, తెలుగు వల్లభుండ తెలుగొకండ
ఎల్ల నృపులు కొలువ నెరుగవే బాసాడి, దేశ భాష లందు తెలుగు లెస్స. [1]

యని, తెలుగు భాషలోని మాధుర్యమును గ్రహించిన సరస జనరంజకుడైన జనపాలుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీ కృష్ణదేవరాయలు.

సీ. తొలుదొల్త నుదయాద్రిశిల దాకి కెరలు నీ యసి లోహమున వెచ్చనై జనించె
మరి కొండ వీడెక్కి మార్కొని నలియైన యల కసవాపాత్రు నంటి రాజె,
అట సాగి జమ్మిలోయ బడిపేగి దహించె కోన బిట్టేర్చె గొట్టాన దగిలె
కనకగిరి స్ఫూర్తి గరచె, గౌతమిగ్రాచె, నవుల నాపొట్నూర రవులుకొనియె,
తే. మాడెములు ప్రేల్చెనొడ్డాది మసి యొనర్చె, కటక పురి కాల్చె గజరాజు కలగి పరవ
తోక చిచ్చన, నౌర నీదురవగాహ, ఖేలదుగ్ర ప్రతాపాగ్ని కృష్ణరాయ. {2}

తే. ప్రబల రాజాధిరాజ వీరప్రతాప, రాజపరమేశ్వరార్థదుర్గానటేశ
సాహితీ సమరాంగణ సార్వభౌమ! కృష్ణ రాయేంద్ర !కృతి వినిర్మింపు మనిరి.[3]

ఇచట చరిత్రకాధారమగు అంశాలు శాసనాలతో సరి జూసి కొనినచో, నిజచరిత్ర తెలిసికొన వీలు కల్పించును.

---

పాద సూచికలు:- [1 ] రాయలవారి ఆముక్త మాల్యద ఆశ్వా.1/15.

[2],[3] {రాయలవారి ఆముక్త మాల్యద ఆశ్వా.1 క్రమంగా .,36,44 పద్యాలు.}

*కవుల పాండితీ గరిమ* :- తమకు తామే తమ ఘనతను గురించి కొందరు పేర్కోవడం కూడా చూడగలము. ఇట్టివారిలో, బ్రాహ్మీ దత్తవర ప్రసాదుడు,ఉరు ప్రజ్ఞా విశేషోదయా జిహ్మ స్వాంతుడు, ఈశ్వరార్చన కళాశీలుడు మొదలగు విశేషణములతో పొగడ బడిన శ్రీనాథుడు ఒకడు. ఆయన తన రచనలను కూర్చిన క్రమమునిట్లు చెప్పుకొన్నాడు.

సీ చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడు
రచియించితి మరుత్త రాట్చరిత్ర
నూనూగు మీసాల నూత్న యౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్షనైషధ కావ్యమాంధ్ర భాష
ప్రౌఢ నిర్భర వయః పరిపాకమున గొని
యాడితి భీమనాయకుని మహిమ
తే. ప్రాయమింతకు మిగులగై వ్రాలకుండ
కాశికాఖండమను మహా గ్రంథమేను
తెనుగు జేసెద కర్నాట దేశ కటక
పద్మ వన హేళి శ్రీనాథ భట్ట మౌళి ! [1]

తన కవిత్వమును గూర్చి కవి సార్వభౌముడగు శ్రీనాథుడు చెప్పుకొనడము ఇట్లు గలదు "పంపా విరూపాక్ష బహు జటాజూటికారగ్వధ ప్రసవ సౌరభ్యములకు, తుంగభద్రాసముత్తుంగ వీచీఘటా గంభీర ఘుమ ఘుమారంభములతు కళసాపుర ప్రాంత కదళీవనాంతర ద్రాక్షలతా ఫలస్తబకములకు కర్ణాట కామినీ కర్ణ హాటక రత్న తాటంక యుగ ధాళధళ్యములకు నిర్నిబంధ నిబంధమైనెనయు కవిత తెలుగుననను, సంస్కృతంబునను పలుక నేర్చు అత్యంత ప్రతిభ కలవాడు కనుకనే,ఇంత గంభీరముగా, గర్వముగా శ్రీనాథుడు, తనను గురించి తనకు తానుగ, తన ఘనతను చెప్పినట్లు వేరెవ్వరూ పూర్వము చెప్పినట్లు కనిపించదు. శ్రీనాథుని కవితా శైలిని గూర్చి పలువురు ప్రశంసించినారు.

------------------------------------------------------------------

పాద సూచికలు:- [1]శ్రీనాథ/ కాశీఖండము ఆశ్వా 1. పద్యం [7]

అట్టి ప్రశంసలలో కొన్ని "సూనాస్త్ర ప్రమదా మదస్ఫురిత వక్షోజాత కాఠిన్యముస్ బూనస్ జాలువచోవిలాసములు ", 'శ్రీనాథభట్ట భాషా నిగుంభంబుల పరిమళంబు', "రుచిరపద సిద్ధధారా నిరూఢమహిమదగిన శ్రీనాథు నచ్యుతత్వము", బహుముఖ ప్రఖ్యాత మహిత శయ్యా విశేష సనాథు శ్రీనాథు, " జాతి వార్తా రసర్ధి పదోజ్జృంభణ శబ్దజృంభణ కళా శ్రీనాథు " ఇత్యాదులు చూడగలము.

భీమన భంగి వచించడం, నన్నయభట్టు వలె భాషించడం, తిక్కయజ్వ ప్రకారము వాక్రుచ్చడం, ప్రబంధ పరమేశ్వరుడగు ఎర్రన వలె పరిఢవించఢము, మరియు పలువిన్యాసాలతో వచియించు వైదగ్ధ్యము తన సొమ్మే యని ఆయన స్వాభిమానము. వేరొక్కరు ఇటువంటి వారు మనకు కనిపించుట బహుశా అరుదనవచ్చు. శ్రీనాథుని గురించి ఇతరులు చెప్పినది ప్రక్కన పెట్టినను, తనకు తానే చెప్పిన విషయములు కూడ చాల గలవు. తన గురించి తానే పేర్కోవడం ఇట్లు గలదు.

సీ. కమలనాభుని పౌత్రు కవితామహారాజ్య భద్రాసనాశీనుపరమపుణ్యు
పాత్రు నాపస్తంబసూత్రు భారద్వాజ గోత్రు సజ్జన మిత్రు, కులపవిత్రు,
భీమాంబికామారనామాత్య నందను నఖిలపురాణ విద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖాధీతి నిష్ణాతు నంధ్రభాషా నైషధాబ్జభవుని

గీ. నుభయ భాషా కవిత్వ ప్రయోగ కుశలు
బాలసఖు గారవించి తాత్పర్యమొప్ప
నవచిత్రి పురాంత కుండలకాధి రాజు
హితమితోక్తులు వెలయంగ నిట్టులనియె [1]

తుదకు, తుది దశలో కూడా, తన గాంభీర్యతను, అభిమానమును వదలనట్టి వాడు శ్రీనాథుడు. తనకు సమముగా ఎవ్వరైనవున్నట్లు తెలిసినా అతని 'కంటికి నిద్ర రాదు, జిహ్వకు వంట రుచించదు. రతి కేళి సుఖమునొసగదు' అని ఒక పాత్ర ద్వారా ఆయన వ్యక్తీకరించిన భావము. తనను ఆదరించిన వారందరూ గతించినారు. ఆదరించు వారు ఇప్పుడు ఎవ్వరూ లేరు. కష్టములు, నష్టములు మాత్రమే అతనికి బాసటగా నిలచినాయి. అట్టిస్థితిలోకూడా ఆయనపలుకెంత వాడిగానున్నదో ఈ చాటువులో చూడుడు.

---

పాద సూచికలు :- [1]హరవిలాసము /శ్రీనాథ ఆవ-8

సీ. కాశికా విశ్వేశుగలసె వీరారెడ్డి, రత్నాంబరంబులే రాయడిచ్చు?
కైలాసగిరి పండె మైలారు విభుడేగి, దినవెచ్చ మేరాజు తీర్చగలడు?
రంభగూడె తెనుంగురాయ రాహుత్తుండు, కస్తూరి కే రాజు ప్రస్తుతింతు?
స్వర్గస్థుడయ్యెవిస్సనమంత్రి , మరి హేమపాత్రాన్న మెవ్వనిపంక్తి కలదు?
గీ. భాస్కరుడుమున్నె దేవునిపాలి కరిగె
కలియుగంబున నికనుండ కష్టమనుచు,
దివిజ కవివరుగుండియల్ దిగ్గురనగ
అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి. [1]

కవితావ్యవసాయము తప్ప, పోతన వలె 'కలమును, హలమును' ధరింపని కారణమున కడుపు నింపు వ్యవసాయము /సేద్యము చేతగాక, ఆత్మీయాఖండ ప్రతిభావిశ్వాసియై, ఘనకీర్తిని మూటకట్టుకొని, సుఖమయమైన జీవితమును గడపి తుది దశలో పలు కష్టములు అనుభవించినది కూడ చరిత్ర పుటలలో నిలచిపోయినది . అది ఒక దురదృష్ట కర దశ. అనంత భౌతికసౌఖ్యసంపదలలో తేలిపోయిన అట్టి కవివరుడు, చివరకు అన్నీ పోగొట్టుకొని కటిక దారిద్ర్యమును చవిచూచుచూ తుది దినములలో శ్వాస విడుచుట ఎంత దుర్భరమో వర్ణింప వీలు కాదు.

*స్వప్న వృత్తాంతములు-* కొన్ని సందర్భములను పరిశీలించినపుడు అవతారికలలో ఆయాకవుల అనుభవాలు మనము తెలుసుకొనే అవకాశం కొంతవరకు లభిస్తుంది. మహాభారతము వ్రాసినట్టి వారిలో రెండవ వాడైన తిక్కన సోమయాజిగారు తాను భారతమాంధ్రీకరింప తలచి హరిహరనాథుని స్తుతించి, మరికొందరిని సంభావించి, ఇంచుక నిద్రించు సమయమున, పవిత్ర శీలుడు, సాంగవేదవేది యగు కొమ్మన గారు [తిక్కన గారి తండ్రి] కనిపించినారు. తిక్కన అంతకు మునుపు గావించిన,

'కిమస్థిమాలాం కిముకౌస్తుభం వాపరిష్క్రియాయాం బహుమన్యసేత్వం,
కిం కాలకూటః కిము వా యశోదా స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే' [2]

---

పాద సూచికలు :- [1]ప్రసిద్ధ శ్రీనాథ చాటువులలోనిది. [2] కవిత్రయ భారతం విరాట/ప్రథమ 11 పద్యము.

పద్యమునతి ప్రీతితో నాదరించిన కారుణ్యమూర్తి యైన హరిహరనాథుడు వచ్చినాడు. సవిశేష సంభ్రమ సంభరిత హృదయముతో తిక్కనగారికి సాక్షాత్కరించిన హరిహర నాథుడిట్లున్నాడు.

సీ. కరుణారసము వొంగి తొరగెడు చాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువార
హరినీల పాత్రికసురభి చందన మున్న
గతి నాభి ధవళ పంకజము మెరయ
గురియైన చెలువున నెఱసిన లోక ర
క్షణ మనంగ గళంబుచాయ దోప
ప్రథమాద్రి తోతెంచు భానుబింబము నాను
రమ్మున కౌస్తుభ రత్న మొప్ప

గీ. సురనదియును గాళిందియు బెరసినట్టి
కాంతి పూరంబు శోభిల్లు శాంతమూర్తి
నామనంబు నానందమగ్న ముగ జేయ
నెలమి సన్నిధిసేసె సర్వేశ్వరుండు. [1]

మరియు

గీ. తెనుగుబాసవినిర్మింపదివురుటరయ,భవ్యపురుషార్థతరుపక్వఫలముగాదె,
దీనికెడనియ్యకొనివేడ్కనూనికృతపతిత్వమర్థించివచ్చితి తిక్కశర్మ [2]

అని అడిగినాడు. 'అడిగినది ఆలస్యమని' చక్కని తెనుగున మహా భారతము తెలుగు భాషలో కూర్చి , మహోపకారము తెలుగు జాతికి కావించినవాడు, మహనీయుడు, తెలుగు సాహితీ వేత్తలు, కవులు, రచయితలు తప్పక గుర్తుంచుకొన తగినవాడు తిక్కన. ఈ ప్రయత్నముతో తిక్కన ధన్యుడైనాడు. కవిబ్రహ్మ, ఉభయకవిమిత్రుడు యైన కొట్టరువు తిక్కన గారు పలువురికి ఆదర్శ ప్రాయుడైనాడు.ఇదే రీతిగా మరి కొందరి విషయములలో కూడ ఇట్టి అనుభవములు చూడగలము.

--------------------------------------------------------------------------------

పాద సూచికలు:- [1 ] [2] కవిత్రయ భారతం విరాట/ప్రథమ 12,18 పద్యములు.

వైజయంతీ విలాస కర్త యగు సారంగు తమ్మయ్య ఒక్కనాడు రాత్రి స్వప్నములో నుండు సమయమున

గీ. “నగుమొగంబున నెలవంక నలికమయిన
తిరుమణి ధరించువాడొక్క దివ్యపురుషుడు
ఎదుట నిలుచుండి నా పేర నీవు సేయ
కావ్యమంకితమొన రింప భవ్య సరణి “[1]

కం. అని పల్కు నంతలో మే
ల్కని నలు దిక్కులును గలయ గన్గొని స్వప్నం
బున కుల దైవము రఘుపతి
నను భావ్యుని జేయ వచ్చి నాడను తెలివినిస్ [2]

పొంది ఆ రామునకు తన గ్రంథమును అంకితముగావించినాడు.
పోతన గారికి కలిగిన అనుభవమును ముందే చూచినాము.

“పలికెడిది భాగవతమట,
పలికించెడి వాడు రామభద్రుండట,నే
పలికిన భవహర మగునట
పలికెద వేరొండు గాథ పలుకగనేలా!” [3]

యని ఆంధ్రుల పరిపూర్ణ భాగ్యమనగా, విన్నంత కన్నంత తెలియ వచ్చినంత, వేదకల్పవృక్ష విగళితమై శుక ముఖ సుధా ద్రవమున మొనసి యున్న భాగవత పురాణ ఫల రసాస్వాదన గావింపజేసి అందరినీ మెప్పించి, తరించిన, నమ్మిన వారిని తరింపజేసిన భాగవతో త్తముడు.

కనుపర్తి అబ్బయామాత్యుడు, తన అనిరుద్ధచరిత్రములో తనకు సాక్షాత్కరించిన మంగళగిరి వాసుడైన నృసింహదేవుని స్వరూపమునిట్లుపేర్కొన్నాడు.

---

పాద సూచికలు:- [1 ], [2] వైజయంతీ విలాసము / అవతారిక/32, 33- పద్యములు
[3] పోతన భాగవతం మొదటి స్కంధము పద్యము 18.

సీ. సంపూర్ణ పూర్ణిమా చంద్రబింబమువంటి
మోమున చిరునవ్వు మొలకలెత్త
అంకపీఠమున సుఖాసీనయై యున్న
కమలావిలాస విభ్రమమెసంగ
శంఖచక్ర గదాబ్జ సంశోభితములైన
బాహా చతుష్టయ ప్రభలు నిగుడ
గ్రైవేయ మకుటకంకణ కుండలాంగద
హారావళులు మేన నందగింప

గీ. బాలికా హస్త పంకజాలోల చారు
చామరానిల మోదిత స్వాంతు డగుచు,
దివ్య సింహాసనంబున తేజరిల్లు
మోహనాకారు, నరసింహ మూర్తిగంటి.[1]

నని తెలిపినారు. ఆ నృసింహ మూర్తి అబ్బయతో ' అనిరుద్ధ చరిత్రమును చక్కగ, ముచ్చటగా ప్రబంధమును ఒనరించి శ్రేయోవర్ధనముకాగా మాపేర అంకితమిమ్మని' అనుమతించినారు. నరసింహ పాద భక్తుడు, నరసింహ కృపా ప్రసాద నయ లబ్ధమతి, నరసింహార్పిత హృదయుడు మరియు నరసింహుని కరుణను చాల నమ్మిన అబ్బయామాత్యుడగు కవి దానినౌదల దాల్చినాడు.' వైజయంతీవిలాసమును' కూర్చినాడు.

ఇట్టి విశేషము శ్రీకృష్ణదేవరాయలవారికిని అనుభవమైనదని స్వయముగా తామే కూర్చిన ఆముక్త మాల్యదలో వారే తెల్పుకొన్నారు. ఆ తెలుగు వల్లభుడు ఇట్లు కాన్పించినాడు.

---

పాద సూచికలు:- [1] అనిరుద్ధ చరిత్ర అవతా 21 పద్యము.

సీ. " నీలమేఘము డాలు డీలు సేయగజాలు
మెరుగు చామనచాయ మేని తోడ
అరవిందములకచ్చులడగించు జిగి హెచ్చు
నాయతంబగు కన్నుదోయి తోడం
పులుగురాయని చట్టుపలవన్నె నొరవెట్టు
హొంబట్టు జిగురెంటెంబు తోడ
నుదయార్క బింబంబు నొరపు విడంబంబు
దొరలంగనాడు కౌస్తుభము తోడ

గీ. తమ్మికేలుండ పెరకేల దండ ఇచ్చు,
లేము లుడిపెడు లేజూపు లేమ తోడ
తొలకు దయ తెల్పు చిఱనవ్వుతోడ కల ద
దంధ్ర జలజాక్షుడిట్లని యానతిచ్చె" [1]

మరియు

" కృతి వినిర్మింపు మిక మాకు ప్రియము గాగ" [2]

అని కోరడం భాగ్యంగా భావించినారు రాయలవారు.

షష్ఠ్యంతములు:- కాలక్రమములో వచ్చిన మార్పుతో అవతారికలలో భాగమైనవి షష్ట్యంతములు అని చెప్పవచ్చును. కావ్యావతారికలలో ప్రతి తెలుగుకవి కూడ దాదాపు పాటించుచూవచ్చిన మరియొక విషయము షష్ఠ్యంతములు. [షష్టి = అరవై, షష్ఠి = ఆరు.] షష్ఠ్యంతములు అనగా తన కృతిపతి కి షష్ఠ్యంతముగ (షష్ఠీ విభక్తి అంతముగా) విశేషణములతో చేయబడిన స్తుతి. విమర్శకులు ఈ విషయములో పలు రకములుగా ఊహించినారని చెప్పవచ్చు. సాధారణముగా ఈ పద్యములు కందములలోనే ఎక్కువగా కూర్చినారు.

ఇందులో కొందరు తమ చమత్కారములు చూపి నారు. భాషలో ప్రాగల్భ్యము చూపడము, ఆలంకారిక ప్రయోగములు కనిపించుట కలదు. శబ్దము మీద అధికారము కూడ కొందరికి

---

పాద సూచికలు:- [1],[2] --> రాయలవారి ఆముక్త మాల్యద/ ప్రథమ 12,13 పద్యాలు.

ఉండడము చూడగలము. మొల్ల ఈ ప్రయోగమును చేసినట్లు లేదు. కొన్ని షష్ఠ్యంతములు పలు కవుల రచనలనుండి ....

కం. 'హరితనయ హృదయ సారస హరికి, మహా సూనృత జిత హరికతి తేజః
పరిహసిత హరికి, భవగజ హరికి, సదా పాదపంకజనత హరికిన్' [1]

కం 'హాటక గిరిధీరున కరి తాటంక వతీ కపోలతల కరిమకరీ
పాటచ్చర కఠిన ధనుర్జ్యాటంకారునకు, మన్మథాకారునకున్' [2]

కం. " పుంఖాను పుంఖ సైంధవరింఖా సంఘాత జాతరేణూగ్రతమో
రింఖద్రిపున్నపదహర ప్రేంఖ దసుగ్రసనజఠర భృత్యసిఫణికిన్"[3 ]

కం. " వరసుగుణ భక్తజనకృత సరస గుడాంబోర్ధపాన సౌఖ్యునకు, శుభా
కర మంగళాచల స్థల నరసింహాఖ్యునకు, సద్గుణ శ్లాఘ్యునకున్" [4]

కం. " ఓంకార వాచ్యునకు న హంకార నిరూఢ భావనారాధ్యునకున్
హ్రీంకారమయ మనోజ్ఞా లంకారోల్లాస నిత్యలాలిత్యునకున్" [5]

కం. " అఘటన ఘటనా చాతు ర్య ఘనోర్జిత కార్య నిర్వహణ ధూర్వహ ధీ
మఘువాచార్యున కచ్యుత రఘునాథ వసుంధరాధి రాడ్వర్యునకున్"[6]

ఉ. ' హారికి, నంద గోకుల విహారికి, చక్రసమీర దైత్య సం
హారికి, భక్త దుఃఖ పరిహారికి, గోపనితంబినీ మనో
హారికి, దుష్ట సంపదపహారికి, ఘోష కుటీ పయోఘృతా
హారికి, బాలకగ్రహ మహాసుర దుర్వనితా ప్రహారికిన్ ' [7]

---

పాద సూచికలు:- [1] బిల్హణీయం.అవ/14 [2] శృంగార నైష /.ప్రథమాశ్వా/43.,
[3 ] మనుచరిత్ర /పీఠి/44., [4] అనిరుద్ధ/అబ్బయ/అవ/47.,
[5] కవిత్రయ భారతము విరాట/ప్రథమ/32,[6] విజయవిలాసము,చేమకూరి / అవతా 64. [7] పోతన
భాగవతం మొదటి స్కంధము /29. ప్రత్యేక ప్రస్తావన : - పోతన కూర్చిన 4 షష్ఠ్యంతములు, ఉత్పల మాలపద్యములు. మరియూ కవులందరూ ఈ నియమమును పాటింపలేదు.

**1.4 *ప్రయోజనములు* :-** ఇక “*కావ్యావతారికల యొక్క ప్రయోజనము*” లను గురించి కొంత చర్చించెదము.

తొలుత ఎట్లున్నను, తర్వాతి దినములలో అవతారిక లేక పీఠిక ఒక చక్కని సంపూర్ణ రూపముతో మనకు సాక్షాత్కరించినదన్న విషయములో రెండవ అభిప్రాయము లేదు.

ఈ అవతారికలవలన మనకు కొన్ని ముఖ్యమైన అంశములు అవగతమగును. అందులో ముఖ్యముగ కొన్ని ఇట్లు పేర్కొనవచ్చును. *చరిత్ర నిర్మించుటలో లేక పునర్నిర్మించుటలో* చక్కగ ఉపయుక్తమగును. తద్వారా కవుల చరిత క్రమమును, *రాజుల లేక పాలకుల* వివరములు, వారి *వంశాలను* గుర్తింప వీలగును.అవతారికలలో పేర్కొన్న *పూర్వ కవుల రచనలు* మనకు ఇప్పుడు లభ్యము కాకున్నను, అట్టివి మునుపు ఉండినవని గ్రహించగలము. కొందరి కవుల *జీవిత విశేషములతో పాటుసమకాలీనుల*, వారిని పోషించిన *రాజుల, పోషకుల విషయములు వారి ధార్మికత, శౌర్య పరాక్రమములు* తెలియును.కొన్ని అవతారికలను శాసనములందలి విషయములను తులనాత్మకముగా పరిశీలించిన *నిజ నిర్ధారణము* జరుగగలదు. కొంత వరకు *సామాజిక స్థితి గతులు* తెలుసుకొనే అవకాశం లభించును. స్వప్న వృత్తాంతముల ద్వారా *కవుల అభిరుచి, కావ్య వస్తు వివేచన అవగతమగును. కవుల వంశాను క్రమణిక, కుల గోత్రాదులు, స్వగుణాతిశయము, పాండిత్య ప్రకర్ష ప్రకటిత మగును.*

పలు కృతులు గావించిన వారి *రచనలలో పరిపక్వత, పౌర్వాపర్యము కవిత్వ తత్త్వ పరిణామము* మొదలగునవి పరిశీలింప వీలు కలుగును. కవుల స్వీయ కవితాశయములను తెలిసికోగలము. రచనలలో చేసిన సుకవి స్తుతుల వల్ల మరియు కుకవి నిందలవల్ల తర్వాతి వారలకు అది ఒక *మార్గదర్శనము* కాగలదు. కావ్య ప్రయోజనము, కథా ప్రాశస్త్యము, చదువుటవలన కలుగు ఫలితము, మొదలగునవి తెలియును. *అవతారిక ద్వారా కావ్య స్వరూపము అనగా, అది అనువాదమా? అనుసరణమా? స్వతంత్రమా? పురాణమా? కావ్యమా? ప్రబంధమా?* మున్నగు విశేషములు తెలియగలము. కావ్య అవతారికల వలన *సంప్రదాయమును పాటించిన తీరు తెన్నుల వివరములు* తెలిసికొనగలము. ఈ రీతిగా అవతారికల పరిశీలన వలన మనకు లభించు కొన్ని **ప్రయోజనములని** పేర్కొనవచ్చును.

# ద్వితీయాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు–కావ్యారంభపద్యాలు

# II ద్వితీయాధ్యాయము

## 2. కావ్యారంభ పద్యాలు.

కావ్యము అనగా మునుపు చూచినాము. సర్వ సాధారణముగా తెలుగు సాహిత్యము నందు మొదటి నుండియు పద్యముల ప్రాభవము విలసిల్లినది. వచనము అప్పుడప్పుడు అక్కడక్కడ ప్రయోగింప బడినది. కావ్యములను రచనా తీరుననుసరించి విభజించినారు.

[1] పద్య కావ్యములని, [2] గద్యకావ్యములని, [3] పద్య గద్యములు రెండునూ ప్రయోగింపబడిన వాటిని "చంపూ" కావ్యములని, పేర్కోవటం తెలిసిన విషయమే. తెలుగు సాహిత్యంపై చాలవరకు సంస్కృతభాషా, సాహిత్యాల ప్రభావం కలదు. కొందరి దృష్టిలోఅన్ని భాషలకు జనని వంటిది సంస్కృతం. నేడు భాషా శాస్త్రవేత్తలు దీనిని అంతగా అంగీకరించరు. భిన్న భిన్న వాదాలు, దృక్పథాలు. వీటి గోల ఇప్పటికి మనకు అనవసరం.

దాదాపు తెలుగు సాహిత్యములో మనకు కనిపించే రచనలు -- అది ప్రబంధాలు కావచ్చు, ఇతరాలు కావచ్చు, మొన్నమొన్నటి వరకు పద్యాలు సాహిత్యములో పై మెట్టులోనే ఉండినవి. అందులకే తన ఛందోదర్పణములో అనంతుడు ఇట్లు పేర్కొన్నాడు.

"విద్యలలోపల నుత్తమ విద్య కవిత్వము, మఱి కవిత్వము ఛందోవేద్యము," [1] ఇది కాదనలేని సత్యం.

ఛందస్సుకు ఇంత ప్రాధాన్యత రావటానికి కారణం పరిశీలిస్తే - ఇదొక శాస్త్రం. గణితం వలె. నిబద్ధతతో కూడి యుండటం వల్ల, ఇది "అంత గౌరవం సంపాదించింది", అనడం సహేతుకమే. గణములతో కూడినదే ఛందస్సు. వేదమునకు ఛందము, అందమును గూర్చునదే గాక గమనమునకు అవసరమైనది. 'ఛందః పాదౌ తు వేదస్య', యనడం తెలిసినదే. పాదములు గమనమునకు అత్యంత అవసరమైన అంగములు. ఈ గమనము యే రీతిగా వెళ్ళవలెను? అను దానిని నిర్ణయించును.

-----------------------------------------------------------------

పాద సూచికలు:- [1] ఛందోదర్పణము /అనంతుడు.ప్రథమ/5

ఒక అక్షరము మొదలు ఇరువదియారు అక్షరముల వరకు [ఒక్కొక్క పాదమునకు] పద్యములు / శ్లోకములు నిర్మించుటకు పద్ధతులను పెద్దలు ఏర్పాటు చేసినారు. ఈ రీతిగా పరిశీలించినపుడు మనకు లభించు 'వృత్తము'లని పిలువబడు పద్యముల సంఖ్య, ' ఉక్త' మొదలు 'ఉత్కృతి' వరకు గల యిరువదియారు [26] ఛందములు కొన్ని కోట్ల [1] సంఖ్యలోవున్నవి. ఆ సంఖ్య, *13,42,17,726*. ఇందులో ఛందః కర్తలు పేర్కొన్నవి కొన్ని వందలలోపుననే యున్నవి, ప్రయోగములో ప్రసిద్ధి చెందినవి కొన్ని పదులలోనే యున్నవనుట సత్యదూరము కాదు.

కాల క్రమములో మార్పు వచ్చినది. ఈ మార్పు ప్రతి విషయములోనూ, అనగా సంస్కృతీ పరమైన, ఆలోచనలోనూ, పరభాషా ప్రభావమువలననూ, స్వతంత్రభావనల ఫలితముగానూ, కొంతవరకూ పద్యాన్ని ప్రక్కకు పెట్టాయనినా లేక నెట్టాయనినా సత్యదూరము కాదు. "కాదేదీ కవితకనర్హం" అనే భావనలు జన సామాన్యములోకి చొచ్చుకువెళ్ళాయి. "కాలోహి దురతిక్రమః" ఇచ్చట ఈ కాల 'శబ్దము' అతిపరిమితముగా ఆంగ్లమందలి 'TIME' అనే అర్థములోనే ప్రాయోజితము. కవులందరూ తమ కావ్యములను పద్యములతోనే ప్రారంభించినారు. పలు ఇతర విషయాలు ఇందుకు దోహదం చేసినాయి.

శ్రీకారముతో దాదాపు తెలుగు సాంప్రదాయ సాహిత్యములో అన్ని పద్యాలు/ శ్లోకాలు ఆరంభింపబడినవి, ఐతే ఈ విధానమును సంస్కృత భాషలో ఎక్కువగా అనుసరించినట్లు/ ప్రయోగించినట్లు / ఆరంభించినట్లు కనిపించదు.

కవికుల గురువుగ చెప్పబడు కాళిదాసు తన రచనలను ఇలా ప్రారంభించినారు.

రఘువంశాన్ని - " వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే"

ఋతుసంహారాన్ని - "ప్రచండసూర్యః స్పృహణీయ చంద్రమా"

అభిజ్ఞాన శాకుంతలాన్ని - " యా సృష్టిః స్రష్టురాద్యా వహతి "

కుమారసంభవాన్ని – " అస్త్యుత్తరస్యాందిశి దేవతాత్మా హిమాలయోనామ"

ఆదికావ్యమైన వాల్మీకి రామాయణపు 'ఆదిశ్లోకం' శోకం

" తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరం" నుండే జన్మించినదనడం.

ఇలా చాలా పేర్కొనవచ్చు.

---

పాద సూచికలు : -[1] అనంతుని ఛందో దర్పణం/ ఉపో పుట 63

ప్రస్తుతము తెలుగు కావ్యముల అవతారికల విషయ సంబంధ పరిశీలనమే మన ధ్యేయము కనుక తత్సాహిత్యము ననుసరించి లక్ష్యమును చేరెదము.

కావ్యారంభము మంగళకరముగా ఆరంభించుట, లక్షణకరము. ఆంగ్లం లో ఇట్లున్నది.

" Well begun is half done" –

అని దీని భావమును తెలుగులో తెలిసికొనినచో, 'చక్కగ ప్రారంభింపబడిన కార్యము సగము ముగిసినట్లే'. అనగా ఆరంభము చక్కగ జరిగినచో పని సగము ముగిసినటుల యైన మిగత కార్యము కొంత పరిశ్రమతో పూర్తిగా జరుగునని భావము.

2.1 *శ్రీకార ప్రయోగ పద్యాలు* :- కన్నడ వాఙ్మయమున కవి రాజమార్గమునుండి గ్రంథారంభము, " శ్రీ" కారముతో కావించవలెనను నియమము పాటింపబడినదని చెప్పడము గలదు. శ్రీ కారముతో కావ్యారంభము జరిగినచో సకల దోషములు పరిహరింపబడునని, సకల శ్రేయములకు అది నాంది యని చెప్పడము జరిగినది.

గీ. "వేదములకెల్ల నోంకార మాదియైన కరణి కృతులకు నెల్ల శ్రీకారమాది
గాన కవివరు లెల్లరు దాని దక్క నితర వర్ణంబు లిడరు సత్కృతుల మొదల" (1)

ఇక శ్లోకము/ పద్యము ఆరంభించుట శ్రీకారముతోనే ఎందులకు అను ప్రశ్నకు ఇట్లు సమాధానము చెప్పడము చూడ వచ్చును.

శ్రీ – అను అక్షరము 'శ,ర,ఈ' ఈ మూడింటి అక్షరముల కలయిక.

వ్యాకరణ పరిభాషననుసరించి -

*'శ ' 'స్థిరము' గా నుండు అక్షరములలో* ఒకటి, మరియు '*మహా ప్రాణాక్షరము'లలో* ఒకటి. *'ర' కూడా 'స్థిరాక్షరాల'లో ఒకటి*. ఇంక *'ఈ' కారము 'ప్రాణాక్షరము'*. ఇపుడు 'శ్',+ 'ర్'+ 'ఈ' = 'శ్రీ' యను సంయుక్తాక్షరముగా ఏర్పడినది. శ్రీ కారము మంగళకరమైనదని భావించడము గలదు. నైఘంటికార్థములో శ్రీ అను పదమునకు/ అక్షరమునకు నానార్థములు గలవు. అందులో కొన్ని ... లక్ష్మి, సంపద. ఐశ్వర్యము, వృద్ధి, త్రివర్గము,శోభ, పార్వతి, అలంకరణము, కీర్తి, బుద్ధి, సరస్వతి, విషము, ఉపకరణము, మారేడు వృక్షము... మొదలగునవని ఇంతకూ మునుపే చూచితిమి. మరియు 'శ','ఈ' కారములకు అధి దేవత

---------------------------------------------------

పాద సూచికలు :- [1] అప్పకవీయం ( 2/354)

లక్ష్మి యనియు, 'ర' (రేఫమునకు) అధిపతి అగ్ని యని భావించడము గలదు . అగ్ని అధిపతి ఐనా పురాణ వచనము ప్రకారము 'శ్రియమిచ్ఛేత్ హుతాశనాత్' హుతాశనుని నుండి కూడ శ్రియం కోరబడుచున్నదని, చెప్పడం వలన రేఫము కూడా మంచిదని గ్రహించవచ్చును. 'శ' కు గ్రహము గురుడు.'ర' 'ఈ' ల గ్రహాధిపతి – శుక్రుడు కనుక మూడు అక్షరాలకు అధిపతులగు గ్రహములు మంచివే. కనుకనే పూర్వీకులు యీ "శ్రీ" అక్షరమును తొలుత ప్రయోగము చేయుటకు స్వీకరించినారనవచ్చు.

కావ్యాదిని శ్రీకారము శుభదాయకము. అప్పకవి ఈ విధముగా చెప్పినారు.

కం. పదపడి శ్రీకారము కృతి,
మొదల నిలిచి దోషపుంజము నడంచి శుభం
బొదవించు పరుస మినుమును
గదిసి సువర్ణంబు సేయు కరణిన్ ధరణిన్. [1]

ప్రాజ్నన్నయ యుగములో కొన్ని శాసనములు శ్రీ కారముతో ఆరంభింపబడినవి. కృత్యారంభముననే గాక ప్రతి అశ్వాస/ఖండ/స్కంధ/ పర్వాదుల ఆరంభములందున గూడా "శ్రీ" కారమును ప్రయోగించుట సాధారణముగా చూడగలము. మరికొన్ని సందర్భములలో కావ్యము ముగింపు కూడ శ్రీ కారముతో చేయడం కలదు.

"ఎంతయు శ్రీకారము లా
ద్యంతంబుల నుంచి లేఖలనంపిన నాగు న
శ్రాంతంబు కార్యసిద్ధి ము
రాంతక కావ్యాది కూర్ప నరుదెశుభంభుల్ ?" [2]

అని కూడ అప్పకవీయములో చెప్పడము కలదు. కావ్యము యొక్క ఆద్యంతములు కూడా, 'శ్రీకారము' తో ప్రయోగించుట మంచిదని దీనిఅర్థము. ఈ విషయమునాధారము చేసికొని కొందరు 'మంగళమహాశ్రీ' యను వృత్తమును తుదిలో వాడటం చూడగలము. మంగళం అనునది కార్యక్రమము తుదిలో జరుపు ప్రక్రియగా పేర్కొనవచ్చు. మంగళము అనగా - పార్వతి, శుభము, క్షేమమని అర్థములు. *విశ్వశ్రేయము కావ్య లక్ష్యము. కనుక శుభము/క్షేమము ఆశించునట్టి ఆచారభావన ఆహ్వానింపదగినదే గదా!*

---

పాద సూచికలు : - [1] అప్పకవీయం ( 2/356] [2] అదే గ్రంథము/ఆశ్వా 2/355

కం. ‘ శుభ దేవతా త్రయంబును

శుభఖచర త్రయము కలిగి శుభ వాచకమై,

యభిమతి గాంచిన కతమున

శుభములు శ్రీకారముననుజొప్పడుటరుదే’ (1)

అని కూడ అప్పకవి సెలవిచ్చినాడు.

పద్యపాదమును శ్రీకారముతో ప్రారంభించు విషయము పైన చూచినాము. ఇప్పుడు యే గణముతో ఆరంభించ వలెనను విషయము కొంత చర్చిద్దాము.

లాక్షణికుల భావనలో జ్యోతిశ్శాస్త్ర మొకింత ప్రస్తావనకు రాకపోలేదు. కనుకనే కొందరి అభిప్రాయము ప్రకారము, కృతిపతి రాశికి పద్యారంభ గణరాశికి మైత్రి యుండవలెనని చెప్పినారు. వీటిలో శుభకరములైనవిగా చెప్పబడినవి, ‘మ-భ–స–త’ లనునవి.

తక్కినవి అనగా, ‘య,ర,జ,న’- అనునవి కావ్యాదిలో వర్జింపవలయునని లాక్షణికుల భావన. శబ్దము/ నాదమును గురించి మన పూర్వీకులకు చక్కని అవగాహన కలదు. కనుకనే భారతీయ సంగీతము శాస్త్రీయ పద్ధతులలో నిర్మితమైనది. స్వరములను గురించి [సాహిత్యములో ప్రయోగింప బడు అక్షరములు, సంగీతములో ప్రయోగింపబడు సరిగమాదులు] మనము పరిశీలించినచో పలు ఆసక్తి కర విషయములు తెలిసికొన వీలు కలుగును. స్వరమును బహు అద్భుతముగా మన పూర్వీకులు వివరించినారు. స్వరమును- ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అని గుర్తించినారు. (2) సమాహారః స్వరితః సాధారణముగా మనము మాటలాడు స్థాయిని మధ్యమము-అనియు, ఆ స్థాయికన్న తక్కువగా యుండునది – అనుదాత్తమని., మాద్యమ స్థాయికన్న పైన పలుకబడినచో అది ఉదాత్తము. శబ్దము అనగా – ధ్వని ., వ్యాకరణ శిక్షితమగు మాట. అసలు నాదము అనగా – ప్రాణానల సంయోగము వల్ల కలిగెడు ధ్వని. ఈ వివరాలు సంగీత శాస్త్ర రత్నాకరములో చూడగలము. ఇందులో (5) స్థాయులు గలవు. వాటిని 1.అతిమంద్ర, 2. మంద్ర, 3. మధ్యమ, 4. తార, 5.అతితార లని సంగీత శాస్త్రలక్షణములో చెప్పడము తెలిసినదే! __

---

పాద సూచికలు : - [1] అప్పకవీయం ( 2/357 ] [2] అష్టాధ్యాయీ 1-2-29 / ఉచ్చైరుదాత్తః 1-2-30 / నీచైరనుదాత్తః 1-2-31

స్వరపరమైన, మన మనసునకు హత్తుకొనునటుల మాటలాడుతీరును గురించి హనుమను ప్రశంసిస్తూ, శ్రీరాముడు తన సోదరుడగు లక్ష్మణస్వామికి వివరించే ఘట్టమును { వాల్మీకి /రామా/కిష్కింధ/సర్గ-3 లో చూడగలము} శబ్దము, అర్థము, రసము,మొదలగు వాటిని ప్రస్తుతానికి తడవ పని లేదు. వ్యాకరణ సాయమున సాహిత్యము, నాదము వలన సంగీతము మానవుని జీవితమును పరిపూర్ణము చేయును. ఇవి రెండునూ వేర్వేరుగా కనిపించినను, ఒక దానితో మరొకటి అవగాహన కలిగియున్నవి. కనుకనే పెద్దలు సంగీత సాహిత్యములను కలిపి సారస్వత స్వరూపమును సాక్షాత్కరింపజేసుకొన్నారు. చదువుల తల్లి చనుగవను , ఆపాత మధురమగు దానిని సంగీతమని, ఆలోచ నామృతమగు దానిని సాహిత్యమని వ్యవహరించారు. [సంగీతమపి సాహిత్యంచ సరస్వత్యా స్తనద్వయం ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతం]

తొలుత ఉన్నట్టి సాహిత్యమునకు సరిగమల గరిమను జతకలిపి కొత్త పుంతలను సృష్టించినారని చెప్పడం సాహసం కాదు. అలంకారములలోనూ ఈ వ్యత్యాసము చక్కగ గమనింపవచ్చును. నాదమును ఆధారము జేసికొని వర్థిల్లినవి శబ్దాలంకారాలు. ఆలోచనలకు ఆశ్రయమిచ్చి పరిఢవించినవి అర్థాలంకారాలు.

'క్షేమం సర్వగురుర్ధత్తే మగణో భూమిదైవతః ' అనుట వల్లను, కావ్యచింతామణిలో రంగకవి తెల్పినట్లుగ, పేర్కొనబడిన విషయమిట్లున్నది . "జగతి గణంబులకెల్లను మగణము కారణము గాన, మగణము గదియన్నిగిడించు గణము లెల్లను తగ శుభమొనరించు, కీడు తగలదు దానస్"

మునుపు చెప్పిన నియమము ననుసరించి మగణముతో అనగా మూడు గురువులతో 'UUU' పద్యమును ఆరంభింపవలెనని అది శ్రేయోదాయకమని చెప్పవచ్చును. మరియు కావ్యాది యందు 'మగణము' శుభదాయకమనుటకు పెద్దలు చెప్పిన మరొక విషయమును కూడ పరిశీలించుట తగును. 'మో భూమిస్త్రి గురు శ్శ్రియం వితనుతే' యనియు "భువనములకెల్ల నాధార భూతమైన జగతి యధిదైవతంబుగా జను మగణము తనకుగారణ మగుటచే దానిగూడి ధన మొసగునేడు నని పల్కె దాతనొజ్జ" యనియూ,

(1) " శుభవర్ణా శ్శుభశబ్దా ఏచ శుభ గణాస్త ఏవ కావ్యాదౌ గ్రాహ్యాః" అనడం చూడగలం.

---

పాద సూచికలు : - (1) సూ. 19. ఆంధ్రశబ్దచిన్తామణి /అప్పకవీయం పుట 114 .

'గణముల' యొక్క ప్రయోగము వలన కలుగు ఫలములను గురించి తన ఛందోదర్పణము నందు, శ్రీ వాణీవరప్రసాదలబ్ధ వాగ్వైభవ తిక్కనామాత్య తనూభవ సుకవిజన విధేయ అనంతయ నామధేయుడు చెప్పిన విషయమునిట్లు చూడవచ్చును.

ఉ. నవ్యసుఖ ప్రదాయి భగణంబు జకారము రుక్ప్రదంబగున్
ద్రవ్యము జేయునా లయకరంబు సకారము మాశుభంబు యా
దివ్యసువర్ణకారి వెతదెచ్చును రేఫ విభూతినిచ్చు దా
గావ్యములందు నాదినిడ కర్తకు భర్తకు నంబుజోదరా ! (1)

అటు తర్వాత గణాధి దైవతముల వివరములిడినారు.

చ. భగణమునేలు చందురుడు, భానుడు దాజగణంబునేలు తా
నగణము నేలు నిర్జర గణంబు సమీరణుడేలు నెప్పుడున్
సగణమునుర్వి యేలు మగణంబు నొగిన్యగణంబు తోయమున్
రగణము పావకుండు తగణంబు నభంబునునేలు కేశవా! (2)

ముందు పేర్కొనబడిన గణములు కాక వేరే గణములతో మొదటి పద్యాదిని చేయడం గలదు, కానీ అది చాల పరిమితముగా నున్నది. శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య శ్రీపాదపంకజ భ్రమరాయమాణ కవిరాజశిఖామణి యగు నన్నెచోడదేవ కవి తన కుమార సంభవము, శ్రీకారము, మగణము తోనే ఆరంభించినా ప్రయోగించినది, 'స్రగ్ధర' వృత్తము. ఆపద్యాది "శ్రీవాణీంద్రామరేంద్రార్చితమకుట మణి శ్రేణిధామాంఘ్రి పద్మా" [3 ] యని ప్రారంభమగును.

స్రగ్ధర – మ,ర,న,భ,య,య,య – గణములచే కూర్చబడినది. ఇది అంత శ్రేయస్కరముగా లేదనిభావించుట వలనకాబోలు ఈ ప్రయోగములు తర్వాత చేసినట్లు లేదు.

కం." మోదంబున సత్కవి ప్రతి పాదింపగ వలయు శుభము పడయుటకై, కా
వ్యాదిని <u>వరునకు</u> నాశీ ర్వాదమయిన దేవతాభివాదనమైనన్" (4 )

కావ్యమును కన్యగా, కృతిపతిని వరునిగా చెప్పడము కలదు.{ చూడుడు --> ఆది శంకరుల శివానందలహరి శ్లోకం 98."<u>*మమ కన్యకాం త్వం గృహాణ*</u>".

---

పాద సూచికలు : - (1),(2) అనంతుని ఛందో/ప్రథ/23, 24 పద్యాలు. [3] నన్నెచోడ /కుమారసంభ/ప్రథమా/1. (4) అప్పకవి/ ద్వితీయా/362 పద్యము

కృతిభర్తకు ఆశీస్సును గానీ దేవతాభివాద మైనా సత్కవియైన వాడు చేయవలెనని దీని భావము.

ప్రస్తుతము ***శ్రీకారముతో*** ఆరంభింపబడిన పద్యములను కొన్ని పరిశీలిద్దాము.

కవిత్రయ భారతమును మొదలిడిన 'ఆదికవి'. నన్నయ్యగారే - సంస్కృత శ్లోకముతో "శ్రీవాణీగిరిజా" అని ఆరంభించినారు. దీని విషయము ముందే చూచినాము.

కవిబ్రహ్మ తిక్కన గారు కవిత్రయ భారతము విరాటపర్వమునిట్లు ఆరంభించినారు.

ఉ. " శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి ' విష్ణు రూ
పాయ నమశ్శివాయ' యని పల్కెడు భక్త జనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముగొల్చెద నిష్టసిద్ధికిన్". {1}

శ్రీమదుమామహేశ్వర వరప్రసాద లబ్ధ, సారస్వతాభినంది, నంది శింగయామాత్య పుత్ర, కౌశిక గోత్రపవిత్ర, సుజన విధేయ, తిమ్మయచే ప్రణీతంబైన, పారిజాతాపహరణమును, శ్రీకార, మగణములతో - మహాప్రబంధమునందు – మొదట చేసిన స్తుతి యిది .

ఉ. "శ్రీమదికిం బ్రియంబెసగ జేర్చిన యుయ్యెల లీల వైజయం [2]
తీమిళి తాచ్చ కౌస్తుభము నిద్దపుగాంతి దనర్చి యాత్మ వ
క్షోమణి వేదిబొల్పెసగ జూడ్కుల పండువు సేయు వేంకట
స్వామి కృతార్థు జేయు నరసక్షితి నాథుని కృష్ణ రాయనిన్."

తిమ్మన గావించినది "వేంకటస్వామిస్తుతి". చూడ్కుల పండువు సేయు వాడితడు.

శా. "శ్రీవిద్యా నిధియై మహామహిమచే జెన్నై వసిష్ఠాజలూ
తా వాతాశన సామజాటవిక గోత్రాదేవ సత్కీర రా
జీవాక్షీ యుగ యాదవాధిపులకు శ్రేయస్కరంబైన, ఆ
ర్యా వామాంగము దివ్య లింగము మదీయాభీష్టముల్సల్పెడున్" [3]

---

పాద సూచికలు : - [1]కవిత్రయభారతము /విరాట /1 పద్యం. [2]తిమ్మన /పారిజాతాప/ఆశ్వా/1 /1 పద్యం [3] ధూర్జటి/ శ్రీ కాళహస్తి/ప్రథమ/పద్యము1

అని శ్రీకాళహస్తి నందలి ఆర్యావామాంగము ఐన దివ్యవాయులింగమును ప్రార్థించినారు శ్రీకృష్ణదేవరాయల వారి ఆస్థానమందుండినను, తన "శ్రీకాళహస్తి మాహాత్మ్యము" ను ఈశ్వరునకే అంకితమిచ్చిన మహాకవి ధూర్జటి. ఆయన తన అభీష్టము నెరవేర్చు శివలింగమును కీర్తించెను. శ్రీకారము, మ గణముతో కావ్యారంభమైనది.

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానమందుండిన అష్ట దిగ్గజాలలో ఒకడు పెద్దన. అల్లసానివాని [వాణి= పలుకు] అల్లిక జిగిబిగి. తెలుగు సాహిత్య విద్యార్థులు తప్పక పఠింప వలసిన వాటిలో ఇదొకటి. అల్లసానివారు తమ 'స్వారోచిష మనుసంభవ' మహాప్రబంధమును, (మనుచరిత్ర) శార్దూల విక్రీడితముతో, అనగా 'మ' గణము తొలుతగల పద్యముతో ప్రారంభించినారు. ఇది తనకృతిపతి యగు కృష్ణరాయనికి ఆశీర్వాద రూపములో చేయబడినది.

" శ్రీవక్షోజ కురంగనాభమెదపై చెన్నొంద విశ్వంభరా
దేవిన్ తత్కమలా సమీపమున ప్రీతిన్ నిల్పినాడో యనం
గా వందారు సనందనాది నిజభక్తశ్రేణికిన్, తోచు రా
జీవాక్షుండు కృతార్థు జేయు శుభదృష్టిన్ కృష్ణ రాయాధిపున్. [1]

శ్రీమదుమారమణ కరుణాకటాక్ష నిరీక్షణ సంలబ్ధ సరస కవితా సామ్రాజ్య ధురంధర ఘన యశోబంధుర కౌండిన్యస గోత్ర పవిత్ర కూచిమంచి గంగానామాత్య పుత్ర బుధజనవిధేయుడైన 'తిమ్మన' కూర్చిన అచ్చ తెనుగు మూడాశ్వాసముల, 'నీలాసుందరీ పరిణయము'

"శ్రీలకు దానకంబగుచు చెన్నలరారెడు వెండికొండపై [2]
మేలికడాని డాల్దొయలు మీఱెడు జాబిలిఱాలమేడలో
వేలుపు ఱేడు నల్వయును వెన్నుడు కొల్వగమంచుగొండ రా
చూలిని గూడి వేడుకలజొక్కెడు లేనెలతాల్పుకొల్చెదన్" -

అని శ్రీ కారముతో, ఉత్పలమాలవృత్తముతో కబ్బమారంభించినాడు.

---

పాద సూచికలు :- [1] అల్లసాని/మనుచరిత్ర/ప్రథమ/1 [2] కూచిమంచి తిమ్మన నీలాసుందరీపరిణయము /పీఠిక /పద్యమ్ . 1

{లిబ్బుల దొరచెలికాడును, గుబ్బలియెకిమీని యనుగు కూతుమగడును, బెబ్బులితోలు కప్పుకొనినవాడును, రేద్రిమ్మరిని తలపై పెట్టుకొన్నవాడును, అయిన వలిమలయల్లుని కోరికననుసరించి, ఎలమితో అచ్చ తెనుగున కబ్బమును, బత్తి మీరగ సెప్పినాడు.}
[ఆ.వె. " మత్తగిల్లు సత్తు గిత్త తత్తడి నెక్కి / మిత్తి మొత్తి సత్తినత్తి బత్తి/ పత్తిరిడిన ముత్తి [3] బుత్తులు రెండును / నొత్తి గుత్తగట్టుచుండు ఱేడ" ని అచ్చ తెలుగులో శివుని వర్ణించినాడు.]

శా. "శ్రీమేల్ గూర్పు భరింపుమీ సకల ధాత్రీ రాజ్యమున్నీవయం
చామోదాప్తి నొసంగులీల వలనౌ హస్తంబునందెల్పు నా
శ్రీమత్కేశవ శౌరి సాంద్ర కరుణాశ్రీ రంజిలస్ సద్గుణ
స్తోముందిర్మలరాయ సోమనృపతిస్ సుశ్రీయుతుం జేయుతస్." [1]

అను పద్యముతో 'ముకుందవిలాసము'ను, 'కాణాదం పెద్దన సోమయాజి' ప్రారంభించి నారు. వీరు సంప్రదాయముననుసరించి శ్రీకారముతో, మగణముతోకూర్చిన పద్యమిది.

శాస్త్రసంబంధమైన 'ఛందోదర్పణ'గ్రంథాన్ని 'అనంతు'డిట్లు ఆరంభించినాడు.

శా. "శ్రీరామాస్తన మండలీ మిళిత కాశ్మీరార్ద్ర వక్షంబుతో [2]
బారావారతరంగ సంగత లసత్పర్యంక నాగంబుపై
కారుణ్యామృత పూరపూరితకటాక్ష శ్రీలబెంపొందు గం
భీరస్వాంతుడనంతు డాశ్రితజనాభీష్ట ప్రదుం దెల్లెడస్" అని

శ్రీకారము, మగణములతో ఆరంభించి సంప్రదాయమును పాటించినాడు.

'కాకునూరి అప్పకవి'గారు తన 'ఆంధ్ర శబ్ద చింతామణి'ని ( 'అప్పకవీయముగ' పండితులచే పిలువబడుచున్న) తానే, కావ్యారంభమెట్లు చేయవలెనని చెప్పిన రీతిలోనే -

శా. " శ్రీయున్భూమియు నాగ ప్రాచిని, ప్రతీచిస్ రుక్మిణీదేవి, స
త్యాయోషా మణియున్మహోత్సుకత సేయన్మంగలన్మోడ్పగే
ల్దోయిం దార్క్ష్య మరుత్సుతుల్గొలువ శ్రీదుండేలు నా ప్రోలిమో
మై యాకామెపలి న్వసించుహరి నిత్యంబు న్మముం బ్రోవుతస్" [3] అనుచూ

శ్రీకారము, మగణముతో ఆరంభమగు పద్యప్రస్తావనతో తన గ్రంథమారంభించినారు.

-------------------------------------------------------------------------------

పాద సూచికలు :- [1] నీలాసుందరీ ప్రథమాశ్వాసం /పద్యం 118.
[2]అనంతుడు/ఛందో/ప్రథమ/మొదటి పద్యము. [3] అప్పకవీయం/ పీఠిక/ 1 పద్యము.

'శ్రీనాథ భట్ట సుకవి' నిండు జవ్వనమున ఆంధ్ర భాషలోనికి సంతరింపబడినది, హర్ష నైషధము. దానిని 'శృంగార నైషదముగ ' పరంపరాగతమగు పద్ధతిలోనే, శ్రీకార, మగణములతో ఇష్ట దేవతా స్తుతితో పద్యమును మొదలు పెట్టుట చూడగలము.

శా. " శ్రీరామా కుచమండలీ మృగమదశ్రీగంధ సంవాసిత [1]
స్ఫారోదార భుజాంతరుండు, ధరణీ సంశ్లేష సంభావనా
పారీణుండు, కృతార్థుజేయు కరుణాపాథోధి పద్మాక్షుడిం
పారన్ మామిడి పెద్దమంత్రిసుతు సింగామాత్య చూడామణిన్" - యనుచూ

శ్రీమత్తిరుమల తొళప్పాచార్య చరణ సరసీరుహసేవా సమాలబ్ధ సామ్రాజ్య ధౌరేయ నిజకావ్యాభరణాయమాన యెల్లభూపురందరవర నందన 'మట్లనంత భూపాలు'నిచే, [అనంతరాజు] ఐదు ఆశ్వాసములలో కూర్చబడినది "కకుత్ స్థవిజయము". పింగళి సూరన కళాపూర్ణోదయాన్ని కొంతవరకు అనుసరించి, అనంతరాజు ఈ కకుత్ స్థవిజయమును రాసినాడు. ఈ రాజుగారు వీరవైష్ణవాభిమాని. ఇష్టదేవతా నమస్కృతి, సుకవి పురస్కృతి, కుకవి తిరస్కృతిచేయడముతో పాటు, వీరు కూడ, సంప్రదాయమును గౌరవించి,

శా. "శ్రీపాదంబురుహద్వయంబిది మదిన్సేవించువాడెవ్వడో
యాపుణ్యుండఅచేతిరత్నమగు మాకన్నట్లుగా తాదృశ
వ్యాపారోన్ముఖ రత్నహస్త మగు తత్త్వంబాయురారోగ్య లీ
లా పూర్తుల్దయ కావ్యకర్త కలమేల్మంగా వరుండీవుతన్" [2]

అంటూ శ్రీకార, మగణములతో పద్యమునారంభించినారు. కావ్య కర్త తానే కదా! నవీన పద్యకవులలో "శ్రీనందనందనోపాఖ్యానము" పేర (అన్నీ కందపద్యాలు ) రచన గావించిన వారు శ్రీ 'ఆలూరు కృష్ణమూర్తి' గారు.
అన్నీ కందములే కనుక శ్రీ కారముతో పద్యమును ప్రారంభించినారు .

కం. శ్రీయునుయశంబుముక్తియుశ్రేయముకరుణామతికడుచెన్నునటులన్
పాయక గాచెడి వేంకట నాయకునిం గొల్తు భక్తి ననుదరి చేర్పన్" [3]

---

పాద సూచికలు :- [1] శ్రీ నాథమహాకవి/ శృంగా నైష / ప్రథ/1 [2] మట్ల అనంతరాజు కకుత్ స్థ /ప్రథమాశ్వా/1 [3] శ్రీ నందనందనోపాఖ్యానము/ ఆలూరి కృష్ణమూర్తి/ తొలి పద్యము.

అని శ్రీ కారము, 'భ' గణముతో కూర్చబడినది.

శ్రీమత్పరమపదమనాథ, నిరవధిక కృపా పరిపాక పరిచిత సరస కవితాసనాథ ' తెనాలి రామకృష్ణ' కవినాథుడు విరచించినది, "పాండురంగ మాహాత్మ్యము". దీనిని ఆంధ్ర పంచ కావ్యములలో నాల్గవదని పెద్దలమాట. తన కావ్యావతారికలో ఇష్ట దేవతా స్తుతితో ఆరంభించినది శ్రీకారము తొలి అక్షరము, మగణము తొలి గణము. సంప్రదాయ పరంపరకు స్వాగతమిస్తూ చేసిన పద్యము.

'శా. శ్రీకాంతామణి కన్మొఱంగి మది ధాత్రి న్మంచినస్, దత్క్షతి
శ్రీకాదంబిని మీది కుబ్జైననగా శ్రీ వత్సముస్ దాల్చి ము
ల్లోకంబుల్ పొదలించు కృష్ణుడు, దయాళుండేలు శ్రీవైష్ణవ
స్వీకారార్హు విరూరి పట్టణపతిస్, వేదాద్రి మంత్రీశ్వరుస్". [1]

ఇక నిఖిలసూరి లోకాంగీకార తరంగిత కవిత్వ వైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్య గేయ 'సూరయ' విరచితమగు "ప్రభావతీ ప్రద్యుమ్నము" ను పరిశీలిద్దాము. ప్రబంధ కవితలలో కొంగ్రొత్త ప్రక్రియలను ప్రభవింపజేసి, లోకోత్తర ప్రతిభను సముపార్జించు కొన్న సూరుడు సూరన. అట్టి కవి వతంసుడు ఈ కావ్యములో అవతారిక ఆరంభమును ఇష్ట దేవతా స్తుతిని, ఉత్పలమాలావృత్తముతో ఆరంభించినాడు. అనగా ఇది 'భ' గణముతో ఆరంభింప బడినది. శ్రీకారము మాత్రము వాడబడినది. ఆ పద్యమిది.

ఉ. " శ్రీమదుమా మహేశు లతి చిత్ర విలాసులు తారు ముస్ వియో
గామిత చింత నొండొరుల కై సగమౌటలునిచ్చ తెల్పు కాం
క్షా మహిమంబుచే చెఱిసగంబుగ నొక్క యొడల్ ధరించు స
త్ప్రేమపు దంపతుల్ కృతిపతిస్ దనరింతురు గాట కీర్తులస్." [2]

ఇతడే [సూరన] 'కళాపూర్ణోదయాన్ని' 'మ' గణ,'శ్రీ' కారములతోఇలా మొదలుపెట్టాడు.

---

పాద సూచికలు: - [1] తెనాలి రామకృష్ణుడు /పాండురంగ/ ప్రథమ/1 [2] పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నము/ప్రథమా/1.

శా. " శ్రీలావణ్యవతీకుచద్వితయ కాశ్మీర ప్రభా చారు వ
క్షోలంకారమణి ప్రకాండము నవీనార్కుండుగా సన్మనో
నాళీకావిరత ప్రభాతమగుచున్ భాసిల్లు తత్ప్రంబు నం
ద్యాల శ్రీనరసింహకృష్ణవిభు నిత్యశ్రీయుతుం జేయుతన్ " [1]

'శ్రీమంగళాచలనృసింహ కృపాప్రసాద సంప్రాప్త విద్యావైభవ, కనుపర్తి రాయనమంత్రి తనూభవ, సుజనహిత కృత్యనిత్య' పరాయణుడైన 'కనుపర్తి అబ్బయామాత్య' నిచే, ప్రణీతమైనది – "అనిరుద్ధ చరిత్రము". మంగళగిరి నరసింహుని స్మరిస్తూ ఈ కవి, అనూచానముగా వస్తున్న ఆచారమును ఆదరించి తొలి పద్యమును శార్దూలవృత్తముతో, 'మ' గణముతో, మరియు 'శ్రీ' కారముతో కూర్చినారు. ఆ పద్యము ఈ రీతిగా కలదు.

శా. " శ్రీనిత్యోత్సవ మందిరంబులగు లక్ష్మీ మోహనాపాంగ వీ
క్షా నీలోత్పలమాలికావళులు, శృంగారంబుగా నంగ పూ
జా నైపథ్య మెలర్ప తత్తనులతాసంశ్లిష్ట కేళిం బ్రియా
సూనుండై తగు, మంగళాచల నృసింహుండిచ్చు కోరికల్ " [2]

మరొక ప్రబంధమునిపుడు చూద్దాము. ఇయ్యది – 'శ్రీ సూర్యనారాయణ వరప్రసాద లబ్ధ ప్రసిద్ధ సారస్వత సుధాసార జనిత యశోలతాంకుర చేమకూర లక్ష్మణామాత్య తనయ, వినయధురీణ సకలకళా ప్రవీణాచ్యుతేంద్ర రఘునాథ భూపాలదత్త హస్త ముక్తా కటక విరాజమాను' డైన 'వేంకటకవి'చేత నిర్మించబడినది, 'విజయవిలాసము'. శ్లేషలకు, శబ్ద చమత్కారాలకు పెట్టిన పేరు ఈ "పిల్ల వసుచరిత్ర" అని కొందరనుట మనకు తెలిసినదే!

ఒక రసికుడు వెనుకటికి ఈ విజయవిలాసమును చదివి, 'చేమకూర మంచి పాకాన పడినది' అన్నారట. 'ఇంటి పేరు నస కవిత్వం పస' అని కూడా కొందరనినట్లు చెప్పడము కలదు. ఏదేమైనా, వేంకటకవి తానూ సంప్రదాయమును గౌరవించేవాడనని రీతిలో తొలి పద్యమును 'శ్రీ'కారముతో, 'మ' గణముతో ఈ విధముగా ప్రారంభించినారు.

---

పాద సూచికలు : - [1] పింగళి సూరన కళాపూర్ణోదయము . ప్రథమాశ్వా/ 1

[2] అనిరుద్ధ చరిత్రము /కనుపర్తి అబ్బయ/ అవతా/ 1 వ పద్యము.

శా. " శ్రీలెల్లప్పుడొసంగ, నీ సకల ధాత్రీచక్రముస్ బాహు పీ
ఠీ లగ్నంబుగజేయ, దిగ్విజయమీస్ డీ కొన్న చందాన, నే
వేళస్ సీతయు, లక్ష్మణుండుదను సేవింపంగ విల్ పూని చె
ల్వొలీలస్ దగు రామమూర్తి రఘునాథాధీశ్వరుంబ్రోవుతస్" [1]

సంగీతము స్రవింపజేయు పద్యాలతో, లోకోత్తర చమత్కారములతో, అద్భుత శ్లేషలతో కూడి, గురుతర వ్యాఖ్యతో చదువుకోతగినది 'వసుచరిత్రము'. తమవద్ద ఇట్టి గొప్ప కావ్యము లేదని సంస్కృత ములోనికి తెలుగునుండి మార్చుకొనబడినది – 'వసుచరిత్రము'. దీని నిర్మాత రామరాజభూషణుడు. యితడు – "శ్రీ రామచంద్ర చరణారవింద వందన పవన నందన ప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్ర భాషా సామ్రాజ్య సర్వంకష చతుర్విధ కవితా నిర్వాహక సాహిత్య రసపోషణుడు', అలంకార శాస్త్ర మైన 'కావ్యాలంకార సంగ్రహము'ను నామాంతరమున నలరు 'నరసభూపాలీయ' కర్త కూడా ఇతడేనని, కాదని కొంత చర్చ గలదు. మనకిపుడు దానితో పని లేదు. ఒకటి మాత్రము వాస్తవము. తన ఒరవడిని జూచి తామును అదే రీతిలో కవిత్వమును కూర్పవలెనని తర్వాతి కొందరు కవులు అనుసరించే విధముగా కబ్బమును చక్కగ కూర్చినట్టి కవి శేఖరుడు రామరాజభూషణుడు .
వసుచరిత్రము అతడొ

నర్చిన పలు గ్రంథములలో నొకటి. వసుచరిత్రము లోని పద్యమునొకసారి చూచెదము.

శా. " శ్రీభూపుత్రి వివాహవేళ, నిజమంజీరాగ్రరత్నస్వలీ
లాభివ్యక్తి వరాంఘ్రిరేణుభవ కన్యాలీలయంచుస్ మదిం
దా భావింప, శుభక్రమాకలనచే, తద్రత్నముంగప్పు సీ
తాభామాపతి ప్రోవుతస్ తిరుమలేంద్ర శ్రీమహారాయనిస్" [2] అని ప్రస్తుతించినాడు.

'శ్రీ శంకరస్వామి సంయమీశ్వర చరణసరోరుహ ధ్యానానంద సౌందర్యధుర్య శ్రీసూర్య సుకవిభవ శంభుదాసలక్షణాభిధేయ 'ఎఱ్ఱయ' నామధేయుడు, కవిత్రయములోనొకడు.

---

పాద సూచికలు : - [1] చేమకూరి వేంకటకవి/ విజయవిలాసము/అవతా/ 1 వ పద్యము.
[2] వసుచరిత్ర/ రామరాజ భూష/ అవతా/ పద్యము 1 .

'ఎఱ్ఱాప్రగడ'గారు తమ 'హరివంశము' ను పూర్వ సంప్రదాయమునకు పట్టముగట్టి, శ్రీకార, మగణాదులతో కృతిని ఆరంభించినారు. కృతిపతికి ఐశ్వర్యములిమ్మని చేసిన ప్రార్థన యిది.

శా. "శ్రీకింబ్రేమపదంబు భూమికి నతి స్నిగ్ధుండు దుగ్ధాబ్ధి శ
య్యాకేళీరతుడాది వేధకుగృహం బై యొప్పు నాభిస్థనా
ళీకంబుంగల వేల్పు లోకములబాలింపం బ్రభుండుత్తమ
శ్లోకుం డన్నమ భూవిభునకిచ్చున్ సుస్థిరైశ్వర్యముల్" [1]

శాస్త్ర సంబంధ నిఘంటువులూ, సాహిత్యాభిరుచి కలవారికి కరదీపికలూ, జిజ్ఞాసువులకు ప్రయోజనకారులూ ఐన 'ఆంధ్ర నామసంగ్రహము' ఆరంభము

" శ్రీపతి వంద్యు విశాలా
శ్రీపతిని భజించి యిష్టసిద్ధులు వరుసన్,
ప్రాపింపగ గణనాథుని
శ్రీపాదంబులకు నెఱగి చెందిన వేడ్కన్" [2]

అని పైడిపాటి లక్ష్మణ కవిగారు, చేయగా

'అడిదము సూరకవి' తన 'ఆంధ్ర నామశేషము' ను,

" శ్రీగౌరీప్రియవల్లభ
రాగద్వేషాదిరహిత రమ్యచరిత్రా,
యోగిధ్యేయ పదాంబుజ
భోగివలయ రామచంద్ర పురవరనిలయా" [3]

అనుచూ, శ్రీ కారముతో కందపద్యములలో అందించినారు.

"సాంబ నిఘంటువు" మనకిచ్చినట్టి తత్కర్త, 'కస్తూరి రంగకవి' గారు మాత్రము, శ్రీకారముతో తనగ్రంథమును, శ్రీ సాంబమూర్తి కి విన్నవించినాడు. తన గ్రంథ ప్రణాళికను ఆ స్వామివారికి 'సీసపద్యశతకం' లో వివరించినాడు. ఆ శతకపు తొలి పద్యమిది. చూడుడు.

-----------------------------------------------------------------------------------------

పాద సూచికలు : - [1] ఎఱ్ఱన /హరివంశము/పూర్వ/ప్రథమాశ్వాస/1 పద్యము.
[2&3]ఆంధ్రనామసంగ్రహ రోహిణీ సంస్థ రాజమండ్రి, 1995 ప్రచురణ.

సీ. శ్రీ వెలయంగ దేశీయముల్ తెనుగులు తద్భవంబులు గూర్చి దైవవర్గు
దనరు మానవ వర్గు స్థావర వర్గు తిర్యగ్వర్గు నను నాలుగలవరించి
జల్లు లుంపక వ్యర్థ శబ్దముల్ రానీక కుంటి నడత గాక కొదుకులేక
యుర్వీజనంబుల కుల కారసరణిగానాంధ్రనామ నిఘంటువనెడు కృతిని
గీ. కవుల దయ చేత నీకటాక్షంబువలన సీస శతకంబుజెప్పెద చిత్తగింపు ,
దనుజ సమవర్తి భక్త హృదబ్జవర్తి సకల సుర చక్రవర్తి శ్రీ సాంబమూర్తి! [1]

కైవల్య నవనీతము అను గ్రంథము శ్రీ విద్యానంద నాథుని విరచితము. సకలోపనిషత్సార మైన ఈ అద్వైత శాస్త్ర ఆరంభము మంగళకరమైన రీతిలో శ్రీకార, మగణాలు కల్గినది.

శా. " శ్రీకైవల్య ఖద్వైకపాత్త్రిపద లక్ష్మీ సంయుతో ద్గీథ స
ల్లోకాలోకకలైకమత్యపరమాలోకాత్మమై మెద్ది య
స్తోకానంద ముఖాంక పంచకలనా సువ్యక్తమై యొప్పు నా
శ్రీ కైవల్య నవోద్ధృతార్థము సదా సేవించి కీర్తించెదన్" [2]

వేదాంత గ్రంథమైన 'శుకచరిత్రము'ను, కూర్చినది – గురులింగమూర్తి చరణ కమల సేవా విధేయ తద్గురు కరుణా కటాక్ష వీక్షణానుగ్రహోపలక్షిత శ్రీ రామ మంత్రోపాసనా ప్రకారజ్ఞాన ధౌరేయ తన్మంత్రాధిష్ఠాన దేవతా తత్త్వానుసంధాన లక్షణ భాగధేయ వేదాంత కవితా విచిత్ర విజ్ఞేయ బ్రహ్మవిద్వజ్జనగేయ పరశురామ పంతుల రామమూర్తి.

ఆ గ్రంథారంభములో 'శ్రీ' కారము, మగణముతో చేసిన మొదటిపద్యము ఇది.

శా. "శ్రీమన్నిర్మల శుద్ధ సత్త్వమయ దృక్సత్తోగతి ప్రాపిత
భ్రూమధ్యోన్నత నూత్నరత్నయుత హర్మ్యోదగ్రభాస్వత్పరం
ధామాకారకళావధూ సమరసాత్మావ్యక్తరూపోత్థ చి
ద్భూమానందుడు మాధవుండు గృపమమ్మెం బ్రోవుచుండుందగన్" (3)

ఈ రామమూర్తి గారే, తనదైన మరొక వేదాంత/ఆధ్యాత్మిక గ్రంథమందు , శిష్టుల ఆచారమనుసరించి మంగళకరమని "శ్రీమద్దివ్యనిజాంఘ్రిపద్మములుసంసేవించుచున్[4] అని శ్రీకార, మగణంతో పద్యం చెప్పారు. అందులో ఆయన తనను గురించి,

---

పాద సూచికలు: [1] ఒక పుస్తకముగా రోహిణీ సంస్థ రాజమండ్రి, 1995 ప్రచురణ [2] కైవల్య నవనీతము తత్త్వబోధ ప్రక/1 వ పద్యము. [3] శుక చరిత్ర/రామమూర్తి/ప్రథ/1 [4] సీతారామా/రామమూర్తి/పీఠి/1

శ్రీమన్నారాయణమహాదేవ గురుకరుణాకటాక్షవీక్షణ విమలీకృత నిజహృదయకమలకర్ణికాంతస్పందర్శితాఖండ సచ్చిదానందరసైకస్ఫూర్తి షట్చక్ర సీతారామమూర్తి పరశురామపంతులలింగురుమూర్తి' యని చెప్పడం కలదు.

ఇక తెలుగు భారతము కూర్చిన, 'కవిత్రయము' లో ఒకడైన ఎఱ్ఱన, విరచితము "నృసింహ పురాణము". అందులో తనను శంకరస్వామి సంయమీశ్వ చరణసరోరుహ ధ్యానానంద సౌందర్యధుర్య శ్రీ సూర్య సుకవిమిత్ర సంభవ శంభుదాసలక్షణాభిధేయ యెఱ్ఱయ నామధేయుడని చెప్పుకోవటం కలదు. ఆ పురాణ పీఠికారంభము, శ్రీకారము, 'భ'గణము లతో చేయడం కలదు.

ఉ. "శ్రీకి నిరంతరంబు కడుజెన్నొసలారెడు రాగలీలను
తేృకముబొంది యొప్పు తన చిత్తము జూపెడు మాడ్కి నిత్య ర
మ్యాకృతి యైన కౌస్తుభము నక్కుపయింబచరించునుత్తమ
శ్లోకుడహోబలేశుడతిలోకుడు లోకముగాచు గావుతన్ " (1)

ఇక మరికొన్ని రచనలు పరిశీలించినపుడు లభించిన వివరాలు ఇట్లున్నవి.

| వరుస | గ్రంథము | కవి/రచయిత | పద్యారంభం | *ఇతరములు. |
|---|---|---|---|---|
| [1] | తా అన్నమయ్య జీ/చ | తా. చిన్నన్న | శ్రీయలమేల్మంగ | శ్రీ /ద్విపద |
| [2] | శ్రీ రామకృష్ణలీలా | డా.మల్లెల గురవయ్య | శ్రీరామాపర | శ్రీ/శార్దూ/మగణం |
| [3] | శృంగారలహరి | జోస్యము జనార్దన శాస్త్రి | శ్రీమహోత్సవ | శ్రీ/ఆటవెలది |
| [4] | శ్రీశివానంద సరస్వతి | డా. మల్లెల గురవయ్య | శ్రీకరమైరమైక | శ్రీ/ఉత్పల/భగణం |
| [5] | శ్రీ శివలీలలు | మడిపల్లి భద్రయ్య | శ్రీ విఘ్నేశుని | శ్రీ/కందం |
| [6] | శ్రీరమా పరిణయం | తరిగొండ వెంగమాంబ | శ్రీవెంకటేశ్వరు | శ్రీ/ద్విపద |
| [7] | రామాయణం | ఆతుకూరి మొల్ల | శ్రీమహిమాభి | శ్రీ/ఉత్పల/భగణం |
| [8] | రామాయణం | రంగనాథుడు | శ్రీకామినీనాథు జిత | శ్రీ/ద్విపద |
| [9] | శశాంక విజయం | శేషము వేంకటపతి | శ్రీవిన్నాణపుగుబ్బ | శ్రీ/శార్దూ/మగణం |
| [10] | లక్ష్మీసహస్రకావ్య | డా.వేదుల సూ.శర్మ | శ్రీమన్మత్కుల | శ్రీ/శార్దూ/మగణం |

పాద సూచికలు :- [1] నృసింహపురా/ఎఱ్ఱన/పీఠి/1

| | | | | |
|---|---|---|---|---|
| [11] | మూర్తిత్రయోపాఖ్య | దంతులూరి బాపకవి. | శ్రీలక్ష్మీజలజాక్షి | శ్రీ/శార్దూ/మగణం |
| [12] | బృందావనవిహారం | వనం గంగాధరకవి | శ్రీమద్వేంకటశైల | శ్రీ/శార్దూ/మగణం |
| [13] | శృంగార శాకుంతలం | పిల్లలమఱ్ఱి పి వీ భ | శ్రీవత్సాంకుడు | శ్రీ/శార్దూ/మగణం |
| [14] | వైజయంతీ విలాసం | సారంగు తమ్మయ్య | శ్రీవసుధా సుతా | శ్రీ/ఉత్పల/భగణం |
| [15] | హరవిలాసము | శ్రీనాథుడు | శ్రీమహిళాపయో | శ్రీ/ఉత్పల/భగణం |
| [16] | బిల్హణీయము | పం. కృష్ణస్వామి | శ్రీరామావనిజా | శ్రీ/శార్దూ/మగణం |
| [17] | అహల్యా సంక్రంద | సముఖం వేం.కృ.నా | శ్రీ సౌబగొందు | శ్రీ/ఉత్పల/భగణం |
| [18] | దత్తాత్రేయం | డా. బాడాల రామయ్య | శ్రీకరుడై జ్ఞానా | శ్రీకారం/కందం |
| [19] | సుందర రామా | శంకరంబాడి సుందరా | శ్రీలు చెలువారు | శ్రీకారం/తేటగీతి |
| [20] | రాధికాసాంత్వన | ముద్దుపళని | శ్రీలజెలంగురాధిక | శ్రీ/ఉత్పల/భగణం |
| [21] | రాజయోగ | తరిగొండ వెంగమాంబ | శ్రీగణనాథు | శ్రీకారం/ద్విపద |

ఈ రీతిగా పరిశీలించినపుడు చాలామంది రచయితలు, కవులు, కవయిత్రులు "శ్రీ" యను అక్షరముతో తమ రచన మొదలుపెట్టినట్లు చెప్పవచ్చును. వారి వారి అనుభవములను, అవసరములను అనుసంధించుకొని తరువాతి గణములను పద్యలక్షణములను పాటిస్తూ ప్రయోగము చేసినారు. తొలి పద్యము తరువాత ఇతర స్తుతులు తదితర విషయముల ప్రస్తావనములను ఆయా సందర్భములలో ప్రస్తావించబడును. ముఖ్యముగా శ్రీ కారమును ప్రయోగించిన విషయమును చూచినాము.

ఇతర రకములగు రచనలలో కూడ తెలుగు కవులు/ రచయితలు ప్రారంభమునందు శ్రీకారమును వాడుట ఒక ఆనవాయితీగ చేసికొనినారు, అనుట వింతకాదు అనవచ్చును. తెలుగు తొలిసంకీర్తనాచార్యుడైన తాళ్ళపాక అన్నమయ్య, అక్కాంబ గారల కుమారుడు పెదతిరుమలాచార్యులు, తండ్రివలెనే వేంకటపతి భక్తుడే కాదు, గొప్ప రచయిత కూడా. ఆయన వేంకటేశ్వరోదాహరణాది బహుగ్రంథకర్త. వేంకటేశ్వరవచనకర్త కూడా. 'వేంకటేశ్వర వచనాలు' మొదలు ఇట్లు చేసినారు –(1) "శ్రీ వేంకటగిరిదేవా! నా దేహంబు నీవుండెడి నిత్య నివాసంబు;" ప్రతి వచనమునకు తుదిలో శ్రీవెంకటేశ్వరా! యను మకుటమును వాడిననూ,

-----------------------------------------------------------------------

పాద సూచికలు : - [1] తి.తి.దే.ప్రచురణ 1034 పరిష్కర్త/ వే.ప్రభా శాస్త్రి.వచ.1.,

పిదప పలు సంబోధనలను చేసిననూ, తొలుత శ్రీ కారమును వాడినారని చెప్పవచ్చును. ఆయన కూర్చిన 166 వచనాలలో శ్రీకారముతో ప్రారంభమైన వచనాలు ఆరు, ఏడుకు మించిలేవు. మిగతావన్నీ పలు రీతులగా సంబోధనలే! నందకాయుధ ధరా, అలమేలుమంగాపతీ, క్షీరాబ్ధిశయనా, దామోదరా, కమలనాభా, హృషీకేశా, మురహరా, గరుడధ్వజా, గోవిందా, పరమాత్మా, గోపికావల్లభా, పీతాంబరధరా, నీలమేఘశ్యామలా, కోనేటినిలయా, సకలలోకారాధ్యా,హయగ్రీవా, ప్రహ్లాదవరదా... ఇత్యాదులు. ఇతడే కూర్చినదని వేటూరి ప్రభాకర శాస్త్రి వారు, పేర్కొనిన "శ్రీవేంకటేశ్వరప్రభాతస్తవము" ద్విపదలో రాయబడినది. అది కూడా 'శ్రీ'కారముతో మొదలైనది.

"శ్రీగురుండర్థితో శేషాద్రియందు / యోగనిద్రాకేళి నున్న యత్తఱిని" (1)

కాలజ్ఞానమును తెలిపిన శ్రీనారేయణ యతీంద్రులు కూడా తమ రచనలు 'శ్రీ' కారముతో ప్రారంభించినారు. పలు రచనలు 'శ్రీ'కారముతో అందు ఆరంభమైనవి.

2 . 2 *శ్లోకారంభపద్యాలు*. : - తొలుతనుండి తెలుగు సాహిత్యముపై సంస్కృత భాషా ప్రభావము కలదు. వాస్తవమునకు ప్రస్తుతము మనము వాడుచున్న/ ప్రయోగించుచున్న పదములలో తెలుగులో దాదాపు 80% ( శాతము) సంస్కృత భాషా ప్రభావము కలవని చెప్పడానికి సందేహింపవలసిన పనిలేదు. కాకపోతే ఈ శాతము సంఖ్యలో మార్పు ఉండవచ్చు.

శ్లోకం అనగాసంస్కృత భాష యందలి "పద్యము' అని చెప్పవచ్చు. కీర్తి యను అర్థములో శ్లోక శబ్దము ప్రయోగింపబడటము కలదు.ఉదా. ఉత్తమశ్లోకుడు = గొప్పకీర్తి కలవాడు. శ్లోకము(2) అను పదమునకు నిర్వచనము/వివరణ ఇట్లు ఇవ్వడము కూడ చూడగలము. " నాలుగు పాదములు కలిగి ఛందోబద్ధమయిన వాక్య విశేషము" " అనుష్టుభ్/ప్ ఛందమున కూర్పబడిన పద్యము,అనుష్టుప్ = ఒక ఛందము / సరస్వతి., ఛందస్సు = పద్యలక్షణ ములను వివరించు శాస్త్రము. 'ఉక్త' నుండి 'ఉత్కృతి' వరకు గల 26 రకముల పద్యములు. అమరకోశము [ గురుబాల ప్రబోధికాసహితము] ఇట్లు చెప్పుచున్నది :

'పద్యే యశసి చ శ్లోకః' (3)

---

పాద సూచికలు:- [1] కైవారం యోగినారేయణ ట్రస్టు కర్నాటక 1994 ప్రచురణ , [] శ్రీ సూర్య ఆం నిఘం ఆరవ సం. పుట 669. [3] గురుబాల ప్రబోధికా సహితమైన " అమరకోశము" పుట 720 లో

"శ్లోక శబ్దము ఛందోబద్ధమయిన వృత్తమందును, కీర్తియందును వర్తించును. శ్లోక్యత ఇతి శ్లోకః శ్లోక్య సంఘాతే కూర్చబడునది, అనియూ యశసి యథా 'పుణ్య శ్లోక ఇత్యాది' – అక్కడక్కడ తెలుగు కావ్యములలో స్తుతుల రూపాన కొందరు శ్లోకములను చెప్పడము కలదు. తెలుగు కావ్యములందు తొలుత కవిత్రయ మహాభారతము పేర్కొనబడుచున్నది. ఆదికవి, శబ్దశాసనుడు ఐన నన్నయ్య భట్టారకుడు వ్రాసిన మొదటి పద్యము /శ్రీకారముతో మగణముతోకూడిన సంస్కృతభాషలోని శ్లోకమే. ఇది స్తుతిపూర్వకమైనది. ఆ శార్దూలవిక్రీడిత లక్షణ యుతమైన పద్యం/శ్లోకము ఇక్కడ మరొక్క సారి ప్రస్తావితమైనది.

"శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితావస్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకంధరా శ్శ్రేయసే." [1]

ఇది సంస్కృత భాషలో నిర్మితమైనది. ఇది శార్దూల విక్రీడితమను వృత్తము. మ,స,జ,స,త, త, గ- యను గణములచే కూర్చబడినది. ప్రాస, యతి నియమములు అనుసరణ లేదు. 19 వ ఛందము "అతిధృతి"అను వర్గమునకు చెందినది. మంగళకరమైనదిగ భావింపబడు 'శ్రీ' కారముతో ప్రారంభింప బడినది. ఇందు హరి,హర,బ్రహ్మలు, స్తుతింప బడినారు. మరియు విశేషముగా శ్రీ [లక్ష్మి], వాణి [సరస్వతి], గిరిజ [పార్వతి] మూర్తులు క్రమముగా వక్షములో హరి, అంబుజభవుడు[బ్రహ్మ] ముఖమందు, హరుడు సగము శరీరమిచ్చిన విషయమును ప్రస్తావించడము కలదు.

కవికులతిలకుడైన కాళిదాసుని కొంతమేరకు అనుసరించినట్లుగా, బృందావనవిహారకర్త, వనం గంగాధరకవి ఇట్లుకావ్యారంభమునకు ముందొక సంస్కృత శ్లోకమున్నది. అయ్యదిది.

శ్లో. పరస్పర తపః సంపత్, ఫలాయిత పరస్పరౌ,
ప్రపంచ మాతా పితరౌ, పార్వతీ పరమేశ్వరౌ". [2]

{పరస్పర తపః ఫలమును పరస్పరము ఫలాయితమొనర్చు జగత్పితరులకు(నమస్సులు)}

---

పాద సూచికలు : - [1] కవిత్రయభారతం నన్నయ్య/ఆది/ప్రథమ/1 [2] వనం గంగాధరకవి/ బృందావ విహారము/మొదటి శ్లోకం.

శ్రీమదుభయ కవిమిత్ర, కొమ్మనామాత్య పుత్ర, బుధారాధన విధేయ, తిక్కన నామధేయము గల, కవిత్రయములోరెండవవాడైన తిక్కనసోమయాజి తొలి రచనగ చెప్పబడు "నిర్వచనోత్తర రామాయణము"ను 'శ్రీ'కార, 'మ'గణములతో, శ్లోకముతో ప్రారంభించినారు.

శా. "శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజాస్తమ్భే,జగన్మణ్డల
ప్రాసాద స్థిర భారభాజి దదతీ సా సాలభంజీ శ్రియం
శుణ్డాలోత్తమగణ్డభిత్తిషు మదవ్యాసంగవ శ్యాత్మనాం
యాముత్తేజయతేతరాం మధులిహా మానంద సాంద్రా స్థితిః"[1]

నన్నయ్య గారి కాలమందే కాక వారి తర్వాత కూడా పలువురు రచయితలు/ కవులు వారి మార్గమునందే పయనించినారు. వారు నాటిన మొలక లేక బీజము మొలకెత్తి మారాకులు తొడిగి సంప్రదాయమును అనుసరించుచు వచ్చినది. మధ్యలో కొన్ని మార్పులు చెందినవి. వాటిని ఆయా సందర్భములలో ప్రస్తావించెదము.

*'విన్నకోట పెద్దన్న ' యను కవి 'కావ్యాలంకార చూడామణి' యను లక్షణ గ్రంథమును రచియించినవాడు. ఇతడు నియోగి బ్రాహ్మణుడు. గోవిందరాజు పుత్రుడు. కౌశిక గోత్రుడు. యూతని నివాస స్థానము రాజమహేంద్రవరము.* [1]

" *ఇతడు తాన రచియించిన యలంకార శాస్త్రమును రాజమహేంద్ర పురాధీశ్వరుడును, చళుక్య వంశ సంభవుడును అయిన విశ్వేశ్వర మహారాజునకంకితము చేసెను. విశ్వేశ్వరుని కాలమును సరిగా నిర్ణయించుటకాధారము దొరకలేదు కానీ, యూతడు పదునాలవ శతాబ్దారంభమున నున్నట్లూహించుటకవకాశము కలిగియున్నది"* [2]

*" విశ్వేశ్వరరాజు రాజమహేంద్రున కేడవ మనుమడైనట్లు తెలియ వచ్చు చున్నది" [3]*

ఇక మధ్యలో నిలచి పోయిన సంప్రదాయమునకు మరల జీవము పోసిన రీతిగా ఈ కవి "విన్నకోట పెద్దన్న" తన "కావ్యాలంకార సంగ్రహము" ను మొదట ఒక చక్కని సంస్కృత శ్లోకముతో ప్రారంభించి నట్లు తెలియుచున్నది. ఆ శ్లోకము 'శ్రీ' కారంతో, మసజసతతగ – గణములతో సిద్ధమైన శార్దూలము. తెలుగులో గల 'యతి' 'ప్రాస'లు లేవు.

---

పాద సూచికలు: [1] తిక్కన/నిర్వచనో /ప్రథమా/1.

2 నుండి 4 వరకు కందుకూరి వీరేశ లింగము గారి సంపూర్ణ రచనలు పుటలు 284 -285 మరియు 71

" శ్రీవాగాస్పదయోః పరస్పరయజోః శ్రుత్యుత్స్వవ శ్లాఘుయోః
రాగాలాప నిరూఢయోర్యతి  గణవ్యాపారపారీణయోః
సారస్యంగిరిజేశయో రివ సదా సంగీత సాహిత్యయో
ర్విద్వద్విశ్రమ హేతుకం విరహతాం చాళుక్య విశ్వప్రభౌ" [1]

"తన ప్రభువు సంగీతం బాగా నేర్చిన వాడు కనుక విన్నకోట పెద్దన ఇలా 'సరిగమ పదనిస' లలో అతనిని నుతించాడట.

కం.  ' నీసరి పని నీసరి ధని – నీసరి మాధారి గరిమ నీ సరిగారీ
నీ సరిగా నిగమాగమ – గోసారులునుం జళుక్యకుల విశ్వేశా" [2]

నన్నయ్య నుండి తెనుగు కావ్యములను కూర్చుటతో పాటు శాస్త్రీయ సంబంధ మైన రచనలు {Technical or Science related }కూడా సమాంతరముగా జీవము పోసుకొనినవనినచో అనుమానము ఆవగింజంత కూడా అవసరము లేదు. పావులూరి మల్లన సారసంగ్రహ గణితము ఇందులకు ఒక ఉదాహరణ.  ఒకటి వాస్తవము తెలుగు సారస్వతము ఎక్కువగా ఇతర భాషలకన్నా సంస్కృతసారస్వతముపైన ఆధారపడినదని చెప్పటానికి ఎక్కువగా ఆలోచింప పనిలేదు.

శ్లో||   " శ్రీకంఠం సుగుణం సమస్త జగతాం కర్తార మీశం గురుం
భూతోయానల చంద్ర సూర్య పవనవ్యోమాత్మ మూర్తిం విభుం
నిత్యానంద మయోపయో గిరిజయాసార్థం ప్రజావృద్ధయే
మాయా యోగ ముపైతి తం శివకరం వందే శివం శ్రేయసే!  [3]

'పావులూరి మల్లన' కూడా తన అనువాదమును మొదట నన్నయ్య గారి దారిలోనే పయనించినారని భావింపవచ్చు. ఆయన తన ప్రారంభ శ్లోకమును 'శ్రీ' కారముతో, మరియు 'మ' గణముతో శార్దూల వృత్తముతో చేసినారు. ఇక ప్రాస, యతులు పాటించు ఆచారము లేదు కనుక వాటి ప్రస్తావన ఇక్కడ అనవసరము.ఆ స్తుతిని చూద్దాము.సకల లోకములకు అధిపతి పరమేశుడు. శ్రీకంఠుడు, సుగుణుడు, సకల జగముల కర్త, ప్రభువు, గురువు. ఆయన పంచభూతములనబడునవన్నియూ ఆయన రూపాంతరములే.

---

పాద సూచికలు : - [1] విన్నకోట పెద్దన్న /కావ్యాలంకార సంగ్రహము [2] ఆరుద్ర గారి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సం.I పుట 668. [3] పావులూరి మల్లన/సారసంగ్రహ గణితము/కృతి మొదటి శ్లోకము

భూమి, తోయము, అనలము, పవనము, వ్యోమము [ఆకాశము] ఇవియే కాక సూర్య చంద్రులు మరియూ ఆత్మ ఆయన స్వరూపములే. నిత్యానంద మూర్తి యగు ఆయన జనహితము కోరు ప్రభువు. అర్ధ నారీశ్వరుడగు ఆయన మాయా యోగ స్వరూపుడు. జగన్మంగళకారి మల్లన కూడా నన్నయ పథముననే పయనించి తుదిలో 'శ్రేయసే' యని ముగించినారు. కేవలము శివుని గూర్చి చెప్పటము ఇతరుల లక్షణాలను ప్రస్తావించినట్లు ద్యోతకమగును. ఆ శివుడు మేలు చేయు గాక. ఆది శంకరుల వారు తమ సౌందర్యలహరిలో చెప్పినరీతిగా అంబ దయ వలన ఈశ్వరుడు వివిధ రూపాలలో కార్యములను నిర్వర్తించు చున్నాడని త్రిమూర్తుల ప్రతినిధిగా వ్యవహరించుట కలదు.

అనంతపురము జిల్లా కదిరి పట్టణ సమీపమునందలి 'కొక్కంటి' గ్రామమునకు చెందిన శ్రీ సోంపల్లె కృష్ణమూర్తి గారు 1940 లో ప్రచురించినకావ్యము '' కవితానంద వాల్మీకి రామాయణము'. సారకాండము పేరున ఇది కలదు. వారు చేసిన విజ్ఞాపనములో ని విషయము ఇచ్చట ప్రస్తావింపబడుచున్నది. ' రామాయణము ప్రథమకావ్యమనియు, వాల్మీకి ఆదికవి యనియూ, పండితులు మొదలు పామరులవరకు అంగీకరింపబడి యుండుట సత్య దూరము కాదు.రామాయణములనేకములు గలవు.

ఆయన తనను గురించి తుదిలో గద్య రూపమున ఇట్లుతెలిపినారు.

'శ్రీరామచంద్ర బాలాత్రిపురసుందరీ చరణారవింద మకరంద పానానందేందిందిరాయమాన మానసత్వ మహావైభవ మంగాంబా నంజపార్య ప్రధాన తనూభవ సుకవిజన విధేయ సోంపల్లికృష్ణ మూర్తి నామధేయు' డని చెప్పికొనినారు.

తెలుగు పద్యములలో గంభీరముగా కావ్యమును కూర్చినను, గీర్వాణవాణిలో తన ప్రస్తుత గ్రంథమునారంభించినారు. ఆ సంస్కృతశ్లోకమిది.

శా. "శ్రీమద్భూతనయా మనోజ్ఞ మధుపం, శృంగార భూషోజ్జ్వలం
భీమోత్సేధ దశానన ప్రముఖ దోర్వీర్యాంధ చంద్రోదయం
భూమానంద కథా సుధా మధురిమా పూర్ణాజజాండాదికం
రామబ్రహ్మ, మనంత సంసరణ పారావార పోతం, భజే" ! [1]

---

పాద సూచికలు : - [1] కవితా వాల్మీ రామా/సోంపల్లె కృష్ణ మూర్తి, ఇష్టదేవ/స్తుతి 1 .

ఇందులో కవి కృష్ణమూర్తి ప్రతిభ చూపడం చూడగలము. సాధారణముగా సంస్కృత శ్లోకములో యతి ప్రాస నియమములు పాటించుట జరుగదు. కానీ ఈ కవిగారు, తొలి పద్యమును, శ్రీకారముతో ఆరంభించినారు. 'మ'గణముతో కూడిన శార్దూల వృత్తమును వాడినారు. తదుపరి రెండవ అక్షరమైన ప్రాస [మ] ను నాలుగు పాదములలో వచ్చునట్లు ప్రయోగించినారు. అటుపై యతి స్థానమును [1-13] పాటించినారు. శార్దూలవిక్రీడితమునకు ప్రయోగింపబడు , 'మ, స, జ, స, త, త,గ' గణములను వాడినారు.

సంస్కృత శ్లోకముతో కావ్యమారంభించుటయేగాక, ఆ పద్యములో తెలుగు ఛందస్సున అనుసరించు యతి ప్రాసలు కూడ వాడటము ఒక ప్రత్యేకమైన అంశముగా గుర్తింపదగును. మిగిలిన విషయములను ఆయా సందర్భములలోప్రస్తావింతముగాక.

2 . 3 *ఆశీర్వ మస్క్రియా పద్యాలు :*- {1} ఆశీస్సు అనగా పూజ్యులైన వారు, పెద్దలు, ఉన్నత స్థితిలో నున్నవారు యిచ్చునట్టి దీవెన. శుభము, మంచి, సఫలత, మంగళము మొ.. కలుగవలయునని పలికెడుపలుకు/మాట – దీవెన లేక దీవన. "ఆశీర్హితాశంసా హి దంష్ట్రయోః " యని ***ఆశీః*** శబ్దమునకు – 'హితమైన', 'పాముకోఱ'- అను అర్థములు కలవు. ఆశాసనం, ఆశంసతీతి చ ఆశీః , అనియు 'ఆఙ శ్శాసు ఇచ్ఛాయాం – అనగా 'ఇచ్ఛయించుటయు' 'హింసించునదియు' – ఆశీస్సు. ప్రస్తుతము మనము 'హితమైనది' /కోరదగినది అను అర్థములోనే ఈ శబ్దమును గ్రహించుచున్నాము.

**నమః** అనగా గౌరవపూర్వకముగా చేయు మ్రొక్కు. 'నమోనతౌ' యని నిర్వచనము. నమః - ఇది మ్రొక్కుటయందు వర్తించును. ఉ. 'నమోవిష్ణవే'.

కావ్యారంభమునందు కవులు కొన్ని సందర్భములలో కృతిపతిని ఆశీర్వదించుచు కృత్యారంభము కావించినారు. మరికొందరు నమస్కార రూపమున కృత్యారంభము చేసినారు. ఆయారీతులను కొన్ని పరిశీలించెదము.

*ఆశీస్సు రూపములోనున్న కొన్ని పద్యములు* :-

* తెనాలి రామకృష్ణ కవి తన పాండురంగ మాహాత్మ్యమును 'శ్రీవైష్ణవ స్వీకారార్హుడైన' విరూరి పట్టణ పతి యగు వేదాద్రి మంత్రీశ్వరుని దయాళుండైన కృష్ణుడు యేలు నని ఆశీస్సులు ఆశించి కృతిని ప్రారంభించడము కలదు. ఆ పద్యమిది.

---

పాద సూచికలు : - {1} గురుబాలప్రబోధికా/అమరకోశము పుటలు – 843 / 873

శా. "శ్రీకాంతామణికన్నొఱంగి మది ధాత్రిన్మంచినన్, తత్ క్షతి,
శ్రీకాదంబిని మీదికుబ్బెననగా, శ్రీవత్సమున్ దాల్చి, ము
ల్లోకంబుల్ వొదలించు కృష్ణుడు దయాళుండేలు శ్రీవైష్ణవ
స్వీకారార్హు విరూరి పట్టణ పతిన్ వేదాద్రి మంత్రీశ్వరున్' {1}

శ్రీవత్సలాంఛనుడు విష్ణువు. శ్రీదేవి, భూదేవి ఇతని భార్యలు. శ్రీదేవి కనులుగప్పి, భూదేవిని ప్రియముతో లాలింపగ, దానిని భరింపలేని మాత్సర్యముతో పైకి ఉబికివచ్చినట్లున్న శ్రీవత్సమును ధరించియుండు శ్రీవిష్ణుమూర్తి, మూడులోకములను సంతోషింపజేయు కృష్ణుడు వేదాద్రి మంత్రిని యేలుగాక! కృష్ణునికి విష్ణువునకు అభేదము చెప్పడము గలదు.

పిదప కూర్చబడిన సీసపద్యములో, 'కలశరత్నాకర గర్భసీమలో అవతారమందినదియు, కాంచనవర్ణము కలదియు, వెన్నెలగాయు వేల్పునకు తోబుట్టువు, పరమపావనమూర్తి యగు చక్రిని పాయక యుండునదియు, దిగ్గజములచే అభిషేకము పొందునదియు, "నవనిధానంబు" {2} లు తనజంటగా నుండునో ఆమహాదేవి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, సరస శుభదృష్టి తో "రామానుజయ్య సుతుని, విరూరి వేదాద్రినాథు"ని ఆదరించుగాక! యని ఆశీస్సులను ఆకాంక్షించిన విషయము చూడగలము. అంతేగాక, నలుమోములవేలుపు, సరస్వతీముద్రిత వక్తుడు ఐన నలువ ఆయువును, శ్రీని నిరంతరమూ విరూరివేదాద్రి చమూ విభునికి ఇచ్చుగాక! యనడం కలదు. పద్మగర్భముఖ రాజీవావళీహంసి, వర్ణద్రాక్షఫలకీరి, శారదా దేవి కృతిపతియగు, వేదాద్రిస్వామికి - నిచ్చలు విద్యాబుద్ధివాక్సిద్ధులను ఇచ్చుగాక! యనడం కలదు.

---

పాద సూచికలు: {1} పాండురంగ మాహాత్మ్య/ తెనాలి రామకృష్ణ/అవ/1

{2} నవనిధానంబులు : నవనిధులు అవి : పద్మము,మహాపద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, కుందము, ముకుందము, నీలము, వరము.

{అమరములో పుట 63–"మహాపద్మశ్చ పద్మశ్చ శఙ్ఖో మకర కచ్ఛపౌ, ముకున్ద కున్ద నీలాశ్చ వరశ్చ నిధయో నవ' అని చెప్పబడినది.}

మరియు 'భద్రనిధానమై వెలయు పర్వతకన్య', "శుకాదులు కొల్వగా కపర్దాచిత చంద్ర గాంగజలమైన శివాహ్వయ కల్పశాఖి' యను పేర పిలువబడు, పార్వతీపరమేశ్వరులు, శ్రీసేనమొదలియారి, ఖగయూథస్వామి శేషుడు మొదలగువారు 'రామానుజయ్య వేదాద్రిపతికి' మనుచుదురుగాక అన్నారు.

తన కృతిపతిని శ్రీమంతునిగా, దీర్ఘాయువు కలవానిగా చేయుమని బృందావన విహార కర్త ప్రార్థించడము చూడగలము. ఆ కృతిభర్త - వేంకట చంద్రభూపతి. తమ కులదైవమగు తలకోన సిద్ధేశ్వరుని కోరడమిట్లున్నది.

శా. శ్రీమద్వేంకట శైల సాను శిఖర శ్రీ ద్రోణ ఝురీ సరి
ద్ధామా ధారా సుధాభిషేచన పరంధాముండు సిద్ధేశ్వరుస్
క్షేమంబర్థి దలంచి యొంచెదను భక్తిన్, సత్కృపాళుండునై
శ్రీమద్వేంకట చంద్ర భూధవు యశశ్శ్రీమంతునిస్ జేయగాస్. [1]

వనం అప్పస్వామిగారిచేత ప్రతిష్టింపబడినవాడు, తలకోన ఝురి సమీపములోనివాడు ఈశ్వరుడు.ఆతడు "శ్రీ ద్రోణ ఝురీ సరిద్ధామా ధారా సుధాభిషేచన పరంధాముండు" ఆగమజాతోదయ హేతువక్త్రుండు, అచలగ్రావ ప్రభాగౌరుడు, ఇంద్ర ఆదిత్యాదులచే అర్చితుండు, త్రిజగద్వర్యుండు, మృత్యుంజయుండు అగు పరమేశ్వరుండు దీర్ఘాయువులిడుగాక యని కర్త కోరుట చూడగలము.

ఆంధ్ర భోజుడు, మూరురాయర గండడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు అను బిరుదములను ధరించినవాడు, స్వయముగా కవియైనవాడు శ్రీకృష్ణదేవ రాయలు. అష్టదిగ్గజములను పేర కవి,పండితులను గౌరవించినవాడు –రాయలు. అరణపు కవిగ చెప్పబడిన వాడు ముక్కు తిమ్మన. ఇతడే నంది తిమ్మన. శ్రీమదుమామహేశ్వర వరప్రసాద లబ్ధ, సారస్వతాభినంది, నంది శింగయామాత్య పుత్ర , కౌశిక గోత్రపవిత్ర, సుజన విధేయుడు. తిమ్మన గారు పారిజాతాపహరణమును ఎందులకు రాసినారను కథను పక్కన పెట్టి, అసలు విషయాన్ని పరిశీలిద్దాము. రాజైన రాయలవారికి, ఆశీస్సులు అందించమని చేసిన స్తుతి.

---

పాద సూచికలు: [1] బృందావన/గంగాధర/ప్రథమా/1

ఉ. " శ్రీమదికిం బ్రియంబెసగ జేర్చిన యుయ్యెల లీల వైజయం
తీమిళి తాచ్చ కౌస్తుభము నిద్దపుగాంతి దనర్చి యాత్మ వ
క్షోమణి వేదిబొల్పెసగ జూడ్కుల పండువు సేయు వేంకట
స్వామి కృతార్థు జేయు నరసక్షితి నాథుని కృష్ణ రాయనిన్." [1]

తిమ్మన గావించినది "వేంకటస్వామిస్తుతి". చూడ్కుల పండువు సేయు వాడితడు. వేంకటపతిమెడలోగల, వైజయంతిమాల ఉయ్యెల తాళ్ళలాగ, శ్రీకౌస్తుభమణి ఉయ్యెలపీట వలె భాసించుచుండగా విశాలమైన వక్షము గల వేంకటపతి ఉరముపై ఊయలలూగుచున్న సిరిని గల, తిరుమలగిరి వాసుడు కృష్ణరాయని కృతార్థునిజేయుగాక! యని కవి ఆశీస్సు. అభ్యుదయార్థము గ్రంథాదిని ఇష్టదేవతా నుతిపురస్సరముగా కృతినాయకుని ఆశీర్వదించుట మహాకవుల సంప్రదాయములలోనొకటి. వేంకటస్వామి యనినపుడు రాయలవారికి తిరుమలనాథుడనిన బహు అభిమానము. కలియుగమునందు నాయకుడు వేంకటపతి. సర్వపాపహరుడు తిరుమలగిరివాసుడు. "సర్వ పాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే సర్వపాపదహో యస్మాత్తస్మా ద్వేంకటనామవాన్". కావ్యభర్తకు ఉత్పలమాలతో అనగా కలువపూలదండవేసి సమ్మానముచేసినట్లున్నది. ఉత్ప్రేక్షాలంకారము. అటు పిదప మహేశ్వరుని స్తుతి తిమ్మన గారు మరవలేదు. నవ్వు రాజిల్లెడు మోముతో క్రొన్నెల తాలుపు, అసూయావాప్తిగల పార్వతి మౌగ్ధ్యముజూచి నవ్వుచున్నాడు. ఆచంద్రమౌళి రాయలవారికి మహైశ్వర్యములు సంధించుగాక యని కవి అకాంక్ష.

<u>ప్రత్యేక ప్రస్తావన</u> : -

అవతారిక యని ఒక ప్రత్యేక అంశంగ పేర్కొనబడిన కంద పద్యము ఒకటి శ్రీ కుప్పుస్వామయ్య గారి 'పరిమళోల్లాస వ్యాఖ్యాసహితము, ద్రావిడ విశ్వవిద్యాలయము కుప్పం వారు ప్రకటించిన గ్రంథములో మాత్రమే కలదు. ఆ పద్యమిది.

కం. ద్విరద వదను శరజుని నజ హరిహరవాణీ రమాంబికాదిత్యుల, మ
ద్గురువుల నిరతము కొలిచెద పరమ సుఖావాప్తిఁ గోరి భావమునందున్.

---

పాద సూచికలు : - [1] {నంది తిమ్మన/పారిజాత/ ప్రథమాశ్వా/ 1}

పై పద్యమందు పలువురు దేవతలను, "పరమసుఖావాప్తి" కై భావములోకోరడం కలదు. ఇచట ద్విరదుని [గణపతిని], కుమారస్వామిని, బ్రహ్మను, హరిని, హరుని, వాణీ, లక్ష్మి, అంబిక లతో పాటు ఆదిత్యుని, గురువులను స్తుతించుట చూడగలము.బహుశః వ్యాఖ్యాత తన వ్యాఖ్యాకార్యము అవిఘ్నముగా సాగుటకొరకై ఈ దేవతల స్తుతిని జేసినారనవచ్చును}

తదుపరి రాయలవారికి దీర్ఘాయువును వారణ వక్త్రుడు కృపతో ఇచ్చుగాక యని ఆశించినారు కవిగారు. హరుని, వినాయకుని రెండు మత్తేభములలో నుతించుట చూడగా ఒకటి గజముఖుని ప్రసన్నము చేసికొనుటకొరకు, మరొకటి గజచర్మాంబరుని ప్రీతిగా అనుకొనవచ్చును. అటు తర్వాత కలుముల లలన యగు సిరిని, పలుకుల చెలియైన శారదను నుతించి వారు కృపతోజూచి, ప్రతిభోన్నతుని జేయుదురని క్రమంగా భావించినారు.

'రాయవేశ్యా భుజంగ" బిరుదు గల మంత్రి పెద్దన సింగనామాత్యవరుడు, మృదు మధుర చిత్ర విస్తర కవితా విలాస వాగీశ్వరులగు కవీశ్వరులును, పతంజలి కణాదాక్షచణ పక్షిలాది శాస్త్ర సిద్ధాంత కమలవన హంసులగు విద్వాంసులును, భరత మతంగా దత్తిల కోహలాంజనేయ ప్రణీత సంగీత విద్యా రహస్య విజ్ఞాన వైజ్ఞానిక స్వాంతులగు కళావంతులును శక్తిత్రయ చతురుపాయ షాడ్గుణ్య ప్రయోగ యోగ్య విచారులగు రాయబారులును, నిఖిల పురాణేతిహాస సంహితా తాత్పర్య పర్యాలోచనా దురంధర దిషణా సముత్సాహంబగు పౌరాణిక సమూహంబునుం పరివేష్టింపంగొలువుండి సకల విద్యా పారీణుండు సరస సాహిత్య గోష్ఠీ వినోద ప్రసంగంబున, శ్రీనాథ మహాకవిని ఆహ్వానించి గంభీర వాక్కులతో ఇట్లనినాడట! అంతకు మునుపే శ్రీనాథుడు తనతొలి పద్యములోనే కృతిభర్తకు ఆశీస్సులను అపేక్షించినాడు.

శా. "శ్రీరామాకుచమండలీ మృగమద శ్రీగంధ సంవాసిత
స్ఫారోదార భుజాంతరుండు, ధరణీ సంశ్లేష సంభావనా
పారీణుండు కృతార్థుజేయు కరుణాపాథోధి పద్మాక్షుడిం
పారన్ మామిడి పెద్దమంత్రిసుతు సింగామాత్య చూడామణిన్ " [1]

-----------------------------------------------------------

పాద సూచికలు :- [1] శ్రీనాథుడు /శృంగారనైషధ /ప్రథమా/1

కవిసార్వభౌముడగు శ్రీనాథునికి మృగమద వాసనలు వదలవు.

కడపటి దినములలో కూడా 'రంభగూడె తెనుంగురాయ రాహుత్తుండు, కస్తూరికే రాజు ప్రస్తుతింతు? అన్న వాడు శ్రీనాథుడు. మరి ఆయన "నిండు జవ్వనంబునయందు హర్ష నైషధకావ్యమాంధ్ర భాష" లో సంతరించినపుడు, ధరణీ సంశ్లేష సంభావనా పారీణుడగు శ్రీపతిని, తన కృతిపతి యగు సింగనామాత్యుని కృతార్థుని జేయవలెనని కోరినాడు. ఈ శ్రీనాథుడే, హరవిలాసమును అవచి దేవయ తిప్పయకు అంకితము నొసగినపుడు ఆ కృతిపతిని కృతార్థుని జేయవలెనని అనుచూ ఈరీతిగా పద్యమల్లినాడు.

ఉ. "శ్రీమహిళా పయోధర హరిన్మణి హారము హస్తి భూధర
స్వామి, పయోజసంభవుని జన్నముకాచిన వేల్పు దేవతా
గ్రామణి, కంచి శ్రీ వరదరాజు మనోహర పుణ్యకోటి వీ
థీమణి మండితుండవచి దేవయ తిప్పు కృతార్థుజేయుతన్" [1]

కృతిపతిని ఆశీర్వదిస్తూ హరివంశము నందు ఎఱ్ఱనగారు, అన్నమభూవిభునకు, ఉత్తమ శ్లోకుడై న హరి, సుస్థిర ఐశ్వర్యములిచ్చుగాక! యని చెప్పడము చూడగలము.

శా. "శ్రీకింబ్రేమపదంబు భూమికి నతి స్నిగ్ధుండు దుగ్ధాబ్ధి శ
య్యాకేళీరతుడాది వేధకుగృహం బై యొప్పు నాభిస్థనా
ళీకంబుంగల వేల్పు లోకములబాలింపం బ్రభుండుత్తమ
శ్లోకుం డన్నమ భూవిభునకిచ్చుస్ సుస్థిరైశ్వర్యముల్" [2]

*<u>నమస్కార రూపములోనున్న కొన్ని పద్యములు:-</u>*

ఇంతక మునుపు కొన్ని కృతిపతులకు శుభము/మేలు చేకూర్చమని కవులు కావించిన స్తుతుల రూపములోని పద్యములను చూచినాము. కవులు తమ కావ్యములలో సభక్తి పూర్వకముగా తాము తమ ఇష్ట దైవతములను స్తుతించిన పద్యములను కొన్ని చూచెదము.

దేశీయ పదములు, తెనుగులు, సంస్కృతులు, సంధులు, ప్రాజ్ఞుల శబ్ద వితతి, శయ్యలు రీతులు, ప్రబంధంబులు,సమాసంబులు, అర్థదృష్టి, భావార్థములు, కావ్యపరిపాకములు

---

పాద సూచికలు : [1] [హరవి/శ్రీనా/అవతా/1] [2] [ఎఱ్ఱన/హరి/పూర్వ/ప్ర/1 ]

రసభావ చమత్కృతులు, పలుకు సరవి, బహు వర్ణములును, విభక్తులు, ధాతు లక్షణాలను, అలంకార ఛందఃవిశేషాదులు, కావ్య సంపద క్రియలు నిఘంటువుల పరిచయము మున్నగు నవి లేనిదాననైనను,శ్రీకంఠమల్లేశు వరముచేత, మరియు, తానూ నమ్మిన రాముడు సెప్పించగా,'ఇహపరసాధనముగా' చెప్పినది రామాయణము – ఆతుకూరి మొల్ల.

కనుకనే కందువ మాటలతో, సామెతలనందముగా కూర్చినది తెనుగునకు పొందైనది, రుచియైనది,వీనుల విందుగూర్చుచు, విబుధుల మదికి కనిపించు రీతిలో రామాయణ కావ్యమును కూర్చినది – మొల్ల.

ఆమె తన మొదటి పద్యమును భక్త తతిని రాముడు ఎల్లకాలము ప్రోచుననుచు ఆ రామునికి ఉత్పలమాలతో సత్కారముచేసినట్లు అంజలి కావించినది.

ఉ. "శ్రీమహిమాభిరాముడు వశిష్ఠమహాముని పూజితుండు సు
త్రామ వధూ కళాభరణ రక్షకుడాశ్రితపోషకుండు దూ
ర్వామల సన్నిభాంగుడుమహాగుణశాలి దయాపరుండు శ్రీ
రాముడు ప్రాచు భక్తతతి రంజిలు నట్లుగ నెల్లకాలమున్" (1)

"శ్రీమదుత్తర రామాయణము" ను, మునుపు విష్ణుమాయా విలాస యక్షగానంబు మాకే సమర్పణముగాజేసి తదియాదిగా మేమునీ సుధానుసారి వాక్కులజొక్కి యున్నార మనఘ! యని" స్వప్నములో జగన్మోహన రూపులో శ్రీకృష్ణుడు కనిపించినాడు. ఆయన కోరికమేరకు, "శ్రీ మదనగోపాల కృపాలలిత కటాక్షవీక్షాసమాసాదిత చతుర్విధానవద్య కవిత్వ విద్యావధానాధునాతన భోజరాజ సకల విద్వజ్జనాభివర్ణితోదీర వితీర్ణి వైభవాధఃకృత రాజరాజ రాజయోగ సామ్రాజ్యలక్ష్మీవిలాస ధురంధర ధరాధిప సభాంతర స్తవనీయ నయకళా యుగంధరబంధుర మనీషావిశేషమంధాన వసుంధరాధరశోభితాగణిత గణితశాస్త్ర రత్నాకర వినయాదిక గుణరత్నాకర కంకంటి వంశ పయః పారావార పరిపూర్ణ సుధాకరాప్పయామాత్య సంక్రందన నందన విజ్ఞానవిభవ విజిత సనందనుడైన,

---

పాద సూచికలు : -[1] [మొల్ల/ రామా/అవతా/1]

'కంకంటిపాపరాజు' గారు ఇష్టదేవతా ప్రార్థనతో తన కావ్యమునిట్లు ఆరంభించినారు.

శా. శ్రీరాధాధరబింబముస్ దొరయు రాచిల్కస్ నిజోరస్స్థలీ
రారాజన్మనణి కాంతి రాపిలిచి తద్రాకేందు బింబాననా
స్మేరాంకూరముచే కృతార్థుడగుచుంజెల్వొందు గోపాంగనా
జారగ్రామణి కృష్ణు డీవుత మహైశ్వర్యంబు మాకెప్పుడుస్" [1]

కృతులకు భర్తలుగా పోషకులను/రాజులను స్వీకరించినపుడు ఆ కృతిభర్తలకు శుభాలను, ఇతర మంగళములను ఇమ్మని కవులు ప్రార్థన చేసినారు. అట్లు కాని సందర్భములలో తమకు తమవారికి, లోకమునకు/జనతకు ఆశీస్సులను/ మంగళమును/మోక్షమును కాంక్షించినట్లుండుట సాధారణముగా చూడగలము. మోక్షమపేక్షిస్తూ, కైవల్య పదవిని చేరుటకు నమస్కృతి రూప పద్యములలో విషయముండుట మనకు స్పష్టమగును.

రాయల వారి కొలువులోనుండిననూ, భవపరాఙ్ముఖుడుగ ప్రసిద్ధి పొందినవాడు 'ధూర్జటి'. ఆయన తన 'శ్రీ కాళహస్తి మాహాత్మ్యము'ను పరమేశునికే అంకితమొసగినాడు. అతడు తన గురించి చెప్పినది చాల తక్కువ. ఆయన 'శ్రీమత్కాళహస్తీశ్వర చరణ కమల సేవా పరాయణ సింగమరమానారాయణ జక్కయ నారాయణతనూభవ భవపరాఙ్ముఖ ధూర్జటి' యని పేర్కొనినాడు.

శా. " శ్రీవిద్యానిధియై మహామహిమచే చెన్నై వసిష్ఠాజలూ
తా వాతాశాన సామజాటవిక గోత్రాదేవ నత్కీర రా
జీవాక్షీయుగా యాదవాధిపులకున్శ్రేయస్కరంబైన యా
ర్యావామాంగము దివ్యలిఙ్గము మదీయాభీష్టము ల్సల్పెడుస్" [2]

ఇచట ఈశ్వరుడు శ్రీవిద్యానిధి, వాయులింగేశ్వరుడు.శ్రేయస్కరుడు. దివ్యుడు. ఆర్యను వామభాగమున కలవాడు. మునులను, వారితో పాటు చెదపురుగును, పామును, హస్తిని, ఆటవికుడైన తిన్నని శ్రేయమును కూర్చినవాడు. స్వర్ణముఖినది తీర వాసుడు. స్వతహాగా శ్రీకృష్ణదేవరాయలు వైష్ణవాభిమాని. పలు పర్యాయాలు తిరుమల నాథుని దర్శనమునకు విచ్చేసినాడు. ఆలయమునకు పలు దానములు గావించినాడు. నేటికీ తన దేవేరులతో

---

పాద సూచికలు : - [1] ఉత్తర రామ/పాపరాజు/పీ /1. [2] శ్రీకాళ/ధూర్జటి/ప్రథ /1

పాటు, "స్వామి సన్నిధానమే శరణమటంచు" ముకుళిత హస్తాలతో అంజలి ఘటిస్తూ భక్తితో నిల్చున్న [విగ్రహ రూపాన] విషయాన్ని నేడు కూడా తిరుమల ఆలయమునందు చూడగలము. విష్ణువునకు వెంకటపతికిని అభేదము చెప్పబడినది. "కలౌ వేంకట నాయకః." యని పెద్దలన్నారు కదా! ఆంధ్రభాష లో గల ఐదు కావ్యములలో ప్రౌఢ కావ్యమైన ఆముక్తమాల్యద కావ్య నిర్మాత, సాహితీ సమరాంగణ సార్వభౌముడు,మూరు రాయర గండడు, ఆంధ్రభోజుడు అయిన వాడు శ్రీకృష్ణదేవరాయలు. వారు తమ ప్రబంధమందలి అవతారికలో తమ రాజకీయ చరిత్ర తామె వ్రాసి పెట్టు కొన్నటుల, తర్వాతి వారల ఊహలకు అనవసర అవకాశమునివ్వని రీతిలో ఉండుట ఒక విశేషము. చరిత గతిని తమకు ఇష్టమైన రీతిలో కొందరు వ్రాయటము, వ్యాఖ్యానించటం కలదు. అందులకు కారణములు వారి వారి, విశ్లేషణలు, అనుభవాలు, లభించిన సాక్ష్యాలు, ప్రత్యక్ష పరోక్ష ప్రమాణాలు, అని చెప్పవచ్చు. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని పేర్కొనిన కొందరిలో వీరొకరు. ఆముక్త మాల్యదలో వెంకటపతిని కొలిచినాడు. తదుపరి చేసిన వైష్ణవపర పలు పద్యములను కూడ కలవు. అవతారికలోకావించిన మొదటి పద్యములో సిరితో కలసి యున్న తిరులగిరివాసుని శోభనిట్లు విశదపరచినారు.

ఉ. " శ్రీకమనీయ హార మణి జెన్నుగ తానును కౌస్తుభంబునం
డా కమలా వధూటియు నుదారత దోప పరస్పరాత్మలం
దాకలితంబు లైన తమ యాకృతు లచ్చతబైకి దోచి య
స్తోకత నందు దోచెనన శోభిలు వేంకటభర్త గొల్చెదన్' [1]

భక్తులైన కవివరులు కొందరు

కం. 'భగవంతుని సద్గుణములు
పొగడు వివేకంబె తమకపూర్వైశ్వర్యం
బగుట, నరస్తుతి సేయరు
జగతిన్ సత్కవులు తుచ్ఛసంపదకొఱకై' [2]

యని అనడం అక్కడక్కడ చూడగలము. "నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా? నిజముగా పల్కుము ఓ మనసా!" అని మనసును ప్రశ్నించినాడు త్యాగరాజు.

---

పాద సూచికలు :- [1] ఆముక్త/శ్రీకృష్ణదేవ/అవతా/1 [2] అనిరుద్ధ/అవతా/17 క.అబ్బయ

తెలుగువారి భాగ్యమైన పోతన, వర గోవింద కథా సుధారస మహావర్షోరుధారా పరంపరల తో కూడిన భాగవతమును తెనుగులో కూర్చుచూ, 'కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ' దీనముగా కనిపించిన భారతిని ఓదార్చి 'అమ్మనుజేశ్వరాధములకు' అమ్మనునిన్నన్నాడు.

అటువంటి మహనీయులకోవలోని వాడు కనుపర్తి అబ్బయామాత్యుడు. ఆతడు ప్రస్తుతము మంగళగిరి పానకాలనరసిహుడుగ కొలువబడుచున్నదేవుని కీర్తించినాడు. అందులో ఆ మంగళాచల స్వామి'ఇచ్చు మా కోరికల్' అంటూ స్థిర స్వరముతో చెప్పడం చూడ గలం.

శా. " శ్రీనిత్యోత్సవ మందిరంబులగు లక్ష్మీ మోహనాపాంగ వీ
క్షా నీలోత్పల మాలికావళులు, శృంగారంబుగానంగపూ
జానైపథ్య మెలర్పతత్తనులతాసంశ్లిష్ట కేళిం బ్రియా
సూనుండై తగు, మంగళాచల నృసింహుండిచ్చు కోరికల్" [1]

ఇదే తీరు కవులలో చేరిన మరొక కవి వరుడు 'దంతులూరి బాపకవి'. ఇతడు మదనగోపాలుని భక్తుడు. శ్రీ మదన గోపాలకృపా ప్రసాద లబ్ధ కవిత్వ చాతుర్య దంతులూరి వంశ్యవర్యధనంజయ గోత్రపవిత్ర వేంకటరాజపుత్ర సకల సుకవి గణగేయుడు, బాపక్షమానాథ నామధేయుడు. ఆతని మనోపద్మమునందువసించు నని చెప్పడం చూడగలము.

శా. ' శ్రీలక్ష్మీ జలజాక్షి యంశములచేచెల్వొందువారింబదా
ర్వేలం స్త్రీల ననేక రూపములచే శ్రీ మీఱ నుద్వాహమై
యాలోలాక్షుల నేకరూప మగు సౌహార్దంబుతో నేలుగో
పాలుండెప్డు వసించు మామకమనః పద్మాంతరాళంబునన్' [2]

పై వాటికి కొంత మినహాయింపా? అనునట్లు, "రాధికా సాంత్వనము" రచించిన రమణీమణి 'ముద్దుపళని'. ఈ కవయిత్రి 'శ్రీ చిన్నికృష్ణ కరుణాకటాక్షవీక్షణక్షణ ప్రవర్ధమానానూన శృంగార రస ప్రధాన, సంగీతసాహిత్య భరతశాస్త్రాది విద్యాపారంగత, శ్రీమత్తిరుమల తాతయాచార్య పాదారవింద మిళిందాయమాన మానస, చోళసింహాసనాధ్యక్ష ప్రతాపసింహ

---

పాద సూచికలు : -[1] కనుపర్తి అబ్బయ /అనిరుద్ధ చరిత్రము /అవ/1.
[2] మూర్తి త్రయో/దంతులూరి బాపకవి /ప్రథ /1

మహారాజ బహుకృతానేక చామీకరాంబరాభరణ ముత్యాలు గర్భశుక్తి ముక్తాయమాన'. ముత్యాలు అను అతని కూతురు మన రచయిత్రి. సుబ్రహ్మణ్య స్వామి భక్తుడైన ముత్యాలు తన పెద్దకూతురికి 'పళని' యని పేరుపెట్టినాడు. ముద్దు అనునది పిదప చేర్చబడినది. 'ముత్తు' అనునది

దక్షిణాదిలో పిల్లలకు ఆప్యాయసూచకముగా చేర్చడం ఒక సర్వసామాన్య సంప్రదాయమని చెప్పడము గలదు. 'ముత్తు' పిదప 'ముద్దు' గా కావడానికి తమిళభాష కారణమనవచ్చు. ముత్యాలు తండ్రి నామము. అతనిని ముత్తు అని కూడ పిలుచుట కూడ జరిగి యుండి యుండవచ్చు.ముత్తు కూతురు కనుక ముత్తుపళని. కాల క్రమములో ముద్దుపళని గా మార్పు చెందియుండును. తమిళనాట తండ్రి పేరు పిల్లల ఇంటిపేరుగా చెప్పడమీనాటికీ గలదు. ముద్దుకొలుపు రీతిలో ఈమెయుండి యుండిన కారణముగ ముద్దుపళని అయి యుండవచ్చు. ఇది భాషకు సంబంధము.

ఈ కవయిత్రి చిన్నికృష్ణుని ఆరాధించినది. రాజాస్థా నమందు ఆదరింపబడిననూ, తన గ్రంథమును ఆ చిన్ని కృష్ణునకే అంకితము జేయడము విశేషము. తన మనసుకు నచ్చినట్లు చేయడము తన అభిమానానికి గుర్తు అనవచ్చు. తన అభీష్ట సిద్ధికి ముద్దుపళని కృపాళుడైన, చిన్నికృష్ణుని కొల్చినది. ఆతని కంఠమును వైజయంతికి తోడుగా ఉత్పలమాలను అలంకరిచినది. నాయకరాజుల యనంతరము ఆ ప్రాంతమునేలిన మహారాష్ట్ర ప్రభువులు, ఆంధ్రనాయకుల అడుగుజాడలలో, 'ఆంధ్ర శారద' నాదరించి, ఆరాధించినారు. ఆ రోజులలో మాన్యతనందిన మహిళా కవయిత్రి ముద్దుపళని.

ఉ. 'శ్రీల జెలంగు రాధికను 'చెల్వరో! నిన్నిల రూప రేఖలన్
బోలుదురే పడంతు? లన, 'మోహపురాలిని నిప్పుడెన్నెదో
హాళిని నన్నుగూర్చి? యని యల్గిన యచ్చెలిగౌగిలించు గో
పాలుని, చిన్ని కృష్ణుని, కృపాళునిగొల్తు నభీష్ట సిద్ధికై' [1]

శ్రీ సీతారామ చరణ సేవా ప్రభావ సంపాదిత కవితా విచిత్ర కాశ్యప గోత్ర పవిత్ర శ్రీమత్పండి పెద్ది కృష్ణస్వామి రచనగా ఆశ్వాసాంత గద్యములోయుండి, చిత్రకవి సింగరాచార్య ప్రణీతముగ కూడ చెప్పబడినది 'బిల్హణీయము'. రచయిత ఎవరు? అనువిషయమును పక్కనపెట్టి, కావ్యమును

--------------------పాద సూచికలు : - [1] రాధికాస్వాంతనము /ముద్దుపళని /అవ/1.

కం. 'హరితనయ హృదయసారస[1]

హరికి, మహాసూనృత జితహరి, కతితేజః

పరిహసిత హరికి, భవగజ

హరికి, సదాపాదపంకజానతహరికి'నంకితమైన గ్రంథమిది.

తనకవితకు సంతతము సత్ప్రకాశము కలుగగా ప్రవిమలమతితో కృతికర్త చేసిన స్తుతి.

శా. ' శ్రీరామావనిజా నిజాయత భుజా శృంగార శాఖా మిళ

త్సారాకార లతా స్తన స్తబక భాస్వద్దంత వాసః కిసా

లారాళాలక భృంగ రంగదఖిలాం గాంచత్ప్రసూ నోత్కర

శ్రీ రామాకృతి కల్పకంబు, మము రక్షించుస్ బుధానందమై' [2]

శా. "శ్రీ రామా పరమూర్తి! ముక్తి తరుణీ సీమచింతామణీ!

మీరమ్యాకృతిసెంచి నిత్యము రసోన్మేషమ్మునస్ భావనా

స్వైరత్వమ్మున నాకుతోచు సరణిస్ వర్ణించి లీలామయ

స్వారస్యంబుల వెల్వరించుటకునై సంధింతు కావ్యాంజలిస్" [3]

శ్రీరామకృష్ణపరమహంసను తొలుత స్తుతించి, పిదప నన్నయ కవితా స్ఫూర్తిని స్మరించినారు.

శా. శ్రీవాణీ గిరిజా సమన్వయ రసశ్రీ లోక సాలోక్యముస్

శ్రీ వాగీశ్వర విష్ణు సోమధరమూర్తి స్ఫూర్తి సాయుజ్యముస్

భావాతీత విచారణాంచిత శుభ ప్రావీణ్యముంజూపుచుస్

నా వాక్కుస్ మధుర మ్మొనర్చుత! అనంతా! రామకృష్ణ ప్రభూ! [4]

అని నవీన పద్యకవులలోని వారైన డా. మల్లెల గురవయ్య తమ శ్రీరామకృష్ణకర్ణామృతములో నమస్కార రూపాన కోరినారు. వారే తమ లక్ష్యమును ఇట్లు చెప్పినారు.

---

పాద సూచికలు : [1] బిల్హణీ/కృష్ణస్వా/అవ/14 ,[2] బిల్హణీ/కృష్ణస్వా/అవ/1.

[3][4]శ్రీ రామకృష్ణకర్ణామృ /మల్లెలగురవయ్య;అభిముఖం 1,2

{ ముమ్మూర్తుల ఏకత్వము, వారి భార్యల సమన్వయత్వము, రస పారమ్యముగల శ్రీ రామకృష్ణ పరమహంస మనస్తత్వములో సంవిలీనము, నన్నయ కావ్యారంభమువలె ప్రసన్న మధుర గంభీర భావపరంపరలతో అనంతమైన శ్రీరామకృష్ణ తత్త్వమును అవలోకించి అందు విలీనము కావలెనని- రచయిత ఆశంస}

మరొక నవీన పద్యకవి విద్వాన్ శ్రీ ఆలూరి కృష్ణమూర్తి. వీరు 'శ్రీనందనంద నోపాఖ్యానము' అందముగా కందములలో కూర్చినారు.

కం 'శ్రీయును యశంబు ముక్తియు [1]
శ్రేయము కరుణా మతి కడు చెన్నగు నటులన్
పాయక గాచెడి వేంకట
నాయకునిం గొల్తు భక్తి ననుదరి చేర్చన్' అని మరియూ,

కం. శ్రీకైవల్య పదంబున
కై కైమోడ్చినుతియింతు గరుడధ్వజు శ్రీ
వైకుంఠు విష్ణు కృష్ణున్
శ్రీకాంతున్ వేంకటపతి చిన్మయ రూపున్. [2]

ఇందులో తొలుత కవిగారు శ్రీని, యశస్సును, ముక్తిని శ్రేయస్సును, ఆశించినారు. వెంకటపతిని దరిజేర్చమని అడిగినారు. కృష్ణుని తలచేసరికి నందాంగనా డింభకుడు సాక్షాత్కారించినాడేమో, లేదా పోతన గుర్తుకు వచ్చినాడో 'కైవల్యమునకై' కైమోడ్చినాడు. ఈ రీతిగా పరిశీలించినపుడు ఆశీస్సు రూపములలోని పద్యములు, నమస్కార రూపములోని పద్యములు వివిధ విషయములను మనకు సాక్షాత్కరింపచేయుట గమనించగలము.

ఒకటి - కవులు తమ కృతిభర్తల ఆయురారోగ్యములను, క్షేమములను, కోరుతూ తమకిష్టమైన దేవతలను ప్రార్థించడము.

మరొకటి -కవులు తమ అభీష్ట సిద్ధికై, లక్ష్య సిద్ధికై తమకు నచ్చిన రీతిలో నుతులర్పించడము.

---

పాద సూచికలు : [1][2]శ్రీ నందనందనోపాఖ్యానము/ఆలూరుకృష్ణమూర్తి.తొలి రెండు పద్యాలు.

కవులు తమకావ్యములలో వారి కావ్యవస్తువునెట్లు ప్రతిపాదించినారో కొంత పరిశీలించెదము. అసలు వస్తవు అనగా ఏమి? వస్తువు అను పదమునకు నిఘంటువులిచ్చిన / ప్రతిపాదించిన అర్థములు ఇట్లు చూడగలము. :- పదార్థము, ఒండము, దినుసు. తమకావ్యములలోని విషయమును కవులు వివరించిన తీరును, పరిశీలించటమే మన ప్రస్తుత ప్రయత్నము.

2 . 4 *వస్తునిర్దేశ పద్యాలు :*- వస్తు నిర్దేశమనగా - కావ్యమునందు కవి ఏమి చెప్పదలచెనో సంక్షిప్తముగా ప్రస్తావన చేయుటయే 'వస్తునిర్దేశము'. ఆయాకావ్యాలలో కవులు 'వస్తునిర్దేశము' ఎట్లున్నదో / ఎట్లు చేసినారో ఆ ప్రణాళికను కొంత చూచెదము.

కవిరాజశిఖామణి యగు 'నన్నెచోడుడు' తన 'కుమారసంభవము' లో చెప్పిన ప్రణాళిక.

"పరమ భక్తియుక్తి నావర్జిత హృదయుండనై సకలభువన భావనావతార కారణుండైన పరమేశ్వరు నవతారంబగుటయు, తదంశావతారంబుగా వ్యావర్ణించి నా చెప్పంబూనిన, 'దివ్యకథా' సూత్రం బెట్టిదనిన" {1} –

అని వచనములో ప్రవచనముజేసి, మహా స్రగ్ధర వృత్తములో మొత్తము వృత్తాంతం ప్రస్తావించిన ఘనుడు, అద్వితీయుడు కవిరాజు – 'నన్నెచోడుడు'

మహాస్రగ్ధర:

"సతిజన్మంబున్ గణాధీశ్వరుజననము దక్షక్రతుధ్వంసముం బా
ర్వతి జన్మంబున్ భవోగ్రవ్రత చరితయు దేవద్విషత్ క్షోభమున్ శ్రీ
సుతసంహారమ్ము భూభృత్సుతతపము నుమాసుందరోద్వాహమున్ ద
ద్రతిభోగంబుం గుమారోదయము నతడనిందారకుంబో రగెల్వన్" [2] అనంబరగు

సకలావయవములం బరిపూర్ణంబైన దివ్యకావ్యాంగనాసృష్టికర్తగ [3 ] నిలచినాడు. పండ్రెండు ఆశ్వాసములలో నిర్మితమైనది కుమారసంభవము. తన ప్రబంధములో కొన్ని లక్షణములను కవి చెప్పడము చూడవచ్చును. అందులో కొన్ని పరికింతము. తొలుత –

కం. 'ముదమున సత్కవి కావ్యము నదరున విలుకాని పట్టి నామమును బరహృ
ద్భదమై తలయూపింపని యది, కావ్యమే? మరియు పట్టినదియున్ శరమే? [4]

---

పాద సూచికలు : - [1] నన్నెచోడుడు/కుమారసంభ /ప్రథమా/ 67.

[2,3,4] నన్నెచోడుడు/కుమారసంభ /ప్రథమా/ 68,69,41.

కవితను విని తలయూచును రసజ్ఞుడు. అది ఆతని హృదయమును తాకును. అట్లే శరప్రయోగము చేయు విలుకాడు ఎదుటివారి హృదయమును బాణప్రయోగముతోచీల్చ వలెను. అట్లు కానినాడు కవి, విలుకాడు ఇరువురూ 'అసమర్థులే' నట. అనగా మదిని తాకు రీతిగా కవికావ్య నిర్మాణము చేయవలెను. కవి 'కవిత' అంతర్గతమైన హృదయమును స్పృశించునటుల ఉండవలెను. కుశలుడైన విలుకాని శరము లక్ష్యమైన శతృవు [బాహ్యమైన] గుండెను భేదించవలెను. అట్లు జరగనిచో ఆ 'కవిత' – 'కవితే' కాదు మఱియూ ఆ 'శరము' – 'శరమే' కాదు. నన్నె చోడుడు కృతులకు వలసిన మరికొన్ని లక్షణములను పేర్కొనుచు, 64 కళల పరిచయమును, అష్టాదశవర్ణనలు –

'వనజలకేళీ రవిశశి
తనయోదయమంత్ర గతి రతక్షితిపరణాం
బునిధి మధు ఋతుపురోద్యా
హనగ విరహదూత్య వర్ణనాష్టాదశముస్' [1]

నవరసములు , శ్లేష ప్రసాదాది దశ ప్రాణంబులు, 36 అలంకారంబులు, మున్నగునవి సమకూర్చి కావ్యమును నిర్మించవలెను. అంతియే కాక,

'పదబంధంబుల నగ్గలించి బుధశబ్దబ్రాజియై సద్గుణా
స్పదమై దుష్కవిహృత్సరోజవనముల్ భంజింపుచుస్ భూరిస
మ్మద లీలస్ విలసిల్లి సత్కృతి జగన్మాన్య ప్రభావంబునస్
మదనాగంబు నుబోలె గ్రాల వలదా మాఱెందు లేకున్నతిస్[2]

చక్కని కృతి జగములో గౌరవము పొందవలెనని ఆయన ఆలోచన. ఇచట కావ్యము గంభీరమైన 'మదగజముతో' పోల్చటంగలదు. 'గజగమనము' నకు సరిగా 'కావ్య (సుందరి)' నడక యుండవలెనని కవి ఆశయము. ఆ శశి తారకంబులుండునంతవరకు సప్తసంతానములనునవి యుండును. వీటిద్వారా ఆ నిర్మాణములు చేసినవారి కీర్తికాయము యుండును. మందికి చేసిన ఉపయోగములు చిరస్మరణీయములగుట మనమునూ చూచు చున్నాము.

---

పాద సూచికలు : - [1] [2 ]నన్నెచోడుడు . కుమార సంభవ /ప్రథమ/ 44,40

ఉభయ గోదావరి జిల్లాల కర్షకులు నేటికినీ 'కాటన్' దొరకు క్షైమోడ్పులు చేయటం కలదుగదా. "ఎక్కడివాడో యిక్కడి గోదావరికి ఆనకట్ట కట్టుటే ఆయన చేసిన పని.

"తెలుగు కావ్యావతారికలయందు కథారంభమునకు ముందు 'షష్ఠ్యంతము' లకు పిమ్మట కథావతారిక ఒక వచనములోగాని, పద్యములోగాని యుండుట సంప్రదాయము. ప్రాచీన సంస్కృత కావ్యములన్నియు వస్తు నిర్దేశముతో ప్రారంభింపబడినవి. పంపాది కన్నడ కవులు తమ కావ్యాంతములయందు కథాసూత్ర ప్రణాళికను తెల్పినారు. తెలుగు కవులు మాత్రము కావ్యాదిని కథావతారికను తెల్పినారు. పాఠకుల చిత్తవృత్తి కావ్య కథకు సన్నిహితమగునట్లు చేయుటకు కావ్యావతారికలో కవి కథా సూత్రమును విరచించుట యుక్తముగదా! " [1]

ఆది కవి నన్నయ గారు తాను మొదలిడిన శ్రీమదాంధ్ర మహాభారతము నందలి పద్యమునకు పలు వ్యాఖ్యలు చేయడము గమనించవచ్చును. ఇందు కవి అనుకొనినది అదేనా? లేక వ్యాఖ్యాతలు తమకు తోచిన రీతిగా పలు వ్యాఖ్యలు చేసిరా? అనునది కొంత వరకు యోచింపవలసిన విషయము.

ఆరు ఆశ్వాసములలో కూర్చబడిన 'స్వారోచిష మనుసంభవము'
( సాధారణముగా మనుచరిత్ర యని పిలువబడును) అను ప్రబంధములో చెప్పబడిన విషయమిట్లు చూడగలము. దీనిని కూర్చినది అల్లసాని పెద్దన యని అందరికి తెలిసినదే!

కం. మనువులలో స్వారోచిష మనుసంభవ మరయ రససమంచిత కథలన్
వినవింపు, కలిధ్వంసక, మనఘ! భవచ్చతుర రచన కనుకూలంబున్ [2]

వచనం. కావున మార్కండేయ పురాణోక్త ప్రకారంబునంజెప్పుమని కర్పూర తాంబూలంబు పెట్టినం బట్టి మహా ప్రసాదంబని మోదంబున నమ్మహాప్రబంధ నిబంధనంబునకు ప్రారంభించితి, నేతత్కథా నాయక రత్నంబగు నమ్మహీనాథు వంశావతారంబెట్టిదనిన... [3]

---

పాద సూచికలు : - [1] {తెలుగు కావ్యావతారికలు /జి.నాగయ్య/పుట 227 }
[2] [3] అల్లసాని పెద్దన/మనుచరిత్ర/ప్రథమా/16, 17

వచనం. అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన స్వారోచిష మనుసంభవం బను మహాప్రబంధంబునకు, కథా క్రమంబెట్టిదనిన, జైమినిముని స్వాయంభువమును కథా శ్రవణానంతరంబున మీదనెవ్వండు మనువయ్యె నెరిగింపుమనువుడు, పక్షులు మార్కండేయుండు క్రోష్టికిం జెప్పిన ప్రకారంబున నిట్లని చెప్పం దొడంగె. [1 ]

ఇచ్చట కవి తాన చెప్పదలచిన మనువు చరిత్రను విశదీకరించినాడు. వస్తునిర్దేశము జరిగినది.

నన్నయ గారి భారతారంభము చూచెదము.

'శ్రీవాణీగిరిజా' అని నన్నయ్య గారు ఆరంభించినారు. ఇందులో త్రిమూర్తులను వారి దేవేరులను ప్రస్తావించినారు. మునుపే చెప్పినటుల ఆశీస్సు కానీ, నమస్కారము గానీ, వస్తునిర్దేశముగానీ తొలుత చేయవలెనను సంప్రదాయము ననుసరించినారు. (లాక్షణికులు ఇట్లు చెప్పినారు – "ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశోవాపి తన్ముఖమ్" ).

కొందరు ఈ తొలి పద్యరూపమైన శ్లోకమును వివరిస్తూ ఇట్లు చెప్పడము గలదు.

'నన్నయ్య ఋషి తుల్యుడు. అతని నోట త్రిమూర్తులనే పదం రావటంచేత లోకాలస్థితిని త్రిమూర్తులు కొన సాగిస్తున్నట్లు ఆంధ్రమహాభారతాన్ని కూడా త్రిమూర్తితుల్యులైన ముప్వురు కవులు రచించి పూర్తి చేస్తారనే సూచన అప్రయత్నంగా కలిగిందని కొందరంటారు. 'నన్నయ' పదం నారాయణ శబ్దభవం, తిక్కన 'కవిబ్రహ్మ', ఎఱ్ఱన 'శంభుదాసుడు'. అందుచేత కవిత్రయం వారు త్రిమూర్తులవంటి వారనటం సమంజసంగానే ఉన్నది" [2]

ఈ వివరణ/వ్యాఖ్య ఎట్లున్ననూ,

బహుభాషల బహువిధముల, బహుజనములవలన వినుచు భారతబద్ధస్పృహులగు వారికి నెప్పుడు బహుయాగఫలములు పరమార్థము లభించునని భావిస్తూండడముగలదు.

---

పాద సూచికలు : [1] అల్లసాని పెద్దన/మనుచరిత్ర/ప్రథమా/ 48, [2] కవిత్రయ /భారతము /ఆదిపర్వ /తొలి పద్యం {వ్యాఖ్య పుట 2 /తితిదే ప్రచురణ.ప్రధాన సంపాదకుడు. డా. జి.వి. సుబ్రహ్మణ్యం

మరియూ,

"అమలినతారకా సముదయంబుల నెన్నను, సర్వవేదశా
స్త్రముల యశేషసారము ముదంబున పొందను బుద్ధిబాహువి
క్రమమున దుర్గమార్థజలగౌరవ భారతభారతీ సము
ద్రము తఱియంగనీదను విధాతృన కైనను నేరబోలునే" (1)

అని మహాభారతమను సముద్రపు ఆవలి తీరమును చేరుటకు సృష్టికర్త యగు బ్రహ్మకుకూడా సంపూర్ణముగ సాధ్యముకాదు. భారత కథ వినవలెనను సంకల్పమే, అత్యుత్తమ పుణ్యం చేకూర్చునని భావించడం చూడగలము.రాజరాజనరేంద్రుడు తన చంద్రవంశరాజులచరిత్రయగు భారతాన్ని విన అభీష్టము కలవాడు. అది గ్రహించినవాడు నన్నయ్య, కనుకనే, పరమ వివేక సౌరభ విభాసిత సద్గుణపుంజ వారిజోత్కర రుచిరంబులై, సకలగమ్య సుతీర్థములై మహామనోహర చరిత్ర పావన పయః పరి పూర్ణములైన సత్సభాంతర సరసీవనంబుల ముదముతో కొనియాడి, కడు వేడుకతో, నారాయణభట్టు తోడుగా నిలువగా, తెలుగు మహాభారత సంహితా రచనబంధురుడైనాడు. సారమతి యగు నన్నయ్య కవీంద్రులు మెచ్చురీతిలో, ప్రసన్నకథా కవితార్థ యుక్తి, అక్షరరమ్యత { 'అక్షతనాదము' - అని కొందరి భావము} ఆదరింపగ, నానారుచిరార్థసూక్తినిధి మున్నగు లక్షణములతో నన్నయ్యభట్టు భారత ఇతిహాసము కూర్చడము జరిగినది. తత్కథా క్రమమును గురించి చెప్పిన 'వస్తునిర్దేశము' చూద్దాము. 'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్'

అని భారతాన్ని గురించి పెద్దలు చెప్తారు. [అనగా – ఇందులో వున్నది వేరేచోట ఉండవచ్చును. ఇందులోలేనిది మరెచ్చటా ఉండదు]

వస్తు సంబంధముగా భారతములో ధర్మాలు, నీతులు, రసపాత్ర పోషణాదులకు అనువైన కావ్యలక్షణాలు, వివిధ లక్షణాలకు లక్ష్యాలు మొదలైనవి అన్నీ కలిగియున్నది. కావ్యానికి అనేక నిర్వచనాలు కలవు. వాక్యం రసాత్మకం కావ్యం అనునది అందులో ఒకటి.

---

పాద సూచికలు : [1] కవిత్రయ /భారతము /ఆదిపర్వ / పద్యము 19 {వ్యాఖ్య /తితిదే ప్రచురణ. ప్రధాన సంపాదకుడు. డా. జి.వి. సుబ్రహ్మణ్యం

వ్యాస భారతం 'శాస్త్రేతిహాసం' అనగా ఇది శాస్త్ర లక్షణాలను మరియూఇతిహాస లక్షణాలను కలిగియుండగా, కవిత్రయ భారతం "కావ్యేతిహాసం' అనగా ఇది కావ్యలక్షణములను మరియూ ఇతిహాస లక్షణములనూ సంతరించుకొనినది. నన్నయ గారు – పర్వాను క్రమణికను పేర్కొనినారు

వ. "అదియునుంబౌష్యంబు, పౌలోమం,బాదివంశావతారంబు ...............హరివంశంబు, భవిష్యత్పర్వంబు నను శతపర్వంబులు గలిగి" [1]

అని వివరించినారు. దాని ననుసరించి తర్వాతి వారలైన తిక్కన నాల్గవదైన విరాట పర్వమునుండి ఆరంభించి కడవరకు రాయగా, మధ్యలోగల ఆరణ్యపర్వశేషమును ఎఱ్ఱన పూరించడము తెలిసినదే. సంస్కృతమందలి భారతం 19 పర్వాలు, [ వంద ఉపపర్వాలు] 1,00,500 శ్లోకాలలో ఉన్నది. అది 18 పర్వాలలో [63 ఆశ్వాసాలు] 21.507 {2} పద్యగద్యాల 'చంపూ' కావ్యముగా తెలుగు భారతము సిద్ధమైనది. సంస్కృతమందలి 19 వ పర్వమును ఎఱ్ఱన, తరువాత 'హరివంశము' గ రచించినాడు. నన్నయ్య వస్తునిర్దేశమును మిగత ఇద్దరు అనుసరించినారు. తర్వాతి భారత కథకు బీజము 'ఆదిపర్వము'లోనే నాటబడినది. దుర్యోధనుడు భీముని చంపించే ప్రయత్నము, అర్జునునికి సమయుజ్జీగా కర్ణుని అంగరాజుగా చేయటము,

కణికనీతి అనుసరించుట పాండవులను ఇంద్రప్రస్థమునకు పంపుట ఇత్యాదులు.

నన్నయ్య గారు ఇంత వివరముగా వస్తునిర్దేశమును చేసి చక్కనిప్రణాలిక నిచ్చినారు. నన్నెచోడుని వస్తునిర్దేశమును ముందే చూచితిమి. ఇప్పుడు మరికొందరికవుల వస్తునిర్దేశ ప్రక్రియల విశేషములను పరిశీలింతము.

వచశ్శ్రీ రసపోషణుడగు 'శ్రీరామరాజభూషణుడు' చేసిన ఒక ప్రయోగము 'హరిశ్చంద్ర నలోపాఖ్యానము". ఇది యొక ద్వర్థి కావ్యము, అనగా సమాంతరముగా రెండు కథలను చెప్పుట. ఒకటి హరిశ్చంద్రునిది. మరొకటి నలమహారాజుది. కవులు అక్కడక్కడ అప్పుడప్పుడు ఇటువంటి కావ్యములను కూర్చుట కలదు.

---

పాద సూచికలు: - [1] కవిత్ర/ భారత/ తితిదే ప్రచుర/ప్రథమా/33, [2] అందే/పీఠి 25/37పుట

రాఘవపాండవీయము, ఆచలాత్మజాపరిణయముమొదలైనవి. ప్రస్తుతము “ఇష్ట దేవతా మనన మంగళ సమాచరణం బును సుకవి చరణ పరిచరణంబును కుకవి తృణీ కరణంబును కావించి యేను{కవి} పురాతన పుణ్యశ్లోక చక్రవర్తిచంద్ర హరిశ్చంద్ర నలకథా యుగ యుగపదనుసంధానబంధుర రసాను బంధంబగు చిత్రప్రబంధంబు నిర్మింప పూనియున్న సమయమున” ఒకనాడు స్వప్నమున వటుప్రవరుని రూపున, వాత్సల్యముతో పావని కనిపించినాడు. దుస్స్వర్శ కళంకపంకము హరిశ్చంద్ర ప్రశంస వలన తొలగును, కలిప్రపీడనము నలచక్రవర్తిని శ్లాఘించిన తొలగును వారి కీర్తనము అత్యంత ఫలప్రదము. అని పలుకగా, తదుదిత పద్ధతిని పాటించి కావ్యమునకు దాశరథిని, కృతిభర్తగ చేసి కావ్యనిర్మాణమును చేసినాడు. ఇచ్చట కథా ప్రారంభముకావించిన తీరు చూడగా - పరిపాండుర కీర్తితో పాండుసుతాగ్రజుండైన ధర్మజుడు ద్వైతవనమున యుండగ మార్కండేయుడు వచ్చినాడు. ధర్మజుడు ఆ మునికి సమ్మానము గావించి, తిరిగి, మాకు సమీహిత రాజ్య సుఖంబులు ఎన్నడు కలుగును? పూర్వము ఇట్టి సంఘటనలు చరిత్రలో సంభవించినవా? యనిప్రశ్నించినపుడు, ఆ ముని సమాధానముగా, పూర్వము హరిశ్చంద్రుడు మీకన్న మిన్నగ కష్టములనుభవించినవాడనియు, నలమహారాజు విపద్వారాశిలో మునిగియూ, పునః సంప్రాప్త సామ్రాజ్యులై సంతుష్టాత్ములైనారు, వారిరువురి కథలాకర్ణించి మనశ్శాంతిని పొందుమని చెప్పినట్లుగా, కవి కావ్య వస్తునిర్దేశమును చేసినాడు. ఇరువురి విషయములలో కొన్ని అంశములు సమానమేయైనా, శ్లేష వలన కొన్ని సందర్భములు సరిపోవును.ఇది కవి ప్రతిభ.

నవీన పద్య కవులలో కొందరు ఈ కావ్యవస్తునిర్దేశమును కావ్యమునకు మునుపే తమ లక్ష్యమిదియని చెప్పటము కలదు. “ ఇది రామ కథ కాదు. రాఘవీయము. రాఘవీయమన రఘువంశ పురుషుని లక్షణములను చర్చించునదియే కాదు. అవన్నియూ రామునిలో గూడు కట్టుకొని పుష్టి చెందినవి. ఆ గూటిలో ఉపనిషన్నాదము అనాహతమై వినబడుచున్నది. అది దేశ కాల పరిస్థితులను అతిక్రమించును. అచట ద్వంద్వము కరగిపోవును. భారతీయ సంస్కృతి ఉపనిషత్తులలో తుది ముట్టినదనవచ్చును. ఉపనిషత్తులు ద్వంద్వాతీత స్థితిని ప్రభావితమొనర్చును.”సర్వం ఖల్విదం బ్రహ్మ” మని ఒక ఉపనిషత్తు తెలుపగా, మరొక్కటి “ఏకమేవా అద్వితీయం బ్రహ్మ” మని ఉద్ఘాటించుచున్నది. పరస్పర విరుద్ధంబులుగా తోచు ఈ బ్రహ్మ తత్త్వమును

గూర్చి అనాదిగా మహర్షులనుండి అర్వాచీనులగు ఆచార్య త్రయము, నేటి శాస్త్రజ్ఞులు నిరంతరము చింతించు చున్నారు. పరస్పర విరుద్ధ భావములు, వర్ణ, వర్గరాహిత్యములేర్పడుచున్న యీ కాలమునకు ఉపనిషత్తులే ధ్యేయము. ఆ సారమే ఈ రాఘవము. అని **ఆనందవల్లి** (ఉపనిషద్రాఘవము) యను తమ [నిర్వచన] కావ్యములో **ఆచార్య డా. బాడాల రామయ్య** గారు పేర్కొవటం కలదు. ఇచట **వస్తు నిర్దేశము** స్పష్టముగ చెప్ప బడినదని అనవచ్చు.

"**అచలాత్మజా పరిణయము**" అనునది మరొక ద్వ్యర్థి కావ్యము. భూపుత్రి సీత. భూధరతనయ పార్వతి. ఇరువురికి 'అచలజ' పదము వర్తిస్తుంది.

అచల =భూమి. అచలము=కొండ. ఒకే గ్రంథము. రెండు కథలు. పద్యమును చదువునపుడు దానిలోని పదము యొక్క విరుపును గ్రహించినచో రెండు కథలను తెలిసికొనగలము. దీని కర్త 'సర్వతంత్ర స్వతంత్ర, సకల భాషావిశేష కవితా ధురంధర, ప్రతిదిన ప్రబంధ పరమేశ్వర , శ్లేష యమక చక్రవర్తి బిరుదాంక తిరుమల బుక్కపట్టణ శ్రీనివాస తాతాచార్య తనయ, శ్రీమదణ్ణయాచార్య దీక్షిత సుత, పితృవ్య శ్రీనివాసార్య కృపా కటాక్ష లబ్ధ సకల పాండిత్య, తర్కాలంకార వాగీశ్వర బిరుదాంక **వెంకటాచార్యులు**. మూడు ఆశ్వాసముల ద్వ్యర్థి ప్రబంధము. పీఠికలో వివరాలు లేవు.'{'శ్రీరమణీ మణీ సతత' మని ఒక పద్యము కలదు. అది కుండలీకరణములలో నున్నది.కనుక ఈ పద్య కర్తృత్వము సందేహాస్పదము}. షష్ఠ్యంతములు పది కలవు. వీటిని పురస్కరించుకొని విష్ణుపరముగా చెప్పబడిన కావ్యమనగలము. ద్వితీయ, తృతీయాశ్వాసమల ఆరంభమందలి పద్యములను అనుసరించి వేంకటపతికి సమర్పించినట్లు చెప్పవచ్చును. అనుప్రాసములు, యమకములు శ్లేషలు కొల్లలుగా కనిపించును. పాండిత్య పటిమ ప్రకాశించు చున్నది. కవి ప్రతిభకు ఒక ఉదాహరణ. శబ్దముపై గల యధికారము. "అంగనయుంగనుంగొనె వనాంగణ సంగిలవంగలుంగ నారంగకుడుంగ శృంగశతరంగతరంగిత ఖాంతరంగణానంగ తురంగ పుంగవ విహంగమ భృంగకుళింగ కాంగనాభంగరవ ప్రసంగమునభాసిలు కేళీవనీ లలామముమున్" వృత్యనుప్రాసలో బిందుపూర్వక గకారం అందంగ సందడి చేసింది. తెలుగు విజ్ఞానపీఠం, హైదరాబాద్ వారిచే ప్రచురింపబడిన ఈ గ్రంథమునకు, సంపాదకత్వము వహించినది శ్రీ సాళ్వ కృష్ణమూర్తిగారు. వారు విస్తృతముగా దీనికి తొలిపలుకు

కూర్చినారు. కవి గురించి వారు ఇట్లు పేర్కొనినారు. " నిజానికి వ్యాఖ్యానంతో రావలసిన కావ్యం ఇది. అనేక కారణాల వల్ల ఇప్పుడు మూలాన్ని మాత్రం అందిస్తున్నాము," "ఈమహాకవి పండితుడు. భాషమీద నిరంకుశమైన అధికారము, అనర్గళమైనధార, అనుప్రాస యమకాది శిల్పజుష్టమైన కూర్పు ఇతని సొమ్ము. ఈ కావ్యమందలి ఏ వృత్తము తీసికొన్నను ఇది తెలియగలదు. లక్షణే మమదక్షత్వం, సాహిత్యే సంహతా మతిః , తర్కే కర్కశ వాదిత్వం క్వ శాస్త్రే నాస్తి మే శ్రమం – అని తర్జింప గల ఈతని కృతిని పరిష్కరించి అందలి సొగసులనావిష్కరించుటకు ఏతాదృశు డైన పండితుడే కావలెను". మనకు వలసిన కావ్యవస్తునిర్దేశము కవిగారు షష్ఠ్యంతమల పిదప తొలిమూడు పద్యములలో కథా ప్రారంభము చేసి చెప్పడము చూడగలము.

ఉ. " వందనకృత్ పురందర భవ ప్రముఖామర బృందమిందిరా
నంద ముకుంద కీర్తి కథన గ్రథన ప్రథనొప్పు బాస వాల్
సుందరులం దనర్చి వరలుస్ వని నైమిశమట్టి సజ్జనా
నందనమై విలాస జిత నందనమైన తపోవనంబునస్" [1]

చ. " సరసిజపత్రనేత్ర వరసామజ వల్లభ శృంఖాయిత
స్వరచిత భక్తి మానితుడు శౌనక మౌని మనో వినోద కృత్
సరళ కథాభిధా సదవధాన విధాతను సూతజున్మనో
హర మచలాత్మజా పరిణయంబు నయంబునదెల్పవేయనస్"[2]

ఉ. "సంతసమంత కొంత మది సంధిల సూత సుతుండు బల్కె, " నో
శాంతి నిశాంత ! సద్వచన చాతురిచే 'నాచలాత్మజా' మహో
దంతము దెల్పుమంటి వది- యంబిక పెండ్లియో? సీత పెండ్లియో?
వింతగ రెండు నొక్కపరి పెల్వడజెప్పెద నంచు హృష్టుడై" [3] ముకుందవిలాసము

సాహిత్య రంగములోనేగాక, తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ఇతర రంగాలలోకూడా జరుపబడిన కృషిని ఏకీకృతము జేయుటకై నెలకొల్పబడినది - "తెలుగు విజ్ఞాన పీఠం". ఆసంస్థ తరపున ఆచార్య రవ్వా శ్రీహరిగారి సంపాదకీయములో,

---

పాద సూచికలు : -[1,2,3] అచలాత్మజా/వెంకటాచార్యులు/ తె.వి.పీ/ప్రథమా/12,13,14.

1985 లో వెలువరింపబడిన ప్రబంధము " ముకుందవిలాసము". దీని కర్త 'కాణాదం పెద్దన సోమయాజి'. ఆశ్వాసాంత గద్యలో, "శ్రీమదుభయకవితా నిస్సహాయది సాహితీవిహార కాణాదాన్వయ తిమ్మనార్య కుమార వినయగుణధుర్య పెద్దనార్య" యని చెప్పుకొనినారు. సాహితీ జగత్తులో పలు రాయబారములు గలవు. అక్రూరుని రాయబారము, సంజయుని రాయబారము, మేఘము ద్వారా కాళిదాసు నడిపించిన రాయబారము(మేఘ సందేశము), శ్రీకృష్ణరాయబారము, రుక్మిణీ దేవి అగ్నిద్యోతనుని ద్వారా కావించిన రాయబారము , శ్రీనాథుని రాయంచ రాయబారము [ శృంగార నైషధము – హంస దూత్యము] ఇలా కావ్యాలను పరిశీలిస్తే రాయబారాలు కోకొల్లలు. ముకుందవిలాసములో కూడ రాయబారము కలదు. ఇది 'శుక రాయబారము'. వ్యాసులవారు భద్రాదేవి వివాహాన్ని మొత్తం, భాగవతంలో ఒకే శ్లోకంతో అయిందనిపించినారు.

"శ్రుతకీర్తేః సుతాం భద్రాముపయేమే పితృష్వసుః (1)
కైకయీం భ్రాతృభిర్దత్తాం కృష్ణః సంతర్దనాదిభిః

{ శ్రీ కృష్ణుడు, తన మేనత్త శ్రుతకీర్తి కూతురు, కేకయ రాకుమారి యైన భద్రా దేవిని ఆమె సోదరులగు సంతర్దనాదులు సమర్పించగా వివాహమాడెను.}

అదే దారిలో పయనించి, {మిగిలిన పలు పెళ్ళిళ్ళు విస్తృతముగ చేయించినా}, పోతనగారు భాగవతములో భద్రాదేవికి, కళ్యాణమునొకే పద్యములో చేసి ముగించినారు.

' జనవంద్యస్ శ్రుతకీర్తి నంద్య తరుణిస్ సందర్శనక్షోణి పా
ద్యనుజస్ మేనమఱందలిస్ విమల లోలాపాంగ కైకేయ ని
ద్ధన యోన్నిద్ర ప్రపూర్ణ సద్గుణ సముద్రస్ భద్ర నక్షుద్ర నా
వనజాతాక్షుడు పెండ్లియాడె నహిత వ్రాతంబు భీతిల్లగస్" (2)

'కాణాదం' వారికి ఇది కొంత కొరతగా తోచిందేమో? తానే సంకల్పించుకొని, మూడు ఆశ్వాసాలలో చక్కని చిక్కని 'ముకుందవిలాసము' నందముగా అందించినారు. విష్ణుమూర్తి వివాహ సత్కథలనువినగోరిన జనకమహారాజుకు శుక మహర్షి ముకుందవిలాసమును చెప్పడము జరిగినది.

---

పాద సూచికలు : - [1] వ్యాస భాగ 10/58 /56, [2] పోతన భాగవ/దశ/ఉత్తర 145.

{ఇచట కొంతవరకు మిథిలాధిపతి జనకుడా? యను ప్రశ్నను, వ్యాసమహర్షి కుమారుడు శుకుడా? యను ప్రశ్నను ప్రక్కకుపెట్టి చూద్దాం }

"కుందవిలాసము తావి ము

కుందవిలాసము సదా ముకుందవిలాసం

బిందు విలాసమును సుధా

బిందువిలాసము హసించు పేశలఫణితిస్" [1]

యని కవియే చెప్పికోవటము చూడగలము. ఈ ప్రబంధమునకు సంధాయకుడు – 'సోమభూపాల రాయవసంతుడు' శ్రీకలితాంకుడు సోమక్ష్మాకాంతుడు తోడుగాగా సరసయగు కృతిశ్రీకి, కవి సుగుణసింధుడై 'శ్రీకేశవపతి'ని కావ్యమునకు కృతిభర్తగ చేసి ధన్యుడైనాడు. వస్తునిర్దేశమునకు సంబంధించి కవి ఇట్లు చెప్పడము గలదు. 'అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా సమర్పింపంబూనిన భద్రా పరిణయోల్లాసంబగు ముకుందవిలాసంబను మహా ప్రబంధంబునకు కథాక్రమంబెట్టిదనిన –

చ. ' అనఘు విదేహదేశ వసుధాధిపుడై మిథిలాపురంబునస్

మనుజనక క్షమాధవుని మాధవునిస్ భజియింపుచుం గనుం

గొన నిగమాగమా గమశుకుండు శుకుండరుదేఱ వేడపూ

జన మొనరించి మౌని మహిజాని మురారి వివాహ సత్కథల్' [2]

వ. ఇట్లమ్మహీభుజుండు శుభసంప్రశ్నంబొనరించిన –[3]

కం. 'ఒకపరి రుక్మిణి మొదలగు

సకియలకార్గురికి పెండ్లి సవరణ వినబొం

దిక పఱచి యవలిసతికథ

శుకముని యా జనక నృపతి సోమునకనియెస్' [4]

మొదటనే పేర్కొనిన రీతిగా జనకునికి శుకమహర్షి ఈ కథను వినిపించినాడని చెప్పడము గలదు. జనకుడు త్రేతాయుగమున వచ్చు పాత్ర. శుకమహర్షి ద్వాపరయుగమున కనిపించు పాత్ర. ఈ రెండింటినీ కలపడం ఒక క్రొత్త ప్రయోగమనవచ్చు. అసలు కథయే కొత్త పుంత లో

---

పాద సూచికలు : - [1,2,3,4] ముకుందవిలాసము/కాణాదం పెద్దన సోమయాజి/తె.వి.పీ/ ప్రథమా/ 33 , 97, పద్యాలు, 98 వచనం. పద్యము 99.

నడచినపుడు, చెప్పినదెవరు? వినినదెవరు? అను మీమాంసను వదలి కవి తన కావ్యములో చెప్పిన చొప్పించిన విశేషములను విని / చదివి ఆనందించుటయేమన కర్తవ్యం. రుక్మిణితో పాటు ఇతరులను పెళ్ళాడిన వాసుదేవునికి 'అవలిసతికథ' వినిపించడము ఇచట చెప్పబడిన కావ్యకథా వస్తునిర్దేశము. ఇతర రచనా చమత్కృతులనిపుడు తడవ పనిలేదు.

"*బృందావనవిహారము*" అను ప్రబంధమునకు కర్త, "కవిరాజు వనం గంగాధరకవి". వీరి తండ్రి గారు వనం అప్పసామయ్య . వీరి వంశవృక్షము ననుసరించి ( ఉదయమాణిక్యపుర వనం వంశీయులశాఖ ) ఋక్శాఖ – ఆశ్వలాయన సూత్రము – భారద్వాజగోత్రమునకు చెందినవారు. అప్పసామయ్య గారు శ్రీ తలకోన సిద్దేశ్వర లింగ ప్రతిష్ఠాపన కర్త. తలకోన తిరుమల గిరులలో కలదు. తిరుపతి – శ్రీనివాసమంగాపురము – భాకరాపేట - నెరబైలు మార్గములో 'తలకోన ' చేరవచ్చు . ఆశ్వాసాంత గద్యములో గంగాధర కవి తనను గూర్చి ఇట్లు వ్రాసికొనినాడు. 'శ్రీ తలకోన సిద్ధేశ్వర వరప్రసాద లబ్ధ కవితా విశారద, శారదా స్వచ్ఛా విచ్ఛిన్న యశో విరాజిత, వనం గంగాధర కవిరాజు".

తలకోన వద్ద జలపాతములుగలవు. దీనికి మరోపేరు "శిరోద్రోణము " – తలకోనకిది సంస్కృతమందు తుల్య ప్రయోగము. శేషాచల పర్వత శ్రేణి తిరుపతి వద్ద ప్రారంభమై, శ్రీశైలము వరకు వ్యాపించినది. ఆయాప్రాంతాలలో భిన్నభిన్న నామములతో వ్యవహారమందు గలదు. ఇది ఆదిశేషునికి ప్రతి రూపమని భావన. తిరుపతి క్షేత్ర ప్రాంతము శిరోభాగమని, శ్రీశైలము పుచ్ఛమని, మధ్యలో ఆహోబిలమని చెప్పడమున్నది.

తలకోన క్షేత్రముగూర్చి ఇట్లు చెప్పడము గలదు.

"శ్రీశైల దక్షిణభాగే, వేంకటాచల పశ్చిమే,
సిద్ధేశ్వరస్య సుక్షేత్రే విద్యతే దేవసన్నిధిః .,
కాశ్యాంతు మరణాన్ముక్తిః శ్రీశైలస్యచ దర్శనాత్,
శిరోద్రోణాఖ్య తీర్థేచ స్నానాన్ముక్తి మవాప్నుయాత్".[1]

---

పాద సూచికలు : - [1] పుట 6 బృందా వనవిహారము/వనం గంగాధరకవి

ఈ కృతిభర్త కోటకొండ వేంకటచంద్ర భూపతి. పోతన భాగవతరీతి ననుసరించిన బృందావన విహార ప్రబంధము, చక్కని కవితా ప్రౌఢిమతో అనర్గళ ధారావేగమున సాగిన రచన. భాగవత మహా పురాణమందలి దశమస్కంధ పూర్వభాగములో ఆవిష్కృతమైన వసుదేవవృత్తాంతములోని మథురా పురవర్ణన, దేవకీవసుదేవుల వివాహము , శ్రీకృష్ణ జననము, శ్రీకృష్ణ లీలలు, పూతనాదుల సంహారము, కాళీయమర్దనము, బ్రహ్మగర్వ భంగము, ఇంద్రోత్సవము, గోవర్ధనపర్వతోద్ధరణ, గోపికావస్త్రాపహరణ, దివ్యభోగ విప్రలంబ శృంగారలీల, రాసలీలాది – ఘట్టాలున్నవి. బాలకృష్ణునిలీలలు వస్తునిర్దేశము.

ఈ కవిరాజు ఉభయభాషావిశారదుడు. వాగ్గేయకారకుడు. ఆశుకవితా విలాసుడు. శ్రీకృష్ణ కర్ణామృతం, తదితర రచనలప్రభావము, పోతనభాగవత శబ్దశైలీ ఇతని రచనలో కలదు. గంగాధరకవి ఇంకనూ పలురచనలు చేసినట్లున్నది.

నేడవి అలభ్యములు. కవితాశోభ, వర్ణనావైచిత్రి, సంగీతజ్ఞానము, ఆనాటి క్రీడావినోదములు, జ్యోతిశ్శాస్త్ర విన్నాణము, పశుశాస్త్ర పరిచయము, నాట్యశాస్త్ర మెలకువలు - ఇలా పలుముఖాల పాండితీగరిమ ఇతని గ్రంథములో ప్రస్ఫుటమగును. పోతనభాగవతాన్ని అక్కడక్కడ అనుసరించడం చూడగలము. భాషపై పట్టుగల కవివరులు, వారు - కావుననే పదములతో పలు విన్యాసాలు చేయించినారనినచో అతిశయోక్తి కాదు, కానేరదు. పదములు తమకు తామే వచ్చి కూర్చున్నవి అనవచ్చు. ఈ కవిరాజు కూర్చిన ఒక కంద పద్యమును చూస్తే , పదాలతో వీరెట్టి చమత్కారాలు చేసి భాషామతల్లికి తమ వంతు సత్కారాలు చేసినారో మనము తెలిసికొనగలము.

కం. “ కేసరి కేసరి నడుమిల
కేసరి కటి, వళులు యలలకేసరి, చెలిప
ల్కేసరి పోల్పగ నవసుధ
కేసరి పొగడంగ వాసుకే సరి దీనిన్ “.[1]

---

పాద సూచికలు : - [1] ప్రథమా/91 / బృందావనవిహా/ వనం గంగాధర.

వీరి భాషాధికారము – సీసపద్యంలో, సంస్కృత భాష- వీరి ప్రయోగము:

సీ. వాసవ పట్టణ ద్వారాగ్ర కలశేషు ! హవ్యవాహన లసదవయవేషు![1]
మార్తాండ నందన మందిరోద్యానేషు! రక్షోధిరాడ్భటోరస్థలేషు !
సరిదీశ్వరాంగనా సందోహపూరేషు! మారుతోజ్వల గేహతోరణేషు!
కిన్నరాధీశ్వర గేహాంతరాలేషు! ధూర్జటి నిలయ బంధూకతరుషు!

గీ. పద్మరాగంతి, కీలంతి, పల్లవంతి, వీరగంధంతి, సద్మంతి, విద్రుమంతి,
ధనవితానంతి, కుసుమంతి, తావకీయసాంద్రతేజాంసి, వేంకటచంద్ర భూప!.

{అష్టదిగ్విషయ విశేషాలను క్రమాలంకారములో కూర్చిన కవి నేర్పుపైన చూడగలము}

ఈ ప్రబంధములో కావ్యవస్తునిర్దేశన ప్రక్రియను పరిశీలించినపుడు: -

*అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన, బృందావన విహారంబనుమహాప్రబంధంబునకు కథా క్రమంబెట్లన్న ను* - అని ప్రారంభించి, భవ్యకరమైన నైమిశారణ్యమును బహుళముగా వివరించడం కలదు. శౌనకాది మునులు అడిగినపుడు,

కం. 'వరశుక మౌని పరీక్షిన్నర వరునకుదెల్పె, మున్ను నయవాక్పణితిన్,
దురితలతా విచ్ఛేదనకరమగు శ్రీ కృష్ణ కథలు కౌతుకమెసగన్' [2]

భవబంద విదూరంబులు నందకాయుధుని చరితంబులని హరిలీలలు విపులంగా వర్ణిస్తూ

కం. 'వ్యాసుడు మద్గురుడతికృప భాసిల్లగ నాకు తెల్పె భాగవతంబున్,
ధీ సన్నుత ! ద్వాపరమున నాసంహిత నీవెరుంగనర్థంబిచటన్' [3]

అని పల్కి, మధురఫల, మధుర సత్సుమ మధుపూర్ణ కరండ జాల మండిత నానా విధ వనకలితంబగుటన్, మధురాపుర మనగ భాసమానంబయ్యెన్'[4]

అని వివరంగ చెప్పడముతో 'శ్రీకృష్ణ సంబంధకథ' యని కావ్యవస్తునిర్దేశము జరిగినది.

రచయిత్రి ముద్దుపళని, తన రాధికా సాంత్వనములో, కథ ప్రారంభం చేసిన విధమిది.

కం. "శ్రీవనితా వరశుభ్ర యశో వారిధి పూర్ణ చంద్రు, శుక యోగీంద్రున్,
భావించి చూచి, జనకక్ష్మావరుడిట్లనియె భక్తి సంభ్రమ పరుడై." [5]

---

పాద సూచికలు : [1]అవతా/69. బృందావనవిహా/వనం గంగాధర.

[2,3,4] బృందావనవిహా/వనం గంగాధర/ ప్రథమా/9, 56,58

[5] రాధికాస్వాం /ముద్దుపళని/ప్రథమా/2.

సీ. "మునినాథ! హరికథల్ ముసు నేను మెండుగా
వీనులవిందుగా వింటి, నందు
నందుతోబుట్టి, గోవిందుని కత్తయై
వరగుణాకర యన వఱలు రాధ
తానెత్తి పెంచగా తగు నిళా సతి మీద
వడినేల బలు కారుబారు చేసి
గోపాలదేవుపై కోపించె? నపుడేట్లు
దక్షిణ నాయకాధ్యక్షు డైన
గీ. దేవకీసూను డా నారి తీరు దీఱ,
తీరుగానేలె? నని యింపుదేఱునటుల
నానతీవయ్య ! బహు సావధానమతిని,
విని కృతార్థుడ నయ్యెద విమలహృదయ!"[1]
కం. "అనవిని, శుక యోగీంద్రుడు
వనజాక్షుని దివ్య పాద వనరుహ యుగళిన్,
తనివారదలచి, ఇట్లనె,
కనులం దానంద బాష్ప కణములు తొలుకన్" [2]
అనగా, 'ఎల్లకళలకు వీడు ప్రేపల్లెవాడ" అని కావ్యవస్తు నిర్దేశము చేయడం కలదు.

అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన శశాంకవిజయంబను మహాప్రబంధం బునకు కథా క్రమంబెట్టిదనిన..వెలయు....నైమిశంబు... ఆ వన సీమ....పల్కిరి "సద్విజ రాజి తోర్జిత శ్రీ విలసిల్లు 'చంద్రుకథ' చిత్తముననవీన గోరు వారలై , మునులు సూతుని అడుగగా, సూతుడు వారికి 'నటత్కనకాచల చాప జటాఘున గాంగ తరంగ భంగిగా నిట్లనియెన్ - ఇది శేషము వేంకటపతి 'శశాంక విజయ' కథా వస్తు నిర్దేశము.

కనుపర్తి అబ్బయామాత్యుడు, తనకృతి యగు అనిరుద్ధ చరిత్రమునందు వస్తు నిర్దేశమును చేసిన తీరును చూద్దాము. ' నారచియింపం బూనిన అనిరుద్ధ చరిత్రంబునకు

---

పాద సూచికలు : [1,2] రాధికాస్వాం /ముద్దుపళని/ప్రథమ/3,4

కథా క్రమంబెట్టిదనిన, భగవత్కథా సుధానుభవ కుతూహల సాంద్రులగు శౌనక ప్రముఖ మునీంద్రులు సకల పురాణేతిహాస ప్రసంగా వచన చాతురీ విఖ్యాతుండగుసూతుని కనుంగొని యిట్లనిరి. జలజభవ భావ ప్రముఖ... భవ్య గుణాగ్రణీ, రౌమహర్షణీ – అనిరుద్ధుని చారిత్రము వినుటకు మా హృదయములను వేడుక పొడమెస్, వినిపింపు సవిస్తరముగ వినుత బుధవ్రాత! సూత! వినయోపేతా! అనిన విని అమ్మునీంద్రులకతండిట్లనియె.. ఇందులో కవి 'అనిరుద్ధుని చరిత్ర' చెప్పనున్నాడని కావ్య వస్తు నిర్దేశము అవగతమైనది.

కవిసార్వభౌముడగు శ్రీ నాథుని బాల సఖుడు అవచి తిప్పయ. కాంచీ నగరవాసి. తన పేర 'శైవ ప్రబంధ మొకటి అవధరింపుము నా పేర నంకితముగ' అనిన వెంటనే అంగీకరించినాడు శ్రీనాథుడు. శుభ ముహూర్తమున నిజాంతరంగ మంగళాయత నాధిష్ఠిత కుమారాచల త్రిపురాంతకుండవచి త్రిపురాంత కుండు కృతిస్వామిగా 'హరవిలాసంబ'ను సెప్పందొడంగి...తిప్పయ వంశాభి వర్ణనము కావించినాడు. అటు పిదప అవతారికనురచించి కథను ప్రారంభించినాడు. పరమేశ్వరుని పలు లీలలలో కొన్ని గ్రహించి ఒక గ్రంథమును కూర్చినాడు. అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా చెప్పంబూనిన'హరవిలాసంబను' ప్రబంధంబునకు ప్రథమ విలాసంబైన కృతినాయకుని వాణిజ్య వంశంబునకు కూటస్థుండైన కిరాటకుల శ్రేష్ఠుండగు చిఱుతొండనంబి చరిత్రతో తన ప్రబంధమును మొదలుపెట్టినాడు. కావ్య వస్తు నిర్దేశము హరుని కొన్ని లీలల గురించినది. సాధారణముగా గ్రంథము యొక్క శీర్షికను చూచినా వెంటనే అది ఫలానా విషయమునకు సంబంధించినదని చెప్పగలము. ఇందులో వేరే విధమైన వ్యాఖ్యకు ఆస్కారము వుంటే తప్ప. ఆచలాత్మజా పరిణయము. పుస్తకము చదివినగానీ, ఇది ద్వ్యర్థి కావ్యమను విషయముతెలిసికొనుట కష్టము. కారణము ఒకే పదానికి ఎక్కువగా అర్థములు ఉండుటే! మహాభారతములో పలు పర్వములు గలవు. ఆయా పర్వములకు సంబంధించినంతవరకు మొదటనే కార్యాచరణ జరిగినది. కొన్ని భాగములకు చెందిన వాటిని కలిపి అందులో ముఖ్యమైన పేరుతో పర్వమును పేర్కొనుట జరిగినది. మరియూ స్కందములుగాగానీ, కాండము లని గానీ, ఆశ్వాసములనిగాని, విభజించుట చదువువారికి కొంత సౌలభ్యము కలిగించుటకే! ఆదిపర్వము – ఇందులో పలు అంశములు గలవు. నన్నయ గారు చెప్పినట్లే పౌష్యంబు, పౌలోమంబు, ఆస్తీకంబు, ఆది (వంశ అవతారంబు) సంభపపర్వంబు, జతుగృహ దాహంబు, హైడింబంబు, బకవధ, చైత్ర రథంబు, ద్రౌపదీ స్వయంవరంబు,

వైవాహికంబు, విదుర ఆగమనంబు,రాజ్యార్ధ లాభంబు, అర్జున తీర్థయాత్ర,సుభద్ర కల్యాణంబు, హరణ హారిక విషయము, ఖాండవ దహనము, మయ దర్శనము... ఇలా 18 అంశాలు 'అది' పర్వములోనే లభిస్తున్నవి. అందులకే వేరెక్కడా లేనిది భారతములో ఉండును. భారతములో లేనిది మరెక్కడా ఉండదు అని నొక్కి చెప్పడము కలదు. కనుకనే ఒక్కొక్క వృత్తాంతమును గ్రహించి పిదప పలు కావ్యాలు, నాటకాలు, ఇతర ప్రక్రియలు, తామరతంపరగా పుట్టుకొచ్చినవి. అసలు భారతము, తొలుత చిన్న కథగా ప్రారంభమై 8,౦౦౦ శ్లోకములతో ఆరంభమై కొంత కొంత చేర్చడము జరిగిన కారణముగ అనంతరకాలములో బృహత్తరమైన గ్రంథముగా మారినదని కొందరు భావిచుట కలదు. రామాయణమును కూడా పలువురు రాసినా, ఆది కవి వాల్మీకి నిర్ణయించిన పరిధిలోనే, కొంత కల్పనలు, మరికొంత ప్రాంతీయ ఆచార వ్యవహారములు, సంస్కృతి చొప్పించిననూ, అసలు కథకు వ్యతిరేకముగా వెళ్ళలేదు. తెలుగు వాళ్ళు రాసిన రామాయణములో తెలుగువారి ఆచారవ్యవహారములు చొప్పించడ ము సహజముగానే జరిగినది. మూల గ్రంథముపై గల నమ్మకము, ప్రభావము, రచనా విధానమును అనుసరించుట గౌరవముగా, భావ్యముగా భావించినారు. ఇతర సంస్కృతుల, భావాల, భాషల, ప్రభావము రానంత వరకు, లేనంతవరకు జరిగిన కావ్య నిర్మాణము ఒక దశ. పరభావముల ప్రభావము పడిన పిదప వచ్చిన మార్పులు మరొక దశ. రామాయణమునకు మరొక పేరు పౌలస్త్య వధ. కానీ రామాయణము అని పేరే ప్రసిద్ధముగాయుండుట తెలిసినదే.

పోతన గారి భాగవత వస్తునిర్దేశమును పరిశీలించినచో, ఇది కావ్యము కాదు. పురాణము. వస్తునిర్దేశము సంబంధించినంతవరకు, దీని లక్ష్యము వేరు. "శ్రీ కైవల్య పదము చేరుటకు' భాగవతమును పోతన తెనిగించెను. ఆ భాగవతము, ' లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మంజులతా శోభితముస్, సువర్ణ సుమనస్సుజ్ఞేయముస్, సుందరోజ్జ్వల వృత్తంబు, విమలవ్యాసాలవాలం బు నై వెలయుస్ 'భాగవతాఖ్య'కల్పతరువుర్వీస్ సద్ద్విజశ్రేయమై. విష్ణు పరమైన అంశముగా కనిపించిననూ, ఇందులో కూడ పలు లీలలు, అవతారములు, ఇతర కథలు, ఉపాఖ్యానములు, భక్తిలోని విధములు పలు భక్తుల గాథలు మనకు లభించును. భాగవత లక్ష్యము ఒక్క చోట ఇది అని చెప్పినట్లు లేదు. ఆయా సందర్భములను అనుసరించిన

తీరు చూడగలము. పోతనకు ధనము అనవసరము. రాజుల ఆశ్రయమును ఆయన తిరస్కరించినాడు.

నిఖిలసూరి లోకాంగీకారతరంగిత కవిత్వ వైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్య గేయుడైన, సూరన తన ప్రభావతీ ప్రద్యుమ్నము నందు ప్రథమాశ్వాసములో చెప్పిన 6 వ పద్య విషయము కొంత చూచెదము .తన కావ్య వస్తు నిర్దేశమును [ రచన ఉద్దేశమును] తెలియచేయుటముచూడగలము.

మ. జనముల్ మెచ్చగముస్ రచించితి నుదంచ ద్వైఖరిస్ గారుడం
బును శ్రీ రాఘవపాండవీయము, కళాపూర్ణోదయంబుస్ మఱిస్ ,
తెనుగుం గబ్బములెన్ని యేనియును మత్పిత్రాది వంశాభివ ;
ర్ణన లేమిస్ బరితుష్టి నాకవి యొనర్పంజాలవత్యంతముస్ [1]

అని చితించి" , తండ్రియు సుతులకుదైవంబండ్రుగదా వేదవాదులది వినియు నేవీండ్రును వాండ్రును బలె మాతండ్రిపరమ పూజ్యగాగ తలపమి తగునే ? అని తలచినాడు. తన పిన తమ్ముడు ఎఱ్ఱన అనువాడు తండ్రికి, గయ, కాశీ, ప్రయాగ, ద్వారకాది భూములలో తర్పణాది క్రియలొనర్చి ఆహ్లాదము కావించినాడు. తన తండ్రికి తానూ, తనవంతు సంతసము కలిగింప సంకల్పించుకొనిన వాడై, తండ్రి కీర్తిని భువిపై నిలుప దలచినాడు. అందులకనువుగా కృతినొకదానిని పరమేశుని దయతో తండ్రి కీర్తిని ఖిలము గాకుండునటుల కూర్చినాడు. 'ప్రభావతీ ప్రద్యుమ్నము' ఆ కారణముగ వెలువడినదే!

ఇక రాయల వారి ఆముక్తమాల్యదను పరిశీలించినచో, రాయలవారే దీనిని 'మహాప్రబంధమని' చెప్పినారు. అంతకు మునుపు రాయలవారు రచించిన పలు గ్రంథాలను మధురముగా గీర్వాణ భాషలో కూర్చినావు, "మాకు ప్రియముగాగా అంధ్రభాష నందు ఒక్క కృతిని వినిర్మింపుమని" ఆంధ్ర విష్ణువు ఆదేశమునొదల దాల్చి ఆముక్తమాల్యద రాసినారు. "నా విన్నవింపంబూను నాముక్తమాల్యదా మహాప్రబంధంబునకు కథా క్రమంబెట్టిదనిన..." శ్రీవిలుబుత్తూరు పుర వర్ణనతో ఆశ్వాసమారంభమగును. వాస్తవమునకు వైష్ణవమత ప్రాశస్త్యమును తెలియ జేయు పలు కథలను కూర్చినదిది. పేరును చూచి ఒక విషయమునకు పరిమితమైనదని చెప్ప

---

పాద సూచికలు : ప్రభావతీ ప్రద్యుమ్నము/పింగళి సూరన/ప్రథమ/6.

వీలులేనిది. సాధారణముగా గ్రంథము యొక్క శీర్షికను చూచి ఆ గ్రంథమునందలి విషయము కొంత  గ్రహించుటకు, అందలి వస్తువేమిటి యను అవగాహనకు రావచ్చును. ఈ విధముగా పరిశీలనా దృష్టితో వీలైనన్ని కావ్యములను చూచినపుడు కావ్యారంభ పద్యములు కొన్ని ప్రత్యేక లక్షణములు గలవానిని ప్రయోగించుట జరిగినది. ముఖ్యముగా 'శ్రీ' కారముతో ఆరంభించుట, అధికముగా 'మ' గణము కలిగిన పద్యములనే వాడడము కలదని గ్రహింప వచ్చును. పొన్నిగంటి తెలగనార్యుని యయాతి చరిత్రము, నన్నెచోడుని కుమార సంభవము లాంటివి ఈ ఆచారమును పాటింపలేదు. తెలగానార్యుడు తన యయాతి చరిత్రమును అచ్చ తెనుగులో కూర్చుటకు, కృతిభర్త యగు అమీను ఖానునిచే ప్రోత్సహింప బడుట వలన వికృతి శబ్దమగు 'సిరి' తొ కృతి మొదలిడినాడు. నన్నెచోడుడు కొత్త పుంతలు తొక్క దలచి కుమారసంభవ కావ్య ఆరంభమును 'స్రగ్ధర'తో చేసినాడు. కొందరు కవులు 'భ' గణముతో కావ్యారంభము చేసినారు. నవీన పద్య కవులు చాలామంది ఈ ఆచారమునకు 'స్వస్తి' పలికినారనినచో సత్య దూరము కాదు. చాల పరిమితముగా తొలి పద్యమును సంస్కృత శ్లోక రూపమున అందించుట చూడగలము.

తెలుగు కావ్యములు చాలావరకు సంస్కృత భాష యందలి సాహిత్యమును దిగుమతి చేసుకొన్నవి. ఇందులో సందేహము లేదు. కొందరు యథా తథముగా మరికొందరు కొంత స్వేచ్ఛతోను మార్పులు /కూర్పులు చేసి తమదైన తీర్పును నేర్పుతో కావ్య రచన సాగించి తెలుగు సారస్వతమునకు అందమైన అలంకారములను అర్పించి భాషాయోషకు సేవ జేసి తరించుటయే గాక, సప్త సంతానములలో ఖిలము కానిది ధాత్రి కృతి యని నిరూపించి మనకు మహనీయమైన మార్గము చూపినారు. పయనించుట మనపని.

***********

# తృతీయాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు–ఇష్టదేవతాస్తుతులు

## III తృతీయాధ్యాయము

3 . ఇష్టదేవతాస్తుతులు :- సప్త సంతానములలోన ఖిలము కానిది 'కృతి' యని పెద్దలు చెప్పడము కలదు. ప్రజోపయోగ /జనహితార్థము చేయు కార్యములు సప్త సంతానములని ప్రసిద్ధికెక్కినవి. ఇవి ఒక వర్గము ననుసరించి – కూపము [బావి], తటాకము [చెరువు], ఉద్యానము[ తోట], మండపము, జలశాల[చలివేంద్రము], సద్ధర్మాచరణము, పుత్రుడు { "కూపస్తడాగముద్యానం మండపం చ ప్రపా తథా, సద్ధర్మకరణం పుత్రః సంతానం సప్తథోచ్యతే} ఇందులో గ్రంథ విషయము లేదు. మరొక వర్గముననుసరించి, సప్త సంతానాలు > తటాక ప్రతిష్ట, ధననిక్షేపము, అగ్రహార ప్రతిష్ఠ, దేవాలయ ప్రతిష్ఠ, వన ప్రతిష్ఠ, ప్రబంధనిర్మాణము, సత్ర ప్రతిష్ఠ – అనునవి. మతభేదములేవైనా, ప్రజలకు ఉపయోగపడు కార్యములన్నీ స్వంత కుమారులతో సమముగా భావించుట కలదు. కవి తను నిర్మించిన కావ్యమును తన కుమార్తె యను భావముతో తలంచుట తెలిసినదే! వేరొక చోట ప్రస్తావించినట్లుగా, జగద్గురువులు 'ఆది శంకరాచార్యుల' తమ "శివానందలహరి " లో ఇట్లు సెలవిచ్చినార్రు.

*" సర్వాలంకార యుక్తాం సరళ పదయుతాం సాధువృత్తాం సువర్ణాం*
*సద్భి స్సంస్తూయమానాం సరసగుణ యుతాం లక్షితాం లక్షణాఢ్యాం*
*ఉద్యద్భూషా విశేషాముపగత వినయాంద్యోత మానార్థ రేఖాం*
*కల్యాణీం, దేవ ! గౌరీప్రియ ! మమ కవితా కన్యకాం త్వం గృహాణ"* [1]

అనుచూ చక్కని శ్లేషను వాడి ఒక భావములో కవిత యొక్క లక్షణములను మరియొక భావములో కన్య లక్షణములను వ్యక్తము చేయుచూ సారమతి యైన సత్పారునిగా కూడా శంకరులవారు ప్రత్యక్షమైనారు. సారస్వత పోషకులుగా విలసిల్లిన రాజులు మున్నగువారికి కృతిపతిత్వమును గైకోవడములో కొంత ఆనందము ఒక రకమైన గర్వము / అతిశయము కూడా ఉండి ఉండునన వచ్చును. సప్త సంతానములను గురించి మరొక వ్యక్తీకరణ ఇట్లు కలదు. "సప్త సంతానాలు యశస్సును చిరస్థాయిగా [చాలాకాలము] నిలుపుతాయి. కాబట్టి ఎందరో పరిపాలకులు సప్త సంతానాలను లేక అందులో కొన్నిటినైనా

-----------------------------------------------------------------------------

పాద సూచికలు : - [1] శివానందలహరి/ఆదిశంకరులు/ శ్లోకము98.

పొందటానికి/స్థాపించుటకు ధనమును వ్యయము / ప్రయత్నాలు చేసినారు. ‘ పుత్రః కృతిస్తటాకశ్చ నిధానం శివమందిరం వనం విప్రాగ్రహారశ్చ సప్తసంతాన ముత్తమం’ [1] అని .శా. శ 1291 [క్రీ.శ.1369 ] నాటి పోరుమామిళ్ల శాసనం, సప్త సంతానాల పట్టిక నిస్తూ ‘భవదూర మహీపతిని ఏతాదిక సత్పుణ్య కర్తగా అభివర్ణించింది. ఇందులకు కారణం బహుశః ఇట్లు చెప్పవచ్చు. “ ధర్మాచరణం స్వర్గ ప్రాప్తికి మూలం. మానవుడు తన జీవితములో అనుభవించే భౌతిక సౌఖ్యములు, సంపదలు ఏవీ శాశ్వతం కావు. ఆచరించిన, అనుసరించిన ధర్మమొకటే శాశ్వతమైనది. పూర్వీకులు ఆధ్యాత్మికవాదులు. వారు భౌతిక వాదులు కారు. ‘అనిత్యాని శరీరాణి, విభవో నైవ శాశ్వతః నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః” అని భావించినారు. {కొందరు ఈనాడు భావించినట్లు ‘అనిత్యాని శరీరాణి అందరి సొమ్ము మనకే రాని’ అను స్వార్థచింతన లేనివారు}

మొదట నన్నెచోడుడు తన కుమార సంభవములో సప్త సంతాన ములను గురించి “పూనిమహాగ్రహార వరపుత్ర సమున్నతి దేవతాలయో ద్యాన తటాక సత్కృతి నిధానము లాశశి తారకంబు సుస్థానములై మహింబరగునని”- ప్రథమాశ్వాసము, 46 వ పద్యములో చెప్పగా, మంచన కవి తన కేయూర బాహు చరిత్రలో ఈ విషయమును ఈరీతిగా ప్రస్తావించినారు.

గీ. “నందనుడు వనము నల్లిల్లు నిధి సుర
గృహము, చెఱువు, మేలికృతి యనంగ
జగతి వెలయు సప్త సంతానములు, వీన
పుణ్యమును యశంబును పొందవచ్చు’’ [1]

అని అక్కడితో ఆగక మరి కొంత వివరణ ఇవ్వడము కలదు.

కం. “ సొమ్ములలో ముప్పోర్చు జ
గమ్మెల్లను నోడుముట్టగాజేయును శ్లా
ఘ్యమ్మగు వస్తువు నగుటస్
కమ్మని కనకమ్ము గాదె కవిత దలంపస్” [2]

---

పాద సూచికలు: - [1] [2]కేయూరబాహు చరిత్ర/మంచెన ప్రథమా/8.9

'సొమ్ములవలన ముప్పుకలుగును. జగమ్మెల్లను బ్రహ్మ రంధ్రము ముట్టగా [సమస్యలు కలుగ] చేయును. తలంపగ కవిత శ్లాఘ్యమ్మగు వస్తువు, కమ్మని కనకమ్ము వంటిది. అని మరికొంత విశదముగా చెప్పిన మరొక మాట కలదు. వననిధి తటాక దేవ భవనములు పుణ్యదములు. వీటిని ప్రతిష్ఠించిన గాని ప్రజలు తెలిసికోలేరు.

సరస కవిత సకలదిశలకు చని పండిత సభలలో ప్రాచుర్యమును పొంది గౌరవమందును. ఆనాటి దేశ కాల పరిస్థితులను అనుసరించి ఉండినట్టి వ్యవహారముగా దీనిని భావింప వచ్చు. ఇచ్చట మరొక మాట కూడా చెప్ప వీలు కలదు. సప్త సంతానములలో కావ్యమొకటే ఇతర ప్రాంతములకు కూడా తీసికొనిపోవ వీలుగలదు. ఇక మార్పు కాలమును అనుసరించి యుండును.

కొందరి దృష్టి ఈ విషయాలలో విపరీతముగా నుండుట మనము పరిశీలన చేయ వచ్చును. వీరికి తెలిసినదే ఘనమైనదని వితండముగా వాదించు వారలు గలరు. ఉదాహరణకు > రామాయణములో ఒక పాత్రకు అన్యాయము చేయడము జరిగినది. అది ఆరీతిగా ఉండకూడదు. ఎప్పుడో కొంత కాలము మునుపు జరిగిన విషయమును ఇప్పటి పరాయివారి రంగుటద్దాల ద్వారా చూస్తూ 'మునుపు మన వారు చేసినది తప్పు' అనటము మనదేశములో మాత్రమే కొందరికి చెల్లినది. మహాభారతము లో చెప్పినవిషయము ప్రకారము మనలనుమనమే పొగడుకొనుట, మనలనుమనమే కించపరచుకొనుట రెండూ ఆర్యవృత్తములు కావు.

ఆ. "అన్యకీర్తనంబు నన్యనిందయు
తన్ను పరగపొగడికోలు ప్రబ్బికోలు
నాపగాతనూజఆర్యవృత్తములుగా
వనిరివీనినాద్యులయినమునులు' [1]

శ్రీ కృష్ణ దేవ రాయలవారు, మనుచరిత్ర నిర్మాణ ఆరంభ సమయాన పెద్దనను గౌరవభావముతో ఆహ్వానించినది అందరికిని తెలిసినదే!

---

పాదసూచికలు : - [1] కవిత్రయభారతం/సభా/2-49

గీ. " సప్తసంతానములలో ప్రశస్తిగాంచి

ఖిలము గాకుండునది ధాత్రి కృతియ గాన

కృతి రచింపుము మాకు శిరీషకుసుమ

పేశల సుధా మయోక్తుల పెద్ద నార్య" [1] హరిశ్చంద్రనలోపాఖ్యానములో సప్త సంతానముల ప్రసక్తి కొంతవరకు చెప్పబడినది. ఆ ప్రకారము – వటు ప్రవరుడొకడు వాత్సల్యముతో సాహిత్యరసపోషణుడగు రామరాజభూషణునికి స్వప్నమునందు సాక్షాత్కరించి ఈరీతిగా సూచించినాడు. హరిశ్చంద్రుని నలుని కథల ద్వర్థి కావ్యము 'కావ్యరాజమైనది' రామరాజభూషణుడు శ్రీరామచంద్ర చరణారవింద వందన పవననందన ప్రసాద సమాసాదితమైనవాడు. కనుకనే రాజగుకృతిభర్త యగు తిరుమలరాయడు, 'సంగీత రహస్య కళానిధియైన' రామభూషణుని, సబహుమాన పురస్సరముగా ఆహ్వానించి రచన చేయ కోరినాడు.

కం. "శ్రీ రామ భూషణ! వచ

శ్శ్రీ రసపోషణ! భళీ! హరిశ్చంద్ర నల

క్ష్మారమణ చరితయుగ కా

వ్యారంభముపూని తనుపమాద్భుతశక్తిన్" [2]

మ. చను దుస్స్పర్శ కళంక పంకము హరిశ్చంద్ర ప్రశంసన్ తొలం

గునల శ్లాఘు కలిప్రపీడనము తత్ క్షోణీశ యుగ్మైకకీ

ర్తన మత్యంత ఫలప్రదం బగుట చిత్రంబే భవత్పుణ్యవా

సననేతా దృశ కావ్య రాజ రచనోత్సాహంబు కల్గెన్ మదిన్.[3]

సంగీతరహస్యకళానిధి యగు రామరాజభూషణుడు వసుచరిత్ర కారుడుకూడా. అతడు వచశ్శ్రీరసపోషణుడు. "రస" భంగము కలిగిన భరింపజాలడు. ఆ విషయము గిరికను చూచిన పిదప నర్మసచివుని ద్వారా నవాంబురుహాంబకుడగు వసురాజునకు {మనకు కూడా} తెలిపిన దిట్ట.

---

పాదసూచికలు : [1] మనుచరిత్ర/ అల్లసాని పెద్దన/పీఠిక /14

[2,3] [హరిశ్చంద్ర/రామరాజభూష/అవతా/12-13]

ఈ విషయము వసుచరిత్ర లోని రెండవ ఆశ్వాసము 55 పద్యంలో 'సారసలోచన'లున్నచోటికి బోరన లాతివారు వచ్చినపుడు.

సీ. సుతుల పెక్కండ్ర శాశ్వత రామనామ ధ
న్యుల జేసి పిలుచు భాగ్యోదయంబు
రచితాగ్రహారంబు రామచంద్ర పురాంక
పూతంబొనర్చిన పుణ్యరేఖ
నవదివ్య భవనంబు సవరించి శ్రీరామ
విభుప్రతిష్ఠించినవిపుల మహిమ
రామ సరోనామ రమణీయముగా తటా
కము వినిర్మించిన ఘనయశంబు

గీ. సఫలతవహించు నీహరిశ్చంద్రనల క
తాయుగ నిబంధచిత్రబంధ ప్రబంధ
మంకిత మొనర్చు రఘుభర్త కఖిలకర్త
కురుతరాభీప్సితము లెల్ల నొదవు నీకు. [1]

సప్త సంతానములకు గల ప్రత్యేక విశేషములను, వాటిలో కొన్నిటిని పైన చెప్పడము జరిగినది. అందులో సంతానము, అగ్రహార రచన నిర్మాణము, దివ్యభవన నిర్మాణము, శ్రీరామ విగ్రహప్రతిష్ఠ, సరోవర/తటాక నిర్మాణము, మున్నగు వాటితో పాటుగా హరిశ్చంద్ర నలోపాఖ్యానమను గ్రంథ రచన కూర్పుగావించుట ఉరుతర అభీప్సితములను కలిగించునవి యని ప్రస్తావించుట చూడగలము. సంఘమున గల జనులకు ఇట్టి నిర్మాణముల వలన పలు అనుకూలములు, లాభములు, ప్రయోజనములు కలుగును. అందులో ముఖ్యముగా కావ్యము కాంత వలె ఉపదేశించు విధానములో ఒక వైశిష్ట్యము కలదని మునుపే చెప్పడమైనది.

-----------------------------------------------------------------

పాదసూచికలు : - [1] హరిశ్చంద్ర/ రామరాజ / అవతా/14

కవికి లేదా కృతిభర్తకు ప్రియము గూర్చు రీతిలో కావించిన స్తుతి ఇహపర సాధకముల నొనగూర్చును. కవి మొదట మానవుడు / జీవుడు. సంఘములో మసలుచు, జీవనము సాగించువాడు. అతనికి గల అధికమైన రచనా శక్తిని వెలికి దీసి దానిని సంఘమునకు మంచి మార్గమును చూపు దానిగా, ప్రజలకు వలసిన సంతోషమును / ఆనందము కలిగించుటొకటి. అట్టి కవులకు అవసరమైన సౌఖ్యాలను సమకూర్చుట రాజుల / పాలకులకు గల బాధ్యత. ఇట్టి పరస్పర సహాయము జరిగినపుడు సంఘములో సుఖ శాంతులు కలుగును / వర్ధిల్లును. సత్ప్రవర్తనకల పౌరులున్నపుడు రాజ్యము ప్రశాంత వాతావరణము కలిగియుండుననుటలో వింత లేదు. అది శుభ పరిణామము. కనుకనే భోజుని కాలము “స్వర్ణ యుగము” అని నేటికిని చరిత్రలో చదువుట కలదు. శ్రీ కృష్ణ దేవరాయలకు, ‘ఆంధ్ర భోజుడ’ని పేరున్న విషయము తెలిసినదే! అన్నిటికిని మించి జనులు / ప్రజలు ఆనందముగా జీవించుటయే లక్ష్యము. ఇందులో ఆపాతమగు సంగీతము, ఆలోచనామృతము ఐన సాహిత్యము ముఖ్యమైన పాత్ర పోషించునవి. ఆనందము కలిగించునవి కళలు. పూర్వము జాన పదులు పలు రకములగు ‘ఆటపాటలు’ కల్పించుకొని జీవితమునకు అవసరమైన/ పరమార్థమైన ఆనందమును అందుకొనినారు. దానికి సాహిత్యము తనవంతు ధర్మము/కర్తవ్యమును నిర్వర్తించినది. అందులకు మూలకారణమగువారు ‘సాహిత్య సృజన’ చేయువారు కవులు. కనుకనే రాజులయెద్ద కవులకు యెనలేని ఆదరముండినది. ఇక రాజే స్వయముగా, రాయలవలె, రఘునాథ నాయకుని వలె కవియైన చెప్పవలసిన పనిలేదు కదా!

## 3.1 *ఇష్ట దేవతా స్తుతి – అర్థము – నిర్వచనము : -*

ఇష్టము అనగా ఏమి? దేవతలు అనగా ఎవరు?

స్తుతి/తులు అని వేటిననవలెను? అను ప్రశ్నలకు

కొంత సమాధానము ఏమో చూద్దాము.

*ఇష్టము* అనగా – నిఘంటువుననుసరించి కల అర్థములు ->

కోరబడినది, ప్రియమైనది, పూజితము, యజింపబడినది, యజ్ఞము చేత సంతోషపెట్టబడినది (దేవతాదికము), కోరిక, (యజ్ఞాది)కర్మము, ఉపనయనాది సంస్కారము, ఆతిథ్యాదివిహిత కృత్యము, ఇష్టక ఇటి/టుక...[శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు సంపుటం I పుట512]

అథ క్రతుకర్మేష్టం :- క్రతుకర్మయత్ తదిష్ట మిత్యుచ్యతే. యజ్ఞమందలి హోమదానాది క్రియ ఇష్టమనంబడును. కవితను లేక కావ్యమును 'అక్షరయజ్ఞము' అని చెప్పవచ్చును. ఇష్టముతో చేయ బడు అక్షరనిర్మాణ ప్రక్రియ కవియొక్కకర్మయగు ఘనమైన కావ్యము.

'***దేవత*** లు అనగా ఎవరు? అను ప్రశ్నకు కొంత సమాధానము చూచెదము. ఋగ్వేదములో దేవతలు చాలామంది చెప్పబడ్డారు. వారిలో కొందరు ప్రధానమైనవారు. మరికొందరు అప్రధానమైన వారు. అగ్ని ఇంద్రుడు వరుణుడు మున్నగు వారు ప్రధాన దేవతా వర్గమునకు చెందినవారు. తర్వాత వర్గములోనికి వచ్చువారు సూర్యుడు, సవిత, విష్ణువు, వాయువు, రుద్రుడు మొదలైన వారు. పురాణేతిహాసములలో సర్వోత్కృష్టులుగా ప్రసిద్ధి చెందిన విష్ణువు, రుద్రుడు మున్నగు వారు ఋగ్వేద సంహితలో అప్రధాన దేవతలుగు పరిగణింపబడటం గమనించతగినది. ఇంద్రుడు అధికముగా ఋగ్వేద సూక్తాలలో, సుమారు 250 వాటిలో ప్రత్యేకముగా, మిగత 50 సూక్తాలలో ఇతరులతో పాటు పేర్కొనబడినాడు. పవిత్రతకు, శక్తికి, తేజస్సుకు కాణాచి యగు అగ్ని ఇంద్రుని పిదప అధికముగా స్తుతింపబడినవాడు. విష్ణువు ఋగ్వేదములో అప్రధానుడుగా పరిగణింపబడినను, పురాణేతి హాసములలో 'త్రిమూర్తులలో' ఒకడుగా వన్నెకెక్కిన వాడు. ఇతడు మూడంగలలో సమస్త లోకాలను ఆక్రమించినాడు. ఇది తర్వాత పురాణ గాథలలోని [వామనావతార] త్రివిక్రమత్వానికి మూలమని చెప్పవచ్చు. ఇతని అత్యున్నతమైన పదం [పరమం పదమ్] మధువుకు (తేనె) {అంటే అమృతత్వం} నిధానం. నిత్యముక్తులు విష్ణువుయొక్క పరమపదాన్ని సదా దర్శిస్తారు. విష్ణువుకు కొండలు నివాసం అని కూడా చెప్పబడి ఉంది.

ఇతనికి 'త్రాత' ( రక్షకుడు) అనే పేరు సార్థకం. ఇది తర్వాతి వాఙ్మయంలో  అతని'స్థితి' క్రియకు సూచకమని చెప్పవచ్చు. ఇతనికనేక రూపాలున్నట్లు చెప్పబడి ఉండి. ఇది అతని 'అవతార' సిద్ధాంతానికి నాంది అనవచ్చు.

ఇక 'రుద్రుడు'. విష్ణువులాగా ఋగ్వేదములో సామాన్య దేవతగా పరిగణింపబడి, పురాణేతిహాసములలో, 'శివుడు' గాను, త్రిమూర్తులలో ఒకడుగాను, కీర్తింప బడినవాడు 'రుద్రుడు' దేవతలందరిలోను ఇతడు చాలా భయంకరుడు. మరుత్తులు, రుద్రులు, రుద్రియులను గణాల తండ్రి. మరుద్గణాలకు తండ్రియైన రుద్రుడు పింగలవర్ణుడు. ఎల్లప్పుడూ ధనుర్బాణాలు ధరిస్తాడు. మరుత్తుల్లాగా ఇతడు కూడా బహు భూషణా లంకృతుడు. అపరాదుల శిరస్సులపై విద్యుత్తనే అస్త్రాన్ని  వెనక ముందాలోచించకుండా ప్రయోగిస్తాడు. అపరాధుల విషయములో చాలా క్రూరుడైనా, భక్తుల విషయములో అత్యంతోదారుడు. తన భక్తుల ఆధులను [మానసిక] వ్యాధులను[శారీరక] పోగొడతాడు. ఇతనిచేతులు  వివిదౌషధాలతో నిండి ఉంటాయి. ఆపదలలో రక్షించమనే ప్రార్థన  విన్న వెంటనే యెంతటి క్రూరుణ్ణైనా పరుగెత్తి వెళ్లి రక్షిస్తాడు. ఇంద్రునికి ఇతడు సహాయకుడు. ఈరీతిగా దేవతా మూర్తుల వారి స్తుతుల విషయములో మార్పులు చెందుతూ వచ్చినవి.

మనము కోరినపుడు ప్రత్యక్షముగనో  లేక పరోక్షముగనో సహాయ సహకారములను అందించువారు కూడా దేవతలను భావమున్నది. కనుకనే 'దైవం మానుష రూపేణ' అను మాట అప్పుడప్పుడూ వినడము కలదు. దేవసంబంధమైనది దైవము. కంటికి కనిపించనిది, అదృష్టము దైవము అనడము కలదు. దేవర,  దేవుడు,  దేవత   దాదాపు ఒకే అర్థమును ఒసగును. దేవర అను శబ్దము కొంతవరకు పాలకుడు/ ప్రభువు అను అర్థమునందున ఉపయోగింప బడుట కలదు.దివిలో నున్నవారు దేవతలు. దివి యనగా ఆకాశము / స్వర్గము. పంచ భూతాలలో ఆకాశము ఒకటి. వరుసగా పంచభూతములను చెప్పినపుడు -  పృథ్వీ,అప్,తేజో, వాయు, ఆకాశములనుట కలదు . వీటికిగల విశిష్ట లక్షణాలు వేరొక చోట చర్చింపబడ గలవు.

"దివ్యోపపాదుకా దేవాః" అను వివరణను/వ్యాఖ్యననుసరించి ' దివి భవాః దివ్యాః మాత్రాది నిరపేక్షేణ ధర్మవిశేషాదేవ ఉత్పద్యంతఇత్యు పపాదుకాః , దివ్యాశ్చతే ఉపపాదుకాశ్చ దివ్యోపపాదుకాః. స్వర్గమందుండు వారు దివ్యులు. తల్లి మొదలైన వారు లేకయే అయోనిజులై పుట్టువారు ఉపపాదుకులు. దివ్యులైన ఉపపాదుకులు - దివ్యోపపాదుకులు. 'దీవ్యతీతి ఇతి దేవః' అనుట వలన స్వయముగా ప్రకాశించువాడు దేవుడు ఐని చెప్పవచ్చును. నరపాలకుడైన రాజును కూడా దేవుడు యనుట కలదు. ఇది తన కన్నా ఉత్తముడు / అధికుడు/ ఘనుడు అను అర్థములో ప్రయోగింప బడుట కలదు .

"స్వరవ్యయం స్వర్గ నాక త్రిదివ త్రిదశాలయాః|

సురలోకో ద్యో దివో(ద్వే)(స్త్రియాం)(క్లీబే) త్రివిష్టపం . అని స్వర్గమునకు పేళ్ళు.

ఇందులో (స్వర్గములో) నివసించువారు స్వర్గవాసులు. వారినే దేవతలందురు. ఇచ్చట కూడా కొన్ని తరగతులు చెప్పబడినవి. పదునాలుగు భువనములు. అవి 7 ఊర్ధ్వ లోకాలు - భూలోకము, భువర్లోకము, స్వర్లోకము, మహార్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము.

ఇక 7 అధోలోకములు :- అవి - అతలము, వితలము, సుతలము, తలాతలము, రసాతలము, మహాతలము, పాతాళము.

మొత్తము పదునాలుగు లోకములు. [చతుర్దశ భువనములు]

కొన్ని ప్రత్యేకతలతో కూడుకొన్నవారు దేవతలు.

అమరములో దేవతలనిట్లు చెప్పడము చూడగలము.

"అమరా నిర్జరా దేవా స్త్రిదశా విబుధా స్సురాః

సుపర్వాణః సుమనాస స్త్రిదివేశా దివౌకసః

ఆదితేయా దివిషదో లేఖా అదితినందనాః

ఆదిత్యా ఋభవో(అ)స్వప్నా అమర్త్యా అమృతాంధసః

బర్హిర్ముఖాః క్రతుభుజో గీర్వాణా దానవారయః

బృందారకా దైవతాని (పుంసి వా) దేవతాః (స్త్రియామ్)

దేవతలనువాళ్ళు వివిధ వ్యాఖ్యానాలను, నిర్వచనములను అనుసరించి జర రుజలు లేనివాళ్ళు అనగా జర =ముసలితనము, రుజ= రోగము మరణము లేనివారు. జన్మమొదలు ముప్పది వర్షములలోపు వయస్సులో నుండువారు. విషయములను

విశేషముగా తెలిసినవారు. ఐశ్వర్యము కలవారు. ప్రకాశించువారు, శుభాలనిడువారు , హవిస్సులను లెస్సగా గ్రహించువారు. సముద్రమునందు లభించిన అమృతమునందుకొన్నవారు. లెస్సగా కోరిన వరములను యొసగువారు. మంచి మనస్సు గలవారు. స్వర్గమును నివాసముగా కలవారు. మంచి లక్షణములుగలవారు.

ఈ రీతిగా పలు ఉన్నత / ఉత్తమ లక్షణయుతులు "దేవతలు"

ఇక స్తుతి లేక ప్రార్థన -

" స్తవః స్తోత్రం స్తుతిర్నుతిః " అని అమరము చెప్పుచున్నది. స్తూయతే అనేనేతి స్తవః – స్తవము, స్తోత్రము, స్తుతి > ఈ మూడును ఒకే అర్థమును ప్రతిపాదించును. స్తోత్రము చేయ బడును గనుక స్తవము. నుతింపబడును కనుక నుతి .

ఉన్న లక్షణాలను ఘనముగా చెప్పడము, లేని లక్షణాలను ప్రతిక్షేపించడము కూడా స్తుతిలో భాగమే! వాస్తవములో స్తుతి లేక పొగడ్త అను పదమునకు పలు పర్యాయపదములు కాన వచ్చును. ఉదారణకు కొన్ని ..పదములు -> అగ్గింపు, అంకన, అభివర్ణనము, అభినందనము, కైవారము, కీర్తనము, కొనియాట, పొగడికోలు, పొగడు, ప్రణుతి, ప్రశంస, ప్రస్తావన, ప్రస్తుతి, మెచ్చు, వందనము, శ్లాఘనము, స్తవము, స్తుతి, సన్నుతి, స్తోత్రము ఇత్యాదులు.

దేవతలలో కొన్ని భేదములు కలవు.

"ఇందులో (1) జన్మ దేవతలు. (2) కర్మ దేవతలు అని ప్రధానముగా రెండు తెరగులు. వారి ధర్మములు/ లక్షణాలు ఇట్లు చెప్పడమున్నది.

'అగ్ని , ఇంద్రుడు, యముడు, సూర్యుడు, వాయువు, వరుణుడు –మున్నగు వారు 'జన్మదేవతలు' అనబడుడురు. వీరు లోకోపకారులు. ఆయా అధికారముతో మొదట సృజింపబడి, వేదవిహితములైన యజ్ఞాదులకు ఉద్దేశ్యులయి తమతమ అధికారాలను /ధర్మాలను నిర్వర్తించుచు కడవరకుయుండి నశించువారు. వీరు మొదటివర్గము.

ఇక రెండవ వర్గము వారు 'కర్మదేవతలు' అను వర్గమువారు. వీరు తమతమ సుకృత కర్మములకు అనుగుణముగా స్వర్గాది లోక భోగములు అనుభవించి పుణ్యము క్షీణించిన తోడనే తిరిగి మానవ లోకమునకు చెందువారు. నహుషాదులు ఇందుకు ఉదాహరణ."[1]

---

పాదసూచికలు : - [1] ప్రాచీప్రచుర/పురాణనామచంద్రి/పుట90

వీరుకాక, పితృదేవతలు అనుమరొక వర్గము కలదు. వీరిగురించి ఇట్లు పేర్కొవటమున్నది. పితృదేవతలు మృతులు అయిన వారు. వీరు వారి పుత్రాదులచే చేయబడు కర్మాదులవలన తృప్తిని పొంది వారి సంతానమునకు, బాంధవులకు పొసగిన దుర్గతిని నివారింపను సద్గతిని కలుగజేయు సమర్థత కలిగినవారు.

ఇలువేల్పులు కులదేవతలు అను వారలను కొందరు ప్రస్తావించుట కూడా కలదు. నవీన పద్య కవులలో 'శ్రీశివలీలలు' రచించిన 'మడి పల్లి భద్రయ్య' తన పొత్తములో ఇతర దేవతలతో పాటు ఇట్లు తమ వంశవేల్పును స్తుతించినారు.

కం. " మడిపల్లి వంశవేల్పుగ

విడమరచెడువిజ్ఞతొసగు'వీరేశ్వరునే'

గుడికట్టి గుండెలందున

చెడు దూరముకాగ గొల్తు చిన్మయ మూర్తిన్" [1]

ఇందులో గుండెలలో గుడికట్టి తమవంశ వేలుపునుకొలుచుట కలదు.

అంతకు మునుపు ఈ రచయిత శ్రీ విఘ్నేశుని, బాసర వాసిని శారదను, వేములవాడ రాజరాజేశ్వరుని, షిరిడీ సాయిని,తాపాలను తీర్చమని గోపాలుని, ప్రత్యక్షదేవతలైన జననీజనకులకు స్తుతుల నిడినారు. పూర్వము తమ వంశముగురించి చెప్పడము కలదు. కొందరు తమ తల్లి, తండ్రుల, పూర్వీకుల పేర్లు చెప్పినారు.

దేవతలను వేదములలో పేర్కొనబడు '*వైదిక దేవతల'ని*, పురాణములలో కనిపించు '*పౌరాణికదేవత*లని, గ్రామములలో పూజింపబడు *'గ్రామదేవతల'ని* లేక జనపదములలో స్తుతులందుకొ నుట వలన '*జానపద దేవత'లని*, ఇటీవలి కాలములో వారి మహిమల వలన లేక ఇతర కారణముల వలన దైవత్వమును ఆపాదించి దేవతలని, గుళ్ళనుకట్టించుట, విగ్రహాలను ప్రతిష్ఠించుట చేసి '*ఆధునిక దేవత'లని* చెప్పినారు. దివ్య లక్షణములు గలవారినే కాక తమ రాజకీయ నాయకులకు విగ్రహములను కూడా ఏర్పాటు చేయుట చూస్తున్నాము. ఆయా ప్రాంతములకు సేవలందించిన వారి విగ్రహాలను కూడా స్థాపించుట కలదు. ఈ పద్దు చాలా పెద్దది కనుక ఈ విషయాన్ని ముగిస్తున్నాను.

---

పాదసూచికలు :'శ్రీశివలీలలు/మడి వీర భద్ర'[1].

స్తుతి - అసలు స్తుతి అనగ పొగడుట వేడుట, కోరుకొనుట, అడుగుట..అని చెప్పవచ్చును. ప్రస్తుతము మన పరిధిలో గల విషయము ననుసరించి కావ్యనిర్మాత యగు కవి ఎవరిని అడుగవలెను లేక స్తుతించవలెను ? ఎందుకు స్తుతించ వలెను? ఏమని స్తుతించవలెను?

అను ప్రశ్నలకు కొంత సమాధానము చూచెదము.

స్తుతి / ప్రార్థన అనునది కవి తన స్వంత నిర్ణయము ననుసరించి లేదా పోషకుని కోరిక ననుమోదించి కావ్యమును ఆరంభించును. అట్లు ఆరంభింప బడిన కావ్యము /గ్రంథము సక్రమముగా పూర్తి కావలయునుగదా! ఆ రీతి "గ్రంథనిర్విఘ్న సమాప్తి" నాకాంక్షిస్తూ, శ్రేయస్సులను కోరుకొనుచూ, నమస్కార రూపమునచేయు, మొదటి రచనయే స్తుతి/ప్రార్థన, అని ముందే చెప్పడము చూచితిమి. పరిమితులు గల జీవాత్మ, పరిమితులు లేని పరమాత్మను ప్రధానముగా ఇష్ట దైవ రూపములో కావలసిన దానినాశించి కోరుటే – స్తుతి /ప్రార్థన. కృతిపతికి క్షేమస్థైర్యముల ప్రసాదించ వేడుట మొదలుగా విషయములను ఇచట చూడగలము. స్తుతులలో పలు రీతులను పాటించుట గలదు. తొలుత కావింప బడు రచనలో కొన్ని లక్షణాలను పాటించుట అవసరమని పేర్కొనినారు. దానిని "ఆశీర్నమస్క్రియా" రూపములో నుండ వలెనని నిర్దేశించినారు. ఇది ప్రాచీన సంప్రదాయము.

కావ్య నిర్మాత యగు కవి, గ్రంథారంభమును చేయునపుడు తనకన్న ఉన్నతులైన వారిని ప్రార్థించి లేక స్తుతించి తన కావ్య నిర్మాణము సంపూర్ణముగా జరుగుటకు చేయు ప్రక్రియ స్తుతి. ఇచట స్తుతింపబడు వారు ఎవరు అను ఆకాంక్షకు సమాధానము 'దేవతలు'. ఆ దేవతా స్తుతిలో తనకిష్టమైన, కొండొకచో తన కృతిభర్త యున్నచో వారికి ఇష్టమైన దేవతలను స్తుతి రూపమున వేడుట. ఈ ప్రక్రియ కావ్య ఆరంభములో/ మొదట నిర్మాణ మగు అవతారికలో జరుగును కనుక ఈ అంశాలు గల మొత్తము 'ప్రక్రియ'ను "తెలుగు కావ్యావతారికలలో ఇష్ట దేవతా స్తుతి" గ నామము కలిగినది.

" స్తోత్రం కస్య న తుష్టయే " అని కాళిదాస సూక్తి.

సూక్తి ఎవరిదైనా అందలి మర్మము గొప్పదే! స్తోత్రము ఎవరిని సంతుష్టి చేయదు. లేని విషయములను కూడా చెప్పడమో, అసలువిషయమును మర్యాదగా చెప్పి మనసు నొప్పింపక కార్యము సాధించుటలో పలు ఉపాయములున్నవి. అట్టి ఉపాయములను మన

పెద్దలు చతుర్విధ ఉపాయములన్నారు. అవి వరుసగా – సామ, దాన , భేద, దండములని విపులీకరింప బడినవి.లక్ష్య సాధనకుగాను ప్రయోగింప బడినవి. వీటిని కొంత చూచెదము.'సామము' అనగా –ఒక వేదము, మంచిమాట,అనుకూల ప్రవర్తనా రూపక మైన ఒక ఉపాయము. సామము అనగా పాపమును నశింపజేయునది. పాపమును నశింపజేయునది అనియు చెప్పబడినది. వాంఛితమును పొందజేయునది ఉపాయము. సామము అను ఉపాయము ముఖ్యముగా నైదు విధములు అని వివరింప బడినవి. అవి క్రమముగా...

(1) పరస్పర ఉపకారము కనుపింప జేయుట.

(2) మంచితనము సేయుట.

(3) గుణములను కొనియాడుట.

(4) చుట్టరికమును తెలుపుట .

(5) నేను నీవాడనని మంచిమాట లాడుట .

ఇందులో మూడవది యగు 'గుణములను కొనియాడుట' అను దాని ద్వారా మనకు వలసిన సహాయము పొందుట అని మనము అన్వయించుకొనవచ్చును. ఆ అన్వయముననుసరించి ముందునకు వెళ్ళు ప్రయత్నము చేయుదము.

3 . 2 ***వర్ణనా నిపుణత***. ఇష్ట దేవతలను కొలుచుట / స్తుతించుట/ ప్రార్థించుట ఇందులో పేరేదైనా వలసిన ఫలమును పొందుట లక్ష్యము.

వర్ణన ఒక్కొక్క కవి ఊహను పట్టి మారుచుండును. కొందరు భక్తి భావనతో స్తుతి చేయడము చూడగలము. మరికొందరు తమకున్న ఇతర పాండిత్య అంశములను కలిపి స్తోత్రములో ప్రయోగించుట కలదు. ఉదాహరణకు చదువుల లలన సరస్వతికి తమ స్తుతులను సమర్పించిన కొన్ని అంశాలను పరిశీలింతము. నన్నయ గారు సృష్టి స్థితి లయ కారకులైన త్రిమూర్తులను వారి భార్యలుగా చెప్పబడు, శ్రీదేవి, వాగ్దేవి, దుర్గలను స్తోత్రములో ప్రస్తావించడము చూడగలము. తర్వాతి కవులలో వారివారి పదశక్తి, భావ యుక్తి, ప్రపూర్ణ భక్తి మున్నగువాటిని వాడుకొని కవితను రక్తి కట్టించుట చూడవచ్చును. ఒకే కవి తనకుగల విపుల వర్ణనా వైచిత్రితో చేసిన స్తోత్రములను చూద్దాము.

కవి సార్వ భౌముడైన 'శ్రీనాథుడు' , 'హరవిలాసము' లో భారతికి కావించిన ఉపాస్తి చూడండి.

కం. " వాణికి చరణా నత గీర్వాణికి ఏణాంక శకల రత్న శలాకా

వేణికి, పుస్తక వీణాపాణికి సద్భక్తితో నుపాస్తి యొనర్తుస్" [1]

హరవిలాసములో ఒక చిన్న కందములో శారదకు ఉపాస్తి యొనరించిన 'శ్రీనాథుడు' 'విద్వదౌషధమగు' నైషధములో  ఆ శారదను అద్భుతముగా వర్ణించినారు. తెల్ల తామర సింహాసనము, చంద్రుడు సిగలో పువ్వు, నలువ నాల్గు వదనములు కేళీ గృహాలు, సత్కవుల మనసు సరస్వతి సాహితీ సౌందర్యమును ప్రతిబింబించు  అద్దము, వేదాది విద్యలు ఆమె విహరించు స్థలములని వివరించారు.ఆయనే శృంగారనైషధములో ఆ శారదామూర్తిని అభివర్ణించిన తీరిది.

సీ.  " సింహాసనము చారు సిత పుండరీకంబు

చెలికత్తెజిలువారు పలుకు చిలుక

శృంగార కుసుమంబు చిన్ని చుక్కలరాజు

పసిడి కిన్నెర వీణ పలుకు తోడు

నలువ నెమ్మోముదమ్ములు కేళి గృహములు

తళుకు టద్దంబు సత్కవుల మనసు

వేదాది విద్యలు విహరణ స్థలములు

చక్కని రాయంచ యెక్కిరింత

గీ.  ఎప్పుడు నేదేవి కాదేవి యుందు కుంద

చంద్ర చందన మందార సార వర్ణ

శారదాదేవిమామక స్వాంతవీథి

నిండువేడుక విహరించుచుండుగాత! [2]

అట్టి చదువులతల్లి తనహృదయమున నిండువేడుకతో విహరించుచు యుండవలయునని కవిగారి ఆకాంక్ష. ఇదే శ్రీనాథకవి సార్వభౌముడు, 'అయః పిండం' అనబడు 'కాశీఖండం' లో ఆ శారదామూర్తికిట్లు స్తుతులర్పించినాడు.

---

పాద సూచికలు:- [1]హరవిలాసము /అవతా/శ్రీనాథ /4, [2] శృంగార నైషధ /శ్రీనాథుడు /ఆశ్వా.1/5

గీ. "కంఠపీఠిక నోంకారఘంట మొరయ

చెలగుగావుత మన్మనః క్షేత్రసీమ

కవికుటుంబంబుపాలిటిదివిజసురభి

జలజసంభవుబోటి భాషావధూటి' [1]

ఆ 'శ్రీనాథకవి' సార్వభౌముడే, ' ప్రౌఢ నిర్భర వయః పరిపాకమున కొనియాడిన భీమనాయకుని మహిమ' యైన 'భీమేశ్వర పురాణము'లో ఆ చదువుల తల్లికి సమర్పించిన సంస్తుతి ఇట్లున్నది.

సీ. "రాజీవభవుని గారాబుపట్టపుదేవి, అంచబాబానెక్కునలరుబోణి,

పసిడికిన్నెరవీణపలికించునెలనాగ పదునాల్గువిద్యలపట్టుగొమ్మ

ఈరేడుభువనంబులేలు సంపదచేడె మొలకచందురుదాల్పుముద్దరాలు,

నెలచాయకొదమ రాచిలుకనెచ్చెలికత్తెప్రణవపీఠికనుండు పద్మగంధి

గీ. మందరాచలకందర మధ్యమాన దుగ్ధ పాథోధిలహరికోద్భూతమైన

లలితసాహిత్యసాహిత్యలక్ష్మినొసగు, వరదయైమాకువినత గీర్వాణివాణి" [2]

ఇక ఈ కవి సార్వ భౌమునిదే చాటువుగ చెప్పబడు ఈ పద్యము చూద్దాం. అందులో 'సరస సద్గుణ నికురుంబ శారదాంబ' ను ఎందులకు అర్థించినాడో కూడా చూడగలము. అంతకు పూర్వము తనను పలు సందర్భాలలో ఆమె ఈ కవి సార్వ భౌమునికి వలసినంత సాయము చేసి ఇతనికి అద్భుతమైన కీర్తి ప్రతిష్ఠలు రావడానికి కారణమైనది.

సీ. " దీనార టంకాల తీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాల శాల

పలుకుతోడైతాంధ్రభాషామహాకావ్య నైషధగ్రంథ సందర్భమునకు

పగులగొట్టించితుద్భటవివాదప్రౌఢిగౌడడిండిమభట్టుకంచుఢక్క

చంద్రభూషక్రియాశక్తిరాయలయొద్ద పాదుకొల్పితిసార్వభౌమబిరుద

గీ. మెటుల మెప్పించెదో నన్ను నింకమీద రావు సింగ మహీపాలు దీవిశాలు

నిండుకొలువున నెలకొని యుండి నీవుసరససద్గుణ నికురుంబ శారదాంబ ![3]

---

పాదసూచికలు : [1] కాశీఖండం/శ్రీనా/ప్రథ/5, [2] శ్రీనాథ భీమేశ్వ/1/4 [3] తెలుగు విజ్ఞాన పీ/శృంగా .నైష /శ్రీనాథ /పు37

తనకు క్రితము దయను ప్రసరింపజేసి ధన్యత చేకూర్చినది, రావుసింగ భూపాలుని వద్ద, తనకు అండగా యుండ కాంక్షించి నాడు.

ప్రస్తుత పరిశీలనాంశము ఒక కవియే ఒక దేవతామూర్తికే, పలు సందర్భములలో ఆ దేవతా మూర్తి స్తుతులను చేసిన/ వర్ణించిన తీరు గురించి.

ఇచ్చట కవి శ్రీనాథుడు. దేవతా మూర్తి సరస్వతీదేవి. ఆ మూర్తిని తన గ్రంథములలో [1] హరవిలాసము, [2] శృంగార నైషధము [3] భీమేశ్వర పురాణము, [4] కాశీ ఖండము - అనువాటిలో మరియు ఒక చాటువును గ్రహించి చూచినపుడు తెలిసిన కొన్ని విశేష విషయములు ఇవి.

కొన్ని సందర్భములలో క్లుప్తముగా దేవికి స్తుతి అర్పితమైనది.

మరి కొన్ని సందర్భములలో విపులముగా స్తుతి చేయడమైనది. చాటువులో తెలిపిన ప్రకారము కవికి లభ్యమైన పేరుకు / ఉన్నతికి ఆ సరస్వతీ దేవి కృపయే , ఆలవాలము, నిలువుటెత్తు సాక్ష్యము, మరియు - ఆధారము. హరవిలాసములో వాణి యొక్క ఉపాస్తి పరికిస్తే ఇట్లు చెప్పగలదు.

కం. "వాణికి చరణానతగీర్వాణికి నేణాంక శకల రత్న శలాకా
వేణికి పుస్తక వీణా పాణికి సద్భక్తితో నుపాస్తి యొనర్తున్"[1]

అందులో దేవతలచే నమస్సులందినది. పుస్తకము, వీణను ధారణ చేసినది. ఏణాంక. మరొక స్తుతిలో ఆమె రాజీవభవుని గారాబు పట్టపుదేవి.

ఇక మరొక దేవతా స్తుతిలో వర్ణనను చూచెదము.

గణపతి స్తుతిని పలువురు కవులు చేయటము కలదు. నన్నయ్య గారు తమ రచనలో 'హరిహరాజగజాననార్క' యని హరిని , హరుని, అజుని, పేర్కొన్న పిదప గజాననుని స్మరించినారు. ఇచట గజాననుని ప్రత్యేకముగా కాక మందిలో ఒకడుగా చెప్పినట్లు చూడగలము.

తిక్కనగారు హరిహర మూర్తిని ధ్యానించినారు. ఇష్ట సిద్ధికై పరతత్త్వమును ఆరాధించినారు. "శ్రీయనగౌరినాబరగు చెల్వకు' యని శ్రీయు గౌరియు ఒకరే, హరి హరులు ఇరువురు ఒకరే యని 'అద్వైత' భావమును ప్రకటించినారు. విరాటపర్వమునుండి ఆయన

---

పాదసూచికలు : -[1] హరవిలా/అవతా/4/శ్రీనాథ

కావించిన  మహాభారత రచనలో, ప్రారంభమున చేసినదే 'సకల బ్రహ్మ ప్రార్థనంబు' గా చేసి ఆ తత్త్వమువలన తనకు ప్రసాదిత మగు కవితత్వ తత్త్వ నిరతిశయాను భావానంద భరితాన్తః కరణుడైనాడు. ప్రత్యేకంగా గణపతిని కానీ ఇతరులను కానీ తలచలేదు.  ఇదే రీతిగా వైష్ణవ సంప్రదాయియైన, సాహితీ సమరాంగణ సార్వభౌముడు కూడా  తన ఆముక్తమాల్యదలో తిరుమల వాసుడైన వేంకటభర్తను, అనంతుని, పక్షిరాజగు గరుడుని, విష్వక్సేనుని బెత్తమును, హరి పాంచజన్య మును, నందకమును, కౌమోదకిని, శార్ఙ్గమును, సుదర్శన చక్రమును, పన్నిద్దరు ఆళ్వారులను [విష్ణు భక్తులను] తలచి 'అని ఇష్ట దేవతా వందనంబు జేసి' నారు.  తన నిర్వచనోత్తర రామాయణ మున తిక్కన గారు 'శ్రీరాస్తాం మనుమక్షితీశ్వర భుజాస్తంభే'  యనుచూ కృతిభర్త ప్రస్తావన జేసినారు. మనుమసిద్ధి తిక్కనను మామా యని పిలిచి గౌరవించిన కారణమున తన 'నిర్వచనోత్తర రామాయణమును' ఆయనకు అంకితము జేసినాడు. ఇందులో మొదటి శ్లోకము తర్వాత చంపకమాలావృత్తపద్యముతో కృతిని ఆరంభించినాడు. అందులో "హరిహరపద్మగర్భులను"మాత్రమె పేర్కొన్నారు. వారి  దారలను కూడాప్రస్తావించలేదు. ఎఱ్ఱన గారు తమ హరివంశములో  గజాననుని ఘనముగా కీర్తించినారు.

మ. "కమలాక్ష స్మర ఘస్మరాబ్జ భవులుస్ గైవారు లంబోధి పూ
రములుస్ బుక్కితిసాము గోత్ర గిరి వర్గంబుస్ గనత్కందుకా
భముసంక్రీడన వేళ నేవిభునకాభవ్యుండు ప్రత్యూహ సం
తమసాదిత్యు డిభాననుండొసగు భద్రంబుం గృతిస్వామికిస్" [1]

ఇచట గణపతి ఘనతను కొంత చూద్దాము.  గణపతిని స్తుతిస్తూ కమలాక్షుడు, మదనుడు, ఘస్మరుడు సర్వభక్షకుడగు అగ్ని,  బ్రహ్మాదులచే పూజలుగొనువాడు, భవ్యుడైనవాడు, చీకటిని హరించు సూర్యుడు అయిన గజాననుడు కృతిపతికి భద్రముకూర్పకోరుట చూడగలము. ఎఱ్ఱన గారు తమ నృసింహపురాణములో తృప్తిగా ఏనిక మోము వేలుపును నుతియించినారు. భారత రచనలో ఆయన కావించినది ఆరణ్య పర్వ శేషము మాత్రమే కనుక, అదియును, ఆదినుండికాకనన్నయ్య గారువదలిన పద్యము తర్వాతనుండి. నన్నయ్య గారు కడపట రాసినపద్యము ఇది.

-----------------------------------------------------

పాదసూచికలు:[1] ఎఱ్ఱన /హరివంశము/ ప్ర/4

ఉ. " శారదరాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులం

జారు తరంబులయ్యె వికసన్నవ కైరవగంధ బంధురో

దార సమీప సౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణ క

ర్పూర పరాగ పాండు రుచి పూరము లంబరపూరితములై" [1]

ఇక భారతములోని పరిశిష్టభాగమును పూర్తి చేసి ఆంధ్రులకు సంపూర్ణ భారతమును అందించినాడు ప్రబంధ పరమేశ్వరుడు – ఎఱ్ఱన. ఎఱ్ఱన లో మరొక గొప్పతనమును గుర్తించ వలసి యున్నది. ఆయన తాను పూరించిన భాగము నన్నయ్య గారే రాసినట్లు చెప్పడము ఆయన ఉదార హృదయమునకు ఉదాహరణ. శ్రీమదాంధ్రమహాభారతం ఎఱ్ఱన పూరించిన ఆరణ్యపర్వశేషంలోని కవిత్వంలో ఆతడి ఆత్మీయతా ముద్ర కనబడుతుంది.అయినాను, సకలోకైక విదితుడైన నన్నయ భట్టు మహాకవీంద్రు సరస సారస్వతాంశ ప్రశస్తి తనను చెందగాతాను 'తత్ కవితా రీతియు కొంత దోప 'తద్రచన కా' అరణ్య పర్వ శేషాన్ని పూరించానని చెప్పుకొన్నాడు. అనగా ఎఱ్ఱాప్రెగ్గడ తాను వ్రాసిన భాగాన్ని నన్నయభట్టు పేరుమీదనే కొనసాగించాడు. ఆశ్వాసాంత పద్యాలు రాజరాజనరేంద్రుడి సంబోధనలే. 'ఆశ్వాసాంత గద్యాలలో 'ఇది సుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీ మహాభారతం బునందు '- అని రచించాడు. ఎఱ్ఱాప్రెగ్గడ చేసింది నిష్కామ సారస్వత సేవ. శైలిలోనూ, కొన్ని ఛందోవిషయాలలోనూ, ఎఱ్ఱాప్రెగ్గడ తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకొని ఉండటం చేత విమర్శకులు, సాహితీ వేత్తలు, ఈతడి భారతకవితకుగల విశిష్టతను గుర్తించి ఉన్నారు. భారత రచన వలెనే 'కవిత్రయం'లో ఎఱ్ఱనకు తరతరాల తెలుగు సాహిత్య చరిత్రలో సముచిత స్థానం లభించింది.

ఇప్పుడు ఎఱ్ఱన గారు తాను రాసిన భారతములోని తొలి పద్యమును ఆరణ్య పర్వములోనిది, నన్నయ్యగారు వదలిన తర్వాతది చూద్దాము.

---

పాదసూచికలు : [1] తితిదే ప్రచురణ భారతం ఆరణ్య/భాగముI /ఆశ్వా/4/141.

చ. 'స్ఫురదరుణాంశురాగరుచి వొంపిరి వోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంస సారసమధువ్రతనిస్వనముల్ సెలంగగా
కరమువెలింగె వాసరముఖంబులు శారదవేళ చూడగన్' [1]

అరుణాంశురాగ రుచి ఎఱ్ఱన కవిత్వారంభ స్ఫోరకమైన ధ్వనిగా పలువురు గుర్తించినారు. అదొక విశేషం ఇక వస్తువునకు సంబంధించి ఈ పద్యం తృతీయాశ్వాస కథార్థాలనుధ్వనింప జేస్తున్నది. అందుకే ఇది ఎఱ్ఱన ముద్ర గల పద్యం. నన్నయ బాటకు కొనసాగింపు. ఛందో రీతిగా చూచినప్పుడు నన్నయ గారు ఉత్పలమాల వృత్తమును వాడగా ఎఱ్ఱన గారు చంపకమాలను వాడినారు 'ర' ప్రాసగ ఇద్దరూ ప్రయోగించినారు. విజయసూచకమైన శారదరాత్రి నుండికథను, నన్నయ నుండి గ్రహించి, తన కథనమును ఎఱ్ఱన అరుణోదయంతో ఆరంభించినారు. ఎర్రనగారికి స్తుతితో ఆరంభించే అవకాశము మహాభారతములో కలగలేదు. కారణము ఆయన నన్నయ గారు వదలిన పద్యము తర్వాత నుండి ఆరంభించుటవలన. ఐతే శరత్కాలవర్ణనను సాగిస్తూ శారదను స్మరించడము జరిగినది. శారద శబ్దము ఎఱ్ఱన తన మొదటి పద్యములోనే ప్రయోగించినారు. నన్నయ తన చివరి పద్యము తొలుత శారద శబ్దమును వాడితే, ఎఱ్ఱన తన తొలిపద్యము చివర 'శారద' పదము ప్రయోగించినారు. పిదప తర్వాతి పద్యములలో, వచనములోప్రత్యక్షముగనో పరోక్షముగనో శారద, శరత్ శబ్దాలు ప్రస్తావితమైనవనుట వాస్తవము.

తార్ క్ష్యుడు అను గొప్ప ఋషి కొన్ని ధర్మ సందేహాలకు సమాధానములు కోరగా సరస్వతి బదులిచ్చినది. అప్పరమేశ్వరిని ప్రార్థిస్తూ ఆ ఋషి చేసిన స్తుతి ఇది.

---

పాదసూచికలు:[1] ఎఱ్ఱన / తితిదే ప్రచురణ భారతం ఆరణ్య/భాగము 2 /ఆశ్వా/4/142.

ఉ. "అంబ! నవాంబుజోజ్జ్వల కరాంబుజ! శారద చంద్ర చంద్రికా

డంబర చారుమూర్తి! ప్రకట స్ఫుట భూషణ రత్న రోచిరా

చుంబిత దిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్త నిజప్రభావ! భా

వాంబర వీధివిశ్రుత విహారి! ననుంగృపజూడు భారతీ ! [1]

ఇచ్చట కూడా వచ్చిన అవకాశమును ఎఱ్ఱన సద్వినియోగము చేసికొన్నాడు. తన మనసులోని ప్రార్థన మునిద్వారా చేసినాడననడం సబబేమో! ఇక్కడ కూడా శారద శబ్దము ప్రయోగింపబడినది. ఎఱ్ఱన భారతము రాయడం మొదలు పెట్టిన 70 గద్య పద్యాల అనంతరం అవకాశము వచ్చింది. తనపై దయను చూపమని అంబను అంబర మంటు ఆనందముతో అర్థించినాడు. నాభి నుండి నాదము వచ్చిన రీతిగా చదువులతల్లి పై యెదనుండి పదములు పొంగిపొరలినవి. కవి ఎవరని ప్రశ్నించుకోక తెలుగు పద్య ప్రియులు దీనిని పఠిస్తున్నారు. ఈ కవిత్రయము వేర్వేరుగా చూచినప్పుడు తోచే భావాలు ఏమో కానీ మహాభారతము అంతయూ ఒకే తీరుగ కనిపించుట విశేషము. వీరి గురించి డా. పాటిబండ మాధవ శర్మగారు, ఆరణ్య పర్వములోని ఆరవ ఆశ్వాసమునందలి 103 వ పద్యానికి వ్యాఖ్యనిలా చేయటము కలదు. అయ్యది త్రివేణీ సంగమము అని వివరించినారు. పారాశర్యుడు అచటికి అరుదెంచినాడు. వేదవ్యాస మహర్షి మహాభారత రచయిత. తెలుగులో మహాభారతాన్ని నిర్మించిన కవిత్రయం వేదవ్యాస మహర్షిని ఉప్పొంగిన డెందంతో అభివర్ణించారు.

వ్యాసుడి యెడ కవిత్రయానికి గల భక్తి ప్రపత్తులు వారు వ్రాసిన పద్యాలలో తొణికిసలాడుతుంటాయి. నన్నయభట్టు పారాశర్యుడిని అభివర్ణించిన పద్యం – ఈ రీతిగా కలదు.

---

పాదసూచికలు:[1] ఎఱ్ఱన / తితిదే ప్రచురణ భారతం ఆరణ్య/భాగము 2 /ఆశ్వా/4/215.

" నీలగిరీంద్ర శృంగమున నిర్మలమైన సువర్ణ వల్లరీ
జాలము వోని పింగళ విశాల జటాచయమొప్పగా వచ
శ్శ్రీలలితుండు వచ్చి నిలిచెన్ హరినీల వినీల విగ్రహా
రాళ రుచుల్ వెలుంగగ పరాశర సూనుడు తల్లి ముంగటన్"

వేదవ్యాసునిగురించి నన్నయ వేరొక చోట వ్రాసిన పద్యము తిక్కన గారికి ఒజ్జబంతి అయిందని చెప్పడము జరిగినది. ఇక వ్యాసుని వర్ణిస్తూ తిక్కయజ్వ కూర్చిన పద్యము చూడండి.

" విద్వత్ సంస్తవనీయ భవ్యకవితావేశుండు విజ్ఞాన సం
పద్విఖ్యాతుడు సంయమిప్రకర సంభావ్యానుభావుండు కృ
ష్ణ ద్వైపాయనుడర్థి లోకహితనిష్ఠంబూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్" ఇప్పుడు ఎర్రాప్రెగడ దర్శించిన వ్యాసమహర్షి రూపము చూచెదము.

' క్రింది పద్యమునదలి ధార నన్నయది. విఋపులు తిక్కనవి. పదము లిరువురివి. కూర్పు ఎఱ్ఱనది. ఈ పద్యమున కవిత్రయమున్నది. కవిత్రయమున కాశ్రయమైన వేదవ్యాసుడున్నాడు. ఇది మూడు రుచుల మువ్వన్నె సొబగు –అన్నారు డా. పాటిబండ మాధవ శర్మ.

శా. 'ప్రీతుండై చనుదెంచె నాశ్రిత జనాభీష్ట క్రియాశీలుడు
ద్గీతామ్నాయుడు నిర్విధూత దురితక్లేశుండు, యోగామృత
స్ఫీత స్వాంతుడనంత సంతత సమావిర్భూత కారుణ్య ధా
రాతోయస్నపనైక శీలుడగు పారాశర్యు డచ్చోటికిన్' [1]

కవిత్రయ కవిత ఆంధ్రమహాభారతంలో త్రివేణీ సంగమంవలె కలిసింది.

---

పాదసూచికలు: తితిదే ప్రచురణలు 1 ఆది నన్నయ/ ఆశ్వా/4/240, తితిదే ప్రచురణలు 2 తిక్కన/విరాట/ప్రథమ/3, తితిదే ప్రచరణ పుట 67 లో సంపుటం 5 ఎఱ్ఱన ఆరణ్యపర్వభాగంలో /6/103

'ననుం కృప చూడు భారతీ' అని ఎఱ్ఱన చేసిన సంబోధన గురించి ఒక వ్యాఖ్య ఇట్లు చెప్పడము గలదు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆరణ్యపర్వ శేషం లోని కథార్థాలకు భారతీ వృత్తి పరమ రమణీయంగా అమరి ఉంటుంది. కైశికి దానికి ఉపబలకంగా ఉంటుంది. అందుకే కాబోలు తెలుగు సాహిత్యంలో వెలసిన భారతీ స్తుతులలో పరమోదాత్తమైన పద్య శిరోమణి ఎఱ్ఱయ గళంలో వినిపించింది. భక్తి రసావతారమైన పోతన్నను కూడా ప్రలోభపెట్టిన పద్య రాజము [ఆరణ్య/ఆశ్వా/4/215] 'అంబనవాంబుజోజ్జ్వలకరాంబుజ శారద చంద్ర చంద్రికా' అనునది.

ఈ సందర్భములో, తమ 'కవిత్రయ భారత జ్యోత్స్న' లో ఆచార్య శలాక రఘునాథశర్మ గారు ఇలా తమ భావాన్ని వ్యక్తం చేసినారు. [పుటలు 43-45 ]

"ఇది మార్కండేయమహర్షి ధర్మరాజునకు తెలియ చెప్పిన సరస్వతీ గీత అనే ఇతిహాసములోనిది. ఎఱ్ఱయ చేసిన సరస్వతీ స్తుతి. నాద రమ్యతగల ఉత్పలమాల. వెనుకటికి తార్ క్ష్యుడను మహర్షి భారతీదేవిని ఆరాధించాడు.

ఆమెను పురుషుడాచరించ వలసిన ధర్మం ఏమిటి? చిరకాలం పుణ్యగతులు పొందాలంటే సాధించవలసిన ధర్మం ఏమిటి? అని ప్రశ్నించాడు. అ జ్ఞానసరస్వతి అతని ప్రశ్నలకు సమాధానంగా చెప్పిన వాక్యాల సముదాయమే సరస్వతీగీత. అది విని పరమానదముతో ఆ సరస్వతిని ఈ విధంగా స్తుతించాడు.

తా: అమ్మా! భారతీ! నీవు కొంగ్రొత్త పద్మాన్ని పద్మం వంటి నీచేతిలో ధరించి ఉన్నావు. శరత్కాలపు చంద్రుని వెన్నెల చాలా ఎక్కువదట్టంగా ఉంటే, దాని వంటి మనోజ్ఞమైన ఆకారం నీది. నీవు ధరించిన నగల రత్నకాంతులు దిక్కుల చివరలను తాకుతూ వాణిని కాన్తికలవిగా చేస్తున్నాయి. వేద సూక్తాలు నీ ప్రభావాన్ని చక్కగా చాటి చెబుతున్నాయి. హృదయంలోని ఆకాశమార్గంలో నీ యీమహిమ ప్రకటితమౌతూ వినవస్తూ ఉంటుంది. నన్ను దయచూడు తల్లీ! భారతి చదువులతల్లి. అన్ని చదువులు ఆమె నుండి ఆవిర్భవించినాయని భావం. జ్ఞానవిజ్ఞానాలన్నిటినీ భరిస్తుంది కనుక భారతి.

ఆమె చేయిఅనే పద్మములో అప్పుడే అప్పుడే వికసించిన పద్మం ఉంది. పద్మం జ్ఞానానికి సంకేతం. అది మొగ్గగా ఉన్నప్పుడు ఏక ముఖముగా చూస్తుంది. వికసించినప్పుడు సర్వతో ముఖంగా - అన్ని వైపులా రేకుల కొనలుచూస్తూ –ఉంటుంది. నిజమైన వికాస లక్షణం ఇది అని తెలియ జెప్పటం అందులోని సంకేతం.అది అంబుజం – నీటిలో పుట్టేది. పంకజం అని కూడా అంటారు.బురదలో పుట్టేది. నీట్లో పుట్టినా, బురదలో పుట్టినా అంటూ సొంటులు లేకుండా చక్కని కాంతితో అందరి హృదయాలను ఆకర్షిస్తూ ఉండటం దాని లక్షణం. నిజమైన విద్య ఆ విధంగా ఉంటుంది. అటువంటి సంకేతమైన పద్మం, పద్మం వంటి అమ్మ చేతిలో కాంతులు విరజిమ్ముతూ ఉన్నది. 'నవ' అనటం చేత ఎన్నటికీ వాడిపోవనిది, వన్నె తరుగనిదీ అని భావన. పద్మంలో చక్కని పరిమళం కూడా ఉంటుంది. అది సుదూర ప్రదేశాలకు వ్యాపిస్తూ ఉంటుంది. జ్ఞాన కిరణాలు కూడా హృదయగుహలో లోతులకుచొచ్చుకొని పోతాయి. ఆ తల్లి "శారద చంద్ర చంద్రికాడంబర మూర్తి". శరదృతువులో ఆకాశం నిర్మలంగా ఉంటుంది. నీరు స్వచ్ఛంగా ఉంటుంది. ప్రకృతి అంతా ప్రసన్నంగా ఉంటుంది. ఆకాల విభాగంలోని చంద్రుని కాంతి సర్వ జీవకోటి హృదయాలను పరవశింపజేస్తుంది. సరస్వతిని సర్వశుక్ల అంటారు. నిలువెల్లా తెల్ల దనమే అయిన తల్లి. ఆమెకు పోలిక చెప్పాలంటే శరత్కాలపువెన్నెల ఒక్కటే సరిపడు తుంది. చంద్రునిలో మచ్చ ఉండవచ్చుగానీ చంద్రికలో ఉండదు.అందుకని తెల్ల దనానికి చంద్రికను ఉపమానముగా తీసుకున్నారు. "ప్రకటస్ఫుట భూషణరత్నరోచిరాచుంబిత దిగ్విభాగ". ఆమె చాలా చక్కగా లోకానికి కనపడేవిధంగా భూషలు ధరించింది. ఆమె భూషలంటే చదువులలోని మర్మాలే! వానిలోని రత్నకాంతులు అన్ని వైపులా ప్రసరించి దిక్కు లన్నింటినీ కమ్మగా తాకుతున్నాయి. అంటే అమ్మ పెట్టుకున్న ఆభరణాల కాంతు లయిన విద్యలమర్మాలు. ఆమె ఎక్కడ ఉన్నా అన్ని దిక్కుల అంతాలను స్పృశిస్తున్నాయి. జ్ఞానజ్యోత్స్నలకు అవధులు ఉండవని తాత్పర్యం. అయినా ఆమె నిజమైన ప్రభావం చక్కగా తెలియాలంటే శ్రుతిసూక్తులను ఆశ్రయించ వల సినదే. వేదమంత్రాలుఆమె స్వరూపంతోనే వెలువడినవి కనుక ఆమె ప్రభావం విస్పష్టంగా తెలుసుకోవాలంటే వేదసూక్తులనే ఆశ్రయించాలని

తాత్పర్యం. ఆ విద్యామాతను వెలుపల చూచే ప్రయత్నం సాధారణంగా సఫలం కాదు. భావాంబర వీధిలో దర్శించాలి.అంటే గుండె గుడిలో చూడాలి. అది హద్దులు లేని గగనం వంటిది. నాదలక్షణం గుర్తుగా తెలియదగినది. శంకరుణ్ణి నాదతనువు అంటారు. నాదమే ఆయన దేహం. ఈ భావాంబరం అదే. ఆ వీథిలో వినవస్తూ విహరిస్తుంది ఆ తల్లి. అంటే ఆమె చైతన్యస్వరూపంతో సర్వజీవుల హృదయాలలో జ్ఞానమూర్తియై తోస్తుంది అని అర్థం. తార్క్ష్యుడు తన అనుభూతిని అక్షరస్వరూపం చేసిస్తుతించాడు. భారతి లోపలా వెలుపలా ఎలా ఉంటుందో , ఆమెను ఎలా గుర్తించాలో ఒక మనోహరమైన అక్షర చిత్రాన్ని రూపొందించి మనకు అందించాడు.

ప్రత్యేక ప్రస్తావన {*} :- నాదబ్రహ్మ త్యాగయ్య గారు ఒక కృతి [శంకరాభరణ రాగము, ఆది తాళము] లో ఇట్లు చెప్పడము చూడగలము. ఆ కృతి ఇది. "స్వరరాగ సుధా రస యుత భక్తి స్వర్గాపవర్గమురా ఓ మనసా" పరమానందమనే కమలముపై బక భేకము చెలగి ఫలమేమి ఓ మనసా? కమలము ప్రక్కనే అదే కొలనులో ఉన్న బకము [కొంగ] భేకము [కప్ప] గ్రహించలేని మరందమును ఎక్కడో ఉన్న తేటి ఎగురుతూ వచ్చి గ్రహించడము ప్రకృతి సిద్ధమైన విషయము. సాహిత్యములోని స్వారస్యమును గ్రహించుట కూడా " అనుభవైక వేద్యము" ఇదొక ప్రత్యేక విషయము"

3.3 ***<u>నన్నయ్య అందించిన వినిర్మాణము</u>*** :- నన్నయగారు తమ మహాభారతేతి హాసమును త్రిమూర్తుల స్తుతితో ఆరంభించిన విషయము తెలిసినదే. తర్వాతి కవులు క్రమక్రముగా కొన్ని నూతన ప్రయోగాలు మార్పులు కాలానుగుణముగా చేస్తూ వచ్చినారు. కవులు రాజుల ఆశ్రయము పొంది రాజుల అభిమతాను సారముగా కవిత చెప్పడము వారిని కృతిభర్తలుగా చేసి కావ్య నిర్మాణములు చేయటము మొదలైన పిదప పీఠికలలో లేక అవతారికలలో చేయబడుచు వచ్చిన దేవతా స్తుతులయందుపెను మార్పులు చోటుచేసుకున్న విషయము అందరికి తెలిసినదే! నన్నయ గారు త్రిమూర్తులు శ్రేయమును చేకూర్చుదురుగాక – అని అనిన తర్వాత, మరొక స్తుతి కావించినారు. అది చూద్దాము.

**తరలము** "హరిహరాజగజాననార్క షడాస్య మాతృ సరస్వతీ

గిరిసుతాదిక దేవతా తతికిన్ నమస్కృతి సేసి దు

ర్భరతపోవిభవాదికున్ గురు పద్యవిద్యకు నాద్యు నం

బురుహగర్భనిభుం, బ్రచేతసుపుత్త్రు భక్తిదలంచుచున్" [1]

యథా తథాముగా తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే ప్రచురితమైన శ్రీ మదాంధ్ర మహాభారతమునందలి వివరణాదులు ప్రస్తావితము చేస్తాను.

" ప్రతిపదార్థం : హరి, హర+ అజ, గజానన + అర్క, షట్+ఆస్య, మాతృ, సరస్వతీ, గిరిసుత+ఆదిక, దేవతా తతికిన్ = విష్ణువు, శివుడు, బ్రహ్మ, యేనుగు మోముగల వినాయకుడు, సూర్యుడు, ఆరు ముఖములుగల కుమారస్వామి, లక్ష్మి, సరస్వతి, హిమవంతుని కూతురైన పార్వతి మొదలైన దేవతల సమూహానికి; నమస్కృతి+చేసి = [గసడదవాదేశ సంధి] నమస్కారం చేసి; దుర్భర, తపః, విభవ+అధికున్=[భరింపరాని]

అధికమైన తపస్సు యొక్క వైభవంచేత గొప్పవాడున్నూ; గురున్ = గొప్పవాడున్ను, ఆచార్యుడున్ను, అజ్ఞానాన్ని పోగొట్టేవాడున్నూ,; పద్యవిద్యకున్ = పద్య(శ్లోక) రచనా సంప్రదాయజ్ఞానానికి; ఆద్యున్= మొదటి వాడున్నూ (ఆదికవి), అంబురుహ గర్భ, నిభున్ = బ్రహ్మతో సమానుడైన వాడున్నూ, అయిన; ప్రచేతసు, పుత్త్రున్ = ప్రచేతసుని కుమారుడైన వాల్మీకిని; భక్తిన్= భక్తితో; తలంచుచున్=స్మరిస్తూ.

తాత్పర్యం: విష్ణువు, శివుడు, బ్రహ్మ, వినాయకుడు, సూర్యుడు, కుమారస్వామి, తల్లియైన లక్ష్మి, సరస్వతి, పార్వతి మొదలైన దేవతల సమూహానికి నమస్కారం చేసి, అధికమైన తపస్సంపదచేత, గొప్ప వాడున్నూ, అజ్ఞానాన్నితొలగించే ఆచార్యుడున్నూ, పద్య(శ్లోక) రచనా సంప్రదాయాన్ని ప్రవర్తింపచేయటంలో ఆదికవియున్నూ, బ్రహ్మతో సమానుడున్నూ అయిన ప్రచేతసుడి కుమారుడైన వాల్మీకిని భక్తితో స్మరిస్తూ.

---

పాదసూచికలు: [1] కవిత్రయ భారతం/ఆది/ఆశ్వా-1/21/పుట16

<u>*విశేషం:*</u> కావ్యారంభంలో త్రిమూర్తులను, వారి భార్యలను, విఘ్నేశ్వరు డు మొదలైనదేవతలను భక్తితో స్మరించటం కవులకు పరిపాటి. ఈ సంప్రదాయానికి సంగ్రహంగా నయినా మార్గ దర్శకు డయింది నన్నయయే. అతడు సూర్యుడినీ, కుమారస్వామిని కూడా స్మరించాడు.

'మాతృ'శబ్దానికి సప్త మాతృకలు, లేదా అక్షర మాతృకలు అనే అర్థాలను కూడా చెప్పవచ్చును. తరువాతి వారు వీరిని స్మరించటం అరుదుగా కనపడుతుంది.

సంస్కృతములో రామాయణం రచించిన వాల్మీకి ఆదికవిగా పరిగణింపబడుతున్నాడు. " మానిషాద ప్రతిష్ఠాం త్వమ్" అనేది అతడు చెప్పిన మొదటి శ్లోకమని అంటారు. అంతకు ముందువెలసిన ఉపనిషత్తులలో కొన్ని శ్లోకాలు ఉన్నవి. అవి వైదికాలు. లౌకిక సంస్కృతములోమొట్ట మొదట శ్లోకం వ్రాసినవాడు వాల్మీకియే కావచ్చును. ప్రచేతసుడు ఒక ఋషి. ప్రచేతసుడు అంటే వరుణుడు అనే అర్థం కూడా ఉన్నది. అలంకారము : ఉపమాలంకారము.

గురుపద్యవిద్యకు ఆద్యుస్ అనే పాఠాంతరము ఉన్నది. గొప్పదైన పద్య(శ్లోక) రచనా సంప్రదాయానికి మొదటి వాడని దీనికర్థం. ఇదే ఉచిత పాఠమని తోస్తున్నది.

'గురుపద్యవిద్యకు ఆద్యుడు' అనే విశేషణం వాల్మీకికి ఎంత వర్తిస్తుందో నన్నయకూ అంత వర్తిస్తుంది. వాల్మీకి సంస్కృతంలోనూ, నన్నయ తెలుగులోనూ గురుపద్య విద్యకు ఆద్యులైన ఆది కవులు. వాల్మీకి మహాకవి అంశ నన్నయలోఉన్నదని ఈ విశేషణం ధ్వనింప చేస్తున్నది. ''మధుమయ ఫణితీనాం మార్గ దర్శీ మహర్షిః '' అనే భోజుడి ప్రశంస వాల్మీకితో బాటు నన్నయకు కూడా సార్థకంగా వర్తిస్తుంది. ఇష్టదేవతా స్తుతి, పూర్వకవిస్తుతి అనబడే అవతారికాంగాలను నన్నయ ఈ పద్యములో నిర్వహించాడు.

**తిక్కన గారు విరాటపర్వమునుండి మహా భారత రచన చేసినది అందరికిని తెలిసిన విషయమే. ఈ మహా ఇతిహాసమును ఆయన 'హరిహరనాథతత్త్వ స్వరూపము' యొక్క ప్రార్థనతో ఆరంభించినాడు.**

ఈ హరిహరనాథుడు వైదికధ్యాయిత కిచ్చమెచ్చే పరతత్త్వం. అతడు సర్వేశ్వరుడు. నిరాకార నిరంజనుడు. ఆనంద స్వరూపుడు. తిక్కన హరిహరుడికీ, ఆనందముద్రకు అవినాభావ సంబంధాన్ని భావించాడు. [మహాభారతము విరాట పర్వము పీఠిక పుట 24 -25 , తితిదే ప్రచు]

ఆరుద్ర గారు అర్థంగా వివరించారు – అని చెప్పడము ఇట్లున్నది.

“ ‘ఆనందం’ అన్నది తిక్కన గారి ఆశయం. భారతంలోప్రతి పర్వాంత ములో ఆనందముద్ర ఉంటుంది. హరిహరనాథుడిని ఆనందరూపునిగావారు ఊహిం చారు. పర్వాంత పద్యాలలో ఆఖరి సంబోధనలు ఎలా ఉన్నాయో చూడండి.

1. విరాట పర్వాంతం - ఆనంద సంస్తూయమానా!
2. ఉద్యోగ పర్వాంతం – పరమానందానుభూత్యేకరూపా!
3. భీష్మ పర్వాంతం – సంతతానంద సాంద్రా!
4. ద్రోణ పర్వాంతం – శాశ్వతానందమూర్తీ!
5. కర్ణ పర్వాంతం – నిర్భరానంద దేహా!
6. శల్య పర్వాంతం – ఆనంద రూపా!
7. సౌప్తిక పర్వాంతం – సుస్థిరానందభాసా!
8. స్త్రీ పర్వాంతం – ఆనంద శీలా!
9. శాంతి పర్వాంతం – భాస్వదానంద మార్గా!
10. అనుశాసనిక పర్వాంతం – నిష్కలానంద మూర్తీ !
11. అశ్వమేధ పర్వాంతం – దర్శితానంద వర్త్మా !
12. ఆశ్రమవాస పర్వాంతం –సానంద వర్గా!
13. మౌసల పర్వాంతం – ఆనంద ప్రకాశ స్వరూపా!
14. మహా ప్రస్థానిక పర్వాంతం – సంభృతానంద లీలా!
15. గ్రంథాంతం - సంభృతానంద భావా!

పర్యాంతంలో ఆనంద ముద్రను వేసిన తిక్కనగారు గ్రంథాదిని దానిని వాడారా అన్న అనుమానం కలుగుతుంది. 'శ్రీయన గౌరినాబరగు...' అనే మంగళాచరణం అయ్యాక వెంటనే తిక్కనగారు వచనంలో ఆనంద ముద్ర వేశారు. ".... అని సకల బ్రహ్మ ప్రార్థనంబు చేసి, తత్ప్రసాదా సాదిత కవిత్వతత్త్వ నిరతిశయానుభావానంద భరితాంతః కరణుండ నగుచు....' (విరా1-2) అయితే కావ్యం మొట్ట మొదటి పద్యంలో కాక రెండవ నెంబరు వచనంలో 'భావానందం' ఉంది. కనుక గ్రంథాంతంలో ఉపధా పద్యంలో ( ఆఖరి దానికి ముందున్న దానిలో) కూడా భావానందం వాడితే గానీ శిల్పంలో నిండుదనం రాదు. అందుకే ఆ ఉపధాపద్యం లోపలే ' కేవల భావానందమయా! వేద వ్యాస వర్ణనా రూఢదయా!' అని ఉపధా చరణంలో వాడి సరి పుచ్చారు [స్వర్గా /96]"

[ ఆరుద్ర - సమగ్రాంధ్రసాహిత్యం 2 సం. పుటలు131-133 ]

నన్నయ్య అందించిన వినిర్మాణమును తిక్కన గారు ఎంతవరకు అనుసరించినారో చూద్దాము. పైన ఆనందస్థితి తిక్కనగారిది అని చెప్పడము చూచినాము. ఆ హరిహర (తత్త్వ) దర్శనం చూద్దాము.

" తిక్కన భారత కృతిపతి హరిహరనాథుడు. భారత రచనా కుతూహలుడైన తిక్కన తన కృతిని ఎవరికంకిత మీయాలా? యని ఆలోచిస్తూ ఇంచుక నిద్రించాడు. అందులోఒక మహనీయస్వప్నం వచ్చింది. తిక్కన తండ్రి కొమ్మనామాత్యుడు కలలో కనబడ్డాడు. తిక్కన చేసిన నమస్కారాలందుకొని, కరుణా దృష్టి తో చూచాడు. తిక్కన ఇది వరలో చెప్పిన, "కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్ , కిం కాలకూటః కిము వా యశోదా స్తన్యం తవసాదు వద ప్రభో మే" యను శ్లోకాన్ని విని దయాళుడై భక్తవాత్సల్యంతో అతడిని కృతార్థుడిని చేసి, ఒక కార్యాన్ని అతడి వలన పొందాలనే అభిలాషతో హరిహరనాథుడు వస్తూ కొమ్మనకు తన సంకల్పాన్ని దివ్యశక్తితో తెలిసేటట్లు చేసి, ముందుగా తిక్కన దగ్గరికి అతడిని పంపాడు. హరిహర నాథుడు తన సన్నిధానం కల్పిస్తున్న వైఖరిని కొమ్మన ముందుగా తిక్కనకు ప్రకటించినాడు. తిక్కన సంభ్రమముతో ఆ వైపు చూచాడు. ఎదుట హరిహర నాథ స్వామి ప్రసన్నుడైనాడు.

సీ. 'కరుణారసము వొంగి తొరగెడు చాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువాఱ
హరినీల పాత్రిక సురభి చందనమున్న
గతి నాభి ధవళ పంకజము మెఱయ
గుఱియైన చెలువున నెఱసిన లోక ర
క్షణ మనంగ గళంబు చాయతోప
ప్రథమాద్రి తోతెంచు భాను బింబమునా ను
రమ్మున కౌస్తుభ రత్న మొప్ప

గీ. సురనదియును కాళిందియును బెరసి నట్టి
కాంతి పూరంబు శోభిల్లు శాంతమూర్తి
నా మనంబు నానంద మగ్నముగజేయ
నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు' [1]

ఆంధ్ర సాహిత్యములో హరిహరనాథుడి అపూర్వమైన అద్భుతమూర్తిని కల్పించి శిల్పించి తెలుగువారి కన్నులముందు నిల్పిన అక్షర భావచిత్రశిల్పి తిక్కన. తండ్రిగారు అదిగో చూడుమని చెప్పింది హరిహరనాథుడిని. కాని, తిక్కన ఎదుట నిలిచింది సర్వేశ్వరుడు. ఇదేమిటన్నది మొదటి ప్రశ్న. దీనికి బ్రహ్మశ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రి గారిట్లా వ్యాఖ్యానించారు. ' తిక్కనయజ్వమనము ఆనందమగ్న మైనదట!...సర్వేశ్వరుని సన్నిధి చేత. ఆ సర్వేశ్వరుడు యే రూపమును ధరించి సన్నిధి చేసెను? కేవల హరి రూపమును కాదు, కేవల –హర రూపమును కాదు. ఇప్పు డాతనికట్టి వేరువేరు రూపములతో తృప్తి కలుగదు. ఆ మహాభాగుడపు డద్వైతమూర్తి. సర్వజ్ఞుడు. సర్వాంతర్యామియునగు సర్వేశ్వరునకు తదాశయము విదితమే.

---

పాదసూచికలు: [1] తితిదే ప్రచురణలు 2 తిక్కన/విరాట/ అశ్వా 1/12]

కావుననే అతడిప్పుడు కేవల హరిరూపమున గానీ, కేవల హర రూపమునగానీ తన భక్త వతంసుడగు  తిక్కయజ్వకు దర్శన మీయ తలంచ లేదు. ఆ రెండు రూపములేక భావము నదిన గానీ కుండలీంద్రుడు ( తిక్కన సోమయాజి) మెచ్చడని తానెఱుగును. శైవ వైష్ణవభేద కల్లోల విజృంభణ కీ పృథగ్భావమే కారణమగుటచే అది కవి బ్రహ్మకు అనభిమతము. కావున భక్తహృదయానువర్తియగు సర్వేశ్వరుడు తనకిట్లు సన్నిధి చేసెనని కవిబ్రహ్మ స్వయముగా తెలుపుచున్నాడు.(తిక్కయజ్వ హరిహరనాథతత్త్వము పు.18-19)
'శివాయ విష్ణు రూపాయ శివ రూపాయ విష్ణవే శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః' అనే మంత్రార్థం అలంకార ధ్వని వలన స్ఫురిస్తుంది. ఆ తత్త్వం పఠితను ఆనంద మగ్నం చేస్తుంది. దీనిని ఈ పద్యం ధ్వనింప జేస్తుంది.
నన్నయ్య ఎట్లైతే మొదట చెప్పిన శ్లోకమును తర్వాత రాజ శబ్దముతో మొదటి పద్యమును చెప్పి శ్రేయమును లక్షణమును కూడా సాధించినారో అదే పద్ధతిని, విరాటపర్వములో తొలుత హరిహరనాథ రూపమును అందించి, తాను సాధింపతలచిన  'ఆనందము'ను పిదపఅందించుట తిక్కన చేసినాడు. ఈ విషయములో నన్నయ్యను అనుసరించినాడు. ఇచట మరొక విషయమును కూడా చెప్పవచ్చును.
తిక్కన హరిహరనాథ తత్త్వవిచారములో ఆచార్య పింగళి లక్ష్మీ కాంతం గారిఈ క్రింది మాటలు విలువైనవి. "కల్పితము ఐన నామరూప భేదములచే భగవంతుని పేరను, మతము పేరను దారుణ కలహాలకు లోనై అలజడి పొందుచుండిన ఆంధ్రులకు తిక్కన ప్రసాదించిన భగవత్తత్త్వము హరిహరనాథుడు'
[పీఠిక పుట 25 తితిదే ప్రచురణ/ భారతము/విరాట పర్వము]  ఈ రీతిగా నన్నయగారు అందించిన వినిర్మాణమును కాలానుగుణ మార్పులతో తర్వాతి కవులు ముందుకు తీసుకొని పోయినారు.

****** ****** *****

# చతుర్థాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు-శైవసంబంధస్తుతులు

# IV. *చతుర్థాధ్యాయము*

4. ***శైవసంబంధ స్తుతులు.*** పరబ్రహ్మము ఒకటే యను భావము కలిగియూ, ఆ పరబ్రహ్మను పలు కోణములలో ఆవిష్కరించినది – 'హిందూమతము'. ఈ దేశములోని ఒక ప్రత్యేకత ఇట్లు పేర్కొనవచ్చును. మత పరమగు ఆలోచనా విషయములో ఈ దేశములో గల స్వేచ్ఛ, విశాల ఆలోచనా పరిధి విశిష్టమనక తప్పదు. పరమాత్మ స్వరూపమును ఇచ్చటి పెద్దలు కనుగొనుటకు ప్రయత్నించిన తీరు, వారి అనుభవములో ఆ పరమాత్మ వ్యక్తమైన విషయము అసాధారణము. వ్యక్తావ్యక్త స్వరూపము పరమాత్మ. అన్నమయ్య గారు తన సంకీర్తనములో ఇట్లనడం గమనింపవచ్చు. "పచ్చిపాలలోన వెన్నవంటి వాడు పరమాత్ముడు".

విష్ణు శబ్దమునకు "విశ్వం వ్యాప్నోతి ఇతి విష్ణుః" అని నిర్వచనమిచ్చినారు. ప్రతి నామము ఒక అర్థము కలిగియుండుట మనము జాగ్రత్తగా పరిశీలించినచో తెలిసికొనగలము. ఇట్టి నిర్వచనాది విషయ వివేచన వేరేప్రాంతములలో/ దేశములలో యున్నదేమో తెలిసికొన ప్రయత్నములు జరుగుగాక! ప్రస్తుతము కవులు తమకృతులలో/కావ్యములలో మొదట పద్యమందుగాని లేక అవతారికలలోని తర్వాత పద్యములందు చేసిన స్తుతులలోని విషయములనొకింత తిలకింతము.

ఆధ్యాత్మికత ఇచ్చట గల స్థిర సంపద. సాధారణముగా భౌతిక వాదమునకు వీరు దూరమే! వీరి భావనలో పంచభూతనిర్మిత శరీరము, ఆధ్యాత్మిక లక్ష్యము చేరుటకొక సాధనము మాత్రమే! సత్యము, చైతన్యము, ఆనందము - వీరి ఆరాధ్య వస్తువులు. ప్రకృతిని అభిమానించడము వీరికి గల గొప్ప లక్షణము. జీవితములోని దశలు పరిపాలకులైన రాజులకు కూడ చెప్పడము గలదు.

" శైశవే(అ)భ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణామ్

వార్ధకే మునివృత్తీనాం యోగేనాన్తే తనుత్యజామ్" అని కాళిదాసు రఘువంశం (సర్గ1/8) లో చెప్పినాడు.

బాల్యము విద్యలో యౌవనములో విషయాలను, వార్ధక్యములో మునివృత్తిని, పిదప యోగముతో తనుత్యజనం, వీరు ఆచరించిన జీవిత ధర్మం. అదే వారి లక్ష్యము.

ప్రస్తుతము శైవ సంబంధమగు స్తుతులను తమ కావ్యములందు కవులు చేసిన విధమును విశేషములను పరిశీలించెదము.

అసలు శైవము అనగా ఏమిటి? 'శివుడు' దేవుడు అను ఒక మతము. శివ సంబంధమైనది శైవము. మతము అనగా [1] అభిప్రాయము, [2] సమ్మతి, [3] శాస్త్రము, సమ్మతము, తెలియబడినది, పూజింపబడినది. ఇత్యాది అర్థములు కలవు.

మతములు మూడు రకములుగా వాశి/సి రీత్యా, రాశి రీత్యా ప్రాచుర్యముగలవి. అవి: వైష్ణవము, మాధ్వము, స్మార్తము.

మరొక నిర్ణయము / పద్ధతి ననుసరించి మతములు ఆరు. అవి : - వైష్ణవము, శైవము, శాక్తము, గాణపత్యము, సౌరము, కాపాలికము. వీటిలో అవసరమైనవాటిని ఆయా సందర్భములలో వివరించు ప్రయత్నము చేద్దాము. శైవ సంబంధ స్తుతులు అను ఈ శీర్షికలో శివుడు,ఆతని పరివారము, అంశలకు చెందినవాటిని ప్రస్తావింతము.

### 4 .1 *గణేశ స్తుతులు* : -

"వినాయకో విఘ్నరాజ ద్వైమాతుర గణాధిపాః

అప్యేకదంత హేరంబ లంబోదరో గజాననాః"[1]

అని గణపతికి కల పేర్లు. సాధారణ కావ్యములలో గణములకు అధిపతి, విఘ్నములకు రాజు, ఇద్దరు తల్లుల బిడ్డడు అనియు, ఏకదంతుడనియు, లంబ ఉదరముకలవాడని, గజముఖుడని, హేరంబుడని చెప్పడముకలదు ఇవి కాక మరికొన్ని కలవు. అవి అచ్చ తెలుగులోనున్నవి. వీటి ప్రయోగములు స్వల్పముగానే యుండును. అవి క్రింద ఇవ్వడమైనవి.

---

పాద సూచికలు: - [1] అమరము గురుబాల ప్రబోధికా వ్యాఖ్య. పుట 39

సీ:- "ఇద్దరుతల్లుల ముద్దుబిడ్డడు, పనిచెఱుపుల దొర, చేటచెవుల వేల్పు, వంకర తొండంబు వాడేనుగు మొగంబు దేవర, పాపజందెముల మేటి, మ్రొక్కువారల పనులచక్కజేసెడు సామి, గఱిక పూజల మెచ్చు గబ్బి వేల్పు ముక్కంటి పండుల మెక్కెడి తిండీండు, ముక్కంటి గారాబు ముద్దుపట్టి,

ఆ. " పెద్దకడుపు వేల్పు, పిళ్ళారి, కుడుముల

తిండికాడు, కొక్కు తేజి రౌతు,

గుజ్జువేలు పొంటికొమ్ము దేవర వెన

కయ్య " యన వినాయకాఖ్యలీశ. [1]

కస్తూరి రంగకవి, సాంబ నిఘంటువు అను పేరుతో మరికొన్ని గణపతి కి తెలుగులో – శ్రీవెలయంగ దేశీయముల్ తెనుగులు, తద్భవంబులు గూర్చి దైవ వర్గులో చెప్పినాడు. అవేమిటో చూద్దాము.

సీ. "ముక్కంటి తొలిపట్టి, మొట్టికాయలమెప్పు, గొప్పబొజ్జగలాడు, గుజ్జు వేల్పు, గబ్బ చెక్కిళ్ళ మొకము మోముగలసామి, కలుగులాయపుతేజి, బలుసిపాయి, గుంజిళ్ళు పెట్టించుకొను మేటి, పిళ్ళారి,కుడుముదాలుపు,పెద్దకడుపువేలు పొంటిపల్లుదొర,ముక్కంటి పండుల మేకకు దేవర, చిలువజందెములమేటి, జమిలితల్లుల బిడ్డ, పెద్దమెయిప్రోడ, చేటవీనుల దణి పని చెరుపు వాడు,మొదటి వేలుపు, వెనకయ్య పుంజుదారి, పెద్ద యన తగు గణపతి పేళ్ళు సాంబ." [2]

ఇందులో కొన్ని పేర్లు ఒకటిగానేయున్నవి, మరికొన్ని పర్యాయపదములనువాడి చెప్పడం. గణములు అనగా సమూహములు వాటికి అధిపతి = గణపతి /గణములకు నాయకుడు. నాయకుని దృష్టిలో యుండుట సామాన్యునికి అవసరము. విజయమునుచేకూర్చుట, విఘ్నభయమును తొలగించుట అను విషయ పరముగా గణపతిని సేవించుట కలదు.

---

పాద సూచికలు: [1] ఆంధ్ర నామ సంగ్రహము, పైడిపాటి లక్ష్మణకవి/ 12 పద్యం

[2] కస్తూరి రంగకవి/సాంబ నిఘం /దేవవర్గు/పద్యము /2.

సాహిత్యములో గణపతికి సంబంధించిన స్తుతులు చాల కలవు. ఇటు స్మార్తులు, అటు మాధ్వసంప్రదాయవర్తనులు, గణపతికి పాటల, పద్యముల రూపాన అర్చనలు చేసినారు. 'తెలుగు పర్యాయపద నిఘంటువు' [1] ననుసరించి పరిశీలించినపుడు ఈ గణపతికి దాదాపు 55 వరకు పలురీతులుగ పేర్లు గలవు. వీటిలో కొన్ని గుణసంబంధములు. 'యాని నామాని గౌణాని విఖ్యాతాని' అని కదా విష్ణుసహస్రనామములో చెప్పటం జరిగినది. దాదాపు ప్రతి కవి తన కావ్యములో గణపతిని స్మరించక వదలలేదు. కారణం వారికి వారి కావ్యము అవరోధములేక పూర్తి కావలయునను కోరిక యుండుటే!

గణపతిని పూజించకుండా ఎలాటి శుభ కార్యమును తలపెట్టుట చేయము.మంగళకరమగు కార్యములు విఘ్నములతో ఆగకుండా యుండవలెనని గణపతిని ప్రార్థించడము ఒక ఆచారము.

"ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే కవిం
కవీనాముపమశ్ర వస్తమం! జ్యేష్ఠ రాజం బ్రహ్మణాంబ్రహ్మణస్పత
ఆ నః శృణ్వన్నూతిభిస్సీదసాదనం ! మహాగణపతయేనమః. ఓం. [2]

{ దేవగణాలకు అధిపతివి కనుక 'గణపతి'గా పేరుగాంచిన నిన్ను కీర్తించి, ఆహ్వానిస్తున్నాము. మేధావులలో నువ్వు మేటివి; సాటిలేని ఖ్యాతి గాంచిన వాడవు; ప్రధానులలో శ్రేష్ఠతముడవు; వేదాలకు నాయకుడవు; మామొరలను ఆలకించి మమ్ము రక్షింప సత్వరం ఏతెంచి కటాక్షిస్తావు గాక! మహాగణపతియైన నీకు నమస్కారము.}

వేరొక సందర్భములో గణపతి ఇట్లు పొగడటం కలదు.

"ఓం నమస్తే గణపతయే. త్వమేవ ప్రత్యక్షం తత్త్వమసి. త్వమేవ కేవలం కర్తాసి. త్వమేవ కేవలం ధర్తాసి. త్వమేవకేవలం హర్తాసి. త్వమేవసర్వం ఖల్విదం బ్రహ్మాసి. త్వం సాక్షాదాత్మాసి నిత్యం"[3]

---

పాద సూచికలు : - [1] తెలుగు పర్యాయపద నిఘంటువు/జి ఎస్ రెడ్డి/విశాలాంధ్ర/ పుట 207.

[2] & [3] సస్వరవేద మంత్రాలు రా.కృ మ ప్రచు/పుటలు 1 & 202.

గణపతిని వివిధ విధాలుగా స్తోత్రం చేయడము కావ్యములలోనే కాదు. ప్రసిద్ధ వాగ్గేయకారులు కూడ వారి వారి కీర్తనలలో, కృతులలో గణపతిని ప్రస్తావించడము చూడగలము. కొన్ని ఉదాహరణగా..గిరిరాజసుతా తనయం, శ్రీగణపతిని సేవింపరారే మొదలైనవి త్యాగరాజురచనలు మహాగణపతిం, శ్రీమూలాధారచక్ర, శ్రీగణనాథం భజరే, వాతాపి గణపతిం..మున్నగునవి ముత్తుస్వామివారి రచనలు. పురందరదాసుల వారివి మరికొందరివాగ్గేయకారకుల రచనలు చెప్పవచ్చు. ప్రస్తుతము మన లక్ష్యము కావ్యములలో, ఇష్టదేవతాస్తుతులలో నుతింప బడిన దేవతలలో గణపతి ప్రస్తావన కనుక అంతవరకూ పరిశీలన పరిమితము చేయడమైనది.

శ్లో. శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం [*]
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే!

[దీన్ని విష్ణుపరంగాకూడ వ్యాఖ్యానించుట ఉన్నది]

వినాయకునికి వందనమును సమర్పించి కార్యములను ఆరంభించటము సంప్రదాయం.

'సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః / వినాయకః
ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండ శ్శూర్ప కర్ణో హేరంబః స్కందపూర్వజః (*)

ఈ 16 నామాలను విద్యారంభాది సకల కార్యములలో పఠించుట – శుభప్రదం, విజయ కారకం. ప్రతి పూజకు మునుపు గణపతి పూజ చేయుట తెలుగువారి ఆచారములో భాగం. ప్రతి సంవత్సరము భాద్రపద శుక్ల చవితి నాడు, 'వినాయకచవితి' గ పాటించడమున్నది.

తెలుగు దేశములో పిల్లలకు అక్షరాభ్యాసము చేయించుట ఒక ఆచార వ్యవహారములలో అంతర్భాగము ఆ దినము గణేశునికి నుతులర్పించడము తప్పక చేయడం కలదు. కోరిన విద్యలకు ఒజ్జ కదా ఆయన.

-----------------------------------------

పాద సూచికలు : [*] (*) ప్రసిద్ధము.

ఉ. "తొండమునేకదంతము తోరపుబొజ్జయు వామహస్తమున్

మెండుగా మ్రోయుగజ్జెలును మెల్లనిచూపులు మందహాసమున్

కొండొక గుజ్జు రూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జపై

యుండెడి పార్వతీ తనయ ఓయి! గణాధిప నీకు మ్రొక్కెదన్"(*) అని చెప్పటం వున్నది.

ప్రతిపద్యమునందు చమత్కృతి కలుగ చెప్పనేర్చిన వాడు చేమకూర వేంకటకవి. మూడాశ్వాసముల గ్రంథము అతని 'విజయవిలాసము'. వాణీ గణపతులను కలిపి ఒక పద్యములోనే కూర్చి రఘునాథశౌరిని ప్రోతురనుచు చెప్పిన పద్యమిది.

శా. "మాద్యద్దంతి ముఖార్చనా నియమమున్ం బాటించు నెల్లప్పుడున్

సద్యః పూర్ణఫలాప్తిచే మనుచు నంతర్వాణులన్ మామనో

హృద్యుండౌ రఘునాథశౌరి యని కూర్మిన్నాటికిన్ బోటికిన్,

విద్యాబుద్ధులొసంగి ప్రోతురతనిన్ విఘ్నేశుడున్ వాణియున్" [1]

{రాజులు గజరాజులను పూజించుట సంప్రదాయము. గజపూజ,గజముఖుడైన తననే పూజించినటుల భావించి గణపతియూ, అంతర్వాణుల అర్చనలే తన పూజగా తలచి పలుకుల రాణి వాణియూ, రఘునాథశౌరిని ప్రోచుదురని కవి భావన}

బుధజనవిధేయుడగు 'తిమ్మయ', తన అచ్చతెనుగు కబ్బమగు 'నీలాసుందరీపరిణయము'లో బత్తితో మాటిమాటికి ఎలుకతత్తడిరౌతునకు మ్రొక్కులొనర్చినతీరు చూద్దాము.

ఉ. " మ్రొక్కులొనర్తు కేలుగవ మోడిచి చొక్కపుగొక్కుజక్కిపై

నెక్కెడు బల్వజీరునకు నిమ్ముగనమ్మినవారి మేల్పనుల్

చక్కగ చేయు దేవరకు చక్కెర కొబ్బెరపండు లుండ్రముల్

మెక్కెడు పాప జందెముల మేటికి బత్తిని మాటి మాటికిన్" [2 ]

---

పాద సూచికలు : (*) ప్రసిద్ధము, [1] విజయవిలాసం /చేమకూరవెంకటకవి /పీఠిక /6.

{2} నీలా సుంద/తిమ్మ/ పీఠిక /7

ఈశ్వరార్చనకళాశీలుడైన వాడు శ్రీనాథ కవి సార్వభౌముడు. ఆయన హరవిలాసము సప్తాశ్వాసముల గ్రంథము. ఈ కవిసార్వభౌముని అసదృశ సృష్టి, శివలీలలనేరి, నేర్పుతో కూర్చడమితడు చేసిన ఒక ఘన కార్యము. అవచి తిప్పయ్య దీని కృతి భర్త. విష్ణుకంచి లోని వరదరాజస్వామిని, శివకంచిలోని ఏకామ్రేశ్వరుని, కంచి నగరాధీశ్వరియగు కామాక్షిని స్తుతించిన పిదప, వాణికి ఉపాస్తి యొనర్చినాడీతడు. అటుపై శాంభవీ శంభు లోచనోత్సవకరమొనరించు విఘ్నరాజుకు కేలుమొగ్గలు కూర్చినాడు ఈ కవివరుడు. అద్భుత ఆలంకారిక ప్రయోగములతో.

సీ. కలితశుండా దండగండూషితోన్ముక్త సప్తసాగర మహాజల భరములు
వప్ర క్రియా కేళివశ విశీర్ణ సువర్ణ మేదినీధర రత్న మేఖలములు
పక్వజంబూ ఫలప్రకట సంభావనా చుంబితభూభృ త్కదంబకములు
వికట కండూలగండక దేహమండలీ ఘట్టిత బ్రహ్మాండ కర్పరములు

గీ. శాంభవీ శంభు లోచనోత్సవ కరములు
వాసవాద్యమృతాశన వందితములు
విఘ్నరాజ మదోల్లాసవిభ్రమములు
మించి విఘ్నోపశాంతి కావించు గాత! [1]

శ్రీ భారతీతీర్థ గురుశ్రీచరణ కరుణాకటాక్ష లబ్ధ సిద్ధ సారస్వత పవిత్రగాదయామాత్య పుత్రుడైన వాడు పినవీరభద్రుడు. శృంగారశాకుంతల కర్త ఈ పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. చిల్లర వెన్నయామాత్యుడు దీని కృతిభర్త. మంత్రి వెన్ననికి మన్నన సొంపు మీరగ భద్రములిడునని కాంక్షించి, యీతడు ప్రార్థించినాడు - బాలగణపతిని. ఆ బాలుడు తన తల్లి జగన్మాత స్తన్యము గ్రోలుచున్న పసివాడు. బాల్యములో కొన్ని చేష్టలు రమణీయమైనవి, అట్టి వాటిలో నొకటి స్తన్యపానము. బాలగణపతి పాలను త్రాగుచూ లేతవగు పద్మములవంటి చరణములందలి కింకిణీ స్వనము ఇంపారగా తల్లి శరీరమును మృదువుగా తొండముతో స్పర్శించి చొక్కుచున్న 'విఘ్నపతి'ని తలచాడు.

---

పాద సూచికలు: {1} హరవిలా/శ్రీనాథుడు/అవతా/5

మ. 'జననీ స్తన్యము గ్రోలుచుంజరణ కంజాతంబునం గింకిణీ
స్వన మింపారగ  తల్లి మేన మృదుల స్పర్శంబుగా తొండమ
ల్లన యాడించుచు చొక్కు విఘ్నపతి యుల్లాసంబుతో మంత్రి పె
న్ననికిన్ మన్నన సొంపుమీర నొసగున్ భద్రంబులెల్లప్పుడున్' [1]

కవుల ఊహలలో ఒక్కొక్కపరి సారూప్యత కనిపించును. అంతమాత్రమున ఒకరిదొకరు గ్రహించినారు అనుట సమంజసము కాదు. దీనికి పలు కారణములు ఉండవచ్చును. ఇట్లు జననివద్ద పాలుత్రాగుచున్న 'బాలుడు' అల్లసాని పెద్దన చేతనుతుడైన గణపతికూడా! అయితే ఈ బాలుని చేష్ట మరొక విధముగా చిత్రితమైనది. ఇచ్చటి పార్వతి పతిదేవునితోకూడి ఆయనలో సగమాక్రమించినమూర్తి. అమ్మయొడిలో పరుండి శైలతనయాస్తనదుగ్ధము గ్రోలుచున్న బాలుడు. ఆ బాలుని చెయిదము పెద్దన హృదయమును కదిలించినది. మనోజ్ఞముగా రచన జరిగినది.

ఉ.  అంకముజేరి శైల తనయా స్తన దుగ్ధము లానువేళ బా
ల్యాంక విచేష్ట తొండమున నవ్వలిచన్ కబళింపబోయి యా
వంకకుచంబు గానకహివల్లభహారముగాంచి వే మృణా
ళాంకుర శంకనంటెడు గజాస్యునికొల్తు నభీష్టసిద్ధికిన్. [2]

గజముఖుని ఇంత ఘనముగా స్తుతించుటలో కల విశేషమును కొంత పరిశీలన చేసినచో అవగతమగు విషయములు అచ్చెరువుగొలుపును. గణపతికి - ప్రకృతికి అతి సాన్నిహిత్య మున్నది. వినాయక చవితి పేరున హిందువులు ఒక పర్వమును నిర్వహించుట తెలిసినదే! ఈ గణపతికి కావించు  పూజను పరిశీలించినచో, సాధారణముగా పూజకు వాడబడు పుష్పములే కాకుండా కొన్ని ఆకులను/ పత్రములను  కూడ ఉపయోగింతురు. వీటిని సంపాదించుటకై వనములలో తిరుగుట వలన సహజ ప్రకృతిని గుర్తించుట,

------------------------------------------------------------

పాద సూచికలు:  [1] శృంగార /శాకుం/పినవీర/ అవ/4

[2] పెద్దన/మనుచరిత్ర / పీఠిక/4.

ప్రకృతి నుండి మనము తెలుసుకొనదగు విషయాలు ప్రకృతి పరిరక్షణ, వీటితో పాటు మన రక్షణ మున్నగునవెన్నో అంతర్లీనముగా ఇమిడియున్నవి. ఆ దినము సేకరింపబడు పత్రములను/ఆకులను పరిశీలనా దృష్టితో చూచినచో ఆరోగ్యపరమగు రహస్యములు తెలిసికొనవీలగును. ఆ పత్రములు

1. మాచీపత్రం 2. బృహతీ పత్రం [వాకుడాకు] 3. బిల్వపత్రం [మారేడు]
4. దూర్వాయుగ్మం [గరిక] 5. దుత్తూరపత్రం [ఉమ్మెత్త] 6. బదరీపత్రం [రేగు ఆకు]
7. అపామార్గపత్రం [ఉత్తరేణి] 8. తులసీ పత్రం. 9. చూతపత్రం [మామిడి ఆకు]
10. కరవీరపత్రం [గన్నేరు] 11. విష్ణుక్రాంతపత్రం 12. దాడిమీపత్రం [దానిమ్మ ఆకు]
13. దేవదారుపత్రం [దేవదారు ఆకు] 14. మరువకపత్రం [మరువం] 15. సింధువారపత్రం [వావిలాకు] 16. జాతీపత్రం [జాజి ఆకు] 17. గణకీపత్రం [అడవి మొల్ల] 18. శమీపత్రం [జమ్మిపత్తి] 19.అశ్వత్థ పత్రం [రావి ఆకు] 20. అర్జునపత్రం [మద్ది ఆకు] 21.అర్కపత్రం [జిల్లేడు ఆకు]. 'కాదేదీ కవితకనర్హం' అన్నటుల గణపతికి సమర్పించుటకు ఇన్ని ఆకులు/పత్రములు అర్హమైనవే! ఇందులో ఆయుర్వేద సంబంధమైనవి కలవని పెద్దలమాట. అతి సాధారణమైన పిల్లల ఆటలలో సైతం రహస్యమైన ఆరోగ్య సూత్రాలు పొదిగిన పెద్దలకు వందలాది వందనాలు. పొడుపుకతలలో ఆయుర్వేద రహస్యము ఒకటి చూడగలము. వంకర టింకర- సొ ., వాని తమ్ముడు –అ., నల్లని పిల్ల – మి., నాకేమిస్తావు తే., నాలుగు కాళ్ళు మే. ఇందులో సొ-సొంటి అ- అల్లము., మి – మిరియము., తే – తేనె అని మార్మికంగా చెప్పబడినది అనడముగలదు.

శ్రీగణేశపురాణం, 13 అధ్యాయము ప్రకారము, త్రిమూర్తులు [హరి హర హిరణ్యగర్భులు] కూడ గణేశుని, " అజం నిర్వికల్పం నిరాకారమేకం నిరానందమద్వైత మానందపూర్ణం పరం నిర్గుణం నిర్విశేషం నిరీహం పరబ్రహ్మ రూపం గణేశం భజేమ" [1] యనుచు సేవించడమున్నది.

---

పాద సూచికలు : - [1] ఋషిపీఠం, సెప్టెంబర్ 2013 సంచిక/ పుట/ 53, / పుటలు 53

ఇక ముక్తిదాతల రూపములో 32 గణపతులు కలరు. ఆ రూపములు ఇట్లు చెప్పబడినవి.

బాలగణపతి, తరుణ గణపతి, భక్తగణపతి, వీరగణపతి, శక్తి గణపతి, ధ్వజ గణపతి సిద్ధి(పింగళ), ఉచ్ఛిష్ట, విఘ్న, క్షిప్ర, హేరంబ, లక్ష్మి, శ్రీమహా, విజయ, నృత్య, ఊర్ధ్వ, ఏకాక్షర, త్ర్యక్షర, వర, క్షిప్ర ప్రసాద, హరిద్రా, సృష్టి, ఏకదంత, ఉద్దండ, ఋణమోచన, ద్విముఖ, డుంఢి, త్రిముఖ, సింహ, దుర్గ, యోగగణపతి, సంకటహరగణపతి.

" ఓం నమో వ్రాతపతయే, నమో గణపతయే, నమః ప్రమథపతయే నమస్తే అస్తు లంబోదరాయ ఏకదంతాయ విఘ్న నాశనే శివసుతాయ శ్రీ వరదమూర్తయే నమః !! [1]

తరిగొండ నరసింహస్వామి భక్తురాలు, తిరుమల వెంకటాచలపతిని సేవించి తరించిన యోగిని, 'అష్టాంగయోగసారము' అను యోగ సంబంధ గ్రంథములో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఇష్టదేవతా స్తుతిలో గణపతితో పాటుఇతర దేవతలను భక్తియుతులతో కొలిచినది.

కం. శ్రీగణనాథుని, దుర్గను,
బాగుగ శంకరుని, క్షేత్రపాలుని, వాణిన్,
శ్రీగురు సుబ్రహ్మణ్యుని,
యోగుల, సుర, మౌని,భక్తి యుతులన్ కొలుతున్ [2]

ఈ చిన్ని కందములో అందముగా అనేకులకు ప్రార్థన సల్పడం, పోతన భాగవతములో చిన్నికృష్ణుడు మన్ను తినలేదని తననోరు తెరచి, తల్లి యైన యశోదకు చూపగా,

కం. "ఆలలితాంగి కనుంగొనె, బాలునిముఖమందు, జలధి పర్వత వన భూ
గోళ శిఖి తరణి శశి ది క్పాలాది కరండమైన బ్రహ్మాండంబున్" [3]

అను పద్యం గుర్తుకొచ్చును.

---

పాద సూచికలు : - [1 ] ఋషిపీఠం, సెప్టెంబర్ 2013 సంచిక/ పుట/ 53, / పుటలు 58
[2] రాజయోగసా /వెంగమాంబ/అవ/1/తితిదే ప్రచు, [3] పోతన భాగ/దశ 1/339 పద్యం

అసలు వ్యాసుడు భారతమును చెప్పుచుండగా గజముఖుడు వ్రాయసకాడట. తిక్కన గారికి గురునాథుడను లేఖకుడుండినట్లు చెప్పడము తెలిసినదే! పలువురు కవులు/రచయితలు గజముఖునికి నతులు నుతులు అర్పించడము కలదు.

చం. తొలిని యవిఘ్నమస్తనుచు ధూర్జటి నందన నీకు మ్రొక్కెదన్
ఫలితము జేయుమయ్య తలపంబడు కార్యకలాప మెల్ల నా
వలపలి చేతిగంటమున వాక్కున నెప్పుడుబాయకుండుమా
తెలివి ఘటింపుమా సతము దేవ! వినాయక! లోకనాయకా! [1]

ఉ. మోదకహస్తునిన్ ధవళమూషక వాహనునేకదంతు లం
బోదరు నంబికాతనయు నూర్జితపుణ్య గణేశు దేవతా
హ్లాదగరిష్ఠు, దంతిముఖు నంచితభక్త వర ప్రదాయకున్
మోదముతోడ  హస్తములుమోడ్చి భజించెద నిష్టసిద్ధికిన్. [2]

కం. గజముఖుని నేకదంతుని భజియింతును వాణి గౌరీ పంకజనిలయన్
నిజభక్తి బుద్ధి విద్యాత్రిజగత్ ఖ్యాత్యాయురుదయతేజమ్ములకై![3]

కం. శ్రీకరదంత రుచిజిత సుధాకర మృడపార్వతీ ముదాకర గుణర
త్నాకర వరధీకర పరభీకర భాగ్యముల కుప్ప! పిళ్ళారప్పా! [4]

కం. మల్లెలు మొల్లలు జాజులు కొల్లలుగా కోసితెచ్చి కొనియాడి నినుం
చల్లగ పూజింతుము కృప వెల్లువగా చూడుమప్ప!పిళ్లారప్పా! [5]

కం. ఓరీ! బాలుడా నీవిటు రారా యని నన్ను పిలిచి రంజిలు దయచే
కోరికలొసగుము భువి ణీ పేరును ప్రకటించి చెప్ప పిళ్ళారప్పా! [6]

కం. భక్షింపుము కావలసిన భక్షణములు నీకు నిత్తు భక్షించియు నీ
కుక్షి గల విద్య మాకున్ భిక్షంబిడి కావుమప్ప పిళ్ళారప్పా! [7]

---

పాద సూచికలు : - 1 నుండి 7 వరకు చాటుపద్య మణిమంజరి ద్వితీయభాగము/ప్రథమ సంపుటము లోనివి/ సేకరణ వేటూరి ప్రభాకర శాస్త్రి /శ్రీ ప్రభాకర పరిశోధక మండలి ప్రచు.

పై పద్యములలో మొదటిమూడును వేర్వేరు రచయితలవి గాను, పిదప నాలుగు ఒకే రచయితవైనట్లు భావింప వచ్చును. కడపటి నాలుగు ఒక మకుటముతో నున్నవి.

విద్యానాథుడు సంస్కృతమున వ్రాసిన ప్రతాపరుద్రీయమను, అలంకార శాస్త్రమునకనువాద రూపమున కావ్యాలంకార సంగ్రహమను నామాంతరముతో నరసభూపాలీయమును రచియించి తెలుగు భారతికి అలంకారములను సమకూర్చిన వారిలో ఒకడు లక్షణకవి మూర్తికవి. అచ్చట విద్యానాథుడు కృతిభర్తయు, లక్ష్య భాగములో చెప్పబడిన రీతిగ, ఇచ్చట కృతిభర్త నరసభూపా లుని పేర లక్ష్యములను పేర్కొనటం జరిగినది. ఈ గ్రంథ కర్త మూర్తికవియే - భట్టుమూర్తి. ఇతడు మరుద్గణనాథుడనుచూ, గణనాథునికొల్చిన తీరున శబ్దార్థముల మేలైన పొందిక పొసగినది.

చ. అరుదుగ వామభాగ లలనా కలనా చలనాత్ముడైనయా
హరుగురు గాంచి తానును తదాకృతి యొౌగతి నేకదంతుడై
కరి కరిణీ గుణంబులు మొగంబున దాల్చి జగంబు లేలునాం
తర కరుణా సనాథు గణనాథు మరుద్గణనాథు కొల్చెదన్. [1]

ఇందలి ప్రత్యేక ప్రస్తావన - వినాయకుడు ఏకదంతుడు. అర్ధనారీశ్వరుల తత్త్వమును అనుకరించునటుల ముఖములో ఒకవైపు దంతసహితమైన 'కరి' [మగ ఏనుగు] లక్షణమును, దంతరహితమైన మరొక పార్శ్వము కరిణీ [ఆడ ఏనుగు] లక్షణమును కలిగి స్త్రీ పురుష రెండు తత్త్వముల ప్రతినిధియై విరాజిల్లినాడు. కావ్యనిర్మాణ సంపూర్తికై అర్చితుడైనవాడీ గణపతి.

జగత్తులోనేకాదు, సాహితీ జగత్తులోనూ కొన్ని వింతలు అప్పుడప్పుడు, అక్కడక్కడ జరుగునని మనం చూడగలము. 1935 సంవత్సరములో తొలి ముద్రణ పొందిన నవీన పద్య కావ్యము శ్రీచౌడేశ్వరీ మాహాత్మ్యము రచయిత, [ఇప్పటి కర్ణాటకరాష్ట్రము కోలార్జిల్లా శ్రీనివాసపురంలోని] గౌనిపల్లె వాస్తవ్యులు, గుమ్మరాజు రామకవి.

---

పాద సూచికలు : - [1] నరసభూపాలీయం/మూర్తికవి/గ్రంథాది/6 పద్యము.

ఈ ప్రాంతము ఆంధ్రప్రదేశ్ చిత్తూర్ జిల్లాకు సమీపమందలిది. ఇందలి ఇతి వృత్తము నందవరీక / నందవైదీక వర్గబ్రాహ్మణుల కులదైవమగు చౌడేశ్వరికి సంబంధించినది. దీనిలో మొదటి రెండు ఆశ్వాసములు 1938 సంవత్సరమునందు ఇంటర్మీడియట్ తరగతి వారికి తెలుగు పాఠ్యభాగముగ నిర్ణయింపబడినది. ఈ విషయము
ఆంధ్ర దేశములో చాలావరకు తెలిసినది తక్కువయను  భావన కలదు.  ఈ గ్రంథమునకు 'ప్రస్తావన' యను పేర గ్రంథ ప్రస్తావన చేసిన పెద్దలు రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ గారు. ఆయన 'ప్రస్తావన' లోని కొన్ని వాక్యములు...'శ్రీ గుమ్మరాజు రామకవిగారిని ఎరిగిన ఆంధ్రులు చాలామంది లేరు.   ఆధునిక సాహిత్య వ్యాపారములలో వీరు చేయి వేసిన వారు కారు.  మరియు, వీరి 'గవనిపల్లి' కోలారు జిల్లాలో నున్నది గానీ, కృష్ణా గోదావరి జిల్లాలలోలేదు. సరిగదా 'రాయలసీమ'లో నైనను తలదూర్చుకొను భాగ్యము దానికి లేదు. వీరిది 'రాగులసీమ' పూర్వాంధ్రులకు గానీ, పశ్చిమాంధ్రులకు గానీ యీ ప్రక్క దృష్టి యింకను పాఱినట్లు లేదు        దీనికి బహుశః కవిది కన్నడ దేశము. రచన తెలుగుభాషలో. నిర్ణయింప బడినది అప్పటి మద్రాసు విశ్వవిద్యాలయాన . ఈ ప్రస్తావన వదలి, కవి కావ్యములో గణపతి స్తుతిని  చూద్దాము.

సింహవాహిని యగు శర్వాణి గణపతిని పిలిచినదట. వినాయకుడు భీతిని చెందినాడు. ఎక్కడనో దాగినాడు. అప్పుడు ప్రేమతో తండ్రి ప్రేమతో తన ఉజ్జ్వలాంకమునందు కూర్చొబెట్టుకొని ముద్దిడినాడు. ప్రమోదంబొంది ఓర చూపులతో తల్లిని చూచినట్టి హస్తి వదనుని కవి  పూజించినాడు. ఇందలి విశేషము పరికిస్తే - తల్లి వాహనము సింహము. కుమారునిది గజవదనము. ప్రకృతిసిద్ధమైన  వైరము కదా  గజ సింహములకు. నందివాహనుడు మూషికవాహనుని చేరదీసినాడు. తొలుత తన తల్లి పిల్వగ, రాని పిళ్ళారప్పకిపుడు  భయము తొలగినదిప్పుడు. నిర్భయముగ ఓరగా చూసినాడు  తల్లి వంక నవ్వుతూ!

మ.  " అలకైలాసగిరి ప్రదేశమున సింహారూఢయౌ తల్లి తన్
బిలువన్ భీతిలి డాగుచో శివుడు బల్ ప్రేమన్ని జాంకోజ్జ్వల
స్థలి నాసీనునొనర్చి ముద్దిడప్రమోదంబొంది దానోర చూ
పుల తల్లింగని నవ్వు హస్తి వదనున్ పూజింతు నశ్రాంతమున్" [1]

గణపతిని స్తుతించని కావ్యములను వ్రేళ్ళపై లెక్క పెట్టవచ్చు. పరమ వైష్ణవాభిమానులగు కవులను ఈ పద్దులో చేర్చవచ్చు. అగజ [పార్వతి] ఆననమను పద్మమునకు అర్కుని [సూర్యుని] వంటి వాడును, గజాననముకలవాడును, భక్తులకనేక వరముల నొసగు వాడును, ఏకదంతుడగు వానిని అహర్నిశములు ఉపాసింపబడు గణపతిని పోతన గారిట్లు నుతించినారు.

ఉ. "ఆదరమొప్ప మ్రొక్కెడుదు నద్రిసుతా హృదయానురాగ సం
పాదికి దోష భేదికి ప్రసన్న వినోదికి విఘ్నవల్లికా
చ్ఛేదికి మంజు వాదికి నశేష జగజ్జన నంద వేదికిన్
మోదక ఖాదికిన్ సమద మూషక సాదికి సుప్రసాదికిన్" [2]

నాదము వినగనే కలుగును మోదము. అది సంగీతము. ఆలోచన చేయగ కలుగు ఆనందము. అది సాహిత్యము. పై పద్యములో పోతన గారి నాదము విని, పిదప సాహిత్యము చూచెదము. ఈ పద్యములో 'ద' కరము దాదాపు 17 పర్యాయాలు వచ్చి వినగానే ఒక సొగసును కలిగిస్తున్నది. ఇది నాదము యొక్క ఘనత. శబ్దములతో గారడీ చేయగల పుట్టుకవి కదా మన పోతన.

'సీతారామ గుణగ్రామ పుణ్యారణ్య విహారిణౌ, వందే విశుద్ధ విజ్ఞానౌ కవీశ్వర కపీశ్వరౌ '[3]

---

పాద సూచికలు : - [1] గుమ్మరాజు రామకవి/చౌడేశ్వరీ మహాత్మ్యం/ప్రథమాశ్వా/7 పద్యం
[2] పోతన/భాగ/మొదటి స్కం/5, [3] తులసీ/రా.చ.మా/బాలకాండ/4.

అంటూ వాల్మీకికి, వాయుసూనునికి వందనములిడిన, ప్రసిద్ధ రామచరితమానస కర్తయగు సంత్ తులసీదాసు - భూతగణాధి సేవితుడు, కపిత్థజంబూఫల సారభక్షణము చేయు ఉమాసుతుడు, శోకనివారకుడు అయిన గణేశుని, ఇట్లు స్తుతించినాడు. ఇది బహుళ ప్రసిద్ధము. చూడండి.

"గాయియే గణపతి జగబందన శంకర – సువన భవానీ నందన !
సిద్ధి సదన గజవదన వినాయక కృపాసింధు సుందర సబ్ లాయక !
మోదకప్రియ ముద మంగళ దాతా విద్యా వారిధిబుద్ధి విధాతా !
మాంగత తులసిదాస కర జోరే బసహి రామ సియ మానస – మోరే !

తన అహల్యా సంక్రందనము లో ' శ్రీమత్పాండ్య మండలాధీశ్వర శ్రీ విజయరంగ చొక్కనాథ మహీనాథ కరుణాకటాక్ష సంపాదిత గజ తురంగ మాందోళికాచ్ఛత్ర చామర విజయ కాహళ భూరి భేరీ బిరుద ధ్వజ ప్రముఖ నిఖిల సంపత్పారంపరీ సమేధమాన సముఖ మీనాక్షీ నాయక తనూభవ శ్రీమీనాక్షీ దేవీ కటాక్ష లబ్ధ కవితా సాంప్రదాయకుడగు' సముఖం వేంకట కృష్ణప్ప నాయకుడు, గణపతిని ఇట్లు భజించినాడు.

చ. 'కుడుములు చాల మెక్కి, కలుగుంబలు లాయపు తేజినెక్కి,ప్రా
నుడువుల వన్నెకెక్కి, మహి నూల్కొను, విఘ్నములెల్ల చెక్కి, య
య్యుడుపతి మౌళి పాదముల కున్నత భక్తిని మ్రొక్కి, భక్తులన్,
విడువక ప్రోచు భవ్య మతి విఘ్నపతిన్, సుమతిన్ భజించెదన్' [1]

ఈ సముఖం వేంకట కృష్ణప్ప నాయకుడు, చాల చక్కని తెలుగు పదములను వాడి, భవ్యమతి యగు, గణపతిని భజించిన తీరు మెచ్చ తగినది. కుడుములు మెక్కి, కలుగులో వసించు ఎలుక వాహనము [తేజి] నెక్కి, వేదపు పలుకుల వన్నెకెక్కి, విఘ్నముల చెక్కి, చంద్రమౌళికి మ్రొక్కి, భక్తులను ప్రోచువాడు. మెక్కి, ఎక్కి, చెక్కి, మొక్కి మొదలగు పదములతో రామణీయకత సాధించినాడు.ఆపాత మధురము కదా నాదము!

---

పాద సూచికలు : - [1] అహల్యా సంక్రందనము / సముఖంవేంకట కృ.నాయకుడు/అవతా/8

వేదపాఠమును 'ఓం గణానాం త్వా గణపతిగ్ం' అని ఆరంభించుట తెలిసినదే కదా! 'కలుగులాయపుతేజి' యనునది అచ్చ తెనుగు పదము. భక్తులను విడువక రక్షించు ఆ గణపతి, భవ్యమతి మరియు సుమతి. ఈ గణపతి, లోకములకాహ్లాదము గూర్చు వాడైన, 'ఉడుపతి' ని శిరముపై ధరించిన, తన తండ్రి యగు ఉమాపతి పాదములకు మొక్కినాడు. అది కూడ అతి భక్తితో! అట్టి గణపతిని సముఖం వారు భజించడం చూచినాము.

మొల్ల రామాయణము, రసవంతముగా రాసినట్టి, ఆతుకూరి మొల్ల, తను కావ్య సంపద క్రియలు, నిఘంటువులును, క్రమములేవియును ఎఱుగనిదట! ఈ నెల్లూరు ప్రాంత నెరజాణ. చదువకనే ఇంత బాగా రాసిన ఈమె మరికాస్త చదివియుండియుంటే ఆ పరిస్థితి ఎలా వుండి ఉండేదో? సొగసుగ పదములను కూర్చడము ఈమెకు బాగా తెలుసు. పదములను చక్కగ పొదగడం /చమత్కరించడం ఈ 'చదవని చాన'కు కొట్టినపిండి. "నేరిచి పొగడిన వారిని", నేరక కొనియాడు వారినీ" కూడా శ్రీరాముడు కరుణతో కాపాడడానికి కారణము వారి వారి భక్తే గానీ – వారి వారి చదువులు, పాండిత్య ప్రాగాల్భ్యాలూ కావు అని మొల్ల విశ్వాసం. ఆరామచంద్రుని యెడల గల ఒకింత భక్తి, రామచంద్రుడే చెప్పించగా, 'ఇహపర సాధనగా' రామాయణము కూర్చిన రచయిత్రి మొల్ల. శ్రీకంఠమల్లేశుని దయతో కావించిన రామాయణములో, విమల రవికోటితేజు, శ్రీవిఘ్న రాజు ప్రస్తుతినిట్లు చేయడమున్నది.

సీ. చంద్రఖండ కలాపు, చారువామన రూపు, కలితచంచలకర్ణు, కమలవర్ణు,
మోదకోజ్జ్వలబాహు, మూషకోత్తమవాహు, భద్రేభవదను, సద్భక్తసదను,
సన్మని స్తుతిపాత్రు, శైల సంభవపుత్రు, ననుదినామోదు, విద్యాప్రసాదు,
పరమదయాభ్యాసు, పాశాంకుశోల్లాసు, నురుతరఖ్యాతు నాగోపవీతు

గీ. లోకవందితు గుణవంతు నేకదంతు, నతుల హేరంబు సత్కరుణావలంబు,
విమలరవికోటి తేజు శ్రీ విఘ్న రాజు ప్రథిత వాక్ప్రౌఢి సేవించి ప్రస్తుతింతు! [1]

---------------------------------------------------------------------

పాద సూచికలు : - [1] మొల్ల/రామాయణము /అవతారిక/5

పదములను, నేర్పుతో కూర్చిన ఈమె రచనా పాటవము కడు ప్రశంసనీయము.

కలాపు – రూపు, కర్ణు – వర్ణు, బాహు – వాహు, వదను – సదను, పాత్రు- పుత్రు, మోదు- ప్రసాదు, అభ్యాసు – ఉల్లాసు, ఖ్యాతు – వీతు, వందితు – వంతు/దంతు, హేరంబు – లంబు, తేజ – రాజు  అంత్యములో ప్రసన్నమగు శబ్దము వచ్చు రీతిలో పద్యములల్లిన ఈమె చదువరిని కానని చెప్పినది.

తరిగొండ వెంగమాంబ ద్విపదలో రాసిన 'రాజయోగసారము' లో ఆదిలోనే 'శ్రీ గణనాథు నాశ్రిత పరిపాలు, నాగమసంవేద్యు నాధారసదను ననిశంబు కీర్తించి, అతి భక్తి మెఱయ అనువుగా తరికుండ హరిని మహానుభావుని భవ్య రూపొంచితునెంచినది. ఈమె నారసింహుని, వేంకట పతిని కొలిచిన భక్తురాలు యోగిని. నందవరీక / వైదీక  బ్రాహ్మణ వర్గమునకు చెందినది. ఈమె రాసినవన్నియు వైష్ణవపరమైనవి, వేదాంతపరమైనవి. అయినా గణపతి ప్రార్థన చేసినది. ఈమెకు తరిగొండ గ్రామమునకు సమీపమందలి మదనపల్లె పట్టణము దగ్గర చిప్పిలి గ్రామ ప్రాంతమునకు చెందిన  'యోగభోగేశ్వరస్వామి' దేవాలయమునందు  రూపావతారము సుబ్రహ్మణ్యము గారు , 'ఉపదేశము' చేసినటుల చెప్పడము కలదు.

తన 'మూర్తి త్రయోపాఖ్యానము' లో 'బాపకవి' బాలగణేశుని, ఇట్లు కొల్చినారు.

ఉ.  " ఏకకళావతంసమిది ఏటికి? పూర్ణసుధా మయూఖుడే
గాక యటంచు తుండమున గ్రక్కున చంద్రుని పట్ట నీకళం
కాకర చంద్రుడేల? యని యంబ నివారణ మాచరింపగా
గైకొని తన్ముఖాంబుజము కన్గొను బాల గణేశు గొల్చెదన్"  [1]

ఈశ్వరార్చనకళాశీలుడైన కవి సార్వ భౌముడు తన నైషధములో హేరంబునికి జేజేయనుచు జోతలిడిన విధము చూద్దాము.

---

పాద సూచికలు : -   [1] మూర్తిత్రయోపాఖ్యానము /దంతులూరి బాప/ప్రథమా/7

శా. " జే జే యంచు భజింతు నిష్ట ఫల సంసిద్ధుల్ మదింగోరి, ని

ర్వ్యాజ ప్రౌఢ కృపావలంబుని కటప్రస్యంది దానాంబునిం

బూజా తత్పర దేవదానవ కదంబున్ బాలకేళీకళా

రాజత్కౌతుక రంజితోరగ పతి ప్రాలంబు హేరంబునిన్" [1]

నన్నెచోడుడు, తన కుమార సంభవ కావ్యములో వినాయకునికి మేఘ ఘనతను రూపించుచు కొత్త సోయగాలను చేకూర్చినాడు. జగమునకు మంచి కలిగించుట పరోపకార చింతనా ప్రవర్తన మహనీయుల గుణములు కదా! అందులకే భర్తృహరి మహాశయుడు ఈ విషయమును

" భవంతి నమ్రాస్తరవః ఫలోద్గమైర్నవాంబుభిర్దూల విలంబినో ఘనాః

అనుద్ధ తాస్సత్పురుషాస్సమృ ద్ధిభిః స్వభావ ఏవైష పరోపకారిణామ్" అని కదా

యనినాడు.

మరి అట్టి గణపతి స్తుతిని చూద్దాము.

చ. " తనువసితాంబు దంబు సితదంతముఖంబచిరాంశు లాత్మగ

ర్జన మురుగర్జనంబు రసద్రుచిత శక్రశరాసనంబునై

చానా మదవారి వృష్టి హిత సస్య సమృద్ధిగ నభ్ర వేళ నా

జను గణనాథుడిచ్చు ననిశంబు నభీష్ట ఫలంబు మా కిలన్" [2]

ముద్దుపలుకుల వాడు ముక్కుతిమ్మన యని చెప్పినారు కదా! ఆ గణపతిని తన పారిజాతాపహరణములో, నంది తిమ్మన గారు ఎట్లు స్తుతించినారో ఒకసారి పరికిద్దాము.

మ. "తన దంతాగ్రముచేత తీక్ష్ణమతి యుద్యత్కుంభయుగ్మంబుచే

త, నితాంతోన్నతి, దాన విస్ఫురణ నుత్సాహంబు శుండా ముఖం

బున దీర్ఘాయువు నిచ్చు గావుత గుణాంభోరాశికిం గృష్ణ రా

యనికిన్వారణ రాజవక్త్రుడు కృపాయత్తైక చిత్తాబ్జుడై" [3]

---

పాద సూచికలు : [1]శృంగార నైష/శ్రీనాథ /ప్రథ/4 , [2] కుమార/ నన్నె /ప్రథ/7, [3] పారిజాత/ఆశ్వా/I /3

దీర్ఘాయువును కార్యములయందు ఉత్సాహమును రాయనికి ఇచ్చుగాక యని కవి ఆశ. పరమశివునికి పరమ భక్తుడైనవాడు ధూర్జటి. రాయలవారి ఆస్థానమందున్నా తన కృతిని ఈశ్వరునకు అంకితమిచ్చినవాడు. తన శ్రీకాళహస్తిమాహాత్మ్యము లో హేరంబుని స్తుతించిన విధము చూద్దాము.

శా. "సర్గ స్థిత్య పహార కర్మనవ దీక్షా వేళ బ్రహ్మ స్వభూ

భర్గు ల్విఘ్నము లేక సాగుటకునై ప్రార్థింపగా తత్క్రియా

దౌర్గత్యంబు నడల్చి సంస్మరణ మాత్రం ప్రాప్తి గావించుద

జ్నిర్గచ్ఛత్కరుణా కదంబు కొలుతున్నిత్యంబు హేరంబునిన్" [1]

రుద్రుని వద్ద యుండువాడు హేరంబుడు. సృష్టి స్థితి లయ - కారకులైన త్రిమూర్తులు తమతమ కార్యక్రమములను విఘ్నములేకుండ జరుగవలెనను దీక్ష వహించు సందర్భములో వారు గణపతిని ప్రార్థించినారు. సంస్మరణ మాత్రమున కరుణ కురిపించు దయా కదంబుడైన హేరంబుడు అహర్నిశములు స్తుతింప బడినాడు. కాళహస్తి క్షేత్రములో పాతాళగణపతిణి దర్శించుట కూడా ప్రశస్తమైన విషయము. దాదాపు ఇరవై అడుగుల లోతునకు ఒక సన్నని ద్వారము గుండా కిందకు వెళ్ళవలసియుండును. ఇది ఒక నిర్మాణ విశేషము. నవీన పద్య కవులలో రామకథను 'ఆత్మ రామాయణము' పేర రాసిన 'గురుమూర్తి' గారు, తొలుత రామునికి తన విన్నపమును వినిపించినాడు. పిదప బాలకాండను గణపతి స్తుతితో ఆరంభించినాడు.

కం. శ్రీగౌరీ వర తనయా,

వాగీశాద్యమర వినుత, వాగ్విభవాఢ్యా!

నాగశయాన కరార్చిత,

భోగి విభూషణ సుపుత్ర, బుధనుత పాత్రా! [2]

---

పాద సూచికలు : - [1] శ్రీ కాళహస్తి/ ధూర్జటి /ప్రథమ/5. [2]ఆత్మరామాయణము/ బాలకాండ/ఆవ/1 /లలిత కవి టి. గురుమూర్తి.

గురుమూర్తి, గజాననునికి, కవినైన తనను లాలన చేయమని, వాక్కులను లలిత తరము జేయుమని తొలుతనె తోరపు భక్తితో, ఒక రకమైన ఆర్తితో విన్నపము గావించినాడు.

చ. తొలుతనె నిన్ను నెంతుమది తోరపు భక్తి గణాధినాథ నా
పలుకులయందు నిల్చి యెడ బాయక సత్కవితా విభూతి సం
కలిత రసప్రవాహహమున గ్రాలగ జేయుము నాదు వాక్కులన్
లలితతరం బొనర్చి, నను లాలన జేయగదే గజాననా! [1]

గణపతికి గల విశేషణములను పేర్కొనుచూ, 'వాల్మీకి చరిత్రము' నందు ' రఘునాథ నాయకుడు' ముచ్చటగా గణముఖ్యుని తలచిన తీరిది.

ఉ. "మోదకహస్త హస్తిముఖ మూషకవాహన యేకదంత లం
బోదర తప్తకాంచన సముజ్జ్వల విగ్రహ బాలచంద్ర రే
ఖాధృత మౌళి యంచు తను నచ్చపు భక్తి తలంచు వారలన్
మోదము మీఱ బ్రోచు గణముఖ్యుని విఘ్నపతిం దలంచెదన్" [2]

తన కర్తములచేత తల్లియైన గౌరికి సంతసము కలిగించిన ఇభరాడ్వక్త్రునికి, రామభూషణుడు, వసుచరిత్రలో కావించిన ప్రశంసా పూర్వక ప్రస్తుతి ఇది.

శా. " దంతాఘట్టిత రాజతాచల చలద్గౌరీ స్వయంగ్రాహముం
గంతు ద్వేషికి గూర్చి శైలజకు తద్గంగార్ఘురాచాంతి న
త్యంతా మోదము మున్నుగా నిడి కుమారాగ్రేసరుండై పితృ
స్వాంతంబు ల్వెలయింపజాలు నిభరాడ్వ క్త్రుం ప్రశంసించెదన్" [3]

విఘ్నములను పర్వతములను ముక్కలుగావింప కులిశమును ధరించినవాడు, గర్వప్రమత్త అరివీరులను బంధింప పాశమును పూనిన వాడు, కావ్య రచనలో కలుగు అంతరాయాలను

---

పాద సూచికలు : [1] ఆత్మరామాయణము/ బాలకాండ/ఆవ/1 & 2/లలిత కవి టి. గురుమూర్తి.

[2] వాల్మీకిచరిత్ర /రఘునాథ/ ప్రథ /4., [3] వసుచరిత్ర /రామరాజభూష/ప్రథమ/7

అడచుమని అగజాననపద్మార్కుడైన గజాననుని వేడుట, 'కంకంటిపాపరాజు' వారి 'ఉత్తర రామాయణము'లో చూడగలము. ఆ పద్యమును మత్తేభ వృత్తములో కూర్చినారు.

మ. " కలుషేభావళి నాప నంకుశము విఘ్న క్ష్మాధర శ్రేణి వ్ర

క్కలు గావింప వరస్ఫురత్కులిశముస్ గర్వ ప్రమత్తారివీ

రుల బంధింపగ పాశ మున్నతమనోరుగ్రేణువుల్ మాన్ప పు

ష్కలదానాంబువులూను వేల్పడచు మత్కావ్యాంతరాయ చ్ఛటల్" [1 ]

సంపదకొరకు లక్ష్మిని, విద్యకోసమై బ్రాహ్మిని, విఘ్నములను పోగొట్టుటకు వినాయకుని సేవించుట కలదు. కొన్ని సందర్భములలో లక్ష్మీయుతుడైన గణపతిని సేవించుట కలదు. శ్రీ కవితానంద వాల్మీకి రామాయణము [సారకాండము]లో నవీన కవి సోంపల్లె కృష్ణమూర్తిగారు 'లక్ష్మీగణపతి'ని లలితోక్తులకొరకై అర్థించినారు. చూడండి.

కం. " లక్ష్మీ గణపతి కవితా లక్ష్మము శుభమెసక మెసగలలితోక్తులతో

సూక్ష్మ స్థితి కృతిగన వాఙ్లక్ష్మీ కరుణా కటాక్ష గరిమము నిడుతస్" [2]

ఈ రీతిగా గణపతిని స్తుతించిన కవులు రచయితలు ఎందరోకలరు ఇప్పుడ 'అప్పకవీయము'లో చతురుడైన సింధురవదనుని చిలిపి చేష్ట కొంత చూద్దాము. గజాననుని గని ముదమందిన జగత్పితరులైన 'అజ నగజ'లిరువురు ఇరువైపులనుండి, గణపతి చెక్కులను ముద్దిడగ ముచ్చటపడి ముందుకొక్క యెత్తున రాగా, నేర్పుతో తన మోమును వెనకకు తీసినాడు 'వెనకయ్య'. తమ ప్రయత్నములేక సుతుని ముద్దాడబోయి, తమ కుమారుని చర్యవలన అప్రయత్నముగా, ఉమాశంకరులు ఒకరినొకరు చుంబించు కోవడమైనది. అట్టి ముద్దును తల్లిదండ్రులకు కూర్చిన ఆఖువాహనుని తలచినాడు – అప్పకవి.

---

పాద సూచికలు: [1] ఉత్తర రామా /కంకంటి/పీ/7. [2] సారకాండ/సోంపల్లె కృష్ణ మూర్తి/12

చ. " తనుగని యొక్క యొత్తుననె దక్షజయున్నిటలాక్షుడున్ముదం
బున నిరు చెక్కులుంగదిసి ముద్దుగొనంగ నొకింత నెమ్మొగం
బనువుగ వెన్కకుందిగిచి యత్న విహీనపరస్పరాస్య చుంబనములు
తల్లిదండ్రులకు పన్నుగ గూర్చు గజాస్యు నెన్నెదన్"[1]

హరివంశములో, ఎఱ్ఱాప్రగడ ఇభముఖునికి యిష్టముతో మత్తేభములో చేసిన స్తుతి చూద్దాము.

మ. " కమలాక్ష స్మర ఘస్మరాబ్జ భవులున్ గైవారు లంభోధి పూ
రములున్ బుక్కితి సాము గోత్రగిరి వర్గంబున్ కనత్కందు కా
భముసంక్రీడన వేళ నేవిభున కాభవ్యుండు ప్రత్యూహ సం
తమసాదిత్యు డిభాననుండొసగు భద్రంబుంగృతిస్వామికిన్" [1]

గణపతిని స్తుతిస్తూ బ్రహ్మాదులచే పూజలుగొనువాడు, భవ్యుడైనవాడు, చీకటిని హరించు సూర్యుడు అయిన గజాననుడు కృతిపతికి భద్రము కూర్ప కోరుట చూడగలము.

మంగళాచల పానకాల నారసింహుని పరమభక్తుడైన కనుపర్తి అబ్బయామాత్యుడు, తన 'అనిరుద్ధ చరిత్రములో' కృపావలంబుడగు హేరంబుని విద్యకై ఇట్లు భజించినాడు.

ఉ. " అంబుజగర్భ నిర్జరవరాదుల సపర్యలందు హే
రంబు కృపావలంబు మునిరాణ్ణికురంబ మనోంబుజాత రో
లంబుదరస్మితానన కళాజిత శారద చంద్రబింబు భూ
షాంబరరుగ్విడంబు విజితారి కదంబు భజింతు విద్యకై " [2]

'కాణాదం పెద్దన సోమయాజి' తన 'ముకుంద విలాసము' అను ప్రబంధమునందు గజముఖుని గణ్య గణ ప్రముఖుడని, భక్తిమత్సుముఖుడనిస్తుతించుట కలదు.

---

పాద సూచికలు:- [1] అప్పకవీయం/పీ/22
[2] హరివం/ఎఱ్ఱన/I-4 [3] అనిరు/కనుప/అవతా/7

చ. " నిజభజనాభి యోజనవినీత సుధీజన సూక్త సత్కృతి

ప్రజముల మాధురీ గుణ మవశ్యము నిల్పు నిరీక్ష నిక్షుసా

ర జలధిమధ్య వాస తను రంజిలు బాహు దశాంచితుస్ మహా

గజముఖు భక్తిమత్సుముఖు గణ్య గణ ప్రముఖుస్ భజించెదస్" [1]

తన 'నృసింహపురాణములో' 'ఎఱ్ఱన' గారు ఏనికమోము వేల్పునకు గావించిన నుతి యొకింత చూద్దాము. మాతృవాత్సల్యముతో అంబిక అగజాననుని అక్కున చేర్చుకొన్నది. గిరితనయ ఘనస్తన యుగమునకు సమముగా కుంభయుగ్మములవంటి గజశిరమందలిభాగములు ఒకదానితోనొకటి స్పర్ధ చెందుచున్నవి. అట్టి గణనాథునికి నుతులనర్పించినాడు, శంభుదాసుడు – అను ఎఱ్ఱన.

చ. ' తనరగ గ్రుచ్చి యంబిక ముదంబున కౌగిటజేర్చుచో ఘన

స్తన యుగ కుంభ యుగ్మములు దార్కొని యొప్పునకై యసూయమై

చెనకి పెనంగ నొండొకటి  చేరిన లాగున నుల్లసిల్ల పెం

పెనసిన వాని ప్రీతి నుతియించెద నేనిక మోము వేలుపుస్' [2]

నవీన పద్యకవుల్లో పెద్ద పేరు కలవారు, నంద్యాల సూరన సారస్వత సంఘము కార్యదర్శి, విద్వాన్ శ్రీ 'గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి' గారు. ఆయనకూర్చిన పలు గ్రంథాలలో ఒకటి 'కలియుగ దానరాధేయ శ్రీ బుడ్డా వేంగళ రెడ్డీయము' [పద్య కావ్యము]  శాస్త్రిగారు పద్యకవులు మాత్రమె కాదు, కలం పేరుతో కథా, నవలా రచయినలు కూడా చేసినారు. ఆచారవంతులు, ప్రాచీన సారస్వత  వ్యవహారములకు గౌరవమిచ్చువారు కనుక తమ కావ్యములో తొలుత దైవ ప్రార్థన చేసినారు.

ఆయన విఘ్నపతిని కోరినదేమో ఈ పద్యములో చూడగలము. తాన ఆరంభించిన కార్యము నిర్విఘ్నముగా జరుగుటకై నమస్కారములిడినారు. తేట తేటగా తేటగీతిలోని పద్యమిది.

---

పాద సూచికలు:  [1] ముకుంద/అశ్వా 1/9  [2] నృసింహ/ ఎఱ్ఱన /పీ/5.

గీ. "కోటి భాస్కర సంకాశుకుబ్జమూర్తి,

వక్రతుండము వాని విశ్వాత్ము ఘనుని

విఘ్న హననమ్ముకై కొల్తు వేల నతుల

కార్య సాఫల్యమునకంచు కరము మోడ్చి" [1]

నవీన పద్య కవులలో 'కే సభా' గారు [చిత్తూరు] తమ 'వేదభూమి' అను పద్య కావ్యములో వినాయకుని స్తుతించిన తీరు ఇది. ఇందులో కవులను, కళలను కారుణ్యముతోడ కాచుమని కోరుట కలదు.

కం "శ్రీ రమణీయ గణాధిప,

మేరుమహోన్నత గభీర, మేధానిధి, నీ

సారతర జయ విలేఖిని,

కారుణ్యము తోడ గాచు కవులన్ కళలన్ " [2]

ఇప్పటి వరకు కొన్ని గణపతి నుతులను చూచినాము.ఇక కొన్ని ఈశ్వర స్తుతులను పరిశీలిద్దాము.

4.2 ***ఈశ్వర స్తుతులు*** : - నిర్వికారుడు, నిరంజనుడు, త్రినేత్రుడు, త్రిమూర్తులలో లయకారకుడు ఈశ్వరుడు. ఈశ్వరుడు అనగా ప్రభువు. హిందువులు ముఖ్యముగా అనుసరించు విధానములలో ఒకటి శైవము. శివుని స్తుతి సాధారణంగా ఇట్లుండును.

"వందే శంభుముమాపతిం సురగురుం వందే జగత్కారణం

వందే పన్నగ భూషణం మృగధరం వందే పశూనాం పతిం

వందే సూర్య శశాంక వహ్ని నయనం వందే ముకుంద ప్రియం

వందే భక్తజనాశ్రయం చ వరదం వందే శివం శంకరం" [ప్రసిద్ధం]

---

పాద సూచికలు: [1] గొ.సుబ్రహ్మణ్య శాస్త్రి /కలియుగ దానరాధేయ శ్రీ బుడ్డా వేంగళ రెడ్డీయము ఆవ/2 [2] కే సభా'/ వేదభూమి/ పద్యము 1

ఇచట పరమ శివునిరూపము లింగ రూపమునందు కాక రూపముతో వర్ణింపబడినది.

ఉమాపతియు, సురలకు పెద్ద/గురువు, జగత్తునకు కారణ భూతుడు, పన్నగ భూషణుడు, మృగమును ధరించినవాడు, పశుపతి, రవిశశియినులు నయనాలుగ గలవాడు, ముకుందునికి ప్రియమైనవాడు, భక్త జనులచే ఆశ్రయింపబడినవాడు, వరదుడు, మంగళకరుడు- ఆ శివుడు.

శివ సంబంధమైనది > శైవము. శివ అనగా –'శామ్యతి పరమానంద రూపత్వా న్నిర్వికారో భవతీతి' అని ఒక నిర్వచనము. బ్రహ్మానంద స్వరూపుడును, నిర్వికారుండును కనుక శమించి యుండు వాడు – శివుడు. భూతపతి,

శ్రీకంఠుడు, హరుడు, స్మరహరుడు, గంగాధరుడు మున్నగు పలు పేర్లు కలవాడు యితడు. యితనికి గల పలు నామములను అమరకోశమునందు

33 -34 పుటలలో ఇట్లు ప్రస్తావించబడినది.

శంభురీశః పశుపతి శ్శివ శ్శూలీ మహేశ్వరః

ఈశ్వర శ్శర్వ ఈశాన శ్శంకర శ్చంద్రశేఖరః

భూతేశః ఖండపరశు ర్గిరీశో గిరిశో మృడః

మృత్యుంజయః కృత్తి వాసాః పినాకీ ప్రమథాధిపః

ఉగ్రః కపర్దీ శ్రీకంఠః శ్శితికంఠః కపాలభృత్,

వామదేవో మహాదేవో విరూపాక్ష స్త్రిలోచనః

కృశానురేతా స్సర్వజ్ఞో ధూర్జటి ర్నీలలోహితః

హరః స్మరహరో భర్గ స్త్ర్యంబక స్త్రిపురాంతకః

గంగాధరో(అం)ధకరిపుః క్రతుధ్వంసీ వృష ధ్వజః

వ్యోమకేశో భవో భీమః స్థాణూ రుద్ర ఉమాపతిః

(అష్టమూర్తి రహిర్బు ధ్న్య మహాకాలో మహానటః )

ఇందులో పరమేశునికి కల పలు లక్షణములు ప్రస్తావితమైనవి. పరమ శివుని ధ్యానముగా ప్రసిద్ధమైన ఈ శ్లోకమును ఒకసారి పరికిస్తే ఆయన స్వరూపము సాక్షాత్కరిస్తుంది.

"శాంతం పద్మాసనస్థం శశి ధర మకుటం పంచవక్త్రం త్రినేత్రం
శూలం వజ్రం చ ఖడ్గం పరశు మభయదం దక్షిణాంగే వహంతం
నాగం పాశంచ ఘంటాం వర డమరు యుతం సాంకుశం వామభాగే
సర్వాలంకార యుక్తం స్పటిక మణినిభం పార్వతీశం నమామి"

పరమ శాంత స్వరూపుడు, పద్మాసనస్థితుడు, శశిని మకుటముగ ధరించినవాడు, పంచ ముఖములు గలవాడు, మూడు కన్నులు గలవాడు, శూల వజ్ర ఖడ్గ పరశు మున్నగు ఆయుధములు ధరించినవాడు, అభయమిచ్చువాడు, నాగాభరణుడు, పాశ, డమరుకములు కలవాడు, మనోజ్ఞమైన అలంకారములతో కూడి, పార్వతీ సహితుడై, స్పటిక మణి సమకాంతి వంతుడు- అయిన ఈశ్వరునికి నమస్సులు. చిత్రాతిచిత్ర రూపము కలవాడు. ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమైన వాడితడు, ధూర్జటిమహాకవి తన శ్రీకాళహస్తి మాహాత్మ్యములో ఈశ్వరుని, జ్ఞానప్రసూనాంబ పతిని, వాయులింగేశ్వరుని రూపులో కల ఈశుని ఇట్లు నుతించినాడు.

మ. "తనయిల్లాలఖిలైకమాత తన సంతానంబు భూత వ్రజం
బనులాపంబులు వేదము ల్దనవిహారాగారము ల్మౌని హృ
ద్వనజంబు ల్దన సేవకుల్గమలజాత శ్రీధరుల్గా చెలం
గిన దేవోత్తమ నమ్మహాత్ము తరమే కీర్తింపగా నేరికిన్?[1]

ఆ శూలిని కీర్తింప అసాధ్యము.ఆయన పత్ని అఖిలైక మాత. భూత సమూహము ఆయన సంతానము. అనులాపములు వేదములు. మునుల మనసు ఆయన విహార భూమి. ఆయన సేవజేయువారు కమలజుడు, కమలాపతి. ఆయన దేవతలలో ఉత్తముడు. మహాత్ముడు. ఆ శంకరుడు సతత త్రైగుణ్యవశాచ్యుత కేళి జగన్ముహు ర్ముహుర్నిర్మాణ స్థితి భంజన కరణుడు, హతభవ పాశుడు. ఆ కందర్పదర్ప హరుని పంచవింశతి లీలలనుఇలా వివరించడము కలదు.

---

పాద సూచికలు: [1] కాళ/ధూర్జ/ప్రథమా/10

చంద్రుని ధరించుట, ఉమాదేవిని కూడియుండుట, ధర్మదేవతరూపమగు వృషభాధిరోహణ, నృత్యమాడుట, పార్వతిని పెండ్లియాడుట, భిక్షాటనము చేయుట, మదనుని గర్వమణచుట, అంతకుని గర్వమణచుట, త్రిపురాంతకుడగుట, జలంధరునిసంహరించుట, గజాసుర సంహారం, వీరభద్రుని అవతారమెత్తుట, అర్ధనారీశ్వరుడగుట, హరికి సగము శరీరమిచ్చుట, మాయాకిరాతుడగుట, కంకాళ రూపియగుట, చండీశ్వరుననుగ్రహించుట, విషభక్షణ, వెన్నునికి చక్రమిచ్చుట, విఘ్నముల హరించుట, ఉమాసుతులతో నుండుట, ఏకపాద రుద్రుడగుట, సుఖాసనమునందుండుట, దక్షిణామూర్తి రూపున దర్శనము నిచ్చుట, లింగోద్భవుడగుట.

తన 'మనుచరిత్ర' లో 'అల్లసాని పెద్దనామాత్యులు', రాజీవాక్షుని ప్రార్థించిన పిదప, తన రాయడగు కృష్ణదేవరాయలకు, 'రాజశేఖరుడు' అభీష్టశుభముల నిడవలయునని ఆకాంక్షించినాడు.

ఉ. 'ఉల్లమునందు నక్కటిక మూనుట మీకులమునందు కంటి మం
చల్లన మేలమాడు నచలాత్మజ మాటకు లేతనవ్వు సం
ధిల్ల గిరీటి పాశుపత దివ్య శరాఢ్యుని జేయు శాంబరీ
భిల్లుడు కృష్ణరాయల కభీష్ట శుభ ప్రతిపాది గావుతన్' [1]

విద్వత్ ఔషధమైన 'నైషధము'ను 'శ్రీనాథ' కవిసార్వ భౌముడు నిండు జవ్వనమున సంతరించినాడు. తొలి పద్యమును వెన్నుని పరమైన స్తుతితో ఆరంభించినాడు. అటుపై ఈశ్వరునికి అంజలి ఘటించినాడు. ఆ శివుడు త్రిపుర సంహారి. అందులకు అతడు వాడిన పరికరాలను వివరిస్తూ కవిసార్వ భౌముడుకూర్చిన రచన.

---

పాద సూచికలు: [1] పెద్దన/మనుచరిత్ర / పీఠిక/2

మ. కనక క్షోణి ధరంబు కార్ముకముగా కద్రూతనూజుండు శిం
జినిగా, మాధవు డమ్ముగా పురములక్షీణైక దోశ్శక్తి గె
ల్చిన జోదీశ్వరుడిచ్చు గాత! జయలక్ష్మీ సుస్థి రైశ్వర్య శో
భనముల్ పెద్దయ సింగ మంత్రికిజగత్ప్రఖ్యాత సత్కీర్తికిన్ [1]

కుమార సంభవములో నన్నెచోడుడు ఈశ్వరుని మూడు పద్యములలో స్తుతించినాడు. మొదటి పద్యము మగణముతో ఆరంభమైన, ఇతర కవులకు కొంత భిన్నముగా స్రగ్ధరా వృత్తముతో ప్రారంభించినాడు. ఆ పరమేశుడు అసాధారణమైన వాడు. ఆయన శ్రీవాణిభర్త యగు విధాత, ఇంద్రుడు, మున్నగువారు సేవింపగ అంఘ్రి పద్మ జీవోత్కసరుడు, ఆశ్రిత జన లషిత అశేష వస్తు ప్రదుడు,దేవాధీశుడు, నిత్యోదితుడు, అజుడు, మహాదేవుడు, ఆద్యుండు, విశ్వైకావాసుండు. ఆయన ప్రీతాత్ముడై అభిమతములను ఇవ్వగలడని అభిలషించుటను అవలోకించగలము.

స్ర. " శ్రీవాణీంద్రామరేంద్రార్చిత మకుట మణిశ్రేణి ధామాంఘ్రి పద్మా
జీవోద్యత్కేసరుండాశ్రిత జన లషితాశేష వస్తు ప్రదుండా
దేవాధీశుండు నిత్యోదితుడజుడు మహాదేవు డాద్యుండు విశ్వై
కావాసుండెప్పుడున్ మా కభిమతములు ప్రీతాత్ముడై యిచ్చుగాతన్"[2]

ఆ పరమేశ్వరుని వర్ణన మరొక సీసపద్యములో చేయటము కలదు.

సీ. రమణీయశృంగార రజతపర్వతము నా శోభిల్లు సిద్ధవిస్ఫూర్తిమూర్తి
ఆ పర్వతాగ్ర హేమైక శృంగంబునా నమరు జటామకుటాతి భాతి
ఆ తుంగ శృంగశిలా పూర్ణ సరసినా పొంగారు జాహ్నవి భూరివారి
ఆ నిమ్న సరసి విహార మరాళికాపంక్తినానొప్పు కపాలమాల

ఆ. ఆ మహామరాళి కాబర్హణాంభోజ పుష్పనిభ సముత్థభోగ భోగి
సమితి దాల్చిపోల్చు శంకరుండంబికాధవుడు మా కభీష్ట దాత గాత! [3]

---

పాద సూచికలు: [1] శ్రీనాథ/శృంగార/ప్రథ/2, [2] కుమార సం / నన్నెచోడుడు /1 [3] కుమార సం/ నన్నె/2

కోరికలను కురిపించు అంబికానాథుడు హిమగిరి వలె గరిమాన్వితుడని ఉపమించి విశేషములను విశదము చేయడము చూడగలము. ప్రతి పాదమునందు అనుప్రాస ఉపయుక్తమైనది. అటు తరువాత కవి మరొక చంపకమాలతో చంద్రధరుని అర్చించినారు. హరి నీల మేఘ శ్యామ వర్ణము వాడు. సిరి సోదరుడు మృగాంకుడు. ఆ చందురుని శిరముపై ధరించినవాడు హరుడు. శివార్పణము చేయబడిన సహస్ర కమలములలోచంద్రుడుకొద్దిగా ఋరదచేత మాసిన తామర యని భావించి, దానిని తొలగించ చేయి చాచినాడు హరి. నల్లని వాడైన హరి కరమునుగని, రాహువుగా భావించి భయముతో వణకినాడు చంద్రుడు. సిరి పతిని, సిరి సోదరుని గని మనసార దరహాసముతో

చ. " హరి వికచామలాంబుజ సహస్రము పూన్చి మృగాంకు కందువి

స్ఫురిత మలాసితాబ్జ మణి పుచ్చగా చాచిన చేయి చూచి చం

దురుడది రాహుసావి వెఱదుప్పల దూలగ జారుచున్న నయ్యి

రువురజూచి నవ్వు పరమేశ్వరు డీవుత మాకభీష్టముల్ " [1]

కూడినవాడైన పరమేశుడు అభీష్టదాత కావలెనని కవి నన్నెచోడుడు ఆశించు చున్నాడు. పై మూడింటిలోనూ, అభీష్టమును సిద్ధింప జేసికొను ప్రయత్నము కవిలో కనిపించును. శివుడనగ...పరమానంద రూపమున నిర్వికారుడై, శమించియుండువాడు సాధు హృదయ ములలో శయనించియుండువాడు, శుభముల నిచ్చువాడు.. శంకరుడనగా....సుఖం కరోతీతి శంకరః .. అనగా సుఖమును కలుగచేయువాడు. మానసికముగా సుఖమును పొందినవాడు భౌతిక సుఖములను గణింపదు. పిదప స్తుతి ఐశ్వర్య యుక్తుడు ఈశుడు. ఈశునికన్న ఉన్నతమైన వాడు పరమేశుడు. అన్నిటి కన్నా ఉత్కృష్టమైన వాడు. ఆ రీతిగా, ఆనందమును, ఐశ్వర్యమును, సుఖమును సంప్రాప్తింప చేయు వాడు సాంబశివుడు.

---

పాద సూచికలు: [1 ] కుమార సంభవం/ నన్నెచోడుడు / 3.

కనుకనే కుమారునికి, కుమారజనకునికి, మారునికి, మారజనకునికి, నమస్కరించినాడు, వన్నెలు దిద్ది తనకవితకు - నన్నెచోడుడు. మంగళకర సందర్భమును ఎన్నుకొన్నాడు, సుజనవిధేయుడైన తిమ్మన . పారిజాతాపహరణ ప్రబంధమందు పార్వతీ పరమేశ్వరుల వివాహ సందర్భము గైకొని పరమేశుని కటాక్షము మహైశ్వర్యము రాయనికి సంధింపజేయుట ఈ అరణపు కవి కోరిక. పెళ్ళిలో తలంబ్రాలు /తలఁ బ్రాలు [పసుపు అక్షతలు] ఒకరిపైఒకరు వధూవరులు పోసుకొనుట ఒక ఆచారము. వరుడు గంగాధరుడు. చెలికత్తెలు సహాయముచేయగా, పార్వతి అక్షతలు శివునిపై వేయబోయి అతని శిరము నందలి గంగలో తన నీడను జూచి, మరొక తొయ్యలి యని అసూయచెందినది. అప్పటి ఆమె మౌగ్ధ్యముజూచి ఇందుధరుడు మందహాసము చిందించినాడు. ఆ రాజశేఖరుని వివాహ దృశ్యమును రమణీయముగా 'మత్తేభము'పై నడిపించినాడు – మన కవిశేఖరుడు.

మ. "పొలతుల్ కౌగిట గ్రుచ్చి యెత్తి తలఁ బ్రాల్వోయించు నవ్వేళనౌ
దల గంగం దన నీడ తాన కని మౌగ్ధ్యంబొప్ప వేరొక్క తొ
య్యలి యంచు న్మదినెంచు పార్వతి యసూయా వాప్తికిన్నవ్వు క్రో
న్నెలపూదాలుపు కృష్ణ రాయనికి సంధించు న్మహైశ్వర్యముల్ " [ 1]

శారదామూర్తి యను పేర విరచితమైన నరసభూపాలీయము రామరాజభూష ణునిదే యని అంగీకరింప బడినది. అందులో శౌరినిస్తుతించిన పిదప హరుని స్మరించుట జరిగినది.ఆ హర స్మరణ చూచెదము. ఈశ్వరుడు శిరముపై గంగను, వామభాగమున గిరిజను ధరించినాడు.వారిరువురిని ఆనదింపజేయుచున్న శంభుడు తన కృతిభర్తను బ్రోవమని ప్రార్థన సేయుట, శ్రీహనుమత్ప్రసాద లబ్ధకవితా మూర్తి శారదామూర్తి పద్యములోని విషయము.

---

పాద సూచికలు: [1] పారిజా/తిమ్మన/ప్రథమా/2

శా.   "గంగం దాల్చితి వుత్తమాంగముననస్ గైకోలు గావించి త
ర్ధాంగీకారమునం బురంధ్రినిను వామాంగంబునందాల్పనే
శృంగారోన్నతి చూడుమంచు గిరిజ న్నీర్ష్యాపగా బింబిత
స్వాంగానందిత జేయుశంభుడు నృసింహా ధీశ్వరుంబ్రోవుతస్" [1]

'తెనాలి రామకృష్ణ' కవి వర్యుడు, తన 'పాండురంగమాహాత్మ్యము'లో పరమేశ్వరుని 'శివాహ్వయకల్పశాఖి' గా వర్ణించినాడు. ఆ కల్ప తరువు చివురాకులతో, ప్రసూనములతో, పూలమరందముతో, తనచుట్టూ శుకాదులచే పరివేష్టితమై చంద్ర , గంగాదులతోవిలసిల్లుచూ శివుడు అను కోరికలనిచ్చు కల్పవృక్షమువలె భాసిల్లుచున్నట్లు చెప్పడమున్నది. చూడుడు.

ఉ.  " ఈ చివురాకు నీప్రసవమీపువు తేనియ యెంత యొప్పెడిస్
జూచితిరే' యటంచు తనచుట్టు  శుకాదులు కొల్వగా కప
ర్దాచిత చంద్ర గాంగ జలమైనశివాహ్వయ కల్ప శాఖి వే
దాచలమంత్రికీర్తి కలశాబ్ధిని వెన్నెల చూడ్కి జూచుతస్'  [2]

లయకారకుడు, త్రినేత్రుడు, శ్మసానవాసి, విచిత్ర రూపి ఎన్ని విధాలుగా చెప్పినా ఈశ్వరునికి కూడా కొంత శృంగారమునద్ది, గట్టురాచూలితో కొంత ఒద్దిక చేకూర్చు ప్రయత్నము కొందరు కవివరులు చేయక వదల లేదు. అట్టివారిలో, 'వాల్మీకి చరితము' కూర్చిన సత్సారుడు, శ్రీ రామచంద్ర కరుణా కటాక్ష లబ్ధ సిద్ధ సారస్వత విశేష నిరర్గళవాగ్విభవశేష, సరస సాహిత్య కళా భోజ, సత్యసంభూషితముఖాంభోజ...మున్నగు బిరుదాంకితుడైనవాడు, 'రఘునాథ నాయకుడు'. ఆయన తన గ్రంథములో, శివునికి, శివానికి మధ్య 'మోవి పందెము'ను కల్పించినాడు. ఆ సరసకవితా రచనాతీరును కొంత పరికింతము.

---

పాద సూచికలు: [1] నరస/ప్రథమా/5  [2] తెనాలి/పాండు/ప్రథమా/5

చ. "  హరిణవిలోచనా! గిరిజ! యాడుదమేయని మోవిపందెముస్
గిరిజకునిచ్చి యచ్చెలియ కేల్దెమలించుచు చంద్రజూట  నీ
వరయగ నెంత జూటవని యట్లన పన్నిదమీయ నీసునస్
సరసములాడు శంకరుడు శబ్దవిశేషములిచ్చు గావుతస్" [1]

మూడాశ్వాసములలో ముచ్చటగా, అచ్చతెనుగులో కూర్చబడినది 'నీలాసుందరీ పరిణయము'. దీని కర్త 'కూచిమంచి తిమ్మకవి'. కథ విషయమునకు వస్తే శ్రీ కృష్ణుడు ఎద్దులతో యుద్ధము చేసి వధువగు నీలను పరిణయమాడుట. అనగా హరికి సంబంధమైనది.

కవి తొలుత జేసిన ప్రార్థన హరునిది. హరుని కవి ప్రార్థించునపుడు హరి కనిపించుట మరి కొందరి కవుల జీవితములలో జరిగిన ఘటనలే. విధి హరి మున్నగు వారు సేవలు జేయుచుండగా వలిమలచూలితో గూడి వలిమలయల్లుడు, నెలతాల్పును ధరించి, వేడుకలలో చొక్కుచున్న రూపమిది.

ఉ.   " శ్రీలకు దానకం బగుచు జెన్నలరారెడు వెండికొండపై
మేలిక డానిడాల్ హొయలు మీఱెడుజాబిలి ఱాలమేడలో
వేలుపు ఱేడు, నల్వయును వెన్నుడు కొల్వగమంచుగొండ రా
చూలిని గూడి వేడుకల జొక్కెడు లేనెలతాల్పు కొల్చెదస్" [2]

*సాహిత్య రసపోషణుడైన రామరాజభూషణుడు , చమత్కారములకు పుట్టినిల్లయిన వసుచరిత్రలోయొక చమత్కారము. ముదుసలియైన మందాకినిని నెత్తికెత్తుకొని, షోడశవర్ష ప్రాయియైన తనను పూర్తిగా పరిగ్రహింపక, సగము దేహము మాత్రమే యొసగినాడని, అసంతృప్తితో ఆర్యామహాదేవి అలిగినది. ఆమె అలకను తొలగించి, ఆమెను ప్రసన్నము జేసుకోదలచినవాడైన శివుడు పార్వతి పాదపద్మములపై శిరమునిడినాడు. సవతి పాదములపై తనను నిల్పినాడని, శివుని శిరమందుండు గంగమొరసినది.*

---

పాద సూచికలు:[1] వాల్మీకి/ప్రథమా/5  [2] నీలా సుందరి/తిమ్మన/పీ/1

*గంగను బుజ్జగించుటకై తన జటలను సరిజేసుకొను నెపముతో గంగను వేడుకొనుచున్నట్టి, అతుల సామర్థ్యవంతుడగు, ఆ అష్టమూర్తికి అంజలి సమర్పించిన విధము చూద్దాము.*

శా. " ఆ మందాకిని మౌళి పూని నను నర్ధాంగీకృతంజేసి తా
నౌ మేల్మేలని యార్య యల్గ ప్రణతుండై తత్పదాంభోజ యో
గామర్షంబున గంగయున్మొరయ చూడాభోగ సమ్యక్క్రియా
సామర్థ్యంబున వేడు శంభుడు కృతిస్వామిం కృపం బ్రోవుతన్" [1]

తన కృతిభర్తయగు 'చిల్లర నాగయ వెన్న మంత్రి'కి చిరతరైశ్వర్య సంపదను ఆ అష్టమూర్తి యైన అభవుడు ఒసగ వలెనని ఆకాంక్షిస్తునాడు,'శృంగారశాకుంతల' కర్త, 'పిల్లలమర్రి పినవీరభద్రకవి' అష్టమూర్తి యనగా ఎనిమిది మూర్తులు / స్వరూపములు కలవాడు. అతడు పరమశివుడు. ఆతని ఎన్మిది రూపములు ఏవనగా.... (1) సూర్యుడు (2) జలము (3) పృథివి (4) వాయువు (5) వహ్ని (6) ఆకాశము (7) చంద్రుడు (8) దీక్షిత బ్రాహ్మణుడు. {విష్ణు పురాణముననుసరించి చెప్పబడిన విషయమిట్లు కలదు – " సూర్యోజలం మహీ వాయుర్వహ్నిరాకాశమేవ చ దీక్షితో బ్రాహ్మణః సోమ ఇత్యేతా స్తనవః"}ఈ విషయమును తన కావ్యములో పినవీరుడు స్తుతించినాడు.

సీ. " పూని చరాచరంబు భరించు నొక మూర్తి యుడుపు తృష్ణా ఖేద మొక్క మూర్తి
యారగించు మనోజ్ఞమగు హుతం బొక మూర్తి యొసగు చైతన్యంబునొక్క మూర్తి
యాదిత్యులకు త్రోవయై పొల్చు నొక మూర్తి యుడుగణంబుల నేలు నొక్కమూర్తి
విశ్వంబు చీకటి విరియించు నొక మూర్తి హోతయై దీపించు నొక్క మూర్తి

గీ. యరయ నేవ్వనియందు నయ్యష్టమూర్తి యిష్ట ఫల దాత కరుణా సమేతుడగుచు
వెలయ చిల్లర నాగయ వెన్న మంత్రి జిరత రైశ్వర్య సంపన్ను జేయుగాత! [2]

---

పాద సూచికలు: [1] వసుచ/రామరాజభూషణుడు /ప్రథమా/5

[2] శృంగార శాకుంత / పిల్లలమర్రి పినవీరభద్రకవి/ఆవ /2.

శృంగారరసమును చిప్పిల జేయుటలో కొందరు కవులు అందెవేసిన చేయి కలవారు. లయమూర్తి యైన పరమశివుడి ద్వారా కూడా వారు చమత్కారాలు చేయించగలరు. ఆ కోవలోకి చెందినదే ఈ పద్యము. గ్రంథము '**ఉత్తర రామాయణము**' కర్త '**కంకంటి పాపరాజు**'. ఇతడు శ్రీ మదన గోపాలుని కృపను పొందిన వాడు, కంకంటి వంశ పయః పారావార వంశ చంద్రుడైన అప్పయామాత్య తనయుడు, రామాయణమును రాసినాడు. వెండికొండపై వాసము చేయువాడు శివుడు. చంద్రశేఖరుడు. పార్వతి పర్వత రాజ కన్య. పార్వతి పాలిండ్లపై నఖ క్షతములు ఉన్నవి. సరస మైన చూపులతో త్రినేత్రుడు, పయ్యెద జారగ, పార్వతి చనులపై గల చంద్ర రేఖలవంటి గోటిగాట్లు గమనించి, వనితరో! వెండికొండ నెలవంకలు పెక్కు వహించె నని, అన్యాపదేశముగా అభవుడు నుడువగా, అందలి సరసమును గ్రహించిన శాంకరి దరహసిత వదనయై పయ్యెద సరిగ సవరించు కొనినది. ఆ గౌరిని కౌగిట బంధించినాడు బాలచంద్రధరుడు. ఆయన మము ప్రోచుగాక అన్నాడు కవి '**కంకంటి**' గారు.

చ. " **వనితరో వెండికొండ నెలవంకలు పెక్కు వహించె జూచితే**
**యని సరసోక్తి తాననిన నచ్చపు గందపుపూత గుబ్బ జా**
**ఱిన నునుబైటకొంగు సవరించుచునవ్విన గౌరి కౌగిటం**
**తనిపెడు చంద్ర శేఖరుడుదార కృపన్ మము ప్రోచు గావుతన్**" [1]

లయకారుడేకాదు, సమయానికి తగు మాటలాడ గలవాడు కూడా ఆ సర్వజ్ఞుడైన చంద్రమౌళి. ఆయన శిరముపై లహరులతో కూడిన గంగ యున్నది.

నాథుని చేరి 'నవోఢ' యగు నగరాజపట్టి ముద్దుపలుకులతో ఈ అంభః కణములేమిటని అడుగగా, నేర్పుతో నీవు, మన వివాహ వేళ పోసిన ముత్యాల తలబ్రాలని తెలిపి లాలించిన శివుడు మనలనధిక ప్రీతితో నేలునని కవి చతురతతో భావన చేయడము మనము గమనింప వచ్చును.

---

పాద సూచికలు: [1] ఉత్తర/కంకంటి/పీ/3

మ. " విలస న్మౌళి విలోల లహరీ విస్రావితాంభః కణం

బులివేమన్న నవోఢయౌ గిరిసుతా ముగ్ధోక్తి కిన్నీ విదే

తలబ్రాల్వోసిన ముత్తియంబులని కాంతా రత్న ము న్నేర్పు మా

టల లాలించి కృతార్థుడౌ శివుడు గాఢ ప్రీతి మమ్మేలుతన్" [1]

నెత్తిపై గంగ స్థావరము, దేహములో సగము అంబ ఆక్రమణ. అయినా సర్వామర స్తుత్యుడు. భంజిత పాపవర్గుడైన ఆ భర్గునికి , 'సారకాండము'లో 'కృష్ణమూర్తి' గారు కైమోడ్పుల తీరిది.

శా. " దుర్గా గంగలు దేహశీర్షములనెంతో ప్రీతి సంధిల్ల సం

సర్గౌన్న త్యసుఖానుభూతి వెలయన్ సర్వామర స్తుత్యుడై

దుర్గర్వంబు హరించి లోకభరమున్ దోశ్శక్తి మాయించు శ్రీ

భర్గున్ భంజిత పాపవర్గు మదిలో ప్రార్థింతు నశ్రాంతమున్" [2]

కవిత్రయములోనొకడైనవాడు, శంభుదాసుడు అని పిలువబడినవాడు 'ఎఱ్ఱన'. ఆయన తన హరివంశములో పరమేశుని ఇట్లు నుతించినారు.

శా. " శర్వాణీ స్తన చక్రవాకములు వక్షస్స్ఫారకాసారమున్

గర్వంబింపెసలారగా దఱిసి వేడ్కల్సల్ప రోమాంచమున్

సర్వాంగీణముగాధరించికొని యిచ్చన్ బేర్పు శంభుండు స

ర్వోర్వీ రక్షణ దక్షువేమనృపు నిత్యోర్జస్వలుంజేయుతన్" [3]

తన 'అనిరుద్ధ చరిత్రము'లో కవి 'కనుపర్తి అబ్బయ' నరసింహుని స్తుతించిన వెంటనే శంకరునికి కైమోడ్పులందించినాడు. అందులో కొంత సింగారము చిలికించినాడు. సరసతతో

---

పాద సూచికలు: [1] చౌడేశ్వరి రామకవి /ప్ర/3 [2] సారకాండ కృష్ణమూర్తి /5

[3]హరివం/ఎఱ్ఱన I/2

గిరిజను గంగాధరుడు కౌగిలిచేర్చినాడు. గిరితనయ ఉరోజములపై నలదియుండిన విబూది తెల్ల తామరమొగ్గలజంట వలె గిరీశునివక్షముపై ముద్రితమైనవి. మమతతో ఆ సుందరమైన ముద్రలను పలుమార్లు తిలకించి సొక్కుచున్నాడు అభీష్ట ప్రదాత యగు కందర్పదర్ప హరుడు.

చ. " సరసత కౌగిలింప గిరిజా కుచపాళి నిజాంగలిప్తభా

సుర భసితాంతమై కులుకుచుస్ వెలిదామర మొగ్గ జోడుసుం

దరత వహించుచుండ మమతం బలుమాఱును జూచి సొక్కు శం

కరుడు ప్రసన్నుడై యొసగు గావుత మాకు నభీష్ట సంపదల్" [1]

'కాకునూరి అప్పకవి' గారు తమ 'అప్పకవీయములో' శివ స్తుతిని ఒక చమత్కారముతో చేసినారు. కొండకూతురగు హైమవతిని కరగించుటకష్టమని శివుడనినాడట. అందులకా అద్రి తనయ, 'కనకాద్రిని విల్లుగా వంచిననీకు,

'హిమాద్రిజాత, అందునా పడతిని కరగించుట' కఠినము కాదని పార్వతి పలుకగా ఆమెను మెచ్చుకొను చున్నాడు శివుడు. ఆ సాంబశివునికి నమస్సులంద జేయుచున్నాడు అప్పకవి.

చ. "కడు కఠినంబు లద్రులు జగంబుల నందున సంభవించి పెం

పడరు నినుం గరంప వశమా యని నన్నిపుడంటివే కదా

వడి కనకాద్రి చాపముగ వంచిన నీకు హిమాద్రిజాతయౌ

పడతి కరంచు టెంత యను పార్వతి మెచ్చు శివుం తలంచెదన్" [2]

'ముకుందవిలాసము'లో 'కాణాదం పెద్దన సోమయాజి' త్రిపురాసురులను సంహరించిన హరుని స్తుతించినాడు. ముక్త పదగ్రస్తమను శబ్దాలంకారమును ప్రయోగించుట ఇందలి విశేషము.

---

పాద సూచికలు: [1] అనిరు కనుపర్తి అబ్బయ' /అవతా/2 ,[2] అప్పకవీయము/పీఠిక/20

సీ. " దనుజ భేదన ధురంధరమౌ శరమును

శరమును వహియింప జాలు గరియు

గరిమేతలకు నాథగరిమగాంచు గుణంబు

గుణముపైవసియింప గూర్చు రథము

రథవరాధారమై రంజిల్లు విల్లును

విల్లునిలుగనుండువీరభటులు

భటకులజ్యేష్ఠుడై ప్రబలు సారథి యును

సారథి ముఖ వచస్తతులు హరులు

గీ. హరుల రక్కసి డాచిన యిరవు పొదియు పొదినిచొర బాణు చక్ర విస్ఫురణ లెసగ

త్రిపుర విజయంబు గైకొన్న దేవమౌళి సోమవిభు శాశ్వతై శ్వర్య ధాముజేయు" [1]

శివుని పలు విలాసములను ఏర్చి కూర్చినారు తన 'హరవిలాసము'లో శ్రీనాథ కవి సార్వభౌముడు. కృతిభర్త యగు అవచిదేవయ తిప్పయను కృతా ర్థునిజేయుమని [శివ] కంచిలోని ప్రసిద్ధ ఏకామ్రనాథుని నుతించిన విధము చూద్దాము. ఇచ్చట దేవుడు సైకతముతో [ఇసుక] చేయ బడిన లింగ రూపియగు కారణమున సాధారణముగా చెప్పబడు జలాభిషేకము మూలలింగమునకు చేయరనడము కలదు. గర్భాలయమునకు వెనుక ఆమ్ర వృక్షము [మామిడి చెట్టు]చాల పురాతనమైనదని చెప్పడమున్నది.

ఉ. "మావిడి మోక క్రింద నిగమ త్రిత యార్థ సమృద్ధి పార్వతీ

దేవి కుచంబులన్ పదను దీర్పని కస్తురి ముద్రగా జగ

జ్జీవన కారణం బయిన శ్రీనిధి కంచి పురీశ్వరుండు మా

దేవయ సెట్టి నందనుని దిప్పు గృతార్థునిజేయు గావుతన్" [2]

తనయొక్క కావ్యకళా కుముద్వతిని ప్రోచుగాక యనుచు, ఎఱ్ఱన గారు నృసింహపురాణములో పరమేశుని స్తుతించుట చూడగలము.

---

పాద సూచికలు: [1] ముకుంద విలా/కాణాదం/ప్రథమా/5 [2] హరవి/ శ్రీనాథ అవతా/2

చ. "వఱలు జటాటవిం గుసుమ వల్లరులై చదలేటి నీటి నె

త ఱుల జనించు క్రొన్నురువు తండములై తలజుట్టు పాము మే

నఱువుడు గుప్ప సంపుబొ రలై చెలువారశివేందు చంద్రికల్

నెఱయగ బ్రోచు మన్ముఖ మనీషిత కావ్య కళా కుముద్వతిన్"[1]

వాగర్థావివసంపృక్తౌ యన్న కవికులగురువు కాళిదాసుమాటలు, మదిలో యే మూలలో ప్రతిధ్వనించినవో పార్వతీనాథుడగు శంకరుని స్తుతితో కావ్యారంభము చేసినారు. ఉమాపతికి ఉత్పలమాలతో కావించిన స్తుతి.

"శ్రీకరమై జగ త్ప్రభవ జీవులకెల్ల శుభంకరమ్మునై

వాకును నర్థముస్ గలిసి భాసిలు భంగి నొకే శరీరమై

చేకొని విశ్వ రక్షణము చీకటి డుల్చుచు రాగ వీక్షణా

శీకరముల్ వెలార్చు ఘన చిన్మయు పార్వతి నాథు మ్రొక్కెదన్" [2]

నందికొటుకూరు సిద్ధ యోగి ప్రణీత "యోగీశ్వర విలాసము" అను ద్విపద కావ్యమును పరిష్కరించి ప్రచురించినారు ఆచార్యులు 'వైద్యం వెంకటేశ్వరాచార్యులు' తమ అక్షరార్చన ప్రచురణలు కర్నూలు ద్వారా 2012 లో. అందులో వేదాంతపరమగు విషయములుగలవు. అవతారికలో శివునిస్తుతి ఇట్లున్నది.

"నీల తోయదములో నిల్చిన మెఱుపు లీల కన్గొనల మేలిమి నటియించి

స్ఫటిక భాండంబులోపల పెట్టినట్టి చటుల ప్రభాజ్యోతి సరణి గాత్రమున

నేవేళ వెలుగు బ్రహ్మేశుని హరుని దేవ దేవుని మహాదేవుని భవుని

శ్రీసదాశివుని నంచిత భక్తి దలచి" నాడు. [3]

--------------------------------------------------------------------------------

పాద సూచికలు: [1] నృసింహ/ ఎఱ్ఱన పీ/4

[2] గొ.సుబ్రహ్మణ్య శాస్త్రి /బుడ్డ వేంగళ రెడ్డీయము /అవ/1

[3]యోగీశ్వర విలాసము/వైద్యం వెంకటేశ్వరాచార్యులు,పరిష్కర్త

4.3 ***పార్వతీదేవి స్తుతులు*** : - పర్వత రాజపుత్రి పార్వతి. మునుపు దక్ష సుత. తండ్రి యగు దక్షుడు యజ్ఞమును నిర్వహింప తలపెట్టినాడు. అల్లుడగు శివుడిని, కూతురగు శివానిని ఆహ్వానింపలేదు. పుట్టినింటికి పిలువకున్నను వెళ్లవచ్చునని, భర్తయగు శివుడు వారించినను, చనినది దక్ష సుత. చని 'సర్వ దిశాంత దేవతా జన ముని దంపతి ప్రకర సంతత యాన విశీర్ణ దివ్య భూగణ విగళన్మణీ నిచయ సంభవ చారు మరీచి కోటికను, సర్వ మహావిభవైకపేటికను జనకుని యాగవాటికను'చూచినది. అచట జనకుడగు దక్షుడు విచక్షణా రహితముగా గావించిన అవమానమును భరింప జాలక, 'శివరహితమైన యాగము శివరహితము కాగ నీవు సేయుచు నుండన్, భవదాస్యముసూచిన నే భవదాస్యానర్హనైతి పాపైకనిధీ' యని పలికి వెంటనే యోగాగ్నిలో దగ్ధమైనది. అటుపై హిమవంతుని తనయగ జనించి హైమవతిగా పిలువబడినది. *పశుపతినే తిరిగి తన పతిగా పడయ దలచి పడరాని పాట్లు పడినది. ఆ వసుంధరాధర కన్య యవంధ్య ప్రతిజ్ఞయై తపము కావింప నిర్ణయించుకొనినది. ఆహారముగ అంబు చుళుకంబులు, ఉడుపతి కరంబులు సురకరువలి డుల్లిన పర్ణములను స్వీకరించి ఉగ్ర తపము చేసినది. ఆ అంబ త్ర్యంబకుని ఆరాధనలో ఆనందమునందినది. ఆమె సర్వ మంగళ. దయామతి. సారకాండలో కృష్ణ మూర్తి ఆ అమ్మను ఇట్లు కోరినారు.*

ఉ. "కర్ణములన్ సుఖంబెసగగా కరి వక్త్రుడు ప్రక్క వీవగా
నిర్ణయకార్యసిద్ధికయి 'నే'ననిముందు కుమారుడుండగా
స్వర్ణ కళా తనూగరిమ సామెయి సామిని కూడి మించు ప్రే
మార్ణవ సర్వ మంగళ దయామతి మత్కృతికిచ్చు భద్రముల్" [1]

తన కుమారసంభవమునందు, నన్నెచోడ కవి శేఖరుడు, ఆయన కృతిని, శంకరుని శరీరములో సగమాక్రమించిన పార్వతి చేకొని సుభగత్వమును ఇవ్వ వలయునని ఆశించినాడు. చూడుడు

---

పాద సూచికలు: [1] సారకాండ కృష్ణ మూర్తి *కవి వాల్మీ రామ/9*

చ. " ముని మనుజాసురాహి సురముఖ్యులు మున్నుగ సర్వజీవులం
దనవశ మర్థిజేసి మనుదర్పకు నోర్చిన వీత రాగిజి
ద్ఘనతను నీకు నాత్మ సుభగ స్థితిమై మెయి నర్ధనారి చే
సిన నగజాత మత్కృతిని జేకొని తత్సుభగత్వ మీవుతన్" [1]

అన్నయైన వెన్నుని కీర్తనలన్నచో మన్నన సేయునది అన్నగరాజపుత్రి. కొదమ చిలుకకు విష్ణుసహస్రనామములనునేర్పుచూ, శుకము మేనును ప్రేమతో దువ్వుచూ భద్రములకు నిలయమైన పర్వతకన్యను 'తెనాలి రామలింగకవి' 'పాండురంగ మాహాత్మ్యములో' స్తుతిగా స్మరించటము చూడగలము.

ఉ. " చిద్రసవేదియౌ కొదమ చిల్కకు విష్ణు సహస్ర నామముల్
ముద్రతి మోము మోవినిడి మున్కుచు, గోరున మేను దువ్వుచున్
భద్రనిధానమై వెలయు పర్వతకన్య విరూరి మంత్రి వే
దాద్రికి విష్ణుభక్తి మహిమాతిశయంబు నయంబు నీవుతన్"[2]

రామరాజభూషణుడు, రసవత్తరముగా చిత్రించిన అగరాజతనూజ రూపము చూడండి. అర్ధ నారీశ్వరులకు మధ్య గల సమతా రూపకమైన జటలు, అబ్జము [చంద్రుడు, తామర] త్రినేత్రము, అట్టి తిలకమును బ్రహ్మ కపాలములు, కమల హస్తములు ఒప్పుచుండగా మగని సగము మేనుధరించిన పర్వతరాజకన్య
తిరుమల రాయమణికి విజయమునిచ్చుగాక యనుచూ ఇరువంకల యందలి సౌందర్యమును సాక్షాత్కరింప చేసిన కవి ఘనత.

---

పాద సూచికలు: [1] నన్నె/కుమార/ప్రథ /10 [2] తెనాలి/పాండు/ప్ర/6

సీ. " ఘనఘనాఘన లక్ష్మి నెనయు కొప్పిరుగడ,
నిరుగడ తరుణాబ్జకృత వతంస,
మురుచిత్రకాగ్ని శిఖోన్మేష మిరువంక,
నిరువంక కుండలి స్ఫురిత కర్ణ
ముడివోనిమిన్కు లీనెడుపేరులిరుదెస
నిరుదెస కమల బంధుర కరంబు
నెఱిమించు చిఱుత వన్నియ చేల మిరుమేన
నిరుమేన రతి మనోహర విభూతి

గీ. యమర నన్యోన్య వేష భేదా సహిష్ణు
భావ విభవంబు తెలుపుచు పరమ మైత్రి
మగని సామేన నిలిచిన యగతనూజ
ప్రథన జయ మిచ్చు తిరుమల రాయమణికి" [1]

సరికి సరిగా సమాధానములిప్పించు చతురిమ కలవారు సత్పారులు. 'ఉత్తర రామాయణము'లో 'కంకంటి పాపరాజు' ఇట్టి చాతురీ గరిమను ప్రదర్శించినారనవచ్చు. పయ్యెద జారినపుడు, వెండికొండపై చంద్రరేఖలు చాల గలవని [ పాలిండ్లపై నఖక్షతములను పరిశీలనతో పరికించి ] పలికిన పరమశివునితో గంగను నెత్తిన పెట్టుకొన్న నటరాజుతో, శిరముపై అలంకరించుకొన్న కమలోత్పల పంక్తులు వాడకుండా యుండ వలయునని ఏకముగా ఏరునే, జటలలోచుట్టినావు, 'యెంతటి జాణవో' యని గిరితనయ శంకరుని కేరినది. తన సవతియైన గంగను శిరముపై ధరించినాడని [ఈర్ష్యతో రగిలి పోయే ఆంతరంగిక మనోవేదన యున్నా, దానిని కప్పి పుచ్చి] వ్యంగ్య భాషణ చేసినది, ఉమ. ఆ పద్యమును పరికించుదాము.

---

పాద సూచికలు: [1] వసుచ/ప్రథమా/6.

ఉ. “ ఊరక చుట్టుకొన్న కమలోత్పల పంక్తులు వాడు నంచునో

యేఱును గూర్చి చుట్టితివ యెంతటి జాణవు మేలు మేలు నీ

నేరుపు మెచ్చ వచ్చు నని నిచ్చలు మచ్చిక శంభు కేరునీ

హార గిరీంద్ర కన్యక దయామతి కోర్కులు మా కొసంగుతన్” [1]

జగద్వంద్య యైన జగములతల్లి శైలజ. ఆమె ఘనమైన గరిమను ‘గుమ్మరాజు రామకవి’ తన ‘చౌడేశ్వరీ మాహాత్మ్యము’ లో ప్రస్తావించినారు. అందులో ఆమె జన్మ స్థానము కులాచలము. సురాంగనలు మేలైన దాసీజనము. ఆత్మేశ్వరుడు చూస్తే జగదీశ్వరుడైన పరమేశ్వరుడు. లోకపావన సౌశీల్యములలంకారాలు. ఇక ఇష్ట సఖులైతే కలిమికిపట్టుగొమ్మకమల, చదువుల తల్లి శారద. అట్టి అసమాన వనిత, ముల్లోక స్తవనీయు రాలైన శర్వాణి, యని పేర్కొనినారు. ఆ శాంబరికి చేసిన కైమోడ్పులు చూద్దాము.

మ. “ తనజన్మ స్థలమా కులాచలము మేల్దాసీ జనంబా సురాం

గన లాత్మేశ్వరుడా మహేశ్వరుడలంకారంబులా లోకపా

వన సౌశీల్యగుణంబులిష్ట సఖులా వాణీ రమాదేవులే

వనితా లోకమతల్లి కట్టి త్రిజగద్వంద్యన్ శివం గొల్చెదన్” [2]

అచ్చ తెనుగు కావ్యమైన ‘నీలాసుందరీ పరిణయము’లో ‘కూచిమంచి తిమ్మకవి’ గట్టుదొర పట్టి యగు ముక్కంటి వాల్గంటి ఘనతను సవివరముగ వివరించుట కలదు. ఆమె క్రీడాంగణము కడిమి తోట. లేతచందురుని పూను చాన. గజముఖుని తల్లి. సర్పములను సింగారించుకొను వాని వలపుటింతి. సింహవాహిని. చెడు రక్కసి మూకల చెండాడు చండి. ఓంకార స్వరూపిణి. సరిలేని కనికరము కురిపించు గిరితనయ. ఆ శాంభవి మనలను ప్రోచుననుచు చెప్పిన కవిత.

---

పాద సూచికలు: [1] ఉత్తర/కంకంటి/పీ/4 [2] చౌడేశ్వరి రామ కవి /ప్రథమా/4

సీ. "అలరుపెంగడిమి తోటల నాడు పూబోడి
పూప వెన్నెల తేని పూను చాన
కోరి యేనుగు మోము కొడుకు గాంచిన తల్లి
చిలువ తాలుపు వేల్పు వలపుటింతి
తెలిబొబ్బ మెకపుమేల్తేజి నెక్కెడిదంట
చెడుగు రక్కసి మూక చిదుము దిట్ట
తొలుపల్కుగిల్కు టందెలు గల యెలనాగ
యెల్ల మేల్టెంకి యై యెసగుచాను

గీ. యొనర తెఱగంటి తెఱవలయుడిగములకు
నడరి యుడివోని బలుసిరులిడెడు నట్టి
గట్టుదొరపట్టి యెనలేని కనికరమున
వొదలుచును మమ్ము ననయంబు బ్రోచుగాత' [1]

మధురలో 'మీనాక్షి' కంచిలో 'కామాక్షి' కాశిలో 'విశాలాక్షి' పేరెన్నికగన్న వారు. మధుర మీనాక్షిని 'సముఖము' వారు భవ బంధ మోచనమునకై స్తుతించినారు. తమ 'అహల్యా సంక్రందనము'లో. కదంబవనంలో విహరించు ఆ సుందరేశ్వరుని వధూటి స్తుతి చూడండి.

చ. " కరమున చిల్క పల్క జిగి కమ్మలు చెక్కుల కుల్క కన్నులన్
వర కృప చిల్క మోవి చిఱునవ్వుల వెన్నెల తొల్క ధాత్రికిన్
వరమొసగన్ కదంబ వనవాటి చెలంగెడి మేటి సుందరే
శ్వరుని వధూటి కొల్తు కృత బంధ విమోచన మీనలోచనన్" [2]

---

పాద సూచికలు: [1] నీలాసుం/కూ. తిమ్మన/పీ/2 [2] అహల్యా/ఆవ/సముఖ 4

మరుని తన మూడవ కంటితో దహించినాడు హరుడు. తర్వాత అంబ కరుణతో తనసతి రతికి మాత్రమే కనిపించినాడు మనోభవుడు. పార్వతీ పరమేశ్వరుల పరిణయము జరిగినది. ఆ వివాహ సందర్భమున అచారమునానుసరించి వధువగు పార్వతి పాదమును సన్నెకల్లుపై నునిచినాడు శివుడు. కందర్పునికి రూపము లేకుండా చేసిన శివుడు, పార్వతి పాదములు పట్టినందులకు, కాముడు తనపై పగ తీర్చుకున్నాడని నీలకంధరుడు దరహాసముఖుడైనాడు.

ఆ నవ్వును సర్పశిరమందుండు అందమైన అద్దమువలె నున్న రత్నముప్రతిఫలించగా యెదలో ముదమందినది ముక్కంటి వాల్గంటి. ఆ భవానికి అంజలించినాడు అప్పకవి మహాశయుడు.

చ. " పరిణయ వేళయందు తనపాదము పట్టుక సన్నెకంటిపై
తిరముగ మోపి కంతునకు తీరెగదా పగయంచు నీలకం
ధరుడు దరస్మితుండగుట తద్వలయాహి ఫణాగ్రరత్నసుం
దర ముకురంబునం గని యెదన్ముద మందు భవాని కొల్చెదన్" [1]

భద్రాదేవి పరిణయమును ముచ్చటగా మూడు ఆశ్వాసములలో కూర్చిన కవి 'కాణాదం పెద్దన సోమయాజి'. ఆ కావ్యమే ' ముకుంద విలాసము'. పద్య చమత్కారములకు ముకుందవిలాసము 'విలాసమను' రీతిలో నున్న గ్రంథమిది. అందులో గిరిసంజాతను స్తుతించినారు.

మ. "హరికిన్ సోదరియౌట తద్గుణమునన్ శ్యామాకృతిం బొల్చి యీ
శ్వరు భామామణి యౌట తద్గుణమునంచన్మందహాసంబునం
దరయందాల్చి గజాస్యు మాత యగుటన్ యానంబునందెల్ప నా
గిరిసంజాత యొసంగుగాత జయలక్ష్మిన్ సోమభూజనికిన్" [2]

---

పాద సూచికలు: [1] అప్పక/పీ/21 [2] ముకుంద/ప్రథ/కాణా/6

హరి నల్లని వాడు. ఆయన సోదరి కనుక శ్యామాకృతి గలది. తెల్లని వాడు ఈశ్వరుడు. ఆ లక్షణము ఆమె మందహాసములో కనిపించును. గజముఖుని తల్లి గనుక ఆమె నడకలో గజగమనము కనిపించుట జరిగినది. ఈ లక్షణాలు కలగలిపిన గిరిసంజాత కృతిభర్త యగు సోమభూపాలునికి జయలక్ష్మి నొసగవలెనని కవీశ్వరుని కౌతుకము.

4.4 సుబ్రహ్మణ్య స్వామి స్తుతులు : -

కం. " తన జనకుడురుస్థాణువు
జనని యపర్ణాఖ్య తా విశాఖుండనగా,
తనరియు నభిమతఫలముల
జనులకు దయ నొసగుచుండు షణ్ముఖు కొలుతుస్" [1]

తండ్రి కదలని వాడు స్థాణువు. తల్లి ఆకులనుకూడా అంటనిది/తిననిది { తపసి పర్ణానామప్య నశనాదపర్ణా - అపర్ణ., పోగొట్టబడిన ఋణముగలది – అపర్ణ}. తను విశాఖుడు. ఇన్ని విపరీతములున్నను, భక్తులు కోరుకోరికలు తీర్చువాడని ఆరుముఖాల వాడిని కవి తలచినాడు.

" అమరము " పుట 40 కుమారునికి గల ఇతర నామములు :

" కార్తికేయో మహాసేన శ్శరజన్మా షడాననః
పార్వతీ నందన స్స్కంద స్సేనానీ రగ్ని భూర్గుహః
బాహులేయ స్తారక జిద్విశాఖ శ్శిఖివాహనః
షాణ్మాతుర శ్శక్తిధరః కుమారః క్రౌంచదారణః ....

ప్రతి పదమునకు అర్థము కలిగి యుండుట చూడవచ్చును.

---

పాద సూచికలు: [1] [నన్నె/కుమార/ప్రథ /8]

'కుమారస్వామి' గురించిన కొన్ని వివరములిట్లు కలవు.

శివుని కుమారులిద్దరిలో రెండవవాడు స్కందుడు. స్వామి దేవసేనకు అధిపతి. ఇతనికి ఇతర నామములు కలవు. వాహనము మయూరము. శక్తి ధరుడు. కృత్తిక నక్షత్రములో జననమంది నవాడు కనుక 'కార్తికేయుడు' అని పిలువబదడినాడు. తారకాసుర సంహారము చేయగలవాని కొరకు దేవతల ప్రార్థనను మన్నించి పరమేశ్వరుడు అనుగ్రహించిన ఫలమే కుమార జననం. పరమేశుని వీర్యమును గ్రహించిన అగ్ని దానిని భరింప జాలక, శరవణమునందు [జెల్లు గడ్డి]విడువగా అచట జన్మ పొందిన వాడైనాడు కనుకనే 'శరవణభవుడ'ని పిలువబడినాడు. జాతకములో కుజదోష పరిహారమునకు స్కంద సేవ / ప్రార్థన శ్రేయస్కరమనుట కలదు.

సుందర రూపము కలవాడు - షణ్ముఖుడు. శివుని వీర్యమును, దేవతల కోర్కెపై అగ్ని వాయువుల సహాయమున గంగ గ్రహించి, దానిని భరింపజాలక జెల్లులో విడ చినదని మరొక కథనము. అట్లు జన్మించిన బాలునికి 'షట్కృత్తికలు' ఆరుగురు స్తన్యమివ్వగా ఒకేసారి ఆరుముఖములతో పాలను గ్రోలినాడు కనుక ఆరు ముఖములవాడైనాడు. తమిళ దేశములో

ఈతనికి ఆరు ప్రశస్తి గాంచిన దేవాలయములున్నవి. తిరుత్తణి, స్వామిమలై, పళని, తిరుచ్చెందూర్, తిరుప్పరకున్రం, పలముదిరచోలై, అనునవి. 'కుమారసంభవమ్' అను పేర కవికుల తిలకుడు కాళిదాసు రచించినాడు. నన్నె చోడుడు జాను తెనుగున మనకందించినాడు.

కుమారస్వామిని ఈ రీతిగా ప్రార్థించడము కలదు. ప్రసిద్ధ ప్రార్థన

" గాంగేయం వహ్ని గర్భం శరవణజనితం జ్ఞాన శక్తిం కుమారం

బ్రహ్మణ్యం స్కందదేవం గుహమమల గుణం రుద్ర తేజస్వరూపం

సేనాన్యం తారకఘ్నం గురుమచలమతిం కార్తికేయం షడాస్యం

సుబ్రహ్మణ్యం మయూరధ్వజ రథ సహితం దేవ దేవం నమామి"

సుప్రసిద్ధ వాగ్గేయకారుడు, సంగీత మూర్తి త్రయమందు ఒకడు, అయిన ముత్తు స్వామి దీక్షితుల వారి సాహిత్య ముద్ర 'గురుగుహ' యనునది. ఆయన పరమ స్కంద భక్తుడు. 'సారకాండము'లో 'సోంపల్లె కృష్ణమూర్తి' గారు సుబ్రహ్మణ్యుని స్తుతించిన రీతి చూద్దాము.

కం. " ప్రథమావతార గణ్యుస్, బ్రథాజయస్తవ్యమాన భక్త శరణ్యుస్ [1]

విధిముఖ సురకృత పుణ్యుస్, సుధీ వినోదమున కెంతుసుబ్రహ్మణ్యుస్"

{థ ధ లను ప్రాసలో కూర్చటము చూడగలము}

పద్యమునకు యుండవలసిన లక్షణాలను నిర్ణ యించుటయే గాక, హృద్యముగా చెప్పుటలో నేర్పు చూపినాడు 'అప్పకవి'. స్కందుని స్తుతిలో ఒక చమత్కారము జూపినాడు. మునుపు గణపతి విషయము వివరించటం జరిగినది.

చ. " జనకునిగోల్వ వచ్చు నలచామరకర్ణునితేజి నంది వా

హనుమకుటాహి గాంచి భయమంది పిఱిందికి బోవ జూచినం

దన శిఖిమావు దీకొలిపి దాని భయంబు హరించి పూర్వజా

తునకు ముదంబొనర్చు గుహు దుర్ధర శక్తివహు న్భజించెదస్"[2]

గజముఖుడైన గణపతి, గజచర్మాంబరునడైన తండ్రి శివుని కొలువతన వాహనమైన ఎలుకనెక్కి వచ్చినాడు. నంది వాహనుడగు శివుని వద్ద గలసర్పమును జూచి భీతితో మూషికము భయము చెందినది. నెమలిని సర్పమునకెదురుగ నిల్పి ఎలుక భయమును పోగొట్టి నాడు స్కందుడు. ఆ రీతిగా అన్నకు ముదము కలిగించిన దుర్ధరమగు శక్తి కల్గిన గుహుని భజింతునని కవి ఆశయం. పలువురు దేవతలతో పాటుగా కుమారస్వామిని స్తుతించుట గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి, తమ 'బుడ్డా వెంగళరెడ్డీయమ'ను నవీన పద్యకావ్యములోఈ రీతిగా చేసినారు.

" కవనంబుంగొన సాగనిమ్మనుచు నా కైదండలందింతు కార్తికేయునకు" [ 3]

---

పాద సూచికలు: [1] సారకాండ /13 [2] అప్పకవీ/పీ/23 [3] వెంగళరెడ్డీయమ ఆవ/4

4.5 *వీర భద్రుని స్తుతులు* : - విష్వక్సేనుడు విష్ణు సేనకునాయకుడైనట్లే, వీరభద్రుడు 'శివభటకోటికి  వరూధినీవరుడు' రుద్రాంశ సంభవుడు కనుక అప్రతిహతుడు. అసాధ్యమైనది లేనివాడు. క్ష్మాచక్రమధ్య భాగములోనికి, భీమ ప్రక్రియతో నవ్వుచూ విద్యుద్వహ్ని శిఖా సముచ్చయ రుచితో వెలుగొందు చంచ జ్జటస్ సద్యః క్రోధముతోడ ఉగ్రుడగు  నీలకంఠుడు విసిరినపుడు, అఖిలలోక భయంకరుడైన దక్ష యజ్ఞ ధ్వంసకుడు వీరభద్రుడు ఉదయించినాడు. ఆ ఉగ్రవీరభద్రోదయ మెట్లున్న దనగా... లలిత లలిత పదములతో భక్తి చిప్పిలజేయు పోతన ఒక సందర్భములో అతి భీషణమైన ఉగ్ర వీర భద్రుని రూపమును  వర్ణించుట కలదు.

సీ. "అభ్రం లిహాదభ్ర విభ్రమాభ్ర భ్రమ కృన్నీల దీర్ఘ శరీర మమర
ప్రజ్వలజ్జ్వలన దీప్త జ్వాలికా జాల జాజ్వల్యమాన కేశములు మెఱయ
చండ దిగ్వేదండ శుండాభ దోర్దండ సాహస్ర ధృతి హేతి సంఘు మొప్ప
వీక్షణ త్రయ లోక వీక్షణద్యుతి   లోక వీక్షణతతి దుర్నిరీక్షముగను
గీ. క్రకచ కఠిన కరాళదంష్ట్రలు వెలుంగ,
ఘన కపాలాస్థి వనమాలికలును దనర
నఖిలలోక భయంకరుడగుచు 'వీర
భద్రు'డు దయించె మాఱట రుద్రుడగుచు" [1]

అంతేకాక, 'వీరభద్రవిజయము'లో 'పోతన' చిత్రించిన వీరభద్రుడు మరొక రకముగా నున్నాడు.

ఈ వీర భద్రుడు భవభక్తుల యెడ చూపినచల్లని చూపు, శరణని వచ్చినవారిపై కరుణ, శివద్రోహుల యెడ క్రౌర్యము, అఖిలదేవగర్వ హరణ శూరుడైన వాడు. ఆ వీరభద్రుడిదిగో!

------------------------------------------------------

పాద సూచికలు: [1] పోతన/భాగ/స్క4 / 107

సీ. " భవ భక్తులగు వారి పాటించి చూచుచో
చల్లని సంపూర్ణ చంద్రుడనగ
శరణార్థులగు వారి చాల రక్షించుచో
సలలిత వజ్ర పంజరమనంగ
పలుశివ ద్రోహుల భస్మీకరించుచో
నద్భుత ప్రళయకాలాగ్ని యనగ
బ్రహ్మాండముల నంటబట్టి ధట్టించుచో
నడరి విజృంభించు హరుడనంగ

ఆ. వెలయునట్టి దేవు వీరభద్రేశ్వరు
నఖిలదేవ గర్వ హరణశూరు
నాత్మ దలచి మ్రొక్కి యద్దేవు కరుణ నా
మనములోన నమ్మి మహిమ తోడ! [1]

4.6 ***వీర శరభ మూర్తి స్తుతులు*** : - వీర శరభ మూర్తి స్వరూపము గురించి కల కొన్ని ఆధారాలు ఇట్లున్నవి. అమరకోశములో శరభ సంబంధ పరముగా చెప్పబడిన విషయము ఇట్లున్నది. " గంధయతి అర్ధయతీతి గన్ధర్వః గంధ అర్దనే. పీడించునది. నరసింహమువలె ఇది ఒక మృగము. ఇది వట్రువ తోకయు, దొడ్డ కడుపును కల మృగము. శృణాతి సిహం శరభః శ్వా హిమ్సాయాం. సింహమును చంపునది. ఎనిమిది కాళ్ళు కలిగి సింహమును చంపెడు మృగము తథాచోక్తం మహాభారతే – 'అష్టపాదూర్ధ్వ నయనః శరభో వనగోచరః' ఇతి. [పుట 333] అంతరించిపోయిన అనేకమగు ప్రాణులవలె ఈ శరభముకూడా చాలా కాలము క్రితమే అంతరించి పోయి ఉండునను కోవచ్చును. ఉద్భటారాధ్య చరిత్రలో తెనాలి రామలింగకవి చేసిన స్తుతిలో నల్లనిదైన శ్యామమోహన మూర్తి యగు భద్రకాళికి కనుల

-----------------------------------------------------------

పాద సూచికలు: [1] పోతన / వీరభద్రవిజయము/1/4

పంటయగు శ్రీ వీరశరభమూర్తి కృతి భర్తను ప్రోచుగాక యని చెప్పడమున్నది. ఒకటి మాత్రము ఇందులో గ్రాహ్యము కాగల విషయము. భద్రకాళికి తగిన జంటగా వీరశరభ మూర్తి ఉన్నాడు. కొందరి ప్రకారము 'ప్రత్యంగిర' శరభునికి పత్ని. శరభుడు యను పేరు కలవాడు రామాయణములోని సుగ్రీవుని వానరసేనా నాయకులలో ఒకడు. ఈ వానరుడు పర్జన్యుని వలన పుట్టెను అని చెప్పడమున్నది. [పురాణ నామ చంద్రిక] శరభమూర్తి అవతార ప్రసక్తి శివపురాణములో చెప్పడము కలదు. "నృసింహావతార కార్యము ముగిసెను. నృసింహుడు గర్వమున తిరుగుచుండెను. శివుడు శరభ రూపమై వానిని వధించి ఆ చర్మము తాను కప్పికొనెను. పిమ్మట నరరూపము నరుడును, మృగరూపము నారాయణుడయ్యెను. [పూర్వగాథాలహరి పుట 258] తెలుగు కావ్యాలలో శరభ ప్రస్తావన కొంత ఉంది. శరభమనునది ఒక విచిత్ర రూపము కలిగిన మృగము. ఇది పక్షి + మృగ రూపము సంతరించుకొన్న బలశాలి. కవిత్రయ భారతము ద్రోణపర్వములో ద్వితీయాశ్వాసములో షోడశరాజ చరిత్ర సందర్భముగా ఈ ప్రస్తావన కలదు. కణ్వాశ్రమములో బాల్యములో పెరిగిన వాడు - శకుంతల దుష్యంతుల కుమారుడు. శరభ, సింహ, వ్యాఘ్రాది క్రూర జంతువులను పోట్టేళ్ళవలె బంధిస్తూ, విడిపిస్తూ ఆడినాడట కనుకనే ఆ బాలునికి సర్వదమనుడు అని నామ కరణము చేయడము జరిగినది. శరభము అనగా మీగండ్ల మెకం. సాహిత్యములో ముఖ్యముగా అవతారికలలో ఈ రూప ప్రశంస తక్కువే. తమిళ దేశములో కొన్ని దేవాలయములలో ఈ రూపమునకు పూజలు చేయడం కలదని తెలియుచున్నది. శరభమును ఎదిరించుటకు గండభేరుండమను మరొక రూపాన్ని నృసింహుడు ధరించినట్లు కలదు. శరభము యొక్క రూపము ఒడిశా రాష్ట్రములోని 'కోణార్క' దేవాలయము వద్ద, శ్రీలంక రాజచిహ్నముగా దాదాపు ఈ జంతువును గుర్తించవచ్చు. శరభోపనిషత్తు అని కూడా ఒకటి ఉన్నట్లు తెలియుచున్నది. మైసూరు విశ్వవిద్యాలయ అధికార చిహ్నములో దీనిని గుర్తించవచ్చు. కర్నాటక రాజ్యములో సబ్బులను తయారుచేయు సంస్థ కూడా ఈ శరభ మృగము రూపము గల జంతువును చిహ్నముగా వాడుచున్నది. మొత్తముపై నరసింహావతారమునకు తుల్యముగా,

భైరవమూర్తికన్న బలవత్తరమైన సృష్టిగా వీరశరభమూర్తి అవతారము జరిగినదనవచ్చు. 'శరభ' శబ్దము / పదము విష్ణుసహస్ర నామములో356 వ నామము. ఆ నామము అనుసరించి నశించిపోవు శరీరమునందు ప్రకాశించువాడు. అనగా దేహములో ఆత్మస్వరూపుడుగా /ప్రాణముగా వుండువాడని చెప్పవచ్చు. శరభమనగా ఒంటెపిల్ల యనికూడ నైఘంటికార్థము.

4.7 *భైరవ స్వామి స్తుతులు* : - భైరవుడు రుద్రుని అవతార విశేషము. భైరవశబ్దమునకుభక్షణ, రక్షణ, వమన క్రియల సమాహారము ఒక్కటిగా కూర్చువాడు. కనుకనే, భక్షణాత్, రక్షణాత్, వమనాత్ భైరవః అని పదమునకు వ్యుత్పత్తి చెప్పడమైనది. ధూర్జటి తన ప్రబంధము శ్రీకాళహస్తిమాహాత్మ్యము లో విద్యాకల్పుడైన భైరవుని ఇట్లు ప్రణుతించినాడు. భైరవుడు అనగానే భయంకరమూర్తి రూపము అగుపించుట సహజము. ఇది వాని భక్తులకు కాకపోవచ్చు.

శా. "వ్యాకీర్ణ స్థితి నాలకించి నకులీవారాహు లూటాడగా
నౌకారాక్షర మంత్రమర్మమున కాద్యంబైన వర్ణంబుతో
నేకగ్రీవము సేసి పల్కెడి తురంగేంద్రంబుపై నెక్కు వి
ద్యాకల్పుం బ్రణుతింతు భైరవుని నీలాహార్య లీలాలయున్" [1]

నెల్లూరు జిల్లాలోని బిట్రగుంట యను గ్రామములో వెలసిన భైరవస్వామిని 'పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు' తన కావ్యము 'శృంగార శాకుంతలము'లో వర్ణన చేయడము కలదు. ఇచట భైరవుని కెంజడలు ప్రవాళముల వంటి చిగురు జొంపమును అపహసించు చున్నది. కోర దంతములు విదియ చంద్రుని వలె వున్నవి. మద్యపాన సేవన వలన కనులు ఎర్రబడినవి.శరీరము నలుపు రంగుతో ప్రకాశించు చున్నది.ఇది భైరవుని రూపము.

-------------------------------------------------------

పాద సూచికలు: [1] కాళహస్తి/ధూర్జటి/ప్రథమా/౩

సీ. “పగడంపు చిగురు జొంపము సొంపు విహసించు
కడునొప్పు కుఱుచ కెంజెడల వాడు
విదియ చందురుతోడ వీడు జోడాడెడు
రమణీయ దంష్ట్రాంకురముల వాడు
సీధుపాన క్రీడ చెంగల్వ పూచాయ
దొంగిలించెడు కన్ను దోయి వాడు
క్రొత్త నీలాల రంగునకు నించుక మించి
మెఱుగారు నల్లని మేని వాడు

గీ. పృథివి కవతంస మణియైన బిట్రగుంట
తానకంబుగ నవతార మైన వాడు
భైరవ స్వామి సకల సంపదల నొసగి
మనుచు చిల్లర వెన్న యామాత్య వరుని” [1]

‘కూచిమంచి తిమ్మన’ తన ‘చంద్రరేఖావిలాపములో’ నీలనృపాలమౌళికి అశుభాలివ్వవలయు నని చెప్పడమున్నది.

ఉ. “నీరద నీలవర్ణుడు శునీవర వాహుడు విద్యుదాభవి
స్ఫార జటాభరుండుబహుశష్ప సమన్విత దీర్ఘ మేఢ్రుడం
భోరుహ గర్భ మస్తక విభూషిత హస్త సరోజుడామహా
భైరవుడిచ్చు గాత నశుభంబులు నీల నృపాల మౌళికిన్” [2]

---

పాద సూచికలు: [1] శృంగా/శాకుంత/పిల్లలమఱ్ఱి/ఆవ/5

[2] కూచిమంచి తిమ్మన/చంద్రరేఖావిలాపము/ ప్రథమా/4

4.8 ***శివలింగ స్తుతులు*** : - భగవంతుని అర్చించు విధానములు రెండు రీతులు. ఒకటి సాకారము. మరొకటి నిరాకారము. సావధికుడు(జీవుడు) తన తృప్తి కొరకు, నిరవధికునికి (దేవుడు) చేయు అర్చన/పూజ. పూజ కూడ పలు రీతులుగా యుండును. భౌతికము, మానసికము. తనకు తోచిన రీతిలో భౌతికముగా వస్తువులను సేకరించి - పూలు, పండ్లు, వస్త్రము, ధూపము, దీపము, పాలు, జలము, ఇతరములను, ఉపయోగించి కావించుట, ఒక విధానము. ఇట్టి భౌతికమగు వస్తువుల సహకారము లేకుండా మానసికముగా కేవలము ఒక ఆకారమును/ ఒక నామమును/ ఒక రూపమును భావించుకొని దాని మీద ధ్యాస పెట్టి చేయుట మరొక విధము. శైవ సంబంధ విధానములలో మూర్తి ఆకారము (అధికముగ)లింగ రూపములో ఉండుట గమనింప గలము. దుర్బలమైన/ అతి సాధారణమైన వ్యక్తి తన దృష్టిని, నిరవధికునిపై నిలుపుట అసాధ్యము కాకున్నను, కష్టమైనది. అభ్యాసముచే దీనిని సాధింప వచ్చును. కనుకనే తొలుత మూర్తిని , పరిపక్వత పొందిన పిదప మూర్తి రహితముగా సాధన చేసిన తగు ఫలితము కల్గును.

పంచభూతములను తన ప్రతినిధులుగా పరమేశ్వరుడు సృష్టించినాడని చెప్పడమున్నది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా ప్రసిద్ధి చెందిన ఐదు శైవక్షేత్రములను చెప్పడము చూడగలము. అవి ఒక క్రమములో - పృథివి, నీరు (అప్) తేజో, వాయు, ఆకాశాలు. కంచిపురములో (శివకంచి) పృథ్వి, జంబుకేశ్వరము (తిరువేనక్కావల్) లో జలము, తిరువణ్ణామలై క్షేత్రములోని తేజోలింగం [అరుణాచలేశ్వరాలయము], చిత్తూరు జిల్లా [ఆంధ్రప్రదేశ్]లోని శ్రీకాళహస్తి క్షేత్రము వాయులింగం, చిదంబరము నందలి నటరాజ ఆలయములోని ఆకాశలింగము. ఇవన్నియూ వేర్వేరు ప్రాంతాల లోను, పలు రాష్ట్రములలోను ఉన్నా అన్నీ ఒకే రేఖాంశముపై ఉండుట కొంత వింతకొలిపే విషయ మనక తప్పదు. వీటితో పాటు కేదారనాథ్, రామేశ్వరము, కాళేశ్వరము అను మరికొన్ని ప్రాచీన మందిరాలు కూడా ఇదే రేఖపై ఉన్నవి. ప్రసిద్ధ శైవ క్షేత్రములు ఆసేతు హిమాచల పర్యంతముగలవు. దీనికి నిదర్శనంగా ఈ 'ద్వాదశ జ్యోతిర్లింగముల స్తోత్రము' ప్రసిద్ధినందినది.

" సౌరాష్ట్రే సోమనాథం చ శ్రీశైలే మల్లికార్జునం

ఉజ్జయిన్యాం మహాకాలం ఓంకారమమలేశ్వరం

పరల్యాం వైద్యనాథం చ ఢాకిన్యాంభీమశంకరం

సేతుబంధే తు రామేశం నాగేశం దారుకావనే

వారాణస్యాం తు విశ్వేశం త్ర్యంబకం గౌతమీ తటే

హిమాలయే తు కేదారం ఘృష్ణేశం చ శివాలయే

ఏతాని జ్యోతిర్లింగాని సాయం ప్రాతః పఠేన్నరః

సప్తజన్మ కృతం పాపం స్మరణేవ వినశ్యతి.

నవగ్రహ క్షేత్రాలు కుంబకోణము పట్టణము చుట్టూ కలవు. అక్కడ కూడ ప్రధాన దైవము లింగ స్వరూపములోని ఈశ్వరుడే. నవగ్రహాల ప్రతిష్ఠ కూడా శివాలయములలోనే జరుపబడును.

అధికముగా శైవము దక్షిణ దేశములో అధికమని చెప్పటము కలదు.

'శ్రీకాళహస్తిమాహాత్మ్యము లో దివ్యమైన శివలింగమును ఆరాధించినాడు 'ధూర్జటి'. అభీష్టములను కష్టములులేకతేర్చుఇష్ట లింగము ఆ వాయులింగము. అది శ్రీవిద్యానిధి. మహామహిమ గలది. పలువురు దానిని సేవించి ముక్తిని పొందినారు అది ఆర్యావామాంగము. లూత, వాతాశన, సామజ, ఆటవికాదులు కామించిన మోక్షమునిచ్చినది.

శా. " శ్రీవిద్యానిధియై మహామహిమచే చెన్నై వసిష్ఠాజ లూ
తా వాతాశన సామజాటవిక గోత్రాదేవ నత్కార రా
జీవాక్షీయుగ యాదవాధి పులకున్నే యస్కరంబై నయా
ర్యా వామాంగముదివ్యలింగముమదీయాభీష్టముల్సల్పెడున్" [1]

---

పాద సూచికలు: [1] కాళహస్తి/ధూర్జటి/ప్రథమా/1

మధుర పాండ్య రాజుల ఉనికికి ఆటపట్టు. దక్షిణ భారత దేశమున ముఖ్యముగా చోళులు పాండ్యులు రాజ్యములను స్థాపించినారు. ఇతరులు యున్నారు. ఆయా సంస్కృతులను వారి వారి శక్తి మేరకు రక్షించినారు. శిల్పకళను పోషించినారు. అందులో ముఖ్యముగా తంజావూరు, కుంబకోణము, కంచి, మధుర ఇలా చెప్పడము మొదలుపెట్టినచో అది ఒక పెద్ద పద్దు కాగలదు. ఆ ప్రాంతాలలో దేవాలయాల నిర్మాణము అచ్చెరువు కొలుపును. మధురలో దేవత మీనాక్షి, దేవుడు సుందరేశ్వరుడు. సుందరేశ్వరుని 'సముఖం' వారు, తమ 'అహల్యాసంక్రందనము'లో సుముఖము జేసికోదలచినారు. ఆ సౌందరలింగము నాశ్రయించినారు.

ఉ. " బంగరుగట్టు సింగిణియు పంకజలోచన దివ్య బాణముస్
రంగుగ దాల్చి ప్రేల్మిడి పురంబులు ద్రుంచి జగంబు బ్రోచు ప్రాగ్
జంగము క్షీర వారధి నిషంగము భక్త జనావన క్రియా
చంగము కీర్తి రంగమలసౌందర లింగము నాశ్రయించెదస్" [1]

ఆచార్యులు గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి, తమ 'బుడ్డా వెంగళరెడ్డీయము'ను నవీన పద్యకావ్యములో తన పట్టణ పరిసరములందు ప్రఖ్యాతి గన్న నందులకు శ్రీశైలమందున్న మల్లన్నకు, శ్రీరామబృందానికి కైమోడ్పులు చేసినారు. మహానంది నంద్యాల పట్టణ సమీపమున గల గొప్ప శైవ క్షేత్రము. పలువురు దేవతలతో పాటుగా స్తుతించుట చేసినారు.

"శ్రీకరమై జగత్ప్రభవ జీవులకెల్ల శుభంకరమ్మునై
వాకును అర్థముస్ గలిసి భాసిలుభంగినొకే శరీరమై
చేకొని విశ్వరక్షణము చీకటి డుల్చుచు రాగావీక్షణా
శీకరముల్ వెలార్చు ఘనచిన్మయు పార్వతినాథు మ్రొక్కెదస్" [2]

---

పాద సూచికలు: [1] అహల్యా/సముఖం/ఆవ/3

[2]గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి / బుడ్డా వెంగళరెడ్డీయము/1

# పంచమాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు – శాక్తేయసంబంధస్తుతులు

## *V పంచామాధ్యాయము*

5. ***శాక్తేయ సంబంధ స్తుతులు*** *:-* ' శక్తి' – పలువురిచే పలువిధాల వ్యాఖ్యానింప బడినది. శత్రువులు దీనిచేత గెలువబడుదురు కనుక దీనిని శక్తి యనినారు. 'శక్యన్తే జేతుం శత్రవో(అ)మీభిరితి శక్తయః వీటిలో కోశదండాదుల వలన [1] ప్రభావ శక్తి, విక్రమచేష్టవలన కలుగునది [2] ఉత్సాహశక్తి, సంధివిగ్రహ సామాదులచే ప్రయోగింపబడునది [3] మంత్ర శక్తి. ఈ రీతిగా శక్తి మూడు రకములు. బలమును శక్తి అందురు. శక్తి అనగా భల్లము అను ఆయుధమునకు పేరు. కాసూ సామర్థ్య యో శ్శక్తిః ప్రభుత్వాది శక్తులకు అన్ని వస్తువుల యందుండు ఒకానొక ధర్మమునకు 'శక్తి' యనిపేరు. ఆదిశంకరులవారు, 'సౌందర్యలహరి'లో ఇట్లంటారు. శక్తితో కూడి సృష్టిచేయు సమర్థత కలిగిన శివుడు, శక్తితో చేరనినాడు కనీసం చలించుటకుకూడ సమర్థుడుకాడు.

శ్లో. "శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి
అతస్త్వా మారాధ్యాం హరి హర విరించా దిభిరపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృత పుణ్యః ప్రభవతి" [1]

శక్తికి సంబంధించినది శాక్తేయము. శక్తి ని గురించి మరొక చోట ఇట్లు విశదీకరించడము ఇట్లున్నది. ఏ దేవి సర్వ భూతములలో చేతనాచేతన రూపములలో వర్తిల్లునో ఆ శక్తికి నమస్సులు అనుచూ దేవీ సూక్తము చెప్పడము కలదు.

శ్లో. "యాదేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా|
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః|| [2]

---

పాద సూచిక :- [1] సౌందర్య లహరి/ఆదిశంకరులు/శ్లో1 / రా.కృ మఠం
[2] శ్రీ దుర్గాసప్తశతీ/గీతాప్రెస్.గోరఖ్ పూర్ పుట/123

శక్తి పలు నామములతో పిలువ / కొలువ బడును. లలితా సహస్ర నామావళిలో 'అంబ'ను 'బహురూపా' యని, చెప్పడమున్నది. పెద్దల దృష్టిలో - సృష్టికి కారణభూతమైన దగుటచే 'ప్రకృతి' అని, కల్యాణకారిణి అగుటచే 'భద్ర' అనియూ, తాను స్వయముగా ప్రకాశించును కనుక 'దేవి' అనియూ, బ్రహ్మాదిదేవతలను ప్రకాశింప జేయును కనుక 'మహాదేవి' అనియూ, ఆనంద స్వరూపిణి కనుక 'శివా' అనియూ పలు విశేషములు గల నామములతో వ్యవహరింపబడుచున్నది.

గ్రామ పొలిమేర్లలోవెలసి పూజలను అందుకొనుచూ గ్రామవాసుల క్షేమాన్ని చూచు స్థానికదేవతా మూర్తులనుకూడ కొనియాడుట జరుగు చున్నది. అసలు 'శక్తి' గ్రామీణ రూపాలలో కూడా వృద్ధి చెందింది.

శక్తికి గల రూపాలు:- విష్ణుమాయా, చేతనా, బుద్ధి, నిద్రా, క్షుధా,ఛాయా, శక్తి, తృష్ణా, క్షాంతి, జాతి, లజ్జా, శాంతి, శ్రద్ధా, కాంతి, లక్ష్మీ, వృత్తి, స్మృతి, దయా, తుష్టి, మాతృ, భ్రాంతి, మొదలైనవని తంత్రోక్తం దేవీసూక్తం లో ప్రతిక్షేపించబడినవి. లేపాక్షి స్వప్న దర్శనము అనే నిర్వచన (పద్య) కావ్యములో ఆచార్యులు డా. బాడాల రామయ్య గారు 'చైతన్య శక్తి' అను శీర్షిక ఆరంభములో ఈరీతిగా ప్రతిపాదన చేసినారు.

అందలి వ్యాఖ్య యథాతథముగా గ్రహింప బడినది. ఇందులో పరిశీలన చేసినపుడు మనకు ఒక విషయము స్పష్టమగును. మానవుడు విశాలము, నిత్యమూ చైతన్యముతో మార్పులు చెందు ప్రకృతిని తన అధీనమందు ఉంచుకొను ప్రయత్నము చేయునో, అపుడు ఆ ప్రకృతి గర్వోన్నతుడగు సావధికుని [మానవుని] గర్వమును అణచును. తన శాస్త్ర విన్నాణము, ఘనత, సాంకేతిక అభివృద్ధి ఇవన్నియూ కొంత వరకు భౌతికమగునవి మరియూ నశ్వరములు. ఒకవేళ నశ్వరములు కావు శాశ్వతమైనవిఅనుకొనిన ఆ కృత్రిమ సృష్టిని నిర్మించిన మానవుని వినాశనమునకే దారితీయునని నేడు మన ఎదుట సంభవించుచున్న కొన్ని నిర్మాణములు ఎన్నైనా ఉదహరింపవచ్చును. ప్లాస్టిక్కు, ప్రాణములనిచ్చు చెట్లను నరికివేయుట, వ్యాపారాభివృద్ధి పేరుతో అరణ్యములను నాశనము చేయుట ఇత్యాదులు.

'ఆచార్య డా. బాడాల రామయ్యగారు' తమ నిర్వచన పద్యకావ్యమగు 'లేపాక్షి స్వప్నదర్శనము' లో శక్తి సంబంధమైన విషయమును పీఠికలో ఈ రీతిగా వివరించినారు.

"లేపాక్షి ఆలయమును దుగ్గమ్మ గుడి యనుచు అ ప్రదేశమునకు చుట్టుపట్టుల గల పల్లె వారు నేటికి వచ్చి మ్రొక్కుబళ్ళుచెల్లించు చుందురు. అట 'దుర్గ' 'మహిషాసురమర్దనియై' మనలో భయ భక్తుల రేపుచున్నది. ఏనాడో మనవారి {పూర్వీకుల} యోగదృష్టికి సాక్షాత్క రించిన విశ్వ రహస్యము పాషాణస్థమై నిల్వగ నేటి యీవాస్తవికలోకము దాన్నివిడదీసి విమర్శించి విస్పష్టము చేయుచు న్నది. భారతీయ సంస్కృతి ఎక్కువగా పౌరాణిక గాథలతో ముడివడి యున్నది. ఆ ముడుల సడల్చి ఆ కథలలోని పేరుల నెమరు వేసినచో మన {పెద్దల} వారల మనస్సులు కొంత అర్థమగును. అప్పుడే మన మీదేశ కాలావధు లను దాటి పోగలుగుదుము. సత్యము సౌందర్య రూపమున మనకు అగపడును. క్రమముగా మనము కొంత ముందుకు పోయినచో ఆనంద మనుభవింపగలము. ఈసంస్కృతి ఎంత అగాధమో అంతమహోన్నతము. ఎంత సూక్ష్మమో అంత విశాలము. ఎంత వైయ్యక్తి కమో అంత సార్వజనీనము. దేశకాలాతీతమయ్యును ఇదిసార్వకాలికమై సద్యః ఫల నిర్వృతమైయున్నది. ఈ ఉపనిషద్రహస్యమును గుర్తించి అనుసరించుటలో మానవత్వమునే గాదు పూర్ణత్వమును పొందగలము.

మహిషాసురుని కథ తెలియని భారతీయుడుండడు. శక్తి స్వరూపమగు బ్రహ్మాండమంతయు చరాచరాత్మకము. ఇది నేటిశాస్త్రజ్ఞుల అభిప్రాయము

ఈ చరాచర శక్తుల మధ్య ఒక విధమగు సమతా బాంధవ్యము కలదు. ఆ సమత చెడినచో లోకమస్తవ్యస్తమగును. నిత్య చైతన్యాత్మకమగు ప్రకృతిని స్తంభింపచేసెడి స్తబ్ధశక్తి మహిషుడు. వాడు విశ్వ రహస్యమును

విశ్లేషాత్మక దృష్టితో విడదీసి సత్యమును గ్రహింపనెంచెను. వానికి ప్రకృతియే ప్రమాణము. వాడు భిన్నత్వముననేకత్వమును జూచుటయే గాక రూపింప ప్రయత్నించెను. తత్ఫలితముగా హరి హరులు విడిగా బ్రదుక లేక పోయిరి. స్త్రీపుంవిభేదము నశింప దొడగెను. చరాచరములు జగదేకశక్తిగా స్తంభింప జొచ్చెను. చావుపుట్టువులు తగ్గిన వాని

రాజ్యాన బ్రతుకు దుర్భరమైనది. సత్యాన్వేషియగు మహిషుడు సిద్ధిపొంది చైతన్యు డయ్యెను. ఈ మార్గమే మనవారికి ఆసుర మయ్యెను. కాని వాని యీ తపఃఫలితముగా బయల్పడిన మహాశక్తినే మనవారు జగన్మా తగ భావించి నేటికిని ఆరాధించుచున్నారు. ఆ మహిషునిగాథ యీలోక పు పోకడను చాటెడి సత్యమే రుద్రమనో హరియై నవచైతన్యము"

గీ. "సత్యసాధనలో జగత్సహజమైన ప్రకృతి చైతన్యలక్ష్మినే బందిసేయు

మాహిష స్తబ్ధశక్తిని మంటబెట్టి చండిగాలేచుదుర్గ నిల్చుండెనిచట"(1)

" ఉన్నత వర్గాల వారి మతం ఏదైనా గ్రామీణులు, 'పామరులు' తమ అమ్మవార్ల కొలువులు, జాతరలు మానలేదు. సాతవాహనుల కాలంలో కుమరిలాగ ఇక్ష్వాకుల కాలంలో హారీతి, తర్వాత మారీచి మొదలైన దేవతల ఆలయాలు, విగ్రహాలు కనబడతాయి. శిష్టుల పురాణాలు రూపొందుతున్న వేళల్లోనే జానపదుల కుల పురాణాలు, స్థల పురాణాలు మౌఖికంగా వర్ధిల్లాయి. నేటికీ మాత పురాణం, జాంబ పురాణం, గౌతు పురాణం వంటి అసలు సిసలు తెలుగు పురాణాలు జనంలో బతికున్నాయి. శిష్ట మతాలనుండి సంక్రమించిన భావాలు కూడా గ్రామీణ గాథలలో రూపాంతరం చెందాయి. నేడు సజీవంగా ఉన్న ఈ మౌలిక సంప్రదాయాన్నే ప్రాచీన పురాతత్త్వ పరిశోధనా ఫలితాలను జోడించి తులనాత్మక పరిశోధన చేస్తే ఒకనాటి మన సంస్కృతి ఎముకల గూడు మాత్రమే కాక దాని కండ, కొవ్వు, వర్చస్సు, వగైరాలన్నీ ఊహించవీలగును" అనిఅంటారు ఆరుద్రగారు తమ "సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో" పుట-77, మొదటి సంపుటిలో. ఎమెస్కో వారు దాదాపు 12 పుస్తకములుగా ప్రచురించిన దానిని, రెండు సంపుటాలుగా తెలుగు అకాడమి, హైదరాబాదు వారు పునర్ముద్రించినారు. ఈ రీతిగా శక్తిని పలువురు వ్యాఖ్యానించటము చూడగలము. కావ్యములలో ఇట్టివి కాక స్తుతుల రూపాలలో నున్న వాటిని ప్రస్తావించుటచేయుదము.

---

పాద సూచికలు:- [1] [లేపాక్షిస్వప్న/బాడాల రామయ్య /పుట 20 -22]

5.1 ***శాక్తేయ సంబంధ స్తుతులు*** : - నిరంతరము మారుతూ ఉండటము లేక చలనము కలిగి ఉండుట చైతన్య లక్షణము. మూల స్వరూపము . కనుకనే పోతన గారు తమ భాగవతములో మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదలను తనకు ఇచ్చునని నమ్మినారు. కరుణాజలధి ఆమె. 'అమ్మలగన్న' అమ్మ అనుచూ చేసిన ప్రార్థన ఇది.

ఉ. ' అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడిపుచ్చిన యమ్మ తన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గ మా
యమ్మ, కృపాబ్ధియిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్' [1]

దయా సముద్రురాలైన దుర్గ ముగ్గురమ్మలకు [లక్ష్మి, సరస్వతి, ఉమ] మూలము. ఆ మాతకు సమస్తము తెలుసునని ఆది శంకరులవారు జగదంబకు ఇలా విన్నవించటం కలదు. నావంటి పాతకుడు, నీవంటి పాపఘ్ని లేరు. మహాదేవీ! నీవు ఏది యోగ్యమని భావిస్తే అదే చేయి.

"మత్సమః పాతకీ నాస్తి పాపఘ్నీ త్వత్సమా న హి|
ఏవం జ్ఞాత్వా మహాదేవి యథా యోగ్యం తథా కురు" [2]

అంబ బహురూపా మఱియు, బహు నామధేయా/ధారి. పేరు ఏదైనా రూపు ఏదైనా కొలిచే వారికి తప్ప కొలువబడే ఆ తల్లికి భేదము లేదు. ఏ పేరున పిలిచితే ఆ విధముగా పలుకుట ఆమెకు మాత్రమే సాధ్యము. ఆ శక్తి స్వరూపిణిని పలువురు కవులు పలురీతులుగా పిలిచినారు. ఆ స్తుతులను కొన్ని పరికిద్దాము.

'దుర్గ' పార్వతికి గల పలు నామములలో ఒకటి. [పోత/మొద/10 ]

దక్షప్రజాపతి కూతురగు దాక్షాయణి , తండ్రి చేయుచున్న ఒక యాగమునకు వెళ్ళు టకు, ఆహ్వానింప బడకున్ననూ, సిద్ధమైనది. పరమేశుడు వద్దని వారించినాడు. 'పిలువని

---

పాద సూచికలు:- [1] పోతన భాగవ/తితిదే ప్రచు /స్కం-10] [2] దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం/ఆది శంకరులు/ప్రసిద్ధము.

పేరంటమైనా' పుట్టినింటికి వెళ్లవచ్చునని, పతితో వాదించి పట్టుబట్టి వెళ్ళినది దాక్షాయణి. అక్కడ ఆమెకు అగౌరవము జరిగినది. తనకన్నా పరమ శివునకు అధిక పరాభవమైనదని భావించి దక్షునిపై కినుక వహించి దేహ త్యాగము గావించినది. ఆ విషయమును తెలిసికొన్న పరమేశ్వరుడు ఆగ్రహోదగ్రు డైనాడు. అది భైరవ సృష్టికి మూలమైనది.

శక్తిని పలువురు పలు రీతులలో ఆరాధించినారు. చైతన్యము ఒకటే! భావింపబడు రూపములు, పలికెడు నామములు వేర్వేరుగా నుండును. మునుపు పెద్దలు చెప్పిన రీతిగా పరిమితమైన అక్షరములచే అపరిమిత సాహిత్యరాశులు తయారైనట్లు, 'స్వరములు ఏడైనా రాగాలెన్నో' యన్న రీతిగా సత్యము / శక్తి ఒకటే! ఆమెయే 'సర్వమంగళ'. ఆమె స్తుతినే 'సారకాండము'లో 'సోంపల్లె కృష్ణమూర్తి' చేసినారు. ఆ సంస్తుతి చూద్దాము.

ఉ. " కర్ణములన్ సుఖంబెసగగా కరి వక్త్రుడు ప్రక్క వీవగా
నిర్ణయ కార్య సిద్ధికయి 'నే'నని ముందు కుమారుడుండగా
స్వర్ణ కళా తనూ గరిమసామేయి సామిని గూడి మించు ప్రే
మార్ణవ సర్వ మంగళ దయామతి మత్కృతికిచ్చు భద్రముల్"[1]

గజాననుడు చేటంత చెవులు కలవాడు వీవన వీవగా కార్య సిద్ధినిచేయుటకు ముందున్నానని కందుడు పలుకుచుండగా, స్వర్ణకళా గరిమకలిగి, తన స్వామియగు శంకరునితో కలసి ప్రేమ యను సముద్రము వంటిదైనది సర్వ మంగళ ఆమె తన కృతికి భద్రముల నిచ్చునని భావన చేయుచున్నారు –కవి.

ఇచ్చట మరొక ప్రత్యేకత కూడా చెప్పవచ్చును. కవులు తాము ఉపాసించు దేవత/ దేవుని యందు పరిపూర్ణ భక్తి కలిగి ఆ దేవుడే సర్వమని భావించుట కలదు. కనుకనే స్తుతులలో వారే సమస్తమునకు మూలాధారమని విశ్వసించుట, స్తుతింపబడుట జరుగుచున్నది.

---

పాద సూచికలు:- [1] సారకాండము/ సోంపల్లె కృష్ణ మూర్తి /పద్యం 9

హరవిలాసమందలి ఇష్ట దేవతా స్తుతిలో కంచి యందలి కామాక్షిని శ్రీనాథుడు ప్రస్తుతించిన విధమును పరిశీలిస్తాము.

ఆ కామాక్షిని ఆదిమ శక్తిగా పేర్కొవటము ప్రత్యేకముగా గుర్తించ వలసిన అంశము.

సీ. " ఏ దేవి తుఱుముపై నేడు కాలము దాక
కసుగంద కుండు చెంగలువ దండ
యేదేవి సేవింతు రేకామ్రనాథుండు
కరి గిరీశ్వరుడు కింకరులువోలె
నేదేవి మణి దివ్య పాదుకా యుగళంబు
పాతాళ పతి మోచు పడగలందు
నేదేవి గొల్చి మత్స్యేంద్రనాథాదులు
యోగ సంసిద్ధికి నొడము లైరి

గీ. యమ్మహా దేవి కామాక్షి యఖిల వంద్య
దేవతాదిమ శక్తి సందీప్త మూర్తి
యవచి దేవయ త్రిపురారి కర్థి నొసగు
భాగ్య సౌభాగ్య వైభవ ప్రాభవములు" [1]

ప్రకాశించు మూర్తిమత్వముగల ఆ ఆదిమదేవి కామాక్షిని దేవతలందరూ సేవించుదురు. ఈశ్వరుని తనవశములోనుంచుకొనినది.

దుర్గాదేవిప్రస్తావన వచ్చినపుడు, ఆ దేవి శుంభ నిశుంభులను రాక్షసులను సంహరించినట్లు చిత్రించడము చూడగలము. శుంభ నిశుంభులనువారు, హిరణ్యకశిపు వంశజులగు సుందోప సుందుల యొక్క కొడుకులు. వీరు పుష్కర క్షేత్రమున బ్రహ్మను గురించి ఉగ్ర తపము గావించి,ఇంద్రాది సురలను పరిభవించు శక్తిని పొందినారు. వీరిని దుర్గ, కౌశికీ దేవి రూపాన సంహరించినది. రక్త బీజుడనువాడు, శుంభ నిశుంభుల తోబుట్టువు

---

పాద సూచికలు:- [1] హరవిలాసము /శ్రీనాథుడు/అవతారిక /3

కొడుకు.వీని దేహమునుండి  ఎన్ని రుధిర బిందువులు ధరణిపై పడునో ఒక్కొక్క బిందువునకు బహుళ సంఖ్యలో రక్కసులు జనన మందుదురు. అది వానికి లభ్యమైన వరము. అంబ, కాళిక రూపాన ప్రభవించి వీని శిరము హరించి నేలపైన వీని రక్తము పడకుండా కరాళవక్త్రయై, రక్త పానము జేసి రక్షణనిచ్చినది.  హాసములను గురించి విచారించినపుడు పలు రకములగు హాసములు కనిపించును. స్మితము, హసితము, విహసితము, ప్రహసితము, అపహసితము, అతిహసితము -  అని ఆరు విధములు. అట్టహాసము అనగా  పెద్ద నవ్వు. శత్రువుపై విజయము సాధించినపుడు చేయునది. అది విజయ గర్వముతో కూడినది . సత్త్వ రజ తమో గుణములకు ప్రతీకలుగా ఒకే శక్తి విభిన్న రూపాలుగ సమయము ననుసరించి  సాక్షాత్కారించును. ఇదే పూర్వీకులు గుర్తించిన శాశ్వత సత్యము.  వారి అనుభవానికి ఇది ఒక గుర్తు. 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి" 'దేవీ కవచం'లో

" ప్రేతసంస్థా తు చాముండా, వారాహీ మహిషాసనా
ఐంద్రీ గజసమారూఢా వైష్ణవీ గరుడాసనా
మాహేశ్వరీ వృషారూఢా కౌమారీ శిఖివాహనా
లక్ష్మీః పద్మాసనా దేవీ పద్మహస్తా హరిప్రియా
శ్వేతరూపధరా దేవీ ఈశ్వరీ వృష వాహనా
బ్రాహ్మీ హంస సమారూఢాసర్వాభరణ భూషితా
ఇత్యేతా మాతరః సర్వాః సర్వ యోగాసమన్వితాః
నానాభరణాశోభాఢ్యా  నానారత్నోప శోభితాః" [1]

ఈ రీతిగ అంబయొక్క రూపములు శక్తి పలువిధాలుగా ప్రకటితమగును. కావ్యాలలో ముఖ్యముగా కవులు సృజించిన అవతారికలలో/పీఠికలలో ఒక మూర్తినే స్తుతించుట చూడగలము. అది కూడా సౌమ్య రూపాన యున్నట్లు వర్ణితమైయుండును.

---

పాదసూచిక:- [1]  దేవీ సప్తశతీ/దేవీకవచం/గీతాప్రెస్/శ్లో :9-12

పరమ హరభక్తుడైన వాడు, శ్రీకాళహస్తీశ్వర శతకకర్త యైనవాడు, శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యమును కూర్చినవాడు మహాకవి ధూర్జటి. ఇతడు శివుని పరివారమునందలి కొందరిని స్తుతించినాడు. వారిలో దుర్గ ఒకరు. దుర్గను కొలిచిన తీరు చూద్దాము. సౌమ్యాతిసౌమ్యముగా కనుపించు లలిత అవసరమైనచో అతి భీకరరూపముదాల్చి దుష్ట శిక్షణ చేయుట కూడా కలదు. ధూర్జటి మహాశయుడు తన శ్రీకాళహస్తి మాహాత్మ్యములో జ్ఞాన ప్రసూన యొక్క మరియొక రూపమైన దుర్గ స్వరూపమును వివరించిన / వర్ణించిన తీరు చూద్దాము. ఆ అంబ హాటకాచలతుంగ శృంగాగ్రగేహ!

సీ. " కాసరాసుర రాజకంఠ నిర్గత రక్త
పంకంబు శ్రీ పాదపద్మలాక్ష,
చండముండాహవ సంభ్రమ స్తనజాత
ఘర్మవాః కణరాజి కంఠమాల
రక్తబీజాది మర్దన సమయాట్టహా
సము మోమునకు లోధ్ర సుమరజంబు
శుంభ నిశుంభ రక్షోవీర సంహార
వేళగప్పిన ధూళి మేలుముసుగు

గీ. కాగ నేదేవి వీర శృంగారమూర్తి
యగుచు శోభిల్లునట్టి దుర్గాంబ కొలుతు
కనక ముఖరీ సమాఖ్య గంగాప్రతీర
హాటకాచల తుంగ శృంగాగ్రగేహ! [1]

దుర్గ అనగానే సాధారణంగా భయంకరరూప సాక్షాత్కారము జరుగును. 'అమ్మలగన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ దుర్గమాయమ్మ' అని పోతనగారు భాగవతంలో మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదలకై దుర్గను ప్రార్థించుట తెలిసినదే. అంబ

-----------------------------------------------

పాద సూచికలు:[1] కాళ/ప్రథమా/4/ ధూర్జటి

యొక్క రూపము వివిధములుగా వ్యక్తమగును. ఇచ్చట మహిషాసురుని హరించుటవలన రుధిరము ఎగజిమ్మినది. మహిషుని గొంతు నుండి చిమ్మబడిన రక్తము దుర్గాంబ పాదములపై లత్తుకవలె భాసించినది. చండముండాసురులతో జరిగిన రణరంగమునందు అలసటవలన కలిగిన ఘర్మజలబిందువులు ముత్యాలసరముల వలె వొలుపారినవి. రక్తబీజుని మర్దనమపుడు చేసిన అట్టహాసము లోధ్రసుమరజముగ విలసిల్లినది. శుంభ నిశుంభాదులను సంహరించు సమయములో పైకెగసిన ధూళి మేలుముసుగుగా ముస్తాబుచేసింది. ఆదేవి వీర శృంగారమూర్తిగ శోభించినది. ఇదే కవి ఇదే గ్రంథములో జ్ఞానప్రసూనను చిత్రించిన తీరు సౌమ్యముగా నున్నట్లు గుర్తించగలము.

ధూర్జటి - తన శ్రీకాళహస్తి మాహాత్మ్యములో, నిఖిలవిద్యా రహస్య వాణీ పరాగపాలికా పూరితా ఖండ పద్మజాండ పేటియై యొప్పుచున్న విషయమును వర్ణించిన విధమిది.

సీ. " హిమధరాధర మండలేశ్వర కుల పాలి
కామణి తనువల్లికా ప్రసూన,
యసిత కంధర సింధు రాజినామంబర
ఘోరబంధనకర గంధలహరి,
సంతత శివశక్తి సామరస్య జ్ఞాన
సారమరంద నిష్యంద ధార,
పరమహంసోత్తంస భావ భృంగ వ్రాత
తన్మయావస్థా ప్రదానకేళి
గీ. నిఖిలవిద్యా రహస్య వాణీ పరాగ
పాలికాపూరితా ఖండ పద్మజాండ
పేటియైయొప్పు చంద్రార్థ జూటకోటి
జోటిగొల్చెద జ్ఞానప్రసూనకలిక ! [1]

-----------------------------------------------

పాద సూచికలు: [1] కాళహస్తి/ప్రథమా/2/ధూర్జటి

పై తీరులోనే తమ కులదైవము, చౌడేశ్వరీదేవిని కవి రామప్ప సన్నుతించిన తీరు కొంత పరికింతము.

సీ. " తన నామధేయంబు దనుజ నాథులకెల్ల

హృదయ సీమలలోన నెదురు చుక్క

తనదేహ కాంతి నాథుని వినిర్మలమైన

కాయంబునకును బంగారు పూత

తనతోడి నెయ్యమింద్రాణికి వాణిక

బ్జేక్షణు రాణి కభీష్ట సిద్ధి

తన పదాంభోరుహ దాస్యంబు పరమహం

సల కెల్ల పారవశ్యంపు టెల్ల

గీ. తనసుచారిత్ర మవని సజ్జనులకెల్ల

పఠన యోగ్య మానంద శుభప్రదంబు

నట్టి మత్కుల దేవత నఖిల లోక

జనని చౌడేశ్వరిని మది సన్ను తింతు" [1]

అంబ సహస్రాధిక నామాధారిణి. ఏ పేరుతో పిలిచినా ఆ రూపుతో ప్రత్యక్షమగును. త్రిపురసంహారకుడు త్ర్యంబకుడు. అతని సగదేహమే త్రిపుర సుందరి. ఆ బాల, ఆబాలగోపాలమును దయతో చూచునట్టిది. ఆ త్రిపుర సుందరిని, సుందరంగా సారకాండములో నోంపల్లె వారు స్తోత్రము జేయుట చూడగలము. అందులో ఆ దేవి రమా, శారదల వాంఛితములు తీర్చినది. కరుణానిధి. వరదముద్ర, అభయ ముద్రలను పూనినది. కళ్యాణ గుణములు కలిగినది. శుభ కర అక్ష సరములను దాల్చినది. సైకత శ్రోణులరాణి. త్రిపుర సుందరి మరియూ 'బాల'

-----------------------------------------

పాద సూచికలు:[1] చౌడేశ్వ /ప్రథమ/9]

ఉ. " వాణికి లక్ష్మికిన్ ప్రమద వాంఛితముల్ పొనగూర్చి కైత వి

న్నాణము నాకు జేర్చి కరుణానిధియై వరదాభయాంక క

ళ్యాణ గుణాత్త పుస్తక శుభాక్ష సరంబుల దాల్చి సైకత

శ్రోణుల రాణియౌ 'త్రిపుర సుందరి' 'బాల' దలంతు భక్తితోన్" [1]

సాధారణముగా కవులు తాము సంకల్పించిన తమ కావ్యమును సంపూర్తిగా సాగుటకు, చక్కని భావములు పదములు, ఇతరములు స్ఫురించుట కొరకు చదువుల తల్లి సరస్వతిని శరణు కోరడము చేయుట సహజము. ఇచ్చట శ్రీవిద్య ఉపాసనజేయువారు కావచ్చు, చవులూరునట్టి పలుకులు పలికించునదై , సుజనోల్లాస ప్రపూర్ణమైన, లలితమైన, రసపుష్టమైన, మధురమైన, లావణ్య సంపాద్యమైన కృతిని కూర్చుటకు, కలమును ముందుకు సాగగ చేయుమని లలితాంబను కామాక్షిని, విశ్వేశ్వరిని అర్థించుట చూడగలము.

మ. "కలమున్ సాగగజేసి నన్ను గనవేకామాక్షి, విశ్వేశ్వరీ

లలితాంబా కృపతోడ దేవి సుజనోల్లాస ప్రపూర్ణంబునై

లలితంబై రసపుష్టమై మధురమై లావణ్య సంపాద్యమై

వెలయంగా చవులూఱునట్టి పలుకుల్ వేకూర్చ నర్థించెదన్" [2]

మరి కొందరు కవులు వైయక్తికముగా కాకుండా సమష్టిగ దంపతులనిరు వురినీ కలిపి స్తుతించుట చేసినారు. అట్టివారిలోనొకడు, నిఖిలసూరి లోకాంగీకారతరంగిత కవిత్వ వైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్య గేయుడగు 'సూరన' తన 'ప్రభావతీ ప్రద్యుమ్న' ప్రబంధములో సకల భువన ప్రవర్తన హేతువులైన పురాతన మిథునంబులను సాధారణముగా చెప్పబడు సృష్టి స్థితి లయకారులను వరుస క్రమము మార్చి ఉమామహేశ్వరులను, లక్ష్మీనారాయణులను, వాణీ విధాతలను కొనియాడుట చూడగలము. ఇందులో మొదట పత్నిని, పిదప పతిని ఉమా – మహేశులు,

---

పాద సూచికలు: [1] సారకాం/14] [2] ఆత్మ రామాయణము /13

[అంగజుతల్లితండ్రులనుచు] రమా నారాయణ, వాక్ – విధాతలను తెలుపుట ద్వారా శక్తితో కూడినవారని అపుడే ఆ మూర్తుల పరిపూర్ణత తెలియ వీలగునని మనము భావించ వచ్చును.

ఉ. "శ్రీమదుమా మహేశు లతి చిత్ర విలాసులు తారు ముస్ వియో

గామిత చింత నొండొరులకై సగ మౌటలు నిచ్చ దెల్పు కాం

క్షా మహిమంబుచే చెటి సగంబుగా నొక్క యొడల్ ధరించుస

త్ప్రేమపు దంపతుల్ కృతిపతిస్ తనరింతురు గాత కీర్తులస్" [1]

ఇచ్చట శరీరమును చెటి సగమాక్రమించుకొనిన 'అర్ధ నారీశ్వర' ప్రస్తావన చేయడము పరిశీలించగలము.

ఉ. " అంగజ హేతుకంబు లరయస్ మిథునంబుల ప్రేమ లిట్టిచో

నంగజు తల్లి దండ్రులగునట్టి యనన్య సమాన హార్ద సం

సంగులనాది దంపతులు సత్కృప నిత్తురు గాక సౌఖ్యముల్

పింగళి సూర ధీరవరు బిడ్డకుమా యమరేశ మంత్రికిస్" [2]

ఇక్కడ మదనుని జననీజనకుల ప్రశంస చేయడమున్నది. మిథునములు అనన్య సమానమగు హృదయ సంసంగులు కావలెనని నారాయణుడు లక్ష్మిని తన హృదయములో నివాసముగా చేసిన విషయమును వక్కాణించుట చూడగలము.

ఇక మూడవ జంట వాణీహిరణ్యగర్భులు. విధాత వాక్కును వదనములో నిడుకొనినవాడు. నిర్మలము నూతనము యగు అంచనెక్కి కీర్తి, తేజాలు సద్యః ఫలితముగ నిడుచు వర్తించువారు. పలుకులచెలిని తన వదనాన

అనువుగ నిలుపుకొనిన నలువను, ఆతని లలనను నుతించుట కలదు.

---------------------------------------------------

పాద సూచికలు: [1] ప్రభా / సూరన/1 [2] ప్రభా/ సూరన /2

చ. " అమల నవీన హైమ నిజయాన గరుద్ద్యుతి ప్రాచు సద్వపు
ర్విమల రుచిస్ స్వభక్తులకు వెండియు పైడియు కీర్తియుస్ సుతే
జము నెపుడప్పుడే యొసగు సర్గవిధానముదాల్చియున్న య
ట్లమరెడు వాగ్విధాతలమరార్యున కిత్తురు నిత్య సౌఖ్యముల్" [1]

తన 'హరవిలాసము'లో 'శ్రీనాథ మహాకవి' శాంభవీ శంభుల మధుకేళిని వర్ణించుట చూడగలము. ఇచ్చట కూడా శక్తి స్వరూపిణియైన శాంభవిని తొలుత కవి ప్రస్తావించుట కలదు. గణపతిని స్తుతించినపుడు కూడా, ఇదే గ్రంథములో శ్రీనాథుడు శాంభవీ శంభు పదములను ప్రయోగించెను.

సీ. " వేదండ వదన శుండా దండ గండూష
కాండ సిక్తాప్సరో మండలములు
గంధర్వ కన్యకా కనక సౌగంధిక
మాలికా లగ్న షాణ్మాతురములు
నందీశ్వర క్షిప్త నారంగ ఫల పాక
తరళ విద్యాధరీ స్తన భరములు
గరుడ లీలావతీ కస్తురికాపంక
పిహిత నిశ్శేషాంగ భృంగిరిటులు

గీ. వీర భద్ర వికీర్ణ కర్పూర చూర్ణ
ధవళితాకాశ చర వనితా ముఖములు
శాంభవీ శంభు మధు కేళీ సంభ్రమములు
పొదలి వాసించు గాత నా హృదయ వీధి" [2]

-----------------------------------------------------------

పాద సూచికలు: [1] ప్రభా సూరన /3 [2] [హరవిలా/అవతా/6]

5.2 ***మాతృకాశక్తుల స్తుతులు*** : - మాతృక యనగా – కన్నతల్లి, పాలిచ్చి పెంచిన దాది, పార్వతి, వర్ణమాల అసలు[మూల]గ్రంథము, సప్త మాతృకలు > బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండి అను మూర్తులు. అంధకాసురునితో యుద్ధము చేయునపుడు రుద్రుని అంగమునందుండి, నృసింహ మూర్తి యగు విష్ణువు యొక్క అంగమునుండి కొందఱు స్త్రీగణ దేవతలు పుట్టినారు. ముల్లోకముల యందు వీరికి బలి పూజాదులు ఒసంగెడువారు వీరిచే రక్షింపబడుదు రని, తక్కిన వారలు భక్షింప బడుదురని చెప్పడముగలదు. ఈ శక్తులలో కొన్ని మతభేదాలు ఉన్నట్లు మనము తెలియగలము. వీరుకాక, మరికొన్ని మూర్తులు గలవు. అందులో, శైలపుత్రీ, బ్రహ్మచారిణీ, చంద్ర ఘంటా,కూష్మాండా, స్కందమాతా, కాత్యాయనీ, కాళరాత్రీ, మహాగౌరీ, సిద్ధిధాత్రీ, మహిషాసుర మర్దినీ మొదలగునవి. మాతృకాశక్తుల వివరాలు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి దుర్గావైభవ ప్రవచనమునను సరించి మాతృకాశక్తుల నుతి చూద్దాం. [సంక్షిప్తముగా ఎన్నిక చేయబడిన కొన్ని వాక్యాలు]

'సరస్వతీ కటాక్షం ఉన్నవాడికి లక్ష్మీ కటాక్షం ఉంటుంది. సరస్వతీ కటాక్షం ఉండి భయం లేకుండా ఉండి చిట్ట చివర ఆవిడ అనుగ్రహాన్ని పొంది ఆవిడలో ఐక్యమైపోతాడు. మూడింటిలో వ్యక్తిని, కుటుంబం, సమాజం, దేశమంతటినీ పైకి ఎక్కించడానికి వచ్చినవే నవరాత్రులు. అప్పుడు ఈ ఒక్క దుర్గయే నవదుర్గలుఅవుతారు.

'ప్రథమం శైలపుత్రీ చ ద్వితీయం బ్రహ్మచారిణీ|

తృతీయం చంద్రఘంటేతి కూష్మాండేతి చతుర్థకమ్ ||

పంచమం స్కందమాతేతి షష్ఠం కాత్యాయనీతిచ |

సప్తమం కాళరాత్రీతి మహాగౌరీతి చాష్టమం||

నవమం సిద్ధి ధాత్రీ చ నవ దుర్గాః ప్రకీర్తితాః || అనినపుడు - శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళ రాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి రూపాలలో దుర్గ సాక్షాత్కరించును. ఆ దేవి సనకసనందనాదుల శాపము, మేనక హిమవంతుల కోరిక ప్రకారము మేనకాదేవి గర్భాన మొదటి రూపం శైలపుత్రిగా

అవతరించింది.

బ్రహ్మతత్త్వస్వరూపిణి ఆ బ్రహ్మచారిణి. మోక్షంవరకు తీసుకునివెళ్ళగల తల్లి ఆమె. ఒక్కసారి నిండుమనస్సుతో నమస్కరిస్తే చాలు కదలికలను భగవంతునివైపు తిప్పి మనుష్య జన్మసార్థక్యం చెయ్యకలిగిన రెండవ శక్తిగా దుర్గరూపం 'బ్రహ్మచారిణి' ఇక మూడవది చంద్రఘంట. నవదు ర్గలలో ఒక దుర్గగా వచ్చినపుడు 'చంద్రఘంటా' అన్న పేరుతో ఉపాసన లో అంతదగ్గర స్థితిని పొంది ఉంటున్నది నిరూపణ చేయడం కోసం ఆ రూపంలో వచ్చినది. అంబ పాదాలు పట్టుకుంటే ధర్మంతో అర్థకామాలు ముడివేయడం వస్తుంది. అందుచేత ఆమె కూష్మాండ. అటువంటి తల్లి నవదుర్గా స్వరూపాలలో కూష్మాండ అని ఒక పేరు పొందినది. గంగా గర్భం నుండి స్ఖలనమయి స్కందుడైతే, స్కందుడికి తల్లిఅయింది కాబట్టి నవదుర్గలలో 'స్కందమాత' అయింది.అంటే మహాపురుషుల జననం కారణం అవడమే కాకుండా తాను కూడా మహాపురుషులకు మహా జ్ఞానులకుతల్లి కావాలనే గాఢమైన కోరిక ఉన్న మాతృ స్వరూపిణి ఈమె.

కామాక్షి అన్న పేరుతో తపస్సు చేసిన కామాక్షి పరమశివుని వామార్ధ భాగాన్ని పొంది వచ్చిన స్వరూపమే కాత్యాయని. తర్వాత చెప్పబడినది 'మహాగౌరి'. మహాగౌరి స్వరూపాన్ని ఉపాసన చేయడం ఆ తల్లిని ప్రార్థన చేయడం, నమస్కరించడం మన అభ్యున్నతికి కారణమౌతుంది. నవదుర్గలలో ఒక దుర్గాస్వరూపంగా వచ్చినతల్లి మహా గౌరి. ఎర్రగా తాంబూల చర్వణంచేస్తూ, నవ్వుతూ, త్రిశూలం చేతిలో పట్టుకుని నిలబడి ఉంటుంది. ఈ కదలికలకన్నింటికీ కారణం ఆవిడ కాళరాత్రి. ఏదైనా ఇవ్వగలదు అనడానికి చిట్టచివరిమాట సిద్ధి. సృష్టి, స్థితి లయలతోపాటు ఈ రెండూ ఆవిడే చేస్తుంది. నామరూపాలు మాయ. అలా ఆ మాయచేత ఆత్మ ఎరుకలోకి రాకుండా తిప్పేతల్లి ఆవిడే. ఆ తెర తీసి అసలు వస్తువు కనబడేటట్లు చేసేది ఆవిడే. తిరోధానం చేస్తే దాస్తుంది మళ్ళీ పుడతారని అనుగ్రహిస్తే తెర ఎత్తినట్లే. ఇదిగో శివుడు అని కలిపేస్తుంది. మాయ అన్న అవనిక పైకి ఎత్తితే, అంటే మాయ తొలగి పోతే, బ్రహ్మం ఎరుకలోకి వస్తుంది.అదే సిద్ధి ధాత్రి. కొంత కొంత భేదముతో వీరి రూపములు అక్కడక్కడ మనకు కనిపించును. ఆ మూర్తుల

రూపాలలోత్రిగుణ శక్తులను గ్రహించి త్రిమూర్తుల అధీనములోనుండి సృష్ట్యాది కార్యములు చేయు వారలుగా చెప్పబడు ముప్పురు తల్లులను ప్రార్థిస్తున్నాడు, కవి 'లింగమూర్తి గురుమూర్తి' తన 'శ్రీ సీతారామాంజ నేయ సంవాదము'లో చూడండి.

శా. " బ్రహ్మాండంబు సృజింప పెంప సమయింప జాలు సామర్థ్యముల్
బ్రహ్మేంద్ర నగేంద్ర చాపులకు సంపాదించుచు న్వారికిన్
బ్రహ్మత్వైక్య వివేక మిచ్చుచును సంభావించు చుంబ్రోచునా
బ్రాహ్మీ మంగళ దేవతా గిరిజలంబ్రార్థింతు నశ్రాంతమున్" [1]

శంకరుని పత్ని పార్వతికి పలు రూపములు నామములు కలవని చెప్పడమైనది. ఆ రూపములనే స్తుతించుట తనదైన పద్ధతిలో 'అనిరుద్ధ చరిత్రము'లో 'కనుపర్తి' వారు కావించినారు. [అనిరుద్ధ/ఆవ/5]

శా. " శ్రీవిద్యా బగళాముఖీ భగవతీ చింతామణీ శ్యామలా
దేవీ వశ్యముఖీ సమాహ్వయములన్ దీప్యన్మహామంత్రయం
త్రావిర్భూత నిజాంశలాశ్రితుల కిష్టైశ్వర్యముల్ చేయుచి
ద్భావాకారతనొప్పు శాంభవి ననున్ ప్రజ్ఞాన్వితుంచేయుతన్"

ముగ్గురు మూర్తులకన్న అధికమైన శక్తి కలిగినది ఒక గ్రామములోని మరిడీ మాత. అందుకే ఆమెను స్తుతించినారు.

మ. " హరియైనా హరుడైన నింద్రుడయినా అబ్జాసనుండైన ని
న్నెరుగంజాలరు నీ మహా మహిమమాకెంచంగ శక్యంబటే
పరదేవీ విషజాత మారుత వలత్పాద ద్వయా దూరమై
మరిడీ దేవత! మమ్ము బ్రోవగదవమ్మా! పొమ్మ! మాయమ్మపై!" [2]

---

పాద సూచికలు: [1] సీతా/పీ/4 [2] వేప్రశా మణి/22

5.3 ***జ్యేష్ఠా దేవి స్తుతులు*** : - జ్యేష్ఠ అను శబ్దమునకు పలు అర్థములు కలవు. అందులో కొన్ని ఇట్లు చెప్పవచ్చును. ఒక నక్షత్రము. జ్యోతిశ్శా స్త్రములో చెప్పబడు ముఖ్యమైన అశ్విని ఆదిగా, రేవతి వరకు గల 27 తారలలో18వ నక్షత్రము 'జ్యేష్ఠ'. నాయకునికిగల పలువురు నాయికలలో మిక్కిలి ప్రేమయుంచిన 'నాయిక'.

'పెద్దమ్మ', బల్లి, ఒక నెల, హంస, అగ్రజుడు, మిక్కిలి వృద్ధుడు, మిక్కిలి శ్రేష్ఠుడు, నడిమి వ్రేలు, గంగ, శివ శక్తి మున్నగు అర్థములు కలవు.

'జ్యేష్ఠా దేవి' అనగ ఒక వివరణను అనుసరించి ఈ రీతిగా చెప్పడమున్నది. [పురాణనామ చంద్రిక పుట 77, పునర్ముద్రణ, జనవరి 2006, ప్రాచీ ప్రచురణలు, హైదరాబాదు]

'జ్యేష్ఠా దేవి' వరుణుని భార్యలలో ఒకతె. ఈమె ధాతృవిధాతలతో కూడా పుట్టిమ్పబడిన బ్రహ్మ మానస పుత్రిక. ఈమె చెలియలు లక్ష్మి. వరుణుని వలన ఈమె అధర్ముడను సుతుని పొందినది. ఈ జ్యేష్ఠాదేవినే కొందరు కాళికాదేవి అని కూడా అందురు. జ్యేష్ఠాదేవి కష్టములకు నెలవు. ఓర్మికి మరోపేరు. దరిద్రదేవతగా ఈమెకు ఉన్న ఘనత. సిరిసంపదలను అందరూ ఆశించుట సహజము.

కష్టములను, కన్నీళ్ళను, దరిద్రమును ఎవ్వరూ ఇష్టపడరు. లోకతీరిది. అట్టి దరిద్రదేవతను 'కూచిమంచి జగ్గకవి' తన 'చంద్రరేఖావిలాపములో' ప్రస్తావించినాడు. దీనికి కారణమేదో బలమైనది ఉండిఉండవలయును. ఆ దరిద్ర దేవత 'జ్యేష్ఠాదేవి' రూపము ఇట్లున్నది. నల్లనివి, ఎర్రనివి సౌందర్యమునకు చిహ్నలుగావు. పారిజాతాపహరణములోముక్కు తిమ్మన గారు కృష్ణునిద్వార 'మాసిన చీరకట్టి మౌనముతోడ నిరస్త భూషయై వాసెన కట్టుకట్టినట్టి' సత్యతో ఇట్లనిపిస్తారు. ' ఇందునిభాస్య మైతొడవులేల ధరింపవు?నున్నకావులీవెందునుమానలేవు, తెలుపేటికి కట్టితివి?" అంటే వస్త్రధారణను బట్టి కొంతవరకు సందర్భములు గుర్తించ వీలుకలుగును. ఇచ్చటదరిద్ర దేవత, నలుపు ఎరుపు రంగుల వలువలు ధారణచేసి జలజల కనులనుండి బాష్పబిందువులు

రాలుచుండగ, లక్ష్మి అక్కయైన జ్యేష్ఠాదేవి కలకాలం, కల్మషాల ఆలయమగు కలిపురుషుని తో కలసి, 'నీలాద్రిరాజు' ఇంట నిలవవలెనని కోరుచున్నాడు. ఆ సంద ర్భములో ఆయన స్తుతి. నీలాద్రి విభుడంటే కవికి చాలా అనాదరము.

చ. " నలుపగు రక్తమాల్యవసనంబులు డంబుగదాల్చి కన్నులస్

జలజల బాష్ప బిందువులు జాలుకొనంగ జెలంగు చుండ న

క్కలుముల చేడెయక్క కలకాలము నీలనృపాలునింటిలో

కలిపురుషాంగయయి గాఢరతిన్నటియించుగావుతస్" [1]

కవులే కాదు ప్రాచీన సూక్తములలో కూడా జ్యేష్ఠాదేవిని తన ఇంటి నుండి పంపివేయమని లక్ష్మిని శ్రీసూక్తములో వేడుకొనుట కలదు. శ్రీసూక్తము 8వ మంత్రము. ఈ రీతిగానున్నది.

"క్షుత్పిపాసామలాం జ్యేష్ఠామలక్ష్మీం నాశయామ్యహం|

అభూతిమసమృద్ధిం చ సర్వాం నిర్ణుద మే గృహాత్"

ప్రతిపదార్థము :-

క్షుత్పిపాసామలాం = ఆకలి దప్పికలచే కృశించినదీ, జ్యేష్ఠాం = లక్ష్మికి ముందు జన్మించినదీ, అలక్ష్మీం = అలక్ష్మిని [మంగళకరము కానిది] అహం = నేను, నాశయామి = నశింప చేస్తాను, మే గృహాత్ = నా గృహం నుండి, సర్వం = సమస్త, అభూతిం = అభాగ్యాన్ని, అసంరుద్ధిం చ = అసమృద్ధులను, నిర్ణుద = నిర్మూలించి అనుగ్రహించు.

భావము : - ఆకలి దప్పికలతో కృశిన్చినదీ, శ్రీదేవికంటే ముందుగా జన్మించినదీ, అయిన జ్యేష్ఠాదేవిని (అలక్ష్మిని) నేను నాశనం చేస్తాను. నా గృహం నుండి అభాగ్య, అసమృద్ధులను పూర్ణంగా నిర్మూలించి అనుగ్రహించు.

5.4 ***గంగాదేవి స్తుతులు*** :- పంచ భూతములలో రెండవది 'జలము' ప్రపంచములో అన్ని దేశాలవారు నీటిని వాడక తప్పదు. మూడు రూపములలోనికి మారగలది జలము. ఆవిరి [వాయు], జలము [ద్రవ], మంచు [ఘన] రూపాలు. గంగను జీవనది / జీవ నాడిగా

---

పాద సూచికలు: [1] చంద్రరేఖావిలాపము/ కూచిమంచి జగ్గకవి' ప్రథ/6

భారతీయులు నమ్ముతారు. గంగ శివుని శిరమును చేరినది. విష్ణుపాదజనితమైనది. పవిత్రతతకు మారు పేరు గంగ. పాండవుల మధ్య జరిగిన ఒక ఒప్పందము / కట్టుబాటు ననుసరించి అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరినాడు. అ సమయములో, అర్జునుడు "చూచెన్ని మజ్జజ్జనౌఘోత్ప తత్పంక శంకా కరాత్మో ర్మినిర్మగ్న నీరేజ రేఖోన్నమద్భృంగ నేత్రోత్సవ శ్రీని గంగాభవానిన్' ."గంగా విష్ణుపదీ జహ్ను తనయా సురనిమ్నగా భాగీరథీ త్రిపథగా త్రిస్రోతా భీష్మసూరపి " యని పలు గాథలతో / చరితలతో కూడినది. గంగ తనలో మునిగినవారి పాపములను తొలగజేసి, పతిత పావనుడను ఘనతను తండ్రియగు దామోదరునికి అందిస్తున్నదని కాసుల పురుషోత్తమకవి చెప్పడము తెలిసిన విషయమే! భగీరథుడు తనపూర్వీకులకు సద్గతులు కల్పించుటకొరకై పట్టువదలక పలు ప్రయత్నములు కావించినాడు. అందులో భాగముగా అతడు గంగాభవానిని స్తుతించినాడు. పోతన ఈ సందర్భములో చెప్పిన పద్యము చూద్దాము.

ఇంద్రవజ్ర .

"చెల్లన్ మదిన్నిన్నుభజింతుగంగన్ ఫుల్లాంతరంగన్ బహుపుణ్యసంగన్
కల్లోల లక్ష్మీజితకాశమల్లిన్ తల్లిన్ సుధీకల్పలతామతల్లిన్" [1]

ఉత్తుంగ తరంగములతో ఎగసి ఎగసి పడుచూయున్న పావన ప్రవాహినిని,ధ్యానించినాడు సారకాండలో కృష్ణమూర్తి గారు. ఆయన చేసిన స్తుతి.

కం. " రంగుగ నంగావుతనుత్తుంగ తరంగాంగ గంగ తోయాంచ ద్చీప్ర
సంగత విహంగ నిస్వన భృంగారవ సత్ప్రసంగ ప్రియమెసగంగన్ " [2]

శ్రీనాథుడు ఒక సందర్భములో నీరు కావలసివచ్చి, పరమేశునితో పరాచికమైన పద్యమును చెప్పినాడని, అప్పుడు గంగ లభ్యమైనదని ఒక చాటువును ఉదహరించడమున్నది.

---

పాద సూచికలు: [1] పోతన/9/222 [2] [సారకాండ/10

అందులో శివుని ప్రార్థించిన దాని కన్నా, అపహసించినట్లున్నదని కొందరి భావన. ఆ ప్రసిద్ధ చాటువు చూడుడు.

కం. సిరిగలవానికి చెల్లును తరుణులు పదియారువేలు తగ పెండ్లాడన్

తిరిపెమునకిద్దరాండ్రా? పరమేశా! గంగ విడువుము పార్వతిచాలున్.

బిచ్చ మెత్తుకొనువాడు శివుడని, పాత్ర కూడా లేక పుర్రెను / కపాలమును భరించిన వాడని కొందరు చెప్పడమైనది. కపాలభృత్ [కపాలం భిభర్తీతి కపాలభృత్].

హిందువులు తమ సంప్రదాయానుసారము కావించు కలశ పూజలో చెప్పబడు ఒక ప్రార్థనారూప మంత్రములో పవిత్ర భావనతో జీవ నదులను స్మరించుట జరుగును.

' గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి|

నర్మదే సింధు కావేరి జలే(అ)స్మిన్ సన్నిధిం కురు||

పూర్వీకులు సుఖ జీవనమునకు, ఆధ్యాత్మిక భావనలను జోడించి సాధించినారు. భౌతిక వస్తువులను అవసరమైనంత వరకు పరిమితముగా వాడకమునందుంచి, అంతకు మించి ఆధ్యాత్మిక చింతనామృతమును ఆస్వాదించినారు – వారు. వారి ఆనందమయమైన సుఖజీవనమునకు బహుశః అది ఒక కారణం/ రహస్యము కావచ్చు.

దీనిని NLP అను భావనతో కొందరు వ్యాఖ్యానించుట గలదు. 'తాను మునిగింది గంగ, మెచ్చింది రంభ' యని సామెతలలోకి కూడా గంగ చేరినది. గాలి తర్వాత ప్రాణికి [మనిషికి] అత్యవసరమైన పంచభూతా లలోనిది రెండవది జలము. అందులకే గంగకు అతి గౌరవము, ప్రాధాన్యత ఇచ్చినారు పెద్దలు. ఆ సంస్కారమును తెలిసిన వారు, కనుక 'గురుమూర్తి'గారు గంగను తమగ్రంథము 'ఆత్మరామాయణము'లో ఆ ఆచారమును అనుసరించి గంగాస్తవము చేసినారు. చూడండి. ఆ గంగ భవలోక పాపనాశిని. సత్సంగ. ప్రవిమలమైనది.

కం. " భవభంగను సత్సంగను, ప్రవిమలమౌ దేవ గంగ పాపవిభంగన్

భువిమమ్మెల్లరనోమగ సవినయ భక్తిన్ దలంతుసతతము గంగన్" [1]

--------------------------------------

పాద సూచికలు:[1] ఆత్మ రామ/26

గంగకు వారిచ్చిన ప్రాధాన్యతను చూద్దాము. పెద్దల వచనానుసారము

'ఇడా భగవతీ గంగా పింగళా యమునానదీ|

తయోర్మధ్యగతా నాడీ సుషుమ్నాఖ్యా సరస్వతీ||

యఃస్నాతి మానసేతీర్థే సపై ముక్తో నసంశయః ' అని చెప్పడము కలదు.

{ 'ఇడా నాడి సాక్షాత్తు గంగాదేవి వంటిదని అట్లే పింగళా నాడి యమునానది వంటిదని చెప్పబడినది. ఈ రెండింటి మధ్యన యుండునట్టి సుషుమ్నా నాడియే సరస్వతీ నదిగా పేర్కొన బడినది. ఈ త్రివిధ నాడులకు చెప్పబడిన త్రివిధ నదుల త్రివేణీసంగమ స్థలమగు మానస తీర్థమునందు స్నానము చేసినవారు సకల పాపములనుండి నిస్సంశయముగా ముక్తులయ్యెదరు}

గంగా విష్ణుపదీ జహ్నుతనయా సురనిమ్నగా, భాగీరథీ త్రిపథగా త్రిస్రోతా భీష్మ సూరపి హరిచరణాత్ గాం భూమిం గతా గంగా. [హరి పాదము వలన భూమిని పొందినది గంగ. హరోత్తమాంగాద్భూమింగతా గంగా. [హరశిరస్సు వలన భూమిని పొందినది – గంగ ] తన గ్రంథములో గంగను చేమకూరి వారు ప్రశంసించిన విషయము మునుపు చెప్పడము జరిగినది. గంగ యొక్క విశేషమును తన పీఠికలో ప్రస్తుతించినాడు మన కవివరుడు.

మ. " ప్రకట శ్రీ హరి యంఘ్రి పుట్టి హరు మూర్ధంబెక్కి యాపాదమ

స్తకమున్ వర్ణన కెక్కుదేవి సహజోదంచత్కులోత్పన్ననా

యకరత్నంబని యచ్యుతేంద్ర రఘునాథాధీశ్వర స్వామికిన్

సకలైశ్వర్యములు న్నిజేశువలనన్గా గల్గగా జేయుతన్" [1]

జనులకు తగుసస్యమునొసగి కరుణతో కాపాడునదైన భూమిని కూడా స్తుతించుట చేసినారు తమ 'కాండసారము'లో నోంపల్లె కృష్ణమూర్తి గారు.

కం. "వర సస్య లాభమిడి సత్కరుణన్ లోకంబునెల్ల క్షమ బ్రోచెడి యా

ధరణిన్ దగు కరణిన్ సుస్థిర సరణిన్ కొలుతు ప్రీతిచే నను గావన్" [2]

---

పాద సూచికలు:[1] విజయ/విలా/8] [2] సార/8

*26 కావ్యాదిలో కాకున్నా మధ్యలో గంగను ప్రస్తావించినాడు తిమ్మన. శ్రీకృష్ణుడు సత్యభామతో కలసి అమరావతికి, ఇరుప్రక్కల నందకాది ఆయుధములు అనుసరించ , విహగావతంసుని నిజాంసముపై ఆసీనుడై  వెళ్ళినాడు. సురలోకములో గజగమనయగు సత్యకు సురగంగను చూపి తద్గంగా ఘనతను విశదీకరించినాడు. ఆ గంగ మదనహరుడైన శివుని శిరమను నాట్యభూమిలో నాట్యం చేసేనర్తకి. జహ్నుమహర్షి ఒడిలో శిశువు. కపిలుని కంటిమంటలకు బూదియైన సగరవంశీకులకు మోక్ష ప్రసాదిని ముల్లోకములలో ప్రవహించునది, యమునకు సఖి కనఖల పర్వతయుత. లయగ్రాహి పద్యము. ఈ పద్యమునందు ప్రతి పాదమున వరుసగ, 'భజసనభజసనభయ' గణాలు వచ్చును. తొమ్మిదేసి అక్షరాల కు ప్రాసయతి 3సార్లు చెల్లించవలయునుప్రాసయతి గీత, సీస పద్యముల వలె చెల్లును.యతులు లేవు. ప్రాసయతులు నియ మములు/తములు.

'అంగన! కనుంగొను మనంగహరమౌళి తట
రంగనటి జహ్నుముని పుంగవ విశాలో
త్సంగ శిశువుంగపిలు నింగలపు చూపుసెక
లంగలయునా సగరువంగడముమోక్షో
త్తుంగ మణిసౌధమునకుం గడపు తాప గగ
నాంగణ మహీతలభుజంగ నిలయంబుల్
జంగగొనుసేర్పరి పతంగజయనుంగు చెలి
యంగనఖలాచలయుగంగా సురగంగన్"

---

పాద సూచికలు :[1] పారిజాతా/ఆశ్వా/2/94

# షష్ఠాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు – వైష్ణవసంబంధస్తుతులు

# VI షష్ఠాధ్యాయము.

## 6. వైష్ణవ సంబంధ స్తుతులు

ఇంతకు పూర్వము శైవ, శాక్తేయ సంబంధ స్తుతులను పలు కావ్యములలో పలువురు కవులు చేసినది పరిశీలించినాము. ప్రస్తుతము వైష్ణవ సంబంధమగు స్తుతులను కొంత పరిశీలన చేయు దము. విష్ణు సంబంధమైనది వైష్ణవము. విష్ణుః అనగా 'విశ్వం వేవేష్టివ్యాప్నోతీతి విష్ణుః' విశ్వమందంతటా వ్యాపించి యుండు తత్త్వము ఏదో అది విష్ణుతత్త్వము. విష్ణు సహస్ర నామములో కూడ 'నామాని గౌణాని' అని చెప్పటము చూడగలము! త్రిమూర్తులలో విధి హరి హరులు , క్రమముగ సృష్టి, స్థితి, లయ కార్యక్రమములు నిర్వహించుదరని చెప్పబడును. విష్ణువునకు పలు నామములు కలవు. మూలచైతన్యము బహురూపములలో వారివారి అనుభవము, ఆరాధనా విధానము, అనుసరించు తీరు తెన్నులను బట్టి, వ్యక్తిగత సంప్రదాయమును అనుసరించి కొలిచెడి పద్ధతులు, రూపములు ఇతరములు ఉండును. ఆరాధనీయులగు దైవ స్వరూపములు, వారి లీలలు, వారికి సంబంధించిన వస్తువులు, ఆయుధములు, వాహనములు, పరివారము కూడ స్తుతి పాత్రమగుట కలదు. భక్తి అధికమైన కొలది సావధికునకు [జీవుడు] - నిరవధికునకు [దేవుడు] మధ్య గల అంతరము తగ్గును. ఈ బంధము గాఢమైన కొలది చనవు బలిమి మిక్కుటమగును. కృష్ణుని స్తుతిస్తూ, మధురాష్టకము లో 'అధరం మధురం వదనం మధురం' అంటూ కృష్ణుని ప్రతి కదలిక వల్లభాచార్యునికి మధురముగా సాక్షాత్కరించి నది. పలుకే బంగారమని ఒక వాగ్గేయకారకుడంటే, అసలు నామమే ఎంతో తియ్యగా నున్నదని మరొకాయన, రామనామమనే పాయసానికి, కృష్ణ నామమనే చక్కెరను,విఠల నామమనే 'తుప్ప' [నేయి] కలిపి ఆనందమను రసాస్వాదన చేసినాడు మరొక భక్త శిఖామణి. కావ్యాలలో కవిపుంగవులు కావించిన వైష్ణవసంబంధ స్తుతులస్థితిని గతిని కొంతపరిశీలిద్దాము. విష్ణువునకు కూడా పలు పేళ్ళున్నాయి. ఇందులో

కొన్ని నామములు వారి వారి లక్షణములను అనుసరించియు, వారి గుణములను అనుసరించి, వస్త్రములననుసరించి, ఆభరణాలను అనుసరించి పేర్లు వాడటము కలదు. ఉదాహరణగా కొన్నిటిని చూద్దాము.

వనమాల కలిగినవాడు కనుక వనమాలి. ఈ వనమాల లక్షణము 'ఆపాదపద్మం యా మాలా వనమాలేతి సా మతా, ఇతి కళిఙ్గః. సా అస్యాస్తీతి వనమాలీ' అనగ పాదముదాక వ్రేలాడు పుష్పమాలిక కలవాడు.

మాధవః : [1] మా అనగా లక్ష్మి, లక్ష్మికి ధవుడు /భర్త. [2] యదోర్జ్యాయాన్పుత్రో మధుః తద్వంశజత్వా న్మాధవః [ యదువనెడి వాని పెద్ద కొడుకు మధుడు; అతని వంశమున పుట్టినవాడు - కనుక మాధవుడు. [3] మధూయతే శత్రూనితివా {ధూఞ్ కంపనే అని ధాత్వర్థము} శత్రువులను కంపింపజేయువాడు. అని 3 అర్థములు కలవు.

పీతాంబరః పీతమంబరం యస్య సః అనగా పచ్చని వలువ గలవాడు.

ఇదే రీతిగా ప్రతి పదమునకు అర్థములు విశేషములు కలవు. ఆయా సందర్భములలో వాటిని ప్రస్తావింతము.

వైష్ణవమనగా విష్ణు సంబంధము - అని ముందే చూచితిమి. విష్ణు స్వరూపమును ఆ స్వరూపముసంబంధమైనవాటిని, పలు అవతారముల విశేషములను ఇచ్చట ప్రస్తావించుట ఉచితము.

ప్రసిద్ధముగ ప్రస్తావించబడునది 'విష్ణు సహస్ర నామము'. మహాభారతములో మనకు ఇది కనిపించును. విష్ణువు స్వరూపమును చెప్పినపుడు, రుక్మిణీ సత్యభామా సహితముగానున్న శ్రీ కృష్ణుని రూపమును కూడ మనకు సాక్షాత్కరింప చేయుట కలదు. వాస్తవములో ఇరువురికి అభేదము చెప్పడము కలదు. విష్ణువు అవతారములను ముఖ్యముగా 'దశావతారాలు' గా చిత్రించిన విషయములు కూడ మనకు కనిపించును. అప్పకవి తన 'ఆంధ్రశబ్ద చింతామణి' [ అప్పకవీయము] గ్రంథములో ప్రసిద్ధముగా

పేర్కొనబడు, 'మత్స్యః కూర్మ వరాహశ్చ నారసింహశ్చ వామనః రామో రామశ్చ రామశ్చ బౌద్ధో కల్కిమేవచ" శ్లోకమునననుసరించి కూర్చిన పద్యమునొకసారి పరికిద్దాము.

కం. "భువనగ కచ్ఛప కిరి మా

నవసింహాదిత్య భృగుజనన రాఘవయా

దవ బుద్ధ కల్కులను కే

శవుపది రూపములు మది నజస్రము తలతున్" [1]

భాషలో శబ్దముల లోని కొన్ని అర్థ పరమైన మర్మములు తెలిసికొనిన కాని ఇందులో మర్మములు తెలియ జాలము.

భువనగ = జలములో సంచరించునది – మత్స్యము. అవతార విశేషము. కమఠ [తాబేలు], కిరి [వరాహ] మానవసింహ [నరసింహ] ఆదిత్య [అదితి కుమారుడైన వాడు] వామనుడు, భృగుజనన [భార్గవుని కొడుకు] పరశు రాముడు, రాఘవుడు [రఘు వంశములోని వాడగు రాముడు], యాదవ [కృష్ణుడు] బుద్ధ కల్కి రూపాలు. ఈ రూపములలో వ్యక్తమై, అవ్యయుడైన, అచ్యుతుని అహరహము తలచిన వాడు అప్పకవి.

పాలకడలిలో శేష తల్పముపై యోగ నిద్రాగతుడైనవాని పాదసేవను లక్ష్మి చేయుచుండు రూపమును చిత్రకారులు అందించినారు.ఆయా రచయితల అనుభవములను, ఆచారములను, అభిరుచులను అనుసరించి వారి వారి దేవతలకు చక్కని రూపములను ఆపాదించినారు. విష్ణువు అలంకార ప్రియుడు అను భావముతో విష్ణు సంబంధ ఆలయములలో అలంకారము చేయుట అధికముగా కానవచ్చును. అనగా శివుని ఆలయములలో అలంకారములు చేయరని భావింపరాదు.

----------------------------------

పాద సూచికలు :[1] అప్పక/9

6.1 *విష్ణుమూర్తి స్తుతులు –*

విశ్వమునందు అంతటా వ్యాపించిన వాడు విష్ణువు, విష్ణుః అను శబ్దమునకు అర్థము / వివరణ పైన చెప్పడము కలదు.

విష్ణువు స్వరూపమును ప్రస్తావిస్తూ కల అత్యంత ప్రసిద్ధ ధ్యాన శ్లోకములను చూచెదము. విష్ణు రూపమిది.

'శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం

విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగం

లక్ష్మీ కాంతం కమల నయనం యోగిహృద్ధ్యాన గమ్యం

వందే విష్ణుం భవభయ హరం సర్వలోకైకనాథం' - అని -

ఆ విష్ణువును మరొక రీతిలోచూడగా

'మేఘ శ్యామం పీత కౌశేయవాసం శ్రీ వత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం

పుణ్యోపేతం పుండరీకాయతాక్షం విష్ణుం వందే సర్వలోకైకనాథం' - అని -

మరొక స్తుతిలో

'సశంఖ చక్రం స కిరీట కుండలం సపీతవస్త్రం సరసీరుహేక్షణం

స హారవక్షస్థల శోభి కౌస్తుభం నమామి విష్ణుం శిరసా చతుర్భుజం' - అని – ఆయా కవులకు / రచయితలకు గోచరించిన రీతిలో ఆరూపములను వర్ణించినారు. ఇచ్చట వర్ణింపబడిన విష్ణుమూర్తి రూపమును పరిశీలించినచో ఆయన ఆకారము – శాంతము / ప్రసన్నము. సముద్రమునందు శేషునిపై శయనించి యుండుట.

పద్మమును నాభియందు కలిగి యుండుట.

ఆయన శరీర వర్ణము నీలము (మేఘ శ్యామలము).

సంపద స్వరూపమగు లక్ష్మి దేవికి కాంతుడు.

భవభయ హరుడు. సర్వ లోకములకు నాథుడు / అధిపతి.

ధ్యానాసక్తులైన యోగుల హృదయమునందు లక్ష్యముగ నిలుచువాడు.

కమల దళములవంటికన్నులు కలవాడు. ఇది మహావిష్ణువు "శయన" రూపము.
ఆయనే ప్రత్యక్షమై ధ్యానించు వారల ఎదుట నిలచినపుడు కల రూపములో వర్ణనలో కొన్ని మార్పులు చూడబడినవి. ఆ రూప సాక్షాత్కారములో ఆయన..
పీత వసన ధారి. నాలుగు భుజములు కలవాడు. ఆయన శ్రీవత్స లాంఛనుడు. వక్షమునందు హారము కలవాడు. కిరీటము శిరముపై, కర్ణములయందు కుండలములు కలవాడు. కరములయందు శంఖ చక్రాదులు కలవాడు.
మరొక కవి హృదయానికి కొంత మార్పుతో ఇట్టి రూపము కనిపించినది.
అపుడు ఆయన పుండరీక నయనుడు. కౌస్తుభ లాంఛనుడు. గగన సదృశుడు. కొద్దిపాటి వ్యత్యాసముతో ఒక పదమునకు వేరొక పదము ప్రయోగించినటుల చూడ వచ్చును. ఒకరు – కమలనయనుడు, మరొకరు సరసీరుహాక్షుడు, వేరొకరు పుండరీకాక్షుడు ఇత్యాదిగ. పీతవసనము కలవాడని ఒక కవి వర్ణింపగా వేరొకరు, పీత కౌశేయ వాసం అనడము చూడగలము. మొత్తముపై విష్ణు స్వరూపమును కొంత వ్యత్యాసముతో అందరూ దర్శించినది దాదాపు ఒకటే! ఆయా భేదములను పరిశీలిస్తూ. కవులు కావించిన విష్ణు స్తుతిని చూద్దాము. పెద్దలు మునుపే నిర్ణయించిన కొన్ని భావనలకు కవులువారి దారిని అనుసరించి దేవతలకు బంధుత్వమును కల్పించినారు. గుణములననుసరించి త్రిమూర్తులను వారి దారలను వర్గీకరించడమున్నది.
" బ్రహ్మ-లక్ష్మి ఒక వర్గము. కాళి-విష్ణువులు ఒక వర్గము. శంకరుడు-సరస్వతి ఒక వర్గము. విష్ణువు – లక్ష్మి ఒక జంటగా, బ్రహ్మ – సరస్వతి ఒక జంటగా, శంకరుడు – కాళి/ పార్వతి ఒక జంటగా సాహిత్యములో చిత్రింప బడినారు. ఈరీతిగా చిత్రించుట తొలినుండే జరిగినది. దీనికాయామూర్తుల గుణములు కారణములుగ చెప్పవచ్చు.
ఈ రీతిగా చెప్పబడిన సోదరీ –సోదర భావనలు, పతి – పత్ని భావనలు ఒకే విశ్వ చైతన్యము యొక్క వ్యక్తీకరణలు. బహువిధములుగా ( ప్రధానముగా - సృష్టి, స్థితి, లయలు) వినిమయము [పరస్పర సహకారము] ఇట్లు వర్ణితమైనది. వాస్తవమునకు సచ్చిదానంద మైన పరబ్రహ్మము ఒకటే! లోకము యొక్క దృష్ట్యా భిన్నవిభిన్నములుగా

చెప్పబడినది. 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అని కదా పెద్దల మాట. కనుక విష్ణుమూర్తికి సంబంధించిన విషయములను సాహితీసృష్టి కావించు సారస్వతనిర్మాతలగు కవులు తమకావ్యములలో దర్శించిన, ప్రదర్శించిన కోణములో ఇప్పటికి చూద్దాము. ఆ వైకుంఠవాసుని సారకాండములో [కవితానంద వాల్మీకి రామాయణము] నోంపల్లె కృష్ణ మూర్తి, వివరించిన తీరు ఇది.

విష్ణుమూర్తికి శ్రీదేవి భూదేవి కాంతలు. సిరికి శ్రీదేవి, ఓరిమికి భూదేవి ప్రతీకలు. వీరు ఇరువురు విష్ణువుకు ఉభయ పార్శ్వములందు నిలచి యుండగా చక్కని దయాసహితమగు ఉల్లాసకరమగు దృక్కులను లోక రక్షణకై క్రీగంట ప్రసరింప చేయుచున్న కళల అధిపతియు, సంపదలకు స్వరూపమైన లక్ష్మికి పెనిమిటియు, కృతి నాయకుడు అయినట్టియు, స్థితికి కారణమైన వాడు, సృష్టికర్తయగు బ్రహ్మకు మూలమైనవాడును, అయిన పక్షివాహనుడు లోకములను రక్షించుగాక యని నుతించినారు.

శా. " శ్రీక్ష్మా కాంతలు పార్శ్వ భాగముల వాసింజెన్నుమీరంగ స
ల్లక్ష్మంబుల్ కరుణాంచితంబులు మహోల్లాసోత్కరంబుల్ చల
త్పక్ష్మాంతంబులునైన వీక్షలను నేతల్లోక సంరక్షియా
లక్ష్మీనాథు కళాసనాథు కృతి లీలానాథు సేవించెదన్" [1]

పార్వతీ పరమేశ్వరుల పుత్రుడు కుమారస్వామి. ఆతని కథ కుమార సంభవము. అందులో వెన్నుని, ముఖ్య పాత్రధారియైన కంతుని కూడ నన్నెచోడుడు సంస్తుతించినాడు. విష్ణుస్తుతినొ కింత చూద్దాము. అఖిల లోకములను పాలించువాడు స్థితి కారకుడు విష్ణువు.

ఉ. " వీంగున పారసత్వ గుణ విస్ఫురణం బరమేశ్వరోరు వా
మాంగమునందుమున్న దయయై నియమస్థితి గొల్చి తద్దయుం
లోంగొని పేర్మితో నఖిల లోకములుందగ గాచుచున్నవే
దాంగుననంతు విష్ణు కమలాధిపు సంస్తుతి దేల్తు సమ్మతిన్" [2]

---

పాదసూచికలు: - [1] సార/కవితానంద వాల్మీకి రామా /కృష్ణమూర్తి 4 [2] కుమారసం/నన్నెచోడు/ప్రథ /4

'నరసభూపాలీయము' అనబడు 'కావ్యాలంకారసంగ్రహము' శాస్త్ర సంబంధ మైనది. అయిననూ ప్రబంధకవుల మర్యాదలను చక్కగా అనుసరించి గ్రంథాదిలో కృతిభర్త నరసోర్వీనాథునికి శుభములను ఆకాంక్షిస్తూ దేవతలను ప్రార్థించినారు. శౌరికి ఆయన చేసిన తొలి ప్రార్థన.

శా. 'శ్రీలీలావతి దా నురోమణి సభాసింహాసనత్కౌస్తుభా
వేలాభా ప్రతిబింబి తాంగియయిన న్వేఱొక్క తందాల్చినా
డౌలేయంచు దలంచునో యన యమందానందుడై లక్ష్మి నే
వేళం గౌగిట చేర్చు శౌరి నరసోర్వీనాథునింబ్రోచుతన్' [1]

'మావరు'డైన మాధవుని ప్రస్తుతిస్తూ 'గురుమూర్తి', 'ఆత్మరామాయణములో' యొనర్చిన ఘనమైన స్తుతిచూద్దాము.

చ. " ప్రవిమలభక్తి నీపదము బట్టి నినున్ తగవేడుకొంటి నో
భవభయ దూర, మావర, విపత్ప్రవినాశ సురారిసంహరా!
అవనిసుతా హృదబ్జ నిలయా సదయా భవదీయ సత్కృపో
ద్భవ సుకవిత్వ సంపద నిబద్ధునిగా నొనరించికావవే! [2]

'హరివంశము'లో 'ఎఱ్ఱన' గారు ఉత్తమశ్లోకుడు, పాలకడలిలో పవ్వళించిన పద్మ దళాయత నేత్రుడు, శ్రీదేవికి ప్రేమపదము, భూదేవికిమిక్కిలి కూర్చు స్నేహితుడు, బ్రహ్మకు జన్మస్థానమైన కమలనాభుడు, స్థితి కర్త యగు వాడు 'వెన్నుడు' - అతడు కృతిభర్త యగు వేమ భూవిభునకు సుస్థిరైశ్వర్యములివ్వవలయునని కృతికర్త కాంక్ష.

శా. " శ్రీకిం బ్రేమ పదంబు భూమికినతి స్నిగ్ధుండు దుగ్ధాబ్ధిశ
య్యా కేళీ రతుండాది వేధకు గృహం బై యొప్పు నాభి స్థనా
ళీకంబుంగల వేల్పు లోకముల పాలింపం ప్రభుండుత్తమ
శ్లోకుండన్నుమ వేమ భూవిభునకిచ్చున్ సుస్థిరైశ్వర్యముల్" [3]

---

పాదసూచికలు: -[1] నరసభూపా/శారదామూ /గ్రంథా/1 [2] ఆత్మ/5 బాల [3] [హరి/ఎఱ్ర/I/1]

అప్పకవి మరుని గురుడగు హరిని స్మరించినతీరు పరికిద్దాము. హరి కృష్ణుని రూపములో నుండగా, సత్య, రుక్మిణీ మున్నగువారు శ్రీదేవి భూదేవి తూర్పు పడమరలలో నుండగా మరుత్సుతులు కొలవగా భాసించు శ్రీపతి తమను బ్రోచుననుచు తమ మొదటి పద్యమును విరచించినారు. 'మ' గణముతో, 'శ్రీ' కారముతో శార్దూలవృత్తములో కూర్చబడిన ఆ పద్యమిది.

శా. " శ్రీయున్భూమియునాగ ప్రాచిని ప్రతీచిన్ రుక్మిణీదేవి స
త్యా యోషామణియు న్మహోత్సుకత సేయన్మంగలన్మేడ్పుగే
ల్దోయిం దార్క్ష్యమరుత్సుతు ల్గొలువశ్రీదుండేలు ణా ప్రోలిమో
మైయాకామెపలిన్వసించు హరి నిత్యంబు న్మముం బ్రోవుతన్" [1]

ఇచ్చట ఒక విషయమును ప్రత్యేకముగా ప్రస్తావించక తప్పదు. అప్పయ్యగారికి హరిపై భక్తియే కాదు ఆ హరి సంబంధ ప్రతి వస్తువు ఆరాధనీయమే.అందుకే అప్పకవీయములో హరియొక్క - "కౌస్తుభము, శ్రీవత్సము, వైజయంతీ, మురళి, కౌశేయము, పంచాయుధములు, అనంతుడైన ఆదిశేషుడు, విష్వక్సేనుడు, దశావతారాలు, వైనతేయుడు, మారుతి, హరిపాద భక్తులు" ఇట్లు ఎవ్వరినీ వదలక స్తుతించుట కలదు. ఇట్టి స్తుతి వేరెవ్వరూ చేసినట్లు కన్పింపదు. ఇది చాలా అరుదు. ఆయా సందర్భములలో వీరి/వీటి ప్రస్తుతి ప్రస్తావింతము.

కౌస్తుభమును ప్రస్తావిస్తూ ప్రార్థించిన విషయము చూద్దాము.

కౌస్తుభము ఒక మణి. అద్దమువలె ఎదుటనున్న వస్తువులను ప్రతి ఫలింపజేయు శక్తి / స్వభావము గలది. అందులో తన బింబమును చూచి అలిగినది అబ్ధికన్య. ఆమె మనసెరిగిన మాధవుడు విషయమును విపులీకరించి, లక్ష్మి తన తనువులో గలదని, ఆమె చూచినది ఆమె ప్రతిబింబమనినాడు. సత్యమును గ్రహించి చిత్తములో ఆనందముతో చెలగినది లక్ష్మి. ఆరీతి ఆనందమును లచ్చికి కలగ చేసినట్టి మణియగు, కౌస్తుభమును మనసార తలచి

---

పాదసూచికలు: [1] అప్పక /పీ/1

నాడు మన కాకునూరి అప్పకవి తన గ్రంథములో.

గీ. " కమల యెందును దన రూపు గాంచి యలిగి

యాత్మ తరళాంతరమున నిజాధినాథు

తనువతడు చూప గని చిత్తమున చెలగు

నట్టి 'కౌస్తుభమణి' హృదయమున దలతు" [1]

ఆ అప్పకవి గారే తర్వాత వైజయంతికి వాగ్వైభవము కొరకు వందనము లిడినారు. ఆ వైజయంతి వననిధి నందనకు ఊయలవలె ఉన్నదట. ఈరీతిగా ఇతర కవులు కూడా కొందరు భావించినారు.

కం. " వననిధి నందన కుయ్యెలయనువున తనరారి వారిజాక్షుని వక్షం

బున నొప్పు 'వైజయంతీ' వనమాలిక నా కొసంగు వాగ్వైభవమున్" [2]

అప్పకవి గారి విష్ణు భక్తికి మేర లేదు. అందుకే చక్రి శ్రీవత్సమును కూడావిడువ లేదు. లచ్చి తన ఫాలభాగమున దిద్దిన తిలకమునకు తులగ వెలసినట్టిది విష్ణు వక్షమందలిపుట్టుమచ్చ 'శ్రీవత్సం' దానిని సంస్మరించిన విధము చూచెదము.

గీ. " కౌస్తుభంబును వనమాలికయును తనకు దిగువగా లచ్చి నొసలిపై దిద్దినట్టి

తిలకమునకు సమంబుగా వెలయునట్టి చక్రి శ్రీవత్స చిహ్నంబు సంస్మరింతు" [3]

వనరుహాక్షుడు, శేషశయనుడు అగు హరికి మించినదేమియూ లేదని ఇట్లనినారు. సాతత హేతి పరిజన వ్రాతంబుగా శేష శయను వనరుహ నయనున్ ఖ్యాతిగ 'నహారేస్తుపరస్తాత్' యనుట తెలిసి ఆ హరి పీతాంబరమును సహితము ప్రీతితో నుతించిన వాడు మన కాకునూరి అప్ప కవి. బాలకృష్ణుని లీలలను బహు సుందరముగా అచ్చ తెనుగు భాషలో మనకు అందించిన వాడు 'నీలాసుందరీపరిణయ' కర్త, " కూచిమంచి .తిమ్మన".

గీ. " కాలమేఘమునందు ప్రకాశమొందు కారు మెఱుగు తెఱంగున కైటభారి

యంసములపై వెలుంగు పీతాంబరంబు బంగరుచెఱంగు మాకు శుభంబు లొసగు" [4]

---

పాదసూచికలు: [1,2,3,4] [అప్పకవీ/పీఠిక/క్రమముగా/2,3,4,7

సీ. " కొఱమాలి విసమిడ్డ కఱకు రక్కసి చెండి పఱపు మీఱెడుబండి విఱుగద్రొక్కి

వెఱ గొప్ప ప్రేతల మొఱగి వెన్నలు మెక్కి తఱిసూచి మద్దులు పెఱికి పైచి

యఱ చేతకొండ చూపఱు వొగడగ బూని నెరి గిబ్బ తొలువేల్పు మురియడంచి

చిఱుత పాయపు గొల్ల తెఱవల వలపించి మఱవక పసుల పల్మఱును గాచి

గీ. వెఱపెఱుంగక మడువున నుఱికి కడిమి మెఱయటక్కరి విసదారి బిఱుసు తఱిమి

మఱియు పేరగు తులువలనుఱుము సేసివఱలు కఱివేల్పు నెదనెంతు గుఱిదలిర్ప" [1]

విష్ణుదేవుని పలు రూపములలో కొలచటముగలదు. 108 దివ్య తిరుపతులలో ఒకటి యని, దివ్య వైష్ణవ క్షేత్రాలలో ప్రముఖమైనదని ఖ్యాతి గడించినది, 'శ్రీరంగము' అచట వెలసిన దేవుడు శ్రీరంగనాథుడు. వైష్ణవ భక్తులైన ఆళ్వార్లు ఈ క్షేత్రమహిమను గానము చేసినారు. ప్రసిద్ధి చెందిన విప్రనారాయణుడను భక్తునిగాత ఇచ్చటి దేవాలయమునకు సంబంధించినది. ఆ కథే 'వైజయంతీవిలాసము' పేర ప్రబంధముగా సారంగు తమ్మయ్య కూర్చినాడు.

శ్రీరంగమందలి రంగనాథుని ప్రస్తుతిస్తూ ఇలా చెప్పబడిన 'ప్రసిద్ధ' శ్లోకము.

" సప్త ప్రాకారమధ్యే సరసిజ ముకుళోద్భాసమానే విమానే

కావేరిమధ్య దేశే ఫణి పతి శయనే శేషపర్యంక భాగే

నిద్రాముద్రాభి రామం కటినికటశిరః పార్శ్వవిన్యస్తహస్తం

పద్మా ధాత్రీ కరాభ్యాం పరిచిత చరణం రంగనాథం భజేహం"

'అహల్యా సంక్రందనము' పేర 'సముఖము వేంకటకృష్ణప్పనాయకుడు' ఒక ప్రబంధమును నిర్మించినాడు. ఆతడు తొలుత శ్రీరంగనాథుని కీర్తించినాడు. అచటసరోవరము 'చంద్రపుష్కరిణి 'యనియు మిగత 8 మందిరమునకు చుట్టుపట్ల కొద్ది దూరములో కలవని చెప్పటమున్నది.

-------------------------------------------

పాదసూచికలు: [1] నీలాసుంద /పీఠిక/3

ఉ.   " శ్రీ సొబగొందు నిందు సరసీ సరసీరుహ కేసరద్యుతిన్

వీసర వోకమీసరపు నిగ్గుల జగ్గుల దుప్పటిన్ దటి

ద్భాసిత నీల మేఘు మన భాసిలు రంగ నివాసు కౌస్తు భో

ల్లాసు రమాధివాసు సవిలాస మతిన్ నిరతిన్ నుతించెదన్" [1]

శ్రీరంగనాథుని స్తుతించిన వారిలో 'చేమకూర' వారొకరు. ఆయన ప్రతి పద్యములోనూ ఒక చమత్కారము చూపినవారు. 'విజయవిలాసము' నందు ఆ కవి గారు శ్రీరంగనాథుడు శ్రీరఘునాథ శౌరికి లోకైకవిభుత్వ మివ్వవలెనని ఆశించినారు.

ఉ. " శ్రీకలకంఠ కంఠియు ధరిత్రియు దక్షిణ వామ భాగముల్

గైకొని కొల్వ వారిగాదకన్ గడకన్నుల కాంతి తేల్చి తా

నాకమలాప్తతం  గువలయాప్తత తెల్పెడు రంగ భర్త లో

కైక విభుత్వమిచ్చు దయనచ్యుతు శ్రీ రఘునాథశౌరికిన్" [2]

'ముకుందవిలాసము'లో 'కాణాదం పెద్దన సోమయాజి' శౌరి స్తుతితో కావ్యారంభము చేసినారు. కృతిభర్త యగు తిరుమల రాయ నృపతిని సుశ్రీయుతునిగా చేయవలెనని ఆకాంక్షిస్తూ చేసిన తొలిపద్యమిది.

శా.  " శ్రీమేల్ గూర్చు భరింపుమీ  సకల ధాత్రీ రాజ్యము న్నీవ యం

చామోదాప్తి నొసంగు లీల వలనౌ హస్తంబునం దెల్పు నా

శ్రీమత్కేశవ శౌరి సాంద్ర కరుణాశ్రీ రంజిలన్ సద్గుణ

స్తోముం దిర్మలరాయ సోమ నృపతిన్ సుశ్రీయుతుం జేయుతన్" [3]

'శశాంక విజయము'లో 'శేషము వేంకటపతి' కృతిభర్త యగు వంగలశీనయ కాంచీ పుర వరదరాజుచే ఆయురారోగ్యములను అందుకొనుగాక యని అభిలషించినాడు.

---

పాదసూచికలు: [1] అహల్యా సంక్ర/అవతా/1/సముఖం [2] వి.విలా/2  [3] ముకుం/1

శా. "శ్రీవిన్నాణపు గుబ్బ చన్నుల నయారే! గంబురాగుప్పి, ము

క్తావల్లుల్ ఘటియించె దేమి? శశికిన్ దా రాప్తి యుక్తంబనే

భావంబో?' యని పల్కికల్కి చెలి సంభావించు కాంచీ పురీ

దేవుండీవుత సీన యార్య మణికిన్ దీర్ఘాయు రారోగ్యముల్" [1]

కవిసార్వభౌముడగు 'శ్రీనాథుడు' తన 'హరవిలాసము'నందు కృతిభర్త యగుఅవచి దేవ తిప్పయను (విష్ణు) కంచినగరవాసుడు వరదరాజు కృతార్థునిగాచేయ కోరుట చూడగలము.

ఉ. " శ్రీ మహిళా పయోధర హరిన్మణి హారము హస్తి భూధర

స్వామి, పయోజ సంభవుని జన్నము గాచిన వేల్పు దేవతా

గ్రామణి కంచి శ్రీ వరదరాజు మనోహర పుణ్యకోటి వీ

థీ మణి మండితుండవచి దేవయ తిప్పకృతార్థు జేయుతన్" [2]

విద్వదౌషధమనబడు నైషధమును తెనుగున కూర్చినవాడు కవిసార్వ భౌముడు శ్రీనాథుడు. అందులో కృతిభర్త యగు మామిడి పెద్దమంత్రి సుతుడగు సింగామాత్యుని కృతార్థుజేయవలెనని, శ్రీ భూరమణుల రమణుడగు నారాయణుని నుతించుట చూడగలము.

శా. " శ్రీరామా కుచమండలీ మృగమద శ్రీగంధ సంవాసిత

స్ఫారోదార భుజాంతరుండు ధరణీ సంశ్లేష సంభావనా

పారీణుండు కృతార్థు జేయు కరుణా పాథోధి పద్మాక్షు డిం

పారన్ మామిడి పెద్ద మంత్రి సుతు సింగామాత్యచూడామణిన్" [3]

'పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు' తన 'శృంగార శాకుంతలము' లో అనుకంపకు వాసమైన వాడు వాసుదేవుడనుచూ రాజీవాక్షుండగు లక్ష్మీ ప్రాణ నాథుని కృతిభర్త యగు విద్యావిఖ్యాతుడైన మంత్రి వెన్నని నితాంత శ్రీయుతుని చేయమని కోరటము చూడగలము.

---

పాదసూచికలు: [1] శశాంక/శేషము/అవతా/1 [2] హర/1 [3] శృంనై1

శా. " శ్రీవత్సాంకుడు భక్త వత్సలుడు లక్ష్మీ ప్రాణ నాథుండు రా

జీవాక్షుండు సమస్త భూత భువన క్షేమంక రానిక రూ

పావిర్భావుడు వాసుదేవుడనుకంపావాసుడై దాన వి

ద్యావిఖ్యాతుని మంత్రి వెన్నని నితాంత శ్రీయుతుం జేయుతన్" [1]

6.2 <u>*లక్ష్మీ స్తుతులు*</u> :

" లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం

దాసీ భూత సమస్త దేవ వనితాం లోకైకదీపాంకురాం

శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం

త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం" [<u>ప్రసిద్ధ</u> <u>స్తోత్రమ్</u>]

"లక్ష్మీః పద్మాలయా పద్మా కమలా శ్రీర్హరి ప్రియా

ఇందిరా లోకమాతా మా రామా మంగళ దేవతా

భార్గవీ లోకజననీ క్షీర సాగర కన్యకా " [2]

అని కమలకు పలు నామములు గలవు. జగత్తును భరించువాడు విష్ణువు కనుక లక్ష్మి త్రైలోక్యములు తన కుటుంబములుగ కలిగినది. పాలకడలి పట్టి. బ్రహ్మేంద్రాదులకు ఈమె కడకంటి కరుణ వలన సంపదలు కలిగినవి. మదనుని మాత. సంపదలకు నిలయమైన మకరాలయమునందు జననమందినది. పండిత సూక్తుల తోడుత తుండంబులు సాచి తీర్థ తోయములెల్లం కుండముల ముంచిదిగ్వేదండంబులు జలక మార్చగా లక్ష్మికి, పలువురు పలు కానుకలు సమర్పించినారు.

తనను కోరుచున్న బృందారక బృందమును పరిశీలించి అందులో తగిన వాడని వెన్నుని మన్ననతో ఎన్నుకున్నది. ఆ ఎన్నుకోవడము అద్భుతముగా వర్ణించినారు పోతన మహాశయుడు. ఇది ఆ లక్ష్మికే తగినది.

---

పాదసూచికలు: [1] శ్రృం. శా /1 [2] అమరకోశం పుట 32.

సీ. “ ఐదువన్నె యుండ నలవడ దొక చోట
నొకచోట సవతితో నోర్వరాదు
తగ నొకచోట సంతత వైభవంబుగా
దొకచోట వేడిమినుండ బోల
దొకచోట కరుణ లేదొక్కింత వెదకిన
నొకచోట డగ్గఱి యుండబెట్ట
నెఱయంగ నొకచోట నిలుకడ చాలదు
చర్చింప నొకచోట జడత గలదు

ఆ. కొన్ని చోట్లు కామగుణ గరిష్ఠంబులు
క్రోధ సంయుతములు గొన్ని యెడల
కొన్ని మోహలోభ కుంఠితంబులు కొన్ని
ప్రమద మత్సరాను భావకములు’ [1]

అని చింతించి, వరుసకు సవతులు లేని, వైభవముతో కూడిన గేహముకల, శృంగార శీతల చందనుడైన, కరుణామూర్తి, విమలుడు, నిలుకడకల వాడు, సాధురక్షకుడు మున్నగు సల్లక్షణములుకల ముకుందుని మెడలో పుష్పదామకము వేసి వరించిన జాణ ఆ లక్ష్మి. ఆ హరిసతికి పోతన అర్పించిన స్తుతిని చూద్దాము.

ఉ. హరికింబట్టపుదేవి, పున్నెముల ప్రోవర్థంపు పెన్నిక్క చం
దురు తోబుట్టువు, భారతీ గిరిసుతల్ తోనాడు పూబోడి తా
మరలందుండెడి ముద్దరాలు జగముల్ మన్నించు నిల్లాలు భా
సురతన్ లేములు వాపు తల్లి సిరి యిచ్చున్ నిత్య కల్యాణముల్ [2]

---

పాదసూచికలు: [1] పోత/స్కం/8/280 [2] పోతన/స్కం 1/11

లచ్చి చక్కని లక్షణములను పైన వివరించినాడు పోతనమహాకవి.

ఎల్లప్పుడూ తన గృహములో వసించవలెనని ఆశిస్తూ దంతులూరి బాపకవి, మూర్తి త్రయోపాఖ్యానము నందు ఇట్లు కీర్తించినారు.

సీ. 'కస్తూరి తిలక సంకలితాననాబ్జంబు
జాయమాన శశాంక శంక నీన
నతి రాగయోగ దృశ్యాధరాధరసీమ
మహిత ప్రవాళ సామగ్రి చూప
నతికృశోదర భాగ గతవళీ నిచయంబు
సలిల వీచీ విలాసంబు కూర్ప
రదకాంతి మిళితా విరళ మందహాసంబు
సముదీర్ణ ఫేన విభ్రమము పెంప

గీ. పితృసమాత్మస్వరూపయై యతుల భాగ్య
లక్షణముగన్న శ్రీమహాలక్ష్మి కమల
నేత్ర వక్షస్ స్థలీ నిత్యనిలయ యెపుడు
తిరముగా వసించుమద్గృహాంతరమునందు' [1]

ప్రబంధ కవులు వీలున్నచోట శృంగారమును వర్ణింపక వదలలేదు. అందులో సత్యభామ నాయిక. పారిజాతమును నారదుడు తెచ్చి ఇవ్వగా, మురారి దానిని రుక్మిణికి ఒసగినాడు. ఆ విషయము తెలిసి అలక వహించినది సత్యభామ. ఆమె అలకను తీర్చునట్టి సందర్భమును నిర్మించుకొనినాడు మన కవివరేణ్యుడు. కవి సమయాలు కలిసివచ్చినాయి. అది సరసపుటలుక. వెన్నుని ఆయుధములు → శార్ఙ్గము = ధనువు, సుదర్శనము = చక్రము, నందకము = ఖడ్గము, అబ్జము = శంఖము [పాంచజన్యము]. బహు చతురత కలవాడు హరి. చతుర్భుజుడు కూడ. కారణమేమో తెలియదు కానీ, సిరి

---

పాదసూచికలు: [1] మూర్తి త్రయోపాఖ్యానము /ప్రథమాశ్వా/4

అలిగినది. అలకను తొలగించుటకై ప్రయత్నములారంభించినాడు సిరిమగడు. తన వద్ద గల అన్ని ఆయుధములను వాడినాడు. ఆ ఆయుధములు సరిగా సిరి వద్ద ఉన్నవి. పొలయలుక తీర్ప శార్ఙమును ధరించు హస్తముతో కలిమి లేమ నడుముపై, సుదర్శనము ధారణ చేయు చేతిని కమల కటిపై, నందకమును పట్టు పాణితో ఆ పద్మాలయ వేణి పై, పాంచజన్యమను పేర  ప్రశస్తి పొందిన శంఖముపట్టు కరముతో ఆ భామ అందమైన కంధరముపై నుంచి నాలుగు చేతులతో సేవించి సుఖాంబుధిలో నోలలాడించినాడు. అట్టి సౌఖ్యజలధిలోతేలునట్టి లోకమాతయగు ఇందిర, నరదేవశిఖామణి యగు  కృష్ణదేవరాయని దయతో చూచుగాక! యని కవి కోరిక. చూడండి ఆ ప్రార్థన.

చ.   "సరసపుటల్క తీర్చు తఱి శార్ఙ సుదర్శన నంద కాబ్జ  సం

భరణ గుణాప్తి నెన్నడుముపై కటిపై జడపై గళంబుపై

హరినలుగేలు పైకొన సుఖాంబుధి నిచ్చలు నోలలాడు నిం

దిర కృప జూచుగాత! నరదేవ శిఖామణి కృష్ణ రాయనిన్"   పాదసూచికలు: [1]

'సార కాండము'లో నోంపల్లె కృష్ణమూర్తి గారు సారసదళనయనయైన సాగర కన్యను సంస్తుతించిన విధము ప్రస్తావించెదము.

చ.  " కలశ పయోధిభాస, వర కంజనివాస, సమస్త  భూత సం

కుల నటనానుకూల దృగ గోచరదివ్య విలాస, భవ్య ని

స్తుల ధనధాన్య సంపదభిశోభిత పావన దాస మానసో

ద్వలసన మందహాస మదభీష్టములిచ్చి శుభంబుగూర్చుతన్" [2]

ఆ భాసమానయైన లక్ష్మి  కంజనివాస, దివ్య విలాస, పావన దాస మరియూ మందహాస. 'కూచిమంచి తిమ్మకవి'గారు తమ అచ్చ తెనుగు రచనయైన 'నీలా సుందరీ పరిణయము' లో ఆ క్షీరాబ్ధి కన్య గరిమను వివరించిన తీరు చూద్దాము.

-----------------------------------------------------------------

పాదసూచికలు: [1]  పారిజా/ప్రథమా/4 [2] సారకాండ /7

ఉ. " కమ్మని తెమ్మ దెమ్మెరలు క్రమ్మగ నిమ్మగు తమ్మి మేడలో

తుమ్మెద కొమ్మ లెమ్మెలను దూకొని నీటుగా పాట పాడగా

కొమ్మని పూవు తేనియ కూరిమినామెత లిచ్చి నిచ్చలున్

నెమ్మదినుండు పాల్కడలి నెయ్యపుగూతురు మమ్ము బ్రోచుతన్" [1]

లక్ష్మి శ్రీరంగధామేశ్వరి. రంగమహీశు కొమ్మ. ఎలిమి, కలిమి, బలిమి నిడు ఆ ముద్దుగుమ్మను 'సముఖం' వారుతమ 'అహల్యా సంక్రందనము' నందు స్తుతించినతీరిది.

ఉ. " రంగ మహీశు కొమ్మ జిగి రంగుల బొమ్మ సంపదల్

పొంగుచునిచ్చుగుమ్మ పతిబొమ్మెడబాయని ముద్దుగుమ్మ య

య్యంగజు గన్నయమ్మ, శరణార్థికి వేలుపుమ్రానికొమ్మ నె

మ్మిం గరుణించి యిచ్చు నెలమిన్ కలిమిన్ బలిమిన్ తిరంబుగన్" [2]

చందురుని తోబుట్టువగు లచ్చిని మెచ్చుకొన్న చదువరి, రామరాజ భూషణుడు, 'వసుచరిత్ర' లో ఇందిరను ఇట్లు నుతించినాడు.

సీ. " సకలలోకాభినంద్య కలాకలాపంబు దొరయునెమ్మోముచందురునితోడ

బహుదివ్య ఫలపరిపాక సౌభాగ్యంబు నేర్చు కెమ్మోవి మానికముతోడ

నవవయశ్శ్రీ నిధానంబులై తగునురో భవ సుధాపూర్ణ కుంభముల తోడ

నమ్లాన సుమమాలికాభి రూప్యము దాల్చు లలిత భుజాకల్ప లతలతోడ

గీ. నడరి జనకాబ్ధిసీమ రామాభిదాన

హరి కహీన గుణప్రోత హర శరాస

గిరి మథన యత్నమున తోచు సిరి యశేష

రాజ్యము లొసంగు తిరుమల రాయమణికి" [3] [వసుచ/ప్రథమా/2]

---

పాదసూచికలు: [1] నీలాసుందరీ/తిమ్మన [2] అహల్యా సం/2' [3] వసుచ/ప్రథమా/2

సకల లోకములచే వందనములందునది, చంద్రబింబము వంటి వదనము కలది. మానికమువంటి మోవితో పలుదివ్య ఫలపరిపాకయైనది. సరికొత్త యవ్వనమువలన నిండుకుండలవంటి చనుగవకలది. మచ్చలేని సుమమాలిక వంటిది. లలితమైనట్టి భుజములు కలది. అహీనగుణ సంపన్నయై, హర ధనుర్భంగ సమయమున, పెంచిన తండ్రియగు జనకుని కూతురు జానకిగా, పాలకడలిని చిలుకునపుడు తండ్రియైన సముద్రుని తనయగాతోచు సిరి వలెను, భాసించు కలుముల తల్లిని స్తుతించినాడు.

'యయాతి చరిత్ర' తొలి అచ్చ తెనుగు కావ్యము. దీని కూర్పరి శ్రీ మదన గోపాల మంత్ర ప్రసాద లబ్ధ సారస్వత సుకవిజన వర్ణనీయ వచో విభవ భావనామాత్య తనూభవుడు, 'పొన్నికంటి వంశ్య తెలగనార్యుడు'. పొన్నగంటి అని ఇంటి పేరు వాడబడినది. పరంపరకు కొంత దూరముగా జరిగి గ్రంథమును రాసినాడు. ఇతని ఇట్టి రచనకు కారణములు మనము కొంత ఊహించ వీలుకలదు. కృతి పతి, కవిని –'పిలిచి పొన్నికంటి తెలగన్న, నీ చేయు నచ్చ తెనుగు కబ్బ మన్ని యెడల మించి వెలయగా నమీను ఖానునకిచ్చి పుడమిలోన సిరులపొగడుగనుమె! యని ప్రోత్సహించి, ' మున్నెవ్వరు నొడువని ఈ తెన్నిడి కడుమీఱి యచ్చ తెనుగుం కబ్బం బెన్నిక మీఱగ జెప్పిన నిన్నుం బొగడంగ కలడె? నెల తాల్ప యినస్' అని ప్రశంసలు కురిపించగ, మురిసినట్లున్నది కవి. కవి కృత్యాదిని పురుషాయిత రూప సంభోగ శృంగార ప్రస్తావన వలన యయాతి చరిత్రలో నాయిక దేవయానికి గల ప్రాముఖ్యత సూచించడమైనదని ధ్వనింపజేయుట కలదని చెప్పడమైనది. విష్ణువు పద్మనాభుడైన కతన లక్ష్మికి రతికేళిలో పురుషాయితము తప్ప అన్య మార్గము లేదు. ఆ చేష్ట శృంగారపరముగా పరాకాష్ట. లక్ష్మి నిత్య యౌవన , మరియు ప్రౌఢ.

ఇకమరో కోణమందలి వ్యాఖ్య, లక్ష్మి వెన్నుని కుడి కన్నుమూయుట యనగా, ఒక్క కన్ను మాత్రమే తెరచి యుంచబడినది. అది ఆహ్లాదకారి, అమృతకిరణు డైన చంద్రుడు. చంద్రధ్వజులైన మహమ్మదీయులు చాలావరకు దేశ పాలకులైనారు. కావ్యపరముగా, రాజకీయ పరముగా కూడా ఉచితమని తెలగనార్యుడుభావన చేసి యుండవచ్చని చెప్పడము కలదు. తెలగన వైష్ణవమతము ననుసరించువాడు. తనమతాచారము

ననుసరించి వెన్నునిదప్ప ఇతరులను స్తుతించరు. కృతిభర్త మహమ్మదీయుడు. మహమ్మదీయులు ఏకేశ్వరోపాసకులు. బహుదేవతా స్తుతి వారు పాటింపరు. 'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' కనుక ఆ కేశవుణ్ణే భావిస్తే / ప్రార్థిస్తే అందరినీ భావించినట్లే /ప్రార్థించినట్లే /పూజించినట్లే కదా! బహుశః కవిగారు ఇటులనే యోచించినారేమో అని అనుకోనుటలో దోషము లేదు.

తొలి పద్యమున "శ్రీ" కారము వాడనివాడు ఈ అచ్చ తెనుగు కవి వరుడు. తన గ్రంథమును ముస్లిం ప్రభువునకు అంకితమిచ్చెను. ఆచార్య ముమ్మటుని కావ్యప్రకాశ గ్రంథమునందలిది ఒక శ్లోకము చెప్పబడినది. అయ్యది

శ్లో|| "విపరీత రతే లక్ష్మీః బ్రహ్మాణాం దృష్ట్యా నాభి కమలస్థం,

హరేర్దక్షిణ నయనం రసాకులా ఝుడితి స్థగయతి"

{ సిరి, హరి - రతి క్రీడలోనున్నారు. వారి ఏకాంతమునకుభంగము కలిగిం చుచున్నరీతిలో హరి నాభి కమలమునందున్నాడు చతురాననుడు. మరునియంబ కది రసాకులత కలిగినది. మదనజనకుని కుడి కన్ను మూసినది. అది సూర్యుని స్థానము. పద్మినీ వల్లభుడు కనిపించకపోగ ముకుళించుకుపోయినది పద్మము. స్వేచ్ఛగ రసానందమందుకొనినది – ఇందిర. ఈ శృంగార చేష్టను తలచుకొని మాధవుడు మనసార నవ్వుకోవడం జరిగినది}. పై శ్లోకభావమును తన గ్రంథాదిని కూర్చినాడు 'యయాతి చరిత్ర' కర్త, చాతురితో పొన్నగంటి తెలగనార్యుడు.

చ. ' సిరుల మెఱుంగుబోడి తన చెక్కులు సిబ్బెపు గబ్బిగుబ్బలున్

బరువడి నాల్గు చేతులను పట్టగా నల్వదలంచి కేలుదా

మర కుడి కన్ను మూయుటకు మాటికి నవ్వెడు వెన్నుడింపుతో

తిరముగప్రోచుగావుత మదింజలరేగి యమీను ఖానునిన్'. [1]

---

పాదసూచికలు: [1] యయా/ప్రథ/1

కృతిభర్త యగు అమీనుని, వెన్నుడు ప్రోచుననుచు కవి ఆకాంక్షిచినాడు. స్త్రీ సహజ లజ్జ లచ్చికి కలిగినది. తమ మదనసామ్రాజ్య విహారములో మరొకరడ్డుగ నుండుట కిష్టపడనిది – పాల్కడలిపట్టి. తుదకు పద్మనాభుని పుత్రుడైన కమలజుడైనా సరే ! వెన్నుని కుడి కన్ను సూర్యుడే కదా ! అందుకే వెన్నుని కుడి కన్ను మూసినది. సూర్యుడు కన్పింపక పోవుటచే ముకుళించిన కమలములో స్థితు డైనాడు విరించి. సమస్య తొలగినది. ఈ చేష్టను మరి మరి తలచి నారాయణుడు నవ్వుచున్నాడు. నవ్వుచున్న వాడు నారాయణుడు గనుక ఇది హరి స్తుతి యని కొందరు చెప్పడము కలదు. తెలగనార్యుడు పరంపరాగతమైన 'శ్రీ' కార ప్రయోగమును, 'మ' గణముతోకానీ 'భ' గణముతో కానీ పద్యారంభమును చేయలేదు. 'శ్రీ' కి - వికృతి యగు, 'సిరి' తో, 'న' గణముతో [ చంపకమాలా వృత్తముతో ] పద్యమును ప్రారంభించినాడు. అచ్చ తెనుగున 'శ్రీ' కారము లేదు. మరొక అచ్చ తెనుగు కావ్యమైన, నీలాసుందరీ పరిణ యములో కూచిమంచితిమ్మకవి మొదట 'శ్రీ' కారమును ప్రయోగించినాడు. 'న' గణము కూడ ప్రాశస్త్యము కలిగినదే యని చెప్పడమున్నది.

సిరి యనిపుడు ప్రథమాక్షరమగు "సి" యందు '{స్+ఇ =సి} 'స్' కార 'ఇ' కారములు ఇందు స్ కారము ఇ కారము రెండును అగ్ని బీజాలు. ఇ కారము లక్ష్మీ బీజము. శ్రియమిచ్ఛేత్ హుతాశనాత్ అనుట ముందే చూచియున్నాము. 'న' గణము సకల భోగప్రదమని పలువురు నగణముతో తమ రచనలు కూర్చినటుల కలదు.

అప్పకవి 'న' గణము నకుగల ప్రశస్తిని ఇట్లు చెప్పదమున్నది.

సి. గ్రహములలోన భాస్కరుని విధంబున, తరులలో పారిజాతంబు కరణి
క్ష్మాధరంబులలోన కనకాద్రి కైవడి, నదులలో జహ్ను కన్యక విధమున
దైవతంబులలోన దైత్యారి చాడ్పున, ప్రమథులలోశూలపాణి పగిది
మృగములలోన కరిద్వేషి భాతిని, వివిధ విద్యలలోన వేదము క్రియ

గీ. క్షేత్రములలోన వారణాసీ స్థలంబు, ఠీవి నిభములలోన నైరావణంబు
రీతిగణములలోన జర్చించిచూడ "నగణ"మొప్పారు శుభనిధానంబుగాను. [1]

-----------------→ పాదసూచికలు: [1] అప్పక/4/74

సంపదలకాలవాలము సముద్ర రాజతనయ. ఆది శంకరులవారు కమలను ప్రార్థిస్తూ ఆమె ఘనతను పలురకములుగా శ్లాఘించినారు. జనుల నుదుట కమలగర్భుడు పాణితో వ్రాసిన రాతను ఈ మదనుని మాత కాలితో చెరపివేయగలదట. భార్గవిని ప్రస్తుతిస్తూ 'జక్కన', తన 'విక్రమార్క చరితము'లో రాజ శబ్దముపై చమత్కారముతో ఘనమైన సత్కారము చేసినాడు. ఆమె బంధువర్గమును పేర్కొనినాడు.

రాజు (చంద్రుడు) = సహోదరుడు. రతిరాజు (రతిపతి మదనుడు) = కుమారుడు

వాహినీ రాజు (సముద్రుడు) = తండ్రి. లోకములను పాలించు రాజు =విష్ణువు (పతి )

పైగా రాజమరాళయైన ఆమె రాజులచేత నుతుడైన, గుణరమ్యుడగు జన్నయకు

రాజ్యలక్ష్మిని ఒనగూర్చుగాక ! యని ఆశించినాడు.

ఉ. " రాజు సహోదరుండు రతిరాజు తనూజుఁడు తండ్రి వాహినీ
రాజు వరుండు లోకములరాజుగ రాజిత లీల నొప్పు నా
రాజమరాళయాన సిరి రాజ్య రమా రమణీయు జేయుతన్
రాజనుత ప్రతాప గుణ రమ్యునిజననాయ సిద్ధ ధీమణిన్" [1]

కవులు/ కవయిత్రులు కొందరు ఇట్టి పద చమత్కారములను పద్యములలో చూపినారు. 'రాజ' శబ్దమును గ్రహించి మొల్ల చేసిన ప్రయోగమును కూడా ఒకింత చూచెదము.

ఉ. "రాజులు కాంతి యందు, రతి రాజులు రూపమునందు, వాహినీ
రాజులు దానమందు, మృగరాజులు విక్రమ కేళియందు, గో
రాజులు భోగమందు, దిన రాజులు సంతత తేజమందు, రా
రాజులు, మానమందు నగరమ్మున రాజకుమారులందరున్" [2]

రాజకుమారులు అందరూ > కాంతిలో చంద్రుని, రూపమునందు మదనుని, దానములో సముద్రుని, విక్రమములో సింహమును. తేజములో సూర్యుని, అభిమానములో రారాజుని, భోగములో గోరాజుకు సమమైనవారని, శాశ్వతముగా మొల్లమ్మ లిఖించినది .

---

పాదసూచికలు: [1] విక్ర/ఆశ్వా1 /5 [2] మొల్ల బాల/11

మల్కిభ రాముని మీద చెప్పబడిన 'రాజ' శబ్దము పైన గల చమత్కార పూర్వక చాటువు ఒకటి చెప్పబడినది దానిని చూద్దాము.

ఉ. " రాజును రాజుగాడతడు రాహుముఖంబున జిక్కె, వాహినీ

రాజును రాజుగాడతడు రామశరాహతి దూలె, దేవతా

రాజును రాజుగాడతడు రావణసూతికి నోడె, నాజిలో

రాజన రాజు, మల్కియిభ రాముడె రాజు ధరాతలంబునన్ " [1]

ఈ పద్యములో - చంద్రుడు రాహుగ్రస్తుడగుట వలన 'రాజు' అనిపించు కొనుటకు, సాగరుడు రామబాణమునకు చలించుట వలన, 'వాహినీరాజు' అనిపించుకొనుటకు, రావణుని కుమారుడగు మేఘనాదునిచేత ఓడిన ఇంద్రుడు, 'దేవతలరాజు' అనిపించు కొనుటకు, తగరట. ఆ ముర్వురిలో కల లోపములు లేనివాడగుటవలన, మల్కిభ రాముడె 'రాజు' అనిపించుకో తగినవాడు. అది చమత్కారము. ఇక పద్యము మొదటి మూడు పాదాలలోమొదటి పది అక్షరాలు ఒకటే! శబ్దముపైన అర్థముపైన కూడ విశేషమైన చమత్కారము చూపుట జరిగినది. తొమ్మిది పర్యాయములు రాజ శబ్దము ఆవృత్తమైనది. 14 పర్యాయాలు 'రా' అక్షరము పునరావృత్తమై ఒక సౌందర్యము చేకూర్చినది.

'దగ్గుపల్లి దుగ్గన' గారు తమ 'నాసికేతోపాఖ్యానము'లో ఈ రాజ శబ్దముపై తనదైన రీతిలో చమత్కరించినారు. చూడండి.

ఉ. " రాజు నవీన కాంతి రతి రాజు విలాసమునందు వాహినీ

రాజుగభీరతన్ ఖచరరాజు నిరంతరదాన శక్తి రా

రాజురమా సమృద్ధినని ప్రస్తుతి సేయగసర్వలోక సం

పూజితుడైనకొమ్మయ సుపుత్రుడు గంగన మించెనిమ్మహిన్" [2]

---

పాదసూచికలు: [1] తెలుగులో చాటు కవిత్వము. డా. సంగనభట్ల నరసయ్య./పుట 140]

[2] నాసికేతోపాఖ్యా /దుగ్గన/1-48

ఇచట ముఖ్యముగా కృతిభర్త సంబంధమైన విషయప్రస్తావన కలదు. 'రాజ' శబ్దమును వాడిన తీరు మాత్రమె చర్చితమైనది.

ఇట్టిదే ఋణపక్షములో {ఆంగ్లములో Negative aspect} రాజ శబ్దమునకు విపరీతమగు వ్యతిరేకమగు భావములో చెప్పడము చూడవచ్చును.

ఇందులో రేరాజుకు మచ్చ, రతి రాజైన మదనుడు శరీర రహితుడు, అంబికారాజు [ఈశ్వరుడు] దిగంబరుడు, మృగరాజు [సింహము] గుహలో వాసము చేయును. వీరందరూ తరాజులే [ త్రాసుల వంటివారు ] ధరలో యనటమున్నది. ఇది అడిదం సూరకవి చాటువుగా ప్రసిద్ధమైనది. ఆ పద్యమును ఒకసారి పరిశీలిద్దాము.

ఉ. " రాజు కళంక మూర్తి రతిరాజు శరీరవిహీను డంబికా

రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతర సీమ వర్తి వి

భ్రాజిత పూసపాడ్వి జయరామనృపాలుడు రాజుగాక యీ

రాజులు రాజులే పెనుతరాజులు గాక ధరాతలంబునన్ [1]

మగని తొమ్మెక్కిన కొమ్మ , వాగ్దేవికి అత్తగారు, కలుముల లలన అయిన లచ్చిని స్తుతిస్తూ, 'మట్ల అనంతరాజు', తన 'కకుత్ స్థవిజయము'లో చెప్పిన పద్యము చూద్దాం.

సీ. " శ్రీవత్సమునకు నెచ్చెలి చేయునే చెల్వ కుచ కురంగ మదంబు కుదురు కొలిపి

కాపుంచు చైతన్య కల కౌస్తుభంబున నేయంబ ప్రతిబింబ మేఱు పఱచి

వైజయంతికి నొకవరుస మొల్లలుగ్రుచ్చు చిఱునవ్వుకులికి యే చిగురుబోడి

యొఱపు జూపుల కాంచనోత్తరీయములకు మీనంచు వ్రాయునే మెచ్చులాడి

గీ. మగని తొమ్మెక్కనే కొమ్మ మనుచు వేడ్క నమ్మహాదేవి వాగ్దేవి యత్తగారు

మధురశీతలసురభి వాఙ్మయతరంగ తతుల మజ్జిహ్వాప్రవహింపతలచుగాత![2]

---

పాదసూచికలు: [1] అడిదం/సూరకవి/ ప్రసిద్ధ చాటువు [తెలు/చాటు/కవి/పుట/140]

[2] మట్ల/కకుత్/ప్రథమా/2

'శారదామూర్తి' కృత 'నరసభూపాలీయము'లో శ్రీదేవిని కవి కడలి రాచూలిగా, చంద్ర సహోదరిగా, కందర్పుని మాతగా, దనుజారి యగు హరి ఇల్లాలిగా వర్ణనలతో నిర్ణయించాడు. ఆ స్తోత్రమును ఒకసారి చూచెదము.

సీ. ఏలేము కడలిరాచూలి యౌటెఱిగించు కలితవళీతరంగములరంగు
ఏ మానినీ రత్న మిందుసోదరియౌటప్రకటించు మొగముపోలిక తెఱంగు
ఏ తన్వి కందర్పమాతయౌ టెఱిగించు కరగృహీతాంభోజ కాండకలన
ఏ సాధ్వి దనుజారియిల్లాలవుట తెల్పు నలివినీలాబ్జ జిన్నయన గరిమ

గీ. యట్టి శ్రీదేవి సుకవివాగమృతదంబు, నఖిలభువనోన్నతము నైన యౌబళేంద్ర
నరసవిభుమందిరంబాత్మ శరణమనుచునుండియేకాలమును బాయకుండుగాత![1]

వళులను కడలి తరంగములుగ, నిండు ముఖము చంద్రబింబముగా, చేతి యందలి లీలాకమలము కందర్ప జననిగా , కనుల కాంతి దనుజారి ఇల్లాలుగా ఆమె గుణ గణములను విశదపరచినవి. ఆమె గరిమను ఘనతను వివరించినవి.

'పాపరాజు' తన 'ఉత్తర రామాయణము'లో కలిమి చెలువను కొలిచిన తీరుచూద్దాం.

సీ. " పుష్కర విహరణ స్ఫురణంబు వహియించియచలాను గుణ వృత్తి యవధరించి
యార్యాభి గణ్య సౌకర్యంబును రహించిప్రబల హిరణ్య వర్ధనత మించి
త్రిభువనాంచిత రూప విభవంబు ప్రాపించిభృగు కులంబు పవిత్రముగ జనించి
యంభోధి భంగ లీలాసక్తి వర్తించి కామ పాలన రీతి ఖ్యాతి గాంచి

గీ. పుణ్య జనముల పూజనములు గ్రహించి కలికితనమెందు నిట్టిది కలదె యనగ
జెలువు చెలువుననలువొందు కలిమిచెలువమెచ్చి నిచ్చలు మాకోర్కు లిచ్చుగాత! [2]

లోకమాత ఇందిర. గోవిందుని డెందము ఆమె వసించు మందిరము. కౌస్తుభము, వైజయంతి, శ్రీ వత్సము ఆమెకు మనోజ్ఞమైన ఇరుగు పొరుగు. గోవిందు హృదయార విందమునందు నొగియించిన ఆమె తన భక్తులను యింపగు చూపులతోదయజూచు

---

పాదసూచికలు: [1] నరస/ప్రథమా/2, [2] కంకంటి పాప/ఉత్తర రామా/పీ/2

గాక –అన్నాడు నృసింహ పురాణములో ఎఱ్ఱన. ఉత్పలమాలవృత్తమును కమలవాసినికి సమర్పించినాడు.

ఉ. " చందన చారుపత్రకము సంస్తుత కౌస్తుభ కర్ణికంబున

స్పందిత లాంఛన భ్రమరసంగమ మనోజ్ఞము నైనయట్టి గో

విందునురస్థలంబ యరవిందముగా నొగియించియున్న య

య్యిందిరసూచుగాట కృపనింపగు చూపుల భక్త సంతతిన్" [1]

ఇచ్చట గోవిందుని ఉరమే కమలమని రూపించుట కవి ప్రతిభ. చందనపు పూత పత్రములుగా కౌస్తుభము కర్ణికగ విలసిల్లిన హరియురమే అందమైన అరవిందమై ఆ యిందిరకు సుందరవాసంబైనది.

'శశాంకవిజయము'లో 'శేషము వేంకటపతి' శ్రీలక్ష్మిని, దేవర యురమందు కుల్కు 'రమ' యని అభివర్ణించినారు. ఆ దేవి స్తనములు, వాతెఱ, నాభి మున్నగు వాటిని ప్రస్తావిస్తూ ప్రశంసించినారు.

చ. " సరసివి గాన జక్కవలె చన్నులు గావివి పద్మినీ కులా

భరణవు గాన తెనియయే, వాతెఱగాదిది, కాలమి చూపు పెన్

గరితవు గాన బొంబిలమె నాభిక గాదనినాన దీర్పు దే

వర యురమందు గుల్కు రమ వంగలసీనయ యింటనిల్పుతన్" [2]

మదనుని మాతను కవి 'మరింగంటి సింగరాచార్యులవారు' తమ[నిరోష్ఠ్యరామాయణము] 'దశరథరాజనందన చరిత్ర'లో ఈ రీతిగా నుతించినారు. ఆమె తమగృహసీమలో స్థిరముగా నుండ అపేక్షించినారు. ఆ కమలకు ఒక చంపకమాలతో అర్చన చేసినారు.

---

పాదసూచికలు: [1] నృసిం/ఎర్ర/పీ/2, [2] శశాంక/శేషము వేంకట/అవతా/2

చ. "తనయనురాగ వృద్ధి విదితంబుగ వెన్నుడు చూపు వోల్కి చ
క్కని యురమందు భాసిలెడు కౌస్తుభరత్నము చేత చూడగా
చనువు పసిండి బొమ్మ క్రియ సంతసమొప్ప వసించునట్టి ఆ
ననవిలుకాని తల్లియగు నాతుక మా గృహసీమ నుండుతన్'[1]

6.3 ***ఆదిలక్ష్మి స్తుతులు*:** విష్ణువు పత్నిగా పేర్కొనబడు లక్ష్మీదేవిని పలువురు పలురకములుగా భావించి, వ్యాఖ్యానించినారని చెప్పవచ్చు. శక్తి స్వరూపము ఒకటేయైనను, లౌకిక భావనలో విభిన్నమైన నామములు, రూపములు కల్పించుట కలదు. అసలు లక్ష్మి అనగా.."లక్ష్యతే సర్వో(అ)నయేతి లక్ష్మీః { ఈమె చేత సర్వము చూడ బడును గావున లక్ష్మి . [లక్ష దర్శనాంకయోః]. సర్వమును సందర్శించును కనుక ఈమె లక్ష్మి. ఇక సాధారణ నిఘంటువులు 'లక్ష్మి' అను పదమునకు ఇచ్చిన అర్థములు > రమ, సంపద, వస్త్ర భూషణాదులవలన కలుగు శోభ..ఇత్యాదులు. లక్ష్మీదేవికి కవులు వారి వారిఅనుభవముల దృష్ట్యా చమత్కారములతో కొన్ని కవితా రూప సత్కారములను చేయటము చూడగలము. లక్ష్మి దేవికి కొందరు [8] ఎనిమిది రూపములను కూడా ప్రసాదించినారు. ఆ రూపములు క్రమముగా....

ధనలక్ష్మి ధాన్యలక్ష్మి జయలక్ష్మి బలలక్ష్మి
ధైర్య లక్ష్మి రాజ్యలక్ష్మి సంపల్లక్ష్మి మోక్షలక్ష్మి అనునవి ఒక ప్రకారము కాగా, మరొక ప్రకారము 'అష్ట లక్ష్మి' స్తోత్రములో సాక్షాత్కరించు లక్ష్ములకు కొద్ది వ్యత్యాసము చూడగలము. ఇచ్చట ఆదిలక్ష్మి , విద్యాలక్ష్మి, విజయలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, అను మూర్తులు - జయ, సంపత్, మోక్ష, రాజ్య లక్ష్ములకు బదులుగా పేర్కోవటం చూడగలము. పలు పర్యాయ పదములు కలిగిన కారణమున ఇట్టి ప్రయోగములు మనకు తటస్థించును. 'జయ జయ హే మధుసూదనకామిని' యను రచన ఈ రీతి వర్ణనాయుత సంగీత ప్రక్రియ కల, అష్ట లక్ష్మి స్తుతిలోయున్నది.

---

పాదసూచికలు: [1] దశరథరాజనందన చరిత్ర/ మరింగంటి సింగరాచార్యులవారు' 1 /3

ప్రత్యేకముగా ఆదిలక్ష్మి ప్రస్తావనతో స్తుతి యొనర్చిన కవుల రచనలను చూద్దాము. ఇచ్చట పేర్కొబడిన విశేషములన్నియు సాధారణముగా శ్రీదేవి [లక్ష్మి] కి చెప్పబడునవే! శ్రీమత్పరమపదమనాథ, నిరవధిక కృపా పరిపాక, పరిచిత సరస కవితా సనాథుడైన, 'తెనాలి రామకృష్ణ' కవి తన 'పాండురంగమాహాత్మ్యము' లో శ్రీదేవిని 'ఆదిలక్ష్మి' యని చేసిన అభినుతిని ప్రస్తావించుదాము. ఆజన్మ శ్రీమంతురాలు, వెన్నెల కాయువేల్పునకు తోబుట్టువు, చక్రి హృదయవాసిని, దిగ్గజములచచేత అభిషేకము చేయించుకొనెడు దివ్యమూర్తి, జవళి సరకుగా నవనిధానములను కలిగిన మహాదేవి శ్రీదేవి.

సీ. " అవతారమందె నే యఖిలైక జనయిత్రి
కలశ రత్నాకర గర్భ సీమ
తోబుట్టువయ్యెనే తులిత కాంచనవర్ణ
వెలది వెన్నెల కాయు వేల్పునకును
పాయకయుండు నేపరమపావన మూర్తి
చక్రి బాహామధ్య సౌధవీధి
అభిషేకమాడునే యభివర్ణితాచార
దిగ్గజానీతమౌ తేటనీట,

గీ. నవనిధానంబులేదేవి జవళి సరకు
ల్మహాదేవి శ్రీదేవి యాదిలక్ష్మి
సరస శుభ దృష్టి రామానుజయ్యసుతుని
నాదరించు విరూరి వేదాద్రినాథు" [1]

తన 'అనిరుద్ధచరిత్రము'లో మంగళాచల నృసింహ భక్తుడైన 'కనుపర్తి అబ్బయా మాత్యుడు' ఆదిలక్ష్మిని స్తోత్రము చేయుట చూడగలము. ఆ ఆదిలక్ష్మి కలిమికి పుట్టినిల్లు. సురకన్యలకేలికసాని. విద్యలచెలియైన పలుకుల లలనకు ఈ కలుముల లలన అత్తగారు.

---

పాదసూచికలు: [1] పాండురం/ప్రథమా /2/తెనాలిరామకవి.

ధన ధాన్య రాశి. ముజ్జగముల కన్న తల్లి, శౌరికి కులసతి. సర్వశుభ లక్షణ లక్షితయగు ఆ ఆదిలక్ష్మిని స్తుతిచేసిన తీరు చూద్దాము.

చ. " కలిమికి పుట్టినిల్లు సురకన్యల కేలికసాని ముజ్జగం

బులకును కన్నతల్లి కృతపుణ్యులకున్ ధన ధాన్యరాశి వి

ద్యలచెలి కత్తగారు, కలశాబ్ధికి కూరిమి పట్టి శౌరికిన్

కులసతి, ఆదిలక్ష్మి దయకుల్కెడి చూపులమమ్ము బ్రోవుతన్"[1]

అప్పకవీయములో శ్రీదేవి భూదేవిని కలిపి స్తుతించినాడు అప్పకవి.

శా. " శ్రీమన్మంద కటాక్ష వీక్షణము పైజిల్కం పయోజేక్షణుం

డామోదంబుననర్మ గర్భసరసస్వాలాపముల్ పల్కగా

వేమాఱుం దరహాస మాననమునం పెంపొందగా కొల్చు శ్రీ

భూముల్ నిచ్చలు మా కొసంగుదురు సంపూర్ణంబుగా నిచ్చలన్"[2]

తన 'శృంగార శాకుంతలము'లో 'పినవీరభద్రుడు' తన కృతిపతియగు వెన్నయ ప్రభుని మందిర రాజములో వసించుమని 'ఆదిమ లక్ష్మి'ని అభ్యర్థించుట కలదు. ఆ ఆదిలక్ష్మి ఆవాసము తమ్మి పూవు. చంద్రముఖి.

ఉ. " మెచ్చగు విచ్చు తమ్మి పువు మేడలలోన నిధాన దేవత

ల్వచ్చి కటాక్ష సంజ్ఞకు కెలంకుల కొల్వగ నోలగంబు నొం

పచ్చగ నుండు చంద్ర ముఖి యాదిమ లక్ష్మి వసించు గావుతన్

మచ్చిక వెన్నయ ప్రభుని మందిర రాజమునందు నిచ్చలున్" [3]

గీ. శ్రీసుకర్పరధాముడౌ శ్రీనృసింహు సిరుల వక్షస్స్థలంబున శ్రీయనంగ

వెలయు శ్రీరాజ్యలక్ష్మిసేవించి దినము మదినిభావించి నుతియింతు మమతనెలమి. [4]

---

పాదసూచికలు: [1] అనిరు/అవ/4, [2] అప్పకవీ/పీ/10, [3] శృం/శాకుం 6, [4] దశర/ప్రథమ/2

6.4 ***శ్రీనరసింహస్వామి స్తుతులు :*** ప్రహ్లాదుని రక్షింప ప్రభవించిన మూర్తి నరహరి. ప్రసిద్ధమైన విష్ణుమూర్తి పది అవతారములలో మత్స్య, కూర్మ, వరాహముల తర్వాత సృజింప బడినది “నరసింహ” అవతారము. హిందూదేశ సాంస్కృతిక / పౌరాణిక సంప్రదాయములో జలచరములు, వనచరములు పిదప మానవులు ప్రభవించినారు. ఈ విషయము ఎట్లున్నను నరసింహుడు దక్షిణ దేశములోఅధికముగా నుతింపబడినాడు. ఎఱ్ఱన నృసింహపురాణమును రాసినారు. ఆంధ్ర దేశములో పలు ప్రసిద్ధమైన మందిరములు నరసింహునికి నిర్మితములైనవి. సింహాద్రి అప్పన్న, యాదగిరి, తరిగొండ, ఘటికాచలము [ ఇప్పుడు షోలింగర్ పేరున తమిళనాడులో యున్నది], అహోబలము [ఎగువ, దిగువ] కదిరి, పెంచలకోన, మంగళగిరి..... ఇలా చెప్పడము మొదలుపెడ్తే పెద్ద పద్దే తయారు కాగలదు. నరసింహుని స్తుతి 32 అక్షరములతో కూడినది. కనుకనే తాళ్ళపాక అన్నమయ్య 32000 సంకీర్తనలు చెప్పినాడని కొందరి భావన. ఒక్కొక్క అక్షరమునకు వెయ్యి సంకీర్తనలు చొప్పున. నరసిహుని సంబంధముగా చెప్పబడు శ్లోకము చూడండి.

“ ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం ” [ప్రసిద్ధము]

చ . ‘ధర నరసింహ రూపమున దైత్యకుమారుని వేగ బ్రోవ దు
ష్కర సమదారి నత్తరి నఖండ బలోద్ధతి కూల్చి లోక సం
భరణ మొనర్చినట్టి హరి భక్తి తలంచెద సూరి దత్తమౌ
వరకవి సింహ నామము శుభస్థితి నిల్వగ నన్ను కావగాన్’ [1]

వేంకటపతిమీద వేలకొలది సంకీర్తనలను కుప్ప తెప్పలుగ కూర్చినవాడు తొలితెలుగు సంకీర్తనాచార్యుడు తాళ్ళపాక అన్నమాచార్యులు . రామానుజ సిద్ధాంతమును పూర్తిగా

---

పాదసూచికలు: [1] సారకాండ/16

ఒంటపట్టించుకొని తిరుమలగిరివాసుని సేవలో మునిగిన వాడు. తర్వాతి తరములను తనవెంట నడచులాగు చేయగల్గిన చైతన్యమూర్తి అన్నమయ్య.

వెంకన్నతో పాటుగా పలు నరసింహుని కీర్తనలను కూర్చిన భక్తుడు ఇతడు.

తెలుగు భారత కర్తలలో మూడవ వాడు, శంభుదాసబిరుదాంకితుడు, ఎర్రాప్రగడ. ఆతడు "నృసింహపురాణ" కర్త.అందులో ఆతడు తనగ్రంథములో లోకములను ఉత్తమశ్లోకుడగు, నారసింహుడు రక్షింపవలయునని ఆకాంక్షించినాడు.

ఉ. " శ్రీకి నిరంతరంబు కడు చెన్నెసలారెడు రాగలీల ను

తే్సకముబొంది యొప్పు తన చిత్తము జూపెడు మాడ్కి నిత్య ర

మ్యాకృతి యైన కౌస్తుభము నక్కుపయిం బచరించునుత్తమ

శ్లోకుడహోబలేశుడతి లోకుడు లోకము గాచు గావుతన్" [1]

ముంగిట కల్ప తరువు, నివేశంబులో మూల ధనము, బంగరు వాన ముంగొంగు పసిడి, చేతిలోని మాణిక్యము, కోరికలు తీర్చు పంట, జగములో ఇటువంటి దేవునికి సమము లేరనుచు 'కనుపర్తి అబ్బయామాత్యుడు' తన 'అనిరుద్ధ చరిత్రములో' ఆ నరమృగశరీరుని ఈ రీతిగా నుతించినాడు.

శా. " శ్రీనిత్యోత్సవ మందిరంబు లగు లక్ష్మీ మోహనాపాంగ వీ

క్షా నీలోత్పల మాలికావళులు శృంగారంబుగా నంగ పూ

జానైపథ్య మెలర్ప దత్తనులతా సంశ్లిష్ట కేళిం ప్రియా

సూనుండై తగు మంగళాచల నృసింహుండిచ్చు మా కోరికల్" [2]

మంగళగిరి యని సాధారణముగా పిలువబడు నృసింహ క్షేత్రము ఒక ప్రసిద్ధ పుణ్య స్థలము. నారసింహుడు ఇచ్చట 'గుడజలము' నైవేద్యముగా స్వీకరించును. దానికి కారణము కవి అబ్బయ అవతారికలో చెప్పినారు. పానకాల నరసింహస్వామిగా ఇక్కడ స్వామిని పిలుతురు. ఆ పానకము కూడా తయారు చేయు విధము చెప్పడమైనది.

-----------------------------------------------------------

పాదసూచికలు: [1] నృసింహ/ఎఱ్ఱన/పీ/1 [2] అని/1

'మిరియంబు లేలకులు మెదిపి చక్కెరతోడ కలిపి తియ్యని పానకమ్ము చేసి' అర్పించగా సగము స్వామికి చ్చి, సగము  ప్రసాదముగా భక్తులకు ఇవ్వడము సంప్రదాయము. దీనికి కారణము  ఆ దేవ దేవుడు

సీ.  " వేంకటాచలమున వేసట నొందక
వడలు భుజింపగా పొడము దప్పి
శ్రీరంగమున నాస తీఅంగ పొంగళ్ళు
భోజనంబొనరింప పొడము దప్పి
కాంచీపురంబులో కాంక్ష కొద్దిని జేరి
యిడ్డెనల్ భక్షింప నెసగు దప్పి
యళగిరి స్థలమున నాపోవగా దోసె
లారగించిన పుట్టినట్టి దప్పి

గీ.  అర్చక స్తోమ హస్త శంఖాగ్ర ముక్త
లలిత గుడ జలధారా ఘుళం ఘుళాయ
మాన పానీయ మహిమచే నణచి కొనుచు
జలజనాభుండు మంగళా చలమునందు" [1]

తిరుమల లో నేతివడలు [ఇప్పుడు లడ్డు ప్రసిద్ధి చెందినా], శ్రీరంగములో పొంగళ్ళు, కాంచీ నగరములో యిడ్డెనలు దక్షిణ మధుర [అళగిరి] లో దోసెలు నైవేద్యముగా అర్పించడము ఆనవాయితీ. వాటిని తినిన కారణమున అధికమైన దప్పి / దాహము స్వామికి కలిగినది. దానిని తొలగించుటకై ఆయన అర్చక సమూహముచే నైవేద్యముగా సమర్పింప బడు 'పానకము' తాగి కొంత ఉపశమనము పొందుచున్నారట! ఇందులో ఆయా ప్రాంతములలో ప్రత్యేకతలు మనము గ్రహింప వీలగుచున్నది. 'దశరథరాజనందన చరిత్ర' అను గ్రంథములో తత్కర్త 'శతఘంటావధాన మరింగంటి సింగరాచార్య' కవి గారు కృత్యాది ప్రథమాశ్వాసములో

-----------------------------------------------

పాదసూచికలు: [1] అనిరు/అబ్బయ/అవ/41

నరసింహుడు ఇలువేలుపై నిలచి లోకమును సంరక్షించుగాక యనుచు నుతించుట కలదు. 'శ్రీ'కి వికృతి యగు, 'సిరి' తో పద్యారంభమైనది.

సీ. సిరివరించిన మేలు గిరిధరించిన కేలు
తనరువాడు శుభోక్తి నొనరువాడు
చిలువరాయని పాన్పు నలువ పాయని కాన్పు
కలుగువా డసురుల కలుగువాడు
పులుగు తత్తడి పోక జిలుగు పుత్తడి కోక
గట్టువాడు అమరులపట్టువాడు
తెలిదిన్నె పై అచ్చ మెలిగొన్న యెదమచ్చ
మెఱయువాడు కృపాబ్ధి నెఱయువాడు
గీ. హాటక నిశాట వక్షః కవాట వాట
పాటనోద్భట శతకోటి పతుల చటుల
శిత నఖంబులవాడు లక్ష్మీ నృసింహు
డెలమి మా ఇలువేలుపై నిలుచు గాక. [1]

[సారస్వత సర్వస్వమున ప్రథమాశ్వాసము ఈ పద్యముతో ప్రారంభము) అని పాదసూచికలో పేర్కొబడినది. పై సీసపద్యము అచ్చ తెలుగులో యుండగా, క్రిందిపద్యము ప్రాచీన సంప్రదాయమునననుసరించి శ్రీకార ఆరంభముతో, 'మసజసతతగ' శార్దూల వృత్తములో కూర్చబడినది.

మ. శ్రీరామామణి ఆననాంబుజముపైశృంగారముల్లుల్క క
స్తూరీ బిందు మరంద వాసనలకుస్ సొంపారు భృంగమ్ములో
నా రంజిలల్లెడు చూడ్కులందన ప్రియానందాబ్ధి నోలాడు – మా
వీర శ్రీ నరసింహుడెల్లప్పుడు నుర్విస్ మమ్ము రక్షించుతస్

---------------------------------

పాదసూచికలు: [1] దశర/ప్ర/1

6.5 ***శ్రీరాముని స్తుతులు :*** శ్రీ రాముని గురించి భారత దేశాన ఘనమైన అభిప్రాయము, అభిమానము కలదు.

శ్రీరాముని రూపమును కొంతవరకు ఇట్లు చెప్పడము చూడగలము.

'శ్రీ రాఘవం దశరథాత్మజమప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం
ఆజానుబాహుమరవిందదళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి'

అప్రమేయుడగు దశరథసూనుడు రఘు కులమునకు రత్నదీపమువంటివాడు. సీతకు పతియైన రాముడు ఆజానుబాహుడు. నిశాచారవినాశకుడైన ఆ రాముడు అరవింద దళాయత నయనుడు. నీలమేఘ శ్యాముడు. రామ కథ మానవుని పరిపూర్ణ పురుషునిగా చేయుటకు ఉపయోగకరమైనది. సీతా చరైతమని, పౌలస్త్య వధ యని, రామాయణమనిపేరు పొందినది రామకథ, అది ఎంత శాశ్వ తమంటే,

"యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే |
తావత్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి ||

{మహీతలముపై ఎంతవరకు గిరులు యుండునో, సరిత్తులు ప్రవహించునో అంత వరకు లోకములో రామకథ ప్రచారములో నుండును} రాముడు కావించిన కార్యములనేకరవు బెట్టినారు'నోంపల్లె కృష్ణమూర్తి' గారు 'సారకాండము'లో.

మ. " మొదటస్ రావణుజంపి సద్ద్విజ వచ స్స్ఫూర్తిస్ ధరిత్రీజతో
నదులంగ్రుంకి దశాశ్వమేధములనెన్నంజల్పి జాయా విలా
సదమౌరీతి జరించి స్త్రీసుతుల పజ్జం జేర్చికోదండ్ర గూ
ర్చిధరం బ్రోచి సమర్చ తెల్పి స్వపద శ్రీరాముడొందెస్ సతిస్" [1]

రామ నామము మూడు సార్లు పలికినచో విష్ణు సహస్రనామము పారాయణము చేసిన దానితో సమానమని చెప్పడమున్నది.

---

పాదసూచికలు: [1] సారకాండము / నోంపల్లె కృష్ణమూర్తి/3

విష్ణు సహస్ర నామమును విన్న పిదప పార్వతి పరమేశ్వరుని ఇట్లు ప్రశ్నించినది.

"కేనోపాయేన లఘునా విష్ణోర్నామ సహస్రకం ,

పఠ్యతే పండితైర్నిత్యం శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో!

{ పరమేశా! ఇంత విపులమైన విష్ణుసహస్రనామమును పండితులు ఎట్లు లఘు పద్ధతిలో పఠించుదురు? అను పార్వతి ప్రశ్నకు ఈశ్వరుని సమాధానమిది }

'శ్రీరామ రామ రామ' అని మూడు పర్యాయాలు పల్కిన అది విష్ణుసహస్రనామము పారాయణము చేసిన దానికి తుల్యమగును.

" శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే

సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే!

'రాముడు చేసినట్లు చేయడము, కృష్ణుడు చెప్పినట్లు చేయడము' అవసరమని పెద్దల సుద్ది. { Do as Raamaa did and do as Krishna said }. రామ శబ్దమునకు విస్తృతమైన అర్థము చెప్పడము కలదు. "రామ" అనగా పరబ్రహ్మ మునకు పేరు. "రామ" అనగా – రూప సంపదచే సంతోషింప చేయువాడు. {రమయతి మోదయతి రూప సంపదేతి రామః – అని నిర్వచనము }రామ అనగా బలరాముడని కూడ కలదు. కానీ ప్రస్తుతము మనము రామ / రామ సంబంధమైన అర్థమును, దశరథ తనయుడు కౌసల్య సుతుడు ఐన శ్రీరాముని సంబంధమైనదే!

మొల్ల తన రామాయణములో రాముని స్తుతించిన తీరు ఇట్లు చూడగలము.

ఉ. శ్రీమహిమాభిరాముడు వశిష్ఠమహామునిపూజితుండు సు

త్రామ వధూకళాభరణ రక్షకుడాశ్రిత పోషకుండు దూ

ర్వామలసన్నిభాంగుడు మహాగుణశాలి దయాపరుండు, శ్రీ

రాముడు ప్రోచు భక్తతతి రంజిలునట్లుగ నెల్లకాలమున్" [1]

-------------------------------------------

పాదసూచికలు: [1] మొల్ల/రామా/అవ1

పైన రాముడు మహిమతో అభిరాముడని, వశిష్ట మహాముని పూజితుడని, శచీదేవి కళాభరణ రక్షకుడని ఆశ్రిత పోషకుడని, దూర్వామలసన్నిభాంగుడని , మహా గుణ శాలి, దయాపరుడు, మున్నగు లక్షణములు రామునికి ఆపాదితములైనవి.

" శ్రీ సీతారామాంజనేయ సంవాదము " అను ఆధ్యాత్మిక గ్రంథకర్త, శ్రీమన్నారాయణ మహాదేవ గురుకరుణాకటాక్షవీక్షణ విమలీకృత నిజహృదయ కమలకర్ణికాన్తస్సందర్శి తాఖండ సచ్చిదానంద రసైక స్ఫూర్తి షట్చక్ర సీతారామమూర్తి 'పరశు రామ పంతుల లింగమూర్తి గురుమూర్తి'. గ్రంథ శీర్షికయే 'శ్రీ సీతారామాంజనేయ సంవాదము' రాముడు - కవి గారికి బ్రహ్మ స్వరూపము. కనుకనే ఆ సీతారామచంద్రుని ఆరాధించుచున్నాడు ఆ ఆరాధన ఇట్లున్నది.

శా. "శ్రీమద్దివ్య నిజాంఘ్రిపద్మములు సంసేవించు చున్ భక్తిచే
ధీమంతుండగునాంజనేయుని నసద్దేహేంద్రియాతీత చి
ద్భూమానందుడ వీవ నేనని కృప న్బోధించు శ్రీజానకీ
రామబ్రహ్మము నంతరంగమున నారాధింతు నశ్రాంతమున్" [1]

శ్రీ మద్రామచంద్ర చరణారవింద వందన పవన నందన ప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్య సర్వంకష చతుర్విధకవితా నిర్వాహకసాహిత్యరస పోషణుడగు రామరాజభూషణుడు, అతి చతురతతో కూర్చిన రెండు అర్థములు గల 'ద్వ్యర్థి' కావ్యము 'హరిశ్చంద్ర నలోపాఖ్యానము' . శ్రీరాముని పరమ భక్తుడైన వాడు రామరాజభూషణుడు. ఆతడు తన గ్రంథములో తొలుత చేసిన రామసన్నుతి ఇది.

శా. "శ్రీవైదేహసుతన్ భృగూద్వహజయశ్రీ నబ్జ భృచ్చాప లీ
లావాప్తిన్ వరియించి సత్కుశలవత్త్వామూల్య మాంగల్య దీ
క్షావాలంబగు నాపరిగ్రహ యుగం బన్యోన్య హార్దంబునన్
సేవింపందగు రామచంద్రుడు శుభశ్రీలిచ్చు మా కెల్లప్పుడున్" [2]

------------------------------------------------------------

పాదసూచికలు: [1] శ్రీసీతా/పీ/1 ] [2]హరి/ ఆవ/1

లంకాధిపుడగు రావణుని సంహరించి, విభీషణునికి లంకారాజ్యమిచ్చి అయోధ్యకు మరలి వచ్చిన శ్రీరాముడు రాజ్యాభిషిక్తుడయ్యాడు. ఆ సందర్భములో వీరాసనములో నున్న సపరివార సమేతుడైన రాముని చిత్రించిన రూపములో

" వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామండపే

మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితం,

అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం

వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలం" [ప్రసిద్ధ శ్లోకము]

దాదాపు ఇట్టి చిత్రమును మనకు నయన గోచరము చేసినారు కృష్ణమూర్తిగారు తమ రామాయణంలో[సారకాండము]

శా. శ్రీసీతాసతి వామభాగమున నర్థిన్ముందు సామీరి య

న్గౌసామిత్రియు వెన్కలన్ భారతుడున్ శత్రుఘ్నుడిర్వంకలం

డా సుగ్రీవ విభీషణాంగదులు వృద్ధా జాంబవంతుండు చు

ట్టై సేవింప రహించు రాము నసితాబ్జాభున్ భజింతున్ మదిన్ [1]

'బిల్హణీయము' 'పండిపెద్ది కృష్ణ స్వామి' ప్రణీతమైనదని, ఇయ్యది 'చిత్రకవి సింగరాచార్య ప్రణీతమని' వేరు వేరు ఉపపత్తులతో చెప్పడము కలదు. కవి ఎవరను నిర్ణయమును చారిత్రక పరిశోధకులకు విడచి, సాహిత్య దృష్ట్యా చూద్దాము. వాస్తవానికి ఇది ఒక అనువాదము. రెండు అంశాలు ముఖ్యమైనవి. రాజపుత్రికి గురువునకు మధ్య కాండపటమును నిర్మించుట. తర్వాత రహస్యము తెలిసి బిల్హణుని, రాజు శిక్షింప పూనుకొన్నాడు. నేర్పుతో బిల్హనుడు 'భ ' కారగుణింతము యముడు చేయుచున్నాడని 'భట్టి', 'భారవి', 'భుకుండు' పిదప 'భూపతి' యని చెప్పి ముప్పునుండి తప్పించుకొనినాడు. కథ సుఖాంతము. అవతారికలో కవి చేసిన తొలి పద్య రూప ప్రార్థన శ్రీ రాముని గురించి. అది ఇష్ట దేవతా ప్రార్థన.

-------------------------------------

పాదసూచికలు: [1] సారకాండము / నోంపల్లె కృష్ణమూర్తి /2

శ్రీరాముడు కల్పవృక్షము. అవనిజా సమేతుడై సీత యను లతతో పరివేష్టితుడైనాడు విశాల భుజములు శృంగార శాఖలుగా విలసిల్లుచున్నాయి. సార భూతములైన స్తబకములు భూజాత స్తనములుగా, అరాళములైన అలకలు భృంగములవలె ఒప్పుచుండగా పూలతో నిండి యున్న చక్కగ కోరికలు తీర్చు కల్ప తరువుగా నిలిచి బుధానందమై శ్రీరాముడు రక్షించుగాక యని కవి ఆశించుట చూడగలము.

శా. " శ్రీరామావనిజా నిజాయత భుజా శృంగార శాఖా మిళ

త్సారాకార లతా స్తన స్తబక భాస్వద్దంత వాసః కిసా

లారాళాలక భృంగ రంగ దఖిలాంగాంచ త్ప్రసూనోత్కర

శ్రీరామాకృతి కల్పకంబు మము రక్షించు బుధానందమై" [1]

అటుపై కవి 'భవ కమలసంభవాది' సమస్తదేవ ముఖ్యులకు ఒక్క కందములో మ్రొక్కినారు. ఇట్టి ప్రార్థనసే నన్నయ్య గారు [భారతములో ఆది పర్వము ప్రథమాశ్వాసములో21 వ పద్యము] తరలవృత్తములో చేసినారు.

కం. ' భవ సరసిజ సంభవ ముఖ

భువనస్థ సమస్త దేవ ముఖ్యుల కెలమిన్

ప్రవిమలమతి మ్రొక్కెద మ

త్కవితకుసంతతము సత్ప్రకాశముకలుగన్' [2]

శ్రీరామ పాదారవింద భజనానందుడు, జగత్ప్రాణ నందన కారుణ్య కటాక్ష లబ్ధ కవితా ధారా సుధారాశి సంజనితైకైక దిన ప్రబంధ ఘటికా సద్య శ్శతగ్రంథ కల్పనుడు, సంగీతరహస్యకళానిధి యగు 'రామరాజభూషణుడు', తన 'వసుచరిత్రము' ను శ్రీరాముని స్తుతితో ఆరంభించెను. ఆ రాముడూ దశరథనందనుడు కాడు. సీతాభామాపతి.

---------------------------------------------------

పాదసూచికలు: [1] బిల్వ/ఆవ/1 & 2

"శ్రీభూపుత్రి వివాహవేళ నిజ మంజీరాగ్ర రత్న స్వలీ
లాభి వ్యక్తి వరాంఘ్రి రేణు భవకన్యాలీల యంచున్మదిం
దాభావింప శుభ క్రమాకలనచే తద్రత్న ముంగప్పు సీ
తా భామాపతి ప్రోవుతం దిరుమలేంద్ర శ్రీ మహారాయనిన్." [1]

*సీత అందెలలోని మంచి రత్న ములోఆమె ప్రతి బింబము చూచి వేరొక నాతి యని భావించు అవకాశమునీయక, వివాహ సమయములో జరిపించు సన్నె కల్లు తొక్కించు ఆచారమును సరించి, తన పాదమును సీత కాలియందుగల రత్న ముపై పెట్టి భ్రమ కలుగనీయని శ్రీరాముడు, కృతి పతి యగు తిరుమలరాయని ప్రోచుగాక! అని ఆకాంక్షించినారు.*

*'సారంగు తమ్మయ' తన 'వైజయంతీ విలాసము'లో, లోకావనుడైన పెళ్ళికొడుకగు రాముడు అభీప్సితములు ఘటించుననుచు స్తుతించినాడు.*

ఉ. "శ్రీవసుధా సుతాంఘ్రి వివరింప శిరీష దళోపమాన, మీ
క్ష్మావరుకేల్నిసర్గ గుణ కర్కశ మశ్మము మెట్టబల్కె నె
ట్లీవసు ధా వరుండనుచు నింతులు వల్కగ నంట గొంచు లో
కావనుడైన పెండ్లి కొడుకస్మ దభీప్సితముల్ ఘటించుతన్" [2]

'గుమ్మరాజు రామకవి' గారు తమ 'చౌడేశ్వరీ మాహాత్మ్యము'ను శ్రీరామస్తుతితో మొదలు పెట్టారు. తన లీలా విభవమును రాముని వక్షమున చెన్నగు హారమునందు చూచి లక్ష్మియని తలచి, మదిలో తను వరించినది వెన్నునే యని మది ముదమొందు జానకీ ముదిత మనసెరిగినవాడై, దరహాసమొలికించు కృపానిధియగు దశరథుని తనయుదు రాముడు ప్రోచునని ఆశంసను తెలిపారు.

ఉ. " శ్రీవిలసిల్ల వక్షమున చెన్నగు హారమణి స్ఫురత్స్వలీ
లావిభవంబు సీతగని లచ్చిని వక్షమున న్వహించున
ద్దేవుని జాడతోపగ మదిన్ముదమొందుచునుండ తన్మనో
భావ మెఱింగి నవ్వెడు కృపానిధి రాముడు మమ్ము ప్రోచుతన్" [3]

---

పాదసూచికలు: [1] వసుచ/ప్రథమా/1 [2] వైజయం/ఆవ/1 [3] చౌడే/ప్రథ /1

ఇక్ష్వాకు వంశములో జన్మించిన మహార్ఘ రత్నము రాముడు. 'వాల్మీకి చరిత్రములో' కర్తయైన రఘునాథ నాయకుడు కావ్యము రామ స్తుతితో మొదలిడినాడు. వాల్మీకి రామాయణ కర్త. తొలిగచేసిన రఘునాథ నాయకుని పద్యము చూద్దాము.

శా. " శ్రీవైదేహి యురోజ పూర్ణ కలశీ శృంగంబులం పల్లవ
శ్రీ విన్యాసము జూపు హస్తములచే ప్రేమం ప్రకామంబుగా
శ్రీవిద్యాల్ నతకోటి కిచ్చు నల రాజీవాక్షు డిక్ష్వాకువం
శావిర్భూత మహార్ఘ రత్నము మదీయాభీష్టముల్ సేయుతన్" [1]

'విజయవిలాస' కర్త యగు 'చేమకూర వేంకటకవి' శ్రీరాముడు తన కృతిభర్త యగు రఘునాథనాయకుని బ్రోచుగాకయని ప్రార్థించినాడు.

శా. " శ్రీలెల్లప్పుడొసంగ నీ సకల ధాత్రీ చక్రమున్ బాహుపీ
ఠీలగ్నంబుగ జేయ దిగ్విజయ మీడీకొన్న చందాన నే
వేళన్ సీతయు లక్ష్మణుండు తను సేవింపగ విల్ పూని
చెల్వొ లీలన్ దగు రామమూర్తి రఘునాథాధీశ్వరుంబ్రోవుతన్" [2]

6.6 *సీతాదేవి స్తుతులు :* దాంపత్య జీవితములో ఆదర్శ దంపతులుగా చెప్పబడు జంటలలో ఒకటి 'సీతారాములు'. శివ ధనుర్భంగము జరిగిన పిమ్మట సీతారామ కల్యాణము జరిగినది. జనకుడు సర్వాలంకార శోభితయైన సీతను అగ్నిసమక్షమున కూర్చుండజేసి రామునితో ఇట్లనినాడు .

"ఇయం సీతా మమ సుతా సహధర్మ చరీ తవ|
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ||
పతివ్రతా మహాభాగా ఛాయే వానుగాతా సదా|
ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మంత్ర పూతం జలం తదా|| [3]

---

పాదసూచికలు: [1] [వాల్మీ/రఘు/I/1 [2] విజ వి/1 [3] వాల్మీ/రా/బాల/స73/25.26

[ ఈ సీత నా దుహిత నీకు నేటి నుండి సహధర్మచారిణియై నీడవలె ఉండగలదు. ఈమె కరగ్రహణము చేయుమని, జనకుడు మంత్రపూతజలమును వదలుచు పల్కెను] కనుకనే తండ్రి మాటను గౌరవించి అడవులకు వెడలిన రాముని ఛాయ వలె అనుసరించినది సీత. కష్టములను భరించినది. నిరంతరము రామధ్యానంలో కాలము గడపినది. రావణునికి సమాధానము ఇవ్వ వలసినపుడు పరపురుషుడు - కనుక గడ్డిపోచనడ్డునిడుకొని భాషించినది. ప్రలోభాలకు లొంగనిది. కనుకనే హనుమ సీతను మొదటి సారి చూసిన వెంటనే ఆమెపట్ల ఘనమైన మాతృభావన నేర్పరచుకొనినాడు. 'సీత' అను పేరుతో పిలువబడు మైథిలికి రామరాజభూషణుడు చేసిన కవితా స్తుతి రూప సేవ చూద్దాము.

సీ. నిఖిల లోకానందనీయస్థిరోద్భూతి
బొలుచు ననాద్య తాంభోజపాణి
అంభోధి మథనాసహాయ శౌర్యవరాప్తి
జాలమించుననాప్త సంఖ్య శీల
పంకదూర కృపీట భవనివేశప్రౌఢి
బరగు నప్రతిపన్న భంగ ధామ
యతిలాలితాక్షీణసుతసంపద తనర్చు
నకళంకి సహజకళాధివసతి

గీ. సుదతులునుతింప నభినవ సురుచిరమణి
యెనయకుండ నిజాధీశహృదయపీఠి
వెలయు సీతా భిధాన నవీన లక్ష్మి
నిశ్చలైశ్వర్యములు కరుణించుగాత! పై పద్యములో సీతా పరమైన ఘనతను, లక్ష్మి యొక్క దైన్యమును చెప్పబడినవి. సీతలో సత్త్వ, రజో, తమో, మరియు శుద్ధసత్త్వ గుణములను ప్రతిక్షేపించి ఆమె భువనైకమాత యని చెప్పినాడు.

---

పాదసూచికలు: [1] రామరాజ/హరిశ్చంద్ర/ఆవ/2

గురుమూర్తి తన శ్రీసీతారామాంజనేయ సంవాదములో. ఆ పద్యము ఇది.

సీ. తనరజోగుణముచే తనరంగ నేదేవి
కల్పించునఖిలలోకములనెల్ల
తనసత్త్వగుణముచే నొనరంగనేకొమ్మ
పోషించు నీసర్వ భూతములను
తనతమోగుణముచే తగనేవధూమణి
జగములనేల్ల సంక్షయము జేయు
తాశుద్ధ సత్త్వ ప్రదానయై యేరామ
రామాంకముననజస్రము వసించు

గీ. అట్టి భువనైకమాత, దయాసమేత,
సద్గుణవ్రాత నిర్మల స్వాంతపూత
భక్త జన మానసోద్యాన పారిజాత
సీత కరుణించి నన్ను రక్షింతు గాత! [1]

లోకముల కల్పన రజోగుణమువలన, పోషణ సత్త్వ గుణమువలన, తమోగుణ కారణముగ లయము అను మూడు దశలను శుద్ధసత్త్వమువలన జరుగుచున్నవి. ఆ మూల ప్రకృతి సీతయే యని నొక్కి వక్కాణింపబడటము చూడగలము. తుది గీతపద్యంలో అంత్యాను ప్రాసప్రయోగించి శబ్ద రామణీయకతను కవి సాధించినారు.'సారంగు తమ్మయ' తన 'వైజయంతీ విలాసము'నందు కన్గొనల నవ్వు ధరాసుత, తమను బ్రోవునని ఆశించినారు.

చ. "జనులరుదండ నా ఘనుడు చాపలతం దరియంగా జూచి లో
నినిచిన కూర్మి నీడలను నెమ్మి రహిస్ బురి విప్ప నయ్యెడం
గనుగొను వారికిస్ కలిగె కన్నుల పండు వటంచు నెచ్చెలుల్
ననువులు పలక కన్గొనల నవ్వు ధరాసుత మమ్ము బ్రోవుతస్' [2]

-------------------------------------------------------- ------------------

పాదసూచికలు: [1] శ్రీసీతారామాంజ సంవ/ పీ/2 [2] వైజయం/ఆవ/2

శివధనుస్సు రాముడు ఎక్కుబెట్టినాడు. అది అద్భుత రవము జేయుచు తునియలైనది. తద్రవము విని విభ్రాంతి చెందిన వారు కొందరు కాగ, సంబరముపొంది సంరంభముతో మనోహరుని కంఠమున పుష్పహారమును అర్పించునపుడు సాత్త్విక భావమునకు లోనైన సీత కరాంభోజము దీవనలిడునని భావించినారు గుమ్మ రాజు రామకవి.

మ. " హరకోదండ విఖండ నాద్భుత రవంబాలించు వారెల్ల దు

ర్భర విభ్రాంతి వహింపగా నధిక సంరంభంబు తోడ న్మనో

హరు కంఠస్థలి పుష్ప హారమును తానర్పించుచో సాత్త్విక

స్ఫురణాంకంబుల నొందు జానకి కరాంభోజంబులేలున్మముస్" [1]

రత్నగర్భ యైన సముద్రుని గారాబు తనయ లక్ష్మి. ఆ సిరుల దొరసానిని ఘనముగా 'రఘునాథ నాయకుడు' తన 'వాల్మీకిచరిత్రములో' శుభ లీలల మనుచు కొరకు మృదువైన పదములతో స్తుతించుట చూడగలము. లక్షణములన్నియు లక్ష్మి దేవికి యున్నవి చెప్పినప్పటికీ, లక్ష్మి యంశ, కళ కల్గినదే కనుక జనకుని ఇంటిలో ఆడుకొన్న అవనిజ స్తుతి చేయడము జరిగినది. సీతకు కమలకు భేదము లేదుకదా! ఆ జనకునికూతురు, వైదేహి బాలగా ఆడుకొనిన తీరు అద్భుతముగా వర్ణించినాడు- రఘునాథ నాయకుడు.

సీ. " కమల గర్భాండ భాండము లఖండ జ్యోతి నెనయు బంగరు బొమ్మరిండ్లు గాగ

నీరేడు లోకంబు లెడనెడ చెన్నారు పన్నారు దొంతులు బాగు గాగ

బ్రహ్మాది సర్వ గీర్వాణ సంఘములెల్ల నాడించు బొమ్మల జాడ గాగ

పార్వతీ భారతీ ప్రముఖాది శక్తులు ప్రియమించు చెలిమి కత్తియలు గాగ

గీ. తలపుచు జనకునింట నుదారమహిమ

బాల లీలలు సలిపె నే భామ యట్టి

రత్న గర్భ యనుంగు గారాపు పట్టి

మమ్ము జేపట్టి శుభ లీల మనుచు గాత!" [2]

---

పాదసూచికలు: [1] చౌడేశ్వరి/ప్ర/2/గుమ్మరాజు [2] వాల్మీకి/రఘునా/I/2

6.7 ***హనుమంతుని స్తుతులు :*** స్వామి భక్తికి ఎన్నికైనది, మన్నికైనది హనుమ నామము. బుద్ధిమంతులలో శ్రేష్టుడు. నిద్రాణమైన అనంత శక్తికి ప్రతీక మారుతి. దినకరుని శిష్యుడు. ఘనమైన చదువరి. రామనామ మహిమను సంపూర్ణముగా తెలిసిన మహానుభావుడు, మహాత్ముడు. అనిలజునికి వున్నన్ని మందిరములు రామునికన్న ఎక్కువే ! నవవ్యాకరణ పండితుడు. వాల్మీకి మహర్షి [రాముని ద్వారా తమ్ముడు లక్ష్మణునికి చెప్పినట్లు] హనుమ ప్రతిభ మనకు తెలియ చేయడము కిష్కిండా కాండలో మొదట చూడగలము. హనుమ గొప్ప దూత. అట్టి దూతగల ప్రభువు ధన్యుడు కావడమే కాదు విజయములను తప్పక సాధించ గలడు. హనుమదుపాసన బహుళార్ధ సాధకము. గోసాయి తులసీదాసు హనుమాన్ చాలీసాలో అష్టసిద్ధి, నవనిధికే దాతా యని చెప్పడము చూడగలము. సుందర కాండలో పరమాత్మ [రాముని] నుండి జీవాత్మ [సీతాదేవి ] కు, {అందునా కష్టముల కడలి మధ్యలో , రాక్షసులచే చుట్టుముట్టబడి, తనవారికి దూరమై, పరమాత్మనే చింతించుచున్న} మధ్య దూతగా వెళ్ళి పరమాత్మ విషయము తెలిపి, సాంత్వనము చేకూర్చిన వాడు. " మనోజవం మారుత తుల్య వేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్టం వాతాత్మజం వానర యూధ ముఖ్యం శ్రీ రామ దూతం శిరసా నమామి.' ఏకపాద రుద్ర మూర్తి. తులసీదాసు రామాయణము రాసిన కవీంద్రునికి [వాల్మీకికి], అందులో హారము మధ్య మణిపూస వంటి కపీంద్రునికి నమస్సుల నిడినాడు. సమీరకుమార విజయములో, పుష్పగిరి తిమ్మన, తన ఆరాధ్య దైవమగు అంజనాసుతుడు అసాధారణుడు, పరమహంస, త్రిమూర్తి స్వరూపుడు అంటాడు .

హనుమదుపాసన ' షణ్మాస జపమున సత్కవిత, ఒక వత్సర ఉపాసన వలన సుజ్ఞానయుక్తి' ఇచ్చునని గాఢముగా నమ్మిన వాడు తిమ్మన. పలువురు కవులు హనుమంతుని స్తుతించినారు. సమీర కుమారా విజయములో తిమ్మన అభి నుతించిన హనుమ ప్రస్తావన చూద్దాము.

సీ.  ‘ సరస భాషాసక్తి సత్యవైభవయుక్తి

భావింప పంకజభవ ప్రభుతదోప

కమకాంగద స్ఫూర్తి దనుజాప హృత్కీర్తి

తన హరిత్వము యథార్థముగదోప

స్మర విభేద ప్రౌఢి పురవిదాహ నిరూఢి

సర్వజ్ఞ గతిమహేశ్వరత దోప

పుష్కరాశ్రయ రీతి బోధ హేతుఖ్యాతి

హంసత్వమును తనయందె దోప

గీ.  స్వప్నమునమున్న నాకుసాక్షాత్కరించి

‘తత్త్వమస్యాదివాక్య సంతతికినర్థ

మెఱుక చేసిన గురుడనేనే’ యటంచు

నానతిచ్చిన హనుమంతు నభినుతింతు’ [1]

వటు రూపాన, మొదట రామలక్ష్మణులకు అగుపించిన మారుతి శివుడు అని భావింపబడు రీతిలో నున్నాడు. ఆ హనుమ అప్పటి రూపు, తిమ్మన గారు ఇట్లు చూపినారు.

ఉ. “బంగరు పట్టు గోచి నునుపచ్చని ముంజియు నొంటి జందెమున్

ముంగయి కంకణంబు జిగి మోహన హారము మండల ప్రభా

భంగ కపోలముల్ తరుణ భాను సమాన ముఖాంబుజంబు మీ

అంగవటు క్రియన్ శివుడు రాడు గదా మన చింత దీర్పగన్” [2]

లింగమూర్తి గురుమూర్తి తన సీతా రామాంజనేయ సంవాదములో, మారుతిని సముపాశ్రయించిన విధము చూద్దాము. హనుమను తత్త్వవేత్తగ భావించినారు.

---

పాదసూచికలు: [1] సమీరకుమార వ/పు తిమ్మన1 /7 [2] సమీర/పుష్ప/తిమ్మన/3/22

మ. " తనరంగాయముచేత రామచరణ ద్వంద్వై క దాస్యంబు హె

చ్చిన భక్తిం దగువాక్కుచే ననిశముస్ శ్రీరామనామ ప్రకీ

ర్తనముంజిత్తముచేత రామ పరతత్త్వ ధ్యానముంజేయు శ్రీ

హనుమంతుస్ సముపాశ్రయింతు మదభీష్టార్థంబు సిద్ధింపగస్" [1]

మహిమాన్వితుడైన హనుమ ఘనతను కొనియాడినాడు గుమ్మరాజు రామకవి తన శ్రీ చౌడేశ్వరీ మాహాత్మ్యములో.

ఉ. "తారక మంత్రయోగసము దగ్ర మహామహిమాను లబ్ధమౌ

వారిధి దాటునంతటి జవంబు నగంబులు మోచునంత దో

స్సారము శాస్త్ర జన్యమతి సంపదయుం జనకావనీంద్ర క

న్యా రమణార్పితంబుగ నొనర్చిన ధన్యు కపీంద్రు నెన్నెదస్ " [2]

ఆ హనుమ తారకమంత్ర యోగము పొందిన వాడు, సముద్రమును లంఘింప గలవాడు, నగములను[సంజీవని] మోయగల భుజ శక్తి కలవాడు, శాస్త్ర జ్ఞాన సంపన్నుడు, జానకిని రామునకు అర్పింపజేయుటలో విజయము సాధించినవాడు, స్వామి కార్యములో ధన్యుడైనవాడు సమీర తనయుడు అని పేర్కొవటము కలదు. హనుమంతుని మిక్కిలి ఆరాధించు రామరాజ భూషణుడు, తన హరిశ్చంద్ర నలోపాఖ్యానము నందు అప్రమేయుడు మునిధ్యేయుడు యగు ఆంజనేయుని అభినుతించిన విధమును చూడుడు.

సీ. 'రామ భక్తునకు భారమె ఘోర పంకాబ్ధి తరణ పాటవ మన శరధి దాటి

రామభక్తునకరుదా మృత్యు నిరసనం బనమహాచ్ఛాయా గ్రహంబు జీరి

రామకింకరునకబ్రమె రమా సాన్నిధ్య మన విదేహాధీశ తనయ గాంచి

రామైకమతికి చిత్రమెపాశ విగళనో పాయంబన నజాస్త్ర బంధమెడలి

గీ. రామపరతంత్రునకు దుర్భరంబె విలయ వహ్నియన వాలశిఖిశిఖావ్యాప్తినోర్చి

యరిపురంబేర్చినయజేయు నప్రమేయు నాంజనేయుమునిధ్యేయు నభినుతింతు'[3]

---

పాదసూచికలు: [1] శ్రీసీతారామాంజ సంవ/ పీ/6 [2] చౌడే/8 [3] హరిశ్చంద్ర/అవతా/6

పైన హనుమ విజయాలను పూస గుచ్చినట్లు మనకు దర్శనము చేయించినారు. భయంకర మైన పంకాబ్ధి దాటుట రామభక్తునకులెక్క లోనిది కాదు. సముద్రము దాటునప్పుడు తనను కబళింప వచ్చినఛాయా గ్రహము సింహికను సంహరించుట రామ భక్తునకు అరుదు కాదు, అది సర్వ సాధారణముగా జరుగు విషయము. లక్ష్మీదేవి అంశ కల సీతా దేవిని సందర్శించుట రామకింకరునకు అబ్బురము కాదు. బ్రహ్మాస్త్రముల బారినుండి విముక్తి పొందుట, నిరంతర రామనామజపధారికి చిత్రము కాదు. వాలమునకు పెట్ట బడిన నిప్పు భరించుట రామపరతంత్రునకు భారము కాదు. అనలము అరిపురములో పెట్టగలవాడు అప్రమేయుడు, ఆంజనేయుడు. ఆయననభినుతించినాడు, మన రామరాజభూషణుడు. 'శారదామూర్తి', 'నరసభూపాలీయము'లో వీరాధివీరుడగు వాయునంద నుని వైభవమును ప్రశంసించినారు. అందులో రామానుజునికి జీవ ప్రదానము చేసినది, సముద్రమును దాటినది, మున్నగు విశేషములను ప్రస్తావించినారు.

సీ. " తనయాస్య గహ్వరంబునకు ఖద్యోత జృం
భణము ఖద్యోత జృంభణముకాగ
తనకరాంభోజాతమున కలగంధమా
దన మొక గంధమాదనము కాగ
తనశౌర్యహర్యక్షమునకు మైరావణ
స్ఫురణ మైరావణస్ఫురణ గాగ
తనవాలదంభోళికెనయు కర్బుర గోత్ర
గరిమ కర్బుర గోత్ర గరిమ గాగ

గీ. వఱలు రామానుజన్మ జీవప్రదాన ధుర్యపర్యాయ ధాత మేదురవిరోధి
బలపయోధి విలంఘన ప్రబలశక్త యోబయ నృసింహ భర్త కొసగు గాక! [1]

హనుమవంటి దూతగల రాజు అత్యంత అదృష్టవంతుడని శ్రీరాముడు, తమ్ముడగు

------------------------------------------

పాదసూచికలు: [1] నరసభూపా/1/7

లక్ష్మణస్వామికి చెప్పడము కలదు. నవవ్యాకరణ పండితుడు పరేంగితావగాహి యైనవాడు నిరంతర రామనామ జపతత్పరుడు, సేవాసక్తిగల భక్తితత్పరులలో ప్రథమగణ్యుడు, హనుమ. రామకథా గానము ఎక్కడ జరిగినా, అక్కడ తప్పక నిల్చి ఆ గానకార్యములో పాలుపంచుకొనువాడని మారుతినిగురించి చెప్పడము కలదు.

"యత్ర యత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృత మస్తకాంజలిం
బాష్పవారి పరిపూర్ణ లోచనం మారుతిం నమత రాక్షసాంతకం" అని కదా!.

ఆ భావననే తన 'వాల్మీకి చరిత్రము'లో 'రూపరేఖావిజిత కుసుమ సాయకుడు, సకలధర్మ సంధాయకుడునైన 'రఘునాథ నాయకుడు' ఇట్లు మారుతీనందనుని వర్ణించినారు.

ఉ. " ఎక్కడ రామ కీర్తన మొకించుకయే వినసైన వేడ్క తా
నక్కడ నిల్చి రంజిలి కృతాంజలియై ప్రమదాశ్రుపూరముల్
పిక్కటిలంగమైపులక బృందము జాదుకొనంగ పాడుచుస్
చొక్కుచు నాడు నయ్యనిల సూను ప్రభానత భాను కొల్చెదస్" [1]

రామమహాశాంతుడు, అతిదాంతుడు, అరికృతాంతుడు, అతుల మతిమంతుడు ఐన హనుమంతుని, తన 'ఉత్తర రామాయణము'లో, కంకంటి పాపరాజు నుతించిన తీరు మెచ్చతగినదే! హనుమ తేజము, తనుద్రఢిమ, అతనిగభీరత, ధైర్య సంపద ప్రస్తావించుట వివరముగా వివరించుట చూడగలము.

సీ. " శైశవంబుననె భాస్కరు మ్రింగెనితని తేజమున కే ఘనుడింక సదృ శుడనచు [2]
హనుతటోద్ధతివజ్రమడచె నీతనితను ద్రఢిమకేమిక బోల్ప తగునటంచు
నురుదాటి కడలిలో మెఱసెనీతనిగభీరతకునెయ్యది యింక బ్రతి యటంచు
వాలాగ్రమున గిరుల్ వ్రాల్చె నీతని ధైర్య సంపద కిక నెవ్వి సాటి యనుచు,
గీ. జానకీ రామచంద్రు లేశౌర్య వంతు పటుగుణ స్ఫూర్తులప్పటప్పటికి నెంతు
రామహాశాంతు నతిదాంతు నరికృతాంతునతులమతిమంతుహనుమంతు నభినుతింతు"

-------------------------------------------------------------

పాదసూచికలు: [1] వాల్మీకి/ప్ర/3 [2] ఉత్తర/కంకంటి/పీ/8

వసుచరిత్రలో రామరాజభూషణుడు, మంజులస్వాంతుడు, మహామతి మంతుడుయైన హనుమంతునిట్లు స్తుతించాడు.

సీ. " తరుణార్క కబళనోద్ధతి జూపెనెవ్వాడు
రుచులచే ఫలమోహ రుచులచేత
నకళంక రామముద్రిక బూనె నెవ్వాడు
శయముచే హృత్కుశేశయముచేత
మున్నీరు పల్వలంబుగ దాటె నెవ్వాడు
జవముచే గుణగణార్జవముచేత
నక్షశిక్షా ప్రౌఢి నలరారె నెవ్వాడు
రణముచేనియమ ధారణముచేత

గీ. ధరణి నెవ్వాడు దానవ ద్విరద దళన
విహృతి తన కేసరి కిశోర వృత్తి దెలిపె
నతని మత్కావ్య భవ్య వాగమృత ఘటన
మంజుల స్వాంతు హనుమంతు మదిదలంతు" [1]

మహా భుజ బల సంపన్నుడైన మారుతి ఘనతను తెల్పుతూ, సూర్యుని మింగ బోయిన విషయము, కళంక రహిత రామముద్రికనుపూనుట,అపార సాగరము దాటుట, జవము కలిగియుండి, శత్రు గజములకు సింహము వంటి శక్తి సామర్థ్య సంపదలు గలవాడు – అని విశ్లేషిస్తారు.

హనుమ ఘనతను తన గ్రంథములో నుతించిన 'అప్పకవి', మారుతిని విడువక కొల్చినాడు. ఆ కేసరి తనయుడు జానకి జాడకనుగొన సుగ్రీవునిచే నియమింపబడి, రాముని నుండి ముద్రిక గైకొని, గోష్పదమను రీతిగ సంద్రమును దాటి లంక చేరినాడు. రక్కసుల యుక్కడగించి, వారిని దోమలవలె మర్దించి, సీతామాతను జూచి రామునకు విషయము

-----------------------------------

పాదసూచికలు: [1] వసు/ప్రథ /8

విన్న వించిన విధేయుడు. ఉత్తమోత్తమ దూత. 'చూచి రమ్మనిన కాల్చి రాగల' విజ్ఞత కలకార్య సాధకుడు, ప్రభువుకు వలసిన సేవ చేయగల చేవగల మూర్తీభవించిన వినయమూర్తి.

ఉ. " పాయక కొల్తు రామజన పాలుడు జానకి జూడ నంపుచో
 తోయధి గోష్పదంబుక్రియ దోప చివాలున దాటి లంక క
 త్యాయతలీలబోయి దివిజారుల దోమలబోలె పట్టి బా
 హాయతశక్తి కొట్టి సతి నారసి తద్విభుగన్న మారుతిస్" [1]

'ముకుందవిలాసము'లో 'కాణాదం పెద్దనసోమయాజి' సూర్యుని శిష్యుడనుచు, హనుమంతుని స్తుతించిన విధము చూద్దాము.

మ. " సవిత్పండాదిగురుండుగాచదివి తత్సాహిత్య విఖ్యాతికై
 కవితా మాధురి నాటకాకృతి కృతిం కల్పించి రామాయణం
 బవనిస్ వాగమృతంబు నించిన శుభ స్వాంతుస్ హనూమంతు స
 త్కవి కాంతుస్ నుతియింతు మామక కవిత్వ ప్రౌఢి సాఫల్యర్థమై" [2]

తన 'చంద్రికాపరిణయము'లో కృతికర్తయగు " సురభి మాధవ రాయలు" హనుమంతుని కృతి చమత్కృతికై ఘనముగా అలంకారయుక్తమగు పద బంధములతో నుతించినాడు.

సీ. వనరాశి భంగంబు గనజేసె నెవ్వాడు కరముచే పర్వతోత్కరముచేత [3]
 ఘనవలాహకశక్తి కల్గించె నెవ్వాడు రుతముచే వేగమారుతముచేత
 నరిపురవిస్ఫూర్తి పరిమార్చెనెవ్వాడు హేతిచే నిజనఖ హేతి చేత
 తత మహామిత్ర వర్ధన మూన్చె నెవ్వాడు క్షణముచే మధుర వీక్షణముచేత
గీ. నవని నెవ్వాడు జానకీస్వాత్మ సూచ నాంజనాత్మజ విఖ్యాతి నధిగమించె
 నతని మామక కృతి చమత్కృతికి తలతు, మహిత ధీమంతుహనుమంతు మానవంతు.

---

పాదసూచికలు: [1] అప్పక/పీఠిక/14 [2] ముకుం/కాణాదం/11 [3] చంద్రి పరి/మాధవ/9

6.8 ***లక్ష్మణ స్తుతులు:*** శ్రీ రామునితో కానలకేగిన వాడు సౌమిత్రి. దుష్ట రావణాదులను సంహరింప విష్ణువు అవతరించగా, ఆదిశేషుడు లక్ష్మణునిగా, పాంచజన్యము భరతుడుగ, సుదర్శనము శత్రుఘ్నునిగా తత్ తత్ అంశలతో భువి జేరినవని చెప్పడము కలదు. లక్ష్మణుడు ముక్కోపి అని, ఆదిశేషుని అంశ కనుక అతి త్వరగా ఆగ్రహము వ్యక్తము చేయువాడని చెప్పడము కలదు { దీనిని ఆంగ్లములో – 'short tempered executive' అని వ్యక్తీకరిస్తారు} రాముని రక్షణ భారము తన మీద వేసికొని రామునికి వ్యతిరేకముగా ఎవ్వరినైన సంహరించుటకు సదా సిద్ధముగా నుండువాడు. లక్ష్మీ రస్యాస్తితిలక్ష్మీవాన్ సంపదను,ఒప్పిదమును కలవాడు లక్ష్మణుడు.రాముని సేవించుటను గొప్ప సంపదగా భావన సేయువాడు లక్ష్మణుడు. వాల్మీకి రామాయణము అయోధ్యా కాండము సర్గ 22 , మొదటి శ్లోకములో "శ్వసంతమివ నాగేంద్రం రోషవిస్ఫారితేక్షణం " అను ప్రయోగమును పరిశీలించినచో రామానుజుని లక్షణము తెలియగలము.

రామరాజభూషణుడు లక్ష్మణస్వామి పరముగా చెప్పిన పద్యమును ఒకసారి చూచెదము.

మ. నిజనిద్రాలసతావిగానమెడలన్ నిర్నిద్రతా వృత్తి పూ
ని జగత్ప్రాణహృతి ప్రవాద ముడుగన్ విశ్వావనోత్సాహియై
యజరారాతివిఘాతికిన్ వనవిహారాధారమై పోల్చు సూ
రిజన ప్రస్తుత శేష భావ నిరతున్ శ్రీ లక్ష్మణున్ కొల్చెదన్ [1]

రాముని వనవాసకాలమునందు, లక్ష్మణుడు నిద్రాహారములను వదలి రాక్షస సంహారములో అన్నకు తోడుగా నిలచినాడు. భృత్య భావ నిరతుడైనవాడు, దైత్యాంతకునకు వనవిహారాధారసమయమున సభ్యసన్నుత శేషాంశముకలవాడై, స్వామిని రక్షించుటకై జాగరూకుడైనవాడు - అని భావము.

------------------------------------------------------------

పాదసూచికలు: [1] రామ రాజ భూషణ/హరినలో/ఆవ/4

6.9 *భరతుని స్తుతులు:* విష్ణుపరివారము వారి వారికి తగిన బాధ్యతలను స్వీకరించి, వారి వారి ధర్మమును నెరవేర్చుటకై భువిపై అవతరించినారు. భరతుడు కైకేయి గర్భ సంజాతుడు. రాముని యెడల అపరిమితమైన భక్తి గౌరవములు కలవాడు. తనకు తల్లి కోరికపై రాజ్యము సంక్రమించినా దానిని స్వీకరించక రాముని ప్రతినిధిగా రాముని పాదుకలను గైకొనివచ్చిపాలన సాగించి నాడు. శంఖము యొక్క అంశ ఇతనిది. శంఖము నాదమునకు ప్రతీక.ఇతని పత్ని, కుశ ధ్వజుని కొమార్తె మాండవి. సుధీనిరతుడైన భరతుని, 'హరిశ్చంద్రనలోపాఖ్యానము' లో 'రామరాజభూషణు' డిట్లు భజించినాడు.

ఉ. " అంచిత రాజ్య రక్షకఖిలావన పావనరామ పాదుకల్

గాంచిన మేటి గావున నకంటక కోమల తా యుతాత్మ ని

శ్చంచల భావనాసరణి సారె జరింపగ నమ్మహాత్ము సం

ధించి తదాత్మతన్ దగు సుధీ నిరతున్ భరతున్ భజించెదన్" [ 1]

6.10 *శత్రుఘ్నుని స్తుతులు:* దశరథుని నలుగురు కుమారులలో కడపటి వాడు. లక్ష్మణునితో పాటు జననమందిన కవలలో యొకడు. సుమిత్ర సుతుడు. విష్ణు దేవుని పరివారములో చక్రము యొక్క అంశగలవాడు. శత్రు సంహారణము చక్ర లక్ష్యము. సుదర్శనము కాంతికి ప్రతీక. ఇతని భార్య , కుశధ్వజుని కుమార్తెయగు -శ్రుతకీర్తి. 'రామరాజభూషణుడు' తన 'హరిశ్చంద్రనలోపాఖ్యానము' లో శత్రుదమనుని ఇట్లు భజించినాడు.

మ. " లవణోదాత్త శర ప్రకర్ష హృతి లీలా ధీర నారాచాలా

ఘవ మాత్మ శ్రిత రామభద్ర పదరక్షా లక్ష్మియుంగార్ముకా

రవ నిర్భర్త్సి త మేఘ నాదతయు వోరం బూని త్రైలోక్య సం

స్తవనీయాగ్ర భవత్రయీ చరితుడౌ శత్రుఘ్ను ప్రార్థించెదన్" [2]

లవణాసురుడను రాక్షసుని అగ్రజుడైన రాముని అనుమతితో చంపినవాడు ఇతడు.

---

పాదసూచికలు: [1] హరిశ్చ/ఆవ/3 [2] హరిశ్చ/ఆవ/5

6.11 ***శ్రీ కృష్ణుని స్తుతులు :*** శ్రీకృష్ణునిది విష్ణువు ధరించిన ప్రసిద్ధ దశావతారములలో ఎనిమిదవది. బాల్యమునుండి లీలలను చూపిన అవతారము. అష్ట మహిషులతో పాటు పదహారువేల కన్యలను వివాహమాడినట్లు కృష్ణుని విషయములో చెప్పడము తెలిసినదే! కృష్ణుడు - అనగానే బాల కృష్ణుని లీలలను గుర్తుకు తెచ్చుకోని సాహిత్యకారులు, తల్లులు - యుండరనిన అతిశయోక్తి కాదు. బాల గోపాలుని చేష్టలను తలచి పులకరించని మాతృమూర్తులు లేరు. తమ పిల్లలలో బాలకృష్ణుని చాలామంది చూడడము కలదు.

"కరారవిందేన పదారవిందమ్ ముఖారవిందే వినివేశ యంతం

వటస్య పత్రే శయనం బాలం ముకుందం మనసా స్మరామి" [ప్రసిద్ధశ్లోకము]

అను శ్లోకము గుర్తుకు వచ్చి కాబోలు తొలి తెలుగు సంకీర్తనాచార్యుడు, తాళ్ళపాక అన్నమాచార్యులవారు ఒక సంకీర్తనలో

"తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడు వాడు [1]

ఎప్పుడు లోకములలీల నేలేటివాడు " అను పల్లవితో సంకీర్తన కూర్చినారు.

మొల్ల తన రామాయణములో అవతారికలో వేణుధరుని ఇట్లు పేర్కొవడముకలదు.

ఉ." తెల్లని పుండరీకముల తేజము మెచ్చని కన్ను దోయితో

నల్లని శక్రనీలరుచి నవ్వెడు కోమల దేహకాంతితో

నల్లని పిల్ల గ్రోవి కరమంచిత సంజ్ఞల నింపు నింపగా

గొల్లతలన్ విరాళితగ కొల్చెడు కృష్ణుడుబ్రోచుగావుతాన్" [2]

తెల్లని పుండరీకముల కాంతిని అధః కరించు నయన సోయగము కలిగిన వాడు, ఇంద్ర నీల కాంతిని తిరస్కరించు కోమల దేహకాంతికలవాడు, గొల్ల భామలను తగు వలపున ముంచువాడు, పిల్లన గ్రోవితో ఇంపునింపువాడు ఐన కృష్ణుడు రక్షించుగాత! చిన్ని కృష్ణుని చేతిలో నిరతము వేణువు అలంకరించి మురిసినవాడు పురందరదాసులవారు. ఆ బాలుడు

---

పాదసూచికలు: [1] లలిత రాగం శృంగార సంకీ 12 సంపు 295 [2] మొల్ల/రామా/3

పుట్టిననాటి నుండి పలు లీలలను చూపిన ఘనుడు. ఆ బాలుని విక్రమములను వివరిస్తూ ఒక కవి చెప్పిన పద్య రూపమైన స్తుతిని ఇక్కడ ఇప్పుడు చూద్దాము.

సీ. పురుడు వెళ్ళని నాడె పూతనఁ బరిమార్చె
శకటాసురుని కొట్టె చరణ హతిని
పడ ద్రొబ్బె మద్దులు బకుని కీటడగించె
దావాగ్ని ద్రావి వత్సకుని కూల్చె
గోవర్ధనంబెత్తి గోవుల రక్షించె
కాళీయనాగంబు గర్వమడచె
ధేనుకాసురుబట్టి తిత్తొల్చె మహిపుత్రు
దునిమి రక్కసు ని తుత్తురుము సేసె

గీ. వెలయ వనమెల్ల పెటికి పో వీచే లీల
వత్స వాతూలు నాతృణావర్తు కెడపె !
సురుచిరాంగుండు గోపాలసుందరుండు
దనుజదమనుండు కేవలదైవ మెట్లు? [1]

తెలుగువారికి భాగవత సుధ నందించి ప్రతి తల్లి, తన తనయునిలో చిన్నికృష్ణుని చూచుకొను రీతిలో చక్కని పద్యరూప స్తుతులనందజేసిన ఘనుడు పోతన. తనమనోభీష్టమైన శ్రీ కైవల్య పదము చేరుటకు ఆయన అర్థించినది నందాంగనా డింభకునే! ఈ మనోహర మూర్తిని మరీ మరీ చూసి చూసి మురిసిన వారు ఎందరో మహానుభావులు, మహాత్ములు. బాలుని రూపున నున్న గోపాలుని ఎందరో వారి వారి శక్త్యానుసారము, భక్త్యాను సారము నుతించినారు.

'చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండ, బంగరుమొలతాడు పట్టుదట్టి,సందె తాయెతులును సరిమువ్వ గజ్జెల చిన్నికృష్ణనిన్ను చేరి కొలుతు. [ప్రసిద్ధం]

-------------------------------------------------------------

పాదసూచికలు: [1] చాటు మ మం వేటూరి ప్ర శా పుట/15

ఆ బాలగోపాలుడు మురళీధరుడు. ఆ రవళితో జగమును మోహింపజేసినాడు. ఆజన్మాంతము తన వ్యక్తిత్వమును పరి పూర్ణముగా చూపినవాడు వాసుదేవుడు. అందులకే ఒకకవి కృష్ణుని ఇలా కొలిచినాడు.

చ. " మురళిని కేలుదోయిని ప్రమోదముగా ధరియించి గానమా

ధురి చవి జూపుచుంగడు కుతూహలతస్ వ్రజ భామినీ తతుల్

బిర బిర నేగుదెంచి తను వీక్షయొనర్చి భజింప మందహా

సరుచిని మౌళి బర్హము పసందుగా నూపెడు కృష్ణు కొల్చెదస్ " [1]

వల్లభాచార్యుడైతే - ఆ నందనందనుని ప్రతి కదలికా, గోపికలు, గోప బాలకులు, అతనితోటి వస్తువులూ, తుదకు యమునా వీచికలు, చేలము, నగవు, [ రుక్మిణీ / వెన్న] హరణము, చేష్టలు 'మధురము' అని చెప్పి మురిసిపోవడము చూడగలము.

"భీమ ఖండములో శ్రీనాథుడు మొట్టమొదట అవతారికలో రాధాకృష్ణుల ప్రసక్తి తీసుకు వచ్చాడు. తెలుగు సాహిత్యములో మొట్ట మొదట రాధామాధవ శృంగారాన్ని వర్ణించి ధూర్త గోపాలునిచేత రాధ మోవిపై తాంబూలము మోవి మోపించి ముద్దు పెట్టించిన ఘనత శ్రీనాథునిదే" అని వ్యాఖ్యానిస్తూ ఆరుద్ర గారు వ్రాసినారు.

ఉ. " వాలిక మోము మత్త వన బర్హి కిశోరక లాస్య లీల బై

వాలిచిపచ్చకప్పురపు వాసనతోడి ముఖారవింద తాం

బూలపు మోవి మోవిపయి మోపుచు రాధకు నిచ్చు ధూర్త గో

పాలుడు ప్రాచు గావుత నపారకృపామతి మంత్రి యన్ననిస్" [2]

---

పాదసూచికలు: [1] సారకాండ/15]

[2]పుట 753/సమగ్ర.ఆంధ్ర సాహి/తెలు/అకా/ ఆ పద్యము భీమ/ శ్రీనాథ/అవతారిక/3

'కంకంటి పాపరాజు' రసవత్తరముగా రాసినట్టి 'శ్రీమదుత్తర రామాయణము'లో తొలుత శ్రీ కృష్ణుని ప్రార్థించి నారు అందులో రాధాదేవి ప్రస్తావన కలదు. రాధయొక్క అధర బింబమును దొరయు రాచిలుక – కృష్ణుడు. ఆ గోపాంగనాజారగ్రామణిని వర్ణించిన తీరిది.

శా. " శ్రీ రాధాధర బింబముస్ దొరయు రాచిల్కన్ నిజోరస్స్థ లీ
రారాజన్మణి కాంతి రాబిలిచి తద్రాకేందు బింబాననా
స్మేరాంకూరముచే కృతార్థుడగుచుంజెల్వొందు గోపాంగనా
జారగ్రామణికృష్ణు డీవుత మహైశ్వర్యంబు మా కెప్పుడున్" [1]

బాలకృష్ణుని లీలలను పలువురు గానము చేసినారు. తాము ఆనంద జలధిలో మునిగి, తమ రచనలను చదివినవారినీ ఆసంతోషసాగరాన తనివిదీర తానమాడించి విడిచినారు. ఇందులో కృష్ణునికి ఒక ప్రత్యేకత గలదు. 'శరము' బలిమితో రాఘవుడు, 'కుఠారము'తో భార్గవ రాముడు, 'నఖరము'లతో నారసింహుడు తమ శత్రువులను ఓడించి విజయము సాధించి లోకమును వశమొనర్చుకొనినారు. శ్రీ కృష్ణుడు లోకమును తన వశమొనరించుకొన్నది, సమ్మోహనకరమైన 'నాదముతో' అది కూడా 'మురళి'తో. మురళి నుండి వచ్చు మోహనకర నాదమును, కాళిదాసు రఘువంశములో ఇట్లు ప్రస్తావించినారు. రఘు వంశ కీర్తిని వెదురు పొదలలో కూర్చొని వనదేవతలు కీర్తించినారట.

"సకీచకైర్మారుత పూర్ణ రంధ్రై
కూజద్భి రాపాదిత వంశకృత్యం
శుశ్రావ కుంజేషు యశస్స్వముచ్చైః
ఉద్గీయమానం వనదేవతాభిః" [2]

తన ఇష్ట పరిపూర్తి కోసము ఆ 'కన్నయ్య మురళి'ని నుతించినాడు మన అప్పకవి.

---------------------------------------------------------------

పాదసూచికలు: [1] పాపరాజు/ఉత్తరరామాయ/పీ/1

[2] కాళిదాసు/రఘువంశం/II సర్గ/12

మ. " ధర కాళింది తటంబునం గలుగు బృందాకాననాంతంబునం

పరితోషాతిశయాళు మోహమున గోపస్త్రీమణుల్ గుంపులై

హరిజేరం జనుదెంతురెందుజను దెంచానాద మాలించి స

త్వరయానంబులతోడ నట్టి మురళిన్ వర్ణింతు నిష్టాప్తికిన్" [1]

ఇంద్రుని కార్ముకము బాలతమాలాగ్రముపై నిలచినదేమో యను తీరున, ఉపేంద్రుడు నీలఘున దేహుడైన కన్నయ్య శిరముపై నెమలి పింఛము అలంకృత మైనది. దానినెంచినాడు మన 'అప్పకవి' – 'అప్పకవీయము'లో

కం. " బాలతమాలాగ్రమునం

గ్రాలు శచీనాథు కార్ముకంబో యనగా

నీల ఘన దేహుడగు గో

పాలుతలన్ మెఱయు బర్హి బర్హము నెంతున్" [2]

భక్తపాలుడగు మురళీధరుని, తన కృతిభర్త యగు సోమ నృపాలుని ఏలుమనుచు, 'ముకుందవిలాస'కర్త 'సోమయాజి' చేసిన స్తుతి చూద్దాము.

ఉ. "శ్రీ లలనాంశజన్మ పరిశీలను నీల సునంద గోపక

స్యాలసుతన్ వరించు తఱి సంగత మంగళ ఘోష చాతురీ

లీల ఘటించు లీల మురళీ శ్రుతి వర్తిలు కృష్ణమూర్తి గో

పాలుడు భక్త పాలుడు కృపాళుడు సోమనృపాలు నేలుతన్" [3]

'తెనాలి రామలింగ కవి' తన కావ్యము 'పాండురంగ మాహాత్మ్యము'నందు ఓం ప్రథమముగా దయాళుడగు కృష్ణుని, శ్రీవైష్ణవ మత స్వీకారార్హుడైన విరూరి పట్టణపతియగు వేదాద్రి మంత్రీశ్వరుని ఏలుగాకయని, నుతించారు.

---

పాదసూచికలు: [1] అప్ప/పీ/5 [2] అప్ప/పీ/8 [3] ముకుం/2

శా. "శ్రీకాంతామణి కన్మెఱంగి మది ధాత్రి న్మంచినస్ దత్ క్షతి
శ్రీ కాదంబినిమీది కుబ్బె ననగా శ్రీవత్సముస్ దాల్చి ము
ల్లోకంబుల్ వొదలించు కృష్ణుడు దయాళుండేలు శ్రీవైష్ణవ
స్వీకారార్హు విరూరి పట్టణ పతిస్ వేదాద్రి మంత్రీశ్వరుస్" [1]

'చంద్రికాపరిణయము' లో కవి 'సురభి మాధవరాయలు '
మదనగోపాలుని సమస్త లోకములకామోదమును కూర్చదలచి నుతించినాడు.*

శా. " శ్రీవక్షోజ ధరస్ఫుర ద్వర మురస్సీమస్ ప్రకాశింప శం
పావృత్తిస్ సరసత్వ మొంది సుమనః పాళి ప్రియాత్మీయ స
ద్భావ స్ఫూర్తి దనర్చు శ్రీ మదన గోపాలాహ్వయోజ్జృంభితాం
భోవాహంబు సమస్త లోకముల కామోద ప్రదంబయ్యెడుస్ " [2]

శ్రీదేవి హరి వక్షముపై ప్రకాశించుచున్నతీరు, మెరుపు తీగవలె యున్నది. అంభోధరమువలె శ్రీ కృష్ణుడు, మదనగోపాలుడను పేరుతో వ్యవహరింప బడుచున్నాడు. శ్రీయు, గోపాలుడు మదనుని జనకులు. సరసతతో మేఘమును వదలక మెరుపు కాంతిని ఒసగు చున్నది. లోకములకు అవసరమగు జలమును అంభోరుహము కురియుంచుచున్నది. అది లోకాలకు ప్రమోదమును కూర్చుచున్నది. సుమనస్కులకు ప్రియమగు ఆత్మీయతను కలిగించుచున్నది. కృష్ణమేఘము లోక హితమొసగుగాక!

6.12 ***రుక్మిణీ దేవి స్తుతులు: -*** శ్రీ కృష్ణుని కి గల అష్టమహిషీ మణులలో పట్టమహిషి రుక్మిణి. విదర్భరాజకుమారి. ప్రద్యుమ్నుని తల్లి. రుక్మియనువాని సోదరి. లక్ష్మీదేవి అంశతో జనించినది. భాగవతములోని దశమస్కంధము పూర్వభాగము1748 పద్యములో. ఆమె అందాన్ని పోతన ఇట్లు వర్ణించినాడు. ఆ రుక్మిణి " అలినీలాలక, పూర్ణచంద్ర ముఖి, ఏణాక్షి, ప్రవాళాధర, కలకంఠి, నవపల్లవాంఘ్రి యుగళ, గందేభకుంభస్తని, పులిన శ్రోణి,

---

పాదసూచికలు: [1] పాండు/తెనాలి/ప్రథమా/1 [2] చంద్రి/1

ఇభేంద్రయాన, అరుణాంభోజ హస్త, మహోత్పలగంధి, మృగరాజమధ్య". రుక్మిణికి, సీతకు, లక్ష్మికి వాస్తవములో అంతరములేదు. అట్టి రుక్మిణిని చంద్రికా పరిణయము లో కృతికర్త సురభి మాధవరాయలు ఇట్లు నుతించినారు.

సీ. అశ్రాంత భువన విఖ్యాత సద్గోత్రుడై
కనుపట్టు నేచాన కన్నతండ్రి
యలఘు కళాశాలియై సత్ప్రభుత్వంబు
తో మించు నేయింతి తోడబుట్టు,
విబుధ సంత్రాణ ప్రవీణుడై నిఖిలైక
నుతిగాంచునేమానవతి ధవుండు,
రహినాత్మ సరసధర్మ గుణపాళిస్ఫూర్తి
నలరించు నేకొమ్మ యనుగుపట్టి,
గీ. యరయసత్యాది కీర్తనీయ స్వవృత్తి
నెనయుకల్యాణమూర్తి తానె వధూటి
యట్టిసిరి రుక్మిణీ రుచిరాభిదాన
చిరతైశ్వర్యములు కృపసేయుగాత" 1-4

కన్నతండ్రి భువనవిఖ్యాతి చెందిన సముద్రుడు, కళావంతుడై ప్రాభవము కల సోదరుడు, శిష్టరక్షణకలిగించువాడు ధవుడు, సరస గుణములచే లోకాలను అలరించు మదనుడు కుమారుడు, కలిగిన కలుముల లలన రుక్మిణి. ఈమె సత్యభామాది వనితలతో కీర్తింపబడుచున్నది. రుక్మిణి యను పేరుతో ఉన్న ఆమె శాశ్వత ఐశ్వర్యములు ప్రసాదించుగాక! రుక్మిణీదేవిని నుతించిన వారిలో 'కువలయాశ్వచరిత్ర' కర్త 'సవరము చిన నారాయణకవి' ఒకడు.

---

పాదసూచికలు: [1] చంద్రికా పరిణయము /సురభి మాధవరాయలు /ప్రథమ 4

సీ. ‘తనమందహాస నూతనకాంతి కాంతకీ

ర్తికలాపములను సంధించుకొనగ

తనయాస్యఘర్మంబు ధవరాగరసఝరీ

పటిమతోడుత మాటపలుకులాడ

తనతనూదీప్తి సంతతులు నాయకమహస్

స్తోమంబునకును విదులు ఘటింప

తనయురోజాచలత్వంబు మనోనాథ

కఠిన ధైర్యముతోడ కలసిమెలగ

గీ. రాజుల తిరస్కరించుచు రమణుడున్న

అరదమెక్కిన రుక్మిణీసరసిజాయ

తాక్షి సవరము నారాయణాధిపేంద్రు

శుభదయాపూర్ణ వీక్షచే చూచుగాత’ [1]

తను కోరుకొనగావచ్చిచేకొని రాక్షస వివాహపద్ధతిలో రాజులనెదిరించి, తన శౌర్యమును యుంకువజేసి వైదర్భిని శ్రీ కృష్ణుడు వివాహమాడినాడు. ఆ సుందరి అందమును గంభీరతను చక్కని పొందికతో కూర్చినాడు, మనకవి. ‘ముద్దుపళని’ ‘రాధికాసాంత్వనములో’ ముచ్చటగ శ్రీకృష్ణుని పట్టమహిషిని నుతించి తనకృతిభర్తయగు బాలకృష్ణునికి మోదముచేకూర్చింది. భావభవు మాత సంపదలను ఇచ్చుగాక యని ఆకాంక్షించింది. రుక్మిణీ జలజపాణిని ఘనముగా ముద్దుపళని శ్లాఘించింది. శృంగారవర్ణన హద్దుమీరినదని ఒక సందర్భములో నిషిద్ధానికి కూడా గురైనదని తెలుస్తున్నది. అందులో ఇది రాసింది ఒక స్త్రీ కావడము విశేషముగా భావించినట్లు అర్థమగుచున్నది.రచన మాత్రము ఆలంకారికముగా సాగింపబడినది. అది మెచ్చ తగినది.

---

పాదసూచికలు: [1] కువలయాశ్వచరిత్ర / సవరము చిన నారాయణకవి/ ప్రథమా/2

సీ. 'రహిముద్దుటడుగులురాజీవములగేర

ప్రపదముల్ తాబేటివగలబోర

సరసోరుకాండముల్ సౌకర్యమేపార

లేగౌను సింగపు లీలజీర

చనువళుల్ త్రిక్రమీసౌజన్యమునతేఱ

భుజములారామతాస్ఫూర్తిమీఱ

రమణీయముఖకాంతి రామచంద్రునిజేర

చిరునవ్వుపలుతెల్వి గరిమగోర

గీ. కన్నుగవశ్రుతిలంఘియైకలిమికులుక

తనరు మధురాధరము కల్కితనము చిలక

చెలగు శుకవాణి రుక్మిణీ జలజ పాణి

భావ భవు మాత సంపదలీవుగాత'    [1]

రుక్మిణీ కల్యాణఘట్టము ప్రత్యేక ప్రశస్తి కలిగియున్నది. పూర్వము ఖగ రాజైన గరుడుడు ఇంద్రుని జయించి అమృతమును తెచ్చిన రీతిగా, చైద్య పక్షవీరులగు సాళ్వాదులనోడించి, రుక్మికి భంగము కావించి, రుక్మిణిని, కృష్ణుడు భీష్మకునిపురమైన కుండిన నగరమునుండి హరించి తెచ్చినాడు.

6.13 ***సత్యభామ స్తుతులు:-*** సత్యభామ సౌందర్యరాశి. భూదేవి అంశ. నరకాసురునికి తల్లి. తల్లిచేతిలోనే మరణము ఉన్నవాడు నరకుడు. కనుక నరకునిపైకి యుద్ధము చేయటానికి కృష్ణుడు వెళ్ళినపుడు సత్యభామ కూడా అనుసరించినది. కృష్ణునికి సాయము చేసినది. సత్యాజిత్తు పుత్రిక. కృష్ణుని అష్ట మహిషులలో రుక్మిణి తర్వాత పేర్కొనబడునది ఈమె. ఈమె కృష్ణునికి మిక్కిలి ప్రియురాలు. కనుక అతనినెడబాయక చరించుచుండును

---

పాదసూచికలు: [1] రాధికా/అవతా/2/ముద్దుపళని

కృష్ణునితోపాటు సురలోకమునకేగి పారిజాతముతో పాటు మరలి వచ్చినది. పారిజాతాపహరణ ప్రబంధమును నిర్మించి రాయలవారికి అంకితము గావించిన తిమ్మనగారు ఈ సత్యభామను స్తుతించుటచేయలేదు. ఆ రీతి సత్యభామను స్తుతించిన కవయిత్రి 'ముద్దుపళని' 'రాధికాసాంత్వనములో'

చ. 'నెఱి గమనంబు, వేణియును, నిక్కు చనుంగవ మీది పాదముల్
కరులును శేషభోగియు నగంబులు నాదిమ కూర్మ రాజమై
వఱలగతొల్చు గంధవతి భామ మనోహర రూపసత్వతన్
నరకునిగాంచిపెంచుగతినన్ కృపనెప్పుడు ప్రోచుగావుతన్' [1]

గజగామినియై, అందమైన కురులు [ ద్రౌపది కురులను అసితచ్ఛవిబొల్చు మహాభుజంగమో – తిక్కనప్రయోగము] భుజంగమువలె యుండగ, నిక్కిన చనులజంట పర్వతములవలె ఔన్నత్యముతో వెలసియుండగ, మీగాళ్ళు తాబేటి చిప్పలకు సరితూగగ, మనోహర రూపముతో అతిశయించిన భామ గంధవతి, నరకుని మాతయై వానిని కనీ, పెంపు జేసిన రీతిగా దయచూపి
తనని[కవయిత్రిని] ప్రోచుగాకయని కోరటము చూడగలము. ఇందులో క్రమాలంకారము తొలి సగములో, మలిసగములో శ్లేష ప్రయుక్తమైనవి.

6.14 ***బలరాముని స్తుతులు:*** బలరాముడు / బలభద్రుడు ఆదిశేషుని అంశమున వసుదేవునకు రోహిణి యందు పుట్టిన కొడుకు. యితడు మొదట దేవకీ గర్భమందు చేరి యోగమాయ ఆమె గర్భమునుండి సంకర్షింపగ రోహిణి గర్భమున జేరి పిదప అవతరించెను. కనుకనే ఇతనికి సంకర్షణుడు అనియు పేరు కలదు. అమరకోశములో బలరామునికి చెప్ప బడిన పేర్లు ఇవి.

------------------------------------------------------

పాదసూచికలు: [1] రాధికా/అవతా/3/ముద్దుపళని

" బలభద్రః ప్రలంబఘ్నో బలదేవో(అ)చ్యుతాగ్రజః

రేవతీ రమణో రామః కామపాలో హలాయుధః

నీలాంబరో రౌహిణేయస్తాలంకో ముసలీ హలీ

సంకర్షణ స్సీరపాణిః కాళిందీభేదనో బలః " [1]

అతుల పరాక్రమము గలవాడు బలరాముడు. 'దంతులూరి బాపకవి' తన 'మూర్తి త్రయోపాఖ్యానము'లో ఆ బలదేవుని ప్రతిభకొక ఉదాహరణగా చేయబడిన వర్ణన ఇట్లున్నది. ఇందులో యమున గమనము మార్చినది, హస్తినను పెకలించినది, ద్వివిదుని మదమణచినది, యజనముల చేయు వారిని కష్టములకు గురిచేయు వాడైన పల్వలుని శిక్షించినదిఆయనని చెప్పడము జరిగినది. ఆతనిని పొగడంగ ఫణిపతియైన శేషునికి, భారతీ పతియైన బ్రహ్మకు కూడాసాధ్యము కాదనినారు. శేషుడే బలరాముడను విషయము గుర్తించకపోవడం కొంత చిత్రము కదా.

సీ. " జలకేళి యొనరింప పిలువ రాకున్నచో
యమున వ్రయ్యలు జేసె హలము చాచి
కురుమహీపతులపై కోపంబు కావించి
కరిపురంబవలీలగా పెకల్చె
సుగ్రీవ సచివు నత్యుగ్ర విక్రమశాలి
ద్వివిదుని మదము భేదించి త్రుంచె
తనకు ప్రత్యుత్థాన మొనరింప కున్న మ
న్మస్తంబు తునుమాడి మగుడ నిలిపె

గీ. మునిసవన విఘ్న కారియై మొఱయుచున్న
పల్వలుని బట్టి వధియించె బలము చేత
బలుని శౌర్యంబు నుతి సేయనలవి యగునె ఫణిపతికి నైన భారతీ పతికినైన" [2]

---

పాదసూచికలు: [1] పుట 29/అమరకోశం [2] మూర్తిత్రయో/ఆశ్వా/4/223

'కలిదిండి భావనారాయణ' తన 'విష్ణుపురాణమునందు' ఒకచోట మాత్రము బలదేవుని స్తుతిని నామమాత్రంగా చేసినాడు 'కల ధౌతాచల చాకచక్యా హసదంగా చ్ఛాయతో, సద్వేద్యుస్ బలుస్ కొల్చెదస్' ప్రథమాశ్వాసములో మూడవ పద్యంలో.

6.15 ***ఆదిశేషుని స్తుతులు***: ఆది శేషువు కశ్యపప్రజాపతికిని కద్రువకును కలిగిన తొలి కుమారుడు. తన తల్లి పినతల్లికి చేసిన అక్రమాన్ని తప్పుబట్టినవాడు. గంధమాదన పర్వతము, బదరికాశ్రమము, గోకర్ణము మున్నగు ప్రదేశముల యందు మహాతపము ఆచరించగా బ్రహ్మ ఆతని దీక్షకు మెచ్చి భూభారమును వహించునట్టి శక్తిని ప్రసాదించి నాడు. పినతల్లి సుతుడగు వైనతేయునితో సఖ్యత కలిగి యుండుమని ఆదేశము నిచ్చినాడు. ఈశ్వరుని కరుణ వలన విష్ణువునకు పానుపై సహస్రఫణ ములతో ధరణీధరుడై నాగులకురాజుగా నుండును. భృగు మహర్షిశాప మువలన ద్వాపరయుగమున శ్రీకృష్ణునికి అన్నగా జన్మించెను.

ఆ ఆదిశేషుని 'తమ్మయ' తన 'వైజయంతీ విలాసము'లో స్తుతించినాడు.

కం. " అమరగ నే ఘను శేష
 త్వమునస్ శేషిత్వ సార్థతంబరగున ద
 త్కమలాక్షుం డట్టి సహ
 స్ర ముఖుండు వచః పరంపరల్ కృపసేయుస్" [1]

రామలింగకవి తన పాండురంగ మాహాత్మ్యములో ధరణీ భారము దాల్చు ఆది శేషుని గురించి ఇట్లు ప్రస్తావించినారు.

------------------------------------------------------------

పాదసూచికలు: [1] తమ్మయ /వైజయంతీ విలాసము/4

సీ. ధరణీ భరము దాల్చు తన చేవ యంతయు

భుజపరిఘంబుల బొంకబఱిచి

మునుమిన్కుగనియైనతనప్రజ్ఞ యంతయు

మతి విశేషమునందు మస్తరించి

దైత్యారి వశమైన తన చిత్తమంతయు

నియమ గౌరవమున నివ్వటించి

తనుపు వెన్నెల గాయు తనమూర్తి యంతయు

కీర్తి వైభవమున కీలుగొలిపి

గీ. శేషుడఖిల ప్రపంచ విశేష శాలి

నిత్యముక్తుల కాద్యుడై నిలుచు మేటి

చారు చరిత్రు రామానుజయ్య పుత్రు

కరుణ వేదాద్రి మంత్రి శేఖరునిమనుచు. [1]

అప్పకవీయములో అప్పకవి ఆది శేషుని స్తుతి ఇట్లు కలదు.

కం. “ దాంతు హరిచరణ భక్తి

స్వాంతు రసాతలనిశాంతు నత్యంత దయా

వంతు సమతీతవిధి క

ల్పాంతు పరమ శాంతు నయ్యనంతు తలంతున్” [2]

పలు యుగములలో పలు రూపములతో ప్రభవించిన ఆదిశేషుని నుతించి నాడు ‘శేషము వెంకటపతి’ తన ‘శశాంక విజయము’లో. కృత యుగము నందు అనంతుడు, త్రేతాయుగమున లక్ష్మణుడు, ద్వాపరములో బలరాముడు, కలిలో శ్రీ భాష్య కారుడగు రామానుజుడు ఆయనే.

---

పాదసూచికలు: [1] పాండు/ప్రథ/ 9/ తెనాలి [2] అప్పక/పీ/11]

చ. " కృతయుగ మందనంతుడన త్రేతను లక్ష్మణ సంజ్ఞ రేవతీ

పతి యన ద్వాపరంబునను భాష్యకృ దాఖ్యకలిస్ జనించి శ్రీ

సతిపతి పైఖరిస్ జనన చాతురి చాతురి మీఱి నిత్య శే

షత గాను శేషు డిచ్చు కృప శాశ్వత భోగము సీనమంత్రికిస్" [1]

నిరంతరమూ దాంతుడగు అయ్యనంతుని, వెన్నునికి మృదు పాన్పగు, ఆదిశేషుని భజించినాడు సాహితీసమరాంగణసార్వభౌముడగు రాయడు తన గ్రంథము 'ఆముక్త మాల్యద'లో.

మ. " సిరి నొక్కప్పుడు కన్మొఱంగి హుటీ దన్జేర న్బ్రహర్షించు ను

ర్వరకు న్వంచన గూడ కాగలుగు భాస్వచ్చంద్ర శాలా పరం

పర లయ్యె న్బుఅపైన యెవ్వని ఫణాపంక్తు ల్భజింతు న్నిరం

తరముం దాంతుని నయ్యనంతుని నతీత బ్రహ్మ కల్పాంతునిస్" [2]

హరికి సిరికి చక్కని పానుపై వరలుచు వేవేల భోగముల ప్రకాశము కలిగి దాసభావముతో సర్వదా సేవించు శేషఫణికాంతుడు, 'మరింగంటి' వారి తెనుగున రచితమైన ప్రథమ నిరోష్ఠ్యగ్రంథమగు 'దశరథ రాజనందన చరిత్ర'లో విశేష మగుశుభోక్తులనిచ్చుగాక యని కోరుట గమనించగలము.

చ. ' హరికి పయోధిపుత్రికి నుదంచిత తల్పకమై, సహస్ర భో

గ రుచిర రత్న దీపకళికాప్రకర ప్రభవత్ప్రకాశ వి

స్ఫురణల లోక నిర్మలతబూనగా చేయుచు సర్వ దాస్య పై

ఖరి రచియించు శేషఫణికాంతుడు మాకు శుభోక్తు లీవుతస్' [3]

---

పాదసూచికలు: [1] శేషము వెంకటపతి/ శశాంక విజయము/ఆవ/3

[2] ఆముక్త/ప్రథమా/3 కృష్ణరాయలు

[3] దశరథ రాజనందన చరిత్ర/ మరింగంటి/ప్ర/ 4

6.16 *గరుత్మంతుని స్తుతులు*: గరుడుడు వినత యొక్క కుమారుడు. పక్షిరాజు. ఇతని తండ్రి కశ్యప ప్రజాపతి. ఇతని అన్న అనూరుడు. సూర్యుని రథము నడిపించువాడు. విష్ణువునకు వాహనము. తల్లి దాస్యమును తొలగజేసిన కుమారుడు. విష్ణువునకు సంబంధములైన కథలయందు కొందరు గరుడుని ప్రశంసించినారు.

" కుంకుమాంకిత వర్ణాయ కుందేందు ధవళాయచ

విష్ణు వాహః నమస్తుభ్యం పక్షిరాజాయ తే నమః " అని ప్రార్థనయున్నది

ఒక కవి ఈ పక్షి రాజు ప్రతిభా పాటవములను ఇట్లు ప్రస్తావించినారు.

సీ. పక్షవిక్షేపణ ప్రభవ ఝుంఝూమారు

తాలోల సకల కులాచలుండు

చారుజాంబూనద శైలాగ్రపూర్ణిమా

హరిణ లాంఛన సన్నిభాననుండు

తారకాపథ నటత్సమయ రయభ్రామ్య

మాణ దివ్యవిమాన మండలుండు

అమృతాపహృతి నిమిత్తాహ వరంగ

నిర్గత బాహు శౌర్య దిక్పాల కుండు

గీ. అంబుజోదరవాహన మహోక్షముండు

వజ్రమయకాయు డాశ్రిత వత్సలుండు

భుజగభూషణుడఖిలైక పూజితుండు

వైనతేయుండొసగు మద్వాంఛితములు [1]

గరుడుని ఘనతను కొనియాడిన కవుల కవితల నొకింత చూచెదము. వైనతేయుడు, వెన్నుని పలు రకముల సేవించుచున్నాడు. కళ్యాణ కారకుడైన ఆ గరుడుని సారంగు

---

పాదసూచికలు: [1] చాటు పద్య మణి మంజ వేటూరి ప్ర శా పుట/5]

తమ్మయ తన వైజయంతీ విలాసములో ప్రశంసించినాడు.

శా. "దాసుండై, సఖుడై, తురంగమయి చిత్రచ్ఛత్ర మై, మేలుక

ట్లై, సింహాసనమై, సుమ వ్యజనమై, యంకోత్తంబై, రమో

ల్లాసిన్ జేరి భజించు వేదమయు , కల్యాణ ప్రదున్,కీర్తి ము

ద్రా సీమంతపతీ మనోహరు, గరుత్మంతుం ప్రశంసించెదన్"[1] ]

అమరములో గరుడునికి, కల పలు ఇతర నామములు ఇట్లు గలవు.

" గరుత్మాన్ గరుడ స్తార్ క్ష్యే వైనతేయః ఖగేశ్వరః

నాగాంతకో విష్ణురథ స్సుపర్ణః పన్నగాశనః" [2]

అప్పకవి శబ్దములచే కొంత ఆలంకారికమగు రీతిలో ఆ వైనతేయునిట్లు తలచినాడు.

ఆ సుపర్ణుడు, మురహరవిధేయుడు, అమరసమూహగేయుడు, కనకనిభకాయుడు, కాద్రవేయుభక్షకుడు, తనముఖద్యుతిచే ఆత్రేయుని [చంద్రుని] జయించినవాడు.

గీ. " నామది తలంచెద సువర్ణ నామధేయు

మురహర విధేయు నమర సమూహ గేయు

కనక నిభ కాయు, భక్షిత కాద్రవేయు,

వక్త్ర కాంతి జితాత్రేయు వైనతేయు" [3]

అపర వైష్ణవాభిమానియగు 'రాయలవారు' తమ 'ఆముక్త మాల్యద'లో వినతా సుతుడు, హరి భక్తుడు, విష్ణు దేవుని వాహనము ఐన గరుడుని ఘనముగా శ్లాఘించినాడు.

---

పాదసూచికలు: [1] వైజయ/విలాస/తమ్మయ్య/అవతా/5,

[2] అమరము/ గురుబాల ప్రబో /పుట3, [3] [అప్పకవి/పీఠిక/12]

సీ. “ ఖ నట త్పయోబ్ధి వీక్ష్య రసాతలాన్యోన్య
పిండీకృతాంగ భీతాండజములు
ధృత కులాయార్ధ  ఖండిత సమిల్లవ రూప
చరణాంతిక భ్రమత్తరువరములు
ఘన గుహా ఘటిత ఝూంకరణలోకైక ద్వి
దుందుభీకృత మేరు మందరములు
చటుల ఝంపాతరస్స్వ నగరీ విపరీత
పాతితాశాకోణ పరిబృఢములు

గీ. ప్రబలతర బాడబీకృతే రమ్మదములు
భాస్వరేరమ్మదీకృత బాడబములు
పతగ సమ్రాట్పతత్ర ప్రభంజనములు
వృజినతూలౌఘముల తూల విసరు గాత! [1]

పక్షిరాజగు వైనతేయుని రెక్కల కదలికల వలన సముద్రములయందలి నీరు అట్టిట్టుకాగా పాతాళమందలి సర్పములు భయముతో ఒకదానితో మరొకటి చుట్టుకొనినవట, గరుడుని గాలి రెక్కల ఉధృతికి మహావృక్షాలు పెల్లగిల్లి అతని కాళ్లవద్ద పడినవి. ఆ దృశ్యము సాధారణముగా పక్షులు గూడు నిర్మించుకొనుటకు చిదు గలను/పుల్లలను తీసికోనిపోవు రీతిగా ఉన్నట్లు చెప్పడమున్నది. మేరు మందర గుహలలో గాలి వేగమునకుకలిగిన మ్రోతప్రపంచములో ఆ రెండు జంట భేరీల వాలే ఒప్పినవి. గరుడుడు దాట్లు వేయునపుడు కలిగిన వాయుబలిమి వలన దిక్పాలకులు తమ పట్టణాలనుండి వేరొక పట్టణము వైపునకు విసరివేయబడినారట. అట్టి వైనతేయుని పక్షములు తమ పాపములను తొలగించవలెనని ఉత్ప్రేక్షించినారు రాయలవారు.

--------------------------------------------------------

పాదసూచికలు: [1] ఆముక్త/ప్రథమా/3/కృష్ణదేవరాయలు

'తెనాలి రామలింగ' కవి, తన 'పాండురంగ మాహత్మ్యము'లో పక్షిరాజైన గరుడుని ఈ రీతిగా కీర్తించినాడు.

శా. " మీదం దార ధరా ధరంబు గల యామేరున్న గంజాలి త

త్త్రాదృక్తుండరుచిన్ దలిర్చు ఖగయూథస్వామి, హేమ ప్రభా

ప్రాదుర్భావ శుభ ప్రభుండు మనుచున్ రామానుజామాత్య, శ్రీ

వేదాద్రీశు విరూరి మందిరు జగద్విఖ్యాత కీర్తీశ్వరున్" [1]

తన దశరథరాజనందనచరిత్రలో మరింగంటి వారు క్షేమము కొరకై పక్షిరాజును ఇట్లు స్తుతించినారు. ఆ గరుడుని శక్తి సామర్థ్యాలు అపరిమితము. కొంతవరకు రాయల వారి భావాలు ఇందులో కనిపించినట్లున్నవి.

సీ. ఊతచే నెగయంగనూర్ధ్వదేశంబుల

బ్రహ్మాండభాండ కర్పరమునంట

వాలంబు పురివిప్పజాలదిక్పాలుర

పట్టణంబులు పరవంజికప్ప

పక్షముల్ విసరెడి పవన వేగంబున

గిరులు గృధ్రంబుల కరణి నాడ

నుంకించిత్రొక్కంగ నుర్వీతలంబెల్ల

నహిలోకపర్యంత మడగిపోవ

గీ. దనరి విశ్వ ప్రపంచ మంతయు దానె

యగు విరాడ్రూప సంపత్తి నచ్యుతునకు

వాహనంబై నిశాటుల వడి జయించు

గరుడుని భజింతు క్షేమంబు కొరకు. [2]

---

పాదసూచికలు: [1] పాండు/తెనాలి /ప్రథమా/8, [2] దశర/ప్రథమ/5/ మరింగంటి

6.17 ***విష్వక్సేనుని స్తుతులు:*** విష్ణువుయొక్క పరిచరులలోఒక్కడు. ఇతడు వైకుంఠ సేనానాయకుడు. విష్ణువునకు గల నామములలో యొకటి విష్వక్సేనుడు. విష్వక్సమంతతః వ్యాప్తా సేనా యస్య సః =విష్వక్సేనః [అంతటా వ్యాపించిన సేన గలవాడు =విష్వక్సేనుడు] విష్ణు సహస్రనామములలో125 వ నామము విష్వక్సేనః దీనికి వివరణను ఇట్లు చెప్పడమున్నది. సేనాపతి యగు యితడు యుద్ధమున ప్రవేశించిన మాత్రము చేతనే శత్రువులను దూరముగా పారద్రోలువాడు. 'కకుత్ స్థవిజయ' కర్త 'మట్ల అనంతరాజు' విష్వక్సేనుని కీర్తించిన తీరు ఒక్క సారి పరికిద్దాము.

శా." విష్వగ్వ్యాప్త దరస్మితోష్ఠ తట దేవీసూత్రవత్యుక్తి శు
శ్రూషాప్యాత్మశ్రవణుండు జన్య జనిత భ్రూచాలనోద్ధూత దై
త్యేషాప్యసుండునమత్తురంగ ముఖ విఘ్నేంద్రాత్మ భూస్థాణుడీ
విష్వక్సేనుడు మత్ప్రణీతము జగద్విఖ్యాతముంజేయుతన్" [1] కాలక్రమములో

వైష్ణవమత అవలంబకులు అంతకు పూర్వమున్న ఆచారములను కొంత పక్కకు నెట్టి విఘ్నపతిగా విష్వక్సేనుని పూజించుట చూడగలము. విశ్నుసహ్స్రనామములో 125 వ నామము 'విష్వక్సేన' అనగా శత్రుసేనలను పారదోలువాడు అని భావము. కార్యమునకు అవరోధము కల్పించువారందరూ శత్రువులే కనుక, శైవపరమైన గణపతి స్థానములో విష్వక్సేనుడు ప్రవేశించినాడు. గణపతివలెనే విష్వక్సేనుడు కూడా గజముఖుడని చెప్పటము జరిగినది. గజదర్శనము శుభకరం. రామాయణములో త్రిజటా స్వప్నములో రాముడు విజయము సాధించి గజమునెక్కి పయనించిన విషయము చెప్పబడినది. { సుందరకాండ 27 సర్గ 23-26 శ్లోకాలు} గజారోహణము ఒక గొప్పసన్మానము. 'ఏనుగునె క్కినాము ధరణీంద్రులు మ్రొక్కగ నిక్కినాము' అని ప్రసిద్ధ జంట కవుల మాట ఉండనే ఉన్నది. వెన్నుని సేనాపతిగా, సూత్రవతీశునిగా, బలాధి పునిగా, సువర్చలా తనయునిగా కీర్తించడమున్నది.

---

పాదసూచికలు: [1] కకుత్/ప్రథ/4/మట్ల అనంతరాజు'

తన 'మార్కండేయ పురాణము'లో 'మారన' విష్వక్సేనుని ఇట్లు నుతించినాడు.

శా. ' రంగద్గండ తటీ సమగ్ర మద ధారా గంధ లోభ భ్రమ

ద్భృంగీ మంజుల గీతి వీనుల కతి ప్రీతిం గడకొల్ప స

ర్వాంగంబుల్పుల కాంకితంబుగా కడున్సర్వాత్ముడై యొప్పు ను

త్తుంగాంగున్గజ వక్త్రు మాకు నభివక్త్రుంగా ప్రశంసించెదన్' [1]

గజమునకు మదజలధారలు స్రవించుట ఒక లక్షణము. ఆ మద ధారల గంధము తుమ్మెదలను ఆకర్షించును. అట్లు వచ్చిన తేటుల రెక్కల సడి మంజుల నాదమును చేయుచున్నవి. అట్టి స్థితిని కవి ప్రస్తావించినాడు.

విష్వక్సేనుని, తమ కావ్యములో, కీర్తించిన వారిలో 'తెనాలి రామలింగ' కవి యొకడు. ఆతడు 'పాండురంగ మాహాత్మ్యము'లో ఈ రీతిగా చెప్పడము చూడగలము.

సీ. " సూత్రవతీ దేవి సొబగు పాలిండ్లపై

మలుపచ్చి గందంపువలపుతోడ

శిరసులు వంచు నిర్జరకోటి పనిగొను

తపనీయ వేత్ర హస్తంబుతోడ

పనియేమియనివిన్నపము సేయు చేతనా

ధరములౌ దివ్యాయుధములతోడ

బ్రహ్మాండ కోటుల పారుపత్తెములెల్ల

గని యున్న నిద్దంపు మనసుతోడ

గీ. శార్ఙ్గి రెండవ మూర్తియై జగములేలు

మునిమనోహారి శ్రీసేన ముదలియారి

చేయుపనులెల్ల సఫలముల్ చేయుగాత

మలరి రామానుజయ్యవేదాద్రిపతికి" [2]

---

పాదసూచికలు: [1] మార్క/I/4 [2]పాండు/తెనాలి/ప్రథమా/7]

అప్పకవి తన గ్రంథములో విష్ణుదళ నాయకునికి వినయాంజలి సమర్పించినాడు. చేత తిన్నని బెత్తము, కలుములకన్నె వన్నెతో, జగములను,రక్షించు విష్వక్సేనుని తలచినాడు.

కం. "తిన్నని వేత్రము  కలుములకన్నియ వన్నెయును హస్తకమల తలమునం

చెన్నొందు జగముమనిపెడువెన్నునిదళవాయిదలతు విష్వక్సేనున్" [1]

సాహితీ సమరాంగణ సార్వ భౌముడు 'ఆముక్త మాల్యదలో' రెండవ విష్ణుమూర్తి యని పిలువబడిన విష్వక్సేనుని బంగరు బెత్తమునకు చిత్తము హత్తుకొను రీతిలో నుతినిడినారు.

ఉ. "పూని ముకుందు నాజ్ఞ కనుబొమ్మనె  కాంచి యజాండ భాండము

ల్వానను మీద బోవ నడువన్గొనె తన్నన నగర నిశ్చల

త్వానచల త్వనిష్ఠలె  సమస్త జగంబుల జాడ్య చేతన

ల్గా నుతికెక్కుసైన్యపతి కాంచన వేత్రము నాశ్రయించెదన్" [2]

'వైజయంతీ విలాసము'లో 'సారంగు తమ్మయ' విష్వక్సేనునికి ఈ రీతిగా స్తుతించినాడు.

ఉ. "వేత్రలతన్ ధరించి యరవింద భవాండచరాచరావళుల్

చిత్రగతిన్ నటించుటకు శిక్ష యొనర్పగ సూత్రధారుడై

మిత్ర శశాంక లోచనుడుమెచ్చ పరాంకుశ వృత్తిబెందు  మా

సూత్రవతీశుచే కవిత చొప్పడు గాత నిరంతరాయమై[3] "

దుష్టులను శిక్షించుటకై, నిరంతరము సిద్ధముగా నుండి, లక్ష్మీపతిని భయ భక్తులతో సేవించు సువర్చలాసుతుడైన శోభన సంశీలియగు, సౌవర్ణ వేత్ర ధారియగు విష్వక్సేనుని ఇట్లు నుతించుట చూడగలము.

మ. ' వనజాత ప్రభవాండ దుష్టదనుజ వ్రాతంబు శిక్షింప సం

జనితంబైన ప్రతాపరేఖ యనగా సౌవర్ణ వేత్రంబు గై

కొని లక్ష్మీపతిచెంత చేరి భయభక్తుల్ మీర వర్తించు శో

భన సంశీలి సువర్చలాసుతు మదిన్ భావింతు నశ్రాంతమున్'  [4]

---

పాదసూచికలు: [1] అప్పకవీ /పీఠిక/13, [2] ఆముక్త/4, [3] వైజ/అవ/6[4] దశర/ప్రథమ/6

6.18 ***శ్రీ వేంకటేశ్వర స్వామి స్తుతులు:*** "కలౌ వేంకట నాయకః" అని చెప్పడము తెలిసినదే! ఏడుకొండలవాడు, వడ్డికాసులవాడు, మున్నగు నామములతో పిలువబడువాడు వేంకటపతి. పలు తిరుపతులున్నవి. ముఖ్యముగ ప్రధానమైనది తిరుమల తిరుపతి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా లోని ఘనత వహించిన పుణ్య క్షేత్రము. జనాకర్షణ, ధనాకర్షణ కలిగిన పుణ్య క్షేత్రము. 'నిత్య కళ్యాణము పచ్చ తోరణము' అను లోకోక్తికి ఇది ప్రత్యక్షోదాహరణము. ఒక భక్తుడు ఈ తిరుమల కొండ గూర్చి ప్రశంసల ప్రస్తావన ఇట్లు చేయడము కలదు. ప్రతి పాదము అంతములో 'కొండ' పదమును 12 పర్యాయములు ప్రయోగించడము గలదు.

సీ. 'శృంగారరాయని చెలువు మీఱినకొండ
ఫణిరాజు పేరిటి పసిడి కొండ
పుష్పజాతులనెల్ల భూషింపగల కొండ
కల్ప వృక్షములైదు కల్గు కొండ
చిలుకలు కోవెలల్ చెలగి కూసెడికొండ
మృగ రాజ కోట్లెల్లమెలగు కొండ
ఘోరపాపమువాపు కోనేరుగల కొండ
తలచిన మోక్షంబు దగులు కొండ

గీ. అమరవరులకు వైకుంఠ మైన కొండ,
ఆళువారికి ప్రత్యక్షమైన కొండ
ఆర్థి జూచిన బ్రహ్మాండ మైన కొండ
యేను కనుగొంటి శ్రీ వేంకటేశు కొండ' [1]

కోరికలు తీర్చు కొంగు బంగారము కొండలలో నెలకొన్న కోనేటిరాయడు. కనుకనే సారకాండ పేరుతో తన కవితానంద వాల్మీకి రామాయణములో, తత్కర్త నోంపల్లె కృష్ణ మూర్తి ఇలా వేంకట పతికి మొక్కులిడినారు.

---

పాదసూచికలు: [1] చాటు మ మం వేటూరి ప్ర శా పుట/13

కం. "శ్రీ వాంఛా పరిపూర్తి 'కలౌవేంకటనాయక' యను లాలిత కీర్తిన్

భూవలయంబున పడసిన దేవున్ సద్భావున్ కోర్కి దీర్ప నుతింతున్" [1]

'కలియుగ వైకుంఠముగ' యశము గడించినది తిరుమల. బహు ప్రాచీనమైనది. వైకుంఠము నుండి విరక్తితో స్వామివారు ఇచ్చటికి వచ్చి నెలవైనారని చెప్పడము కలదు. రాయలవారికి వేంకటపతి యన్నచో అమిత గురుభావము. కనుకనే దేవతా స్తుతిని తిమ్మన గారు, తమ పారిజాతాపహరణ ప్రబంధమునందు వేంకటపతి స్తుతితో ప్రారంభించినారు.

ఉభయతారకముగ అటు దేవుని ఇటు రాయనిప్రీతిగా!

లక్ష్మి విష్ణు హృదయ వాసి. వైజయంతి మాలను, కౌస్తుభమును, ధరించిన వాడు వెన్నుడు. కౌస్తుభ మణి యను పీఠముపై కూర్చుని వైజయంతిమాల పట్టుకొని ఉయ్యెల లీల, లక్ష్మి ఊగుచున్నదను రీతిలో వర్ణన చేసినాడు ఈ కవి విశారదుడు.

ఉ. 'శ్రీమదికిం బ్రియంబెసగ చేర్చిన యుయ్యెల లీలా వైజయం

తీమిళి తాచ్చ కౌస్తుభము నిద్దపుగాంతి తనర్చ యాత్మ వ

క్షోమణివేది వొల్పెసగ చూడ్కుల పండువు సేయు వేంకట

స్వామి కృతార్థు జేయు నరస క్షితి నాథుని కృష్ణ రాయనిన్'[2]

లక్ష్మికి , కౌస్తుభమునకు, వైజయంతికి ప్రాధాన్యత అధికముగా నున్నను, ఇవన్నియు ధరించినవాడు, భరించినవాడు విష్ణుమూర్తి. వేంకటపతికి - లక్ష్మీపతికి భేదము లేదు. అది తాత్పర్యము.

'కకుత్ స్థవిజయము'లో 'మట్ల అనంతరాజు'వేంకటపతిని కావ్యకర్తకు ఆయురారోగ్యాదులను దయతో నిచ్చు గాక యని పల్కుతూ, భక్తితో కొలుచు వారలకఱచేతిలోని రత్నమైన ఆదేవదేవుని అలమేల్మంగావరునిగా ప్రస్తావించినారు.

---

పాదసూచికలు: [1] సారకాండ/17, [2] పారిజాతా/ప్ర/1తిమ్మన

శా. "శ్రీపాదాంబు రుహ ద్వయంబిది మదిన్సేవించు వాడెవ్వడో

యా పుణ్యుండఅచేతి రత్నమగు మాకన్నట్లుగా తాదృశ

వ్యాపారోన్ముఖ రత్న హస్త మగు తత్త్వంబాయు రారోగ్య లీ

లాపూర్తుల్దయ కావ్యకర్త కలమేల్మంగా వరుండీవుతన్" [1]

'ముకుందవిలాసము'లో 'కాణాదం పెద్దన సోమయాజి' వెంకటపతి స్తుతి ఇట్లున్నది .

శా. " శ్రీ మాంగల్య వతీ నివాసత నురః శ్రీ దెల్ప శేషాచల

గ్రామ గ్రామణి నా నెసంగి త్రిజగత్కల్యాణ సంధాతయౌ

శ్రీమద్వేంకట నేతబ్రోచు శుభ దృష్టిన్ ముష్టిపల్ల్యన్వయున్

సోమున్ రాజలలాము నూర్జిత కళాస్తోమున్ జయ స్థేమునిన్"[2]

వేంకటపతికి మహా భక్తుడు, సాహితీ సమరాంగణ సార్వ భౌముడు. ఆయన తన 'ఆముక్త మాల్యద'ను ఏడుకొండలవాని స్తుతితో ఆరంభించెను.

ఉ. 'శ్రీకమనీయ హారమణి జెన్నుగ తానును కౌస్తుభంబునం

దా కమలావధూటియు నుదారత తోప పరస్పరాత్మలం

దాకలితంబు లైన తమ యాకృతు లచ్ఛతబైకి దోచి య

స్తోకత నందు దోచెనన శోభిలు వేంకట భర్తగొల్చెదన్' [3]

తన 'విజయవిలాసము' లో చేమకూర వేంకటకవి' వేంకటేశ్వరుని నుతించిన విధము రఘునాథుని బ్రోచుననుచు ఆశించడము చూద్దాం.

ఉ. 'శ్రీరుచిరాంగి నీభవన సీమ ధ్రువంబుగ నిల్పు నేలు దీ

ధారుణి నీవ' యన్నక్రియ దక్షిణపాణి నెఱుంగజేయు శృం

గార రసాబ్ధి వేంకట నగస్థిర వాసుడు పూర్ణ దృష్టి నెం

తే రఘునాథ భూరమణ దేవు గుణంబుల బ్రోవు బ్రోవుతన్" [4]

---

పాదసూచికలు: [1] కకుత్ /ప్రథమా/1, [2] ముకుంద/3, [3] ఆము/అవతా/1, [4] విజయ విలా / 3

6.19 *అలమేలుమంగాస్తుతులు* : అలర్మేల్ మంగను అలమేలుమంగ యని పిలచుట జరిగినది. భక్తులపై కడకంటి చల్లని చూపులను ప్రసరింప జేయునట్టి దేవత. ఆ అలమేలుమంగ శ్రీశానుషంగ, దయాంతరంగ, లాలితాపాంగ. కాణాదం వారు తమ ముకుంద విలాసములో ఆమెను స్తుతించిన తీరు పరికిద్దాము.

సీ. " ఏ నాతి యాకాశ భూనాథ సుతయౌట
తెలుపు నంచిత మధ్య దేశ కలన
నే రామ ధరణీ కుమారియౌ టెఱిగించు
పృథు విడంబ నితంబ బింబ గరిమ
నే నీలవేణి కళానిధి సోదరి
యౌట చాటు మనోహరాస్య లీల
నే యింతి శేషశైల వాసిని యౌట
చూపు రోమాళి వక్షోజ పాళి
గీ. నట్టి శ్రీశానుషంగ దయాంతరంగ
లాలితాపాంగ శ్రీ యలమేలుమంగ
యమ్మహాలక్ష్మి సుకుమారుడని
భాగ్యములొసంగు సోమ భూపాలమణికి" [1]

ఆకాశరాజు కూతురు అనుటవలన ఆ మంగ సన్నసైన మధ్యము కలదని, భూసుత యనుట వలన ఆమె చక్కని ఘనమైన నితంబములు కలదని,
కళానిధి యగు చంద్రుని యనుట చేత మనోహరమైన ముఖము గలదని,
శేషశైల వాసిని యనుట వలన ఘనమగు గిరులవంటి ఉరోజాలు కలదని,

---

పాదసూచికలు: [1] ముకుంద/ఆశ్వా/4]

ఆమె సౌందర్యమును తెలియ జేయుచు సుకుమారుడగుకృతిభర్త యగు సోమ భూపాలునికి అనేక భాగ్యములొసగుమని, లక్ష్మిని అర్థించుట కలదు.

శ్రీవేంకటపతిని అతి భక్తితో సేవించిన సాహితీ సమరాంగణ సార్వభౌముడు ఆ అలమేలుమంగను , లక్ష్మీ రూపముగా భావించినాడు, ప్రత్యేకముగా స్తుతించుట చేయలేదు.

'అయ్యలరాజు రామభద్రకవి', తన 'రామాభ్యుదయము' నందు కృతిభర్త యగు గొబ్బూరి నరసింహనృపాలుని మందిరమ్మున సిరులుంచ వలెనని ఆశించుట గమనించగలము. ఆ అలమేలుమంగకు పలుకుల వెలది కోడలు. ఇంద్రుని సతియగు శచీదేవి మున్నగువారు ఊడిగము సేయువారు. అగజాత యగు అంబ ఆమెకు చెలి. అది ఆమె వైభోగము.

చ. " పలుకు వెలంది యేయువిద పజ్జల కోడలికంబు సేయు నే
కలికి కనుంగు టూడిగపుగత్తియ పిండు శచీముఖామరీ
కులమగజాత యేచెలువకుంజెలి యయ్యలమేలుమంగ భా
సిలు సిరులుంచు గొబ్బురినృసింహ నృపాలుని మందిరంబునన్" [1]

అలమేలుమంగను అతిభక్తితో కొలిచినవారు తాళ్ళపాక వారు. తన సంకీర్తనలలో 'అలరులు కురియగ ఆడెనదే అలకల కులుకుల అలమేలుమంగ' అని అన్నమయ్య పాడటం తెలిసినదే. [రాగం: శంకరాభరణం] తాతగారి చరిత్ర రచించి మనకు ప్రసాదించిన తిరువేంగళనాథుడు [చిన్నన్న] తన ద్విపదలో ఇట్లు ప్రస్తావిస్తారు.

"శ్రీయలమేల్మంగ చిరకృపాపాంగ, కాయజు కన్నతల్లి, కాంతామతల్లి
శ్రీవేంకటేశు పోషిత పద్మకోశు, సేవకపరతంత్రు జితదైత్యతంత్రు" [2]

అష్టమహిషీ కల్యాణము లో చిన్నన్న చేసిన అలమేలుమంగ స్తుతి ఇట్లు కలదు. అందులో మొదటిపాదము అన్నమయ్య చరిత్రలో వలెనున్నది.

---

పాదసూచికలు: [1] [1] రామాభ్యుదయము'/ప్రథమా/2,

[2] అన్నమా చరిత్ర/తితిదే ప్రచు/అవతర/3] 1978. 1-2 ద్వి

‘శ్రీయలమేల్మంగ చిరకృపాపాంగ, కాయజు మాత సాగర తనూజాత

శ్రీవేంకటేశ కాంక్షిత కుచదేశ జీవన భవపాణి శ్రీకర వాణి’[1]

లక్ష్మికి, అలమేలుమంగకు నామభేదము తప్ప లక్షణ భేదము లేదు. కవులు తమ చమత్కారమును చూపుటకై సందర్భముననుసరించి పేర్లు మార్చినప్పటికీ, ఇతరముల విషయములలో మార్పుచూపలేదు.

తన ‘ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము’లో ‘గణపవరపు వేంకటకవి’ అలమేలుమంగను నుతించినారు. అందులో ఇతర కవులు లచ్చిని వర్ణించినదానికి భాషా భేదము తప్ప భావ భేదము లేదు.

ఇక అలమేలుమంగను కవి ప్రస్తుతించిన విధము చూద్దాము.

సీ. “రతికి భారతికి మేరలు నియోగింప నె
చ్చరిక నెమ్మది గొన్న గరిత మిన్న
గారాబమున పాలకడలి ముద్దులు సేయ
నలరు నిల్లంట్రపుటాడుబిడ్డ
కలుములు వెదచల్లు కడకంటి చూపుల
మగని టొమ్మెక్కిన మాయలాడి
చెలికత్తెయగు మంచుమలపట్టిపోరామి
గీలు గొల్పిన రాయగేస్తురాలు

గీ. తనకడుపు చల్లగా జగత్త్రయముగన్న
తల్లి జాబిల్లికిని కూర్మి చెల్లెలయిన
మంగళాకార యలిమేలు మంగ నాదు
తలపులీడేర్చిమా యింట నిలుచు గాత! [2]

-----------------------------------------------------------------

పాదసూచికలు: [1] అష్టమహి కల్యా1-2 ద్విపద. /చిన్నన్న, [2] ప్రబ వేంక విజ విలా/ప్రథ /2 గణప వేంకట

మాధవుని కుమారుడు మారుడు. రతి, కుసుమాస్త్రుడైన మారుని మగనాలు. పద్మనాభుని సుతుడు పద్మగర్భుడు. అతని స్వామిని చదువుల రాణి, భారతి. ఈ రతీ, భారతీ ఇరువురూ లచ్చికి కోడండ్రు. వారిపై అత్త పెత్తనము చేస్తూ వారికి సలహాలు సూచనలు ఇచ్చు ఇంతి, మిన్నయైన గరిమగల గరిత కమల. 'తాళ్ళపాక అన్నయ' రచించిన 'చెల్లపిళ్లరాయచరిత్రము' ( బీబీ నాంచారు కళ్యాణ గాథ) యక్షగానము. సంగీతప్రధానము మనోరంజకమైనది. కథను వినిపించుట ద్వారా శ్రోతలను ఆకట్టుకొనుట దీని లక్ష్యము. ఇది యక్ష గాన పద్ధతికి చెందిన ప్రక్రియ ఇందులో 'రంగ దభినవ హేమ వరరుచిరంగలోచన విజితకురంగ నలమేల్మంగ మదిదనరంగ దలతుస్' అని పుట 2 లో నుతించుట చూడగలము. ఇచ్చట సీత కూడా ప్రస్తుతింపబడినది.

6.20 ***పంచాయుధ స్తుతులు :*** 'చాపశ్శార్ఙ్గం మురారేస్తూ శ్రీవత్సో లాంఛనం మతం' పంచ ఆయుధములు అనగా ఐదు ఆయుధములు. అవి శ్రీ మహావిష్ణువు ఆయుధములు. మహాభారతమునందలి ప్రసిద్ధమగు ప్రత్యేక ప్రస్తావనగల వాటిలో 'భగవద్గీత', 'విష్ణుసహస్రనామము' చాలా ముఖ్యమైనవి. వీటికి టీకలు, తాత్పర్యములు, భాష్యములు చాలా కలవు. భగవద్గీతను వివిధ సంస్థలు తమవ్యాపారాభివృద్ధి కొరకు మానవనైపుణ్యమును పెంచుకొను శాస్త్రముగా ఉపయోగించుకోవడము ఉన్నది. ఇక విష్ణువుయొక్క పంచాయుధములు విష్ణు సహస్ర నామము తుదిలో ప్రస్తావించబడుట చూడగలము.

శంఖ భృన్నందకీ చక్రీ శార్ఙ్గ ధన్వా గదాధరః
రథాంగ పాణి రక్షోభ్యః సర్వ ప్రహరణాయుధః
|| సర్వ ప్రహరణాయుధ ఓం నమ ఇతి||
వనమాలీ గదీ శార్ఙ్గీ చక్రీ చ నందకీ
శ్రీమాన్నారాయణో విష్ణుః వాసుదేవో (అ)భిరక్షతు|

"శ్రీసుదర్శన చక్ర రాజం" అను గంభీరమైన పుస్తకము పుట 39 లో, తత్కర్త ఆచార్యులు 'శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు' ఇలా విశదీకరించినారు.

" తత్త్వ ప్రబోధకమైన విష్ణు సహస్ర నామాలలో 'సర్వప్రహరణాయుధః'అనే నామం వుంది. 'సర్వేషాం ప్రహరణాని ఆయుధాని యస్య సః - సర్వ ప్రహర ణాయుధః' అంటే తననే రక్షకంగా ఆశ్రయించిన వారికి సకల అనిష్టాలను సమూలంగా తొలగించే అనంతాలై అపార సామర్థ్యం కలవై తనకు తగినవై, 'అనేక ఆభరణాలా? ఇవి' అని సందేహించేటట్లు సదా సర్వత్ర సర్వ ప్రకార ములచేత ఆశ్రయించిన వారలను రక్షించటం అనే దీర్ఘసత్రయాగాన దీక్షితాలై సర్వైశ్వర్య భారాలను వహించివుండే దివ్యాయుధాలను కలవాడు అని అర్థం"

ఆయుధముల వివరాలు :

1) శార్ఙ్గము అనునది విష్ణువు ధనుస్సు /చాపము.

2) సుదర్శనము అనునది విష్ణుచక్రము. సుదర్శనః భక్తుల చేత సుఖముగా చూడబడునట్టిది. సు – దర్శనము.

3) పాంచజన్యము అనునది విష్ణువుయొక్క శంఖము. సముద్రమునందు తిమిర రూపమున సంచరించుండిన పంచజనుడు అను రాక్షసునియొక్క ఆస్థివలన పుట్టినది కనుక దీనికి పాంచజన్యమని పేరు.

4) కౌమోదకి అనునది విష్ణువుయొక్క గద. భూమిని సంతోషింప జేయునది. ఇది వరుణుని చేత ఇవ్వబడినది. దైత్యులను సంహరించునది.

విష్ణు సంబంధమైనది కుం = భూమిం, మోదయతి = హర్షయతీతి కుమోదకో విష్ణుః తస్యేయం కౌమోదకీ.

5) నందకము అనునది విష్ణువు యొక్కఖడ్గము. నందయతి దేవానితి నందకః దేవతలను సంతోష పెట్టునది.

ఇవి పంచాయుధముల కొన్ని విశేషములు.

పంచాయుధముల విశిష్ట లక్షణములను తెలుపుచూ "పంచాయుధ స్తోత్రము" ఒకటి కలదు. దానిని ఒక సారి చూద్దాము.

'స్ఫురత్సహస్రార శిఖాతి తీవ్రం సుదర్శనం భాస్కర కోటి తుల్యం|

సురద్విషాం ప్రాణ వినాశివిష్ణోః చక్రం సదా(అ)హం శరణం ప్రపద్యే|| {చక్రము}

విష్ణోర్ముఖోత్థానిలపూరితస్య, యస్య ధ్వనిర్దానవ దర్పహంతా|

తం పాంచజన్యం శశి కోటి శుభ్రం, శంఖం సదాహం శరణం ప్రపద్యే|| {శంఖము}

హిరణ్మయీం మేరుసమాన సారాం, కౌమోదకీం దైత్య కులైకహంత్రీం|

వైకుంఠ వామాగ్ర కరాగ్ర మృష్టాం, గదాం సదాహం శరణం ప్రపద్యే|| {గద}

యజ్జ్యానినాద శ్రవణాత్ సురాణాం, చేతాంసి నిర్ముక్త భయాని సద్యః|

భవంతి దైత్యాశని బాణ వర్షైః శార్ఙ్గం సదాహం శరణం ప్రపద్యే|| {శార్ఙ్గము}

రక్షో(అ)సురాణాం కఠినోగ్ర కంఠచ్ఛేదక్షరచ్ఛోణిత దిగ్ధ సారం|

తం నందకం నామ హరేః ప్రదీప్తం ఖడ్గం సదాహం శరణం ప్రపద్యే|| {నందక ఖడ్గం}

ఇమం హరేః పంచ మహాయుధానాం స్తవం పఠేద్యో(అ)నుదినం ప్రభాతే|

సమస్త దుఃఖాని భయాని సద్యః పాపాని నశ్యన్తి సుఖాని సంతి|| {ఫలశ్రుతి}

వనే రణే శత్రు జలాగ్ని మధ్యే యదృచ్ఛయాపత్సు మహాభయేషు|

పఠేత్త్విదం స్తోత్రమనాకులాత్మా సుఖీ భవేత్ తత్కృత సర్వరక్షః || {ఫలశ్రుతి}

పంచాయుధాలను ముఖ్యముగా వైష్ణవమతావలంబకులైన కవులు స్తుతించినారు. 'మట్లఅనంత భూపాలుడు' తన 'కకుత్ స్థవిజయము' లో హరి పంచాయుధ స్తుతి.

మ. "సకలోచ్చక్రమచక్రమున్విజిత రక్షశ్శంఖము న్శంఖముం

జకితానందక నందకంబు నకృతస్వారాజ ముఖ్యామర

ప్రకర స్వాంతగదన్గదన్గదగార క్రీడ దుత్ఫుల్లవై

రికలాకోక కుచాప చాపమును ప్రార్థింతు న్వచశ్శుద్ధికిన్" [1]

---

పాదసూచికలు: [1] కకుత్/ప్రథమా/3/ మట్లఅనంత భూపాలుడు

పైన వరుసగా - చక్ర, శంఖ, నందక, గద, చాపములనుక్రమముగా స్మరించినారు.

'కాణాదంపెద్దన సోమయాజి' శబ్ద చమత్కారమునకు విలాసము అయిన, 'ముకుంద విలాసము' పేర కూర్చిన ప్రబంధములో హరి పంచాయుధముల స్తుతిని చేసినారు.

కం. "వరధర్మ యుక్తి నరిదర

కరజగదా నందకముల కంపిత విక్రుత

స్మర పంచాయుధగుణముల

హరి పంచాయుధగుణములనభినుతిసేతుస్" [1]

స్మరుడు ఐదు ఆయుధములుకలవాడు. ఆ అయిదూ కోమలమైన సుమములు అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము. అనునవి. మరుని గురుడు మాధవుడు. అవి శత్రు లోక భయంకరములు. చక్ర, గద, శంఖ, నందక, చాపములనునవి. రెండింటిని ప్రస్తావనజేసినాడు ఈ కవీశ్వరుడు. హరివి కఠిన మగు భయంకర ఆయుధాలు. మరునివి కోమలతర కుసుమాలు. అదే తరాలలో అంతరము.

చంధశ్శాస్త్ర మెలకువల వొలుపు తెలుపునది 'అప్పకవీయము'. అందులో దాదాపు ఉన్న దేవతలనందరినీ స్మరించినట్లు చెప్పవచ్చు. భక్తి విపరీతమైనదిగ తోచును.

సీ. "పాంచ జన్యంబన బరగి దైత్యారాతి యెడమను బైకేల నెసగు నెద్దీ

మొగి సుదర్శన నామముననను మాధవు దక్షిణాగ్రహస్తంబున నమరు నెద్ది

కౌమోదకీ సంజ్ఞగని కృష్ణు దాపలి రెండవ కరమున నుండు నెద్ది

నందకం బను పేర నారాయణునికుడి క్రిందటిచే వెలుగొందు నెద్ది

గీ. శార్ఙమన దనరారి కేశవుని వామ

బాహుయుగ మూలమున కనుపట్టు నెద్ది

యట్టి హరి యైదు కైదువులట్ల చక్ర

ఘన గదా ఖడ్గ చాపముల్ మనుచు మమ్ము" [2]

-----------------------------------------------------------

పాదసూచికలు: [1] ముకుందవి/ప్రథమా/12, [2] అప్పక/పీ/6

ఇందులో ఆయుధములు వెన్నుని చేతులలో ఎచ్చటెచ్చట అమరునో తెల్పుతూ తుదిలో అవి ఏమిటో క్రమాలంకారమును ప్రయోగించి వివరించడము కనిపించును.

'ప్రబంధ రాజవేంకటేశ్వర విజయవిలాసము' ను కూర్చినవాడు, ''గణపవరపు వేంకటకవి' ఆయన తన గ్రంథములో కావించిన పంచాయుధ స్తుతిని చూద్దాము.

చ. " శ్రితహిత భోగదన్గదను సేవక శంఖము శంఖమున్సము
న్నతిదిగధీశ నందకమునుంగుణజాతముటంకటంక్రియా
సతతహతోగ్ర దైత్యవర శార్ఙ్గము శార్ఙ్గముపాలిత త్రయీ
శతధ్రుతి ముఖ్య దేవ మునీ చక్రము చక్రము నాశ్రయించెదన్"[1]

ఇందులో కేవలము పంచాయుధములను స్తుతించుట యేగాక వేంకటకవి శబ్దములతో చమత్కారము సలిపినాడు.

ఆశ్రయించిన వారికి భోగములనిడు గద, సేవకులకు శంఖము[నిధి] వంటి శంఖము, సమున్నతి తో దిక్కులకు అధీశుడగు దేవుని నందకము, శత్రు భయంకరమగు వింటి జ్యారవము, దైత్యుల హింసించు శార్ఙ్గము ఇంద్రాది దేవ సమూహముచే ఆశ్రయింపబడు సుదర్శన చక్రమునుప్రస్తుతించినారు.

6.20.1 *<u>పాంచజన్యము స్తుతి:</u>* శ్రీ కృష్ణుడు అన్న యగు బలరామునితో కలసి చిన్ననాడు సాందీపుడను ఒక గురువు వద్దకు విద్యాభ్యాసము చేయుటకు వెళ్ళినాడు. విద్యాభ్యాసము ముగిసినపిదప గురు దక్షిణగ, ప్రభాస తీర్థములో పంచజనుడను రాక్షసుడు, అపహరించు కుపోయిన గురుపుత్రుని, తిరిగి తెచ్చుటకు పోయి, ఆ రాక్షసుని సంహరించి వాని మెడ ఎముకను తాను గ్రహించి, పుత్రుని గురువునకు అప్పగించినాడు. గురుదక్షిణ సమర్పించిన సమయములో ఆతనికి పంచజనుడను రాక్షసుని నుండి లభించినది పాంచజన్యము.

---

పాదసూచికలు: [1] ప్రబం రాజవేంక విజయవిలా/ గణపవరపు వేంకటకవి/[పీ/6

అదియే విష్ణుని శంఖం పాంచజన్యము.

'శంఖో లక్ష్మీపతేః పాంచజన్యః ' పాంచజన్యము విష్ణు శంఖము పేరు.

పాంచజన్యమును స్తుతిస్తూ రాయలవారు తమ 'ఆముక్తమాల్యద'లో ఇట్లు పేర్కొనినారు.

మ. " హరి పూరింప తదాస్య మారుత సుగంధాకృష్టమై నాభి పం
కరుహ క్రోడ మిళింద బృంద మెదురెక్క దుష్క్రియా పంక సం
కరదైత్యాసు పరంపరం గముచు రేఖం బొల్చు రాకా నిశా
కరగౌరద్యుతి పాంచజన్య మొసగు కళ్యాణ సాకల్యముస్" [1]

'శశాంకవిజయము'లో 'శేషము వేంకటపతి' జితాసుర సైన్యము అభ్ర విభ్రమ స్థేమఘుమం ఘుమం ధ్వని విజృంభిత జన్యమైన పాంచజన్యమునిట్లు ప్రస్తుతించినారు.

ఉ. " హైమవతీశ మాన్యము జితాసుర సైన్యమునభ్ర విభ్రమ
స్థేమ ఘుమం ఘుమం ధ్వని విజృంభిత జన్యము పాంచజన్యమా
త్మామల కీర్తి కార్తిక నిశాబ్జ ధుతారి నొనర్చు దైవత
స్వామిని భోగ లీల గెలువం గల వంగల సీన యార్యునిస్"[2]

6.20.2 *నందకము స్తుతి :* నందకము విష్ణువు యొక్క ఖడ్గము.

'నందయతి దేవా నితి నందకః' అనగా దేవతలను సంతోషపెట్టునది.

అది "ఇనకోటి తేజము కలిగిన హేతిరాజమని " తాళ్ళపాక అన్నమయ్య మనుమడు చిన్నన్న [తిరువేంగళనాథుడు] తాత గారి జీవిత చరిత్రలో చెప్పినాడు. సంకీర్తనా చార్యుడు తాళ్ళపాక అన్నమయ్య నందకాంశ సంభూతుడని ప్రశస్తి ఉన్నది.

---

పాదసూచికలు: [1] ఆము/I/5, [2] శశాంక/పీఠిక/7 / శేషము వేంకటపతి'

'దండిపై గారుడ స్తంభంబు దండ, దండంబు లిడుచు సంతానంబు వేడ

వరదుడై వేంకటేశ్వరుడుతా బూను బిరుదు గజ్జియల ముప్పిడి కఠారంబు

కలలోన నొసగ నక్కజమంది తపము ఫలియించె నణచు దంపతులేగి రంత! [1]

దీనిని ముఖ్యముగా విష్ణు భక్తులు ప్రస్తావించుట కలదు.

మూరురాయర గండడు అని కీర్తింపబడిన శ్రీ కృష్ణ దేవరాయలు తన 'ఆముక్త మాల్యద'లో విష్ణుదేవుని ఖడ్గమైన నందకమును ఇట్లు పొగడినారు.

మ. " ప్రతతోర్ధ్వాధర భాగపీఠయుగళీ భాస్వత్త్సరుస్తంభసం

స్థితి తీండ్రించెడు జాళువామొసలివాదీప్తార్చిగా కజ్జలా

న్వితధూమాసిత రేఖపై యలుగుగా విజ్ఞాన దీపాంకురా

కృతి నందం బగు నందకం బఘులతా శ్రేణిచ్ఛిదంజేయుతన్"[2]

6.20.3 ***కౌమోదకీ స్తుతి***:- 'కౌమోదకీ గదా' కౌమోదకి విష్ణుదేవుని గద.

కుం =భూమిం, మోదయతి = హర్షయతీతి, కుమోదకో విష్ణుః తస్యేయం కౌమోదకీ.

భూమిని సంతోషింప జేయు విష్ణుని సంబంధమయినది. వసుధకు మోదమునొసగు కౌమోదక ప్రస్తుతి రాయలవారు ఇట్లు చేసినారు.

ఉ. "యాదవ సార్వభౌమ భయదాయత బాహునియుక్తి జేసి యెం

దే దనుజేంద్ర సాళ్వపుర హేమమణీ వరణంబు సంగతం

బై దివి నాత్మ కంకణము లందొక కంకణ మయ్యె నట్టి కౌ

మోదకి మోదకీలిత సముజ్జ్వల కల్పకమాల్య కొల్చెదన్" [3]

యాగదాన భరితుడైన, కృతిభర్త సీనార్యుని ప్రోచుగాక యనుచు , తన 'శశాంక విజయము'లో 'శేషము వేంకటపతి' కాంక్షించినారు.

---

పాదసూచికలు: [1] అన్నమయ్య చరిత్ర /ద్విపద/చిన్నన్న/తితిదే ప్రచు

[2] ఆము1/6 [3] ఆము/I/7

గీ. "కళుకు జగజంపు విడి కెంపు కంకణంపు పలుకు లొలయంగ హరి కేలు పట్టు విడని

అమిత భోగద ఆ గద, యాగదాన భరితు సీనార్యు సత్కళా భరితు బ్రోచు" [1]

6.20.4 *శార్ఙ్గ స్తుతి :* వెన్నుని చేతి యందలి ధనువు శార్ఙ్గమనబడును.

' శార్ఙ్గమన దనరారి కేశవుని వామ

బాహుయుగ మూలమున కనుపట్టు నెద్ది' – అప్పకవి అన్నాడు.

రాయలవారు తమ 'ఆముక్త మాల్యద' లో ఈ శార్ఙ్గము నిట్లు నుతించినారు.

చ. " పిడికెడు కౌను కొప్పు గని ప్రేమ త్రివక్ర సమాంగి జేసి తే

బిడకెడు కౌను కొప్పు పయి పెచ్చు గుణంబును గంటినంచు నే

ర్పడర నిజ త్రివక్రతయు పాపగా మ్రొక్కెడు ణా సుమాలిపై

జడిగొని నమ్ము లీను హరి శార్ఙ్గ ధనుర్లత గాచు గావుతన్" [2]

6.20.5 *సుదర్శన స్తుతి*: సుదర్శనము చక్ర రాజము. విష్ణువు ఆయుధము. చక్రం సుదర్శనః. భక్తై స్సుఖేన దృశ్యత ఇతి సుదర్శనః [భక్తులచేత సుఖముగా చూడబడు నట్టిది.శోభనం దర్శన మస్యేతి వా. అని కూడ నిర్వచనము. కాంతికి ప్రతీక. మంచి దర్శనము 'సు – దర్శనము'. చిన్నన్న "దనుజ కర్శనము మాధవ సుదర్శనము " అని ప్రస్తుతించుట కలదు.

" సహస్రాదిత్య సంకాశం సహస్ర వదనాంబరమ్

సహస్ర దోస్సహస్రారం ప్రపద్యేహం సుదర్శనం

హుంకార భైరవం భీమం ప్రపన్నార్తి హరం ప్రభుం

సర్వ పాప ప్రశమనం ప్రపద్యేహం సుదర్శనం" అని భక్తితో చక్రరాజమునకు నీరాజనము అర్పించుట కలదు. వైష్ణవులు, 'సుదర్శన చక్రమును' "చక్రత్తాళ్వారని" యనుట కలదు.

---------------------------------------------------------------

పాదసూచికలు: [1] శశాంక/ అవతారిక/8, [2] ఆము/ 1/8

అన్నమయ్య గారు చక్రమును బహువిధాల కీర్తించినారు. యోగపరమైన విషయములను చెప్పినటులకొన్ని సంకీర్తనల పరిశీలనలవలన తెలియుచున్నది.

పోతన గారి భాగవతములో, అంబరీషోపాఖ్యానమునందు, విష్ణువు తన చక్రమును రాజు రక్షణకు యిచ్చినాడు. దుర్వాసుడు ముక్కోపి. తనను ఆహ్వానించి తనకై ఎదురుచూడక ద్వాదశి పారణ చేసిన రాజును శిక్షించుటకై , 'కృత్య' ను ప్రయోగించి నాడు. భక్తుడైన అంబరీషుని రక్షించుటకై ధర్మ నిర్వహణలో నున్న చక్రము, కృత్యను ధ్వంసముగావించి మునిని శిక్షించుటకు వెంబడించినది. విధి శంకరులు, మునిని వెన్నుని శరణు కోరమనినారు. విష్ణువు, తన భక్తుడగు అంబరీషుని శరణు కోరమని చెప్పినాడు.

తనను శరణు వేడిన మునిని కావమని అర్థించి అంబరీషుడు చేసిన సుదర్శన చక్ర ప్రార్థన.

సీ. నీవ పావకుడవు, నీవ సూర్యుండవు
నీవ చంద్రుండవు, నీవ జలము,
నీవ నేలయు, నింగి నీవ, సమీరంబు
నీవ, భూతేంద్రియ నికర మీవ,
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును ,
నీవ యజ్ఞంబును, నీవ ఫలము
నీవ లోకేశులు, నీవ సర్వాత్మయు,
నీవ కాలంబును ! నీవ జగము

గీ. నీవ బహు యజ్ఞ భోజివి, నీవ నిత్య
మూలతేజంబు నీకు నే మ్రొక్కు వాడ
నీరజాక్షుండు చాల మన్నించు నట్టి
శస్త్రముఖ్యమ! కావవే చాలు మునిని. [1]

---

పాదసూచికలు: [1] పోతన భాగవ/ స్క/9/129 పద్యం

'ఆముక్త మాల్యద' లో 'రాయల'వారు సుదర్శన చక్రమును స్తుతించినారు. అందులో కొద్దిగా రాహు మస్తక ఖండన విషయము తెల్పినారు. ఇది క్షీర సాగర మధనము జేసి అమృతమును సంపాదించి, మోహిని రూపాన ముకుందుడు, పంపకము జేసిన విషయము. రాయల వారు సుదర్శన దేవునికి చేసిన స్తవము చూద్దాము.

చ. "అడరు గళాస్రధారలు మహాముఖవాంత సుధాంబు ధారలున్
పొడవగు వహ్ని కీలములు పొంగునుగాబెఱ దైత్య కోటికిన్
బెడిదపు కిన్కతో నేసారు పెట్టిన పెద్ద పెనంటి వోలె నె
క్కుడు వెస రాహు మస్తకముగొన్న సుదర్శన దేవు కొల్చెదన్" [1]

'శశాంకవిజయము' అను తన ప్రబంధమునందు 'శేషం వెంకటపతి' ఇంద్ర శాత్రవ ధూమ కేతువైన, ధర్మ సేతువైన, విమలరూపియైన, విశ్వదీపమైన, శక్రరక్షయైన చక్ర రాజాన్ని ఈ రీతిగా ప్రస్తుతించినారు.

ఉ. " ఓ మధుసూదనా! యన నోహో యని తార్క్ష్యని కన్న మున్నుప్రో
ద్దామెతవచ్చు శౌరికిని డా మునుగా జనితాంత దంతి ర
క్షామతి నక్ర మస్తకము చెక్కులు చేసిన చక్రమెప్పుడున్
క్షేమమొసంగి చక్రపతి జేయుత సీనయమంత్రి భాస్కరున్" [2]

ఇచ్చట కవి "నీరాట వనాటములకు జరిగిన పోరాటవిషయమును స్పృశించి, గజము యొక్క ఆరాటమును తొలగ చేయుటకు, సత్వరితా కంపిత భూమి చక్ర మును, మహోద్యద్విస్ఫులింగచ్ఛటా పరి భూతాంబర శుక్రమును, బహువిధ బ్రహ్మాండ భాండచ్ఛటాంతర నిర్వక్రమును, పాలితాఖిల సుధాంధశ్చక్రమును యైన చక్రమును" పంపిన విషయమును ప్రస్తావించిన రీతిని మనము చూడగలము. పలువురు మహనీయులు తమ తమ అనుభవాలను, అభిమతాన్ని అనుసరించి సుదర్శన చక్రస్తుతి చేసినారు.

---

పాదసూచికలు: [1] ఆముక్త/1/9 [2] శశాంక/పీ/6

**ఉత్తర హరి వంశములో నాచన సోమనాథుడు చక్రమును ఇట్లు ప్రస్తుతించినాడు.**

**" సతతంబు న్నుతియింతు జంతుమయ సంసార క్రియా రక్షణా**

**క్షత శౌర్య కపితారి పక్షమగుటన్ సంగ్రామ భీమ భ్రమా**

**గత గేహాంతిక దీర్ఘికాతటలుఠత్కంఠ చ్ఛిదా చ్ఛాదన**

**క్షతజ క్షాళితకేలి తామరస రక్షశ్చక్రమున్ జక్రమున్". [1]**

---

**పాదసూచికలు: [1] ఉత్తర హరి వంశము నాచన సోమనాథుడు 3/149**

# సప్తమాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు–ఇతరదేవతాస్తుతులు

## *VII సప్తమాధ్యాయము.*

7 ***ఇతర దేవతాస్తుతులు*** ముఖ్యముగా ఇంతవరకు శైవ, వైష్ణవ దేవతా సంబంధ విషయములను చూచినాము. అసలు హిందూ / సనాతన పద్ధతిలో' ప్రకృతి'ని వీరు గౌరవించి దైవత్వమును ఆపాదించినారు. మానవుని జీవనము ప్రత్యక్షముగా మరియు పరోక్షముగా పంచభూతములపైన ఆధారపడి యుండుటయే ఇందులకు కారణము. జీవన విధానములో లక్ష్యమును నిర్ణయించుకొని ప్రకృతిని గౌరవించినవారు పెద్దలు.

### 7.1 *బ్రహ్మ స్తుతులు.*

సాధారణముగా మనము తెలుగులో ప్రయోగించు బ్రహ్మ శబ్దము సంస్కృతములో 'బ్రహ్మన్' అని చెప్పబడును. 'వేదస్తత్వంతవో బ్రహ్మ బ్రహ్మ విప్రః ప్రజాపతిః' బ్రహ్మ అనగా –వేదమునకు, పరమాత్మకు, తపస్సునకు, విప్రునికి, ప్రజాపతికి కల నామములు. విరాట్పురుషుని నాభి నుండి ఉద్భవించిన కమలమే, సృష్టికర్తగా చెప్పబడు బ్రహ్మజన్మస్థానము. అందులకే బ్రహ్మ కమలసంభవుడు. త్యాగరాజు ఒక కీర్తనలో భవనుత నా మనమున బడలిక దీర రమింపుము, 'కమల సంభవనుత' అని శబ్దముపై చమత్కారంగా ప్రయోగము చేయటమున్నది. మొదట భవుడు = ఈశ్వరుడు, కమలసంభవ = బ్రహ్మ. సాధారణార్థములో ప్రజలను వృద్ధి పొందించువాడు[బ్రహ్మ], తనంతట తాను జన్మించినవాడు [ఆత్మభువుడు], పరమోత్కృష్ట పదమునందు ఉండువాడు, తండ్రులకు కూడా తండ్రి, నాలుగు ముఖములు కలవాడు,హిరణ్యమును గర్భమునందు కలవాడు, విశ్వమును సృజించిన వాడు సర్వమును చేయువాడు, భూతములను సృజించువాడు.... ఇత్యాది పలు విశేషములు ఈయనకు గలవు. కవులు ఈయనను, పలుకుల చెలి, వీణాపాణి, సరస్వతి విద్యాధిదేవత పతిగా వ్యవహరించడము చూడగలము.

తెలుగువారి భాగ్యమైన 'భాగవతము'ను మనకందించిన 'బమ్మెర పోతన'గారు విధాతకు, భారతీ హృదయ సౌఖ్య విధాతకు వందనము లిడిన తీరు చూద్దాము. గణపతికన్న ముందే ఈ సురజ్యేష్ఠునికి సేవజేసినాడు.

ఉ. ' ఆతత సేవజేసెద సమస్త చరాచర భూత సృష్టి వి
జ్ఞాతకు భారతీ హృదయ సౌఖ్య విధాతకు వేద రాశిని
ర్ణేతకు దేవతా నికర నేతకు కల్మషజేతకున్ నత
త్రాతకు ధాతకున్ నిఖిల తాపస లోక శుభప్రదాతకున్' [1]

ఆ విధాత శుభ ప్రదాత, దేవతలకు నేత. చర అచర భూతములసృష్టి విషయ రహస్యములను తెలిసినవాడు. భారతీదేవికి హృదయ సౌఖ్య విధాత. అంటూ స్తుతించినారు. అమరకోశములో బ్రహ్మ దేవునికి గల పేర్లు ఒక సారి చూద్దాము.

"బ్రహ్మాత్మభూః సురజ్యేష్ఠః పరమేష్ఠీ పితామహః
హిరణ్యగర్భో లోకేశ స్స్వయంభూ శ్చతురాననః
ధాతాబ్జయోని ర్ద్రుహిణో విరించిః కమలాసనః
స్రష్టా ప్రజాపతిర్వేధా విధాతా విశ్వసృడ్విధిః
(శతానంద శ్చతధృతిర్విరించో[అ]జ విరించినః) [2]

బ్రహ్మ సృష్టికర్త, వివిధ ప్రాణికోటి లలాట లేఖన మహావిద్యాసంధాత. నేర్పు మీఱగ లోకములను నిర్మించువాడు. ఆయువును నిర్ణయించువాడు. అందులకే, మొల్ల తన రామాయణములో ఆ విధాతను ఇట్లు స్తుతించినది.

ఉ. " మించి సమస్త లోకములు మిన్నక తాఁ దన నేర్పుమీఱ ని
ర్మించి, ప్రగల్భతన్ మెఱసి మేలును కీడును ప్రాణికోట్లు సే
వించ ఘటించి శాస్త్రములు, వేదములుం కొనియాడుచుండు నా
కాంచన గర్భుడిచ్చునధికంబుగ నాయువు నీప్సితార్థముల్ " [3]

పాదసూచికలు: [1] పోత/భాగ/స్కం1/3, [2] అమరము పుట 33, [3] మొల్ల/అవ/4

ఆంధ్ర కవితాపితామహుడు, అల్లసాని పెద్దనామాత్యులు తన మనుచరిత్ర లో విధాతను కొలిచినది చూడుడు.

ఉ. నాలుగు మోములన్ నిగమ నాదము లుప్పతిలం ప్రచండవా
తూలహతిన్ జనించు రొదతోడి గుహావళినొప్పు మేరువుం
బోలి పయోజపీఠి ముని ముఖ్యులు గొల్వగ వాణి గూడి పే
రోలగమున్న ధాత విభవోజ్జ్వలు జేయుత కృష్ణరాయనిన్' [1]

నలువకున్న పలువిశేషములను వాడి, తన కృతిభర్తకు - చిరాయువు, ఉన్నతి కలిగింపగ చేసిన ప్రార్థన. కవి శ్రీనాథుడు. కృతి నాయకుడు పెద్దయసింగ మంత్రి. కావ్యము తెలుగు పంచ కావ్యములలో కడపటిది.

ఉ. " హాటక గర్భుచేత కమలాసనుచే చతురాస్య కంఠ శృం
గాటక వీథికాకృత విగాహ చతుః శ్రుతిచేత దేవతా
కోటి కిరీటసంఘటిత కోమల పాద సరోజుచే జగ
న్నాటక సూత్రుచేత కృతినాథుడు గాంచు చిరాయురున్నతుల్" [2]

కవులు ప్రార్థనతోపాటు కొంత చిలిపితనమో /శృంగారమో ఒలికించుట కొన్ని సందర్భములలో కనిపించును. అట్టి విశేషము 'మూర్తి త్రయోపాఖ్యానము'లో దంతులూరి బాప కవి మనచచేత దర్శింపజేసినాడు. మరాళగామిని యగు వాగ్దేవికి, అంచ యేనుగు మావంతు యైన, వనజభవునికి మధ్య సంభవించిన సంభాషణ.

చ. 'కరి రథ వాజి ముఖ్యములు గాక మరాళము మీకు యానమై
పరగుట కేమి హేతువన భారతి? నీ గమనంబు దీనికిం
దొరగుట మాకు నిచ్చలు ననూనము ప్రేమని పల్కుధాత యా
దరమున నిచ్చు గాక నిరతంబు మదీయ మనోరథార్థముల్ ' [3]

---------------------------------------------------------

పాదసూచికలు: [1] మను/ప్రథమ/3 [2] శ్రీనాథ/శృంగార నైష/ప్రథమా/3 [3] [ ప్రథ /3 ]

దేవా! హస్తి, రథ, తురగాదులను వదలి, మరాళమును వాహనముగా ఎందుకు గ్రహించినారు? అని ప్రశ్నించిన పలుకులచెలికి, కమల గర్భుడు గడుసుగా మరాళ గమనము, సరస్వతి నడకకు దొరయు కారణమున అనూనమైన ప్రేమతో రాయంచను తత్తడిగా ఎన్నుకొన్నా నని సమాధానమునిచ్చినాడు. ఔరా! విరించి వైదుష్యము. సారకాండము పేర రాయబడిన కవితానంద రామాయణములో, కృతికర్త సోంపల్లె కృష్ణమూర్తిగారు, సదుపాస్యుడగు చతురాస్యుని పొగడినతీరు చూడండి.

శారద వాక్చతురతను విని మెచ్చుకొనుచు తన కార్యమును ఘటించు చున్నాడట విధాత.

మ. 'చతురత్వంబున వాణి వాఙ్నిలయయై సంతోషమున్ నింప నా
తతమౌ రీతి సమస్త భూతచయ సత్త్వంబుల్ తదాయుష్యముల్
నుతిపాత్రంబుగా కూర్చి జన్మ ఫల సందోహంబు సంధించు నా
చతురాస్యున్ సదుపాస్యున్ మత్కృతిచిరస్థంబౌనటుల్ కొల్చెదన్'[1]

తనకు మనవిని చేయగ వచ్చు దేవతలను ఒక ముఖముతో, మునీంద్రులను మరొక వదనముతో, ఒక ప్రక్కనున్న ఉపనిషత్తులను కాంతా సమూహముపై ఒక ఆననము, నాలుగవ మోమును భారతి చనుగవపై కటాక్షశ్రీలను సారించి పెద్ద తామరగద్దియపైన ఒద్దికగా కూర్చున్న వేల్పుల పెద్దయైన బ్రహ్మను భక్తితో ప్రార్థించినాడు. గుమ్మరాజు రామకవి తన చౌడేశ్వరీ మాహాత్మ్యములో. ఆ పద్యమొక సారి చూద్దాము.

మ. 'మనవుల్సెప్పగ వచ్చు దేవతలపై మౌనీంద్ర బృందంబుపై
తనకిర్వంకల కొల్చు నయ్యుపనిషత్కాంతాళిపై భారతీ
స్తనగుచ్ఛంబులపై చతుర్విధకటాక్ష శ్రీల సారించి కొ
ల్వున పొందామరగద్దె పై నెసగు వేల్పుంబెద్దఁ బ్రార్థించెదన్' [2]

------------------------------------

పాదసూచికలు: [1] సారకాండము /6 [2] చౌడే /5

పరమేశ్వరుని దక్షిణభాగమున జన్మను పొంది, పరమేశుని కృపచే విశ్వా నిర్మాణము చేసినవాడైనాడు అజుడు. ఆ ధాతను, తన 'కుమార సంభవము'లో 'నన్నె చోడుడు' ఇట్లు కొనియాడినాడు.

చ. " అమిత రజోగుణ స్ఫురణ నావహమై పరమేశు దక్షిణాం
గమున జనించి భక్తి చిరకాలము సద్విధి గొల్చి తత్ప్రసా
దమున నజాండ లోక జనితత్వసువేద కళాగమాదివి
శ్వముసృజియించిపొల్చు నజువాగ్విభుసంస్తుతి చేతుసన్మతిన్" [1]

విశ్వ జన ప్రమోదమును, వాణీవల్లభుడు ఘటించుగాకయని 'పైజయంతీ విలాస' కర్త అభిలషించినాడు.

ఉ. " మంఖాత రోష్ఠబింబము సమంచిత దాడిమ బీజ పంక్తి లే
కంజని జూచి పల్కు చిలుకన్ ప్రియముల్ చినుకన్ చతుర్ముఖీ
పంజర పాలికన్ బెనుచు ప్రౌఢ వినోది ఘటించు గావుతం
గంజభవుండు మత్కృతిముఖంబున విశ్వజన ప్రమోదమున్" [2]

ఒక్కొక్క కవికి ఒక్కొక్క రీతిగా ఆలోచనలు తరంగాలవలె ప్రభవించుచుండును. ఒకరి దృష్టి శృంగారపరమైనది కాగా, వేదాంత పరమైనది మరొకరిది, చమత్కారపూర్వకమైనది ఒకరిది కాగా, భక్తి భావ సంభరితమైనది ఇంకొకరిది. ఇలా పలురకాల రచనలు మనకు ప్రత్యక్షమగు చుండును. 'కువలయాశ్వ చరిత్రము' కూర్చిన కవి 'సవరము చిననారాయణ నాయకుడు'. ఇతడు బ్రహ్మ స్తుతిని చేయుటకై సిద్ధమైనాడు. చదువుల లలన మేనిలోని వైభవ రుచిని కనులార కాంచిన కమలగర్భునికి వేద సంబంధ విషయాలు స్మరణకు రాసాగినవి. ఇచట ప్రత్యేకముగా చెప్పబడిన 'పదము', 'చర్చ', 'క్రమము' 'జట' మున్నగువాటికి వేదపరమైన భాష యందు అర్థములు వేరు. వానిని – వాణిలో క్రమముగా చూచి తలపునకు తెచ్చుకొన్నాడు తమ్మిచూలి.

---------------------------------------------------

పాదసూచికలు: [1] ప్రథమా/5 [2] పైజ/ఆవ/7

సీ. " నుడుగుల పూబోడి యడుగుల బెడగు వీ
క్షించుచో 'పదము' పఠించు కొనుచు
పలుకుటొయ్యారి గుబ్బకవ గంధపు పూత
నెంచుచో ' చర్చ' వర్ణించుకొనుచు
మాటమిటారి సయ్యాటంపు నడ నిరీ
క్షించుచో ' క్రమము' గుణించుకొనుచు
మినుకు బ్రోయాలి కింపున కీలుజడ యల్ల
చేరువుచో నల ' జట 'చెప్పుకొనుచు

గీ. వాణి శారీర రుచి వైభవంబు జూచు
వేళ ' వర్ణ క్రమంబు' భావించు కొనుచు
నెమ్మినగు తమ్మి చూలి మా తిమ్మ నృపతి
పుత్రు నారాయణాధిపు బ్రోచుగాత! [1]

ఒకటిమాత్రము ప్రత్యేకముగా ప్రస్తావించ తగినది ఏమనగా... మన దృష్టి సక్రమముగా యున్నపుడు విషయములను కూడ సక్రమముగానే చూడగలము.

ఆంగ్లములో దీనిని "PERCEPTION' అంటారు. మనవాళ్ళు 'యద్భావం తద్భవతి' అనడమున్నది. చూచే దృష్టినిబట్టి ఒకేవస్తువు, వేర్వేరుగ కన్పించును. శ్రీ కాళహస్తిశతకములో, ధూర్జటి పద్యమునిక్కడ చెప్పవచ్చును. శివుని లింగము యొక్క రూపమేది? యని సందేహముకలుగునని , ధూర్జటి చెప్పినపద్యమిది.

శా. "నిన్నే రూపముగా భజింతు మదిలో? నీ రూపు మోకాలొ, స్త్రీ
చన్నో కుంచమొ మేక పెంటికయొ, యీ సందేహముల్మాన్పి నా
కన్నారన్భవదీయమూర్తి సగుణా కారంబుగాజూపవే !
చిన్నీరేజ విహార మత్త మధుపా! శ్రీకాళహస్తీశ్వరా!" [2]

---

పాదసూచికలు: [1] కువలా/1/5 [2] శ్రీకాళ/శతకం

విధాత, పలుకుల కొమ్మ నెమ్మోము పార్వణ  చంద్రునిగా భావించి, తన ఆసనమైన కమలము ముకుళించునో యని నేర్పుతో పలు అన్య మార్గములను అన్వేషించుచున్నాడట! ఇది 'శారదామూర్తి' తన 'కావ్యాలంకార సంగ్రహము' నందు [నరసభూపాలీయము] చమత్కరించిన తీరు. ఆ విధాత విషయమిది.

చ.  " పలుకుల కొమ్మ నెమ్మొగము పార్వణ  చంద్రునిగా దలంచి యు
 జ్జ్వల నిజ భద్ర పీఠ జలజంబు నిమీలిత మౌనొ యంచు నే
 ర్పలవడ భారతీ వనిత నాత్మ ముఖంబులలోనె తాల్పుచుం
 జెలగు విధాత యొాబ నృ సింహునకిచ్చు చిరాయు రున్నతుల్" [1]

ఆయన ముఖమునుండి  వేదరూప  నాదము ఉద్భవించును. ఆమె వీణ నుండి స్వరములు వెలువడును. కనుకనే కాబోలు తన 'వాల్మీకి చరిత్రము' లో శబ్ద సౌందర్యమును ప్రకటింప చేయుచూ, 'రఘునాథ నాయకుడు' విరించి గురించి తన సాహితీ గరిమ సవరించి పద్యములో 'పదునైదు పర్యాయాలు' బిందుపూర్వక చకారమును { "ంచి" } హృద్యముగా ప్రవచించినాడు/ ప్రయోగించినాడు.

ఉ. " పంచిన లీల రాగము ప్రపంచితమై చెలగన్ విపంచి వా
 యించి తనున్నగించి యెలయించినప్రేయసి నల్కడించి, మో
 దించి ప్రవీణవౌదని నుతించి కవుంగిట నుంచి ప్రేమ యూ
 రించి వరించి మించిన విరించి మముం కరుణించి ప్రోవుతన్"[2]

హిరణ్య గర్భుడు, సరస్వతీశ్వరుడు, కవులచే సమాశ్రయింప బడినవాడు, భువన నిర్మాతగా ప్రసిద్ధినందినవాడు బ్రహ్మ. ఆయనను కంకంటి పాపరాజు తన ఉత్తర రామాయణములో చిరాయువును ఇచ్చుగాక యని స్తుతించుట చూడగలము.

-------------------------------------------------------

పాదసూచికలు: [1] నరస/3

[2] వాల్మీకి/7

చ. “ భువనములం బ్రసిద్ధి గని భూరితరోర్మి వర ప్రభావ మొం

దిఁ విధుని రాక కుబ్బుచు నుదీర్ణ గుణాంచిత రత్న రాశియై

కవులు సమాశ్రయింప తగి కర్బుర గర్భత శ్రీ గురుత్వముం

దవులు సరస్వతీశ్వరు డుదారత మాకు చిరాయువీవుతన్” [1]

వసుచరిత్రకారుడు సర్వకళా కాంతుడైన కమలగర్భుని స్తుతించుట చూద్దాము.

మ. “ సకలామోదక తాళ వృత్త గతులన్ సంగీత సాహిత్య నా

మక విద్యా యుగళంబు పల్కుచెలికింబాలిండ్ల దోడై సిరుల్

ప్రకటింపన్ నఖ రేఖలందు నలఘు ప్రస్తారముల్సేయు స

ర్వ కలాకాంతుడుప్రోచు తిర్మలమహారాయక్షమావల్లభున్[2]

శబ్దముపై మంచి పట్టుగలవాడు రామరాజభూషణుడు. సంగీత రహస్యకళా నిధి. ఇక అతని సాహిత్యము గురించి చెప్ప పనిలేదు. జగత్ప్రాణ నందనుని కారుణ్య కటాక్ష లబ్ధ కవితా ధారా సుధారాశి సంజనితైకైక దిన ప్రబంధ ఘటికా సద్యశ్కృత గ్రంథ కల్పన జేయు చేవ గలవాడు. కనుకనే సారస్వత స్వరూపమును సంపూర్ణముగా చూచినాడు. అందువలననే తాళ వృత్తముల ప్రయోగమువలన ఒకటి సంగీత పరమైన ‘తాళ’ [ఆది, త్రిపుట. ధ్రువ ఇత్యాది] మను భావము ద్యోతకమగును. తాటి [తాళ ఫలమని] కాయలని మరొక భావము. వృత్తము [ఉత్పల, చంపక , మత్తేభ, తరల, శార్దూల మున్నగు] పద్య విషయ పరమగు భావము ఒక వైపు, గుండ్రని దైనదని మరొక భావము. ఒక అర్థములో పాలిండ్లు తాళఫలమంతవి గుండ్రనివి యని వ్యక్తము చేయుట కవి ప్రతిభ. అలఘు అనగా గురువు, లఘువు అనునవి చంధశ్శాస్త్రములో వాడబడు గుర్తులు. ప్రస్తారము ఆలాపన, నెరవలి రాగాదులను విస్తరించు ప్రక్రియ.

-------------------------------------------

పాదసూచికలు: [1] ఉత్తర/కంకం/పీ/5

[2] వసు/ప్ర/3

'అలఘు ప్రస్తారముల' పద ప్రయోగము వలన సాహిత్య సంగీతములను రెండిటినీ స్పర్శించినట్లైనది. ఇక ప్రామాణికమైన పెద్దల మాట ఉన్నదేకదా!

"సంగీతమపి సాహిత్యం సరస్వత్యాస్స్తనద్వయం
ఏక మాపాత మధుర మన్యదాలోచనామృతం"

అమృతము వంటి క్షీరమను ఆశీస్సులనిడుచూ, బిడ్డలగు సాహిత్య , సంగీత ఆరాధకులను 'శారదాంబ' కటాక్షించుట జగమెరిగిన సత్యము కదా! అటువంటి సరస్వతిని కళలలో తేల్చగల సర్వ కలాకాంతుడు – కమల గర్భుడు. అది అసలైన విషయము. విశేషము. అది కవి చూపిన చాతుర్యము. కవులు నిరంకుశులు. చమత్కారములకు పెట్టిన పేరు. వారి యూహలు బహు చిత్రము.అప్పకవీయము శాస్త్రపరమైనదైనా, కవి భావాలకు కొదువ లేదు. బహుశః గ్రంథము లోపల విషయములలో చమత్కారాలకు ఆస్కారము తక్కువ అని తలచిన కారణము కావచ్చు తన ప్రతిభను గ్రంథపు మొదటి 25 -30 పద్యములలోనే ప్రదర్శించినాడు అప్పకవి. కవులు / కవయిత్రులు తమకు గల ఇతిహాస పురాణ మరియు ఇతర విషయములను, అనుభవములను చక్కగా ప్రతిపాదించి రసాత్మకమైన రీతిలో స్తోత్రములను జేసినారు. అ కోవలోకి చేరినారు,

'ఆంధ్రశబ్ద చింతామణి' రచయిత 'కాకునూరి అప్పకవి'. ఇది 'అప్పకవీయము' గ ప్రఖ్యాతి నందిన విషయము తెలిసినదే!

నలువ జనన మందినది హరినాభి కమలములో! కమల బాంధవుడు 'మింటిమానికమైన' మిహిరుడు. సృష్టికర్త యైన చతురాననుడు తన జనికి బంధువని సూర్యునికి సహస్రాధిక కిరణాలను యిచ్చినాడు. కురంగాంకుడైన తోయజవైరికి మాత్రము కేవలము పదిహేను కిరణాలనిచ్చినాడు. అది కూడా దినమునకొక్కటి చొప్పున భానుడివ్వవలెను. శీతభానుడు గ్రహింపవలెను. కవి ఊహ ఏమైననూ, గ్రహములను వాటిని పరిశీలన జరుపు వారు తెల్పిన ప్రకారము చంద్రుడు కాంతికిరణాలను, సూర్యునినుండి గ్రహించి 'పరావర్తన' సూత్రము ద్వారా మనకు అందించుచున్నాడు. భూమి, చంద్ర గ్రహములు సూర్యుని చుట్టూ

చేయు పరిభ్రమణముల వలన చంద్రుని కాంతి మనకు [భూమికి] వచ్చుచున్నది. వాస్తవమైన విషయమును కవితా రూపములో చక్కగా చెప్పిన తీరు చూడండి.

చ. "తన జని కారణం బయిన తామరకుస్ హితు డౌటచే విక
ర్తనునకు వేయిఘృష్టులిడి దానికి శత్రుడు గాన నేణచి
హ్నునకు పదేనుజేసి యవియుస్ శిఖి భానుముఖామరాళిచే
దినమొక టప్పు గైకొనను దిద్దను చేయు విధాత గొల్చెదస్"[1]

శంభుదాస లక్షణాభిదేయ ఎఱ్ఱననామధేయుడు కూర్చిన 'హరివంశము' లో కావించిన బ్రహ్మ స్తుతి. బ్రహ్మ పరమైన పలు విశేషములను తెల్పినారు.

ఉ. " తమ్మికిచూలు లోకములతాత తపస్విలయొజ్జ యోగివ
ర్గమ్ములకాఢ్యుదాగమ పరంపరకుం బ్రభవంబు ధర్మ భా
గమ్ముల కర్త భారతికి గాదిలి ముమ్వుర తొల్త పేరు ని
త్యమ్ముగ నాయు వీవుత గుణాఢ్యుడుప్రోలయ వేమ శౌరికిస్" [2]

బ్రహ్మ తామరలో జన్మగైకొనిన వాడు. లోకములకు పెద్ద. తపమొనరించు వారికి గురువు. యోగ సంపన్నుడు. ఆగమముల పరంపరకు ఆది మూలము. సృష్టి స్థితి లయ అను ధర్మములలో భాగస్వామి. త్రిమూర్తులలో మొదటి వాడు. ఆయువు నిర్ణేత. ఇట్టివాడు కనుకనే చక్కని గుణములకు నిలయమైన కృతిభర్త యగు ప్రోలయ వేమనకు దీర్ఘాయువు నివ్వమను ఆకాంక్షను వెలిబుచ్చినారు.

'కూచిమంచి తిమ్మకవి' తన అచ్చతెనుగు కావ్యమైన మూడాశ్వాసాల చక్కని చిన్ని పొత్తము 'నీలాసుందరీపరిణయము'లోవేలుపుల తొలిపెద్ద పలుకుముద్దియతో తామర గద్దెపై నున్నవాడగు జేజేపెద్దను తద్దయు పొగడుట కలదు.

---

పాదసూచికలు: [1] అప్ప/పీఠిక /18

[2] హరివం/I-4

కం. 'తద్దయు పొగడెదవేలుపు

బెద్దయనన్ జగము లెల్ల బెంచుచుపల్కన్

ముద్దియతో నెఱ తామర

గద్దియ కొలువుండు నల్మొగంబులప్రోడన్" [1]

నాలుగు మోముల ద్వారా వేదములను వెలువరించుచు, పాలను నీటిని వేరు చేయగల అద్భుతమైన సత్తువ గల అంచను వాహనముగ కలిగిన వాడు అజుడు. ఆతనికి తన 'అహల్యాసంక్రందన' ప్రబంధములో 'సముఖం వేంకట కృష్ణప్ప నాయకుడు' నమస్కరించినాడు. చూడండి.

ఉ. "ప్రాంచిత పద నాదము సమంచితమున్ నలు మోములన్ మరుత్

ప్రాంచిత కాంచనాంచల గుహాంచలతన్ రహి మించ నీరుబా

ల్పంచు గుణానివేడ్క మిగులన్ నడిపించు విరించి నెంచి భా

వించి నమస్కరించెద సమీహిత సాహితీ సేకరించెదన్"[2]

జగన్నిర్మాణ కర్త యగు ఆ జలజసంభవునికి తన 'అనిరుద్ధ చరిత్రము' లో తత్కర్త 'కనుపర్తి అబ్బయామాత్యుడు'ఈ రీతిగా మొక్కులిడినాడు. కవిగారు కళంక రహిత చిత్త శుద్ధి నాశించినారు.

మ. " అకలంకంబగు చిత్త శుద్ధి కొఱకై యశ్రాంతమున్ మ్రొక్కెదన్

సకల స్థావర జంగమాత్మక జగత్సంసార నిర్మాణ క

ర్తకు నానాదురితాప హర్తకు సమస్తామ్నాయ సంధర్తకున్

ప్రకట స్మార్త మనో విహర్తకును వాక్పద్మేక్షణా భర్తకున్"[3]

'ముకుందవిలాసము'లో 'కాణాదం' వారు హరినాభి కమలమందు జనించి వేద మూర్తియై, తన అలివేణియగు వాణినిరంజింప చేయుచున్న నలువ కృతిభర్త సోమవిభునకు చిరాయువు లిచ్చుగాక యనినారు.

---------------------------------------------------------------------------

పాదసూచికలు: [1] నీలాసుంద/పీఠి/5 [2] అహల్య/6 [3] అనిరు/3

మ. " హరినాభీ కమలంబునందు నిజ వక్త్రాళి శ్రుతి స్వాన వి
స్తరతంగల్గుట తత్సువర్ణ రుచితో తానుస్ సువర్ణాకృతిస్
నెరయందాల్చి సువాణి వాణి నలివేణిం బ్రేమ రంజించు వా
గ్వరుడిచ్చున్ సుచిరాయురున్నతులు వేడ్కన్ సోమభూభర్తకున్" [1]

సువర్ణ శబ్దముపై కొంత చమత్కారము కవి గావించుట కలదు. బ్రహ్మ హిరణ్యగర్భుడు. సువర్ణము యనగ బంగారము. 'సు- వర్ణం'మంచి నాదపరమైన అక్షరము. అక్షరము అనగా నాశము లేనిది/కానిది. వేదము నాదాధారమైనది. సరస్వతి కి మరొక పేరు 'వాణి' వాణి యనగ పలుకు. వాణిని అలివేణిగ కలిగి ఆమెను రంజింప చేయువాడు విరించి. విశ్వ వినిర్మాత విధాత. ఆ నిర్మాణము అనల్పమైన కళా శిల్పము. ప్రాణుల ఫాల భాగముపై వ్రాతలను రాసే ఘనమైన రాతగాడు. వేదములను శ్వాసించువాడు ఆ అబ్జభవుడు కృతిభర్త యగు నాగవిభు వెన్నయకు దీర్ఘాయువు లిడవలెనని 'శృంగార శాకుంతలము'లో కృతికర్త యైన 'పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి' ఆకాంక్షించినాడు. చూడుడు.

శా. " చేయుస్ విశ్వము నెవ్వ డంచిత కళా శిల్పంబనల్పంబుగా
వ్రాయుస్ బ్రాణుల ఫాల పట్టికల నెవ్వండర్థ వర్ణంబు లా
మ్నాయ వ్రాతములూర్పు లెవ్వనికి నయ్యబ్జాత గర్భుండు దీ
ర్ఘాయుష్మంతుని జేయు నాగవిభు వెన్నామాత్య చూడామణిస్" [2]

'విజయ విలాస' కర్త చేమకూర వేంకటకవి బ్రహ్మను స్తుతించుట కలదు.

గీ. 'ధీయుతు డటంచు నలువ దీర్ఘాయువొసగి
కాయు రఘు నాథ విభు వజ్రకాయు గాగ
వీర వరుడని హరుడత్యుదార కరుణ
జేయునెప్పుడు విజయు నజేయు గాగ! [3]

పాదసూచికలు: [1] ముకుంద/కాణాదం/ ప్రథమా 7 [2] శృంగార శా/పిల్లల/అవతా/3
[3]విజ/విలా/పీ/4

తామరయందలి మరందమందుకొనుటకై తేటులుదానిచుట్టూ చేరి  చేయు ఝుంకారము వలె  తమ్మివిరి యను గద్దెపైతాను  కూర్చొని యుండ చుట్టూ చేరిన ప్రోడలగు శిష్యులు పెద్దస్వరముతో వేదపాఠాలు

వల్లెవేయుచుండగ ఒప్పుచున్న వేల్పుపెద్దయగు బ్రహ్మను నుతించుట చేసినారు తన నృసింహ పురాణమునందు ఎఱ్ఱాప్రగడగారు.

ఉ. " గద్దియయైన తమ్మివిరి కమ్మని తావికి గ్రమ్ము తేటు లే

ప్రొద్దును మ్రోయు చందమున ప్రోడలు శిష్యులు కూడి చుట్టులన్

పెద్ద యెలుంగునంచదువ పేర్మియెలర్పగ నొప్పు వేలుపుం

పెద్ద నయంపు మత్కృతి కభీష్ట చిర స్థితి దాయి గావుతన్" [1]

నాలుగు మోముల నలువను, తన 'పాండురంగ మాహాత్మ్యము'లో, 'తెనాలి రామలింగకవి' ఇట్లు స్తుతించుట కలదు.

ఉ.  "మాద్రికి మీఱు నాంచ వెలి మావుపయిన్ మురుపైనజోదుచే

భద్రమయాత్ముచే, భువనపాలన ఖేలనుచే, సరస్వతీ

ముద్రిత వక్త్రుచేత, నలు మోముల వేలుపుచే విరూరి వే

దాద్రి చమూవిభుండుగను నాయువు శ్రీయు నిరంతరాయమున్" [2]

---

పాదసూచికలు:  [1]  నృసింహ పురాణమునందు ఎఱ్ఱాప్రగడగారు.3

[2] 'పాండురంగ మాహాత్మ్యము/తెనాలి రామలింగకవి/ప్రథమా /3

## 7.2 *సరస్వతీదేవి స్తుతులు*

వాఙ్మయ రూపుడైన వేదపురుషునికి షడంగాలుగా ఛందస్సు,కల్పము, జ్యోతిష్యము, నిరుక్త, శిక్ష, వ్యాకరణములు శరీరములోని కొన్ని అంగములుగా చెప్పడము కలదు. ఇందులో 'వేదస్య ముఖం వ్యాకరణం స్మృతం' యనినారు. వ్యాకరణము అనగా –శబ్ద శాస్త్రము. శబ్దముల సాధుత్వాసాధుత్వములు ; ప్రకృతి ప్రత్యయ విశ్లేషణము; శబ్దార్థ రూపసంబంధము; విశేషములైన శబ్దార్థ ధర్మములు; లోప, ఆగమ, వర్ణవికారాది స్వరూపాలు; శాస్త్రీయ నియమ విశేషాలు, విశిష్ట శబ్ద స్వరూపాలు.. తదితరములను ప్రతిపాదించే వ్యాకృతి – వాక్యనిర్మాణ శాస్త్రము "వ్యాకరణము". దీనిని వ్యాక్రియంతే వ్యుత్పాద్యంతే స ధర్మాః శబ్దావయవాః యత్ర తద్ –' వ్యాకరణం' ఆధునిక భాషాశాస్త్ర రీతులకు పునాది పాణిని వ్యాకరణమే అన్నది నిరనుమానప్రసక్తి. ఇప్పటికి ఈ భాషాశాస్త్ర చర్చను నిలిపి, పూర్వీకులు తమ కావ్యములలో దాదాపు అందరూ పలుకుల లలనను ప్రస్తావించినారు. ప్రస్తుతించినారు. కొందరైతే సరస్వతిని అద్భుతముగ వర్ణించినారు. వేదస్వరూపుడైన బ్రహ్మకు వదనములో వాణి నివసించినది. అదే భారతీయ సంస్కృతి లో విశేషము. కావ్యములలో కవులు సరస్వతిని స్తోత్రము జేసిన విధమును కొంత చూద్దాం.

కం. 'శారద నీరద వర్ణా సారసభవ చక్రపాణి శంకరవినుతా
కీరమనోహరహస్తా భారతి! నీ పాదపద్మ భజనమొనర్తుస్' [1]

సీ. పాలించవే నన్ను పద్మసంభవురాణి బహుశాస్త్ర పుస్తకపాణి వాణి
కరుణించవే నన్ను కలహంస గామినీ! కోరి మ్రొక్కెద నీకు కీరవాణి
రక్షించవే నన్ను రాజబింబాననా దయ గానవే సర్వ ధవళ వర్ణ
మన్నించి నీవు నామదిలోన నుండవ మాధవు కోడలా మదను వదినె

గీ. నిన్నునెప్పుడు సేవింతు నీలవేణి నన్ను కృపజూడుమెప్పుడు నళిననేత్రి
భారతీదేవి నాజిహ్వ పాయకుండు శరణు లోకైక వినుతాంబ! శారదాంబ! [2]

---

పాదసూచికలు: [1]సేక/చాటు/వేప్రశా/ పు/10 [2] సేక/చాటు/వేప్రశా/ పు/10

శా. " వీణా పుస్తక పాణిపై హరిశిలా వేదీభవద్వేణిపై
మాణిక్యోన్నతపుంజ రంజిత లసన్మంజు ప్రభాశ్రోణిపై
స్థాణు బ్రహ్మ హరీంద్ర ముఖ్య హృదయాంతర్వాణిపై వాణి క
ళ్యాణీ ణా రసనాగ్రమందు నిలుమీ వ్యాఖ్యానకాలంబునన్ " [1]

వైజయంతీ విలాసములో సారంగు తమ్మయ పలుకుల చెలిని ప్రస్తుతించిన తీరిట్లున్నది.

శా. వీణాతంత్రిలసద్గుణంబులు ముదావిర్భావమున్ జేయగా
ప్రాణంబున్ బలె ఔ మ్ము డించుక సుధా ప్రాయానులాపంబులన్
బాణిన్ కూర్చుచు, సారెసారెకు రుచుల్ పాటింప పల్కించు న
వ్వాణీ దేవి నటించు మద్విమల జిహ్వారంగ మధ్యంబునన్. [2]

విమలమైన జిహ్వయను రంగస్థలముపై, వీణాపాణియగువాణి నటించవలెనను కోరికను వ్యక్తముచేసినాడు-ఈ శ్రీరామచంద్రుని భక్తుడు.

అల్లసాని వారు ఉపనిషత్తులు బోటులుగ వెలయగ, వేడుకతో వీణ వాయించు విధాత రాణిని ఇట్లు ప్రస్తుతించినారు.

సీ. చేర్చుక్కగా నిడ్డ చిన్ని జాబిల్లిచే సిందూర తిలకంబు చెమ్మగిల్ల
నవతంస కుసుమంబునం దున్న యెలదేటి రుతి కించి దంచిత శ్రుతుల నీన
ఘనమైన రారాపు చనుదోయి రాయిడి తుంబీఫలంబు తుందుడుకు చెంద
తరుణాంగుళిచ్ఛాయ దంతపుసరకట్టు లింగిలీకపు వింత రంగు లీన

గీ. నుపనిషత్తులు బోటులై యోలగింప పుండరీకాసనమున కూర్చుండి మదికి
నించు వేడుక వీణ వాయించు చెలువ నలువ రాణి మదాత్మలో వెలయుగాత! [3]

---

పాదసూచికలు: [1] సేక/చాటు/పేప్రశా/ పు/10 [2] వైవి సారం ఆవ/8
[3] మనుచ/ప్రథమ/5/ పెద్దన

సరస సద్గుణ నికురంబ యగు శారదాంబను, తనతెనుగు అనువాదమైన శృంగార నైషధము, రచింప ప్రారంభించినపుడు బ్రాహ్మీ దత్త వరప్రసాద సంపన్నుడగు శ్రీనాథుడు, పుండరీకాసనస్థయగు, నుడువుల పడతుకను నిండువేడుకతో తన డెందమునందు విహరింప వేడినాడు.

సీ. సింహాసనము చారు సిత పుండరీకంబు
చెలికత్తె జిలువారు పలుకుచిలుక
శృంగారకుసుమంబు చిన్ని చుక్కలరాజు
పసిడి కిన్నెర వీణ పలుకుదోడు
నలువనెమ్మొము తమ్ములు కేళిగృహములు
తళుకుటద్దంబు సత్కవుల మనసు
వేదాది విద్యలు విహరణ స్థలములు
చక్కని రాయంచ యెక్కిరింత

గీ. యెపుడు నేదేవి కాదేవి యిందు కుంద
చంద్ర చందన మందార సార వర్ణ
శారదాదేవి మామక స్వంత వీధి
నిండు వేడుక విహరించు చుండు గాత! [1]

ఆ కవిసార్వభౌముడే తన హరవిలాసములో సరస్వతికి చేసిన ప్రశస్తమైన సద్భక్తి తో కూడిన ఉపాస్తి యిది.

కం. "వాణికి చరణానత గీర్వాణికి ఏణాంక శకల రత్న శలాకా
వేణికి పుస్తక వీణాపాణికి సద్భక్తితో నుపాస్తి యొనర్తున్" [2]

---

పాదసూచికలు: [1] శృంగార నై /ప్రథమ/5/శ్రీనా

[2] హరవిలా/అవ/4/శ్రీనాథ

నవీన కవులలో, శ్రీ కవితానంద వాల్మీకి రామాయణము రచించిన వారు సోంపల్లె కృష్ణమూర్తి గారు. 1820 గద్యపద్యాలతో కూడిన చంపూ పద్ధతిలో సారకాండము పేరున రామాయణము కూర్చినారు. ఈయన మాలికాబంధము , కందగర్భితద్విప్రాసోత్పలమాలావృత్తము, పద్మనాభవృత్తము - ఇత్యాది విశేష ప్రయోగములు చేసినారు. అందు చదువులరాణిని, రమ్యవచో విలాసకవితార్థంబై నుతించినతీరు ఇట్లు చూడగలము.

శా. " వాణిస్ పద్మజరాణి నిత్యనత గీర్వాణిస్ నమద్ద్విజన

శ్రేణిస్ పుస్తక దివ్య హారమణియు క్స్రీ హైమవీణా చతు

ష్పాణిస్ నీలభుజంగవేణి శుభ వీక్షాభాజితైణిస్ లస

ద్వాణిస్ రమ్యవచోవిలాస కవితార్థంబై నుతింతుస్ మతిస్" [1][

రామభక్తురాలైన రచయిత్రి మొల్ల తన రామాయణములో చదువుల తల్లిని స్మరించిన తీరుచూడండి. నలువ హిమగిరి యంత పెద్దదైన రాయంచ నెక్కి విహరించి వచ్చాడు. ఎదురువచ్చిన పతికి నవ్వుచూవిశాలమైన కనులతోనే చతుర్ముఖాలనుగని ఒక్క సారినివాళి కావించి చిరునగవుతో ముదమును కలిగించినది విద్యాదేవి.

ఉ. " మేలిమి మంచుకొండ నుపమింపగ జాలిన యంచ నెక్కి వా

హ్యాళి నటించి వచ్చు చతురాస్యు నెదుర్కొని నవ్వుదేరగా

వాలిక సోగకన్నుల నివాళి యొనర్చి ముదంబు గూర్చు వి

ద్యాలయవాణిశబ్దముల నర్థములస్ సతతంబు మాకిడుస్ [2]

భారతికి అమరములో చెప్పబడిన పేర్లు ఇవి > బ్రాహ్మీ తు భారతీ భాషా గీర్వా గ్వాణీ సరస్వతీ.

---

పాదసూచికలు: [1] శ్రీ కవితానంద వాల్మీకి రామాయణము సోంపల్లె కృష్ణమూర్తి గారు పద్యము 11

[2] మొల్ల/అవ/8

అచ్చ తెనుగున  ఈ అజని రాణికి కల పేళ్ళు > తలవాకిటను మెలంగెడు వొలతుక, పలుకుల వెలది, వొత్తముముత్తో, నలువపడతి, కలుములపైదలి కోడలు. ఇతరవిషేశానములతో మరిన్ని నామములు కలుగును. ఈ పలుకుల లలనను పలువురు కవులు ప్రార్థించినారు.

గుమ్మరాజు రామకవి, తాము విరచించిన, చౌడేశ్వరీ మాహాత్మ్యము లో సరస్వతిని వర్ణించిన రీతి ఇది.

మ. "  కరముల్పుస్తక వల్లకీ జన సరాకాంతంబులై యొప్ప సుం

దర రక్తాంబురు హోల్లసత్సరసి నందంబొందు రాయంచ పై

ఖరి నాత్మేశుని చెంత కొల్వమరి లోకస్తుత్యయై యొప్పు న

య్యరవిందాసన సుందరీమణికి సాష్టాంగంబు కావించెదన్" [1]

సాష్టాంగపడుదుననినాడు. పెద్దలకు, పూజ్యులకు గౌరవపురస్సరముగ దేహములోని 8 శరీర భాగములు ధరణిని తాకు నటుల చేయు వందనము. అవి {కరములు[2] +పాదములు[2] + భుజములు[2] + ఱొమ్ము+లలాటము = 8}

మహాదేవు అపారగుణ ములను సంస్తుతి చేయునట్టిది భారతి. ఆమెకు కుమారసంభవములో, నన్నె చోడుడు చేసిన స్తుతి ఇది.

కం.   "వేదాగమ రూపమున మహాదేవు నపార గుణ మహాసంస్తుతి సం

పాదితయగుభారతి నేడాదిగ మత్కృతికి నెలయునదిగాక దయన్" [2]

కవుల కల్పనలలో శారదాదేవికి వీణను అలంకరించినారు. శృంగేరిదేవాలయమందు శారదాదేవి తన నాలుగు చేతులలో చతుర్విధ పురుషార్థములకు ప్రతీకలుగా ధరించిన వస్తువులు చిలుక, అక్షమాల, పుస్తకము,అమృతకలశము.

--------------------------------------------------

పాదసూచికలు: [1] చౌడే/6

[2] కుమా/11

కాల క్రమములో చదువులతల్లి, సంగీత సాహిత్య రూపి, వాగ్దేవి మున్నగు విషయములను చెప్పి పలుకులరాణికి వీణను కూడా ఇచ్చినారు. ప్రస్తుతము "వీణాపాణి" అయితేనే 'సరస్వతి' యను ముద్ర పడినది. వాణి వీణను వాయించుట అనునది ఆది శంకరులవారు , సౌందర్యలహరిలో కూడ పేర్కొవటమున్నది.

సౌందర్యలహరి, శ్లోకము 66 లో ఇట్లు చెప్పబడినది.

" విపంచ్యా గాయంతీ వివిధ మపదానం పశుపతే
స్త్వయా రబ్ధే వక్తుం చలితా సాధు వచనే
త్వదీయై ర్మాధుర్యైరపలపిత తంత్రీ కలరవాం
నిజాం వీణాం వాణీ నిచుళయతి చోళేన నిభృతాం" [1]

{ సరస్వతి వీణను ధరించి లలితాంబ యెదుటఈశ్వరుని చరితలను సుమధు రముగ ఆలపించుచున్నపుడు, ఆ ప్రక్రియను మెచ్చుకొని , ప్రశంసించబోవుచు 'సాధు' [బాగు బాగు]అన్నది. అంబ పలుకు తన వీణా నాదముకన్నా ఘనముగా నున్న కారణమున సరస్వతి వీణావాదననాపి వేసింది}. ఇక తిమ్మన గారి వాణీ ప్రార్థనను చూచెదము.

చ. " తనమృదుగీతికా పరిణత ధ్వని వైఖరి పల్కు మించు మిం
చిన రహి చేతివీణియకు చెక్కులు గీటుచు నేర్పు చున్నదో
యన నఖరాంకురంబుల నయంమున తంత్రులు మీటి గాన మిం
పొనరగ జేయువాణి ప్రతిభోన్నతు జేయుత కృష్ణరాయనిన్" .[2]

తన కవిత్వములో లలితమైన పదములను ప్రయోగింప చేసి ఏలమని శరణము కోరినాడు 'ఆత్మరామాయణము'లో, కవి 'మలుగూరు గురుమూర్తి'. నవీన పద్య కవులలో ఆత్మ రామాయణముపేరిట రామచరిత వ్రాసిన వారు గురుమూర్తి. ఈ కవి ఒకచోట తనను గురించి ఇట్లు చెప్పడము చూడగలము.

---

పాదసూచికలు: [1] సౌందర్యలహరి, శ్లోకము 66 [2] [పారిజా/ప్రథమా/5]

శ్రీ రామ చంద్ర చరణారవింద మరంద పానాసక్తుండును, శ్రీ కూడలీ శృంగేరీ శ్రీమజ్జగద్గురు శ్రీ సచ్చిదానందశంకర భారతీ స్వామి కృపాలబ్ధ కవితా విశారద బిరుద యుక్తుండును, హరిహర శ్రీ సమర్థ నారాయణాశ్రమ శ్రీ సద్గురు సమర్థ నారాయణ మహారాజాశీర్వాద లబ్ధుండును, శ్రీమదానందాశ్రమ శ్రీ సద్గురు స్వామి రామదాస మాతృశ్రీ కృష్ణా బాయి సేవాసక్తుండును శ్రీమత్కాశ్యపగోత్రోద్భవుండును ఆపస్తంబ సూత్రుండును శ్రీమద్రంగమాంబా శ్రీ లక్ష్మీ నారాయణు జ్యేష్ఠ పుత్రుండును లలిత కవి బిరుద పాత్రుండును, మలుగూరు టి గురుమూర్తి. రామసంబంధమైనది కనుక సాధారణముగా రాముని స్తుతించుట జరుగును. మొదట ఈ కవి ' పరమాత్ముని చరణ సన్నిధి విన్నపము' అని ఆరు పద్యములు కూర్చినారు. 'శ్రీకరము నీ చరిత్రము, వాకొనినన్వ్రాయ చదువ వంశోన్నతియున్ చేకూర్చు సిరుల నీదగు సాకారత నొసగు సుజన సన్నుత రామా! ' యని ప్రారంభించి, జానకీపతీ! యను మకుటముతో మూడు చంపకమాలా వృత్తములను పిదప రెండు కందములతో విన్నపమును సలిపినారు. లలిత పదములను యిమ్మని శారదను శరణుజొచ్చినాడు – ఈ సత్కారుడు.

ఆ. " దివిజవాణి వాణి, దివ్య వీణాపాణి,
యమరవినుత వాణి, యజుని రాణి
లలిత శబ్ద సంతతుల నిచ్చి నన్నేలు
శరణు జొచ్చినాడ, శారదాంబ! [1]

హనుమత్ప్రసాదవరలబ్ధుడైనకవి శారదామూర్తి. అతడు కావ్యాలంకార సంగ్రహములో చదువుల లలన, సమముగా సాహిత్య సంగీతములనుగుబ్బపాలిండ్లు గల శారదను సొగసుగా స్తుతించిన తీరు చూడండి.

---------------------------------------------

పాదసూచికలు: [1] [బాల /అవ/3]

సీ. ఒకటి యక్షర విలాసోల్లాసమున మించ నొకటి తాళ ప్రౌఢి నుల్లసిల్ల

నొక్కటి నారికేళోన్నతితాల్ప నొక్కటి గోస్తనీగుచ్ఛకలన దనర

నొకటి సువృత్త భావోన్మేషమొంద నొక్కటి వల్లకీతుంబి కలన చెలగ

నొకటి భారవిశేష యుక్తి పెంపొంద నొక్కటి గిరీశ మతానుకారిగాగ

గీ. ససమసాహిత్య సంగీతరసములనెడు

గుబ్బపాలిండ్లు దాల్పు పల్కులవెలంది

సరస గుణహారు నోబయ నరస ధీరు

నవ్య కృతి నాయకునిగా నొనర్చుగాత! [1]

క్రమాలంకారమునుచక్కగా ఈ అలంకారసంగ్రహములో గ్రహించి , పూర్వార్ధములో సాహిత్యవిషయములను పశ్చిమార్ధములోసంగీత విషయములను జత గూర్చి ముగింపులో సాహిత్య సంగీతములను స్తనయుగముగ కలిగిన సారస్వతమూర్తిని సాక్షాత్కరింపచేయుటములో కవి విజయము సాధించినాడు.

'పాండురంగ మాహాత్మ్యము'లో 'తెనాలి రామలింగకవి' చదువులతల్లి శారదను ఇట్లు స్తుతించినారు.

శా. " కద్రూజాంగదు తోడబుట్టువు శరత్కాదంబిని చంద్రికా

జిద్రూపాంచిత పద్మగర్భముఖ రాజీవాళీహంసి, వ

ర్ణ ద్రాక్షా ఫల కీరి, శారద కృపన్ రామానుజామాత్యు వే

దాద్రి స్వామికి నిచ్చు నిచ్చలును విద్యాబుద్ధి వాక్సిద్ధులన్" [2]

'రఘునాథ నాయకుడు' విరించి గురించి వివరించినంత కాక, వాల్మీకి చరిత్రలో వాణిని ఈ రీతిగా స్తుతించినాడు.

కం." రాణించు నెపుడు నంతర్వాణి మనోబ్జముల వివిధ వర్ణాకృతి న

వ్వీణా పుస్తక పాణిని వాణిని ద్రుహిణ ముఖ రంగ వాణిని తలతున్" [3]

---

పాదసూచికలు: [1] నరస/ప్రథమా/4 [2]పాండు/1/4 [3]వాల్మీకి/8

విద్యావిశారద యగు శారద తనను బ్రోచునని ఆశిస్తూ ధవళ వర్ణ మూర్తి సాత్త్వితకు ప్రతీక యైన సరస్వతికి కావించిన ప్రాశస్త ప్రస్తుతి చూడండి.

కం. " శారద విద్యా జాల విశారద నను బ్రోచు కొరకు సారె భజింతుస్

శారద నీరద నారద పారదహార దరహీర పాండు శరీరస్" [1]

సరస్వతి సాత్త్విక గుణమునకు ప్రతీక. అందువలనే ఆ చదువుల పడతి శుభ్రవస్త్రాన్విత , స్వచ్ఛతకు ప్రతీకయైన హంస ఆమెకు వాహనము. తెలుగువారి భాగ్యమైన 'భాగవత' కర్త 'పోతన' గారు ఆ దయాంభోనిధి వంటి చల్లని తెల్లని తల్లిని, పలు ధవళ వర్ణ వస్తువులను ఉపమానములుగా పేర్కొని అట్టి సుందర తమ మూర్తిని ఎప్పుడు చూడగలనో? యని తలచినాడు. చూడండి.

ఉ. " శారద నీరదేందు ఘనసార పటీర మరాళమల్లికా

హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం

దార సుధా పయోధి సిత తామర సామర వాహినీ శుభా

కారత నొప్పు నిన్ను మది గానగ నెన్నడు గల్గు భారతీ! [2]

అంతకు మునుపే వాణిని, తనదైన బాణిలో స్తుతిస్తూ, ఆ పలుకుల లలన చతుర్విధ పురుషార్థములనొసగ జాలినదని, అందులకు ప్రతీకలుగా ధర్మ, అర్థ, కామ, మోక్షముల కను గుణమైన, అక్షమాలను, రాచిలుకను, తామరను, పుస్తకమును ధరించినదని చెప్పినారు. భూమిపై తన నుదుటిని సోకించి నుతించినారు.

ఉ. " క్షోణి తలంబునన్ నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత

శ్రోణికి చంచరీక చయ సుందర వేణికి రక్షితామర

శ్రేణికి తోయజాతభవ చిత్త వశీకరణైక వాణికిన్,

వానికి నక్షదామ శుక వారిజ పుస్తక రమ్య పాణికిన్" [3]

---

పాదసూచికలు: [1] అప్ప/పీఠిక/19 [2] పోత/స్కం 1/8 [3] పోతన/స్క 1 /6]

వాగ్వనజదళాక్షి తనకు వచోరచనా చమత్కృతులు యొసగ వలెనని, 'కంకంటి పాపరాజు' తన గ్రంథము 'ఉత్తర రామాయణము'లో ఆకాంక్షించు చున్నాడు.

చ. "తన హృదయాంబుజాతమున తార్కొను నాథ గతాను రాగ వా
హినివెలిగ్రమ్మ చేసెనొకొ యీ గతి నాగ విధాత చెంగటన్
దనరి జపా ప్రసూన సవిధ స్ఫటికా కృతి రక్తి గుల్కు వా
గ్వనజదళాక్షిమా కొసగు గాత వచోరచనా చమత్కృతుల్" [1]

శారద శుద్ధ సాత్త్విక లక్షణయుక్త. ఆమెకు ఉపమానములుగా చెప్పదగినవి ఇంతకు మునుపే జూచితిమి. ఇచ్చట అక్షసరములను వీణా నాదముచే కరగించినది. ఆ రసములో తన ప్రతిబింబమును చూచుచు తన నిజమైన బ్రహ్మ స్వరూపమును నిదింప జేసిన చైతన్యమూర్తి ఆమె. ఆ విషయము నొకింత తిలకింతము.

మ. " రమణీయాక్షసరాకృతిం బొలుచు వర్ణ శ్రేణి వీణా నులా
పముచేతం కరగించి యందు నిజబింబంబొప్ప నచ్ఛామృత
త్వము నాత్మ ప్రతి పాదకత్వమును దద్వర్ణాళియందెల్ల పూ
ర్ణము గావించినవాణి తిర్మల మహా రాయోక్తి బోల్చుం గృపన్" [2]

ఎఱ్ఱన హరివంశములో చేసిన శారద స్తుతి చూడండి.

మ. " వరవస్తు ప్రతిపత్తి ధుర్య మగు నైశ్వర్యంబు పంచాశద
క్షర సంసిద్ధ సమస్త శబ్ద రచనా సంవ్యాప్తి నుద్దీప్తమై
పరగం గల్పలతా సధర్మ యగుచుం బ్రజ్ఞావిశేషాఢ్యులన్
కరుణం బ్రోచు సవిత్రి వాణి త్రిజగత్కల్యాణిప్రార్థించెదన్" [3]

వాణిని ఎఱ్ఱన గారు పొగడిన తీరు చూద్దాము.

---

పాదసూచికలు: [1] కంకం పా/పీ/6
[2]వసు/ప్రథ/4
[3][హరివం/I/5

సంధ్యా వందనములో సమర్చలందు 'గాయత్రి' ఉదయాన 'గాయత్రి'గాఎరుపుకాంతి కలదై , మధ్యాహ్నమున 'సావిత్రి'గా తెలుపు కాంతి కలదై , సాయంత్రమున 'సరస్వతి' గా కొంత మసకబారిన రంగుతో ప్రార్థింపబడును. సుప్తుని [నిద్రించిన వాడిని] జాగృతమొనర్చు వాడు సవిత. సావిత్రి సూర్య సంబంధమైన శక్తి. ఆ వాణి ముల్లోకాలకు మంగళము గూర్చునట్టి కల్యాణి. సమస్త శబ్ద రచనలలో వ్యాప్తి చెందినది.

'కూచిమంచి తిమ్మకవి' తన 'నీలాసుందరీపరిణయము'నందు పలుకుల చాననిట్లు స్తుతించినారు.

చ. 'బలుతెలిపుల్గు వారువము బంగరువీణెయు మిన్కుటందెలుం
జిలుక తుటారిబోటియును జిందపువన్నియ మేను పొత్తముం
జెలువపు తెల్లదమ్మివిరి సింగపు గద్దెయు కల్గి యొప్పు న
ప్పలుకుల చాన జానలరుపల్కు లొసంగెడుగాత నిచ్చలున్" [1]

'అహల్యాసంక్రందన' గ్రంథములో, 'సముఖంవేంకటకృష్ణప్పనాయకుడు' హిరణ్య గర్భుని వదనాంతర సీమ వసించు వాగ్దేవి, కవియైన తన జిహ్వాపై నివాసము చేయ కాంక్షించుటచూడగలము.

ఉ. " సార తరంగిణీ కనక సారస రాజ మరాళికైవడిన్
హారి హిరణ్య గర్భ వదనాంతర సీమ వసించు వాణి శృం
గార సరోజపాణి నవకంధరవేణి విలాసధోరణిన్
వారక నిచ్చ నిచ్చలు నివాసము చేయు మదీయు జిహ్వకన్" [2]

'అనిరుద్ధచరిత్రము'ను ప్రబంధములో కవి 'కనుపర్తి అబ్బయ' చదువుల లలనను తన నాలుకపై నర్తించమని కోరుట గమనించ గలము.

-----------------------------------------------

పాదసూచికలు: [1] నీలా/పీ/ 6

[2] అహల్యా/ఆవ/7

చ. " రవ రమణీయ కీర సుకరంబు నభీష్ట ఫలోదయంబు మా
ర్దవ సుమ గంధ యుక్తము సుధా సమవర్ణము గల్గి వర్ణనీ
య విబుధ లోక కల్పతరువై తగు పద్మజు రాణి నర్తనో
త్సవము వహించుగాత నిరతంబును మద్రసనాంచలంబునన్" [1]

దేవతా వృషభుడు [శ్రేష్ఠమైన వాడు] బ్రహ్మ. కోరికలు దీర్చునది కామధేనువు. పెనిమిటిని వదలిపోనిది మంచి ఇల్లాలు. వేదములు పలికించిన విధాతను విడువక నాద రూపాన నిలచినది వాణి. వాగీశ్వరి తన కృతిభర్త యగు సోమ భూవరునకు ఇష్టపదార్థ సిద్ధి సమృద్ధిగా సమకూర్చవలెనని, 'ముకుందవిలాస' కర్త 'కాణాదం' వారి కాంక్ష.

ఉ. " విశ్వనుత శ్రుతి స్తవ నవీన సుధారస ధారలట్ల యౌ
శాశ్వత పూరుషార్థముల సజ్జన వత్సలయై వసించి యా
త్మేశ్వరు దేవతా వృషభు నెప్పుడు పాయని కామధేను వా
గీశ్వరి సోమ భూవరునకిష్ట పదార్థ సిద్ధి సమృద్ధిగూర్చుతన్" [2]

'శృంగార శాకుంతలము'లో 'పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు' తన రచనలను పరిపూర్ణముగా చేసి యింపు కల్పించునట్టి, అందు చక్కని కవితా పరిమళములను వ్యాపింప జేయు వాగ్దేవిని స్తుతించుట కలదు.

మ. " పొసగన్ నే కృతి చెప్పగా పరిమళంబుల్ చాల కొక్కొక్కచో
కొసరొక్కించుక గల్గె నేనియును సంకోచంబు గాకుండ నా
రసి యచ్చోటికి నిచ్చుగాత పరిపూర్ణంబంద  వాగ్దేవి యిం
పెసలారం తన విభ్రమ శ్రవణ కల్హారోద యామోదముల్" [3]

'నృసింహపురాణము'లో 'ఎఱ్ఱన' గారు బుధసేవిత మూర్తియగు భారతిని సంభావించిన తీరు చూడవలయును.

---

పాదసూచికలు: [1] అనిరు/6 [2]ముకుంద/కాణాదం/8 [3] శృంగా7

చ. " కరకమలంబునందు పటికంపు కమండలువచ్చ కాంతి భా

సురమగు మౌక్తికంపుజపసూత్రము దాల్చుట బ్రహ్మ వాదియై

పరగిన హంసముంబిలిచి బాల మృణాళము జూపు చందమౌ

సిరి తిలకింప నొప్పు బుధ సేవిత మూర్తి తలంతు భారతిన్" [1]

'మూర్తిత్రయోపాఖ్యానము'లో 'దంతులూరి బాపకవి' సరస్వతికి చేసిన స్తుతి ఇట్లున్నది.

'కెరయనీరను కెరెగె జల్లి' { చెరువు నందలి నీటిని చెరువుకే సమర్పణము చేసినట్లు}

శారద కృప వలన నేర్చిన అక్షరాలను తిరిగి స్తుతులను పేర శారదకే పండితులు

అర్పించుచున్నారు. అయినా దయా మూర్తియగు వాణి వారిని కటాక్షించుచున్నది. అట్టి

భారతి తన వదనాంబుజమున వసించ వలయునని వాంఛించుటను చూడగలము.

ఉ. "అంబుధికిం జలాంజలి సమర్పణ చేసిన రీతి పండితౌ

ఘంబు తనునుతింపగ నఖండ కృపా నయనాంచలాను భా

వంబున వారి బ్రోచు నతి వత్సల భారతి మామకీనవ

క్త్రాంబురుహాంతరంబున నిరంతరమున్ వసియించు గావుతన్"[2]

{ఈ సందర్భములో ఆది శంకరులవారు తమ సౌందర్యలహరిలోతుదిలో ఇట్లు వచించినారు.

శ్లో| "ప్రదీప జ్వాలాభిర్దివసకర నీరాజనవిధి

సుధా సూతేశ్చంద్రోపలజలలవై రర్ఘ్యరచనా|

స్వకీయైరంభోభిస్సలిల నిధి సౌహిత్య కరణం

త్వదీయాభి ర్వాగ్భిస్తవ జనని వాచాం స్తుతిరియం|| [3]

సూర్యునికి దివిటీలతో హారతిచ్చుట, సముద్రునికి నీటితో అర్ఘ్యమిచ్చుట,

తనదైన చంద్రకాంత శిలాజలబిందువులతో అమృతకిరణునికి అర్చన చేయు రీతిలో అంబ

యొక్క దయవలన కలిగిన వాటినితిరిగి ఆమెకు అర్పణచేసిన రీతిగా నని భావము}

---

పాదసూచికలు: [1] నృసింహపురాణము'లో 'ఎఱ్ఱన' /6 [2] మూర్తిత్రయోపాఖ్యానము 1/6

[3] సౌందర్య/100

"వాణిస్ వీణా పాణిస్ శోణముఖ మరాళముపయి శోభిలు రాణిస్
గౌణస్ మధుకర వేణిస్ కాణభుజిం గొల్తు నాదు  కావ్య సృజనకై" [1]

అంటూ బుడ్డా వెంగళ రెడ్డీయములో కావ్య సృజనకై వాణికి వందనాల నిడినారు గొట్టిముక్కలవారు.

7.3 *పరబ్రహ్మ స్తుతులు :* రూపరహితమైన గుణరహితమైనది పరబ్రహ్మ. ప్రధానం పరమాత్మాధీః > ప్రధాన శబ్దము పరమాత్మకు, ప్రధానికి, ప్రజ్ఞకు వర్తించును. దీనికి వారి వారి భక్త్యానుసారము, శక్త్యానుసారము, యుక్త్యానుసారము వ్యాఖ్యానము చెప్పుకొనవచ్చును. అది -  ఆది మధ్య అంత రహితము.  పర బ్రహ్మకు గుణములు తప్ప రూపమును కల్పించుట దుష్కరము. అవ్యక్త స్వరూపుడైన పరబ్రహ్మమును స్తుతిస్తూ చేసిన ఒక స్తుతిని ఇప్పుడు చూద్దాము.

సీ.  విశ్వంబు నీవయై  విశ్వంబు చూచుచు
విశ్వంబు చేయుచు విశ్వమునకు
నినుడవై పంచభూతేంద్రి యాహంకార
ములకు మనః ప్రాణ బుద్ధి చిత్త
ములకెల్ల నాత్మమై మొనసి గుణంబుల
కావృతమగు నిజాంశాంశభూత
మగునాత్మ చయమున కనుభూతి సేయుచు
మూడహంకృతులచే మునుగుపడక

గీ.  నెఱి ననంతుడవై దర్శనీయ రుచివి
గాక సూక్ష్ముండవై నిర్వికారమహిమ
తనరి కూటస్థుడన సమస్తంబు నెఱుగు
నీకు మ్రొక్కెద నాలింపు నిర్మలాత్మ!  [2]

---

పాదసూచికలు: [1] బుడ్డా వెంగళ రెడ్డీయములో  అవ/3  [2] మణిమంజరి వేప్ర శా పుట 9

పై పరబ్రహ్మ స్తుతిలో నిర్మలమైన ఆత్మ కల మూల బ్రహ్మమునకు మొక్కడము చూడగలము. అహంకార రహితుడు, విశ్వమును సృజించినవాడు పంచభూతముల కర్త యగు నిర్గుణ తత్త్వమును సేవించుట యున్నది.

నిర్గుణ తత్త్వమునకు ఆదిగా చెప్పబడునది, వేదములకు మూలమమైనది ఓంకారమని చెప్పడము కలదు. ప్రణవమని దానికి పేరు. దానిని స్తుతించిన తీరు ఇట్లున్నది.

చ. మొదలిటి గద్దెయక్షరము ముప్వురు వేల్పులలావుమేనిలో
మొదలి వెలుంగు నెత్తి తుది మోవగచేయుట కేర్చు జంత్ర మ
భ్యుదిత తనూసరోజముల నూనినగాద్పుల యాటపట్టు స
మ్మదమలరారగా ప్రణవమంత్రము మాకు ప్రసన్నమయ్యెడిన్ [1]

---

పాదసూచికలు: [1] మణిమంజరి వేప్ర శా పుట 3

7.4 ***నిర్గుణ బ్రహ్మ స్తుతులు*** :- గుణములు మాత్రమె చెప్పి స్తుతించుట సగుణ బ్రహ్మ స్తుతి యగును. కావ్యములు, ముఖ్యముగా రాజుల, తదితరుల ప్రోత్సాహముతో సృజింప బడినవి. వాటి లక్ష్యము లౌకిక ఆనందము. నిర్గుణ స్తుతి కావ్యములలో కనిపించుట కొంతవరకు తక్కువే! అట్టి స్తుతి వేదాంత పరమైన గ్రంథములలో మనకు కనిపించును. అది సామాన్యముగ జరుగును. కొన్ని సందర్భాలలో అట్టి వేదాంత పరమైన గ్రంథములలో ఇతర దేవతా స్తుతులు యుండు అవకాశము కలదు. నాదము జనులకు మోదకరమైనదైనా, నాదమును రెండు విధములుగా, '**ఆహత నాదము**' అనియు, '**అనాహత నాదము**' అనియు వివరింపబడిన విషయము 'సంగీత రత్నాకరములో' ఇట్లు కలదు. "ధ్యానమేకాగ్ర
చిత్తైకసాధ్యం న సుకరం నృణామ్
తస్మాదత్ర సుఖోపాయం శ్రీమన్నాద మనాహతమ్
గురూపదిష్టేన మార్గేణ మునయ స్సముపాసతే
సో(అ)పి రక్తి విహీనత్వాన్న మనోరంజకో నృణామ్
తస్మాదాహత నాదస్య శ్రుత్యాది ద్వారతో(అ)ఖిలం
గేయం వితన్వతో లోక రంజనం భవభంజనమ్
ఉత్పత్తి మభిదాస్యా మస్తథా శ్రుత్యాది హేతుతామ్" [1]

{ఏకాగ్రత గల చిత్తముతో ముఖ్యముగా సాధింపతగినది ధ్యానము, [సాధారణ] నరులకు సుకరము కాదు. ఆ కారణమున నిండు శ్రీమంతమైన అనాహత నాదంబును, గురూపదిష్టముగా మునులు ఉఖోపాయముగా ఉపాసించుచు ఉన్నారు. అనాహతనాదము రక్తి లేనిదగుట చేసి నరులకు ప్రయోజనకారి కాదు. కావున శ్రుతి స్వర గ్రామ మూర్ఛనాదులద్వారా అఖిల గేయములలో విస్తరించియున్న ఆహత నాదోత్పత్తిని శ్రుత్యాది హేతువుల వలన లోక రంజనము, భవభంజనము కలుగునని చెప్పడమైనది}

పోతన గారి కలము ద్వారా జాలువారినది ఒక నిర్గుణ వైశ్వ దేవ స్తుతి. సృష్టి స్థితి లయ యను పరిణామములకు మూలమైన ఆ తత్త్వమును ఒక సారి చూద్దాము.

---

పాదసూచికలు: [1] సంగీత రత్నాకరము/శార్ఙ్గదేవుడు/పిండోత్పత్తి ప్రక 165 -167 శ్లోకాలు

ఇది గజేంద్ర మోక్షణ కథలోనిది. ఆ పద్యరాజమిది.

ఉ. “ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై

ఎవ్వని యందు డిందుపరమేశ్వరుడెవ్వడు మూల కారణం

బెవ్వడనాది మధ్య లయుడెవ్వడు సర్వము తానయైన వా

డెవ్వడు వానినాత్మభవు నీశ్వరు నె శరణంబు వేడెదన్” [1]

వేదాంత పరమైన గ్రంథములలో నిర్గుణబ్రహ్మ స్తుతులు ఉండుట చూడగలము. సాధారణమగు మానవునికి బాహ్యదృష్టి సహజము. అంతర్లీనముగా అంతరంగమునందు ఉన్నటువంటి సత్తును కనుగొనుటకు సాధన చాలా అవసరము. భౌతికమగు సుఖము, సంపదలను వదలి తొలుత సారహీనమగు సౌఖ్య రహితమగు జీవితమును కోరుకొనుట కష్టమైన కార్యము. అది పలువురికి అసాధ్యముగానే ఉండినదని చరిత్ర పుటలలో కనిపించు విషయము. భగవద్గీత విన్న తర్వాత అర్జునునికి శ్రీకృష్ణుడు చెప్పిన వేదాంతపరమైన విషయమును గ్రహించుట కష్టమని తెలుపగా, గీతాకారుడు ఇట్లు చెప్పడము చూడగలము.

మనస్సును నిగ్రహించుట కష్టతరమైన కార్యముగ అర్జునుడు ఇట్లనినాడు.

‘చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్

తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్’ [2]

{ఓ కృష్ణా! ఈ మనస్సు మిక్కిలి చంచలమైనది. ప్రమథనశీలమైనది. [బాగుగా మథించు స్వభావము కలది] దృఢమైనది. మిక్కిలి బలీయమైనది. కనుక దానిని నిగ్రహించుట గాలిని ఆపుటవలె మిక్కిలి దుష్కరమని భావింతును. దీనికి సమాధానముగా శ్రీకృష్ణుడు ఇట్లుచెప్పుట చూడగలము.

“ అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్

అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే || [3]

---

పాదసూచికలు: [1] పోతన/స్కం /8/73 [2,3] భగవద్గీత 6/34 &35

శ్రీ భగవానుని సమాధానము - ' హే మహాబాహో! నిస్సందేహముగా మనస్సు చంచలమైనదే. దానిని వశపఱచుకొనుటమిక్కిలి కష్టము. కాని కౌంతేయ! అభ్యాస వైరాగ్యముల ద్వారా దానిని వశపరచుకొనుట సాధ్యమే! కనుక భౌతికముగ కనిపించని వానిని సాధించుట కష్టమే, అయినా అసాధ్యము కాదు. [1],[2] ఆత్మ సంయమయోగము భగవద్గీత 6 /34, 35 గోరఖ్ పూర్, గీత ప్రెస్] కనుక నిర్గుణ బ్రహ్మ స్తుతులను చేయుటయేకాక, ఆచరణలో పెట్టుట కూడా కొంతకష్టమైన పనియే. నిర్గుణ ఉపాసన సులభముకాదు. సాధనతో, జ్ఞానముతోఆ తత్త్వాన్ని గ్రహించవచ్చు. కానీ కొన్ని కావ్యాలు తప్ప మిగిలిన కావ్యములు సగుణ బ్రహ్మ లీలా విశేషాలతోనిండి ఉండుట చూడవచ్చును. కావ్యాల లక్ష్యం విశ్వశ్రేయము కనుక సగుణబ్రహ్మ ఆరాధన సులభము. అందు వలననే కవులు సగుణ బ్రహ్మను అందుకు ప్రతీకలుగా త్రిమూర్తులను, ఇతర దేవతలను, వారి వాహనాలను, ఆయుధాలను, లీలలను, వారివారి అభిమానాన్ని, సంప్రదాయమును అనుసరించి స్తుతుల రూపములలో ప్రస్తావించినారు.

7.5 ***త్రిమూర్తుల స్తుతులు*** : - హరి, హర, హిరణ్య గర్భులను త్రిమూర్తులు అంటారు కదా! కవులు ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా పేర్కోవటం తెలిసినదే. ఇందుకు ఒకే దేవునకు పలు నామములు ఉండుట అనునది మనమెరిగిన విషయమే. ఐతే ఇవన్నియు పేర్లే కాక గుణములను కూడ ప్రతిపాదించునవి. శంకరనారాయణవిధులు, బ్రహ్మవిష్ణు మహేశ్వరులు మున్నగు ప్రయోగాలున్నవి.

తొలుత తెలుగు సాహిత్యమునకు మేలుబంతిగా త్రిమూర్తుల స్తుతిని అందించినవాడు- ఆదికవి నన్నయ భట్టారకుడు. శబ్దశాసనుడగు ఆయనశార్దూల వృత్తముతో శ్రీకార పదప్రయోగముతో, ఆంధ్రమహా భారతమును జాతికి అందించి, చక్కని సాహితీరాజమార్గమును ఏర్పరచినాడు. అయ్యది త్రిమూర్త్యాత్మకస్తుతితో ఆరంభమైనది. దీని విషయమై విస్తృతముగా చర్చ జరుపబడినది.

శా. “శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే

లోకానాం స్థితి మావహంత్య విహతాం స్త్రీ పుంస యోగోద్భవాం

తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితావస్సురై

ర్భూయాసుః పురుషోత్తమాంబుజ భవ శ్రీ కన్ధరాశ్శ్రేయసే” [1]

భానుమద్విజయము లో కృష్ణయామాత్యుడు త్రిమూర్తి స్తుతి చేసినాడు.

కం. “ సకల ప్రపంచ సత్తా ప్రకటన ఘటనా మహత్త్వ భాసిత యనగా

త్రిగుణాకృతిగా మూల ప్రకృతిని భావింతుతత్త్వ వాచా ప్రౌఢిన్” [2]

* మూడవ పాదము లో ప్రాస సరిగా లేదు

త్రిమూర్తులను ఒక పద్యములో ‘ప్రకృతి పురుషుల వినుతించి, బ్రహ్మ విష్ణు రుద్రు లను పేళ్లతో, సత్త్వ రజస్తమో గుణములు ఉపాధులు(ఆవరణలు)గా కలిగి విలసిల్లు పరమాత్మ ప్రతిబింబంబులను భావించి వినుతించుట, ‘శ్రీ సీతారామాంజ నేయ సంవాదము’లోచూడగలము. దీని కర్త ‘లింగమూర్తి గురుమూర్తి’.

సీ. “ తతశుద్ధ సత్త్వ ప్రధాన విగ్రహుల ని

మ్ముల రజస్సత్త్వ తమోగుణ కుల

స్వసుధర్మ శృంగార వైరాగ్య వేషుల

విశ్వో ద్భవ స్థితి విలయకరుల

తప్త కాంచన నీరధర చంద్ర వర్ణుల

శుభ కమండలు చక్ర శూల ధరుల

ఘనసత్య వైకుంఠ కైలాసవాసుల

వరహంస ఖగ వృష వాహనులను

గీ. షడ్గుణై శ్వర్యయుతుల భాషా వధూప్రసన్న మంగళ దేవతా సర్వ మంగ

ళాధిపతుల సాక్షాత్పరమాత్మ మయుల బ్రహ్మవిష్ణు మహేశుల ప్రస్తుతింతు” [3]

---

పాదసూచికలు: [1] కవిత్ర/భార/1/1 [2] భాను/1/2 [3] శ్రీ సీతారామ/గురుమూర్తి/పీ/3

పై పద్యములో బ్రహ్మ రజో గుణ సంబంధిగ , సుధర్మ[సృష్టి] కర్తగా, తప్త కాంచన వర్ణము కలవాడిగా, కమండల ధారిగా, హంసవాహనముగలవాడుగ, సత్యలోక వాసిగా, భాషా యోషకు పతిగారూపింప బడినాడు.

విష్ణువు సత్త్వ గుణముకలవాడిగా, స్థితికర్తగా, మేఘవర్ణునిగా, చక్రధారిగా, వైకుంఠపురవాసిగా, ఖగవాహనముగ లవానిగా, మంగళదేవత యగు లచ్చి పెనిమిటిగా, ప్రస్తుతింప బడినాడు. పరమేశుడు తమోగుణము కలవాడిగా, విలయ కారుడిగ, చంద్ర వర్ణునిగా, శూలధారిగా, వైరాగ్య వేషునిగా, కైలాసవాసిగా, వృశ్వాహనునిగా, సర్వమంగళ భామగా కలవానిగా నిర్ణయింప బడినాడు. ఇది త్రిమూర్తుల రూపున సాక్షాత్కరించు పరబ్రహ్మస్వరూపము. త్రిమూర్తులను అనగా- హరి, విధి, హరులను, క్రమముగా వీరి భార్యలు లక్ష్మి, సరస్వతి, పార్వతి, కొన్ని సందర్భాలలో మహా లక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి లేక ఇందిర, శారద, హైమవతి ఇత్యాదిగా కూడా చెప్పడము కలదు. వీరిని సకల భువన ప్రవర్తన హేతువులగు పురాతన మిథునములుగా చెప్పి , ప్రభావతీ ప్రద్యుమ్న మను ప్రబంధములో, నిఖిల సూరి లోకాంగీకార తరంగిత కవిత్వ వైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్య గేయుడైన సూరన ఆ ముప్పురిని వారి దారలతో సహా స్తుతించినాడు. ఆ స్తుతులను చూద్దాము.

ఉ. "శ్రీమదుమా మహేశు లతి చిత్ర విలాసులు తారు ముస్ వియో
గా మిత చింత నొండొరులకై సగ మౌటలునిచ్చ తెల్పు కాం
క్షా మహిమంబుచే చెటి సగంబుగా నొక్కయొడల్ ధరించు స
త్ప్రేమపు దంపతుల్ కృతి పతిస్ తనరింతురుగాతకీర్తులస్" [1] చిత్రమైన ప్రేమతో ఒకరికొకరు సగదేహమునుధరించిన వారు. వియోగమును తొలగచేయుటకై ఒక దేహమునే పంచుకొని విలసిల్లినారు. ఇక రెండవ మిథునమును చూద్దాము.

---------------------------------------

పాదసూచికలు: [1] ప్రభా/ప్రద్యుమ్న I/1

హృదయము దేహములో ముఖ్య అంగము. అనన్య సమాన మగు మిథునంబుల తీరు తెల్పుచున్న తీరులో, రీతిలో మదనుని మాతాపితరులు వర్తించినారు.

ఉ. " అంగజ హేతుకంబు లరయన్ మిథునంబుల ప్రేమ లిట్టిచో

నంగజు తల్లిదండ్రులగునట్టి యనన్య సమాన హార్ద సం

సంగు లనాది దంపతులు సత్కృప నిత్తురు గాక సౌఖ్యముల్

పింగళి సూర ధీరవరు బిడ్డకు మా యమరేశ మంత్రికిన్ " [1]

ఇక వాణిని తన రాణిగా చేసికొని, వదనమందు నిలుపుకొని {Face is the index of the Mind} తన ఆలోచనలకు పలుకు రూపమున ప్రతిఫలింపచేయు చున్నవాడు, స్వభక్తులకు కీర్తిని కలుగ చేయువాడు - సృష్టికర్త బ్రహ్మ దేవుడు. ఆతని పత్ని పలుకుల చెలి వాగ్దేవి. ఆ వాగ్విధాతల మిథునమును చూద్దాం.

చ. " అమల నవీన హైమ నిజయాన గరుద్ద్యుతి బ్రోచు సద్వపు

ర్విమల రుచిన్ స్వభక్తులకు వెండియు పైడియు కీర్తియున్ సుతే

జము నెపుడప్పుడే యొసగు సర్గ విధానము దాల్చి యున్నయు

ట్లమరెడు వాగ్విధాత లమరార్యున కిత్తురు నిత్య సౌఖ్యముల్ " [2]

---

పాదసూచికలు: [1] ప్రభా/I/2 [2] ప్రభా/I/3

7.6 ***దత్తాత్రేయుని స్తుతులు*** : - బ్రహ్మ మానస పుత్రులలో ఒక్కడు. ఈయన భార్య అనసూయ. ఇతడు తనతపోబలముచే త్రిమూర్తులఅంశలలో సోమ, దూర్వాస, దత్తాత్రేయులను ముగ్గురిని కొమరులుగా పొందినాడు. అనసూయ అత్రిమహర్షి భార్య. త్రేతాయుగమున తండ్రిమాట పాలించుటకు అడవులకు రాముడు వెళ్ళినాడు. రాముని అనుగమించినది సీత, లక్ష్మణునితో పాటు. అపుడు దండకారణ్యమున అత్రి అనసూయల ఆశ్ర మమును రామాదులు దర్శించినారు. అనసూయ సీతకు స్త్రీ ధర్మాలను పదేశించినది. సీతను దీవించి సౌమంగల్యమునకులోపము రాకుండ, అంగరాగ మాల్యవస్త్రాభరణముల నిచ్చినది. అనసూయ మహోన్నత మహిళ. ఇనుపగుగ్గిళ్ళను వండిపెట్టినదని చెప్పడము కలదు. అసూయాపరులైన సిరి, భారతి, గిరిజలు తమ పతులకామె ఘనతను కనుగొనవలసినదిగ వేడినారు. త్రిమూర్తులు అనసూయను పరీక్షింప వెడలి ఆమెచే పూజితులైనారు. ఆమె తమకు వివస్త్రగా వడ్డన సలుప కోరినారు. అనసూయ త్రిమూర్తులను పసిపాపలుగా మార్చి వారికోరిక తీర్చినది. తమభర్తలు పసిపాపలుగా మారిన విషయమును గ్రహించి అనసూయను పతి భిక్షపెట్టమని ప్రార్థించినారు త్రిమూర్తుల పత్నులు. వారికోరిక మన్నించినది. త్రిమూర్తులు తనకు బిడ్డలుగా కోరిన ఆ  అన సూయకు దత్తాత్రేయుడు జన్మించినాడు. మూడు శిరములతో, వేదాలు శునకరూపమున సేవించుచుండగా వెలసినవాడు, దత్తాత్రేయుడు. కొందరి ప్రకారము దత్తుడు విష్ణు అంశ అని చెప్పడము కలదు.దత్తునికి కొన్ని ఆలయాలు కలవు. తర్వాతి మార్పులలో అయ్యప్ప దత్తావతార మనినుతులర్పించుట చూడగలము. ప్రత్యేకముగా దేవతా స్తుతులలో దత్తునికి, పరిశీలించిన స్తుతులలో లేవు ఉత్తరోత్తర పరిశీలింప తగును.

7.7 ***హరిహరనాథ స్తుతులు*** :- అర్థ నారీశ్వర తత్త్వమువలెనే, హరి హర రూపములో పరతత్త్వమును ప్రత్యక్షము చేసుకొనిన కొందరు మహనీయుల భావనలకు రూపకల్పనయే "హరిహరనాథుని" రూపము. సగము పురారి , మరొక సగము మురారి. హరి మోహిని

రూపమును ధరించి అమృతమును దేవతలకు పంచుటతెలిసినదే! ఆ రూపమును చూడవలయునని హరుడు కోరినపుడు, విష్ణువు జగన్మోహిని రూపున అవతరించి కందర్పదర్ప హరుడగు శివునికి తన మాయను చూపినాడు. వారికి కలిగిన కుమారుడు హరిహరసుతుడు – శబరిగిరి నిలయుడైన అయ్యప్ప. శైవ - వైష్ణవ మతముల మధ్య అంతరము పెరిగి ప్రజలు మతము పేరిట ద్వేషమును పెంచుకొనుట తగదని, శివ కేశవుల మధ్య అంతరము లేదని ఇరువురు ఒకటేయను వైదిక భావమును తెలియజేయుచూ, ప్రతిపాదితమైన తత్త్వము హరిహరనాథ తత్త్వము. దానికి రూపము హరిహరనాథుడు. మన సాహిత్యములో ఇట్టి ప్రస్తావన ఉభయకవిమిత్రుడు, కవిబ్రహ్మ యైన తిక్కన సోమయాజి మహాభారత రచనకు ఉపక్రమించుచు, చేసిన ప్రార్థన హరిహరాత్మస్వరూపము.

ఉ. "శ్రీయనగౌరినాబరగుచెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియైహరిహరంబగు రూపము దాల్చి 'విష్ణు రూ
పాయ నమశ్శివాయ' యని పల్కెడు భక్త జనంబు వైదిక
ధ్యాయిత కిచ్చు మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్ట సిద్ధికిన్" [1]

నిర్గుణ స్వరూపము పరబ్రహ్మ. సగుణ స్వరూపము హరిహరనాథుడు. విష్ణు రూపమునదలి శివునికి నమస్కారము. సంధ్యా వందనములో, 'శివస్య హృదయం విష్ణుః, విష్ణోశ్చ హృదయ(గ్)మ్ శివః' అని చెప్పడము తెలిసినదే!

హరిహరనాథుని తిక్కన తర్వాత స్తుతించిన వారిలో నాచన సోముడు ఒకడు. ఉత్తర హరి వంశములో వేదవ్యాసముని మనో నివాసుడని హరహర నాథుని నాచన సోముడు పేర్కొవటం గలదు.ఆ స్తుతి ఇది >

కం. "శ్రీ సర్వ మంగళా కుచ వాసంతీ వకుళ గంధవద్వన మాలా
వాసుకి విలాస వేదవ్యాసముని మనో నివాస హరిహర నాథా![2]

---

పాదసూచికలు: [1] [విరా/తి/1] [2] [ఉ.హ వం/1/1 నాచ.సో ]

తన ' విక్రమార్కచరిత్రము' లో 'జక్కనామాత్యుడు', కృతిభర్త యగు జన్న మంత్రి సుతుడైన సిద్ధామాత్య చూడామణిని, హరిహరేశుడు ఎల్లప్పుడూ రక్షించుగాక యని కోరినాడు. ఆ స్తుతిలో భాగముగా కూర్పు చేయబడిన పద్యమిది.

శా. "శ్రీ గౌరీ కుచనీల మౌక్తిక మణిశ్రేణీ విభూషాఘృణి

ప్రాగల్భ్యంబులు కృష్ణపాండురతనుప్రౌఢిం ప్రతిష్ఠింప తే

జో గణ్యుండయి యొప్పు శ్రీ హరి హరేశుండెప్డు రక్షించు వి

ద్యాగంభీరుని జన్న మంత్రి సుతు సిద్ధామాత్య చూడా మణిన్" [1]

హరిహర నాథ రూపముకూడా పలు చోట్ల శిల్పములో కలదు. ఆంధ్రప్రదేశ్ లో ప్రకాశం జిల్లా చంద్ర శేఖర పురం మండలములో భైరవకొన అను క్షేత్రము వద్ద ఒక హరిహర నాథ శిల్పమున్నది. అది త్రిముఖ దుర్గాంబ ఆలయమునకు ఎదురుగానున్న గోడపై కలదు. వామ భాగములో నారాయణికి బదులుగా నారాయణుడు ఉండుట చూడగలము. కొన్ని చిత్రములలో మరొకవిధముగా, విష్ణువును దక్షిణ భాగములో చూపడము కలదు'

7.8 *సూర్యుని స్తుతి* : నవీనుల అభిప్రాయములేవైన ఒకటి మాత్రము నిజము. సూర్యడు వెలుగు నిచ్చువాడు. సూర్యునికి దివాకరుడు, దినకరుడు, ప్రభాకరుడు, రవి, విభాకరుడు, మొదలైన నామాంతరములున్నవి.ప్రాచీన మంత్ర ద్రష్టలలో పలువురు సూర్యుని పెక్కు రూపములలో వర్ణించి ఉన్నారు. ఈ వర్ణనల ప్రభావము తరువాతి పురాణాదులందలి సూర్యవర్ణనముపై  అధికముగా కనిపించును. సూర్యుని ఉపాసించుటవలన సర్వ రోగాలు శాంతించును అను నమ్మకము ఋగ్వేదమునాడే కలదు.  ప్రస్కణ్వుడు  అను మహర్షి తాను  దర్శించిన మూడు మన్త్రములను జపించి చర్మ రోగమును పోగొట్టుకొనెను. ఆ మూడు ఋక్కులును 'తృచ' మను పేర భారత దేశమునందు అంతటను ప్రసిద్ధములయి ఆచరణలో నున్నవి.

---------------------------------------------------------------------------------

పాదసూచికలు: [1] విక్ర/1/1/జక్కన

ఋగ్వేద సంహితలో అందందు చెదరి ఉన్న సూర్య పరములు అయిన 60 ½ ఋక్కులను 'మహాసౌరము' అను పేర ఒక్కచో సేకరించి ఉన్నారు. ఆరోగ్యము కోరువారు వానిని జపించుచు నేటికిని సూర్యనమస్కారములు చేయుచున్నారు. ఋగ్వేదమునందలి సూర్య వర్ణనలను సూక్ష్మముగా పరిశీలించినచో అప్పటి ఋషులు సూర్యమండల తత్త్వమును ఎంత గాఢముగా పరిశోధించిరో తెలియ వచ్చును.

వీటిని మరొక సందర్భములో వివరించుట జరుగును. ఇతడు గ్రహపతి. ఇతనికి తోడు చంద్రుడు. సూర్యుడు ఆరోగ్య ప్రదాత. 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అని పెద్దలు చెప్పినారు. సూర్యనమస్కారములు దేహానికి వ్యాయామము కల్పించు ప్రక్రియ. జగత్తుకు సాక్షియని చెప్పబడినవాడు సూర్యుడు. అమరకోశకారుడు చెప్పిన ప్రకారము సూర్యునికి గల నామములు ఇవి > వీటిలో ప్రతి పదమునకు ప్రత్యేకమైన అర్థము యుండడము భాషాపరమైన విశేషముగా గమనించవలెను.

" సూరా సూర్యార్య మాదిత్య ద్వాదశాత్మదివాకరాః
భాస్కరాహస్కర బ్రధ్న ప్రభాకర విభాకరాః
భాస్వద్వివస్వత్సప్తాశ్వ హరిదశ్వోష్ణరశ్మయః
 వికర్తనార్కమార్త ణ్ణమిహి రారుణ పూషణః
ద్యుమణి స్తరణిర్మిత్ర శ్చిత్ర భానుర్విరోచనః
విభావసు గ్రహపతి స్త్విషాంపతి రహర్పతిః
భానుర్హంస స్సహస్రాంశు స్తపన స్సవితా రవిః
( కర్మసాక్షీ జగచ్చక్షు రంశుమాలీ త్రయీతనుః
ప్రద్యోతనో దినమణిః ఖద్యోతో లోకబాన్ధవః
సురోత్తమో ధామనిధిః పద్మినీవల్లభో హరిః)

దినరాజు, గ్రహరాజు ఐన సూర్యునిగూర్చి, అతని ఘనతను గూర్చి ఇట్లు చెప్పడము కలదు.

సీ. కాశ్యప గోత్రుడై ఘనత కెక్కిన వాడు ధర లక్ష యోజనాంతరమువాడు

గ్రహరాజు వర్తులాకార మండలుడును హేమ దృష్టి కళింగ భూమివిభుడు

మాణిక్య కుండల మకుట హారములతో మేరుప్రదక్షిణ మెలగువాడు

సప్తాశ్వరథ శంఖ చక్రముల్ కలవాడు రక్తవర్ణు డు సింహరాశివాడు

గీ. అంబుజాప్తుడు మరియు ఛాయావిభుండు శమన కర్ణుల కన్నట్టి జనకు డనగ

రాజగురుడైన సూర్యనారాయణుండు మనల కరుణా విధేయుడై మనుచుగాత! [1]

ఇక్కడ సూర్యుడు కశ్యప ప్రజాపతి కుమారుడు, కాశ్యపగోత్రజుడు అని, భూమికి లక్ష యోజనముల దూరమున ఉన్నవాడని గ్రహముల రాజు, వర్తులాకార మండలుడని, హేమ కాంతి కలిగిన వాడు, కళింగ దేశ ప్రభువని మాణిక్య కుండలములు కలవాడని, కిరీట ధారియని, సప్త అశ్వముల రథము , శంఖ చక్రములు కలవాడని, రక్త వర్ణుదని, సింహరాశి అధిపతి, అంబుజ ఆప్తుడని, ఛాయాదేవి భర్త యని, యమ, కర్ణులకు తండ్రియని రాజగురుడని చెప్పడము కలదు. సంగీత త్రిమూర్తులలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితులు తమ నవగ్రహ స్తుతిలో *సౌరాష్ట్ర రాగ మందలి [చతుస్ర ధృవ తాళం] కృ*తిలో ఇట్లనినారు.

పల్లవి. సూర్యమూర్తే నమోస్తుతే! సుందర ఛాయాధిపతే!

అను. కార్యకారణాత్మక జగత్ప్రకాశ సింహరాజ్యాధిపతే!

ఆర్యవినుత తేజస్స్ఫూర్తే ఆరోగ్యాది ఫలత్కీర్తే!

చరణం. సారసమిత్ర మిత్రభానో సహస్రకిరణ కర్ణసూనో

క్రూర పాపహర కృశానో గురుగుహ మోదిత స్వభానో

సూరిజనేష్టిత సుదినమణే సోమాదిగ్రహ శిఖామణే

ధీరార్చిత కర్మసాక్షిణే! దివ్యతర సప్తాశ్వరథినే!

సౌరాష్ట్రార్ణ మంత్రాత్మనే సౌవర్ణ స్వరూపాత్మనే

భారతీశ హరిహరాత్మనే భక్తిముక్తి వితరణాత్మనే !

---

పాదసూచికలు: [1] చాటు పద్య మణి మంజ పుట/6 సేక.వేటూరి ప్ర.శా.

ఇందులో ఛాయాపతి, సింహరాజ్యాధిపతి, సారసమిత్ర , కర్ణ సూను, హరిహరాత్మ, సావర్ణ, కర్మసాక్షి, భారతీశ, ఆరోగ్యాదిఫలత్కర్తే ఇత్యాది పదములు పై పద్యములోని విషయములతో అనుగుణముగ కూడియుండుట పరిశీలనగ గమనించిన తెలిసికొన/ గ్రహించ గలము. గ్రహములను ఆరాధించుట వలన కలుగు లాభములు / ప్రయోజనములు ఇట్లు చెప్పడము చూడగలము. ఆది / రవి / భాను వారము యీతని పేరుపైన గల దినము. విష్ణువుకు సూర్యుడు కుడి కన్నుగ చెప్పడము కలదు.

జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిం

తమోఘ్నం సర్వపాపఘ్నం ప్రణమామి దివాకరం - యని సూర్యునికి చేసే ప్రార్థన.

ఆత్మపీడ ఉపశాంతి కొరకై సూర్యుని,

"సూర్యారిష్టేతు సంప్రాప్తే సూర్యపూజాం చ కారయేత్,

సూర్యధ్యానం ప్రవక్ష్యామి ఆత్మపీడోపశాంతయే" అని ప్రస్తావించడం కలదు.

రక్త గంధం, రక్తవర్ణం, రక్తపుష్పం, రక్తమాల్యాంబరధరం, సప్తాశ్వం, కళింగ దేశాధి పతిం, సింహరాశ్యాధి పతిం, ప్రాఙ్ముఖం, కాశ్యపసగోత్రం, గ్రహమండలే ప్రవిష్టమస్మిన్నధికరణం. ఇత్యాది గుణములు సూర్యగ్రహమునకు చెప్పబడినవి. సూర్యుడు లోకసాక్షి , జగచ్చక్షువు. ఈ సూర్యనారాయణుడు 'మూడు మూర్తుల రూపము' అని అనడముకూడా మనము చూడగలము. ఆ తేజోనిధి త్రిమూర్త్యాత్మకుండు అని స్తుతించడము చూద్దాము. 'విజయ విలాసకర్త' 'చేమకూర వేంకటకవి' పదములపై చమత్కారము చేయుచూ, సత్త్వ, రజ, తమో గుణములు రూపించినవాడు దినకరుడు అనటమిట్లున్నది.

మ. ' మొగుడుందమ్ముల విప్పునప్పుడు రజంబున్, చక్రవాళంపు కొం
డ గడిన్ దేఱుగడైన పట్ల తమమున్, మందేహులన్ దోలి వాసి
గడల్కొన్ తఱియందు సత్త్వము ప్రకాశింపన్ త్రిమూర్త్యాత్మకుం
డగు తేజోనిధి పేద్కజేయు రఘునాథాధీశు తేజోనిధిన్' [1]

-----------------------------------------

పాదసూచికలు: [1] వి వి ఆవ/5 చేమ

లోకసాక్షియగు సూర్యుని పలురీతులుగా వివరించి ఆతని కాంతి తమకిమ్మని 'కుమారసంభవములో' 'నన్నెచోడుడు' చేసిన ప్రార్థన చూద్దాము.

చ. " అనుపమదివ్యమూర్తి యనునంతియ కాదు భవాష్టమూర్తులం

దును వరమూర్తి దాన ప్రభ తోడ జగజ్జనరాజికెల్ల నిం

దనయము దాన దృష్టి యను నంతియ కాదు త్రిలోచనాదిలో

చనమును దాన యైన రవి చారునిజప్రభ మాకు నీవుతన్" [1]

'విక్రమార్క చరితము' లో జక్కన చేసిన సూర్య స్తుతిని చూడండి. సూర్యుని వేగము ఈ కవి ప్రస్తావించినాడు.

చ " హరిహర నీరజాసన సుఖావహమై నిమిషార్థ మాత్రలో

నిరువదిరెండు నూరులకునెక్కుడు నిర్వది యోజనంబులే

యరదము లీలవోలె జన నంబర వీధిని యారథంబు నా

సురథము సన్మనోరథము చొప్పడ నీవుత సిద్ధ మంత్రికిన్" [ 2]

ఇందులో కూడా త్రిమూర్తుల ప్రస్తావన చేయడమున్నది.

సింహాసన ద్వాత్రింశిక లో, కొరవి గోపరాజు, విక్రమార్కుని సంభవమునకు ఆ అర్కుడు కారణమైనవాడని [విక్రమ+అర్కుడు= విక్రమార్కుడు] సూర్య స్తుతి చేయడము కలదు.

కం. "ప్రవిమలుడని గ్రహరాజని, కవితా ప్రియుడని జగత్ప్రకాశకుడనియున్

భువి విక్రమార్క నృప సంభవ కారణుడనియు లోకబాంధవు దలతున్" [3]

సూర్యుడు గ్రహరాజుగా, ప్రవిమలుడుగా,కవితాప్రియుడుగా, జగత్తునకు ప్రకాశము కలుగ చేయువాడని మరియూ లోకబాన్ధవుడని చెప్పడమైనది. సూర్యునికి చెప్పబడినలక్షణాలన్నీ, విక్రమార్కునికి కూడా వర్తిస్తాయి.

---

పాదసూచికలు: [1] కుమా/6 [2] విక్ర/1/7 [3] సింహా/కొరవి/1/7

తన 'లంకా విజయము'లో 'పిండిప్రోలు లక్ష్మణ కవి' నవగ్రహాలను స్తుతించినారు. అక్కడ ఆయన చేసిన సూరి స్తుతిలో భాసురమైన ప్రతాపము, చక్ర శబ్ద ప్రయోగమున ఆరు ఋతువులను కలిగించువాడని, హిమాధికత్వమును హరించు యనుటచే, వాల్మీకి శ్రీమద్రామాయణ మహాకావ్యమందలి ఆదిత్య హృదయంలో చెప్పిన రీతిగా, 'హిమఘ్నాయుడు' అని స్మరణకు తెచ్చుట చూడగలము. ఆ 'జయభద్రుని' స్తుతించిన తీరు చూద్దాం.

చ. "పరమ హిమాధికత్వమును భాసురమైన ప్రతాపవృత్తిచే
హరణము నొంద జేయుచు నయంబలరంగ మలానిశప్రమో
దరతితనర్చి చక్ర సహితత్వమునన్వెలుగొందు చుండు నా
హరిమముబ్రోచుగావుత దయారస పూరము నించి పెంపునన్" [1]

7.9 ***చంద్రుని స్తుతి*** ;- ఆహ్లాదము కలిగించువాడు, అమృతకిరణుడు, జీవకోటికి అవసరమగు సస్యములను వృద్ధిచేయువాడు. జైవాతృకుడు. చంద్రుని స్మరణ, స్తుతి, దూషణ అధికముగా ప్రబంధాలలో చూడగలము. చంద్రుని కథా నాయకునిగా కూర్చబడిన ప్రబంధము "శశాంక విజయము" దీని కర్త ' శేషము వేంకటపతి'. కృతిభర్త 'వంగల సీనయామాత్యుడు. బృహస్పతి పత్నియగు తారకు, చంద్రునికి మధ్య నడచిన ప్రేమ వ్యవహారము, దానిఫలమైన చంద్రునికి ఇంద్రునికి మధ్య సంభవించిన రణము... బుధుని జన్మము, సుఖాంతము కథ.

సోమ/ ఇందు వారము యీతని పేరుపైన గల దినము. చంద్రుని పరమైన స్తుతి దీక్షితులవారు, 'అసావేరి' రాగము, 'చతురస్ర మఠ్య' తాళమునకు కూర్చినారు.

-----------------------------------------

పాదసూచికలు: [1] లంకా/పీ/8

పల్లవి. చంద్రం భజ మానస సాధు హృదయ సదృశం !

అను. ఇంద్రాది లోకపాలేష్టిత తారేశం ఇందుం షోడశ కళాధారం

నిశాకరం ఇందిరా సహోదరం సుధాకర మనిశం !

చ. శంకర మౌళి విభూషణం, శీతకిరణం, చతుర్భుజం మదన ఛత్రం

క్షపాకరం వేంకటేశనయనం విరాణ్మనోజననం విధుం, కుముదమిత్రం

విధిగురుగుహ వక్త్రం శశాంకం గీష్పతి శాపానుగ్రహ పాత్రం కంకణ

కేయూరహార మకుటాది ధరం పంకజ రిపుం రోహిణీ ప్రియకర చతురం

కావ్యాలలో, మరీ ప్రబంధాలలో చంద్రుని ప్రస్తావనరావడమతి సహజము. ప్రత్యక్షంగా పరోక్షంగా చంద్ర సంబంధవర్ణనలు ప్రబంధములందు ఉండుట సహజాతిసహజము. కొన్ని సందర్భములను ఇప్పుడు ప్రస్తావింతము. కావ్యాలలోనే కాదు చంద్ర సంబంధముగా సమస్యలు ఉన్నప్పుడు చేయ వలసిన ఉపశాంతి గురించి ఇట్లు చెప్పబడినది.

" చంద్రారిష్టేతు సంప్రాప్తే చంద్రపూజాం చ కారయేత్

చంద్ర ధ్యానం ప్రవక్ష్యామి మనః పీడోప శాంతయే" అనుచు మానసికస్థితి బాగలేనపుడు చంద్రుని పూజింప వలెనని తత్ జ్ఞుల మాట/ సలహా!

" దధిశంఖ తుషారాభం క్షీరోదార్ణవ సంభవం,

నమామి శశినందేవం శంభోర్మకుట భూషణం" అని చంద్రునికి చేయు ప్రార్థన.

వివిధ అర్థములు గలిగిన చంద్రుని నామములను అమరకోశము ఇట్లు చెప్పడము చూడగలము.

" హిమాంశు శ్చంద్రమాశ్చంద్ర ఇన్దుః కుముదబాన్ధవః

విధు స్సుధాంశు శ్శుభ్రాంశు రోషధీశో నిశాపతిః

అబ్జో జైవాతృక స్సోమో గ్లౌ ర్మృగాఙ్కః కళానిధిః

ద్విజరాజ శ్శశధరో నక్షత్రేశః క్షపాకరః "

చంద్రునికి చెప్పబడిన మరికొన్ని విశేషములు ఇప్పుడు చూద్దాము. ‘ చంద్రగ్రహం, శ్వేతవర్ణం, శ్వేత గంధం, శ్వేతపుష్ప, చ్ఛత్ర, ధ్వజ, రథ, పతాకాది శోభితం, కర్కాటక రాశ్యాధి పతిం సూర్యగ్రహస్యఆగ్నేయ దిగ్భాగములోనుండువాడు. ధవళ వర్ణ సంబంధమైనవి చంద్ర గ్రహమునకు ప్రీతిగా చెప్పడమున్నది. ఇతడు యాముని దేశాధిపతి. చంద్రుని సోదరి లక్ష్మి. మదనుడు ఇతనికి మేనల్లుడు. ఇట్లు వరసలు కొన్ని మరొక సందర్భములో చూడగలము.

లోకానికి అంతటికి మామ యైన ఈ చందమామను అచ్చతెనుగులో యీ రీతిగా పేర్కొనుట కలదు.

“కఱకంఠు తలమానికము, వేలుపుల బువ్వ, జాబిల్లి, మరుమామ, చందమామ, జింకతాలుపు, తోగ చెలికాడు, జడదారి కన్నాప, రేఱేడు, కడలివెన్న, చుక్కలగమికాడు, జక్కవ పగవాడు, చలివెల్గు, రేవెల్గు, చలువజోతి, వెన్నునెడమకన్ను, వెన్నెలరాయడు , నెలతమ్మిదాయ, మున్నీటిపట్టి, కందుగలదుండగీడు, చీకటులమిత్తి, పంటపైరులదొర, ప్రొద్దుజంట, లచ్చియన్న, రేజోతి, చందు ..అనునవి. వేరువేరు గ్రంథ కర్తలు మరికొన్ని తెలుగు పదములు చెప్పినారు. పైన వున్న పదములవంటివే కొంత మార్పుతో! ఉదా. పంటపైరులదొర = పంటపైరుల ఎకిమీడు., మున్నీటిపట్టి = పాల్కడలిపట్టి ఇత్యాదిగా.

బృందావనవిహారమను ప్రబంధములో కవి తన జ్యోతిష్య శాస్త్ర విజ్ఞానమును మేళవించి ఒక వైపు చంద్రుని భూషించడము మరొక వైపు దూషించడము చేయడము చూడగలము. కువలయప్రియ కారివి, గురువివర్ధనీయ సంపూర్ణతర కళాన్వితుడవు, అమృత కిరణుడవు , ద్విజరాజువు, కామధేను, చింతామణి, కల్పతరు, ఇందిరాదుల తోడ పుట్టినావు. సర్వజ్ఞుడగు శంకరుని శిరమునధిరోహించిన ఘనుడవు అని ప్రస్తుతించినాడు. అట్టి చంద్రునే తరుణుల ఏచుట వలన ఓ! తారకానాథ! కర్కటకమును పొందిన దురాత్ముడని, క్షీణత కలవాడైనాడని, కాలకూటముతో కూడ జన్మ పొందినవాడవనినాడు. ఓ! బిసరుహారి! నీ మహోగ్ర వృత్తి మన్నింప రానిది, ఈశుడు గొంతులో కాలకూటమును దాచుకొని, దానితో

పాటు జన్మించిన చంద్రుని నెత్తిపై పెట్టుకొనిననూ, విషము కన్నా విషమమైనవాడవని చంద్రుడని - తెగడుట కలదు. విష్ణువుకు ఎడమ నేత్రము చంద్రుడని చెప్పడము కలదు. 'లంకా విజయము' నందు కవి 'పిండి ప్రోలు లక్ష్మణకవి' ఆహ్లాదకారియగు చంద్రుని యీరీతిగా స్తుతించినారు.

మ. " ప్రకటంబైన కురంగ లాంఛనముతో భాసిల్లి దాక్షాయణీ

సకలాభీష్ట ఫల ప్రదుండగుచొగిన్ సౌమ్యాఖ్య చెన్నొంది పౌ

ల్చుకుమారుంగని దేహ శుభ్ర రుచితో శోభిల్లునా సోమ నా

మకు డశ్రాంతశుభ ప్రదాయి యగుచున్మముం కృపం బ్రోవుతన్"[1]

పైన కురంగ లాంఛనుడని , దాక్షాయణీ కృప వలన సకలాభీష్టములుతీర్చు వాడు, బుధుని కన్నా తండ్రి, సోమ నామము కలవాడు, శుభములనొ సగువాడు, దయతో మము ప్రోచునని కవి ఆశంసను వెలిబుచ్చినాడు.

రాజ వంశములు ముఖ్యముగా రెండు వర్గములుగా చెప్పబడినవి.

ఒకటి సూర్య వంశము. రెండవది చంద్ర వంశము.

శ్రీరాముడు సూర్యవంశము వాడు.

శ్రీకృష్ణుడు, పాండవాదులు చంద్ర వంశీయులు.

శ్రీకృష్ణ దేవ రాయలు చంద్ర వంశమునకు చెందిన వాడనుచూ, ఆ చంద్రుని స్తుతిస్తూ తన రాజుపై, (కృతిభర్త కూడా) కరుణను కురియ జేయ ఆకాంక్ష వెలిబుచ్చినాడు తిమ్మన తన పారిజాతాపహరణము ప్రబంధములో. చూడుడు.

చ. " వలిమల యల్లు వాడు తలవాక ధరించిన పూవుగుత్తి వే

ల్పుల గమి జీవగఱ్ఱ, యుదివోవని చలవల టెంకి వెన్నెల

ల్మొలచిన పాదు, పాలకడలి ముద్దుల పట్టి నృసింహ కృష్ణ రా

యల కరుణా రసంబు నినుపారెడి చూపుల జూచు గావుతన్"[2]

---

పాదసూచికలు: [1] లంకా/వి/పీ/9/పిండి .లక్ష్మణ [2] పారి/6

హిమవంతుని అల్లుడు శివుడు. అట్టి ఘనమైన శివునికి పూల గుత్తి వలె అలంకారముగా కూర్చబడినవాడు కుముద బాంధవుడు. చంద్రుడు ప్రాణులకు జీవ ప్రదాత. సస్యముల వృద్ధి కారకుడు. అమృత కిరణుడు. వదలని చల్లదన గుణము కలవాడు. మనసునకు ఆహ్లాదము కలిగించు వెన్నెలలు మొలచునట్టి పాదు. అన్నిటికి మించి పాలకడలి పట్టి. ఇన్ని ఉన్నతోన్నత లక్షణాలు కల చంద్రుని వంశములో అవతరించినవాడు ఆంధ్రభోజుడు. కనుకనే ఆ శశి చల్లని చూపులు తన వంశమువాడైన నృపుని పై కురిపించ వలెనని తిమ్మన కోరిక.

## 7.10 *నవగ్రహాలస్తుతి*

జ్యోతిశ్శాస్త్ర ప్రకారము మానవ జీవితముపై అత్యధికమగు ప్రభావము చూపునవి నవగ్రహములు. ఇవి తొమ్మిది. వరుసగా సూర్య, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర,, శని మరియు ఛాయాగ్రహములను - రాహు, కేతు మొత్తము తొమ్మిది. ఈ ఘనత వహించిన నవగ్రహములను స్తుతించిన విధము చూడుడు..

"ఆదిత్యాయ చ సోమాయ మంగళాయ బుధాయ చ

గురుశుక్ర శనిభ్యశ్చః రాహవే కేతవే నమః " అని వ్యాస ముఖోద్గీతం.

నవగ్రహముల స్వరూపమును దిశలను ఇట్లు చెప్పడము కలదు.

"మధ్యే వర్తుల మండల మాదిత్యాయ / ఆగ్నేయాం చతురశ్రగ్ం సోమాయ / దక్షిణే త్రికోణ మంగారకాయ /ఈశాన్యం బాణాకారం బుధాయ / ఉత్తరే దీర్ఘ చతురస్రం బృహస్పతయే / ప్రాక్పంచ కోణగ్ం శుక్రాయ / పశ్చిమే ధనురాకారగ్ం శనైశ్చరాయ / నైరృత్యాం శూర్పాకారగ్ం రాహవే / వాయవ్యం ధ్వజాకారగ్ం కేతవే!

''నవగ్రహస్థానము'' లనిట్లు పేర్కొనవచ్చు

| | | |
|---|---|---|
| బుధుడు[ఈశా] | శుక్రుడు [తూర్పు] | చంద్రుడు [ఆగ్నే] |
| బృహస్పతి [ఉత్తర] | {సూర్యుడు} (కేంద్రం) | అంగారకుడు [దక్షిణ] |
| కేతువు [వాయవ్య] | శని [పడమర] | రాహువు [నిర్రుతి] |

నవగ్రహములను ఒక పద్యమునందు స్తుతించిన రీతి చూడుడు.

సీ. భానుండు తగ మీకు భవ్య తేజం బిచ్చుగాక,
కరుణ చంద్రుడు మీకు కాంతి యిచ్చు
అంగారకుడు మీకు మంగళంబుల నిచ్చు,
బుధుడు నెమ్మది మీకు బుద్ధి నిచ్చు
నెఱి బృహస్పతి మీకు నిర్మల మతి యిచ్చు,
నరయ శుక్రుడు మీకు హర్షమిచ్చు
రాహువేప్పుడు మీకు బాహాబలం బిచ్చు,
కేతువు మీకు విఖ్యాతి నిచ్చు

గీ. ఘనతకెక్కిన యీ నవగ్రహము లెప్పుడు
బలిమి నేకాదశ స్థానఫలము లొసగ
పుత్ర పౌత్రాభి వృద్ధిచే భూతలమున
మీరు వర్ధిల్లు డాచంద్రతారకముగ! [1]

శని గ్రహ ప్రస్తావన మాత్రముఎందుకో ఉన్నటుల కనిపించదు.

ఆయా గ్రహములు ఇచ్చు ఫలములను పైన చెప్పడము చూడగలము.

అప్పకవీయములో నవగ్రహములను ఈ రీతిగా స్తుతితో సంభావించడమున్నది.

కం. " రవి శశి కుజ బుధ సురగురు
కవి భానుజ రాహు కేతు గణములు నాకుం
దవిలి ఘటంబున నుండుచు
సవ నిత్తురు గాత సకల సంపద లెపుడున్" [2]

---

పాదసూచికలు: [1] చాటు పద్య మణి మంజ పుట/12 సేక.వేటూరి ప్ర.శా.

[2] అప్పకవీయ/పీ/25

కొందరు ఆభరణములలో నవగ్రహముల ప్రీతి కొరకై పలురత్నములను ధరింతురు. ఏయే గ్రహములకు తగిన రత్నములు ఇట్లు చెప్పడమున్నది.

(1) సూర్యుడు = కెంపు, (2) చంద్రుడు = ముత్యము, (3) కుజుడు /అంగారకుడు =పగడము, (4) బుధుడు =పచ్చ, (5) బృహస్పతి/గురువు =పుష్యరాగము, (6) శుక్రుడు = వజ్రము, (7) శని = నీలము, (8) రాహువు = గోమేధికము, (9) కేతువు = వైఢూర్యము

రవి చంద్రులను ప్రత్యేకముగ పైన ప్రస్తావించడము జరిగినది.

***అంగారకుడు.***

నవగ్రహాలలో మూడవది అంగారకుడు. దీనికే కుజుడు అని పేరు. మంగళ/భౌమ/ కుజ వారము ఇతని పేరున కలదు. కుజని స్తుతి చూద్దాము.

'ధరణీగర్భ సంభూతం విద్యుత్కాంతి సమప్రభం
కుమారం శక్తిహస్తం తం మంగళం ప్రణమామ్యహం'
'కుజారిష్టేతు సంప్రాప్తే కుజపూజాం చ కారయేత్
కుజధ్యానం ప్రవక్ష్యామి రోగపీడోపశాంతయే'

రోగముల బాధలనుండి ముక్తి కొరకు కుజని పూజింప వలయునని చెప్పడము పైన చూడగలము. భూమిపుత్రుడు కుజుడు. అంగారకగ్రహమురక్తవర్ణ ప్రీతి గలదిగా గుర్తించినారు.సూర్య గ్రహమునకు దక్షిణ దిశలో స్థితమైనది కుజగ్రహం.

కుజుడు మేష, వృశ్చిక రాశులకు అధిపతి.

అంగారకుని, కుజుడు, భౌముడు, మహీసుతుడు, లోహితాంగుడనియు నామాంతరములు కలవు. అవంతీదేశమునకు కుజుడు అధిపతి.

అంగారకుని పరమైన స్తుతి దీక్షితులవారు, 'సురటి' రాగము, 'రూపక' తాళమునకు కూర్చినారు.

ప. అంగారక మాశ్రయామ్యహం వినతాశ్రితజన మందారం
మంగళవారం భూమికుమారం వారం వారం

అను. శృంగారక మేష వృశ్చిక రాశ్యాధి పతిం రక్తాంగం రక్తాంబరాది ధరం

శక్తి శూల ధరం మంగళం కంబుగళం మంజులతర పద యుగళం

మంగళనాయక మేష తురంగం మకరోత్తుంగం

చరణం: దానవ సుర సేవితం మందస్మిత విలసిత వక్త్రం ధరణీప్రదం

భ్రాతృకారకం రక్త నేత్రం దీన రక్షకం పూజిత వైద్య నాథ క్షేత్రం

దివ్యౌఘాది గురుగుహ కటాక్షానుగ్రహ పాత్రం భాను చంద్ర గురు మిత్రం

భాసమాన సుకళత్రం జానుస్తహస్త చిత్రం చతుర్భుజ మతి విచిత్రం.

తన 'లంకా విజయము'లో, 'పిండిప్రోలు లక్ష్మణకవి' భూమి కుమారుడగు కుజునికి చేసిన స్తుతి చూద్దాము.

ఉ. "మేదుర వృత్తి నాకము సమీపమునందువసించుచుం ప్రవా

ళోదిత కాంతితో కడగి యొప్పి ద్విజాది సదాశ్రితాళికా

మోదమునస్ రుచుల్ దనర వొల్పుగ కామ్య ఫలంబు లెల్ల న

త్యాదర లీల నిచ్చు మహిజాధికతన్మదిలో నుతించెదన్" [1]

*బుధుడు.*

బుధుడు సౌమ్య గ్రహము. చంద్రుని కుమారుడు. తార ఇతని తల్లి. బుధ / సౌమ్య వారము ఇతని పేరుపై వ్యవహరింపబడుతున్నది. నవగ్రహాలలో సూర్యునికి ఈశాన్యదిశలో నుండు గ్రహము. బుధుడు అనగా పండితుడు. బుధుని స్తుతిని ఇట్లు చేయుట చూడగలము.

"ప్రియంగుకళికాశ్యామం రూపేణా ప్రతిమం బుధం

సౌమ్యం సౌమ్య గుణోపేతం తం బుధం ప్రణమామ్యహం"

పీత వర్ణ ప్రియుడు బుధుడు. కన్యా మిథున రాశులకు అధిపతి. బుద్ధి సంబంధ సమస్యలను తొలగించుకొనుటకు బుధగ్రహప్రార్థన చేయవలె ననుట కలదు. బుధుని – సౌమ్యుడని, రౌహిణేయుడని [రోహిణి పుత్రుడు] కూడా పిలుతురు.

---------------------------------------

పాదసూచికలు: [1] లంకావి/పీ/10

"బుధారిష్టేతు సంప్రాప్తే బుధ పూజాం చ కారయేత్

బుధ ధ్యానం ప్రవక్ష్యామి బుద్ధి పీడోపశాంతయే" వ్యాస ప్రార్థన

'బుధుని' పరమైన స్తుతి దీక్షితులవారు, 'నాటకురంజి' రాగము, 'మిశ్ర జంప ' తాళము నకు కూర్చినారు. చూడండి.

ప. బుధమాశ్రయామి సతతం

సురవినుతం చంద్రతారాసుతం

అ.ప. బుధజనైర్వేదితం భూసురైర్మోదితం

మధుర కవితాప్రదం మహనీయ సంపదం!

చ కుంకుమ సమద్యుతిం గురుగుహ ముదాకృతిం

కుజవైరిణం మణిమకుట హార కేయూర కంకణాది ధరణం

కమనీయ తర మిథున కన్యాధిపం పుస్తక కరం నపుంసకం

కింకర జన మహితం కిల్బిషాది రహితం

శంకర భక్తహితం సదానంద సహితం!

చంద్ర- తార సుతుడని, మధురమగు కవిత ఇతని కృప వలన కలుగునని, కుంకుమ వర్ణము కలవాడని, మిథున కన్యా రాశుల అధిపతి, శంకరభక్త హితుడని భూసురులకు మోదక కారకుడని, పైన చెప్పడము చూచినాము. బుధుడు మగధ దేశాధిపతి.

'పిండిప్రోలు' వారు, తమ 'లంకా విజయము' నందు బుధుని ఇట్లు స్తుతించినారు.

చ. " ఘనమార్గంబున సంచరించుచు సదా కావ్య ప్రియైకాత్ముడై

యనయంబున్ బలభద్రుడంచును బుధుండంచున్ సమస్తావనీ

జనముల్ వర్ణన సేయ పొల్చి యుచితజ్ఞత్వంబునుం గల్గియుం

దనరంగా జానూ రౌహిణేయున్ మదాత్మన్ నిల్పి వర్ణించెదన్" [1]

---

పాదసూచికలు: [1] లంకా /పీఠిక/11

*__గురువు__* : సూర్యుని పిదప ఘనమైన గ్రహము 'గురువు' గురు / బృహస్పతి వారము ఇతని పేరు మీదుగా చెప్పబడినది. దేవతలకు, ఋషులకు - గురువు, పురోహితుడు బృహస్పతి. బుద్ధికి బృహస్పతి యనడం లోక విదితమైనది.

దేవానాం చ ఋషీణాం చ గురుం, కాంచన సన్నిభం

బుద్ధిమంతం త్రిలోకేశం తం నమామి బృహస్పతిం - అని వ్యాసుని స్తుతి

పుత్ర కారకుడు, సురాచార్యుడు. ధను, మీన రాశులకు అధిపతి. మహేంద్రాదు లచే వందనములందువాడు. సింధుద్వీపదేశాధిపతి గురుడు.

"గుర్వరిష్టేతు సంప్రాప్తే గురుపూజాం చ కారయేత్

గురుధ్యానం ప్రవక్ష్యామి పుత్ర పీడోపశాంతయే'

పుత్ర పీడ తొలగుటకు ఇది అవసరమైన ప్రార్థన – అని పెద్దల సూచన.

'గురుని' పరమైన స్తుతిని దీక్షితులవారు, 'అఠాణ' రాగము, 'తిశ్ర త్రిపుట ' తాళము నకు సమకూర్చినారు.

ప. బృహస్పతే తారాపతే బ్రహ్మ జాతే నమోస్తుతే !

అ. మహాబల విభో గీష్పతే మంజు ధనుర్మీనాధిపతే!

మహేన్ద్రాద్యుపాసితాకృతే మాధవాది వినుత ధీమతే!

చ సురాచార్య వర్య వజ్రధర శుభలక్షణ జగత్రయ గురో

జరాది వర్జితాక్రోధ కచ జనకాశ్రిత జన కల్పతరో

పురారి గురుగుహ సమ్మోదిత పుత్రకారక దీన బంధో

పరాది చత్వారి వాక్స్వరూప ప్రకాశక దయా సింధో!

నిరామయాయ నీతి కర్త్రే నిరంకుశాయ విశ్వ భర్త్రే

నిరంజనాయ భువన భోక్త్రే నిరంశాయ మఖ ప్రదాత్రే!

వివాహాది శుభ కార్యములను చేయుటకు గురువుయొక్క అనుగ్రహము బలము కావలయునని పెద్దల మాట! సూర్యునికి ఉత్తర దిశలో గురు స్థానము. సింధు దేశ అధిపతి, కనకచ్ఛత్ర, ధ్వజ, రథ, పతాకాదులతో శోభిల్లువాడు – గురువు.

దేవ గురువునకు గల మరికొన్ని నామములు > బృహస్పతి, సురాచార్యుడు, గీష్పతి, ధిషణుడు, గురువు, జీవుడు,ఆంగిరసుడు, చిత్రశిఖండిజుడు, వాచస్పతి.

గ్రహములలో పెద్ద, దేవతలకు గురువైవాడు, బుద్ధికి బృహస్పతియని పేర్కొనబడువాడు గురువు. తారాధినాథుడు.

ఆ గురువరుని , లంకావిజయములో పిండిప్రోలు లక్ష్మణకవి గారు స్తుతించిన తీరు నొక సారి తిలకిద్దాము.

మ. "అరయన్వర్ణనసేతు తారక పదవ్యశ్రాంత వర్తిస్ గురుస్

స్ఫుర దుత్తుంగబలాతిరేక కలుషీ భూతారిజీవుస్ ఘనాం

గిర సాఖ్యాతు బుధౌఘ పూజిత పదుస్ క్షేమంకరాంచత్తపో

భర సంతోషిత సర్వ మౌని ధిషణుస్ వాచస్పతి న్నార్యునిస్" [1]

శుక్రుడు : ఈ గ్రహమునకు సంబంధించినంతవరకు విశేషములను ఇట్లు చెప్పవచ్చును. సూర్య గ్రహమునకు తూర్పు దిశ ఇతని స్థానము. తుల వృషభ రాశులకు అధిపతి - శుక్రుడు. అసురుల గురువు. బృహస్పతి కుమారుడైన కచునికి మృత సంజీవని బోధించినవాడని, మహాభారతములో కలదు.

పత్ని ఒకనికి లభించవలెనంటే శుక్ర గ్రహము కరుణ కావాలట! సౌందర్యమునకు ప్రతీక. పత్నిసంబంధ పీడ యున్న సందర్భములో ఉపశాంతి కొరకై ఇతనిని సేవించ వలయునని పెద్దల సూచన. ఇతడు కాంభోజదేశాధిపతి.

శుక్రునికి గల వేరే పేర్లు > భార్గవుడు, దైత్యగురుడు, కావ్యుడు, ఉశనుడు, కవి.

శుక్ర /భృగు వారము ఈ గ్రహము పేరు మీద చెప్ప బడినది.

'హిమకుంద మృణా లాభం దైత్యానాం పరమం గురుం

సర్వ శాస్త్ర ప్రవక్తారం భార్గవం ప్రణమామ్యహం' – అని వ్యాసుల వారి నుతి.

----------------------------------------

పాదసూచికలు: [1] లంకా/పీ/12

'శుక్రారిష్టేతు సంప్రాప్తే శుక్రపూజాం చ కారయేత్

శుక్ర ధ్యానం ప్రవక్ష్యామి పత్ని పీడోప శాంతయే' అన్నారు పెద్దలు. 'శుక్రుని' పరమైన స్తుతిని దీక్షితులవారు, 'ఫరస్' రాగము, 'ఖండ అట' తాళము నకు సమకూర్చినారు.

ప. శ్రీ శుక్ర భగవంతం చింతయామి సతతం తత్వజ్ఞం

అ. హే శుక్ర భగవాన్ మాం ఆశు పాలయ వృషభ తులాధీశ

దైత్య హితోపదేశ కేశవ కటాక్షైక నేత్రం కిరీట ధరం ధవళగాత్రం

చ. వింశతి వత్సరోడు దశావిర్భాగ మష్టవర్గం కవిం కళత్రకారకం

రవి నిర్జర గురు వైరిణం నవాంశ హోరాద్రేకాణాది వర్గోత్తమావసర

సమయే వక్రోచ్చ నీచ స్వక్షేత్ర వర కేంద్ర మూల త్రికోణే త్రింశాంశ

షష్టయాం శైరావతాంశ పారిజాతాంశ గోపురాంశ

రాజయోగ కారకం రాజ్యప్రదం గురుగుహ ముదం !

పై స్తుతిని అనుసరించి పరిశీలన జేసినచో శుక్ర గ్రహము అనుకూలముగా నున్నచో, కలుగు లాభాలలో పత్నీ లాభము, రాజ్యలాభము మరియు ఇతర లాభాలు .. ఐరావతాంశ, పారిజాతాంశ, గోపురాంశ మున్నగునవి కలుగును. శుక్రుడు దైత్య గురువు. సంజీవని విద్యరహస్యము తెలిసినవాడు. ఒక బంధుత్వ రీత్యా లక్ష్మికి సోదరుడు. బ్రహ్మ మానస పుత్రులలో ఒకడైన భృగువుయొక్క వంశమునకు చెందినవాడు భార్గవుడు.యుగ ధర్మములలోని కొన్ని మర్మముల వలన భార్గవి పేరు పొందినది పాలకడలి పట్టి.

తన 'లంకా విజయము'లో, 'పిండిప్రోలు లక్ష్మణ కవి' చేసిన శుక్ర భగవానుని స్తుతి ఇది.

ఉ. "పుణ్యజన ప్రకాండపరి పూజిత మంజు పద ద్వయాద్భుతా

రుణ్య గుణ ప్రభావముల రూడిగశుక్ర సమాఖ్యయున్ మహ

ద్గణ్యత మిత్రజాత విహితంబును గల్గి చెలంగు చుండు న

ప్పుణ్యుఁగవిన్ ముదంబొదవ పొల్పుగ నెమ్మదిలో నుతించెదన్"[1]

----------------------------------------

పాదసూచికలు: [1] లంకా/పీ/13

<u>*శనైశ్చరుడు*</u> శని గ్రహమును గురించి కొన్ని విషయములను చూద్దాము.

శనైః చరించువాడు అనగా మెల్లగా కదలువాడని మూలార్థము. మంద అనునది మరొక భావము. శని వారము / మంద వారము అని ఇతని పేరు మీదుగా కలవు. శని చుట్టూ చాలా ఛాయా గ్రహములు కలవు. శనికి గల ఇతర నామములు >మందుడు, పంగుడు, కాళుడు, ఛాయాసుతుడు, అసితుడు, అర్కజుడు, సౌరి. వీటన్నిటికి ప్రత్యేకమైన అర్థములు గలవని గ్రహించగలము. వ్యాస భగవానుడు ఈ శనిని స్తుతిస్తూ ఇట్లు చెప్పినారు.

"నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం
ఛాయా మార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరం"

మానవ జీవితముపై శని ప్రభావము చాలా ఉండుననుట కలదు.

'శన్యరిష్టేతు సంప్రాప్తే శని పూజాం చ కారయేత్
శని ధ్యానం ప్రవక్ష్యామి ప్రాణ పీడోపశాంతయే' అని పెద్దల మాట.

రవి సుతుడైన, 'శని' పరమైన స్తుతిని దీక్షితులవారు, 'యదుకుల కాంభోజి ' రాగము, ' ఆది ' తాళము నకు సమకూర్చినారు.

ప. దివాకర తనుజం శనైశ్చరం !
ధీరతరం సంతతం చింతయేహం !

అ. భవాంబునిధౌ నిమగ్న జనానాం భయంకర మతిక్రూర ఫలదం
భవానీశ కటాక్ష పాత్ర భూత భక్తిమతాం అతిశయ శుభ ఫలదం !

చ. కాళాంజన కాంతి యుక్త దేహం కాల సహోదరం కాక వాహం
నీలాంశుక పుష్పమాలావృతం నీలరత్న భూషణాలంకృతం
మాలినీ వినుత గురుగుహ ముదితం మకర కుంభ రాశి నాథం
తిలతైల మిశ్రితాన్న దీపప్రియం దయా సుధా సాగరం నిర్భయం
కాల దండ పరిపీడిత జానుం కామితార్థ ఫలద కామధేనుం
కాలచక్ర భేద చిత్రభానుం కల్పిత చాయాదేవి సూనం !

నీల వర్ణుడు, నీలగంధ ప్రియుడు, నీలమాల్యాంబర ధరుడు, నీలఛత్రధ్వజ రథ పతాకాది శోభితుడు, సూర్య గ్రహమునకు పడమటి దిశలో నుండువాడు. కాశ్యపస గోత్రోధ్భవుడు. సౌరాష్ట్ర దేశ అధిపతి. మకర కుంభ రాశుల అధిపతి.

సూర్య సుతుడగు 'శని గ్రహమునకు' , 'పిండిప్రోలు' వారు, తమ 'లంకా విజయము'లో, చేసిన స్తుతిని కొంత చూచెదము.

కం.' తనరగ నంజలి సేసెద మనమున హర్షంబు తోడ మార్తాండ తనూ

జనికిన్ సద్గుణ ఖనికిన్ శనికిం పరిపంథి గోత్ర సంఘాశనికిన్' [1]

*రాహుగ్రహము* నవగ్రహములలో చాయాగ్రహములని పిలువబడు రెండు గ్రహములలో ఒకటి రాహువు. రాహుగ్రహము సూర్యునికి నైరుతి దిశలో గలదు. రాహువు బర్బర దేశాధిపతి. ఇతనికి ప్రత్యేకమైన వారము లేదు. రాహువును, వ్యాసమహర్షి ఇట్లు స్తుతించినాడు.

"అర్ధ కాయం మహావీరం చంద్రాదిత్య విమర్దనం

సింహికాగర్భ సంభూతం తం రాహుం ప్రణమామ్యహం'

రాహువు సేవ వలన నేత్రపీడ తొలగుననుట కలదు.

పెద్దలమాట ఇట్లున్నది.

"రాహ్వోరిష్టేతు సంప్రాప్తే రాహుపూజాం చ కారయేత్

రాహుధ్యానం ప్రవక్ష్యామి చక్షుః పీడోపశాంతయే' –

అమృతమును సంపాదించిన పిదప, విష్ణువు మోహిని రూపాన వచ్చి, దేవతలకు అమృతమును పంచినాడని, మోసము జరిగే అవకాశమున్నదని భావించిన రాక్షసులలో రాహు, కేతువులనువారు మారువేషములో అమృతమును స్వీకరించు ప్రయత్నము చేసినపుడు, ఆ విషయమును సూర్య చంద్రులు హరికి తెలియ జేసినారని, చక్రాయుధుడైన విష్ణువు ఆ రాక్షసులను సంహరింప బోవు లోపల వారు అమృతపాన సేవన వలన మరణము పొందలేదు. వికృత శరీరులైనారు.

---

పాదసూచికలు: [1] లంకా/పీ/14

ఆనాటి నుండి సూర్య చంద్రులను రాహు కేతువులు పీడించుచున్నారని కథ కలదు. కథ ప్రక్కన పెట్టి పరికిస్తే, రాహు కేతువుల ప్రభావము కలదని, దానికి ప్రత్యేక శాంతులు జరిపించుకొనుట ముఖ్యముగా కుంబకోణము పట్టణ పరిసరములలోగల కొన్ని క్షేత్రములు [తిరునాగేశ్వరము], చిత్తూరు జిల్లా లోని శ్రీకాళహస్తి క్షేత్రములో జరుపబడు రాహు పూజలను సేవించు వారిని గురించి వార్తాపత్రికలలో వార్తలుగా రావడము తెలిసినవిషయమే!

రాహువునకు > తముడు స్వర్భానువు సైంహికేయుడు విధుంతుదుడు అని కూడా నామాంతరములుగలవు. రాహు గ్రహము శనికి వలెనే నీల వర్ణప్రియుడు. నీల - పుష్ప వస్త్ర మాల చ్ఛత్ర ధారి. ఈ గ్రహ శాంతికి స్కందుని పూజిస్తారు.

'రాహుగ్రహ ' పరమైన స్తుతిని దీక్షితులవారు, 'రమామనోహరి ' రాగము, 'రూపక ' తాళము నకు సమకూర్చినారు.

ప. స్మరామ్యహం సదా రాహుం

సూర్య చంద్ర వీక్ష్యం వికృత దేహం !

అ. సురాసురం రోగాహరం సర్పాది భీతి హరం

శూర్పాసన సుఖకరం శూలాయుధ ధరకర్మం

చ. కరాళ వదనం కఠినం కయానార్ణ కరుణార్ద్రాపాంగం

చతుర్భుజం ఖడ్గ ఖేటాది ధరణం చర్మాది నీల వస్త్రం

గోమేధికాభరణం శని శుక్ర మిత్ర గురుగుహ సంతోషకరం!

'లంకావిజయము'లో కవి, 'పిండిప్రోలు' వారుకావించిన 'రాహు' స్తుతి చూడండి.

కం. 'తమునిం గాఢ ద్యుతిజిత

తమునిన్వినివార్య శౌర్యధైర్యాది గుణో

త్తమునిన్ భాసుర మంగళ

తముని న్నుతి సేతు సతతమునింపమరన్' [1]

---

పాదసూచికలు: [1] లంకావి/పీ/15

*కేతు గ్రహము*. నవగ్రహాలలో కడపటిది. ప్రత్యేకమైన వారము కేతుగ్రహానికి లేదు. సూర్యునికి వాయవ్య దిశలో దక్షిణాభిముఖుడై యుండును. జ్ఞాన సంబంధ సమస్యలకు ఇతని సేవ అవసరమని పెద్దలమాట.

" కేత్వరిష్టేతు సంప్రాప్తే కేతుపూజాం చ కారయేత్

కేతుధ్యానం ప్రవక్ష్యామి జ్ఞానపీడో పశాంతయే"

సభక్తి పూర్వకముగా వ్యాసమహర్షి కేతు గ్రహమును ఇట్లు స్తుతించినారు.

' పలాశ పుష్ప సంకాశం తారకాగ్రహ మస్తకం

రౌద్రం రౌద్రాత్మకం ఘోరం తం కేతుం ప్రణమామ్యహం'

ఇతడు అంతర్వేది దేశాధిపతి. చిత్ర వర్ణములనిన ఇతనికి ప్రీతి యని చెప్పడము కలదు. చిత్ర > గంధ పుష్ప వస్త్ర మాల్యాదులు మరియు చిత్రచ్ఛత్ర ధ్వజ రథ పతాకములు గలవాడు. కేతుగ్రహము ప్రభావము చూపుచున్నపుడు కొంత వరకు పుణ్యక్షేత్రాలు దర్శనముంటుందను వ్యాఖ్య గలదు. రాహుగ్రహ పరమైన విషయములో చెప్పినటుల అమృతము వితరణ చేయు సందర్భములోనే కేతు గ్రహమునకు చక్రమువల్ల కలిగిన వికార స్వరూపము కలవాడు కేతువు. ఇతనికి కల మరొక పేరు శిఖీ. మరికొందరి ప్రకారము- అవల, ధూమ, మృత్యుపుత్ర అనునవి కూడ ఇతరనామములు.

ధూమ్రోద్విబాహుర్వరదో గదాభృద్గృ ద్రాసనస్థో వికృతానన, అని ఇతనికి చెప్పబడిన కొన్ని విశేషములు.

"చిత్రగుప్తం మహాప్రాజ్ఞం వేత్ర దారిణ మవ్యయం

రక్త వర్ణాంబరధరం సర్వ పాపహరం విభుం" అనికూడా ఇతని గూర్చి చెప్పడమున్నది. మోక్ష కారకుడని ఇతనికికల మరొక విషయము.

'కేతు గ్రహ ' పరమైన స్తుతిని దీక్షితులవారు, 'చామరం ' రాగము, 'రూపక ' తాళము నకు సమకూర్చినారు.

ప. మహాసురం కేతుమహం

భజామి ఛాయాగ్రహ వరం!

అ.    మహావిచిత్ర మకుటధరం మంగళ వస్త్రాది ధరం

నరపీఠ  స్థితం సుఖం నవగ్రహ యుతం సఖం

చ.    కేతుం కృణ్వన్ మంత్రిణం క్రోధ నిధి జైమినం కుళుత్థాది భక్షణం

కోణ ధ్వజ పతాకినం  గురుగుహ చామర భరణం  గుణదోష

జితాచరణం గ్రహణాదికార్య కారణం  గ్రహాపసవ్య సంచారిణం!!

'లంకావిజయము'లో, 'పిండిప్రోలు లక్ష్మణ కవి' 'కేతు' గ్రహమునకు మనస్సులోనే సన్నుతి సమర్పించినాడు. ఆ స్తుతి కొంత  చూచెదము.

కం.   'చేతో వీథిన్ సన్నుతి సేతు న్విక్రమ సమేతు శ్రీకర గుణ సం

ఘాతున్ భవ్యామేయనికేతున్ రిపు విపిన ధూమ కేతుంజేతున్' [1]

7.11  *__అష్ట దిక్పాలకుల స్తుతులు__*. పూర్వీకులు  తామున్న ప్రదేశమునుండి  చుట్టు  ప్రక్కల గల దిక్కులను పలు పేర్లతో గుర్తించినారు. దేశ కాల సంకీర్తన యని దీనికి పేరు పెట్టడముజరిగినది. మనము ఎక్కడ ఉన్నాము? దానిని గుర్తించుట ఎట్లు? విశాలమైన విశ్వములో మన ఉనికి వీటికి సంబంధించిన విషయ వివేచన కొంత వరకు చేయుటమే అష్ట దిక్కుల గుర్తింపు.  సూర్యుడు ఉదయించు దిక్కును 'తూర్పు' అని, అస్తమించు దిక్కును 'పశ్చిమ' [పడమర] అని, తూర్పునకు ఎదురుగ నిలిచి నపుడు మనకు వామ [ఎడమ] భాగము దిక్కును 'ఉత్తరము' అని, దానికి ఎదురుగ కల దిక్కును, [పైన చెప్పిన రీతిలో తూర్పునకు మనము ముఖము పెట్టి నిలిలిచినపుడు, మనకు కుడి[దక్షిణ] వైపును 'దక్షిణ' దిశ అని నిర్ణయము చేయడము జరిగినది.

| | | |
|---|---|---|
| 1 [ఈ] | 2 [తూ] | 3 [ఆ] |
| 4[ఉత్త] | (*) [కేంద్రం] | 5 [దక్షిణం] |
| 6 [వాయ] | 7 [పడమర] | 8 [నిరృతి] |

---------------------------------------

పాదసూచికలు:  [1] లం కా/పీ/16

1 = ఈశాన్యము, 2 = తూర్పు, 3 = ఆగ్నేయము, 4 = ఉత్తరము

{*} నిల్చున్న వ్యక్తి /ప్రాంతము 5 = దక్షిణము. 6 = వాయువ్యము

7 = పడమర, 8 = నైరుతి అని గుర్తుంచుకొన వచ్చును. ఈ దిశలకు పాలకులుగా ఈశానుడు, ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్రృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, చెప్పడము కలదు. వీరి స్తుతి ప్రత్యేకముగా కలదు.

పూజలు చేయు సందర్భములో చెప్పబడు విశేషమే దేశ కాల సంకీర్తన. ఇందులో మనము ఎక్కడ ఉన్నామో చెప్పడము, ఎవరమో చెప్పడము అనునదే సంకల్ప సంకీర్తన. ఇది మహా సంకల్పము, సంకల్పము, లఘు సంకల్పము అని మూడు విధములుగా చెప్పడము కలదు.....

'మేరోః దక్షిణ దిగ్భాగే, శ్రీశైలస్య ఆగ్నేయ/ వాయవ్య ప్రదేశే, కృష్ణా గోదావర్యోర్మధ్య ప్రదేశే/ కృష్ణా కావేర్యోర్మధ్య దేశే...అస్మిన్ గృహే...వ్యావహారిక..నామ సంవత్సరే..." ఇత్యాదిగా పేర్కొనుటయే దేశము /ప్రాంతము, కాలమునకు సంబంధించిన ప్రస్తావన / సంకీర్తన.

సంకల్పము రెండు విధములుగా యుండును.

కామముతో [ ఫలము నాశించి ] చేయుట ఒకటి. నిష్కామముతో [ఫలితమును కోరుకొనక] ఒక పని నిర్వహించుట తన ధర్మముగ భావించి చేయుట మరొకటి.

ఈ దిక్పాలకుల దిశలు, వారి వాహనములు ప్రత్యేకముగా దిగువ నివ్వబడినవి.

ఇంద్రుడు – ప్రాగ్భాగాధిపతి. ఐరావతవాహనముగ కలవాడు.

అగ్ని - ఆగ్నేయ దిశాధిపతి. మేషము వాహనముగ కలవాడు.

యముడు – దక్షిణ దిశాధిపతి. మహిషము వాహనముగ కలవాడు.

నిర్రృతి - నైర్రృతి దిశాధిపతి. నరుడు వాహనముగ కలవాడు.

వరుణుడు – పశ్చిమ దిగ్భాగాధిపతి. మకరము వాహనముగ కలవాడు.

వాయువు – వాయవ్య దిగ్భాగాధిపతి. ఏణి [నల్లలేడి ] వాహనముగ కలవాడు.

కుబేరుడు – ఉత్తర దిగ్భాగాధిపతి. అశ్వము వాహనముగ కలవాడు.

ఈశానుడు – ఈశాన్య దిగ్భాగాధిపతి. వృషభము వాహనముగ కలవాడు.

తన చంధ శ్శాస్త్ర గ్రంథములో అప్ప కవి గారు తమ ప్రతిభనంతా ఉపయోగించి ఒక చిన్న కందములో బహు సుందరముగా 'అష్ట దిక్పాలకులను, వారి వాహనములను' చెప్పడమున్నది. ఆ హృద్యమైన పద్యాన్ని చూద్దాము.

కం. " హరి శిఖి యము దైత్యాంబుప

మరుద్ధనప శివు లిభాజమహిష నరాంభ

శ్చర హరిణ పుష్పక వృష

ప్రరుచిర వాహనులు మమ్ము రక్షింతు రొగిన్" [1]

పైన దిక్పాలురు వారి వాహన వివరాలు కలవు. అదే అప్పకవి చెప్పినాడు. వీరిని కొందరు స్తుతించిన తీరు ఇక్కడ చూద్దాము.

*ఇంద్రుడు*

సీ. ఐరావతో చ్చైశ్శ్రవోధిరూఢుడు నీలదివ్య దేహుడు పూర్వదిగ్విభుండు

శతమహాధ్వరకర్త శతకోటి హస్తుండు బహుమహా పర్వత పక్షహర్త

సౌందర్య లక్షణానంది శచీప్రియుండనుపమ నందన విహారి

శతపత్రనిభ దశశత దీర్ఘనేత్రుండు, వారివాహ సమూహ వాహనుండు

గీ. యుక్తసన్మంత్ర మఘు ఫలభోక్త నిత్యమభినవ సుధారసైక పానాభిరతుడు

విక్రమక్రమ దేవతాచక్రవర్తి శ్రీలు మీఱంగ మిమ్ము రక్షించుగాత! [2]

{ పైన ఇంద్రునికి గల లక్షణాలు, విశేషాలు ప్రస్తావించడము చూడగలము}

ఇంద్రునికి గల ప్రత్యేక లక్షణముల వివరములతో ఇట్లున్నవి.

పరమ ఐశ్వర్యము గలవాడు ఇంద్రుడు. ఇంద్రునికి గల పలు నామములను అమరకోశములో ఇట్లు ప్రస్తావితమైనవి.

---

పాదసూచికలు: [1] అప్పకవీ/పీ/24 [2]పేటూ 18

" ఇంద్రో మరుత్వాన్మఘవా బిడౌజాః పాకశాసనః వృద్ధశ్రవాః శు(సు)నాశీరః పురుహూతః పురందరః జిష్ణుర్లేఖర్షభశ్శక్ర శ్శతమన్యు ర్దివస్పతిః సుత్రామా గోత్రభిద్వజ్రీ వాసవో వృత్రహా వృషా వాస్తోష్పతి స్సురపతి ర్బలారాతి శ్శచీపతిః జంభ భేదీ హరిహయ స్స్వారాణ్ణ ముచిసూదనః సంక్రన్దనో దుశ్చ్యవనస్తురాషాణ్మే ఘవాహనః ( ప్రాచీనబర్హి రహిహాప్పృత నాశాత్పులోమజిత్) అఖండలః సహస్రాక్ష ఋభుక్షాః" గుణములను బట్టి పైన చెప్పిన పేర్లు కలవు అని గ్రహింప గలము.

<u>అగ్ని</u>

పృథివి, అప్, తేజో, వాయు, ఆకాశ- ములనునవి పంచభూతములు. వాటిలో మూడవవాడు అగ్ని. హవ్య వాహనుడు. యాగాదులందు అర్పితములైన హవిస్సులను దేవతలకు తీసుకొని వెళ్ళువాడు కనుక, ఇతనికి హవ్యవాహనుడు అని పేరు కలదు. 'అగ్నిర్ధనం' అని చెప్పడము కలదు. అగ్నికి పలు నామములున్నవి. అమరకోశములో, " అగ్నిర్వైశ్వానరో వహ్నిర్వీతిహోత్రో ధనంజయః కృపీటయోనిర్జ్వలనో జాతవేదాస్తనూనపాత్ , బర్హిశ్శుష్మాకృష్ణ వర్త్మా శోచిష్కేశ ఉషర్బుధః ఆశ్రయాశో బృహద్భానుః కృశానుః పావకో(అ)నలః లోహితాశ్వో వాయుసఖ శ్శిఖావా నాశుశుక్షణిః హిరణ్యరేతా హుతభుగ్దహనో హవ్యవాహనః సప్తార్చిర్దమునా శ్శుక్ర శ్చిత్రభానుర్విభావసుః శుచిరప్పిత్తమ్" అని అగ్నికి గల బహు లక్షణములతో కూడిన పేర్లను వివరించుట చూడగలము.

'మనుచరిత్రలో ధర్మమును అక్షరముల పాటించువాడైన ప్రవరుడు తనను పడమటి సముద్రములో సూర్యుడు క్రుంకయమున్న ఇంటికి చేర్చమని తద్వారా తాను తన అగ్నికార్యాది విహిత కార్యక్రమములను చేసికోగలనని, అగ్ని దేవుని అర్థించి మన్నింప బడినాడు' – అను విషయము మనకు తెలిసినదే! అగ్నినిలా స్తుతించిన విషయము చూద్దాము.

సీ. మేషవాహనుడుసుస్మితుడు చతుశ్శృంగధరుడు విస్ఫురితపక్షద్వయుండు
సప్తసంఖ్యార్చిరం చద్బాహు జిహ్వుండు మహనీయ పాదపద్మ త్రయుండు
స్వాహాస్వధాసతీసహిత పార్శ్వద్వయుండరుణ సువర్ణ భాస్వరతనుండు
లోహితమహిత విలోచనుడాజ్యపాత్ర స్రుక్స్రు వాదికోద్యతకరుండు
గీ. అఖిలపితృదేవతార్పితహవ్యకవ్య
ధరుడు సర్వతోముఖుడు నిత్యశుచియనలు
డిహపరానందముల నిచ్చి ఎల్ల వేళ
నంచితోన్నతి మిమ్ము రక్షింతు గాత ! [1]

[అగ్ని లక్షణములు అతని వైదిక సంబంధ ధర్మములు పైన చెప్పబడినవి]

***యముడు***

మహిష వాహనుడు, యమునానది సోదరుడు, సూర్యుని కుమారుడు, సమవర్తి మున్నగు పేర్లు కలవాడు ధర్మరాజు. ఆ యమునికి అర్పించిన స్తుతిని చూద్దాం.

సీ. మహిష వాహనుడు సమ్యగ్ధర్మపాలుండు దారుణతర దీర్ఘ దండపాణి
దివ్యకాళిందీనదీ సోదరుడు నీలవర్ణుండు కమలినీ వరసుతుండు
గతజన్మకర్మ సంచితఫలదుడు యుధిష్ఠిర గురుడమృత నిషేచణుండు
గంధవతీ మనః కాసార సంచార సంగతానంద చక్రాంగవిభుడు
గీ. విష్ణురుద్రాది భక్తివర్ధిష్ణు హితుడు దక్షిణేశుండు ధర్మ విచక్షణుండు
శమనుడనురక్త చిత్తుడై యమరమమ్ము నాయురారోగ్య యుక్తుల జేయుగాత! [2]

యమునికి అమరములో గల నామములు > ధర్మరాజు, పితృపతి, సమవర్తి, పరేతరాట్, కృతాంతుడు, యమున సోదరుడు, శమనుడు, యమరాట్, యముడు, కాలుడు, దండధరుడు, దేవుడు, వైవస్వతుడు, అంతకుడు.

---

పాదసూచికలు: [1][2] వేటూరి ప్ర శాస్త్రి పుట 19

<u>నిర్ఋతి</u>

దక్షిణ, పడమర దిక్కుల మధ్య గల మూల /దిశను నైరుతి అందురు.

సీ. నరవాహనుండు బంధుర ఖడ్గ హస్తుండు
వరచర్మ ధరుడుకర్బురశరీరు
డతుల జగద్రక్షణాంచత్కృపానిధి
చటులోగ్రయామినీ సంచరుండు
సన్మార్గరోధి దుష్ట నిశాచర వ్రాత
వారకుండురుబలాధారకుండు
నురుతర కుటిల నీలోన్నత కేశుండు
నికషావధూమణీ నిత్యరతుడు

గీ. మహితబల వైభవోద్దండ మండితుండు
కింకిణీరవ భూషణాలంకృతుండు
మృదులవచనుండు నైర్ఋతి మీకునొసగు
చిరతరారూఢ భోగ విశేషములను. [1]

నిర్ఋతి గుణ గణములను పైన చెప్పడము చూడగలము.

ఈ నిర్ఋతికి పలు నామాంతరములు ‘ అమరకోశము’ నందు ఇట్లు చెప్పబడినవి.

“రాక్షసః కౌణపః క్రవ్యాత్క్రవ్యాదో(అ)స్రపఆశరః
రాత్రించరో రాత్రిచరఃకర్బురో నికషాత్మజః
యాతుధానః పుణ్యజనో నైర్ఋతో యాతు రక్షసీ”

ఈతనికి చిత్ర వర్ణముకలవాడని, రాత్రి యందు సంచరించువాడని, నికష యను రాక్షస స్త్రీ కుమారుడని రక్తమును త్రాగువాడని, మాంసభక్షకుడని,మూలను రక్షించువాడని కుణప(శవము)ను భుజించువాడని .... కొన్ని లక్షణములను చెప్పడము చూడగలము.

----------------------------------

పాదసూచికలు: [1]వేటూరి ప్ర శాస్త్రి/ పుట 20

## *వరుణుడు*

“ప్రచేతా వరుణః పాశీ యాదసాంపతి రప్పతిః – అనునవి వరుణుని పేర్లు.

పడమటి దిక్కునకు అధిపతి వరుణుడు. వరుణుని స్తుతి ఇట్లున్నది.

సీ. మహనీయ సముదోగ్ర మకరవాహనుడు

కచ్ఛపమీన నక్రాది జంతువిభుడు

పద్మినీ మానస పంజరకీరంబు

ఫణగణాంచిత నాగ పాశధరుడు

భీకరాకార గుంభిత కనత్కల్లోల

వారిసంభృత వార్ధి వల్లభుండు

నూతన తృణగ్రాహి రత్న విభూషితుం

డఖిల జగద్వర్ష హర్ష దాత

గీ. దుష్టనిగ్రహకారి యుత్కృష్టమహిమ

డభయ హస్తుడు కరుణారసార్ద్ర హృదయు

డమృత జీవన మొనగూర్చి యన్వయంబు

వరుణ దేవుండు మిమ్ము కాపాడుగాత.[1]

జనావళికి జీవనాధారము జలము. అట్టి నీటిని వర్షము ద్వారా కురిపించి ప్రాణికోటికి అధారమునొసగి హర్షము కలుగ చేయువాడు వరుణుడు – కరుణా సముద్రుడు. పంచభూతములలో రెండవ భూతము ‘నీరు’. వరుణుడు – మకరవాహనుడు. నాగపాశధరుడు. అభయ హస్తముద్ర కలవాడు. సముద్ర అధిపతి.అమృత జీవన మొనగూర్చువాడు.దుష్ట నిగ్రహకారి. కరుణా రసార్ద్ర హృదయుడు. ఇవి వరుణునికి కల కొన్ని లక్షణాలు.

------------------------------------

పాదసూచికలు: [1] వేటూరి ప్ర శాస్త్రి/ పుట 20

*వాయువు*

**సకల చరాచర ప్రాణులకు ప్రాణము వాయువు. పంచ భూతములలో ఇది నాల్గవది. ఇతని వలన ప్రాణులు బ్రతుకుచున్నారు. వాయువునకు పలు నామములు కలవు. అర్థములననుసరించి వివరములతో చూడవచ్చును.**

" **శ్వసనః స్పర్శనో వాయురాత్మా తరిశ్వాసదాగతిః**

**పృషదశ్వో గంధవహో గంధవాహోని లాశుగాః**

**సమీర మారుత మరుజ్జగత్ప్రాణ సమీరణాః**

**నభస్వ ద్వాత పవన పవమాన ప్రభంజనాః**

**( ప్రకంపన శ్చాతిబలో ఝుంఝూవాత స్సవృష్టికః) - అని అమరకోశము**

**వాయువులు పది విధములు. అవి వరుసగా - 1 ప్రాణ/ 2 అపాన/ 3 సమాన 4 ఉదాన/ 5 వ్యాన/ 6 నాగ/ 7 కూర్మ/ 8 కృకర/ 9 దేవదత్త/10 ధనంజయము. వాయువు యొక్క కొన్ని ప్రత్యేకతలు, విశిష్ట లక్షణములు ఇట్లు వర్ణితములు.**

**సీ. సకలభూత వ్రాత సంజీవనఖ్యాత ముఖ్య మహాప్రాణ మూర్తిధరుడు**

**కర్పూర కస్తూరికాచందనాగరు ధూపాదిపరిమళ వ్యాపకుండు**

**ఆత్మానుకూల మహావేగ మృగవాహనారూఢు డఖిల విశ్వాభియాయి**

**వైశ్వానర ప్రభు శాశ్వత సహవాసి భీమాంజనేయుల ప్రియ జనకుడు**

**గీ. పశ్చిమోత్తర మధ్యదిగ్భాగ నిరత**

**పాలనోద్యోగి దేవతా ప్రముఖుడెపుడు**

**వాయుదేవుండు చిరముగానాయువిచ్చి**

**మంచి యారోగ్యమున మమ్ము మంచు గాత! [1]**

---

**పాదసూచికలు: [1]** వేప్రశా/సేకరణ/ పుట 21

*<u>కుబేరుడు</u>* : కుబేరుడు ఈశ్వరునికి మిత్రుడు. ధనాధిపతి. తిరుమలగిరులలో వెలసిన కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వరునికి, ఆకాశరాజు పుత్రి పద్మావతితో, పరిణయ సందర్భమున, పెళ్లి ఖర్చుల కొరకు 'అప్పు' ఇచ్చినవాడు కుబేరుడు.

' మహా పద్మము, పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుంద, కుంద, నీల, వరము' లనబడు నవనిధులితని ఆధీనములు. ఉత్తర దిశకు దిక్పాలకుడు కుబేరుడు.

ఈ కుబేరునికి గల ఇతర నామములు >

కుబేరుడు, శివుని సఖుడు, యక్షరాట్, గుహ్యకేశ్వరుడు, మనుష్యధర్ముడు, ధనదుడు, యక్షుల (జక్కుల) ఱేడు, ధనాదిపుడు, కిన్నరప్రభువు, వైశ్రవణుడు, యక్షుడు, పౌలస్త్యుడు, నరవాహనుడు, ఇలబిల సుతుడు, ఏకపింగుడు, [ఇడబిడ్భ్రాతా] శ్రీదః, పుణ్యజనేశ్వరుడు – అనునవి అమరకోశము ననుసరించి.

చ. ఉనికట వెండికొండ తనయుండటరంభకు యక్షరాజు నా
ధనపు డనన్ ప్రసిద్ధుడట దానవిభుండట పుష్పకంబుపై
చనునట పార్వతీపతికి సంగడి కాడట ఆత్మ సంపదల్
పెనుపుగ నిచ్చి హెచ్చుగ కుబేరుడు మిమ్ము నను గ్రహించుతన్ [1]

ఇతని రాజధాని అలకాపురి.

కాణాదం పెద్దన సోమయాజి ఈ కుబేరుని వద్దగల నవనిధుల విషయాన్ని తనకావ్యమైన ముకుందవిలాసములో రమ్యంగా నాయికయగు భద్రాదేవిని వర్ణిస్తూ ఇలా చెప్పడము చూడగలము.

" పద్మదృశ, నీలకచ,మహాపద్మవదన, శంఖగళ, కుందరదన, కచ్ఛపపదాగ్ర , వరమకరజంఘ, చెందనీ సిరి ముకుంద యట నవస్ఫూర్తి నిధి లాభమంది నటుల" [2]

పైన పేర్కొబడిన నవనిధులను చమత్కారముతో సత్కరించడము కవి ఘనత కదా!

---

పాదసూచికలు: [1] వేప్రశా/సేకరణ/ పుట 21 [2] ముకుంద విలా/కాణాదం/ఆశ్వా1/223

*ఈశానుడు:* తూర్పు ఉత్తర దిశలకు మధ్య గల మూల ఈ శాన్యము. దీనికి అధిపతి ఈశానుడు. ఈశ్వరుడు. వాస్తు శాస్త్రములో దీనిని దేవమూల యని పిలుతురు. హిందువులు నిర్మించుకోను గృహములలో పూజా గదిని ఈ దిక్కులో ఏర్పాటు చేయుట పరిపాటి. ఈశాన్య దిశవైపు నీటి వసతి ఏర్పాటు చేయుదురు.

ఈశ్వరుని గురించి అధికమైన వివరాలు వేరొక చోట చర్చించుట జరిగినది.

సీ. హిమశైల శిఖరోన్నత మహా వృషభవాహనాధిరోహణుడు విశ్వాధినేత
నిరతార్ధగాత్ర సన్నిహిత పర్వత రాజపుత్రీ ద్వితీయానుభూతి రతుడు
కైలాసపర్వతాగ్రనివాస పరితోషి వరవీరగణ వారపరివృతుండు
సర్వభూత వ్రాత సర్వ విద్యాజాత నిర్ణేత మహిత దృక్కర్ణ భూషు
గీ. దిష్ట సఖుడు కుబేరుని కిందు ధరుడు గగన కేశుడతి స్వచ్ఛ కాంతి తనుడు
ఈశ్వరుండు మహానటుండెల్ల వేళ సర్వ సౌఖ్యంబు లిడి మమ్ము సాకు గాక ! [1]

స్పష్టి స్థితి లయ కారకులని చెప్పబడు వారిలో లయకారకుడు ఈశ్వరుడు. అష్ట మూర్తి అని కూడ ఇతడు పిలువబడును. పార్వతీపతికర్పిత స్తుతి చూడుడు.

" ఆపాతాళనభః స్థలాంత భువన బ్రహ్మాండ మావిస్ఫురత్
జ్యోతిః స్ఫాటికలింగమౌళి విలసత్పూర్ణేందు వాన్తామృతైః
అస్తోకాప్లుత మేకమీశ మనిశం రుద్రానువాకాన్ జపన్
ధ్యాయే దీప్సిత సిద్ధయే ధ్రువ పదంవిప్రో(అ)భిషించే చ్ఛివమ్" - అని రుద్రనమకమునకు ముందు చేయు ప్రార్థన. ఆపాతాళ ము నుండి ఆకాశ పర్యంతం విస్తరించిన పరమేశుని ఆద్యంతములనుతెలియ వలయునని భూమిలోనికి వరాహ రూపములో హరి, హంస రూపాన విధాత గగనములోనికి వెళ్ళి ఆదిని అంతమును కనుగొనలేక పోయినారని చెప్పడము తెలిసినదే! ఈ పరమేశ్వరుడు > బ్రహ్మాండ వ్యాప్త మైన దేహుడని, భుజంగ భూషణుడని, భసితపూతతో అలరారువాడని, త్రినేత్రుడని, కాలకంఠుడని, కపర్దియని, రుద్రాక్ష ధారియని, రుద్రప్రకటిత వైభవము గలవాడని చెప్పబడినాడు.

---

పాదసూచికలు: [1] వేప్రశా/సేకరణ/ 22

7.12 *మన్మథుని స్తుతి* :- మదనుడు, మనసిజుడు, రతీపతి మున్నగు నామములతో అలరారువాడు సుకుమారమైన సాధనములతో బహుకష్టమగు కార్యములు సాధించువాడు. మనస్సునాడు జన్మించువాడు, శివుని కంటిమంటకు కాలి బూదియై అంబ దయ వలన, తన పత్ని రతికిమాత్రమే నేత్రగోచరుడగువాడితడు.

" మదనో మన్మథో మారః ప్రద్యుమ్నో మీనకేతనః

కందర్పోదర్పకో(అ)నంగః కామః పంచశరః స్మరః

శంబరారిర్మనసిజః కుసుమేషు రనన్యజః పుష్పధన్వా

రతిపతి ర్మకరధ్వజః ఆత్మభూః (శృంగారయోనిః శ్రీపుత్రః

శూర్పకారాతి రిత్యపి బ్రహ్మసూ ర్విశ్వ కేతుః స్యాత్) అని సుకుమారుడైన మారునికి గల ఇతర పేర్లు.

కావ్య అవతారికలలో మదన స్తుతి కన్నా అష్టాదశ వర్ణనలలో చంద్రునితో పాటు ఇతనిని పొగడడము కొన్నిసార్లు తెగడడము చూడవచ్చును.

తాళ్ళపాక అన్నమయ్య వేంకటపతికి ఒక సంకీర్తనలో "షోడశ కళానిధికి షోడశోపచారములు జాడతోడ నిచ్చలు సమర్పయామి" అంటారు. షోడశోపచారములు అనగా పదహారు సేవలు. భగవానుని పూజ చేయు సందర్భములో వీటిని ప్రస్తావించుట కలదు. అవి ఏవనగా... సాధారణముగా

ఆవాహనము, ఆసనము, పాద్యము, అర్ఘ్యము, ఆచమనము, స్నానం, వస్త్రము, యజ్ఞోపవీతం, గంధం, పుష్పము, ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలం, నమస్కారము, ఉద్వాసనము అనునవి.

ఇవి కాక మరికొన్ని సందర్భమును అనుసరించి చేయుట కలదు.

బృందావన విహారమను ప్రబంధములో కవి గంగాధరుడు నాయిక చెలుల ద్వారా మదనునికి 'షోడశోపచారపూజ' చేయించినారు. ఒకసారి ఆ పూజ చూద్దాము.

'ఆ వెడవింటి వాని పుష్పరసఫల మధుర వాక్పుష్ప సమితి పూజ సేయంగ దొడగిరా పువ్వు బోండ్లు'

కం. ధ్యానము మానస భవునకు

మానుగ నావాహనము రమా సూనునకున్

మీనాంకునకర్ఘ్యము, ఖగ

యానికి పాద్యంబు, మరునకగు పీఠంబున్ [1]

కం. సుమచాపునకభిషేకము

విమలాంబరమంగజునకు విష్ణుజునకు గం

ధము మదనునకక్షత లును

సుమములు లోకత్రయైక సుందరునకొగిన్ [2]

చ. 'మరునకు ధూపమాశుగ విమానికి దీపము సన్నివేదనం

బురు సుమధన్వికిన్ పరిమళోదక పానము భృంగ మౌర్వికిన్

విరివి నివాళి నిస్సదృశ విక్రమశాలికి నిర్జితారికిన్

తరుణ సుమాంజలుల్ తగు ప్రదక్షిణముల్ ప్రణతుల్ నమస్కృతుల్[3]

కవి తన చాతుర్యముతో పద్యములలో ఈ ఉపచారములు చేయడము విశేషమనక తప్పదు.

మదనుడు లోకోపకారి. బ్రహ్మకు తమ్ముడు. ఎవ్వరినీ వదలిపెట్టడు. మాధవుని మానసిక పుత్రుడు. తుదకు విష్ణువును కూడ, వదలక అల్లరి పెట్టినవాడు.

తెలుగు భాగవతములో పోతన గారు ఇట్లు చిత్రించినారు.

ఆట. "మోహరుచుల వలన ముద్దియ తలయెత్తు, సిగ్గువలన బాల శిరము వంచు

నింతి వెఱగు వలన నెత్తదు వంపదు తనదుముఖము ప్రాణ దయితు జూచి' [4]

కం. ' హరిసూచిన సిరి సూడదు సిరి సూచిన హరియు చూడ సిగ్గును పొందున్

హరియును సిరియును తమలో సరిచూపుల చూడ 'మరుడు' సందడి వెట్టెన్'[5]

---

పాదసూచికలు: [1,2,3] బృందావన విహార/ వనం గంగాధరకవి/ ఆశ్వా 2/45, 46 & 47

[4, 5] పోతన/8/284.285

'కుమారసంభవము'లో 'నన్నెచోడుడు'- దేవతలచే ప్రేరేపింపబడి, ముక్కంటి కంటి మంటలకు ఆహుతై, అనంగుడైన వాడు మదనుడు, కనుక తొలుత చేసిన స్తుతులలో మనసిజుని కూడ , తన కృతి చదువు పాఠ కులు వశ్యమతులు కావడానికి సహాయకారియను భావముతో, స్తుతించినాడు.

కం. "హరుడాదిగ సకలచరా
చరమయ జీవాళి నెల్ల సతతము కామా
తురులుగ వశగతిజేసిన
మరుడీవుతమఖిల వశ్యమతి మత్కృతికిన్" [1]

తన 'దశకుమారచరిత్ర'లో 'కేతన' మనోభవుని, తనకృతిభర్తను తగినట్టి ప్రచుర సౌభాగ్యాన్వితునిగ, చేయుమని ఆశించుచున్నాడు.

మ. " తనదుర్వార తర ప్రతాపమున చిత్త స్న్నహముల్ గట్టి సే
యు నితండెట్టి విదగ్ధుడో తలపనో హోయంచు లోకంబు గో
సన పుచ్ఛం గరమొప్ప దర్పకుడు రాజత్సుందరాకారు శో
భన సంపన్ను కృతీశ్వరుం ప్రాచుర సౌభాగ్యాన్వితుం జేయుతన్"[2]

7.13 ***హరి భక్తుల స్తుతి*** : - హరిని దేవునిగా భావించువారలు హరి భక్తులు. అక్కడక్కడ హరిభక్తులకు కూడా గౌరవము జూపి స్తుతులను చేయుట చూడగలము. తాళ్ళపాక చిన్నన్న తన తాత యగు అన్నమయ్య జీవితచరితను ద్విపదలో వ్రాసినాడు. అందులో అన్నమయ్యను రాజు మొదట సత్కరించి, పిదప తనపై సంకీర్తనములను చెప్పమనినాడు. నరహరిని కీర్తించు తాను నరులను కీర్తించనని, తిరస్కరించినాడు. తిరస్కారమును భరింపజాలని రాజు అన్నమయ్యకు సంకెలలు వేయించినాడు.

-------------------------------------------------------

పాదసూచికలు: [1] కుమారసంభవము/9 [2] దశకుమారచరిత్ర/1/7]

హరి కటాక్షమువల్ల బంధములనుండి రక్షితుడైనాడు, భక్తుడు అన్నమయ్య. రాజు తన తప్పిదమునుతెలిసికొనినాడు. మన్నింప వేడినాడు. అప్పుడు అన్నమయ్య,

"...యింక నింతటనుండి నీవు, నరహరి సంకీర్తనము సేయువారిఁ

బరసమానులుగాగ పరికింపవలదు మురవైరి కృతయుగమున సర్వజనుల నిరత నిజ

ధ్యాన నిష్ఠ చె మెచ్చు" అనినాడు.

[ అన్నమా/ద్విపద చిన్న/తి.తి దే ప్రచురణ ] హరికన్నా, హరిభక్తుల ఘనత అధికమైనదని చెప్పడమున్నది. రామబాణముకన్న రామనామ బలిమి అధికమని చెప్పడమున్నది. దక్షిణదేశములో వైష్ణవ భక్తులు ఆళ్వార్లు. హరి భక్తుల కథలను వివరించు సందర్భములలో చెప్పబడినది అంబరీషుని కథ ఒక చిన్న ఉదాహరణ. కావ్యావతరికలలో గాకున్నా, గ్రంథము మధ్యలో పోతన దీనిని రమ్యముగా చిత్రించినారు.

ప్రత్యేకముగా అనంత గరుడాదులను వేరొకచోట ప్రస్తుతించుట జరిగినది.

'ముకుందవిలాసము'లో 'కాణాదం పెద్దనసోమయాజి' ఇట్లు నుతించారు.

కం. 'అలభోగ సుకీర్తిబలో

జ్వలయోగ నిరూఢి సుప్రసక్తులు హరిభ

క్తులు వరముక్తులు మత్కృతి

వెలయింతురనంత గరుడ విష్వక్సేనుల్' [1]

శ్రీక్రష్ణదేవరాయలవారు ఆముక్తమాల్యద లో ఆళ్వార్లను స్తుతించినారు. అది హరి భక్తుల స్తుతియే! ఆ పద్యమొకసారి చూచెదము.

మ. " అలపన్నిద్దరు సూరులందును సముద్యల్లీల కాపున్న వె

గ్గలపుండాపము పాపనా నిజమనః కంజాత సంజాత పు

ష్కల మాధ్వీక ఝురిన్మురారి నొగియంగాజొక్కి ధన్యాత్ము తా

నిల పన్నిద్దఱు సూరులందలాతూ మోక్షేచ్ఛామతిందివ్యులస్" [2]

---

పాదసూచికలు: [1] ముకుందవిలాసము ప్రథమా/10 [2] ఆముక్త మాల్య /1/10

పరమ భాగవతులు భక్తాగ్ర గణ్యులయినవారెందరో గలరు. అట్టి వారిలో ముఖ్యముగా కీర్తింపబడువారు వీరు > " ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాస అంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్, రుక్మాంగదార్జున వశిష్ఠ విభీషణా దీన్'[*] యని చెప్పడము కలదు. అప్పకవి వీరిలో కొందరిని ప్రస్తావించినారు. వారు పేర్కొనిన భక్తులను చూద్దాము.

కం. "శుక భీష్మ విభీషణ శౌనక రుక్మాంగద వసిష్ఠ నారద బలి దా
ల్భ్యకిరీటి పుండరీకుల ప్రకటిత హరి పాదపద్మభక్తుల తలతున్" అప్ప/15

ఇందులో ప్రహ్లాద, పరాశర, వ్యాస, అంబరీషులను ప్రస్తావించలేదు.

శ్రీరామచరిత్రను పొగడగ కామారికే కాదనినపుడు మిగతా వారిమాట తడవ పనిలేదు. కొందరు మహానుభావులను, తమ కావ్యముల మొదట కొందరు 'పూర్వ కవి స్తుతి' వలె భక్తులను కవుల భక్తిననుసరించి వారి వారి అనుభవాల దృష్ట్యా కీర్తించుట / స్మరించుట చేయడమున్నది. అట్లు ప్రస్తావన రూపములో కొందరిని ప్రశంసించినవారు 'ఆత్మ రామాయణ' కర్త నవీన పద్య కవి వర్గమునకు చెందిన 'లలిత కవి గురుమూర్తి'. వారు నుతించిన భక్తులను చూద్దాము.

అందులో ఒకరు నాదోపాసన చేసి తమిళనాటయుండియూ, తరతరాలకు తరగని చక్కని తెలుగు కీర్తనా రాశి ప్రసాదించిన మహానుభావుడు, 'నిధికన్న రాముని సన్నిధి ఘనమని' పలికిన కాకర్ల త్యాగరాజస్వామి. కాకర్ల వారిని స్తుతిస్తూ గురుమూర్తి ఇట్లనినారు. [కం.

"నాదబ్రహ్మోపాసన మోదమెలర్పగనుజేసి మునిపూజితుడౌ
నాదబ్రహ్మను రఘువరు దా దనరగపాడుకొన్న త్యాగయనెంతున్"[1]

'ముద్దుపళని' తన 'రాధికాసాంత్వనము'లోపలువురిని నుతించింది./4

ఆ.వె. 'శ్రీనివాసుడైన శేషుని భజియించి, ఘనశరీరుడైన గరుడి పొగడి
అఘవిదారియైన హరిచమూపతినెంచిపరమసూరి జనుల ప్రస్తుతింతు'

తిరువణ్ణామలై పట్టణములో అరుణాచలేశ్వరుని వద్ద నిలిచి భక్తులకు సదుపదేశ ములొసగిన మహర్షి రమణుడు . వారిని తలచినారు గురుమూర్తి.

---

పాదసూచికలు: [1] ఆత్మరా అవ/బాల/29

ఆ.వె. " మౌన ముద్ర చేత మానవతతికెల్ల నాత్మ తత్త్వ బోధ నరయ జేసి

సత్య పథమునందు నిత్యంబు నిలిపిన రమణ మునిని మదిని రక్తి నెంతు. [1]

దీనినే దాదాపు, 'భైరవకవి', తన 'శ్రీరంగమాహాత్మ్యము'లో చెప్పినట్లు చూడగలము. ఆయనచేసిన సంస్తుతి యిది.

మ. "వినుతింతుస్ హరిభక్తి పెంపున జగద్విఖ్యాతులై పుణ్య కీ

ర్తనులైనట్టి పరాశరుంగపిలు వేదవ్యాసు ప్రహ్లాదు న

ర్జును రుక్మాంగదు నంబరీషుని వసిష్ఠుంబుండరీకుస్ మరు

త్తనయున్భీష్మువిభీషణుస్ సురమునిందాల్భ్యున్శుకుస్ శౌనకుస్ [2]

ఇచ్చట పరాశరుడు, పింగళుడు,వేదవ్యాసుడు, ప్రహ్లాదుడు,అర్జునుడు, రుక్మాంగదుడు, అంబరీషుడు, వసిష్ఠుండు, పుండరీకుడు, హనుమ, భీష్మ, విభీషణ, దాల్భ్యుడు, శుకుడు,శౌనకుడు-వీరు హరి భక్తులు.

7.14 ***హర భక్తుల స్తుతి :-*** శివుని దేవునిగా భావించి పూజించు వారలు శైవులు. వీరు హరభక్తులు. దక్షిణదేశమునందు వీరిని నాయనార్లు అని వ్యవహరింతురు. వాస్తవమునకు వాహనరూపున నంది, భృంగి, పుష్పదంతుడు, భైరవుడు, వీరభద్రుడు,శివగణాలు, రావణబ్రహ్మ, కుబేరుడు, శ్రీ, కాళ, హస్తి, తిన్నడు, అర్జునుడు, అందరికన్నా ముఖ్యంగ పేర్కొనవలసినవాడు విష్ణువు. వీరందరూ ఈశ్వరుని ప్రియభక్తులు, వీరు సేవించినవారు, సాయుజ్య మందినవారు. విష్ణువైతే త్రిపుర సంహార సందర్భమున బాణముగ మారినాడు. మోహిని రూపాన సేవించినాడు. వరాహరూపాన శివునిపాదమూళాలను తెలిసికోవలెనని యత్నించెను. శివుడునాట్యము చేయునప్పుడు మద్దెలను మోగించువాడు విష్ణువు. ఇలా చాలా విషయములను 'హరభక్తుల' గురించి తెలియగలము. ఇదమిత్థముగ హరభక్తులను నుతించిన విషయము మరింత పరిశీలన వలన తెలియు అవకాశము కలదు.

---

పాదసూచికలు: [1] ఆత్మ/రామా/బాల/ఆవ/22 [2]శ్రీరంగ మాహాత్మ్య/భైరవకవి /ప్రథమా/5

# అష్టమాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు–ఇష్టదేవతాస్తుతులు–విశేషాంశములు

## VIII అష్టమాధ్యాయము

**8. ఇష్ట దేవతా స్తుతులు- విశేషాంశములు:- ఇంతవరకు పరిశీలించిన ఇష్ట దేవతా స్తుతులలోని విశేష అంశములను పరిశీలిద్దాము.**

**తమ వ్యక్తిగతమగు మత ఆచారములేపైనను ప్రభువుయొక్క భావమునను సరించి స్తుతులను చేయుట అందులో విశేషములను తెలుపుట కవులకు పరిపాటి.**

ఋగ్వేదములో దేవతలు చాలామంది చెప్పబడ్డారు. వారిలో కొందరు ప్రధానమైనవారు. మరికొందరు అప్రధానమైన వారు. అగ్ని ఇంద్రుడు వరుణుడు మున్నగు వారు ప్రధాన దేవతా వర్గమునకు చెందినవారు.

తర్వాత వర్గములోనికి వచ్చువారు సూర్యుడు, సవిత, విష్ణువు, వాయువు, రుద్రుడు మొదలైన వారు. పురాణేతిహాసములలో సర్వోత్కృ ష్టులుగా ప్రసిద్ధి చెందిన విష్ణువు, రుద్రుడు మున్నగు వారు ఋగ్వేద సంహితలో అప్రధాన దేవతలుగు పరిగణింపబడటం గమనించతగినది.

ఇంద్రుడు అధికముగా ఋగ్వేద సూక్తాలలో, సుమారు 250 వాటిలో ప్రత్యేకముగా, మిగత 50 సూక్తాలలో ఇతరులతో పాటు పేర్కొనబడినాడు.

పవిత్రతకు, శక్తికి, తేజస్సుకు కాణాచి యగు అగ్ని ఇంద్రుని పిదప అధికముగా స్తుతింపబడినవాడు.

విష్ణువు ఋగ్వేదములో అప్రధానుడుగా పరిగణింపబడినను, పురాణేతి హాసములలో 'త్రిమూర్తులలో' ఒకడుగా వన్నెకెక్కిన వాడు. ఇతడు మూడంగలలో సమస్త లోకాలను ఆక్రమించినాడు. ఇది తర్వాత పురాణ గాథలలోని [వామనావతార] త్రివిక్రమత్వానికి మూలమని చెప్పవచ్చు. ఇతని అత్యున్నతమైన పదం [పరమం పదమ్] మధువుకు (తేనె)

{అంటే అమృతత్వం} నిధానం. నిత్యముక్తులు విష్ణువుయొక్క పరమపదాన్ని సదా దర్శిస్తారు. విష్ణువుకు కొండలు నివాసం అని కూడా చెప్పబడి ఉంది.

ఇతనికి 'త్రాత' ( రక్షకుడు) అనే పేరు సార్థకం. ఇది తర్వాతి వాఙ్మయంలో అతని'స్థితి' క్రియకు సూచకమని చెప్పవచ్చు. ఇతనికనేక రూపాలున్నట్లు చెప్పబడి ఉండి. ఇది అతని 'అవతార' సిద్ధాంతానికి నాంది అనవచ్చు.

ఇక 'రుద్రుడు'. విష్ణువులాగా ఋగ్వేదములో సామాన్య దేవతగా పరిగణింపబడి, పురాణేతిహాసములలో, 'శివుడు' గాను, త్రిమూర్తులలో ఒకడుగాను, కీర్తింప బడినవాడు 'రుద్రుడు' దేవతలందరిలోను ఇతడు చాలా భయంకరుడు. మరుత్తులు, రుద్రులు, రుద్రియులను గణాల తండ్రి. మరుద్గణాలకు తండ్రియైన రుద్రుడు పింగలవర్ణుడు. ఎల్లప్పుడూ ధనుర్బాణాలు ధరిస్తాడు. మరుత్తుల్లాగా ఇతడు కూడా బహు భూషణా లంకృతుడు. అపరాదుల శిరస్సులపై విద్యుత్తనే అస్త్రాన్ని వెనక ముందాలోచించకుండా ప్రయోగిస్తాడు. అపరాధుల విషయములో చాలా క్రూరుడైనా, భక్తుల విషయములో అత్యంతోదారుడు. తన భక్తుల ఆధులను [మానసిక] వ్యాధులను[శారీరక] పోగొడతాడు. ఇతనిచేతులు వివిదౌషధాలతో నిండి ఉంటాయి. ఆపదలలో రక్షించమనే ప్రార్థన విన్న వెంటనే యెంతటి క్రూరుణ్ణైనా పరుగెత్తి వెళ్లి రక్షిస్తాడు. ఇంద్రునికి ఇతడు సహాయకుడు. ఈరీతిగా దేవతా మూర్తుల వారి స్తుతుల విషయములో మార్పులు చెందుతూ వచ్చినవి.

సర్వ సాధారణముగా కవులు వారి ప్రభువులు అనుసరించు శైవ లేక వైష్ణవ సిద్ధాంతములకు చెందినట్టి ఆయా దేవతామూర్తుల లేక వారి సంబంధ స్తుతులు చేయుట పరిపాటి. సందర్భముననుసరించి, శైవ వైష్ణవ సిద్ధాంతములకు మధ్య అంతరము లేదని తిక్కన హరిహరనాథ మూర్తిని సృజించినాడు. వాస్తవములో ఇది ఇంతకు పూర్వము ఉన్నదే. అర్ధ నారీశ్వర తత్త్వములోని రహస్యమిదియే. శివునిలో సగము అంబిక. నారాయణుని సోదరి నారాయణి. హరిహరుల క్షేత్రములు ఈ దృక్పథముతో నిర్మితములైనవి. ఆది శంకరులవంటి వారు తమ రచనలలో శివ, విష్ణు, హనుమ, భ్రమర,

శారద, కృష్ణ, మహిషాసురమర్దని, గణేశ, నృసింహ, లక్ష్మి, ఇత్యాది సకలరూపా లలోమూలతత్త్వమును చూచారు. 'విజయవిలాసము'లో 'చేమకూర వేంకటకవి' తన కృతిభర్త యగు అచ్యుతేంద్ర రఘునాథ నరపాలునికి, శైవ వైష్ణవములను రెండు మతముల పట్ల సమానమైన విశ్వాసము కలదని పల్కినారు. ఆహవ జయమును శ్రీగౌరులిత్తురనుట విశేష విషయము.

శా. 'ప్రాగల్భ్యంబున విష్ణుశంభు మతముల్ పాటించి సర్వంసహా
భాగంబందు సమప్రధానగతి యొప్పన్ రాజలోకంబులో
తాగణ్యుండని యచ్యుతేంద్ర రఘునాథ క్షోణి భృన్మౌళికిన్
శ్రీగౌరుల్ సమకూర్తు రాహవజయశ్రీ గౌరులన్ నిత్యమున్' [1]

రఘునాథ నాయకుడు అన్ని మతములను గౌరవించును. కావున విష్ణుని భార్య శ్రీదేవియు, శివుని భార్య గౌరీదేవియు, ప్రభువు యెడల అభిమానము కలిగి, శ్రీదేవి సంపదను, గౌరీదేవి రాజ్య సంపదను ఇట్టురని ఆశ. 'రాజలోకంబులో' అనుతచే 'రాజ' పదము వలన 'చంద్రుడు' సూచింపబడుట ఉన్నది. క్షీరసాగర మధనంలో జన్మించిన చంద్రుడు లచ్చికి సోదరుడు, తన పతియగు పరమ శివుని శిరము నలంకరించినవాడు. కనుక ఇద్దరికినీ వలసినవాడు చంద్రుడు. ఆ బాంధవ్యముతో కనుక రఘునాథ నాయకుని యెడల సిరి, గౌరి, ఇరువురు కనికరము వహించు వారే యని చమత్కారము. మరొక విశేషమగు వ్యాఖ్య ఇదే గ్రంథమునందు చూద్దాము.

హరిపాద జనితము, హరమూర్ధమున అద్భుతమగు అలంకారము గంగ. హరి పాదమునుండి, హరుని శిరము వరకు చేరినది ఈ గంగా స్రోతస్విని.విరాట్పురుషుని వర్ణనలోఇట్లున్నది.

---

పాదసూచికలు:- [1] విజయవిలాసము/చే.వేంకటకవి/పీఠిక/7

" ......బాహూ రాజన్యః కృతః ఊరూయద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత...." [పురుష సూక్తం/సస్వర వేదమంత్రాలు/రామకృష్ణ మఠం/హైదరాబాదు ప్రచురణ/పుట 484] కొందరు పెద్దలు విరాట్పురుషుడి రూపము మన భౌతిక శరీరమే. ఇందులో బుద్ధిని ఉపయోగించి సంఘమునకు/ దేశమునకు సేవలందించు వర్గము, భుజ బలముతో దేశరక్షణ చేయు వారొక వర్గము, వస్తువులను పలు మూలలనుండి తెప్పించి వితరణ చేయు వారొక వర్గము, భౌతికమైన సేవలు చేయుచూ దేశమునకు/ సంఘమునకు మేలు కూర్చు వారొక వర్గముగను ఉన్నారు. మనస్సు చంద్రుడని, చూపుకలిగించు శక్తి సూర్యుడని విశ్లేషణ చేసినారు. ఇందులో హెచ్చు తగ్గులు లేవు. వారి వారి బాధ్యతలను సక్రమముగా సాగించి దేహముయొక్క/ దేశముయొక్క అభ్యున్నతిని కోరితే శ్రేయస్కరము. రఘునాథ నాయకుడు కవియొక్క రచన ప్రకారము పాదజనిత వర్గము వారు శూద్రులు. గంగ కూడా హరి పాదజనితమే. గంగపాపములను తొలగించు పరమ పావని. శివుడు ఆమె పట్ల అధికమైన మక్కువ కలవాడు. కనుకనే శిరముపై నిడుకొని గౌరవించినాడు. అట్టి గంగ తనతోబుట్టువు వంశము వాడైన కృతిపతికి సకలైశ్వర్యములు కలిగింప నేర్చు కలది. మరియూ ఆ వంశము గంగానదివలె స్వచ్ఛమైనదని భావించ వచ్చును.

మ. ' ప్రకటశ్రీహరియంఘ్రి బుట్టి హరుమూర్ధంబెక్కి యాపాదమ
స్తకముస్ వర్ణనకెక్కుదేవి సహజోదంచత్కులోత్పన్న నా
యకరత్నంబని యచ్యుతేంద్ర రఘునాథాధీశ్వర స్వామికిస్,
సకలైశ్వర్యములు న్నిజేశువలనస్ దాగల్లగాజేయుతస్' [1]

ఇక మరొక పద్యములో వేంకట కవి చేసిన చమత్కారము చూడండి.

---

పాదసూచికలు:- [1] విజయ విలాసము/చే వేంకటకవి/పీఠిక /8

కల్పనలకు కవుల ఆలోచనలు కాణాచి. కవుల ఊహలకు కొలమానాలు లేవు. వారి ఊహావైదగ్ధ్యము చిత్రవిచిత్రముగ నుండును. సాధారణమైన విషయమును కూడ తమ పోలికల ద్వారా, ఇతర వర్ణనల ద్వారా అద్భుతమైన సుందర సుకుమార కమనీయ దృశ్యములను మనకు సాక్షాత్కరింప చేయ గలరు. వారు సహృదయులు, రసహృదయులు, సరసహృదయులు కూడా కనుక.

ఉ. "శ్రీకలకంఠకంఠియు ధరిత్రియు దక్షిణవామభాగముల్

గైకొని కొల్వ వారి కడకన్ కడకన్నులకాంతిదేల్చి తా

నాకమలాప్తతం కువలయాప్తత తెల్పెడు రంగభర్త లో

కైకవిభుత్వమిచ్చు దయనచ్యుతు శ్రీరఘునాథశౌరికిన్" [1]

రంగనాథుడు ఇరుపైపులా శ్రీదేవి భూదేవి సేవింపగ విలసిల్లుచున్నాడు. శ్రీదేవి కమలమునకు, సూర్యుని సంబంధము(పగలు), భూదేవి కువలయము కలువ చెలికాడు చంద్రుడు(రాత్రి), విష్ణువునకు సూర్యచంద్రులు నేత్రములు. వారిరువురు రఘునాథుని రక్షింతురని, ప్రాభవమునిచ్చి ప్రోచుదురని, రాజు ప్రజారంజకుడగునని భావము.

---

పాదసూచికలు:- [1] విజయ విలాస /చే వేంకటకవి/పీఠి/2

8.1 *భావి కథార్థ సూచనలు* :- కావ్యములో కొంతవరకు తాను చెప్పదలచినది ఏమిటని కవి వస్తు నిర్దేశము చేసికొని కావ్యమును నడిపించును. కొన్ని సందర్భములలో కవి తాను చెప్పదలచిన విషయమును ధ్వని రూపముగా వ్యక్తముచేయును. నన్నయ్య గారు ఒక చక్కని ప్రణాళికను సిద్ధముచేసికొని మహాసంహిత, పంచమవేదమగు తెలుగులో భారతమునారంభించెను. ఆ విషయము మనకు ఆదిపర్వములో ప్రథమాశ్వాసములో దాదాపు 50 (33 – 82) పద్య గద్యములలో వ్యాసభారతము ననుసరిస్తూ స్వతంత్రముగా రాసినారు. ఏయే పర్వాలలో ఏయే కథలు/ విషయాలు చెప్పాలి, ఎక్కడ ఆపాలి, మొదలగు భావి కథాంశాలను అత్యంత నియమ పూర్వకముగ నిర్ణయము చేసినారు. గాసటబీసటగా కాకుండా కాకపోవడానికి ఇదొక కారణము.

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని యధ్యాత్మ విదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని యైతిహాసికు లితిహాస మనియు
పరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చయంబని మహికొనియాడుచుండ
ఆ. వివిధ తత్త్వ వేది వేదవ్యాసు డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వ జనీనమై పరగుచుండ జేసె భారతంబు.

ఇందులోవిశ్వ జనీనమగు మహాభారతము యొక్క విషయ విశేషాలను నన్నయ వివరించినారు. మహాభారతములో భావి కథార్థ విషయ వివరణ ముందే చెప్పడము జరిగినది. కొన్ని కావ్యాలలో విషయమును సూచన ప్రాయముగా మనము గ్రహించే అవకాశము ఉండును. అట్టి కొన్ని కొన్ని కావ్యములలోని విశేషాలను పరిశీలిద్దాము. వాచ్యముగా కాకుండా ధ్వనింప జేయుట ఒక ప్రత్యేకత మరియు ఘనత. మంచి కావ్యలక్షణము కూడా.

---

పాదసూచికలు:- [1] కవిత్రయ/భారత/ఆది/ప్రథమా/32/ttd

మనుచరిత్రలో పెద్దన రాసిన తొలి పద్యము 'శ్రీవక్షోజకురంగనాభ మెదపై జెన్నొంద విశ్వంభరా దేవిస్....అను పద్యములో లక్ష్మీదేవి కుచముల యొత్తిడి వలన కలిగిన కస్తూరి మచ్చను నిత్య బ్రహ్మచర్య వ్రతమునందుండు సనక సనందాది మహర్షులకు శృంగారపరమగు అర్థము /భావము తోచలేదు. అట్లు వారు గ్రహింపక పోవుట సముచితముగానున్నది. విష్ణువు లక్ష్మిని తన వక్షమునందు నిల్పుకొనుట జగద్విదితము. లచ్చిని కౌగిలించుకొన్న సందర్భ మున ఆమె పాలిండ్లపై గల కస్తూరి వెన్నుని బొమ్మపై అంటుకొనినది. వెన్నుని సేవింపవచ్చిన సనకాది మునులకు ఆ కస్తూరి శ్రీదేవితో పాటు భూదేవిని కూడా విష్ణువు తన వక్షముపై నిల్పుకొన్నాడని తలచినారు. లక్ష్మి స్తనకస్తూరి భూదేవివలె మునులకు తోచుట గంధర్వుడు వరూధినికి 'ప్రవరుని' వలె తోచిన కారణమున భావికథా /కావ్యార్థ సూచనగా వ్యాఖ్యానించడమైనది. రామరాజభూషణుడు, 'శ్రీ భూపుత్రివివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్వలీలాభి వ్యక్తి ....' యను పద్యంతో వసుచరిత్రను ప్రారంభించిన విషయము మునుపే చూచినాము. ప్రతిభాశాలియగు రామరాజభూషణుడు తన తొలి పద్యమునందు భావి కథా సూచనను చేసినాడు. మంజీరాగ్రరత్నము నందలి బింబమును చూచి సీత వేరొక భామగా తలచకుండునటుల చేయుటకై రాముడు సన్నెకల్లు తొక్కిణ విషయమును, వసురాజు కోలాహలుని గోటితో మీటుట అను భావికథా సూచనగా వ్యక్తమగుచున్నది. ఆంధ్రకవికులతిలకుడు అని కొందరిచే కొనియాడబడిన ముద్దుపలుకుల తిమ్మనార్యుడు కూర్చిన ప్రబంధము పారిజాతాపహరణము. శ్రీకృష్ణదేవరాయలకు అంకితముగ యివ్వబడినది. లీలామానుషావతారుడగు శ్రీకృష్ణుడు సత్యభామకు ప్రీతి కలిగించి పారిజాత పాదపమును దివినుండి భువికి తెచ్చిన గాథను మహాభారతాంతర్గతమగు హరివంశమునుండి గ్రహించి తెనుగు ప్రబంధముగా తీర్చిదిద్దినాడు - తిమ్మన. శ్రీమదుమామహేశ్వర వరప్రసాద లబ్ధసారసారస్వతాభినంది యని చెప్పుకొన్న తిమ్మన శివభక్తుడైనప్పటికీ, కృతిభర్త యగు శ్రీకృష్ణదేవరాయల అభిమతము ననుసరించి తిరుమలగిరివాసుడగు వెంకటపతిని స్తుతించినాడు. 'శ్రీమదికిం ప్రియంబెసగ చేర్చిన ఉయ్యెలలీలస్..అని కావ్యారంభమును కావించి కావ్యము నందు

వర్ణ్యమానమగుసత్యభామా ప్రీత్యర్థ పారిజాతాపహరణ రూపమైన యితి వృత్తమును వ్యంగ్యమర్యాదచే సూచించినాడని అవగతమగుచున్నది. ఆలంకా రికుల మతమునననుసరించి ధ్వని ప్రధానమగు కావ్యము ఉత్తమమైనది.

"కావ్యస్యాత్మా ధ్వని రితి బుధైర్య స్సమామ్నాత పూర్వః" అని చెప్పి ధ్వని లక్షణమును, ధ్వన్యాలోకమున ఆనందవర్ధనాచార్యుడు ఇట్లు వివరించినాడు.

"యత్రార్థశ్శబ్దో వా తమర్థముపసర్జనీకృత స్వార్థౌ
వ్యక్తః కావ్యవిశేషస్సధ్వని రితి సూరిభిః కథితః"

కనుక సత్యభామ ప్రీతికొరకు, శ్రీమదికి ప్రియము గూర్చుట అనుటవలన ధ్వని రూపముగా భావికథను సూచించినాడని మనము గ్రహింపగలము. కొన్ని సందర్భాలలో కొందరు కవులు తాము దేనిని గురించి చెప్పదలచినారో స్పష్టముగా చెప్పడము చేసినారు. భావి కథార్థ సూచనలు పూర్వ కావ్యము లలో అధికమనవచ్చును. నవీన కావ్యములలో ఈ విషయము అల్పమే.

## 8.2 *ఛందో విశేషాంశములు* :-

'ఛందస్సు' అనేపదం 'ఛద్' ధాతువునుండి రూపొందింది. ఈ ధాతువునకు 'ఆహ్లాదం' అని అర్థం. కనుక ఛందస్సు అంటే (సంతోషం) కలిగించే వాక్సమూహం. ఈ సంతోషం ఆ వాక్సమూహంలోని గురులఘు వుల వల్ల వాటి ఆవృత్తివల్ల, వాటి నియమ పూర్వక విచ్ఛేదం వల్ల కలుగుతున్నది. ఇవన్నీ ఆ శబ్ద సమూహం లోని లయను అభివ్యక్తం చేయడం ద్వారా ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

ఛందస్సులో నియమిత విచ్ఛేదం అనేక రకాలుగా ఉన్నది. అందులో ఆ వాక్సమూహాన్నిలయాను గుణమైన పాదాలుగా, గణాలుగా విభజించడం ప్రధానమైంది. గణాలు గురులఘువుల కూడిక వల్ల ఏర్పడుతున్నాయి. అక్షరాలకు గురుత్వం గానీ, లఘుత్వం గానీ వాటి ఉచ్చారణ కాలాన్ని బట్టి చెప్పబడుతుంది. ఆయా పాదాల్లో గురు

లఘువులుండే స్థానాల మార్పువల్ల ఛందస్సులోఅనేక గమనాలు ఏర్పడుతున్నాయి. కాబట్టే వేద పురుషునికి ఛందస్సు {ఛందః పాదౌ తు వేదస్య} పాదాలు అని వర్ణించడం. పాదంలో ఉండే అక్షరసంఖ్యను బట్టి ఛందస్సు పేర్కొనబడుతోంది. ఛందస్సులో సాధారణంగా నాలుగు పాదాలుంటాయి.

పాదంలో 1 మొదలు 26 వరకు అక్షరాలుంతాయి. కనుక 26 ఛందస్సులు ఉన్నాయి. అవి నాలుగు వర్గాలుగా విభజింపబడ్డాయి.

ఒకటవ వర్గం 'ఉక్త' మొదలు 'సుప్రతిష్ఠ' వరకు ఉన్న(5) వాటిని 'అనాదిష్ట ఛందస్సులని' అంటారు.

రెండవ వర్గము 'గాయత్రి' మొదలు 'జగతి' వరకు గల (7) వాటిని 'బృహ ఛందస్సులని' అంటారు.

మూడవ వర్గం 'అతిజగతి' మొదలుగ 'అతిధృతి' వరకు గల (7) వాటిని ''అతి ఛందస్సులని' అంటారు.

ఇక నాల్గవ వర్గములో 'కృతి' మొదలు 'ఉత్కృతి' వరకు గల (7) వాటిని 'కృతి ఛందస్సులని' అంటారు. ఈ విధముగా 1 నుండి 26 వరస సంఖ్యలు ఆయా ఛందస్సులో ఒక పాదం లోని అక్షరాల సంఖ్యను తెలుపుతున్నాయి.

ఉదా. శార్దూలవిక్రీడితము. ఇందులో 'మసజసతతగ అను గణాలున్నవి.

తొలి 'మ' నుండి తుది 'త' వరకు ( 3 X 6 = 18) + [గ =1] కలిపి 19 అక్షరాలు గల 'అతిధృతి' అను 'ఛందస్సునకు' చెందినది.

లౌకిక ఛందస్సులో వృత్తాలన్నీ గణబద్ధాలు. వైదిక ఛందస్సు ఉదాత్త, అనుదాత్త, స్వరితాలనే స్వరాలపైన, లౌకిక ఛందస్సు గురు లఘు వర్ణా లపైన లేక అక్షరాల ప్రస్వ దీర్ఘాల పైన ఆధారపడి ఉంటుంది.

వేదాంగాలలో మూడోది ఛందస్సు. వేదార్థాన్ని తెలుసుకోవడంలో వ్యాకరణాదులు ఎలా ఉపయోగిస్తాయో ఛందస్సు కూడా అలాగే ఉపకరిస్తుంది. ఆయా మంత్రాలకు సబంధించిన

ఋషి ఛందో దైవత బ్రాహ్మణాలను తెలిసికోకుండా చేసే అధ్యయనం అధ్యాపనం యజనం, యాజనం, నిష్ఫలాలని ఆర్షేయ బ్రాహ్మణం చెబుతున్నది.

*ఛందస్సు వలన ప్రయోజనాలు* : కవిత్వానికి సౌందర్యాన్ని కల్గించేది ఛందస్సు. వచనం కంటె ఛందోబద్ధమైన రచన గుర్తుంచుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. నియమపూర్వకమైన విచ్ఛేదం ఉండటం వాళ్ళ ఇది ధారణకు ఎంతో వీలుగా ఉంటుంది. మంత్రజపాలలో ఆయా మంత్రాల ఛందో విశేషజ్ఞానం ఎంతో ఆవశ్యకం. ఛందోజ్ఞానం లేకుండా చేసే జపాదులు ఫలించవు. ఛందోబద్ధంగా ఉండటం చేతనే వేదాలు లిఖిత పూర్వకంగా లేకపోయినప్ప టికీ శ్రుతులనబడుతూ అనాదినుంచి స్వస్వరూపాన్ని కోల్పోకుండా చక్కని స్వరూపంతో చెక్కు చెదరకుండా స్థిరంగా ఉండగల్గాయి.

* కావ్యాలలో అధికముగా వైదిక దేవతలకన్న పురాణ సంబంధ మగు దేవతల స్తుతులు చేసినారను విషయము వాస్తవము. ఇది కాలముతో కలిగిన మార్పుగా మనము భావించుటకు వీలు కలదు. కనుకనే వేద సాహిత్యములో స్తుతింప బడిన దేవతల స్థానములో క్రమముగా పురాణ సంబంధ దేవతలు ప్రతిష్ఠింపబడినారు. వేద సాహిత్య యుగమునుండి లౌకిక సాహిత్యము వైపునకు మొగ్గుచూపబడింది. పురాణపురుషులు వైదిక ధర్మమును అనుసరించిననూ, రాచరిక వ్యవస్థ, సాంఘిక జీవన విధానము, మరియు ఇతర కారణాలవలన సాహిత్యములో కూడా మార్పులు కొంగ్రొత్త పుంతలు తొక్కినవి. కావ్యాలలో పురాణములలోని దేవతా స్తుతులే అధికముగా చేయబడినవి. ఇందులో రెండవ ఆలోచనకు తావు లేదు. ఛందస్సులో వైదిక ఛందస్సు, లౌకిక ఛందస్సు అని రెండు భాగములున్నవి. వైదిక ఛందస్సులో 'కేవలాక్షరగణనానుసారి' { అనగా మొత్తముపై ఇన్ని అక్షరములు ఉండవలెనను నియమము] ఇందులో కేవలం పాదవిభాగం లేకుండా ఎన్ని అవసరమో అన్ని అక్షరాలు ఉంటాయి. ఇదొక వైదిక మంత్రము, ఇందులో ముఖ్యముగా అక్షరాలే తప్ప పాద విభజన ఉండదు. ఇక రెండవ విధానము

'పాదాక్షరగణనానుసారి' అనగ ప్రతిపాదమునందున ఇన్ని అక్షరాలు ఉండవలెనను నియమము. అను రెండు మార్గములు కనిపించును. రెండు పద్ధతులలోను అక్షర సంఖ్య ఒకటే, కానీ పాదవిభజనలో భిన్నత్వము కలదు. కృష్ణ యజుర్వేదములో ఈ రెండును కలవు. కావ్య సాహిత్యము లౌకిక ప్రయోజనములు కాంక్షిస్తూ చేసినది కనుక వేదములందలి అక్షరాలను కాక పాదములందు ఎన్ని అక్షరాలు కావలెనో గ్రహించి 'పాదబద్ధచ్ఛందోవిధానాన్ని' అనుసరించినట్లు గ్రహింపగలము.

**అందులో ప్రయోగములను కొన్నిటిని ప్రస్తుతము పరిశీలింతము.** నన్నయ్య గారు ఆరంభించినది శ్లోక రూపమందలి వృత్తము. నన్నయ్య గారు భారతములో చేసిన తొలి శ్లోక రచన త్రిమూర్తుల స్తుతి.

'శ్రీవాణీగిరిజా'... ఇది ప్రతి పాదమునకు ఉండవలసిన అక్షరములను గ్రహించినది. దేవ భాషలోని ఛందస్సునకు కల లక్షణములను కొంత అనుసరించినది. పాదక్షరానుసారియై, 'మసజసతతగ' అను గణాల కూర్పుతో భాసించినది. లక్షణగ్రంథాలలో చెప్పిన నియమాలు కలిగియున్నది. ఇందులో తెలుగు కావ్యములలో పాటించు యతి, ప్రాస నియమాలు లేవు. వేదములు నృప శాసనములవంటివను మార్గము నుండి, సుహృద్విజ్ఞాపనంబులుపురాణాది గ్రంథములు అను మార్గములోనికి వచ్చినదనవచ్చును. నన్నయ్య గారు కావించిన మహాభారతములోని 'మొదటి' పద్యము, 'రాజకులైకభూషణుడు' అంటూ రాజరాజనరేంద్రుని పరమైన విషయము. అనగా నన్నయ్య గారు ఉత్పలమాలతో లౌకిక రచన ప్రారంభించినారు. వాస్తవమునకు పంచమవేదమనబడిన వ్యాస భారతము, 'దేవభాష' నుండి 'దేశభాష' లోనికి తీసుకురావడానికి ప్రయత్నము జరిగినది.

నవీన పద్య కవి, శతావధాని, డా. సి వి సుబ్బన్న శతావధాని గారు, తమ 'బీబీ నాంచారు ప్రబంధములో' ప్రథమాశ్వాసములో, అవతారికా భాగములో మొదటి పద్యమును "వసంత తిలకమును" వృత్తముతో ప్రారంభించినారు. బహుశా బీబీ తమ సంప్రదాయము ప్రకారము

తిలకం పెట్టుకోదు. కనుక వేంకటపతిని వివాహమాడిన పిదప తిలకమును కవిగారు దిద్దినారేమోనను రీతిలో ఈ పద్యమును రాసినారు.

***వసంత తిలక వృత్తము***: -

‘ శ్రీవేంకటేశ్వర! పరిస్ఫుటపద్మనేత్రా!

ప్రావృట్పయోధరసవర్ణ మనోహరాంగా!

కైవల్య నిత్యసుఖ కాంక్ష నినుస్ భజింతుస్

దేవా! కళత్ర సుతధిష్ణ్య ధనాదులొల్లస్’

ఈ వృత్తము 14 వ ఛందము ఐన ‘శక్వరి’ అను వర్గమునకు చెందినది.

గణాలు వరుసగా – ‘త భ జ జ గగ’ [గా  రెండు గురువులు]

ప్రతి పాదమునందును రావలెను.

1 -10 అక్షరములకు యతి చెల్లించవలెను. ఇట్లు నవీన కవులు కొన్ని నూతన ప్రయోగాలు చేసినారు.*

8.3 *అలంకార విశేషాలు :-* అలంకారమనగా ప్రకృతి సిద్ధమగు స్నిగ్ధ సౌందర్యమునకు మరిన్ని మెరుగులు  పెట్టుట. ఇక సాహిత్యవిష యానికి వస్తే నరసభూపాలీయములో ఇట్లనుట చూడగలము.

“కవితాలతాంగికి హారకటక కంకణాదుల క్రియ నలంకరణ కరణ పరిణ తులచే నలంకారభావమొందు” [1].

ఇవి రెండు విధములుగాకలవు.

[1] శబ్దాలంకారములు: శబ్దము ప్రధానముగా కలవి.

[2] అర్థాలంకారాలు: అర్థ/భావ ప్రధాన మైనవి అర్థాలంకారములు

-----------------------------------------------------------------

పాదసూచికలు:- [1] నరస/4/72/శారదామూర్తి వావిళ్ళ

గ్రంథము లేక కావ్యములోపల కవులు వేర్వేరు అలంకారములు సమయ సందర్భముల ననుసరించి వాడినను కావ్యాదిలోదేవతా స్తుతిని పీఠికలలోగానీ, అవతారికలలో గానీ లేక కావ్యమును ప్రారంభించినపుడు మొదట కొన్ని పద్యములలో అధికప్రాధాన్యతను అర్థాలంకారాలకే ఇచ్చినట్లు భావింప వచ్చు. కొన్ని పద్యాలను స్తుతుల రూపమునందలివి పరిశీలనను చేస్తాము.

ఉదాహరణగ :- నన్నయ్యగారు కూర్చిన మహాభారతమందలి తొలి మంగళశ్లోకాన్ని తీసుకుందాము.

శ్లో. "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీ పుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితావ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజ భవశ్రీ కంధరా శ్శ్రేయసే"

ఇచ్చటవరుసగా శ్రీని వక్షమునందు, వాణిని ముఖమునందు, గిరిజను సగదేహమునందు, నిలుపుకొన్నవారు త్రిమూర్తులు. వారు పురుషోత్తముడు, అంబుజభవుడు, శ్రీకంధరుడు. త్రిమూర్తులు శ్రేయస్సును కలిగింతురుగాక అను ఆశీః పూర్వక వచనముతో మహాభారతము ఆరంభింప బడినది. లక్ష్మి విష్ణువు హృదయమున, [స్థితి కారుని విషయము] కమలజుడు ముఖము /వదనము నందు వాణిని [సృష్టికర్త] తనదేహములో సగము గిరిజకునిచ్చి శ్రీకంధరుడు [లయకారకుడు] క్రమముగా స్తుతింపబడుట జరిగినది.

క్రమాలంకార సూత్రము:- దీనికి మరొక పేరు యథాసంఖ్యాలంకారము.

' క్రమముగాచెప్పబడిన పదార్థములనాక్రమముతోడనే సమన్వయించుట యథాసంఖ్యాలంకారమగును. [క్రమాలంకారము]

ఉదా. శత్రువును మిత్రుని ఆపదను జయింపుము సంతోషపెట్టుము పోగొట్టుము. ఇందు శత్రువును జయింపుము, మిత్రుని సంతోష పెట్టుము, ఆపదను పోగొట్టుము.

ఈ సూత్రముననుసరించిన శ్లోకములో చెప్పబడిన లక్ష్యములో సక్రమముగా "క్రమాలంకారము" ప్రయోగింపబడినది.

మరొక పద్యము నన్నయ్యగారిది, అవతారికలోని తొలిపద్యము చూద్దాం.

ఉ. "రాజకులైక భూషణుడు రాజమనోహరుడన్య రాజతే

జోజయశాలి శౌర్యుడు విశుద్ధ యశశ్శరదిందు చంద్రికా

రాజిత సర్వలోకు డపరాజిత భూరి భుజా కృపాణధా

రాజలశాంతశాత్రవపరాగుడు రాజమహేంద్రుడున్నతిన్" [1]

ఈ సందర్భములో రాయబడిన విశేష విషయము [ttd pp3/భారతం ఆది] లోని కొన్ని ముఖ్యమైన అంశాలను ఎన్నిక చేయబడి ప్రస్తావిస్తాము.

పద్యములోని రాజరాజ నరేంద్రుడి ఆభిజాత్యమును, సౌందర్యమును, శౌర్యమును, నిర్మలమైన కీర్తిని, బాహుపరాక్రమమును నన్నయ్య వర్ణిం చినారు. ఈ గుణాలు ఉత్తమ నాయకత్వ వ్యంజకాలు. ఈ విశేషణాలు భారత నాయకుడైన ధర్మ రాజుకు కూడా వర్తింపజేయటానికి అనువుగా ఉండటం విశేషం. కావ్యావతారికలలో కృతిపతివర్ణనం అనేది ఒక ముఖ్యమైన అంగం. ఇచ్చట ఉపమానానికి ఉపమేయానికి అభేదాధ్యవసాయం చేయడం రూపకాలంకార లక్షణం. "విశుద్ధయశశ్శరదిందుచంద్రికా..." అన్నప్పుడు " భూరి భుజాకృపాణ ధారాజలశాంత శాత్రవ పరాగుడు" అన్నప్పుడు, యశస్సుకు చంద్రికకూ, కృపాణధారకు, జలానికి, శత్రువుల పరాగానికి, అభేదం చెప్పటం వలన రూపకాలంకారమైనది. నాందీ శ్లోకంలో చంద్ర ప్రశంస ఉండాలని లాక్షణిక నిర్దేశం. "శ్రీవాణీగిరిజాశ్చిరాయ" అన్న శ్లోకంలోచంద్ర ప్రశంస లేదు, కానీ మొదటిసారి ఎత్తుకొంటున్న ఈ తెలుగు పద్యంలో 'రాజ' శబ్దం శ్లేషార్థంలో ప్రయోగించడం విశేషం. 'రాజ' శబ్దం పునరావృత్తం చేయటంవలన ఈ పద్య రచనకు అక్షర రమ్యత ఏర్పడింది. ఒకే శబ్దం పలు పర్యాయాలు రావటం వలన వృత్త్యనుప్రాస అలంకారము.

-------------------------------------

పాదసూచికలు:- [1] భార/ఆదిI/3

చంద్ర ప్రశస్తి అర్థాంతరంలో వస్తున్న ఈ పద్యాన్ని 'ఉత్పలమాల'లో రచించటం విశేషం. రాజు అంటే చంద్రుడు, భూపతి, క్షత్రియుడు అనే అర్థాలున్నాయి. చంద్ర ప్రస్తావన ఇందులో వచ్చింది. ముఖ్యంగా నన్నయ్య శైలి ప్రసాద గుణభూయిష్ఠమైనది. తత్సమ పద బహుళమైనది. సంస్కృత శబ్దాలువాడినా తెలుగుతియ్యందనానికిగానీ, తెలుగువారి వ్యావహారికతకు గానీ, జాతీయతకుగానీ, భంజకం కాకుండా పోషకంగా ఉండటం ఈ పద్యంలో ప్రత్యేకత.

వసుచరిత్రను మనుచరిత్రను కలిపి ద్వర్థి కావ్యముగా రాసినవారు కీ.శే. క్రొత్తపల్లి సుందరరామయ్య గారు [1875 -1949]. దీనిని అద్దంకి వాస్తవ్యులు గాడేపల్లి సీతారామ మూర్తి గారు. ఇందులో శ్లేష తప్పక ఉండును. ఒక పద్యము చూడండి.

చ. " పురిద్విజకోటి ధాత, నృపపుంగవులర్జును, వైశ్యపాళికి

న్నరవరు, నంఘ్రిజుల్ హలిని, నట్టువకత్తెలు రంభ, నాగముల్

తురగములుస్ మహీరుహతతుల్ సురసింధుర సైంధవాద్రులస్

నిరతము క్రిందుసేయ తగు నేర్పున రంజిలు మంజు వైఖరిస్"

<u>వసుచరిత్ర</u> పరముగా అర్థము – ఆ అధిష్ఠాన పురమునందలి బ్రాహ్మణులు బ్రహ్మను, క్షత్రియులు అర్జునుని, వైశ్యులు కుబేరుని, శూద్రులు బలరా ముని మించిరి. నాట్యము చేయు స్త్రీలు రంభను మించిరి. అట్లే ఏనుగులు ఐరావతమును, గుర్రములు ఉచ్చైశ్రవమును, వృక్షములు కొండలను మించియున్నవి.

<u>మనుచరిత్ర</u> పరమగు అర్థములో మార్పు పురి అనగా –అరుణాస్పదము

కానీ, పద్యము నాగముల్ మొదలుకొని.. క్రమాలంకారము కలదు. పద్యములందలి పదములను జాగ్రత్తగా పరిశీలించినపుడు ఒక అద్భుత మగు కవి ప్రతిభ ఆవిష్కృతమగును. మరొక పద్యమును చూడండి.

గీ. "ఆత్మ భార్యానురాగుడై యవ్వసు ప్ర

భుండు నాయ నమిత మతి పొరసి యుండ

ఘన సమితి పొంగుగాం చుచు ఘనత నెసగ

పాటు వాడెంత వాడైన వటల గలడె" [1]

---

పాదసూచికలు:- [1] వసుచరిత్రను మనుచరిత్రను కలిపి ద్వర్థి కావ్యము పద్యం సంఖ్య 8

<u>వసుచరిత్ర</u> అనుసరించి :- ఆత్మ = స్వకీయమైన, భా = కాంతిచే, ఆర్యా+ అనురాగుడై = పెద్దల యందనురాగము కలవాడై, అవ్వసుప్రభుండు = ఆ వసురాజు, నాయ = నీతి చేత ('ఓష ప్లోషేనయో నాయే జానిర్జీర్ణౌ భ్రమోభ్రమౌ' – అని అమరము) నమిత= నమ్రమైన, మతిన్=బుద్ధిని,

పొరసియుండన్= పొందియుండగా, ఘన సమితిన్ = గొప్ప రణమందు పొంగుగాంచుచు = గర్వించుచు, ఘనతనెసగన్ = ఘనత్వమున నొప్పగా

ఎంత వాడైనన్ = ఎంత గొప్ప బలము కలవాడైనను, పాఱువాడు = పాఱి పోవును, వఱల గలడె? = ప్రకాశింప నేర్చునా? (నేరడనుట).

<u>మనుచరిత్ర</u> అనుసరించి :- పాఱువాడు= ఆ బ్రాహ్మణుడు, ఆత్మ=తన, భార్య =సతియందు, అనురాగుడై= అనురాగము కలవాడై, అవ్వ= తల్లియు, సుప్రభుండు =యోగ్యమైన ప్రతిభ గల, నాయన = తండ్రియు, మితమతిన్ =తగిన మనస్సుచే, పొరసి యుండన్= కూడియుండగా,

ఘన – సమితిన్ = పెద్దల సభలయందు ( 'సమితి స్సంగరే సామ్యే సభాయాం సంగమేచ' – అని నానార్థరత్నమాల) పొంగు గాంచుచు= జయమును లేదా సంతోషమును పొందుచు, ఘనతనెసగన్ = గొప్ప తనముచే నొప్పగా, ఎంతవాడైనను = తెంట పెద్ద (పండితుడు) ఐనను, వఱల గలడె? = ప్రకాశింపగలడా? [ప్రకాశింప లేడు అని భావము] .

* పారిజాతాపహరణకర్త యగు 'ముక్కుతిమ్మన' యనబడు నంది తిమ్మన ఆశ్వాసాంత గద్యలో 'శ్రీమదుమామహేశ్వరవర ప్రసాదలబ్ధసార సారస్వతా భినంది' యని చెప్పికొని యుండుటచే శివభక్తుడుగ కానంబడుచున్నను, కృష్ణరాయ మహారాజునకు తిరుపతి మహీధరంబుపై భక్తానుగ్రహార్థము దివ్యమంగళరూపుడై వేంచేసియుండు శ్రీవేంకటేశ్వరుండిష్టదేవత కావున తొలుతనద్దేవుని వినుతించినాడు. ఆయన చేసిన స్తుతి ఇచట చూడగలము.

'శ్రీమదికింబ్రియంబెసగ చేర్చిన యుయ్యెలలీలవైజయం

తీ మిళితాచ్ఛ కౌస్తుభము నిద్దపు కాంతిదనర్చి యాత్మ వ

క్షోమణి వేది పొల్పెసగ చూడ్కుల పండువు సేయు వేంకట

స్వామి కృతార్థు జేయు నరసక్షితినాథుని కృష్ణరాయనిన్' [1]

శ్రీమదికిం బ్రియంబెసగ జేర్చిన యుయ్యెలలీల అనుటచే కవి ఈ కావ్యమునందు వర్ణ్యమానమగు సత్యభామా ప్రీత్యర్థ పారిజాతాపహరణ రూపమైన ఇతివృత్తమును వ్యంగ్య మర్యాదచే సూచించెనని సహృదయ మానసంబులకు గోచరంబగును. ధ్వని ప్రధానంబగు కావ్యము ఉత్తమ మైనదని ఆలంకారికుల అభిప్రాయము. ఆనందవర్ధనుడు 'కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైర్యస్సమామ్నాత పూర్వః' అనినుడువుటయు, మరలా

"యత్రార్థశ్శబ్దో వా తమర్థ ముపసర్జనీయకృతస్వార్థౌ

వ్యఙ్క్తః కావ్య విశేష స్సధ్వనిరితి సూరిభిః కథితః" అని ధ్వన్యాలోకమున చెప్పినట్లు తెలియగలము. వైజయంతీ మిళిత కౌస్తుభమును, శ్రీదేవికి అమర్చబడిన ఉయ్యెలగా ఉత్ప్రేక్షించుటచేత వస్తూత్ప్రేక్ష. ఆత్మవక్షో మణివేది యనుచో రూపకము, కావ్యార్థ సూచనచే ముద్రాలంకారము.

ఇందులో మూడు అలంకారముల ప్రస్తావన జరిగినది. వరుసగా అవి > వస్తూత్ప్రేక్ష, రూపక, ముద్ర అను అలంకారములు.

'పొలతుల్గొగిట గ్రుచ్చి యెత్తి'...అను పద్యములో 'భ్రాంతిమదాలంకారము' కనిపించును. కారణం 'గంగం తననీడ తానె జూచి వేరొక్క తొయ్యలి యని మౌగ్ధ్యముతో అసూయతో భ్రాంతిని చెందు పార్వతిని చూచి, క్రొన్నెలపూ తాలుపు యగు శివుడు మదిలో నవ్వుకొనుట జరిగినది.

------------------------------------

పాదసూచికలు:- [1] పారిజాతాపహరణ/ప్రథ/1

'సరసపుటల్క తీర్చుతరి' అను పద్యంలో శార్ఙ్గ, సుదర్శన, నందక, అబ్జములు [శంఖము] వరుసగా నెన్నడుముపై, కటిపై , జడమీద, మరియు, గళముపై వరుసగ నాల్గు చేతులతో ఇందిరను సుఖసంద్రంలో ఓలలాడించు అనునపుడు సక్రమంగా "క్రమాలంకారము" కన్పిస్తుంది. తిమ్మనగారే తమ పారిజాతాపహరణ ప్రబంధమున 'తన దంతాగ్రముచే తీక్ష్ణమతి ఉద్యత్కుంభ యుగ్మంబుచే' అను గణపతి స్తుతిలో పరికరాలాం కారమును ప్రయోగించినారు.

పరికరాలంకారమనగా –'విశేష్యము సాభిప్రాయమగుచో అది పరికరాలంకారము. గణపతి నిశితమగు బుద్ధినీ, విశాలమగు కుంభస్థల మువలె ఘనమగు స్థితిని, మదము ద్వారా పరిపాలనా శక్తిని, దీర్ఘమగు తొండము ద్వారా దీర్ఘాయువును కృపాయత్తైకచిత్తాబ్జుడై' ఇచ్చుగాక యని పరికరములను విశేష్యముగా చెప్పటము వలన పరికరాలంకారము.

'తనమృదుగీతికా పరిణత ధ్వని' అను సరస్వతీ స్తుతిలో వీణకు చెక్కులు మీటి పాటను నేర్పుచున్నదా యన్నట్లు ఉన్నదనుటచేత, ఉత్ప్రేక్షగా సాక్షాత్కరిస్తున్నది.

ఉత్ప్రేక్షయనగా...'ఉపమానమును ఉపమేయముగా గానీ, ఉపమేయానికి ఉపమానముగా గానీ ఊహించుట 'ఉత్ప్రేక్ష'యగును

దీనిని ప్రతీపభేదమనియు చెప్పడమున్నది.

'విజయవిలాసము'లో 'చేమకూర వేంకటకవి' గారి పద్యాలను కొన్ని పరిశీలిస్తే వారి ప్రతిభ ఇట్లు ప్రకాశమగును.

"శ్రీలెల్లప్పుడొసంగనీ సకలధాత్రీ చక్రముస్ బాహు పీ
ఠీలగ్నంబుగ చేయ దిగ్విజయమీ డీకొన్న చందాన నే
వేళస్ సీతయు లక్ష్మణుండు తను సేవింపంగ విల్ పూని చె
ల్వొ లీలస్ తగు రామమూర్తి రఘునాథీశ్వరుం బ్రోవుతస్' [1]

అను పద్యము విజయవిలాసమందలి పీఠికలోని మొదటి పద్యము.

-----------------------------------------------

పాదసూచికలు:- [1] విజయవిలాసము/పీఠిక/

సీతాదేవి లక్ష్మీదేవి అవతారమగుటచే ఆమె శ్రీలనొసగజాలినది. లక్ష్మణుడు ఆదిశేషుని అవతారమగుటచే భూమిని మోయుచున్న ఆ శేషుడు లక్ష్మణ రూపమున యుండి భూమండలమును బాహుపీఠమున నిల్ప జాలి యున్నాడు. ధనుర్ధరులలో అగ్రేసరుడగు శ్రీరాముడు దిగ్విజయమును పొందువాడు కనుక దిగ్విజయము నివ్వగలవాడని అభిప్రాయము. కనుక ముప్వురు మూడు కార్యములను నిర్వర్తింతురు. సీత సంపదలనిచ్చుట, లక్ష్మణుడు భూభారము మోయుశక్తిని , శ్రీరాముడు దిగ్విజయమునిడుట, అనుటవలన క్రమాలంకారము ప్రయుక్తము అయినది. ఆయనే తర్వాతి పద్యమగు 'శ్రీ కలకంఠకంఠియు ధరిత్రియు దక్షిణవామ భాగముల్ గైకొని కొల్వ...' అను దానిలో శ్రీరంగనాథుడు కుడి, ఎడమ ప్రక్కల శ్రీదేవి, భూదేవి నెలకొని యుండగా సిరి సంపదలతో తులతూగి,

ఆ శ్రీరంగనాథుని కుడి, ఎడమ నేత్రములగు సూర్యచంద్రుల వలె రాత్రి పవలు ప్రజారక్షణ చేయుట యందు ఆసక్తి కల్గి యుండునని భావము. ఇందులో శ్లేష రూపక అలంకారాలు ప్రస్తావితమైనవి. రంగనాథునివలె కృతి భర్త యగు రఘునాథ నాయకుడు భాసిల్లవలెనని కవి ఆశ.

మరొక ఇష్టదేవతా స్తుతిలో కవిగారు గణపతిని, వాణిని, ఒకే పద్యములో నుతించారు. 'మాద్యద్దంతి ముఖార్చనా నియమమున్ పాటించు నెల్లప్పుడున్' అనుదానిలో రాజులు గజముఖమును పూజించుట సంప్రదాయము. గజముఖ పూజ తనపూజగా, విద్వత్పూజ తనకు చేయుపూజగ సరస్వతి తృప్తిని పొందుదురని వ్యక్తమైన భావము. ఇందులో వేంకటకవి శ్లేషను ప్రయోగించుట చూడగలము. పలు అర్థములు గల పదములతో చేయబడు విన్యాసమే కవితాలోకాన శ్లేషగా చెప్పబడును. వేరొక పద్యములో 'ప్రాగల్భ్యంబున విష్ణు శంభు మతముల్ పాటించి'

అనుదానిలో సాధారణముగా ప్రభువులు శైవ, వైష్ణవ మతములలో ఒక దానికి అధిక ప్రాధాన్యము ఇచ్చుట వాస్తవము. కానీ ఇచ్చట రఘునాథ నాయకుడు సర్వమతములను సమానముగా ఆదరించుచున్నాడు. రాజలోకంబులో అనుప్రయోగములో 'రాజు' అనగా

చంద్రుడు  లక్ష్మికి అన్న. కనుక రఘునాథనాయకుడంటే లక్ష్మికి ప్రీతిపాత్రుడు. ఇక శివుడు తన శిరమున చంద్రుని ధరిస్తాడు. తన పతి తలపై అలంకారముగా నిల్చిన రాజును గౌరీదేవి కూడా రఘునాథుడంటే ఆదరము చూపుతుంది. ఈ రీతిగా శ్రీ గౌరులు రాజ్యమును, సంపదను ఇత్తురని క్రమములో తెల్పుట ద్వార క్రమాలంకారమును ఇక్కడ కవి ప్రయుక్తము చేసినారు.  'మొగుడుందమ్ములు విప్పునప్పుడు రజంబున్' అను పద్యములో సూర్యుడు బ్రహ్మ విష్ణు, శివ రూపములను దాల్చిన తేజోనిధియని మూడుమూర్తుల రూపముయని రూపకములో  రూపించుట గలదు. ఇంతకూ మునుపు వేర్వేరుగా త్రిమూర్తులను స్తుతించిన కవి ఇచ్చట ప్రత్యక్షభగవానుడగు సూర్యుని త్రిమూర్త్యాత్మకుడని నుతించుట, బ్రహ్మ రూపున సృష్టిని(రజోగుణము), శివుని (తమోగుణము) లయకారుడుగా, విష్ణువును (సత్త్వ గుణము) స్థితికారునిగా పేర్కోవడం విశేషము. ఆంధ్ర భోజుడు, సాహితీసమరాంగణ సార్వభౌముడు మొదలగు బిరుదులు కలిగియున్న రాజు, కవిరాజు శ్రీకృష్ణదేవరాయలు.  ఆయన రచించిన ఆముక్తమాల్యదలోని కొన్ని అలంకారములను ప్రస్తావింతము. ప్రథమా శ్వాసములో ఇష్టదేవతా స్తుతిని వేంకటభర్తను కొలుచుట ద్వారా ఆరంభించినారు. రాయలవారు పరమ వైష్ణవాభిమాని. ఆయన క్రమంగా  వేంకటపతిని, అనంతుని, గరుడుని, విష్వక్సేనుని కాంచన వేత్రాన్ని, పాంచజన్యాన్ని, నందకాన్ని, కౌమోదకిని, శార్ఙ్గాన్ని, సుదర్శనాన్ని, పిదప వైష్ణవ సూరులగు పన్నిద్దఱు ఆళ్వారులను నుతించినారు.

' శ్రీకమనీయ హారమణిచెన్నుగ తానును కౌస్తుభంబునం
దా కమలా వధూటియు నుదారత తోప పరస్పరాత్మలం
దాకలితంబు లైన తమ యాకృతులచ్చత పైకి తోచి య
స్తోకత నందు తోచెనన శోభిలు వేంకట భర్త కొల్చెదన్" [1]

---------------------------------------

పాదసూచికలు:- [1]  ఆముక్త/ప్రథ/1

ఇందులోలక్ష్మీ వెంకటేశ్వరులు ఒకరికొకరు ఎదురుగ నున్నపుడు వారి మూర్తులు బింబ ప్రతిబింబములుగా అగపడినవని వ్యక్తము చేయుట ద్వారా 'ఫలతను హేతుత వస్తుత నలరెడు సంభావనంబులగు నుత్ప్రేక్షల్' ఇచట ఉత్ప్రేక్షాలంకారము ప్రాయోజితమైనది. ఇక రాయలవారు అనంతుని ఒక మత్తేభములో నుతించినారు.

' సిరినొక్కప్పుడు కన్మొఅంగి హరిదన్జేర న్బ్రహర్షించు ను

ర్వరకు న్వంచన కూడా కా గలుగు భాస్వచ్ఛంద్రశాలా పరం

పరలయ్యె.' అని తెల్పినారు. ఇచట అనంతుని ఫణములు చంద్రశాలలని సంభావించుట వలన అలంకారము ఉత్ప్రేక్షగా విలసిల్లినది. గంభీరపద గుంఫనముతో కూర్చబడిన పక్షీంద్రుని నుతి 'ఖ నట త్పయోబ్ధి వీక్ష్య రసాతలాన్యోన్య పిండీకృతాంగ భీతాండజములు...' అను సీసపద్యములో

గరుడుని రెక్కల గాలికి సంద్రములోని జలమంతయు ఎగసిపడుటవలన పాతాళమందలి పాములు, గరుడుని చూచి భయపడి ఒకదానికొకటి చుట్టుకొని ముద్దలు ముద్దలుగా తమ రూపమును మార్చుకొనినవని చెప్పటము 'అత్యుక్త్యలంకారము' 'సంబంధాతిశయోక్తి' అని మరో వ్యాఖ్య. ఇందులోనే సర్పములు ఒండొంటితో పెనవేసికొని చుట్టుకొనె ననినపుడు స్వభావోక్తి కనిపించుచున్నది. సమిల్లవరూప అను సమాసమువలన ఔపమ్యము చెప్పబడినను సంభావనయందే తాత్పర్యము కావున ఉత్ప్రేక్ష ప్రత్యక్షమగుచున్నది. పిదప 'ఆ మ్రోతతోడ ఆ రెండు పర్వతములు ఒక జంటభేరి అనుట వలన రూపకాలంకారము నిరూపింపబడుచున్నది. గరుడుడు మహావేగముతో పయనించునపుడు జనించిన మారుతబలము వలన దిక్పాలకులు తమ పట్టణములనుండి వేరు దిశలలోనికి పోయి పడిపోయినారు - అనినపుడు 'అత్యుక్త్యలంకారము' ప్రయుక్తమైనది. వైష్ణవ సేనానాయకుడగు విష్వక్సేనుడు కాంచన బెత్తమును ధరించి రెండవ విష్ణువు వలె వర్తించుచూ, ' పూని ముకుందు నాజ్ఞకనుబొమ్మనె కాంచి అజాండభాండముల్వాననుమీద బోవ నడువ...' అనినపుడు, శ్రీమన్నారాయణుని యొక్క

సేనాపతిసర్వకార్య నిర్వహణ చేయుచు, కాంచన వేత్రము కదలిక సృష్టిని, ఆగినచో లయమును చేయ కలిగినదని పేర్కొన్నపుడు ఉత్ప్రేక్షాలంకారము విశదమగుచున్నది.

పాంచజన్య వర్ణనలో హరి, పూరింప, మారుత, కృష్ట, పంకరు, క్రోడ, బృంద, రెక్క, దుష్క్రియా, సంకర, పరంపర, రేఖ, రాకా, నిశాకరగౌర, ఇత్యాది శబ్దములలో 'ర' కారము పలు రూపములలో అరుదెంచి వృత్త్యనుప్రాస అను శబ్దాలంకారము కొంతవరకు శబ్దముచేయుట పరికింప వచ్చును. ఇక నందకమును వర్ణించిన సందర్భములో 'ప్రతతోర్ధ్వాధర భాగ పీఠ యుగళీ భాస్వత్త్సరుస్తంభ సంస్థితి.....' అనుపద్యములో నందకమందు విజ్ఞాన దీపాంకురత్వము సంభావింప బడినది. కావున ఉత్ప్రేక్షాలంకారము. మరియు, నందకము భాగములందు దీపస్తంభముల ఆరోపణచేత అచ్చట రూపకాలంకారము నిరూపితమైనది. 'యాదవసార్వభౌమ భయదాయత బాహు నియుక్తి చేసి యెందే దనుజేంద్ర ......' అను కౌమోదకి గదా వర్ణనలో హేమరత్నమయమైన సౌభక సాలము కౌమోదకీ వలయముగా సంభావితము గావున ఇచ్చట ఉత్ప్రేక్ష, మరియు 'మోదకి మోదకీ' లో వృత్త్యనుప్రాస అలంకారాలున్నవి. ఆపై శార్ఙ్గమును స్తుతించినపుడు, పిడికెడు కౌను కొప్పుగని ప్రేమ త్రివక్ర సమాంగి చేసి తే ....' అను చంపకమాలా వృత్తములో రాయల వారు మొదటి రెండు పాదములలో ఎనిమిది అక్షరాలు ఒకే రీతిగా ప్రయోగించి శబ్దముపై తనకు గల ఆధిపత్యమును నిరూపించినారనిపించును. ఇట త్రివక్రను వక్రహీనగ చేసి సుందరిగ మార్చిన విషయము చెప్పడమున్నది.

ధనువు వంగుటచేత వినమ్రత చూపినటుల చెప్పడంవలన 'ఉత్ప్రేక్ష'. విష్ణువు యొక్క సుదర్శనచక్రమును నుతించినపుడు 'అడరు గళాస్త్ర ధారలు మహాముఖవాంత సుధాంబు ధారలు...' మంటలు ఎప్పుడును ఊర్ధ్వముఖముగానే పయనించును కనుక ఆ సామ్యమును సిద్ధింప చేయుటకుగాను 'అడరు' శబ్దము వ్యక్తము చేయుట కలదు. రాహు మస్తకము పెఱ దైత్య కోటికి ఎసరు వెట్టిన పనంటిగా ఉత్ప్రేక్షితమైనది. ఆపై పంద్రెండుమంది ఖ్యాతి వహించిన సూరులను స్మరించుట జరిగినది. వారు - సరో, భూత, భక్తిసార,

మధురకవి, శఠకోప, కులశేఖర, విష్ణుచిత్త, గోదాదేవి, భక్తాంఘ్రిరేణు, ప్రాణనాథ, పరకాళ, తిరుమంగ అనువారలు. వారు మోక్ష సామ్రాజ్య ధురంధరులు కావున మొక్షార్థమై కవి వారిని ఆశ్రయించుచున్నాడు. ఇచ్చట దీనిని 'ఫలోత్ప్రేక్ష' గా చెప్పడమైంది. దశరథరాజ నందనచరిత్ర యందు మొదటి పద్యము ఇలువేలుపగు నరసింహుని నుతితో కూడినది.

సీ. సిరివరించిన మేలు గిరిధరించిన కేలు
తనరువాడు శుభోక్తి నొనరువాడు
చిలువరాయని పాన్పు నలువ పాయని కాన్పు
కలుగువా డసురుల కలుగువాడు
పులుగు తత్తడి పోక జిలుగు పుత్తడి కోక
గట్టువాడు అమరులపట్టువాడు
తెలిదిన్నె పై అచ్చ మెలిగొన్న యెదమచ్చ
మెఱయువాడు కృపాబ్ధి నెఱయువాడు

గీ. హాటక నిశాట వక్షః కవాట వాట పాటనోద్భట శతకోటి పతుల చటుల
శిత నఖంబులవాడు లక్ష్మీ నృసింహు డెలమి మా ఇలువేలుపై నిలుచు గాక.[1]

అంత్యానుప్రాసముతో కూర్పబడినది. ప్రాసయతి పాటింపబడినది. వృత్త్యను ప్రాస కలిగినది.

'అల్లసానిపెద్దనామాత్యుడు' రచించినది 'స్వారోచిషమనుసంభవము' మనుచరిత్ర అని చాలామందికి తెలిసిన పేరు. కృష్ణరాయలవారికి ఇది అంకితమైన గ్రంథము. తొలిపద్యము

శా "శ్రీవక్షోజ కురంగనాభ మెదపై చెన్నొంద విశ్వంభరా
దేవిన్ తత్కమలా సమీపమున్ ప్రీతిన్ నిల్పినాడో యనం
గా వందారు సనందనాది నిజభక్త శ్రేణికిన్ తోచు రా
జీవాక్షుడు కృతార్థు జేయు శుభ దృష్టిన్ కృష్ణ రాయాధిపున్" [2]

------------------------------------------------------------

పాదసూచికలు:- [1]దశర/ప్ర/1 [2] మనుచరిత్ర/1 వ పద్యము.

'కావ్యం యశసే(అ)ర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే, సద్యః పర నిర్వృతయే కాంతాసమ్మిత తయోపదేశయుజే' అను ఆలంకారిక ప్రామాణ్యము అనుసరించి, 'ఆంధ్రకవితాపితామహుడు' శ్రేయమునకు సాధనమ్మని చక్కని కావ్యమును, 'ఆశీర్న మస్క్రియావస్తు నిర్దేశోవాపి' అను మూడు విధములలో ఒకటగు ఆశీర్వాదరూపమును గ్రహించి ప్రబంధమును నిర్మించాడు. లక్ష్మీదేవిని కౌగిలించికొన్నప్పుడు ఆమె పాలిండ్ల మీదుండిన కస్తూరి దేవరవారి బొమ్మునకు అంటుకున్నది. ఆ సమయాన ఆయనను సందర్శింపవెళ్ళినారు నిజభక్తులగు సనకసనంద నాదులు. వారు నిత్య బ్రహ్మచర్యవ్రతులు. వారు వెన్నుని వక్షముపై యున్న కస్తూరిని భూదేవిగా తలచినారని కవి చమత్కారము. ఇచ్చట భ్రాంతిమద అలంకారముచే ఉజ్జీవితమగు ఉత్ప్రేక్షగ ప్రత్యక్షమైనది. లక్ష్మి స్తన కస్తూరి భూదేవియని మునులకు తోచుట గంధర్వుడు వరూధినికి ప్రవరునివలె తోచుటకు సూచన యని భావముతో కావ్యార్థ సూచనగా భాసిల్లినది.

'ఉల్లమునందు నక్కటికమూనుట మీకులమందు కంటిమంచల్లనమేలమాడు అచలాత్మజమాటకు...' అనుపద్యములో కిరాతునియందు దయారసోత్పన్నమను విషమ కార్యోత్పత్తి చెప్పబడుట చేత ఇచ్చట విషమాలంకారము ప్రయుక్తమైనది.

విషమాలంకారలక్షణము

" అననురూపములైన వానికి ఘటన వర్ణింపబడిన - విషమాలంకారము

ఇచ్చట కిరాతుని యందు దయారసముత్పన్నమగుట విషమ కార్యము.

బాలవినాయకుని బహు సుందరముగా నుతించినాడు పెద్దన. 'అంకముజేరి శైలతనయాస్తన దుగ్ధములాను వేళ బాల్యాంక విచేష్ట తొండమునవ్వలిచన్ కబళింపబోయి ఆ వంక కుచంబు కానక' లో,

సగము పతి మేను గ్రహించినది శైలజ. బాలుడగు గజాననునికి చనుబాలు తాగించు సమయమున ఆవైపు కుచమును తాకబోయినాడు తొండముతో బాలగణపతి అటువైపు సగము అయ్యది. నాగహారమును తాకడమైనది దానిని తామరతూడుగ భావించినాడు

విఘ్నేశ్వరుడు. ఇచ్చట ఒకదానిని వేరొకదానిగా భావించుట జరిగినది కనుక "భ్రాంతిమదలంకారము" దీనికి లక్షణము : ఉపమాన ఉపమేయములలో ఒక వస్తువును వేరొక వస్తువుగ భావించి భ్రాంతి చెందిన (ఊహించిన) అది 'భ్రాంతిమదలంకారము'.

నలువరాణిని తన మదిలో వెలయవలెనని పెద్దనగారి పెద్ద ఆకాంక్ష.

"చేర్పుక్కగానిడ్డ చిన్ని జాబిల్లిచే సిందూర తిలకంబు చెమ్మగిల్ల నవతంస కుసుమంబునందున్న యెలతేటి రుతి కించిదంచిత శ్రుతులనీన..." అను శారదాదేవి స్తుతిలో చేరుచుక్కగా తాల్చిన బాలచంద్రుని వలన చెందిరపు బొట్టు చెమరు క్రమ్మగా, బింకపుగుబ్బలయొరపున వీణసొరకాయ అదరగా, ఉపనిషత్కాంతలు సభదీరగా తెల్లతమ్మియ గద్దిమీద ఆసీనమైన చదువులతల్లిని సంస్తుతిచేసిన పద్యంలో అతిశయోక్తి, తద్గుణాలంకారాలు విలసిల్లినవి. అతిశయమనగా ఒక వస్తువు యొక్క నిజస్థితిని గాక అతిశ యించి చెప్పినచో 'అతిశయోక్త్యలంకార' మనబడును. స్వగుణములను విడుచుటచే అన్యగుణములను గ్రహించిన 'తద్గుణాలంకారమ'నబడును

పవననందన కరుణాసమాసాదిత సంస్కృతాంధ్రకవితాసామ్రాజ్య ధురంధరుడు, సంగీతసాహిత్యవిదుడు, రామరాజభూషణుడు. అతడు సమస్త ఫలసాధన భూతమగునని వసుచరిత్రమును అద్భుతమైన ప్రబంధముగా వినిర్మించినాడు. 'శ్రీభూపుత్రి వివాహవేళ నిజమంజీరాగ్ర రత్న స్వలీలాభివ్యక్తి వరాంఘ్రి రేణుభవకన్యాలీల యంచు...'అను మొదటి పద్యములో సీతాదేవి తన వివాహ కాలమునందు తన అందియలలోని రత్నమందు ప్రతిబింబమును చూచి రాముని పాదస్పర్శవలన రాయి స్త్రీగ మారినదని తెలిసి, రత్నవిషయముగా భ్రాంతి చెందుచుండగా సన్నెకల్లు త్రొక్కించుట అను నెపమున ఆ రత్నమును మాటుపరచి సీత భ్రాంతినితొలగించినాడు సీతాభామాపతి రాముడు. రత్నం భ్రాంతిని కలిగించడమైనది. కనుక భ్రాంతిమదాలంకారము ప్రాయోజిత మైనది. ఇంకా మరెన్నో అలంకారసంబంధ ప్రయోగాలు చూపవచ్చును. ఉదాహరణగా పైన కొన్ని అలంకార సంబంధప్రయోగాలు చూపబడినవి.

8.4 *వ్యాకరణ విశేషాలు : -* వ్యాకరణ మనగా పెద్దల నిర్వచనము ననుసరించి 'వ్యాక్రియంతే వ్యుత్పాద్యంతేస ధర్మాః శబ్దావయవాః యత్ర తద్ వ్యాకరణం' అని చెప్పడమున్నది. శబ్దసౌష్టవము, వాక్యనిర్మాణ ము, పదఘటనముఇత్యాది ప్రయోజనములను సాధించుటకు ఆధారమైనది వ్యాకరణము. ప్రాచీన సంస్కృత సాహిత్యముననుసరించి భాషాశాస్త్రమునకు పునాది వంటిది వ్యాకరణం. ఈ వ్యాకరణము తొమ్మిది విధములు.

వాల్మీకిరామాయణములోకిష్కింధకాండసర్గ 3 శ్లోకం 30 అనుసరించి, హనుమంతుని శ్లాఘించుచూ, రాముడు తన సహోదరుడగు సౌమిత్రితో 'నూనం వ్యాకరణం కృత్స్నం అనేన బహుధా శ్రుతం బహు వ్యాహరతానేన న కించిదపశబ్దితమ్' అంటాడు. ఇచ్చట సంస్కృతభాషాశాస్త్రమనుసరించి చూచినచో, పైన పేర్కొనినరీతిగానున్న వ్యాకరణాలు ఇవి. వరుసగా ఐంద్రం, చంద్రం, కాశకృత్స్నం, కౌమారం, శాకటాయనం, సారస్వతమ్, అపిశలం, శాకలం, పాణినీయం. నిరుక్త శాస్త్రం వర్ణాగమ, వర్ణవిపర్య , వర్ణవికార, వర్ణనాశ,అర్థాతిశయ అను ఐదు భాగాలతోకూడియున్నది. అసలు వేదపురుషునకు షడంగములు ఛందస్సు, కల్పము,జ్యౌతిషము, నిరుక్తము, శిక్ష , వ్యాకరణము అనునవి మానవశరీరమునకు పాద, హస్త, నేత్ర, కర్ణ, నాశిక, ముఖాదుల వలె ముఖ్యమైనవి.

కవులయొక్క కర్మ యగు గ్రంథము/కావ్యము నందునూ వ్యాకరణము ప్రముఖమగు పాత్ర వహించుననుటలో రెండవ ఆలోచన రాదు/రారాదు/రాకూడదు. ఒకవైపు శాస్త్రమర్యాదలను పాటించుచూ తమదగు విధానములో కావ్యమును సృజించిన కవికి లభించు గౌరవము అధికము. నిరంకుశోపాఖ్యానములో కందుకూరి రుద్రకవి చేసిన ప్రయోగము కొంత చూద్దాము. తనపట్టణమైన కందుకూరిలోని సోమేశ్వరుని స్తుతితో కవి తన కావ్యమారంభించినాడు. శ్రీకారముతో, శార్దూలవృత్తములో రచన మొదలైనది.

శ్రీభాషారమణీ విమృష్ట పదరాజీవోత్తమాంగార్చ్యుడార్యా భామా పరిణేత సర్వజగదా రాధ్యుండు... [నిరంకుశో/కం.రుద్రకవి/ప్రథమా/1] ఇచ్చట 'మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని' రచన వుండవలెనను పెద్దల ప్రమాణమనుసరించి ఆశీర్వాద, నమస్కారరూప, వస్తునిర్దేశాదులలో ఒకటైనఆశీర్వాద రూప మంగళమును కల్పించుట

జరిగినది. కేవలము శివునిగా కాక త్రిమూర్త్యాత్మకుడుగా భావించుట తద్వారా నాయకునికి లక్షణాలను ధ్వనింప చేయుట అని వ్యాఖ్యానింప వీలుకలదు. ధ్వని ప్రధానమైనది ఉత్తమ కావ్యమని పెద్దల మాట. స్మరణమాత్రమున ఐహికాముష్మికములను ఇచ్చువాడు కందుకూరి సోమేశ్వరుడు. శబ్దములతో కవి ఆడుకొనినట్లుగ విధాత వర్ణన కలదు. కావ్య నిర్మాణము సవ్యముగా జరుగుట కొరకు చతురాస్యుని చతురతతో ఇట్లు స్తుతించుట చూడగలము. “శతకోటి కల్పవాటీ, శతకోటి ద్యుతుల నవ్వు సతి కల్గిన యా చతురాస్యు నఖిలవిద్యాచతురాస్యు తలంచినాడు” అట్లే కొమ్ముపై తన సవతిని నిల్పినాడని పతి కొమ్ముపైనిల్చినట్టిది, అఖిలలోకాధీశుడైనవానిని ఇల్లరికపు అల్లునిగా చేసినట్టిది, తొలుత తనపేరు పతిపేరునకు ముందు చేర్పించుకొనినది, మున్నగు విశేషణములను వక్కాణించి 'గుణధన్య, కలుషశూన్య, సాధుమాన్య, కృపానన్య అని స్తుతింపబడిన కలుముల లలనను, అటుపై పుండరీకాసనమున కొలువుతీరినవాణిని నవరస పూరితములైన మనోహరవాక్సంపదకై ప్రణుతించుట ఇతర విషయాలనుప్రస్తావించి కావ్య నిర్మాణము చేయుట చేయుట కలదు.  మరికొందరు కవులు తమ భాషాపాటవము ధ్వనింపజేయుట చూడగలము. సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడని తన వాక్చాతురిని ప్రదర్శిస్తూ కృతిభర్త యగు రఘునాథనాయకునికి తేజస్సునొసగుగాక యని చేమకూరి వేంకట కవి తన విజయవిలాసములో చెప్పడము భాషాపరమైన వ్యాకరణ విశేషముగా వ్యాఖ్యానింప వచ్చును. సృష్టిజరుగుటకు రజో గుణము[బ్రహ్మ లక్షణము], రాత్రియగు సమయములో సూర్యాస్తమయ సమయములో తమోగుణము[శివుని లక్షణము], ఉదయాస్తమానముల మధ్య సత్త్వగుణము [విష్ణు లక్షణము] కలిగి దివాకరుడు హిరణ్యగర్భ, హర, హరి రూపుడై భాసిల్లుచున్నట్లు చెప్పడము చూడగలము.

వ్యాకరణపరమైన అంశములను ప్రత్యేకముగా ప్రస్తావించిన మరొక కవి వైజయంతీ విలాసకర్త యగు సారంగు తమ్మయ. కుకవులను నిందించుచూ 'గణశుద్ధియు, గుణ శుద్ధియు గణుతింపగ లేనివారు కవితలటంచుస్ గణములు తెలుపుకొనంగా గుణదోషము

లెంచనేల' యనడం కలదు. తొలుత క్రొత్త సంకేత పదములను పరిచయము చేసినవాడు నన్నె చోడకవి. ఇతడు 'జానుతెనుగు' ప్రశంస చేసినాడు. నన్నయ్యగారు చెప్పని పలు అలంకారశాస్త్ర నియమము లనుపాటించవలెననినాడు. అష్టాదశ వర్ణనలను ప్రస్తావించినాడు. సామాన్యజన వ్యవ హారమునకు ఎక్కువ సన్నిహితమగు పదాల ప్రయోగము చేయుట కలదు. ఇక తిక్కనసోమయాజి తెలుగుసాహిత్య భాషను విషమ మార్గామునున్దితప్పించి విశాల సమసుందరమైన మైదానములో తెచ్చి విడిచినాడని పెద్దలనుత కలదు. జన్మాంతర దుఃఖము తొలగునట్లు, భారతామృతము కర్ణపుటంబుల కరోలి ఆంధ్రావళి మోదంబొరయు నట్లు, తుదివరకు బుధసంతోషంబు నిండారగా రచియించినాడు. ఈ రీతిగా /తీరుగా పరిశీలించినచో వ్యాకరణమునకు సంబంధించిన వివధ కవుల ప్రత్యేకతలు వ్యక్తమగుచున్నవి. ఉచిత శబ్ద శ్లేష, అర్థశ్లేష, గౌణవృత్తిశ్లేష, సభంగశ్లేష, అభంగశ్లేష, సంస్కృతాంధ్రభాషాశ్లేష మున్నగునవి ప్రయోగించి రామాయణ భారత కథలను సమన్వయము కావించుకొని ద్వర్థి కావ్యమును వెలయించిన వాడు పింగళి సూరనగారు. ప్రబంధయుగములో జంటగా తెలుగు, సంస్కృతములు కలిసి సాహితీ సేవచేసినవి. ప్రబంధయుగములో రెండు భాషలు చక్కని ప్రయోగాలతో నిర్వహింబడినవి. అందొకటి ఆంధ్రభాషకు కల ద్వర్థి సామర్థ్యము. రెండవది శుద్ధాంధ్ర భాషకు సమగ్ర కావ్య రచన కనుకూలమని నిరూపించడము. ఈ కారణముల వలన అపూర్వ శ్లేష ఘటనాశక్తితో ఆంధ్రులకు అద్భుత కావ్యము రూపొంది మరిన్ని కొంగ్రొత్తరీతుల కబ్బముల లబ్ది జరిగినది.

కనుకనే 'రాఘవపాండవీయము'ను ప్రశంసిస్తూ కృతిభర్త ఆకువీటి ప్రభువైన శ్రీ పెదవేంకటాద్రి విభుడు, " రెండర్థంబుల పద్యమొక్కటియు నిర్మింపంగ శక్యంబుగాకుండుస్" అట్టియెడ ఒక కావ్యమును నిర్మించుట 'ఓహో!' యనిపించుకొనునని వక్కాణించుట చూడగలము. ప్రకృతి పరిశీలన కవుల సహజ లక్షణము. వ్యాకరణమావిధమైనది కాదు. పలువిషయ విశేషములను భావిలో పరిశోధకులు పరిశీలించి తగు భాషా సేవ చేయవలెను.

8.5 *ఆలంకారిక ప్రయోగములు :-* కవితా చమత్కారములతో విషయములను వివరించుట కొందరి కవుల కల్పనా సామర్థ్యము. అట్టివి ఒకటి రెండు ఉదాహరణకు పేర్కొందాము. ఒకరకముగా చెప్పవలెనంటే ఇది మార్మిక కవిత. పదములలోని రహస్యమును గ్రహించిన కలుగు ఆనందం చెప్ప నలవి కానిది. ఆ పద్య మర్మమును ఛేదించుటకు కొంత శ్రమ, ఆలోచన అవసరము.

చ. "కరిముఖుడశ్వినుల్ శ్రుతులు కంజసముద్భవు మోములంబికే
శ్వరు మొగముల్ తదాత్మజుని వక్త్రములాదిమునీంద్ర మండలం
బురగ పతుల్ గ్రహంబులు పయోరుహనాభుడు తారకంబులున్
బొరిబొరి నెల్లసంపదలు వోలమగుండనికిచ్చుగావుతన్"[1]

బింబ ప్రతిబింబములవలె యున్నవని కొన్ని పద్యములను తెల్పడ మున్నది. ఆ పరిశీలన ఇప్పటికి మనకు అవసరము లేదు. మన లక్ష్య సాధనకుపకరించునది ఇష్టదేవతా స్తుతి. ఇచ్చటి మార్మిక పద్యకవిత లోని విషయముచూచెదము. పద్యమును విభజించి చూచిన యెడల

కరిముఖుడు అశ్వినుల్, శ్రుతులు, కంజసముద్భవు మోములు, అంబికేశ్వరునిమొగములు, తదాత్మజుని వక్త్రములు, మునీంద్ర మండలం , ఉరగపతుల్, గ్రహంబులు, పయోరుహనాభుడు, తారకంబులున్ -- అను పదముల అర్థములు పరిశీలిద్దాము.

*కరిముఖుడు* = గణపతి[ఒకడు],

*అశ్వినుల్* = అశ్వినీదేవతలు [ఇద్దరు]

*శ్రుతులు* =రుక్,సామ,యజుర్వేదములు [మూడు] { స్త్రియామృ క్సామ యజుషీ అని అమరకోశము పుట/124},

---------------------------------------------------------------

పాదసూచికలు:- [1]కేయురబాహు/2

*కంజ సముద్భవుమోముల్* = కమలమందు జనించినవాడు బ్రహ్మ అతని మోములు [నాలుగు],

*అంబికేశ్వరు మొగముల్* = పార్వతీ పతియైన ఈశ్వరుని ముఖములు {సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన} [అయిదు], *తదాత్మజుని వక్త్రములు* = పైన చెప్పబడిన అంబికాపతియొక్కసుతుడు

అయిన కుమారస్వామి యొక్క ముఖములు అనగా [ఆరు] {షడాననుడు =ఆరు ముఖములు కలవాడు స్కందుడు},

*ఆదిమునీంద్ర మండలము* సప్తర్షులు [అనగా ఏడుగురు]

[ఎవరెవరు సప్తర్షులు అని చూడగా పలు రూపాంతరములున్నవి]

అమరకోశముననుసరించి, "సప్తర్షయో మరీచ్యత్రిముఖాశ్చిత్ర శిఖండినః" సప్త ఋషయః మరీచ్యత్రిముఖాః చిత్ర శిఖండిన ఇత్యుచ్యంతే. మరీచిః అత్రిః అంగిరాః పులస్త్యః పులహః క్రతుః వసిష్ఠ శ్చేతి సప్తైతే ఋషయః"

అత్రి, అంగిరస్సు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - అను వీరు ఏడుగురు సప్తర్షులు.

*ఉరగపతులు* = సర్పరాజులు [ఎనిమిది] {అష్ట నాగములు అనగా అనంతుడు, వాసుకి, తక్షకుడు, శంఖుడు, కులికుడు, కర్కోటకుడు, పద్ముడు, మహాపద్ముడు అను ఎనిమిది మంది సర్ప రాజులు}

*గ్రహములు* = నవగ్రహములు [తొమ్మిది] గ్రహాలు 9 > ఆదిత్య, సోమ, కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు , శని, రాహు, కేతు – అనునవి.

*పయోరుహనాభుడు* [పయోరుహము = పద్మము, నాభుడు = నాభియందు కలవాడు] = విష్ణువు {మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన పరశురామ రామ కృష్ణ బుద్ధ కల్కి} అను దశ అవతారాలు ధరించినవాడు.

*తారకంబుల్*: 'అశ్వని' మొదలు 'రేవతి' వరకు గల 27 తారకలు అని గాని ఆకాశ వీధిలో సాక్షాత్కరించు లెక్కకు మిక్కిలిన నక్షత్రాలు కానీ ....

వీరందరూ గుండన మంత్రికి సంపదలనిత్తురు గాక యని ఆకాంక్ష.

సంఖ్యా వాచకమును ప్రయోగించి చేసిన చమత్కారము. ఒకటి నుండి ప్రారంభించి అనంతమైన తారకల వరకు అందరూ సంపదలందించ వలెనను ఆశ ఆవిష్కారం అయినది. ఇట్టిదే మరొక మార్మిక పద్యం. పద్యమును చదివినప్పుడు సమస్యగా నుండును. కానీ వాటిలోని సంకేతములో, కవిసమయములో, ప్రసిద్ధాంశాలో, గ్రహించి వాటి ఆధారముగా సమస్యగా కనిపించు విషయమును విశ్లేషించినచో అసలైన విషయము ఆవిష్కరింపబడి, చదువరులకు ఆనందము కలిగించును. మరొక చమత్కారముతో కూడిన పద్యము. పద్యమును చదివినప్పుడు సమస్యగా నుండును. కానీ వాటిలోని సంకేతములో, కవిసమయములో, ప్రసిద్ధాంశాలో, గ్రహించి వాటి ఆధారముగా సమస్యగా కనిపించు విషయమును విశ్లేషించినచో అసలైన విషయము ఆవిష్కరింపబడి, చదువరులకు ఆనందము కలిగించును.

"సలిల విహారులిద్దఱును సంతత కానన చారులిద్దఱున్
వెలయగ విప్రులిద్దఱును వీరపరాక్రమశాలులిద్దఱున్
పొలతుల డాయువాడొకడు భూమిని చరించువాడు నొక్కడున్
చెలువుగ మీకభీష్ట ఫలసిద్ధి ఘటింతు రనంతకాలమున్"[1]

ఇందులో మర్మమును కొంత పరిశీలించినచో మనకు లభించు భావము.

సలిల విహారులిద్దరు = జలచరాలైన మత్స్య, కూర్మ అవతారాలు

కానన చారులు = అడవిలో తిరుగు వరాహ, నరసింహ అవతారాలు

వెలయగ విప్రులు ఇద్దరు = వామన, పరశురామ అవతారాలు

వీరపరాక్రమ సాలులిద్దరు = శ్రీరామ, బలరామ అవతారాలు పొలతులడాయువాడు = కృష్ణ అవతారము, భూమి చరించెడువాడు = కల్కి అవతారము ఇట్లు ఈ అవతార మూర్తులు మీకభీష్టఫలసిద్ధి కల్గింతురు గాక. ఇట్టిదే మరొకటి చూద్దాం.

---

పాదసూచికలు:- [1] తెలుగు చాటు కవిత్వ/88 డా.సం.నరసయ్య

'పాండురంగని తన పదగుంఫనముతో అర్చించినవాడు, 'తెనాలి రామలింగకవి', 'పాండురంగ మాహాత్మ్యము'లో. [అశ్వాసము 3/102] ఇచ్చట కవి ఒక చమత్కారము చేసినాడు. నిగమశర్మ ఉపాఖ్యానంలో భార్యా పుత్ర వియోగంతో పరితపిస్తున్న నిగమశర్మ, సంగమ తీర్థములో స్నానం చేసి నృసింహస్వామిని పలుమార్లు చూచుచు, తాదాత్మ్యము చెందినాడు. ఇచ్చట నిగమశర్మచేష్టలు దశావతారములతో పోల్చడము కవి ఘనతకు దర్పణము పడుతున్నది. ఐతే ఇది కావ్యము మధ్యలో. ఆ పద్యమును ఒకసారి చూద్దాము.

సీ. ఒకింత ఱెప్పవేయక చూచు పెఱవారి - మత్స్యావతారం

తలగొట్టుకొని దుఃఖ జలధిమునుగు – కూర్మావతారం

బిలము తెఱవుమంచు పృథివిలోచొరబాఱు – వరాహావతారం

సమదిక స్తంభోద్భవము గమించు – నృసింహావతారం

తిరియువాడును బోలె దెసలకు చేయి చాచు – వామనావతారం

తొరగు నస్రాంబుధి తొప్ప దోగు – పరశురామావతారం

'హా! పోయితే!' యని అఱచు భార్య గుఱించి – రామావతారం

బహు విధేరాసక్తి భ్రాంతి పొందు – బలరామావతారం

గీ. చేరగారాని దర్శనస్థితి వహించు - బౌద్ధావతారం

బాడబ స్ఫూర్తి లోగొన్న పగిది నుండు – కల్కి అవతారం

దానవారాతికొబూని తదవతార

దశకమును మున్నెతాల్చెనా ధరణి సుతుడు.[1]

---

పాదసూచికలు:- [1] పాండురంగ మాహాత్మ్యము/ తెనాలి రామలింగకవి/ అశ్వాసము 3/102

8.6 *కవుల ఊహా వైదగ్ధ్యము :-* ప్రకృతిని చూచి పరవశించువారు కళాకారులు. ప్రకృతి / భగవంతుడు/పరాశక్తి పేరేదైనా నిత్యం చైతన్యముతో విలసిల్లుతూ ఉంటుంది. అది దాని సహజ లక్షణం. కవులు కూడా నిత్యం పరిశీలన జరిపి తమ ఎదుటగల ప్రకృతిని, ప్రజలను సంఘమును పరిశోధించి తమ గ్రంథాలలో తద్విషయాలను లిఖితపూర్వకంగా చేసిదానికి ఒక శాశ్వతత్వమును కల్పిస్తారు. కనుకనే సప్తసంతానాలలో కావ్యము కూడా చోటుచేసుకున్నదనడం. ఆయా సమయాన్ని సందర్భాన్ని అనుసరించి కవులు తాము తెలుసుకొన్న విషయాన్ని ప్రజా/ సంఘ ఉపయోగార్థము గ్రంథరూపంలో ప్రకటిస్తారు. అవి సంఘమునకు ఉపయోగపడే ధర్మాలు కావచ్చు, నీతులు కావచ్చు మరేదైనా ఉపయోగకరమైనది కావచ్చు.

కోపము ఒక వ్యక్తికి కలిగించు హాని , ఓర్పు కలిగి ఉండుటవలన కలుగు లాభము, దయ కలిగి ఉండుట, దొరికిన దానితో సంతసము అనుభవించుట ఇత్యాది విషయములు తన అనుభవమును పురస్కరించుకొని బద్దెన కవి తన సుమతి శతకములో ఒక పద్యాన్ని మనకు అందించినాడు. ఆ పద్యము -

'తన కోపమెతన శత్రువు తన శాంతమెతనకు రక్ష దయ చుట్టంబౌ
తనసంతోషమె స్వర్గము, తన దుఃఖమెనరకమండ్రు తథ్యము సుమతీ! ఇందులో గల విషయాన్ని అతి జాగ్రత్తగా వ్యాఖ్యానిస్తే అనేకమగు జీవిత సత్యాలు అవగతమగును. కోపము వలన కలుగు నష్టాలు, దయ వలన లభించు లాభాలు, సంతోషముగా జీవితాన్ని గడుపుకోవడం ద్వారా కలుగు సౌఖ్యము ఇలా పలు విషయాలు మన జీవితానికి అనుసంధించుకోవడం ద్వారా సుఖతర జీవితాన్ని మనము గడపగలగడం చేయవచ్చు. కవుల భావ గంభీరతను అంచనా వేయడము సులభము కాదు. వ్యాఖ్యాతల సహాయమును తీసికొని పఠించినప్పుడుఅందులోని దాగియున్న సరికొత్త విషయాలు బహిర్గతమగును. మహా కవుల విషయములో కూడా ఇట్టి విషయము జరిగినదే. మరొక్క విశేషము ఏమంటే సాధారణ పాఠకునికి వ్యాఖ్యాతల సహాయమున కవుల యొక్క

ఊహావైదగ్ధ్యము తెలిసే అవకాశము కలుగును. కొన్ని ప్రయోగాలను పరిశీలించి కవుల ఊహావైదగ్ధ్యము గమనిద్దాము. ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత అనునవి పరమేశ్వరుని ఐదు రూపాలు. ఇందులో సద్యోజాత ముఖమును వర్ణిస్తూ ఇట్లు చెప్పడమున్నది.

'ప్రాలేయాచల చంద్రకుంద ధవళం గోక్షీర ఫేన ప్రభం

భస్మాభ్యక్త మనంగ దేహ దహన జ్వాలావళీ లోచనం|

బ్రహ్మేన్ద్రాది మరుద్గణై స్స్తుతి పరైరభ్యర్చితం యోగిభిః

వందేహం సకలం కళంకరహితం స్థాణోర్ముఖం పశ్చిమం|| *ప్రసిద్ధం

{మంచుకొండవలె, చంద్రునివలె, మల్లె పూవువలె తెల్లనైనదీ, ఆవుపాలనురుగు వలెతెల్లని కాంతి కలదీ, విభూతి పూయబడినది, మన్మథ దేహాన్నిదహించే జ్వాలలకు మూలమైనది, స్తుతి చేయుచున్న బ్రహ్మేంద్రాది దేవతలచే, మరియు యోగులచే పూజింపబడునదీ, నిర్మల మైనదీ, నిండైనదీ అయిన శివుని పశ్చిమ ముఖానికి నమస్కారము. ఇది సత్త్వగుణ ప్రధానమైన ముఖము. శివుడు సరస్వతి ఒక వర్గము అని ముందే చెప్పడము జరిగినది. ఆ సాత్త్విక లక్షణాలను అనుసరించి సరస్వతిని కూడా సత్త్వగుణ ప్రధాన దేవతగ భావన చేయటము సహజము. కనుకనే దేవతా స్తుతులలో పోతనమహాశయుడు తాను చేసిన ఇష్ట దేవతా స్తుతులలో తొలుత కృష్ణునికి, శివునికి, విధాతకు, ఒక్కొక్క పద్యమును 'నిఖిల భువన ప్రధాన దేవతా వందనము' చేసినాడు. అటుపైన మూషకసాది యగు గణపతికి ఆదరముతో మ్రొక్కులిడినారు. సిరికి, గిరిజకు చెరొక పద్యములో స్తుతి చేసినాడు. శారదకు మాత్రము నాలుగు పద్యాలలో నుతి కావించుట కలదు. ఇందులో 'అంబ నవాంబుజోజ్జ్వల' అనునది ఎర్రన గారిది ముచ్చటపడి భక్తితో స్వీకరించినారనుకొన్నను, పుస్తకరమ్య పాణికి, బ్రాహ్మికి, భారతికి 25% పద్యాలను ఇష్ట దేవతా స్తుతులలో సమర్పించినారు. భారతీ యను సంబోధన ఎర్రన చేసినదానిని మరలా చేసి పలుకుల లలనపై తనకు గల భక్తిని, గౌరవాన్ని ద్విగుణీకృతము చేసుకున్నారు. శంకరుని సోదరి కనుక శారద కూడా తెలుపు వర్ణయుతమైనదే. కనుకనే

'శారద నీరదేందు ఘనసార పటీర మరాళమల్లికా
హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సుధాపయోధి సితతామర సామర వాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మది గానగ నెన్నడు గల్గు భారతీ'[1]

శరన్మేఘకదంబము, శరత్కాల చంద్రబింబము, పచ్చకర్పూరం, పటీరము [చందనము] రాజహంసలు, జాజిచెండ్లు, నీహారము [మంచు], డిండీరము, వెండికొండ, రెల్లుపూలు, ఆదిశేషుడు, మల్లెలు, మందారాలు, పాలసంద్రం, పూచిన పుండరీకాలు, అమరవాహినీ మున్నగునవి – భారతికి, ఉజ్జ్వల ఉపమానాలు. అట్టి స్వచ్ఛమగు ధవళ సుందర మూర్తియగుఆ తల్లిని మనసుదీరా ఎన్నడు చూడకల్గుదునోగదా యని కవి ఆలోచన. పై రెండింటిలోనూ కొన్ని సహజముగా దొర్లిన ఉపమానాలు మంచుకొండ, చంద్రబింబము, మల్లెపూలు, ఆవుపాలనురుగు, అనగా కవుల మనస్సులలో కొన్ని విషయాలపట్ల సహజముగా కనిపించు భావనలు. ఈ పద్యములో 13 'ర' కారాలు ప్రయోగించుట జరిగినది. ఒకే హల్లు పలుమార్లు పునః పునః వచ్చి వృత్యనుప్రాసాలంకారమను శబ్దాలంకారము వాడబడినది. పోతన శబ్దముపై ప్రీతి కలవాడని కొందరనటం కలదు. ఆపాతమధురమైనది నాదము. నాదోపాసన ద్వారా పాఠకులను రంజించుట ఆ మహానుభావుడు చేసినాడు. పిదప 'క్షోణి తలంబునన్' అను పద్యములో సహితము సరస్వతి ధారణచేసిన వాటిలో 'వీణ' లేదు. నాలుగు పురుషార్థాలను ప్రతిబింబించు రీతిలో అక్షమాల, రాచిలుక, తామరపువ్వు, పుస్తకము ధరించినది. నేటికినీ శృంగేరీ పీఠము నందలి శారదాదేవి అలంకారాలలో వీణ ఉండదు. క్షోణి, సైకతశ్రోణి, సుందరవేణి, అమర శ్రేణి, కరణైక, వాణి, వాణికిన్, పాణికిన్ అను శబ్దములచే శ్రవణసుభగత్వము కలిగి రసికు/ పాఠకుడానందము పొందును. ఇది సహజకవికి లభించిన వరం. అమ్మ శబ్దముపై చేసిన చమత్కారము చూడగలము. భాగవతములో పలు సందర్భాలలో శబ్దముపై పోతన చూపిన అధికారము మోదము కూర్చును.

---

పాదసూచికలు:- [1] భాగ/స్కం -1/8

ఇష్టదేవతా స్తుతులలో కాకున్నా, 'హరి' శబ్దముపై ఆయన చేసిన ప్రయోగము అభివందనాలకు అందనిది.

" హరిసుతు పరిచరుగాగొని,

హరిసుతుదునుమాడి, పనిచె హరిపురమునకున్

హరివిభునకు హరి మధ్యను

హరి రాజ్యపదంబునిచ్చె హరి విక్రముడై" [1]

ఇచ్చట క్రమముగా హరి = వాయువు [హనుమ], హరి =ఇంద్రుడు [వాలి], హరి = యముడు, హరి = [సూర్యుని సుతుడగు] సుగ్రీవునికి హరిమధ్య = [సింహము నడుము వంటి నడుము గలది] రుమను/తారను, హరి = వానర [రాజ్యము], హరి = శ్రీరాముడు.

బిల్హణీయంలో ఈరీతిగా హరిశబ్దమును ప్రయోగించి చేయబడిన కొన్ని చమత్కా రములను చూడగలము. ఇది షష్ఠ్యంతములలో చూడగలము.

"హరితనయ హృదయ సారస

హరికి, మహాసూనృత జితహరికతితేజః

పరిహసిత హరికి భవగజ

హరికి సదాపాద పంకజానత హరికిన్"[2]

*సాహిత్య రసపోషణుడైన రామరాజభూషణుడు , చమత్కారములకు పుట్టినిల్లయిన*

వసుచరిత్రలోయొక చమత్కారము. ముదుసలియైన మందాకినిని నెత్తికెత్తుకొని, షోడశవర్ష ప్రాయుయైన తనను పూర్తిగా పరిగ్రహించపక, సగము దేహము మాత్రమే యొసగినాడని, అసంతృప్తితో ఆర్యామహాదేవి అలిగినది. ఆమె అలకను తొలగించి, ఆమెను ప్రసన్నము జేసుకోదలచినవాడైన శివుడు పార్వతి పాదపద్మములపై శిరమునిడినాడు. సవతి పాదములపై తనను నిల్పినాడని, శివుని శిరమందుండు గంగమొరసినది.

---

పాదసూచికలు:- [1] పోతన/భాగవతము-ద్వితీ స్కంధ /165 పద్యము

[2] బిల్హణీయం /అవతా/14

గంగను బుజ్జగించుటకై తన జటలను సరిజేసుకొను నెపముతో గంగను వేడుకొనుచున్నట్టి, అతుల సామర్థ్యవంతుడగు, ఆ అష్టమూర్తికి అంజలి సమర్పించిన విధము ఇక్కడ ఒకింత చూడగలము. ఆ చమత్కార పూరితమగు పద్యరాజమిది.

శా. " ఆ మందాకిని మౌళి పూని నను నర్ధాంగీకృతంజేసి తా
నౌ మేల్మేలని యార్య యల్గ ప్రణతుండై తత్పదాంభోజ యో
గామర్షంబున గంగయున్మొరయ చూడాభోగ సమ్యక్క్రియా
సామర్థ్యంబున వేడు శంభుడు కృతిస్వామిం కృపం బ్రోవుతన్" [1]

మూడాశ్వాసములలో ముచ్చటగా, అచ్చతెనుగులో కూర్పబడినది 'నీలాసుందరీ పరిణయము'. దీని కర్త 'కూచిమంచి తిమ్మకవి'. కథ విషయమునకు వస్తే శ్రీ కృష్ణుడు ఎద్దులతో యుద్ధము చేసి వధువగు నీలను పరిణయమాడుట. అనగా హరికి సంబంధమైనది.

ఉ. " శ్రీలకు దానకం బగుచు జెన్నలరారెడు వెండికొండపై
మేలిక డానిడాల్ హొయలు మీఱెడుజాబిలి ఱాలమేడలో
వేలుపు ఱేడు, నల్వయును వెన్నుడు కొల్వగమంచుగొండ రా
చూలిని గూడి వేడుకల జొక్కెడు లేనెలతాల్పు కొల్చెదన్" [2]

కవి తొలుత జేసిన ప్రార్థన హరునిది. హరుని కవి ప్రార్థించునపుడు హరి కనిపించుట మరి కొందరి కవుల జీవితములలో జరిగిన ఘటనలే. విధి హరి మున్నగు వారు సేవలు జేయుచుండగా వలిమలచూలితో గూడి వలిమలయల్లుడు, నెలతాల్పును ధరించి, వేడుకలలో చొక్కుచున్న రూపము పైన వివరింపబడినది.

---

పాద సూచికలు: [1] వసుచరిత్ర/ రామరాజభూషణుడు/ప్రథమా/5

[2] నీలా సుందరి/తిమ్మన/పీ/1

కవుల కల్పనలకు, చమత్కారముల సత్కారములకు కావ్యములు చక్కని వేదికలు. ఒక సందర్భములో తల్లియగు పార్వతి గణనాథుని పిలిచినది. గజముఖుడు అచ్చటికి వచ్చినాడు. సింహము తల్లి వాహనము కదా! గజము సింహమును చూచి భయపడుట ప్రకృతి సహజము. ఇచ్చట సింహమును చూచి గజముఖుడు భయపడినాడు. భీతిల్లిన గజముఖుని తండ్రిచేర పిలిచినాడు. తండ్రి ఒడినిచేరగ ముద్దిడినాడు పరమేశ్వరుడు. ముదమందిన మోదకఖాదియగు గణపతి చిరునవ్వుతో తల్లిని చూచినాడు. అట్టి హస్తివదనుని అశ్రాంతము పూజింతునని బహు హర్షణీయమగు కవి నిర్ణయము.

" అలకైలాసగిరి ప్రదేశమున సింహారూఢయౌ తల్లి తన్
బిలువన్ భీతిలి డాగుచో శివుడు బల్ ప్రేమన్నిజాంకోజ్జ్వల
స్థలి నాసీనునొనర్చి ముద్దిడప్రమోదంబొంది దానోర చూ
పుల తల్లింగని నవ్వు హస్తి వదనున్ పూజింతు నశ్రాంతమున్- [2]

శృంగారరసమును చిప్పిల జేయుటలో కొందరు కవులు అందెవేసిన చేయి కలవారు. లయమూర్తి యైన పరమశివుడి ద్వారా కూడా వారు చమత్కారాలు చేయించగలరు. ఆ కోవలోకి చెందినదే ఈ పద్యము. గ్రంథము 'ఉత్తర రామాయణము' కర్త 'కంకంటి పాపరాజు'. ఇతడు శ్రీ మదన గోపాలుని కృపను పొందిన వాడు, కంకంటి వంశ పయః పారావార వంశ చంద్రుడైన అప్పయామాత్య తనయుడు, రామాయణమును రాసినాడు. వెండికొండపై వాసము చేయువాడు శివుడు. చంద్రశేఖరుడు. పార్వతి పర్వత రాజ కన్య. పార్వతి పాలిండ్లపై నఖ క్షతములు ఉన్నవి. సరస మైన చూపులతో త్రినేత్రుడు, పయ్యెద జారగ, పార్వతి చనులపై గల చంద్ర రేఖలవంటి గోటిగాట్లు గమనించి, వనితరో! వెండికొండ నెలవంకలు పెక్కు వహించె నని, అన్యాపదేశముగా అభవుడు నుడువగా, అందలి సరసమును గ్రహించిన శాంకరి దరహసిత వదనయై పయ్యెద సరిగ సవరించు కొనినది.

---

పాద సూచికలు: [1] గుమ్మరాజు రామకవి/చౌడేశ్వరీ మహాత్మ్యం/ప్రథమాశ్వా/7 పద్యం

ఆ గౌరిని కౌగిట బంధించినాడు బాలచంద్రధరుడు. ఆయన మము బ్రోచుగాక అన్నాడు కవి 'కంకంటి' గారు.

చ. " వనితరొ వెండికొండ నెలవంకలు పెక్కు వహించె జూచితే
యని సరసోక్తి తాననిన నచ్చపు గందపుపూత గుబ్బ జా
ఱిన నునుబైటకొంగు సవరించుచునవ్విన గౌరి కౌగిటం
తనిపెడు చంద్ర శేఖరుడుదార కృపన్ మము బ్రోచు గావుతన్" [1]

లయకారుడేకాదు, సమయానికి తగు మాటలాడ గలవాడు కూడా ఆ సర్వజ్ఞుడైన చంద్రమౌళి. ఆయన శిరముపై లహరులతో కూడిన గంగ యున్నది.

'అప్పకవీయము'లో చతురుడైన సింధురవదనుని చిలిపి చేష్ట కొంత చూద్దాము. గజాననుని గని ముదమందిన జగత్పితరులైన 'అజ నగజ'లిరువురు ఇరువైపులనుండి, గణపతి చెక్కులను ముద్దిడగ ముచ్చటపడి ముందుకొక్క యెత్తున రాగా, నేర్పుతో తన మోమును వెనకకు తీసినాడు 'వెనకయ్య'. తమ ప్రయత్నములేక సుతుని ముద్దాడబోయి, తమ కుమారుని చర్యవలన అప్రయత్నముగా, ఉమాశంకరులు ఒకరినొకరు చుంబించు కోవడమైనది. అట్టి ముద్దును తల్లిదండ్రులకు కూర్చిన ఆఖువాహనుని తలచినాడు – అప్పకవి.

చ. " తనుగని యొక్క యెత్తునను దక్షజయున్నిటలాక్షుడున్ముదం
బున నిరు చెక్కులుంగదిసి ముద్దుగొనంగ నొకింత నెమ్మొగం
బనువుగ వెన్కకుందిగిచి యత్న విహీనపరస్పరాస్య చుంబనములు
తల్లిదండ్రులకు పన్నుగ గూర్చు గజాస్యు నెన్నెదన్"[2]

---

పాద సూచికలు:- [1] ఉత్తర/కంకంటి/పీ/3 [2] అప్పకవీయం/పీ/22 [సారకాండ/సోంపల్లె కృష్ణ మూర్తి/12]

ఒక్కొక్క కవికి ఒక్కొక్క రీతిగా ఆలోచనలు తరంగాలవలె ప్రభవించుచుండును. ఒకరి దృష్టి శృంగారపరమైనది కాగా, వేదాంత పరమైనది మరొకరిది, చమత్కారపూర్వకమైనది ఒకరిది కాగా, భక్తి భావ సంభరితమైనది ఇంకొకరిది. ఇలా పలురకాల రచనలు మనకు ప్రత్యక్షమగు చుండును.

'కువలయాశ్వ చరిత్రము' కూర్చిన కవి 'సవరము చిననారాయణ నాయకుడు'. ఇతడు బ్రహ్మ స్తుతిని చేయుటకై సిద్ధమైనాడు. చదువుల లలన మేనిలోని వైభవ రుచిని కనులార కాంచిన కమలగర్భునికి వేద సంబంధ విషయాలు స్మరణకు రాసాగినవి. ఇచట ప్రత్యేకముగా చెప్పబడిన 'పదము', 'చర్చ', 'క్రమము' 'జట'

మున్నగువాటికి వేదపరమైన భాష యందు అర్థములు వేరు. వానిని – వాణిలో క్రమముగా చూచి తలపునకు తెచ్చుకొన్నాడు తమ్మిచూలి.

సీ. " నుడుగుల పూబోడియడుగుల బెడగు వీ
క్షించుచో 'పదము' పఠించు కొనుచు
పలుకుటొయ్యారి గుబ్బకవ గంధపు పూత
నెంచుచో ' చర్చ' వర్ణించుకొనుచు
మాటమిటారి సయ్యాటంపు నడ నిరీ
క్షించుచో ' క్రమము' గుణించుకొనుచు
మినుకు బ్రోయాలి కింపున కీలుజడ యల్ల
చేరువుచో నల ' జట 'చెప్పుకొనుచు

గీ. వాణి శారీర రుచి వైభవంబు జూచు
వేళ ' వర్ణ క్రమంబు' భావించు కొనుచు
నెమ్మినగు తమ్మి చూలి మా తిమ్మ నృపతి
పుత్రు నారాయణాధిపు బ్రోచుగాత! [1]

-----------------------------------------------

పాద సూచికలు: [1] కువలయాశ్వ చరిత్ర/ సవరము చిననారాయణ/ ప్రథమా /5

కవులు ప్రార్థనతోపాటు కొంత చిలిపితనమో /శృంగారమో ఒలికించుట కొన్ని సందర్భములలో కనిపించును. అట్టి విశేషము 'మూర్తి త్రయోపాఖ్యానము'లో దంతులూరి బాప కవి మనచేత దర్శింపజేసినాడు. మరాళగామిని యగు వాగ్దేవికి, అంచ యేనుగుమావంతు యైన, వనజభవునికి మధ్య సంభవించిన సంభాషణ.

చ. 'కరి రథ వాజి ముఖ్యములు గాక మరాళము మీకు యానమై
పరగుట కేమి హేతువన భారతి? నీ గమనంబు దీనికిం
దొరగుట మాకు నిచ్చలు ననూనము ప్రేమని పల్కుధాత యా
దరమున నిచ్చు గాక నిరతంబు మదీయ మనోరథార్థముల్ ' [1]

దేవా! హస్తి, రథ, తురగాదులను వదలి, మరాళమును వాహనముగా ఎందుకు గ్రహించినారు? అని ప్రశ్నించిన పలుకులచెలికి, కమల గర్భుడు గడుసుగా మరాళ గమనము, సరస్వతి నడకకు దొరయు కారణమున అనూనమైన ప్రేమతో రాయంచను తత్తడిగా ఎన్నుకొన్నా నని సమాధానమునిచ్చినాడు. ఔరా! విరించి వైదుష్యము.

సారకాండము పేర రాయబడిన కవితానంద రామాయణములో, కృతికర్త సోంపల్లె కృష్ణమూర్తిగారు, సదుపాస్యుడగు చతురాస్యుని పొగడినతీరు చూడండి. శారద వాక్చతురతను విని మెచ్చుకొనుచు తన కార్యమును ఘటించు చున్నాడట విధాత.

మ. 'చతురత్వంబున వాణి వాఙ్నిలయయై సంతోషముస్ నింప నా
తతమౌ రీతి సమస్త భూతచయ సత్త్వంబుల్ తదాయుష్యముల్
నుతిపాత్రంబుగా కూర్చి జన్మ ఫల సందోహంబు సంధించు నా
చతురాస్యుస్ సదుపాస్యుస్ మత్కృతిచిరస్థంబౌనటుల్ కొల్చెదస్' [2]

తనకు మనవిని చేయగ వచ్చు దేవతలను ఒక ముఖముతో, మునీంద్రులను మరొక వదనముతో, ఒక ప్రక్కనున్న ఉపనిషత్తులను కాంతా సమూహముపై ఒక ఆననము,

---

పాద సూచికలు: [1] మూర్తి త్రయోపాఖ్యానము/ దంతులూరి బాప కవి/ ప్రథమా/3

[2] కవితానంద రామాయణము/సోంపల్లె కృష్ణమూర్తి/ సారకాండము /6

తనకు మనవిని చేయగ వచ్చు దేవతలను ఒక ముఖముతో, మునీంద్రులను మరొక వదనముతో, ఒక ప్రక్కనున్న ఉపనిషత్తులను కాంతా సమూహముపై ఒక ఆననము, నాలుగవ మోమును భారతి చనుగవపై కటాక్షశ్రీలను సారించి పెద్ద తామరగద్దియపైన ఒద్దికగా కూర్చున్న వేల్పుల పెద్దయైన బ్రహ్మను భక్తితో ప్రార్థించినాడు. గుమ్మరాజు రామకవి తన చౌడేశ్వరీ మాహాత్మ్యములో. ఆ పద్యమొక సారి చూద్దాము.

మ. 'మనవుల్సెప్పగ వచ్చు దేవతలపై మౌనీంద్ర బృందంబుపై
తనకిర్వంకల కొల్చు నయ్యుపనిషత్కాంతాళిపై భారతీ
స్తనగుచ్ఛంబులపై చతుర్విధకటాక్ష శ్రీల సారించి కొ
ల్వున పొందామరగద్దె పై నెసగు వేల్పుంబెద్దఁ బ్రార్థించెదన్' [1]

నవీన పద్య కవులలో కీర్తిగడించినవారు, 'డా. సివి సుబ్బన్న' శతావధాని. ఆయన తమ భద్రాచల 'శ్రీ రామదాస ప్రబంధమును' ఆ భద్రాచల రామునికి అంకితము గావించినారు. ఆ అంకితము చేయు సందర్భములో ముచ్చటగా మూడు పద్యములను ఆభద్రాద్రి రామయ్యకు నివేదించినారు.

" స్వామీ! నల్వది నాలుగేండ్లు జరిగెన్ భద్రాచలంబందు నీ
సామీప్యమ్మున నావధానికసభన్ సాగించి సాక్షాత్పరం
ధామున్ రాము చతుర్భుజున్ నిను గుడిన్ దర్శించి వర్ణించితిన్
నీ మాహాత్మ్యము నిల్పుకొంటినపుడే నిన్నున్ మనః పీఠికన్"

" ననయో నారికెడమ్మొపల్లవమొ ఆనాడేమి యర్పించి నా
నో నమః పూర్వకముగాగనీకు నిపుడన్యూనోపదన్ కావ్యల
క్ష్మి నివేదించెద దీని కైకొనవె స్వామీ జానకీదేవికం
టె నినున్ రంజిలజేయు సాధుమధుర స్నిగ్ధోక్తి చాంద్రీరతిన్"

"ప్రతిఫలము కోరనేదియున్, సతతము నీ పాద భక్తి చాలును సంసార
తమోదవీయమగు నిర్వృతిన్ ప్రసాదింపవే వివిక్తము రామా! అని ఒక

---------------------------------------

పాద సూచికలు: [1] గుమ్మరాజు రామకవి/చౌడేశ్వరీ మాహాత్మ్య/ప్రథమా/5

శార్దూలమును, ఒక మత్తేభమును, అందముగా ఒక కందమును భద్రాద్రి విభునకు సమర్పించినారు. కావ్యమును శ్రీ తో ఆరంభించి 'చంద్ర రేఖావృత్తముతో' శ్రీ కారముతో తమ ఐదు ఆశ్వాసముల ప్రబంధమును ముగించినారు. ఇది ప్రాచీన సంప్రద్దయములో 'మంగళ మహాశ్రీ' వృత్తముతో కొన్నికావ్యాలను ముగించుట ఉండినది. అదే పద్ధతిలో కొంత భిన్నత్వముతో వీరు చేసినారు.

ఇక అంకితమిడిన మూడు పద్యములలో భద్రాచలరాముని సన్నిధిలో తాను రాముని దర్శనము పొందినది, గుడిని వర్ణించినది, ఆ రాముని తన మనః పీఠికపై నిల్పుకొన్నది, చతుర్భుజుడగు ఆ రామయ్య సమీపములో అవధానము నిర్వహించినది తెల్పుకొన్నారు. తర్వాత తాన రాముని సేవించిదానికి, రాముని నుండి ప్రతి ఫలముగా ఏవియూ ఆశించనినియూ, సంసార తమమునుండి నిర్వృతిని ప్రసాదింప మనియూ కోరినారు. ఇక మరొక పద్యములో తన ప్రబంధమును భద్రాద్రీశునికి అంకితమునిచ్చినాడు. తన కావ్యము రాముని "జానకీ' దేవికన్నను రంజిల చేయునని పల్కినారు. ఏకపత్నీ వ్రతుడగు రామయ్య ఈ అభ్యర్ధన అంగీకరించునో లేదో అనుకొన్నారేమో, క్రితము ఏమి చేసెనో దానిని కాక, 'సాధుమధుర స్నిగ్ధోక్తి చాంద్రీరతిస్' సమకూర్చగల తన కావ్యలక్ష్మిని ఇపుడు సమర్పించు చున్నానని గ్రహింపవేడినారు.

**కవులు కావ్య రచనయే కాక అందులో అద్భుతమైన కల్పనలు కావింప గల స్రష్టలు. కొన్ని కల్పనలనలు వారికే సాధ్యం.**

# నవమాధ్యాయము

## తెలుగుకావ్యావతారికలు – ఇష్టదేవతాస్తుతిపరిణామక్రమము

## *IX నవమాధ్యాయము*

9 *ఇష్ట దేవతా స్తుతులు పరిణామక్రమము* :- ఒకింత ప్రస్తుతము ఇష్ట దేవతా పరిణామక్రమును చర్చిద్దాము. ఋగ్వేదమునందలి సూక్తములు దేవతా స్తుతి పూర్వకములుగాను, ప్రార్ధనా పూర్వకములు గాను ఉండును. అందు ముందు ఆయా దేవతలయొక్క పౌరుషము, ఔదార్యము మున్నగు గుణములును, తరువాత వారు చేసిన సాయమును వర్ణింప బడును. పిమ్మట స్తుతించు వానికికల కోరికలను తీర్చవలెను అను ప్రార్థన కనబడును. అప్పటి వారు [స్తోత్రము చేయువారు] సాధారణముగా పశు రూపమైన ధనమును, ఆయువును, సంతానమును, జయమును, ఐశ్వర్యమును కోరుచుండిరి. ఇప్పుడు కూడా యజమాని / భక్తుడు తనకు కలిగిన కష్టమును తొలగించమని చేయు పూజ/ప్రార్థన/ఉపాసన సందర్భములో ఈ రీతిగా సంకల్పముండును > "మమ సర్వారిష్ట నిరసన పూర్వక సర్వ పాపక్షయార్థం, దీర్ఘాయురారోగ్య ధన ధాన్య పుత్రా పౌత్రాది సమస్త సంపత్ ప్రవృద్ధ్యర్థం ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం, శ్రుతి, స్మృతి, పురాణోక్త ఫల ప్రాప్త్యర్థం ...... (దేవ/దేవతా) ప్రీత్యర్థం ......పూజనమహంకరిష్యే"

పైన చెప్పబడిన సకామ సంకల్పములో యే దేవుని/దేవతను పూజిస్తున్నామో ఆ దేవుని/దేవతను మన కోరికను తీర్చమని అభ్యర్థించుట చేయుచున్నాము.

అగ్ని, ఇంద్రుడు, మిత్రుడు, సోముడు, వరుణుడు అనువారు ప్రధానులు. పెక్కు సూక్తములు వీరి స్తుతులతో కూడి ఉండును.ఆయా స్థానములను, సందర్భములనుబట్టి ఒక్కొక్కరికి ప్రాధాన్యము ఒసంగబడుచుండును. కొన్ని సూక్తములలో సూర్యుడే సర్వదేవతాస్వరూపుడు అనియూ, కార్యవశమున ఆయా దేవతల రూపములను తాల్చుచుండుననియు వర్ణింపబడినది. కొన్నిచోట్ల అగ్నియే ప్రధాన దైవముగాను, కొన్ని చోట్ల విరాట్పురుషుడు ప్రధాను డుగాను వర్ణింపబడుట కలదు. పైన పేర్కొనబడిన పురుష దైవములే కాక, అదితి, ఇంద్రాణి, వరుణాని మున్నగు స్త్రీ దేవతలు కూడా కొందరు కలరు.

అదితి దేవతల తల్లి. సాధారణముగా ఇరువురు దైవముల పేర్లతో కూడిన మిత్రావరుణులు, అగ్నీషోములు, అను ద్వంద్వ సమాసములే అధికముగా కనబడును. దీనిని బట్టి అప్పటి వారు పై స్త్రీపురుష దైవములను ఆరాధించెడివారు అని తెలియుచున్నది.

ఇంతవరకు ఋక్సంహితలో పేర్కొన్న దేవతలే కాక, కృష్ణ యజుస్సంహితలో మరికొందరి దేవతలను పేర్కోవటం చూడగలము. పరమేశ్వరుడు, ద్యావాపృథువులు, మిత్రావరుణులు, వైశ్వానరుడు, వరుణుడు, యజమానుడు, ప్రాణం, లింగోక్తులు, సరస్వతి, త్వష్ట, అశ్వినులు, దంపతి, దిక్కు మరుత్తులు, గణపతి, వసువులు, బ్రహ్మ, ఆత్మ, క్షత్రపతి, గృహపతి,గరుత్మంతుడు, జగదీశ్వరుడు, ఋతువులు, కృషీవలుడు, వీరుడు, సినీవాలి, సేనాపతి, హిరణ్యగర్భుడు మొదలగు దేవతలు ఈ సంహితలో అక్కడక్కడ పేర్కొన బడ్డారు.

ఆదికవియని, శబ్దశాసనుడని/ వాగనుశాసనుడని కీర్తింపబడినవాడు నన్నయభట్టారకుడు. నారాయణభట్టు {మహాభారతములో అర్జునునికి అచ్యుతుడు సాయము చేసిన రీతిలో} సాయముతో పంచమవేదమైన, సంస్కృత వ్యాసభారతమును తెనుగుభాషలో వినిర్మించినారు. ఈ ఇతిహాస నిర్మాణమునకు ప్రోత్సాహము నిచ్చినవాడు రాజరాజ నరేంద్రుడు. ఆయన చంద్రవంశపురాజు. పాండవులు /కౌరవులు చంద్రవంశమునకు చెందినవారు. తమ వంశమందలి పూర్వీకుల విషయములను తెలిసికొనుటకై రాజు తన కులబ్రాహ్మణుడు, అనురక్తుడు, అవిరళ జపహోమతత్పరుడు, విపుల శబ్దశాసనుడు, సంహితాభ్యాసుడు, బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతుడైన వాడు, లోకజ్ఞుడు, ఉభయభాషాకావ్య రచనాభిశోభితుడు, నిత్యసత్య వచనుడు, సుజనుడు యైన నన్నపార్యునితో, తన అభీష్ట మును వ్యక్తము చేసి నాడు. ఆ అభ్యర్థనలో చంద్రుడాదిగా పూరువు, భరతుడు, కురురాజు, పాండురాజుమున్నగు వారు వంశమును స్థాపించి కొనసాగించినారు. అట్లు ప్రశస్తి వహించిన వంశములో స్వచ్ఛమైన, యోగ్యమైన గుణములతో ప్రకాశించినవారు, సజ్జనులైన వారు పాండవులు. వారి చరిత్ర వినవలెనను ప్రభువగు రాజరాజనరేంద్రుని కోరికను గౌరవించి భారతము తెనుగు చేయ 'శ్రీ' కారము చుట్టినాడు నన్నయ్య. ఆ నాటి వ్యవస్థలో అధికముగా పండితుల చదువరుల దృష్టిలో

సభలలో, సంస్కృతమే ప్రయోగింప/ వాడ బడిన భాష. 'పరమ వివేక సౌరభ విభాసిత సద్గుణపుంజ వారిజోత్కరరుచిరంబులై సకలగమ్య సుతీర్థ ములై, మహామనోహర సుచరిత్ర పావనపయః పరిపూర్ణములైన సత్సభాంతర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి, సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకవితార్థయుక్తి లోనారసి మేలునా నితరులు అక్షరరమ్యత ఆదరింప, 'నానారుచిరార్థ సూక్తి నిధి' నన్నయభట్టు మహాభారత సంహితరచనా బంధురుడైనాడు. అది జగత్ హితంబుకై.

అందులో మొదట జగన్నిర్మాతలైన విధి హరి హరులను జగమునకు శ్రేయస్సును ప్రసాదింపవలెనని ప్రార్థించినారు. ఆ దేవతాస్తుతి ఆరంభ మైనది ఒక శ్లోకముతో. అది దేవభాషయనబడు సంస్కృతములో. ఆనాడు చదివినవారు /పండితులనగ సంస్కృతం తెలిసినవారే! ఆ తొలి తెలుగువెలుగుగ భాసించినది. మహాభారతరచన ఆరంభమైనది ఈ శ్లోక రూప మందలి ప్రార్థనతో.

శ్లో. "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు  యే
లోకానాంస్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకన్ధరాశ్శ్రేయసే"!  [కవిత్రయ భారత/1శ్లోకం]

అది 'శ్రీ'కారముతో మొదలిడబడినది. 'మ' గణము తో మొదలగు శార్దూల వృత్తములో కూర్చబడినది. ఇచ్చట మంగళకరమైనదిగ 'శ్రీ' కారము ప్రయుక్తము. తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిన శ్రీ మదాంధ్రమహాభారతములో తొలి మంగళ శ్లోకమునకు విశేష వ్యాఖ్య ఇట్లు చేయ బడినది. ఆ వ్యాఖ్య తొలి పద్య/ రచన/శ్లోకమునకు చేయబడిన వ్యాఖ్య యథా తథముగా ఇచ్చట ప్రస్తావించ బడుచున్నది.

" కావ్యారంభ పద్యాన్ని శ్రీకారంతోనూ, మగణంతోనూ, ప్రారంభించటం  మంగళకరం. అందువలననే ఇది మంగళ శ్లోకం. ఇది నాటకంలో నాంది వంటిది. కావ్యారంభములో ఆశీర్వాదాన్నికాని, నమస్కారాన్నిగాని, వస్తునిర్దేశాన్నికాని చేయాలని లాక్షణికుల నిర్దేశం. "ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశోవాపి తన్ముఖమ్". ఈ శ్లోకములో ఆశీర్వచనమున్నది.

నన్నయ మహాభారతాన్ని తెలుగులో రచిస్తున్నప్పటికీ, సంస్కృతము అమరభాష కావటంచేత ఆశీఃపూర్వకమైన మంగళశ్లోకాన్ని సంస్కృతం లోనే వ్రాసి వున్నాడు. శ్రీకంధరుడు అంటే విషం కంఠంలోకలవాడని వ్యుత్పత్తి. ఆశీర్వచనములో శ్రీకంధర శబ్దమును ఎందుకు వాడినాడని కొందరికి సందేహము కలుగవచ్చు. శివుడు హాలాహల భక్షణము చేయటం లోకరక్షణం కొరకే కాబట్టి అది శుభాన్నే సూచిస్తుంది. వేద త్రయ మూర్తులనే పదం భారతం పంచమవేదమని సూచిస్తున్నది. పురుషోత్తమ శబ్దము శ్రీకృష్ణుడినే కాక ధర్మార్జున భీష్మాదులను కూడా జ్ఞప్తికి తెస్తున్నది. వక్షోముఖాఙ్గేషు అనేది సమాహార ద్వంద్వం కదా! అది ఏకవచనంలోకాక బహు వచనంలో ఉండటానికి హేతు వేమిటని కొందరు ప్రశ్నిస్తారు. ఆ వక్షోముఖాంగాలు ఒక్కరివి కాక ముగ్గురివి కావటం అందుకు కారణం. భార్యలను చిరకాలం నుండీ ప్రేమిస్తున్న ధర్మమూర్తులు త్రిమూర్తులు, వేదత్రయంలో చెప్పబడిన గృహస్థ ధర్మానికి ప్రతీకలు. వారు స్త్రీపుంసయోగోద్భవమైన లోకానికి అవిచ్ఛిన్నతను ప్రసాదిస్తారనటంవలన భారతంలో వేదసమ్మతమైన గృహస్థ ధర్మం ప్రధానప్రతిపాద్యాంశం అని ధ్వని. ఇది సంస్కృతభారతారంభము కంటే విలక్షణమైనదని గమనించాలి. కావ్యతాత్పర్యాన్ని సూచించటం వస్తునిర్దేశంలోని భాగం. అలంకారము – క్రమాలంకారము.

నన్నయ ఋషి తుల్యుడు. అతనినోట త్రిమూర్తులు అనే పదం రావటం చేత లోకాలస్థితిని త్రిమూర్తులు కొనసాగిస్తున్నట్లు ఆంధ్రమహాభారతం  కూడా త్రిమూర్తితుల్యులైన ముఫ్ఫురు కవులు రచించి పూర్తి చేస్తారనే సూచన అప్రయత్నంగా కలిగిందని కొందరంటారు. 'నన్నయ' పదం నారాయణ శబ్ద భవం; తిక్కన 'కవిబ్రహ్మ', ఎఱ్ఱన 'శంభుదాసుడు', అందుచేత కవిత్రయం వారు త్రిమూర్తులవంటి వారనటం సమంజసం గానే ఉన్నది. ఇది శార్దూలవిక్రీడితం. ఇందులో తెలుగుపద్యాలలో వలె ప్రాస కానీ, అక్షరమైత్రి తోకూడిన యతి కానీ లేవు. సంస్కృత శ్లోక మర్యాదలే ఇందులో ఉన్నాయి." **[1]**

---

పాదసూచిక : [1] కవిత్రయ భారతం/తితిదే ప్రచురణ /పుట 1,2 /మొదటి సంపుటి

తెలుగు మహాభారత రచన ఒక విధముగా అనువాదముగ సంస్కృత వ్యాసభారతము ననుసరించినను, పలు మార్పులు, చేర్పులు, కూర్పులు చేయబడి పూందాగా ఒక స్వతంత్ర గ్రంథముగ కవిత్రయముచే నిర్మిత మైనది. కథను చక్కగా నడిపించుచు, జీవితమునకు అవసరమైన, అను సరణీయమైన మంచిమాటలను కూడ తెల్పుతూ ఉండటము కలదు. ధర్మజ్ఞుడు ఎవరు అనినపుడు చెప్పిన సమాధానము భారతమందలి పాత్రకే కాక చదువుచున్న మనకు కూడా అది వర్తించి జీవితాన్ని చక్కగా మలుచుకొను అవకాశము కలిగించును.

'అలిగిననలుగక యెగ్గులు పలికిన మఱివినని యట్లు ప్రతివచనంబుల్

పలుకక బన్నమువడి యెడదలపక చూపె ధర్మజ్ఞుడిలన్' [1]

ఇదే రీతిగా [పలు సంస్కృత భాషయందలి హితోక్తులను తెలుగులో]

'ఎఱుక గలవారి చరితలు గఱచుచు సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం

బెఱుగుచు నెఱిగినదానిని మఱవకనుష్ఠించునది సమంజసబుద్ధిన్' [2]

ఈ రీతిగా జీవితమును చక్కగా నడుపుకొనుటకు అవసరమగు మార్గమును చూపడము ఇందలి విశేషము.

అట్టి మహాభారతమును ఆదికవిగా గుర్తింపబడిన నన్నయ రచనా విధానాలను, తర్వాతివారు ఎంతవరకు అనుసరించినారు అనునది కొంత పరిశీలన చేయుట ఉచితము. 'నన్నయ్య తన రచనలో దాదాపు రెండువంతులు సంస్కృతము [2/3] ఒకవంతు [1/3] తెలుగు భాషా పరమగు పదములు ప్రయోగించినాడు. అది ఆనాటికి ఒక సంధి యుగము. మార్పులు జరుగుటకు కొంతకాలము పట్టుట సహజము. మృదువైన శైలిలో కవిత రసవంతముగు నుండును. ద్రాక్షాపాకము' అని రావ్ బహదుర్ కందుకూరి వీరేశ లింగము గారు తమ అభిప్రాయమును తెలిపినారు. [The complete works of rao bahadur k veeresa lingam panthulu] శ్రీరామా ప్రెస్ రాజమండ్రి 1937 పుట- 31. ఇక నన్నయకు

-----------------------------------------------------------

పాదసూచిక : [1] &2 క్రమంగా ఆది/ఆశ్వా-3/147 & 203పద్యాలు

పూర్వము ఉండిన సాహిత్యము లభించినమేరకు సుసంపన్నము కాకపోవుటవలనకానీ, ఒకవేళ ఉండి ఉంటే లభ్యము కాకపోవుటవలన కానీ – కారణమేదైన నన్నయ ఆదికవిగ గుర్తింపు పొందిన విషయము పండితలోకమునకు తెలిసినదే! ఆ తరువాత ప్రస్తావించ వలసిన వాడు, ప్రశంసలకు తగినవాడు 'కుమారసంభవ'కర్త 'నన్నెచోడుడు'. నన్నెచోడుడు కావ్యకవితకు వన్నెలద్ది, పలు విషయ ములలో కొంగ్రొత్తరీతులకు 'ఒరవడి పెట్టిన ఒజ్జ'. అనుట వాస్తవము.

నన్నె చోడుని గురించి ఆరుద్ర గారు ['స.ఆం.సా' తొలి సంపుటము, అకాడమి ప్రచురణ, పుటలు 162 -163] పేర్కొన్న వాటిలో కొన్ని భాగములు స్వీకరించుట జరిగినది.

“ఆదికవి' అన్న బిరుదు లేకపోతే పోయిందిగాని, నన్నెచోడుడు నిజంగా చాలా విషయాలలో ఆద్యుడు. ప్రతి ప్రబంధంలోను మనం మొట్టమొదట చదివే 'ఇష్టదేవతా' ప్రార్థన, పూర్వకవిస్తుతి, కుకవినింద, గ్రంథకర్త స్వవిషయం, కృతిపతి వర్ణన, షష్ఠ్యంతాలు, మొదలైనవి నన్నెచోడుడే మొదలు పెట్టాడు. ఇదే ఆతరువాతి కవులకు ఒరవడి అయింది. నన్నయ్య చేసిన దేవతాస్తుతి, ఒకే పద్యములో 'హరిహరాజ గజాన నార్క షడాస్య మాతృ సరస్వతీ గిరిసుతాదిక దేవతాతతికి' అంటూ చేయగా నన్నెచోడుడు 'వరసపెట్టి' పేరుపేరునా ఒక్కొక్కర్నీ ఒక్కొక్క పద్యములో స్తుతించినాడు. పూర్వ సంస్కృతకవి పుంగవులను ప్రస్తుతించి, ఉత్తమ మార్గ కవులను, వారితో పాటు 'దేశి' సత్కవులనూ సత్కరించుట చూడగలము. పూర్వకవుల స్తుతులను నన్నయ్య కన్నా అధికముగాచేయుట, దేవతలనందరినీ సామూహికముగా స్తుతించుట కాక వ్యక్తిగతముగా స్తుతించు సంప్రదాయమును నెలకొల్పినాడు. ఇక తర్వాత చాలామంది కవులు దీనిని అనుసరించుటో/ అనుకరించుటో చేసినారు.

ఆంధ్రకవుల చరిత్ర పుట 70 – 75 లలో 'చాముండికావిలాసము' అను గ్రంథము ఒకటి తర్వాత లభించిన దనియు, అది చౌడేశ్వరీ మాహాత్మ్యమును తెల్పుచూ, నందవరీక, ఆఱువేలవారియొక్క సంబంధ చరిత్రగ నున్నటుల విపులీకరించినారు. ఆ రచయిత తన

పేరు 'ఘునత రాజనరేంద్రుని కరుణ బడసి నట్టివాడను నన్నయ భట్ట నేను' అని ఉన్నదనియూ, అప్పుడు కందుకూరి వీరేశలింగముగారు ఇట్లు ప్రస్తావించినారు.

నన్నయ్య గారి కాలములో గ్రంథముల తొలుత పాటించిన కొన్ని ప్రత్యేకతలు

[1] మొదటి పద్యము/సంస్కృత భాషలో కూర్చబడిన శ్లోక ప్రయోగము.

[2] షష్ఠ్యంత పద్యములు ప్రయోగములో లేవు.

[3] అధికముగా మధ్యాక్కరలు వాడుట

[4] నన్నయ్య సీసపద్యాలలో పాటించిన, 'వడి' 'ప్రాస' ల తీరు ప్రత్యేకమైనది.

కానీ ఈ తీరును అందరూ పాటించలేదు. కొందరు మాత్రము మొదటి పద్యము/సంస్కృత భాషలో కూర్చినారు. తర్వాత ఆ విధానమునకు స్వస్తి పలికినారు. షష్ఠ్యంత పద్యములు ప్రయోగములోకి వచ్చినవి. ఇందులో పలువురు కందపద్యములను వాడినారు. పోతనగారు షష్ఠ్యంత పద్యముల సందర్భముగా వృత్తాలను వాడినారు. ఇది ఈ వరకే చెప్పడమైనది. మధ్యాక్కరలు వాడకం బాగా తగ్గినది. సీసపద్యాల లో పాటించిన, 'వడి' 'ప్రాస' ల తీరు నన్నయ మాదిరి కాకుండా వేర్వేరు రూపాలలో ప్రయోగించటం కలదు. ఈ రీతిగా కాలక్రమములోమార్పులు జరిగినవి. మార్పు కాలానుగుణముగా ఉన్నదే. వ్యక్తిగతముగా తమ తమ మతాచారముల ననుసరించి మార్పులు జరిగినవి. ఇది ఒక రకముగా సాహిత్యము వృద్ధి చెందుటకు దోహదము చేసినది. ఉదాహరణగా చెప్పవలెనంటే గణపతిని స్తుతించుట జరిగిన కాలము తర్వాత వైష్ణవ మతము బాగా వ్రేళ్ళూనుకొని ఆ మతపరమైన దైవ స్తుతులలో దేవునికన్న మిన్నగా ఆతని పరివారము కూడా అధిక గౌరవమును సంపాదించుకోవటం చూడగలము. కవులు శైవమతా వలంబకులైనా, తమపోషకుడు వైష్ణవ మతాభిమాని ఐనచో కవులు కూడా కొంత వైష్ణవ అభిమానము చూపుటయో లేక కొన్ని పద్యాలను వైష్ణవ పరముగా కూర్చుటయో జరిగినది. స్వయంగా కృష్ణదేవరాయలవారు దేశభాషలందు తెలుగులెస్స యని పలికినవారు. కవిగా కూడా ప్రసిద్ధి వహించినారు. 'ఆముక్తమాల్యదలో' రాయలవారి వైష్ణవ మతాభిమానము వెలికి వచ్చింది. ఆయన వేంకటభర్తను కొలిచి నారు. తమ గ్రంథములో వైష్ణవ సంబంధమగు విష్ణు పరివారమునకు

అత్యంత ఆదరముతో నుతులర్పించినారు. ఆయనచే నతులు నుతులు అందుకొన్నవారు విష్ణుదేవుని పానుపుగా వర్తించువాడు, బలదేవునిగా ద్వాపరయుగములో, లక్ష్మణస్వామిగా త్రేతాయుగములో మనకు కనిపించినవాడు ఆదిశేషుడు/అనంతుడు. అటుపై తన పక్షముల బలిమిచే విపక్షాలను శిక్షించినవాడు, పక్షిరాజు, విష్ణుదేవునికి వాహనముగ, స్వామి కార్యములను భక్తితో నిర్వర్తించు వాడు. దాసునిగ, సఖుడుగ, చిత్రమగు ఛత్రముగ, సింహాసనముగ, తన స్వామినియగు రమకు ఉల్లాసముకలిగించు దేవదేవుని సేవించువాడై, కల్యాణ కారకుడు, వేదమయుడు అయిన గరుడుని స్తుతించినాడు. ఆపై మిత్ర శశాంక లోచనుడగు నారాయణుని మెప్పు సాధించిన వాడు, నిత్యమూ కనకపు బెత్తమును ధరించి జగములను అదుపులో ఉంచువాడు, బ్రహ్మాది దేవతలకు, వెన్నుని కనుసన్నలను గమనించి నేర్పుతో లోకాలను పర్యవేక్షించువాడు, విష్ణుసేనకు అధిపతి, వైష్ణవ వర్గమునకు విఘ్నములను తొలగించుటలో ముందుండి కార్య నిర్వహణ సేయువాడు అయినట్టి విష్వక్సేనుని స్తుతించినారు. అటుపై క్రమంగ శాత్రవహృదయ విదారకమగు పాంచజన్యమును, దేవతలకు ఆనంద కారకమగు నందకమును, బృందారక బృందాలకు మోదము గూర్చు కౌమోదకిని, త్రివక్రను సమాంగి కావించిన శార్ఙ్గమును నుతించుట చేసి, తుదిగా రాహుమస్తాకాన్ని ఖండించిన, సుదర్శన చక్రరాజాన్ని ప్రస్తుతించినారు. తుదిగా మోక్షమార్గమును చూపు పన్నిద్దరు సూరులను స్మరించినారు. వీరే ద్వాదశ ఆళ్వారులు. ఈ మార్గములోనే పయనించినవారు పలువురు కలరు. శ్రీమదు మా మహేశ్వర వరప్రసాద లబ్ధ సార సారస్వతాభినంది నందిసింగయా మాత్య పుత్రుడగు సుజన విధేయుడగు తిమ్మన నామధేయుడు, పారిజాతాపహరణ కర్త, శ్రీవేంకటపతి స్తుతితో గ్రంథమారంభించినాడు. ఇక అప్పకవీయ కర్త దాదాపు అందరి దేవతలను స్తుతించినాడు. నవగ్రహాలను, దిక్పాలురను, కృష్ణుని మురళిని, పీతవసనమును, దశావతారములను, పంచాయుధాలను, హరిభక్తులను, మారుతిని, శ్రీని, భూదేవిని, అనంతుని, వైనతేయుని, విష్వక్సేనుని, విధాతను, భారతిని, శివుని, భవానిని, గణపతిని, కందుని, కౌస్తుభమును, వైజయంతిని, శ్రీవత్సమును... ఇలా కొందరి ఇష్ట

దేవతా స్తుతి సాగి పోయింది. నవీనకవులలో ఇంతటి స్తుతి కానరాదు. ఈరీతిగా వచ్చిన కొన్ని మార్పులను కొంత చూపడము జరిగినది.

మహాభారతములోని కొన్ని పద్యాలకు ప్రత్యేకమైన వ్యాఖ్యనందించారు 'ఆచార్య శలాక రఘునాథశర్మ'గారు, తమ 'కవిత్రయభారతజ్యోత్స్న'లో.

వారు నన్నయ్య గారి 'శ్రీవాణీగిరిజాశ్చిరాయ' శ్లోకానికి చేసిన వ్యాఖ్యలో  కొన్ని ప్రధాన అంశములను యథాతథంగ ప్రస్తావిస్తాము.[పుటలు/1-5]

" ఆంధ్రమహాభారతానికి తిలకం వంటిది ఈ శ్లోకం. నిత్య సత్య వచనుడు, మతిలో బృహస్పతి అనదగినవాడు, బ్రహ్మాండ పురాణం మొదలైన అనేక పురాణాల విజ్ఞానాన్ని హృదయంలో నింపుకొన్నవాడు అయిన నన్నయ్య భట్టారకుడు మంగళంతో కావ్యాలను ప్రారంభించాలనే అనుశాసనాన్ని అనుసరించి ఈ శ్లోకంతో భారతాన్ని ప్రారంభించాడు. మహాభారతం మంత్రమయమైన వేదం వంటిది కనుక అది దేవభాషలో ఉంటుంది. కనుక ఈ మంగళవాక్యాన్ని కూడా సంస్కృతములోనే నిబం ధించాడు. అర్థగాంభీర్యం, నాదసౌందర్యం, అలంకారాల ఉజ్జ్వలత్వం గల ఈ శ్లోకం గొప్ప మహిమతో అలరారే చక్కని వాక్కు. ప్రస్తావితమైన వారు ముగ్గురు పురుషులు. మూడు వేదాలమూర్తులు. శాశ్వతంగా హృదయ స్థానంలో ముఖంలో దేహంలో క్రమముగ, లక్ష్మిని సరస్వతిని పార్వతిని, ధరించిన వారై  స్త్రీ పురుషుల సమాగమంతో ఏర్పడిన లోకాల చెడిపోని స్థితిని ధరిస్తున్నవారు. దేవతలు వారిని నిరంతరం చక్కగా పూజిస్తూ ఉంటారు. వారిని పురుషోత్తముడనీ, అంబుజభవుడనీ, శ్రీకంధరుడనీ, అంటారు. వారు మీ శ్రేయస్సు కోసం అగుదురుగాక! నన్నయ్య భట్టారకుడు ఈ శ్లోకంలో 'సకల' బ్రహ్మ ప్రార్థన గావించాడు. సకలబ్రహ్మం అంటే నామరూపాదులతో తెలియవచ్చే పరమాత్మ తత్త్వం. దానినే 'సగుణం' అంటారు. సాధనమార్గంలో ఉన్నవారందరి సౌకర్యం కోసం వేదమాతయే దానిని అందించింది. దానికంటే ఆవలిది నిర్గుణ బ్రహ్మం. అది అందరికీ సులభమైంది కాదు. మహాతపస్సంపన్నులకు మాత్రమే అందు

ప్రవేశం. అందువలన సకల బ్రహ్మం ఏర్పడినది. ఇందులో నిష్ఠ కూడా నిర్గుణ బ్రహ్మనిష్ఠవంటిదే!

సకల బ్రహ్మములో సత్త్వము, రజస్సు, తమస్సు అనే మ్మోడు గుణాలు ఉంటాయి. సత్త్వం నిలువెల్లా నింపుకొని ఉన్న పరతత్త్వాన్ని విష్ణువుగా, రజస్సుతో కూడుకొన్న దానిని బ్రహ్మగా, తమస్సుగా ఏర్పడిన పరతత్త్వాన్ని శివునిగా వేదపురాణాదులు రూపొందించాయి. ఆ మూడు పేర్లు గల పురుషులను త్రిమూర్తులుగా అభివర్ణించాయి. వారికి నిర్దిష్ట మైన కార్యాలు  వరుసగా పోషణ, సృష్టి, లయం అనేవి. వారికి ఆయా కార్యాలలో తగిన సహకారాన్ని అందించే శక్తి స్వరూపాలు కూడా మూడు విధాలుగా ఉన్నాయి.ఆ శక్తి స్వరూపాలను స్త్రీ మూర్తులుగా ఏర్పరచి లక్ష్మి, సరస్వతి, పార్వతి అనే పేర్లు పెట్టారు. ఆ ముగ్గురు  ఈ ముగ్గురు స్త్రీలు కలసి జగత్తు వ్యవహారాన్ని నడుపుతుండటం వలన వారియందు పతిపత్నీ భావం /సంబంధం కలిగింది. అయితే ఈ జంటలు మనలాగా పార్థివ దేహాలతో ఉండవు. కనుక కేవలం మన దాంపత్యం వంటివిగా అనుకోరాదు. అవి తత్త్వాలకు రూపకల్పన చేయగా ఏర్పడిన స్థితులు. ఈ స్త్రీ పురుషయోగం వలన సృష్టి కలుగు తున్నది. నిలుస్తున్నది. మళ్ళీ సృష్టి ఏర్పడకముందు ఉండే స్థితిలోకి  లీనం అయిపోతున్నది. అందులోపరతత్త్వం సర్వాన్ని నిలుకడగా ఉంచే విధానంలో లక్ష్మీనారాయనులుగా, సృష్టి చేసే సందర్భంలో వాణీ హిరణ్య గర్భులుగా (బ్రహ్మ), లయకార్యములో పార్వతీపరమేశ్వరులుగా మనకు తెలియవస్తుంది. వారినే నన్నయ్య కవీంద్రుడు పురుషోత్తమ, అంబుజభవ, శ్రీకంధరులనీ, శ్రీ, వాణీ, గిరిజలనీ, ఈ శ్లోకంలోక్రమంగా పేర్కొన్నాడు. లోకముల స్థితిని వీరు చక్కగా వహిస్తున్నారు. ఈసృష్టి మొత్తానికి అంతా స్త్రీ పుంస యోగ+ఉద్భవ = స్త్రీపురుషుల కలయికవల్ల ఏర్పడినది. ఈ వ్యవహార చక్రము, అనాదిగా అనంతంగా అలా ప్రవర్తిస్తూనే యున్నది కనుక 'అవిహత'. అంటే ఏవిధమైన అడ్డూ ఆపు లేకుండా [దెబ్బతినకుండా] సాగిపోతున్నది. దానికి కారణం వారి 'ఆవహనం'. సంపూర్ణమైన వహించటం. దానిని అలా వహించటానికి కారణం ఆ ముగ్గురు పురుషులు ఈ ముగ్గురు స్త్రీలను శాశ్వతంగా(చిరాయ) ధరిస్తూ ఉన్నారు.పురుషోత్తముడు శ్రీని

వక్షమునందు, అంబుజభవుడు వాణిని ముఖమునందూ, శ్రీకంధరుడు గిరిజను అంగము (దేహము) నందూ ధరిస్తున్నారు. ఇందులో భావింపదగిన అంశం ఒకటి ఉన్నది. ఎవరైనా అలా ఆయా అవయవాలలో ఉంచుకొంటారా? ఉంచుకోగలరా? కనుకనే అది ఒక భావనతో చెప్పిన విషయంగా మనం గుర్తించాలి. విష్ణు వునకు శక్తి హృదయ స్థానంలోను, బ్రహ్మకు శక్తి వాక్కు స్థానంలోను, శివునకు సగభాగంలోనూ ఉంటుంది. అవే వరుసగా మనస్సు, వాక్కు, కాయమూ అనే మూడు కరణాలు. అనగా త్రికరణములు సాధారణంగా వీటినే 'మనోవాక్కాయకర్మలు' అంటారు. ఇచ్చట మొదటి పురుషుడు పురుషోత్తముడు. పరమాత్మనే ఆ పేరుతో వ్యవహరిస్తారని భగవద్గీతలో 'ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మేత్యుదా హృతః' అని భగవద్గీత అధ్యాయము-15, శ్లోకం-17 లో చెప్పడం కలదు. పురుషోత్తముని నాభికమలము నుండి ఉదయించినవాడు - బ్రహ్మ. ఆ బ్రహ్మ రుద్రుని పుట్టుకకు కారణమని కూడా పురాణాలవలన మనకు తెలియుచున్నది. అంటే విష్ణువు బ్రహ్మగ, బ్రహ్మ రుద్రునిగ పనులను బట్టి ఎర్పడుతారని భావము. మనం ఇక్కడ గుర్తించ వలసిన విషయం ఏమిటంటే ఈ ఆరుగురు [హరి బ్రహ్మ హరులు + శ్రీ వాణీ గిరిజలు = 6 ] ఆరు తత్త్వాలు. అంతే కాదు. ఒకే తత్త్వానికి చెందిన ఆరు భావనలు. మరి కొంత స్పష్టంగా చెప్పుకోవాలంటే ఆ పరతత్త్వమే పనులను బట్టి ఆరు పేర్లతో వ్యవహారంలో తోస్తుంది. ఆ ఆరు పేర్లతో వ్యవహరించే తత్త్వం ఒకటే కనుక ఆ తత్త్వాన్ని దేవతలందరూ 'సమ్' – మిక్కిలి భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఇక్కడ దేవతలంటే దివ్యమైన భావాలు, పంచభూతాలు, ఇంద్రుడు మొదలైన దిక్పాలకులూ, శమము, దమము మొదలైన భావాలు, శబ్దము, స్పర్శ మొదలైన విషయాలూ, కన్ను, ముక్కు, చెవి మొదలైన యింద్రియాలు, ఇంకా ఇటువంటివన్నీ. అవి అన్ని సమయా లలో, అన్నిదేశాలలో తమ సుస్థితికోసం, ఆ పరమాత్మ తత్త్వాన్ని పూజిస్తూ ఉంటాయి. అట్టి మహావిషయాలే పూజిస్తున్నాయి అంటే అల్ప శక్తితో కూడిన మనం ఇంకా యెంత గొప్పగా పూజించాలో ఊహించ వలసిన విషయం. ఆ తత్త్వం సర్వసమారాధ్యం అని తాత్పర్యము.

అంటే అందరికీ అన్నివేళలా ఆరాధింప తగినది. సృష్టిలో ప్రయోజనం లేకుండా బుద్ధిహీనుడు కూడా ఏపనీ చేయడని ఒక సూక్తి ఉంది.

( ప్రయోజన మనుద్దిశ్య న మందో(అ)పి ప్రవర్తతే). ఆ దేవతలు గానీ, ఈ మనం గానీ ఆ ఆరురూపాల సమాహారం అయిన తత్త్వాన్ని ఎందుకు పూజించాలి అనే ప్రశ్నకు సమాధానం 'వః శ్రేయసే భూయాసుః' [వారు మీ శ్రేయస్సు కోసం అగుదురు గాక!] అని చెప్పారు. వారు మీకు శ్రేయస్సును చేకూర్చాలి అని తాత్పర్యం. భౌతికమైన భోగ భాగ్యాదులను ప్రేయస్సు అనీ, పరమార్థ సంబంధమైన పరమ సుఖాన్ని శ్రేయస్సు అనీ, శాస్త్రాలు వ్యవహరిస్తాయి. ఆ ముప్పురు పురుషులు మీకు ఆ పరమ సుఖాన్ని ప్రసాదించుగాక! యని ఇక్కడ కవి ఆశీర్వది స్తున్నాడు. వః అంటే మీకు అని అర్థం.తాను వ్రాయబోయే ఆంధ్రమహా భారతాన్ని అధ్యయనం చేయబోయే వారినందరినీ ఎదురుగా ఉన్నట్లు భావించుకొని హృదయంలో ఆరువిధాలుగా దర్శనం ఇస్తున్న ఆత్మ తత్త్వాన్ని కోరుతున్నాడు. మహాత్మా! వీరికందరికీ శ్రేయస్సును అందించు అని, ఇది మహాకవి పలికిన మధుర ఆత్మీయతా ఆశీస్సు.

మరొక్క సంగతి. మహాభారతంలో ప్రత్యక్షంగా సర్వమూ తానయై నడి పించిన మహావ్యక్తి శ్రీకృష్ణుడు. ఆయన ఈ మంత్రమయ శ్లోకంలోని పురుషోత్తముడు. శ్రీకృష్ణుని మాయాప్రపంచ రూపమైన మహాభారత మనే ఆఖ్యాయికను (కథను) వాఙ్మయరూపంగా తీర్చిదిద్దిన శ్రీకృష్ణ ద్వైపాయనుడు (వ్యాసమహర్షి) ఇక్కడ అంబుజభావుడు. ఇది పాండవో త్తముల అమల చరిత్ర. దీనిలోప్రధాన నాయకుడు ధర్మరాజు. అతడు లయకారుడైన శ్రీకంధరుని ఆజ్ఞమేరకు సర్వాన్ని లయింపజేసే యముని కుమారుడు. శ్రీకృష్ణుని ఇచ్ఛాశక్తియే శ్రీలక్ష్మి. వ్యాసభగవానుని జ్ఞాన శక్తియే వాణి. ధర్మరాజుని క్రియాశక్తియే ద్రౌపదీదేవిరూప అయిన గిరిజ. వారు ఆరుగురూ శ్రీమహాభారతం అనే 'స్త్రీపుంసయోగోద్భవయైన' స్థితిని 'అవిహతంగా' నిర్వహించారు. ఇది మూడు వేదాల జ్ఞానవిజ్ఞానాలను నిలువెల్లా నింపుకొన్న మహేతిహాసం. అందువలననే విష్ణువు, బ్రహ్మ, శివుడు వేదత్రయమూర్తులని కవి ప్రత్యేకంగా చెప్పాడు. మహాభారతంలోనే

స్వర్గారోహణపర్వంలో ధర్మరాజు, దేవేంద్రునితో పాటు అందలి విశేషాలను చూస్తూ ఒక అత్యద్భుత కాంతి విశేషంతో వెలిగి పోతున్న స్త్రీని చూచి ఆమె ఎవరు? అని అడుగుతాడు. ఆమె లక్ష్మి. నీకు భూలోకంలో సాయపడటానికి గౌరీశుని ఆజ్ఞ మేరకు అవత రించిన ద్రౌపది అని చెబుతాడు. అంతేకాక సభాపర్వంలో ద్యూతసమయంలో ఆమెను 'శ్రీసమానయా' అని వ్యాసులవారు అన్నారు. ఆ విధంగా ఆమెయందు లక్ష్మీతత్త్వం స్ఫుటం అవుతున్నది. ఈ విధంగా ఆమె క్రియాశక్తి అనే విషయం సమన్వయం అవుతున్నది. దీనిని ఆ దృష్టితో పఠించిన వారికి పరమపదరూపమైన శ్రేయస్సు కలుగుతుంది. ఇది ఈ మంగళశ్లోకానికీ, రాబోయే మహారచనకూ సమన్వయం.  ఈ రీతిగా 'ఇష్ట దేవతాపరిణామక్రమము' కొంతమేర అవగాహనకై  చేసే ప్రయత్నం

9.1 *సంస్కృత కావ్యాల ప్రభావము* :- దాదాపు సంస్కృత భాష పురాతనమైనది. అందులో అపౌరుషేయములుగా చెప్పబడు వేదముల భాషకు, కొంత భిన్నముగా  సంస్కృత సాహిత్యము ముమ్మరముగా వెలువడినది. సంస్కరింపబడినదని సంస్కృత భాషకు గుర్తింపు. హిందూ దేశములో సంగీత, సాహిత్య, శాస్త్రీయాది శాఖలలోదేవభాషగ పిలువబడిన సంస్కృతము తనదైన ముద్ర వేసినది. పండిత భాషగా జనబాహుళ్యములోదీనిని పిలుచుటకద్దు. 'జనని  సంస్కృతంబు సకల భాషలకు' అని కొందరి అభిప్రాయము. కొందరు దీనికి వ్యతిరిక్తముగా వాదించుదురు. వారి వారి, ఆలోచనలు, ఉపపత్తులు, ఋజువులు వారివి. నేటికీ పలు కార్యక్రమాలు సంస్కృతముతోనో లేక ఆ భాషా ప్రభావముతోనో జరుగుచున్నదనుట విస్మరింపలేని వాస్తవము.

ఈ భాషా ప్రభావము సారస్వత వ్యవహారములోనున్నదనుట విస్మరించలేము. భాషాపరమైన విషయములో దీని నిర్మాణము విశిష్టమనక తప్పదు. నేటికినీ అనునిత్యము మనము కావించు/ పాటించు పూజలు, ప్రార్థనలు, దేవతాస్తుతులు, మాట్లాడు మాటలు అధికభాగము దేవభాష యగు సంస్కృత ప్రభావముతో తప్పక ముడివడినవి. కొన్ని సందర్భములలో ఆ భాష కాకున్నా తత్సమములనో, తద్భవములనో వాడుచున్నామని పలువురికి తెలియక పోవచ్చును, పండితులకు తప్పక తెలుసు.

ఈరీతిగా తెలుగు భాషపై దాదాపు 75 మొదలు 80 % దేవభాష ప్రభావము కలదు. ఇందులకు సంస్కృతము లోగల నిర్దిష్టము, నిర్దుష్టము అగు శబ్ద నిర్మాణము. పదములు మూల ధాతువులను [root] ఆధారముగా చేసికొని నిర్మితమగును. ప్రతి పదమునకు ప్రత్యేక మైన అర్థము ఉండును. తెలుగులో చెప్పబడు విభక్తి ప్రత్యయములు పదముతోనే దేవభాషలో చేరియుండుట వలన అభ్యాసము తప్పక కావింప వలసియుండును. పదములను ముందునుండి వెనుకకు, వెనుకనుండి ముందునకు చదివినప్పుడు అర్థములో మార్పు రాదు. కానీ కొన్ని సందర్భములలో ఈ రీతిగా కాక ముందునుండి వెనుకకు చదివి ఒక అర్థము, వెనుకనుండి ముందునకు చదివిన మరొక అర్థము వచ్చును. దీనికి చిత్రకవిత యని చతుర్విధ కవితలని నామకరణము కావించినారు. ఒకే శబ్దమునకు పలు [నానా] అర్థములు ఈ భాషలో కొల్లలుగా మనకు లభించును. కనుకనే నానార్థ రత్నమాలలు, ఏకాక్షర నిఘంటువులు ఏర్పడినవి. అమరకోశము వంటి నిఘంటువులు సిద్ధమై పుస్తకముల సాయము లేకుండా పూర్వము చదవగలిగినారు.

భాషలోని గంభీరత, ప్రామాణ్యత, విభిన్నప్రాంతాలలో భారతదేశమంతా ఒకే అర్థమును ప్రతిపాదించు పాటవము, సత్తా కలిగియుండిన కారణమున 'భిన్నత్వములో ఏకత్వము' నకు కారణమైనది. మొదట అనువాద రచనలు ఆపై ఆ భాషా ప్రభావము కలిగిన కొన్ని స్వతంత్ర రచనలు, ఆ తర్వాత కవుల మేధను అనుసరించి కొత్త కొత్త కవితా మార్గాలు ఉత్పన్నమైనవి. ఇక ఇప్పుడు హైకూలు, నానీలు, మాత్రా ఛందస్సులు ఇతరత్రా నూతన రీతులలో మార్పులు చోటు చేసుకొన్నవి.

9.2 *దేవతా స్తుతి పరిణామము* :- దేవతా స్తుతిపరిణామమును పరిశీలించినచో మనకు కొన్ని విషయాలు విశదమగును. నన్నయ గారు తమ మహాభారతేతితిహాసమును త్రిమూర్తుల స్తుతితో ఆరంభించిన విషయము తెలిసినదే. తర్వాతి కవులు క్రమక్రముగా కొన్ని నూతన ప్రయోగాలు మార్పులు కాలానుగుణముగా చేస్తూ వచ్చినారు. కవులు రాజుల ఆశ్రయము పొంది రాజుల అభిమతాను సారముగా కవిత చెప్పడము వారిని

కృతిభర్తలుగా చేసి కావ్య నిర్మాణములు చేయటము మొదలైన పిదప పీఠికలలో లేక అవతారికలలో చేయబడుచు వచ్చిన దేవతా స్తుతులయందుపెను మార్పులు చోటుచేసుకున్న విషయము అందరికి తెలిసినదే!

నన్నయ గారు త్రిమూర్తులు శ్రేయమునుచేకూర్చుదురుగాక – అని అనిన తర్వాత, మరొక స్తుతి కావించినారు. అది ఇచ్చట చూద్దాము.

తరలము "హరిహరాజగజాననార్క షడాస్య మాతృ సరస్వతీ

గిరిసుతాదిక దేవతా తతికిన్ నమస్కృతి సేసి దు

ర్భరతపోవిభవాదికున్ గురు పద్యవిద్యకు నాద్యు నం

బురుహగర్భనిభుం, బ్రచేతసుపుత్త్రు భక్తిదలంచుచున్" [1]

యథా తథాముగా తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే ప్రచురితమైన శ్రీ మదాంధ్ర మహాభారతమునందలి వివరణాదులు ప్రస్తావితము చేస్తాను. " _ప్రతిపదార్థం_ : హరి, హర+ అజ, గజానన + అర్క, షట్+ఆస్య, మాతృ, సరస్వతీ, గిరిసుత+ఆదిక, దేవతా తతికిన్ = విష్ణువు, శివుడు, బ్రహ్మ, యేనుగు మోముగల వినాయకుడు, సూర్యుడు, ఆరు ముఖములుగల కుమారస్వామి, లక్ష్మి, సరస్వతి, హిమవంతుని కూతురైన పార్వతి మొదలైన దేవతల సమూహానికి; నమస్కృతి+చేసి = [గసడదవాదేశ సంధి] నమస్కారం చేసి; దుర్భర, తపః, విభవ+అధికున్=[భరింపరాని]

అధికమైన తపస్సు యొక్క వైభవంచేత గొప్పవాడున్నూ; గురున్ =

గొప్ప వాడున్ను, ఆచార్యుడున్ను, అజ్ఞానాన్ని పోగొట్టేవాడున్నూ,; పద్యవిద్యకున్ = పద్య(శ్లోక) రచనా సంప్రదాయజ్ఞానానికి; ఆద్యున్= మొదటి వాడున్నూ (ఆదికవి), అంబురుహ గర్భ, నిభున్ = బ్రహ్మతో సమానుడైన వాడున్నూ, అయిన; ప్రచేతసు, పుత్త్రున్ = ప్రచేతసుని కుమారుడైన వాల్మీకిని; భక్తిన్= భక్తితో; తలంచుచున్=స్మరిస్తూ.

---

పాదసూచిక : [1] కవిత్రయ భారతం/ఆది/ఆశ్వా-1/21/పుట16

<u>*తాత్పర్యం:*</u> విష్ణువు, శివుడు, బ్రహ్మ, వినాయకుడు, సూర్యుడు, కుమారస్వామి, తల్లియైన లక్ష్మి, సరస్వతి, పార్వతి మొదలైన దేవతల సమూహానికి నమస్కారం చేసి, అధికమైన తపస్సంపదచేత, గొప్ప వాడున్నూ, అజ్ఞానాన్నితొలగించే ఆచార్యుడున్నూ, పద్య(శ్లోక) రచనా సంప్రదాయాన్ని ప్రవర్తింప చేయటంలో ఆదికవియున్నూ, బ్రహ్మతో సమానుడున్నూ అయిన ప్రచేతసుడి కుమారుడైన వాల్మీకిని భక్తితో స్మరిస్తూ.

<u>*విశేషం:*</u> కావ్యారంభంలో త్రిమూర్తులను, వారి భార్యలను, విఘ్నేశ్వరు డు మొదలైనదేవతలను భక్తితో స్మరించటం కవులకు పరిపాటి. ఈ సంప్రదాయానికి సంగ్రహంగా నయినా మార్గ దర్శకు డయింది నన్నయయే. అతడు సూర్యుడినీ, కుమారస్వామిని కూడా స్మరించాడు.

'మాతృ'శబ్దానికి సప్త మాతృకలు, లేదా అక్షర మాతృకలు అనే అర్థాలను కూడా చెప్పవచ్చును. తరువాతి వారు వీరిని స్మరించటం అరుదుగా కనపడుతుంది.

సంస్కృతములో రామాయణం రచించిన వాల్మీకి ఆదికవిగా పరిగణింపబడుతున్నాడు. " మానిషాద ప్రతిష్ఠాం త్వమ్" అనేది అతడు చెప్పిన మొదటి శ్లోకమని అంటారు. అంతకు ముందువెలసిన ఉపనిషత్తులలో కొన్ని శ్లోకాలు ఉన్నవి. అవి వైదికాలు. లౌకిక సంస్కృతములోమొట్ట మొదట శ్లోకం వ్రాసినవాడు వాల్మీకియే కావచ్చును. ప్రచేతసుడు ఒక ఋషి. ప్రచేతసుడు అంటే వరుణుడు అనే అర్థం కూడా ఉన్నది. అలంకారము : ఉపమాలంకారము.

గురుపద్యవిద్యకు ఆద్యుస్ అనే పాఠాంతరము ఉన్నది. గొప్పదైన పద్య(శ్లోక) రచనా సంప్రదాయానికి మొదటి వాడని దీనికర్థం. ఇదే ఉచిత పాఠమని తోస్తున్నది.

'గురుపద్యవిద్యకు ఆద్యుడు' అనే విశేషణం వాల్మీకికి ఎంత వర్తిస్తుందో నన్నయకూ అంత వర్తిస్తుంది. వాల్మీకి సంస్కృతంలోనూ, నన్నయ తెలుగులోనూ గురుపద్య విద్యకు ఆద్యులైన ఆది కవులు. వాల్మీకి మహాకవి అంశ నన్నయలోఉన్నదని ఈ విశేషణం ధ్వనింప చేస్తున్నది. ''మధుమయ ఫణితీనాం మార్గ దర్శీ మహర్షిః '' అనే భోజుడి ప్రశంస వాల్మీకితో

బాటు నన్నయకు కూడా సార్థకంగా వర్తిస్తుంది. ఇష్టదేవతా స్తుతి, పూర్వకవిస్తుతి అనబడే అవతారికాంగాలను నన్నయ ఈ పద్యములో నిర్వహించాడు.

తరల వృత్తానికి ప్రతిపాదంలోనూ 'న, భ, ర, స,జ,జ,గ' గణాలుంటాయి.

12వ అక్షరం యతి స్థానం. ఇందులోనిమొదటి రెండు లఘువులను ఒక గురువుగా మారిస్తే 'మత్తకోకిల' ఔతుంది. విశేషవృత్తాలలో ఈరెండింటినే నన్నయ ఎక్కువ సంఖ్యలో వాడాడు."

కాలక్రమములోమార్పులు చోటు చేసుకొన్నవి. నన్నయ గారు కేవలం దేవతలను స్మరించినారు. వారికి నమస్కార ములనర్పించినారు. ఉపాసనా విధులు, రీతులు, కవుల తీరులు పలుపోకడలు పోయినవి. ఆ దేవతాస్తుతులు పోయినపలు పోకడలలో కొన్ని చూద్దాము.

చాలామంది కవులు మొదటి పద్యములో శ్రీకారమునే వాడినారు. నన్నె చోడుడు శ్రీకారమును, మగణ మును ప్రయోగించినా, వృత్తమును మార్చికొనినాడు. స్రగ్ధరావృత్తమును 'మరభనయయయ' అను గణములచేనిర్మితమైన 'ప్రకృతి' ఛందములో21 అక్షరములుగల దానిని ప్రయుక్తము జేసినాడు. యతి 1-8-15 అక్షరాలకుచెల్లించవలెను. తర్వాత తిక్కనగారు, నన్నయ గారు అసంపూర్తిగా వదలిన ఆరణ్య పర్వమును, కారణములేవైన, కాకుండా , నాల్గవదైన విరాటపర్వము నుండి అనగా పాండవుల అజ్ఞాతవాసము మొదలు తుది వరకు అనగా స్వర్గారోహణ పర్వము వరకు రాసినారు. మధ్యలో ఆరణ్య పర్వశేషము మిగిలి పోయినది. తర్వాత ఎఱ్ఱన దీనిని పూరించుటతో, కవిత్రయ నిర్మితమైన సమగ్ర 'శ్రీమదాంధ్రమహాభారతము' సిద్ధించినది. అది తెలుగు వారి భాగ్యము అనక తప్పదు.

తిక్కన సోమయాజి గారు తనచే రాయబడిన భారతము, విరాటపర్వము 'హరిహరనాథుని' స్తుతితో ఆరంభించినారు.

ఆయన ఉత్పలమాలావృత్తములో 'శ్రీ'కారము , 'భ' గణములను వాడి పద్యాన్ని ఆరంభించినారు.

ఉ. " శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ

ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి 'విష్ణు రూ

పాయ నమశ్శివాయ' యని పల్కెడు భక్త జనంబు వైదిక

ధ్యాయిత కిచ్చు మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్ఠ సిద్ధికిన్" [1]

ఇందులోని విశేషమును ఇట్లు వివరించడము చూడగలము. విరాటపర్వము (తిక్కన) తొలి పద్యమునకు వ్రాయబడిన వ్యాఖ్య యథా తథాముగా స్వీకరింపబడినది. నన్నయ తరువాత తిక్కన ఆంధ్ర మహాభారతాన్ని విరాటపర్వము నుండి రచించటానికి ప్రారంభిస్తూ మంగళారంభంగా ఈ పద్యాన్ని రచించాడు. తానూ రచిస్తున్న భారత భాగానికి అవతారికను నిర్వహించాడు. దానిలోని మొదటి అంగం నాంది వంటి మంగళాశాసనం. అది 'శ్రీ'కారం తో ప్రారంభం కావటం సంప్రదాయం.శుభాలనూ సంపదలనూ కోరిన కోరికలనూ ఇచ్చే దేవత లక్ష్మి. ఆమె శ్రీ శబ్దంచేత సూచించబడింది.

"ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశో వా(అ)పి తన్ముఖమ్" అనే నియమం చేత గ్రంథారంభం ఆశీఃపురస్సరముగాకానీ, నమస్క్రియా రూపంగా కానీ వస్తు నిర్దేశకంగా (కథార్థ సూచకంగా) కానీ ఉండాలి. తిక్కన పర తత్త్వాన్ని ఇష్టసిద్ధికై ప్రార్థిస్తున్నాడు కాబట్టి, ఈ మంగళారంభ పద్యం నమస్క్రియా రూపమై రాణిస్తున్నది. నన్నయ ఆశీఃపురస్సరంగా మొదటి పద్యం వ్రాయగా, తిక్కన నమస్క్రియా రూపంగా వ్రాయటం గమనించ దగింది.

తిక్కన హరిహరులకు అభేదమనిచెప్పే భక్తి తత్త్వాన్ని ప్రతిపాదించాడు.

ఆ స్వామిని నిర్గుణంగాఉపాసిస్తే పరబ్రహ్మ తత్త్వం; సగుణంగా ఆరాధిస్తే హరిహరనాథ స్వామి. ఆయన భార్య కూడా శ్రీగౌరుల ఏకస్వరూపం.

ఆమెను లోకములో లక్ష్మీదేవి అనీ, గౌరీదేవి అనీ పిలుస్తారు - అని చెప్పటం విశేషం. అందుచేత దేవుడి రూపమొక్కటే; ఆయన దేవేరి కూడా ఒక్కతే. దీనితో పాటు మంత్రం

---

పాదసూచిక : [1] విరాటపర్వము ప్రచు తితిదే పుటలు 1- 2]

కూడా ఒక్కటే. అది "విష్ణురూపాయ నమః శివాయ" గ్రంథాన్ని శ్రీకారంతో మొదలుపెట్టటం మంగళప్రదం. విష్ణు రూపుడైనశివుడికి నమస్కారమన్నాడు తిక్కన. అంతే కాదు భారతం కార్ష్ణ వేదం (శ్రీకృష్ణ సంబంధమైన వేదం)అని ప్రసిద్ధి చెందింది. అందులో ఉపాసించదగింది వాసుదేవ తత్త్వమని పండితులు చెప్పుతారు. కాబట్టి శ్రీకారంతో తన కృతిని ఆరంభించి అనేక ప్రయోజ నాలను సాధించినాడు తిక్కన.

హరిహరనాథుడు తిక్కన కృతిభర్త కూడా కావటం విశేషం. హరిహరాత్మ కమైన రూపంధరించిన ఆ పరమాత్మ భద్రాయితమూర్తి. భద్రవదాచరితా మూర్తిః యస్యసః - మంగళ కరమైన మూర్తి కలవాడని అర్థం.

'కర్తుః క్యఙ్ స లోపశ్చ' అనే సూత్రం ప్రకారం క్యఙ్, అకృత్ సార్వ ధాతుకయోర్దీర్ఘః' అనే సూత్రం చేత దీర్ఘం వచ్చింది. భూతార్థక 'క్త' ప్రత్యయమున్నూ, ఇడాగమమున్నూ రాగా 'భద్రాయిత'మూర్తి అనే రూపం ఏర్పడింది.

శ్రీ గౌరీ శబ్ద వాచ్యురాలైన పరాశక్తికి పరమానందం కలిగించే భద్రమూర్తి హరిహరనాథుడని వర్ణించటం చేత మహాభారతంలో ప్రతిపాదించ బడే వైదికధర్మనిష్ఠమైన గార్హస్థ్య జీవితతత్త్వం ధ్వనిమయంగా సూచింపబడు తున్నది. నన్నయ త్రిమూర్త్యాత్మకంగా సూచిస్తే తిక్కన ఆ తాత్పర్యాన్నే హరిహరనాథ పరంగా చెప్పి వస్తు నిర్దేశంలో ఏకవాక్యతను పాటించాడు.

తిక్కన ఈ పద్యములో తన ఇష్ట సిద్ధిని కోరుతున్నాడు. కృతిభర్తఅయిన హరిహరనాథుడు ఉత్తమ కవితా శక్తిని ప్రసాదిస్తాడు. పరతత్త్వమైన ఆతడే జన్మాంతర దుఃఖం లేని మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. ఈ రెండు రకాల కోరికలూ అవతారికలో సూచించబడుచున్నాయి. అంటే మొత్తం మీద – కావ్యంవ్రాసిన తిక్కనకూ, చదివిన పఠితలకూ, ఇహపర సౌఖ్య ములు భారతంవలన కలుగుతాయని తాత్పర్యం. ఉత్పలమాలవృత్తం"

***ఆచార్య శలాక రఘునాథశర్మగారు తమ 'కవిత్రయభారతజ్యోత్స్న' [పుటలు 85 -88, 106 – 107] లో చెప్పిన విషయాలు కొన్ని ఎన్నిక చేసినవి ప్రస్తావిస్తాము. మహాభారతంలో లోకసాధారణమైన పలుకులలో వెలసిన ఒక వేదం. వ్యాసమహాముని సర్వ మానవుల హృదయాలను సంస్కరించటం కోసం పురుషార్థముల విజ్ఞానసర్వస్వంగా తీర్చి దిద్దిన గొప్ప**

ఇతిహాసం. నన్నయ తెలుగులో వ్రాసిన భాగం ఆగిపోయిన తరువాత తిక్కనమహాకవి తక్కిన భాగాన్ని తెలుగుజాతికి అందించటం
కోసం పూనుకొని మొట్టమొదటగా నమస్క్రియా రూపంలో చేసిన మంగళాచరణ పద్యం ఇది. వేద నాదాలను హృదయంలో వినిపించే సుమధురమైన ఉత్పలమాల. నన్నయ గారు 'శ్రీవాణీ గిరిజాః' అని ప్రారంభించి రచించిన శ్లోకంలో సగుణమైన పరమాత్మను ప్రార్థించినారు. ఆ ప్రార్థనకు ప్రయోజనం మనందరి శ్రేయస్సు. తిక్కనగారు కూడ సగుణ బ్రహ్మమునే ఈ పద్యములో ప్రార్థిస్తునారు. నామ రూపాదులు లేని తత్త్వాన్ని నిర్గుణమనీ, అవి కలిగిన దైవాన్ని సగుణమనీ వ్యవహరిస్తారు నామములు, రూపాలు దైవానికి సంబంధించి అనంతంగా ఉన్నాయి. అందులో ఎక్కువసంఖ్యలో ప్రజలు భావించి పూజించే దైవాలు ప్రధానంగా రెండు. హరి, హరుడు. నిజానికి ఇవి రెండూ రెండు కావని ఆ పేర్లే చెబుతున్నాయి. 'హర' అనేది ఆకారంతో, 'హరి' అనేది ఇకారంతో పూర్తి అవుతున్నాయి. రెండింటికి ధాతువు (verb root) ఒకటే. ఏర్పడే అర్థం కూడా ఒకటే. హరించువాడు – భక్తుల ఆర్తిని హరించువాడు. ప్రళయ కాలంలో సర్వమును హరించు వాడు అయిన తత్త్వ స్వరూపుని హరి, హరుడు అంటారు. కానీ పురాణాలలో ప్రజల రుచిభేదాలకు, అనుగుణముగా కథా రూపంలో చెప్పిన అంశాలను బట్టి ఆయనపేరు, ఈయన పేరు అనుకుంటారు. అది తప్పు కాదు. కానీ రెండు విభాగము లుగా అయిపోయి ఒకరినొకరు దూషించుకోవటం, ద్వేషించుకోవటం, ఆ దూషణద్వేషాలు ఆ తత్త్వాలకు అంటగట్టటం అవధులు దాటిపోయేదాకా వచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే పరమ అజ్ఞానం. పరమాత్మకు దూరంగా, ఊహ కందని దూరంగా – మనుష్యుణ్ణి పాపపంకిలం (బురద) లోనికి నెట్టివేసే మహాపాపం. సమాజం మీద పరమవాత్సల్యం కలిగి ఆ అజ్ఞానాన్ని తుడిచివేసి జ్ఞానాన్ని హృదయపీఠంమీద నెలకొల్పటానికి మహాత్ములు ఎంతో ప్రయత్నించి లాలించి పాలించి తెలియ చెబుతారు. అట్టి మహాత్ములలో మహోన్నతస్థితి కల తిక్కనసోమయాజి ఈ పద్యమనే మంత్రానికి ద్రష్ట. ఋషిపదవిలో ఉన్నవాడు.ఆయన హరీ, హరుడు ఇద్దరు కాదు నాయనా! ఒకే పరతత్త్వం. నీకు ఇష్టమైతే ఏదో ఒక పేరునూ, దానికి

సంబంధించిన పత్నీ స్వరూపాదులను గ్రహించి ఆరాధించుకో. కానీ రెండవ దానియందు అనిష్టభావం కలిగించుకోకు. మెల్లగా రెంటినీ ఒక్కటిగా హృదయపటం మీద కలిపి చూడటానికి గట్టిగా ప్రయత్నించు అని ప్రేమతో చెబుతూ 'హరిహరంబగు రూపము తాల్చి' అని ప్రకటిం చాడు. అలాగే శివునకు నమస్కారం అనివేద తత్త్వం తెలిసినవారు అంటూ ఆయన విష్ణురూపుడే అని మనకు గుర్తు చేస్తున్నాడు. కృష్ణ యజుర్వేదంలో శతరుద్రీయం అనే పేరుతో ఒక మంత్రసముదాయం ఉన్నది. ఆ సముదాయంలో అనేక రూపాలతో, భావాలతో, తెలియ వచ్చే శివతత్త్వానికి నమస్కరించటం ప్రధానాంశం. అందుకే దానిని 'నమకం' అంటారు. విష్ణువు అంటే విశ్వమంతా వ్యాపించి ఉన్నవాడు అని అర్థం.అలా వ్యాపింపగా పెక్కు రూపాలతో, భావాలతో తెలియ వచ్చే తత్త్వాన్నే 'శతరుద్రీయం' అభివర్ణిస్తుంది. కనుక దానిని 'వైదికం' – వేద సంబంధమైనది – అన్నారు. దానిని ధ్యానించేవాడు, చెదరకుండా హృదయాన్ని అక్కడ నిలిపే వాడు – ధ్యాయి. అతని భావం ధ్యాయిత.అంటే ధ్యానమే. ఒక్కటి ఉంటే ధ్యానం కుదురుతుంది. కనుక ధ్యానించ వలసిన ఆ ఒక్కటీ పరతత్త్వమే. పరతత్త్వం అంటే పరమాత్మ. అంతటా నిండి, అన్నీ అదేయై, అన్నింటికంటే విలక్షణంగా (వేరైనా గుర్తులు కల్గి) ఉండే దానిని పరమాత్మగా అభివర్ణిస్తూ ఉపనిషత్తులు మనక జ్ఞానం కలిగిస్తున్నాయి. అది నిర్గుణం. సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలస్పర్శ లేనిది అని ఆ పదానికి అర్థం. అందువలననే అది – పరం అంటే ఆవలిది. సగుణం కంటే ఆవలిది అని గ్రహించాలి. { ఈ సందర్భం వంటి చోట పోతన భాగవతం - స్కం.8 పద్యం 75 లో 'లోకంబులు లోకేశులు లోకస్థులు తెగినతుదినలోకంబగు పెంజీకటికవ్వలనెవ్వండే కాకృతి వెలుగునతని నే సేవింతుస్' అని నుతించినారు}.

ఆ గుణాలతో మనభావనకు వచ్చే ఆ పరతత్త్వమే హరి, హర నామము లతో తెలుస్తున్నది. గుణభావనలో శక్తి భావన కూడా ఇమిడి ఉంటుంది. ఆ శక్తిని స్త్రీ మూర్తిగా సంభావించారు. విష్ణువునకు సంబంధించిన శక్తి 'శ్రీ' – లక్ష్మి. శివునకు సంబంధించిన శక్తి గౌరి. ఈ రెండు పేర్లతో మనకు తెలియవస్తున్న 'చెలువ' ఒక్కతెయే. ఇద్దరు కాదు. అందుకే కవి చెల్వకు

అనిప్రయోగించినాడు. పల్లవించటం అంటే చిగురు తొడగడం. అది చైతన్యానికి, ఆనందానికి సంకేతం. ఆ రెండు రూపాలుగా ఉన్న శక్తి సర్వ జగత్తును ఏర్పరచటానికి, నిలుపటానికి, మళ్ళీ లయం చేసుకోవ టానికి, ఉత్సాహంగా ఉండటమే ఇక్కడ చిత్తం పల్లవించటం. దాని ప్రయోజనం ఆ పరతత్త్వం 'భద్రాయితమూర్తి' కావటం. శుభాన్ని కలిగించే స్వరూపం పొందటం. శుభం సర్వ లోకాలకు సంబంధించినది. ఆ కార్యవిశేషంకోసం హరిహరమైన రూపాన్ని రూపాన్ని ధరించినదట. విష్ణువుగా, శివుడుగా - శ్రీతో, గౌరితో కలిసి లోకాలకు శుభాన్ని సమ కూరుస్తున్నది. నన్నయ్యగారు చెప్పిన స్త్రీపుంసయోగాన్ని తిక్కన గారు ఈ విధమగా ఇందులో అనుసంధానించారు. అతి ముఖ్యమైన అంశం ఒకటి ఇక్కడ ఉన్నది. నమస్కారం ఎవరికి? శివునకు, ఎట్టి శివునకు? విష్ణు స్వరూపుడైన శివునకు. అంటే విష్ణువువచ్చి శివునిలో కలిసి పోయి మన నమస్కారం అందుకుంటున్నాడు. శివుణ్ణి జ్ఞానస్వరూపంగ తత్త్వవేత్తలు చెబుతారు. విష్ణువు పోషణ కర్త కనుక క్రియాత్మకంగా – క్రియయే – పనియే – స్వరూపంగా కలవాడు. 'సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే' అని గీత చెబుతున్నది. క్రియాత్మకమైన తత్త్వం జ్ఞానంలో లీనం కావటాన్ని తిక్కనగారు ఇక్కడ నిరూపిస్తున్నారు.

నమస్కారం అంటే తననుతాను ఇంద్రియాలతో కూడిన మనస్సుతో పాటు సమర్పించుకోవటం. అంటే విడిగా తానూ అంటూ ఒకటి లేకుండా చేసుకోవటం. పరమాత్మలో కలిసి పరమాత్మగా అయిపోవటం. అదే నిజమైన నమస్కార తత్త్వం. 'ఇష్ట సిద్ధికిస్ కొల్చెదస్' అన్నారు తిక్కనగారు. వ్యక్తిగా ఆయనకు ఇష్టమైనది పరతత్త్వతాదాత్మ్యం. అదే అయిపోవటం. మనందరికోసం సమష్టిగా ఇష్టం జ్ఞానస్వరూపమే అయిన భారతాన్ని తెలుసుకొని తెలియజెప్పటం. అది పరతత్త్వమ అనుగ్రహం వలన గానీ సిద్ధించదు. నిరంతరంగా భావిస్తూ వాక్కులతో పేర్కొంటూ, చేష్టలతో సేవిస్తూ ఉంటే ఆ అనుగ్రహం కలుగుతుంది.ఆ పని చేస్తూ ఉంటాను, అని ప్రకటన చేయటం మనలనలా చేయమని ఉపదేశించటం కోసం. నిజానికి హరియనిన, శ్రీయనిన, హరుడనిన, గౌరీయనినా ఉపనిష త్తులు నిరూపించిన పరమాత్మయే. ఆ తత్త్వంలో ఇన్నిలేవు. దానిని

పట్టుకోవటానికి ఇన్ని కావాలి. పువ్వు అన్నా, అందులోని వన్నె చిన్నెలు వాసనలూ పండూ అందులోని రసమూ ఇవన్నీ అనుభవం లోనికివచ్చే సమయానికి అది ఒక్కటిగానే ఉంటుంది. తిక్కన పద్యం ఈ విధంగా పరమనిగూఢమైనపరతత్త్వాన్ని అనుభవం లోనికి తెచ్చే ఉపనిషత్తు, అని అనడం సాహసం కాదు, సత్యదూరమూ కాదు.

కవిత్రయములో ఆదికవియగు నన్నయ, కవిబ్రహ్మ తిక్కనల పిదప శ్రీమదాంధ్ర మహాభారత రచనా రంగములోనికి వచ్చిన వారు ఎర్రాప్రెగడ. నన్నయ గారు అసంపూర్తిగా వదలిన ఆరణ్య పర్వమును నన్నయ పేరుమీదుగానే పూర్తి జేసిన ఘనుడు శంభుదాసుడు, ఎఱ్ఱన.

ఈయన కృషి వలన కవిత్రయ భారతము తెలుగు వారి భాగ్యముగా పూర్తి రూపము సంతరించుకొనినది. ఎఱ్ఱన, నన్నయ గారు తుదిగా రాసిన పద్యము ఇది.

ఉ. " శారదరాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులం
జారు తరంబులయ్యె వికసన్నవ కైరవగంధ బంధురో
దార సమీప సౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణ క
ర్పూర పరాగ పాండు రుచి పూరము లంబరపూరితములై" [1]

ఈ పద్యము పిదప విశేషముగా గల వ్యాఖ్య నిచ్చట యథా తథాముగా గ్రహించబడినది.

" పూరములం బరిపూరితంబులై – అనే పాఠాంతరము కొన్ని ప్రతులలో ఉన్నది. ఆరణ్య పర్వానికి సంబంధించి తాటాకు వ్రాత ప్రతులన్నితిలోనూ, ఈ పద్యం చివర 'నన్నయభట్టు కవిత్వంసంపూర్ణం' అనే వ్రాత కనపడుతున్నది. అందువలన విద్వాంసులు అందరు ఇంచుమించుగా ఏకగ్రీవమగా ఈ విషయాన్ని అంగీకరించి ఉన్నారు. ఇక, ఈ పద్యం చివర కొందరు పండితోత్తములు ఒక స్వారస్యాన్ని ఉల్లేఖిస్తున్నారు. నన్నయభట్టు ఇట అసంపూర్ణంగ ఆరణ్యపర్వశేషాన్ని ఎందుకు వదలి పెట్టాడు?

----------------------------------------------------------

పాదసూచిక : [1] భారతం/కవిత్రయ/ఆరణ్య/ఆశ్వా4/141

ఈ ప్రశ్నకు పలువురు పండితులు పలు రీతుల సమాధానాలు చెప్పుతున్నారు. కొందరు నన్నయ భట్టు మరణాన్ని, మరి కొందరు రాజరాజ నరేంద్రుడి మరణాన్ని కారణంగా ఊహిస్తున్నారు. అందరూ అంగీకరించిన విషయం – ఇచ్చట నన్నయ మహాకవి కవిత ఆగిపోవటం. ఈ పద్యంలోని చివరి పదగుంఫనం. పండురుచి పూరములు + అంబర పూరితంబులై –అని విరవటానికి బదులు – 'పాండురుచిపూరములన్+ పరపూరితంబులై' అని సంధి విశ్లేషించిన, నన్నయ వ్రాసిన చివరి పద్యంలో చివరి మాట ' పరపూరి తంబులై' అని ఏర్పడుతున్నది. నన్నయ మహాకవి ఇకపై భారతం వ్రాయటం పొసగదు అనిన్నీ, అది పర పూరితం కాక తప్పదు అనిన్నీ

సూచించటానికే ఇట్లా వ్రాశాడా? లేక కేవలం యాదృచ్ఛికంగా నన్నయ గంటం నుండి అట్టి పదగుంఫనం వెలువడిందా? భవభూతి మహాకవి – ఋషి కల్పుల వాక్కులను అర్థం అభిసరిస్తుందని చెప్పి ఉన్నాడు. {ఋషీణాం పునరాద్యానాం వాచా మర్థో(అ)నుధావతి} రాజరాజ నరేంద్రుడు నన్నయ మహాకవిని, మహాభారతాన్ని తెలుగున రచించమని కోరినప్పుడే, ఆ మహాకవి చెప్పిన సమాధానం అనుశీలించ తగింది.

చ. "అమలిన తారకా సముదయంబుల నేననను సర్వ వేద శా
స్త్రముల యశేషసారము ముదంబున పొందను బుద్ధిబాహు వి
క్రమమున దుర్గమార్థజల గౌరవభారత భారతీ సము
ద్రము తఱియంగ నీదను విధాతృనకైనను నేర బోలునే" [1]

పై పద్యంలో ఎవ్వరైనా ఒకరు భారతం తుదముట్ట వ్రాయజాలరని తెలిపి ఉన్నాడు. అందులో ఒక స్వారస్యం ఉన్నది. తానేకాదు, ఆ పని 'విధా తృకైనను నేరబోలునే" అన్నాడు. అనగా సాధ్యమైతే కవిబ్రహ్మకు సాధ్యం కావలె. కానీ, నన్నయ తనకు పిమ్మట సుమారు రెండు వందల సంవత్సరాల తదుపరి పుట్టే కవిబ్రహ్మ కూడా మహాభారతాన్ని పూర్తి చేయ లేడని చెప్పాడా? కవుల వాక్శుద్ధికి ఎన్నో నిదర్శనాలు పెద్దలు చూపగలరు.

-----------------------------------------------------

పాదసూచిక : [1] తి.తి.దే /కవిత్ర/భార/ఆది/1-19

నన్నయ మహాకవి మహాభారతం వ్రాసేనాటికి జ్ఞాన వయోవృద్ధుడు.
రాజరాజ నరేంద్రుడు క్రీ. శ.1022, ఆగష్టు పదునారవ తేదీన పట్టాభి షిక్తుడైనాడు.నందం పూడి శాసన కాలం 4-11-1015 తేదీ సూర్యగ్రహణ కాలం. అందు దాన గ్రహీత నారాయణభట్టు. మహాభారత రచనలో నన్నయభట్టుకు తోడ్పడినట్లు మహాభారత అవతారికలో ఉన్నది. కావున నన్నయ భట్టు మహా భారత రచనలో క్రీ.శ.1055 సంవత్సర ప్రాంతంలో ఆరంభించినట్లు చెప్పటం పూర్వ పక్షం లేని సిద్ధాంతం. అంటే రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తుడైన 32 సంవత్సరముల తరువాతాన్న మాట!
నన్నయ భట్టు మహాకవి ఉద్దేశ పూర్వకంగానే తానూ వ్రాసిన చివరి పద్యం చివర 'పరపూరితంబుగన్' అనే పద గుంఫనం ప్రయోగించి నట్లు  ఊహించటం బహుశః సత్య దూరం కాదేమో!
కవిత్రయములో  మూడవవాడైనను, తానూ రాసింది కొంతైనావిస్తృత మైన మహాభారతములో ఆరణ్యపర్వములో తుది మూడు ఆశ్వాసాలు  పూర్తిగా, మధ్యలోని నాల్గవ ఆశ్వాసములో 276 కలిపి దాదాపు 1573  గద్య పద్యాలు ఉన్నాయి. మొత్తము శ్రీమదాంధ్రమహాభారతమునందలి గద్య పద్యముల సంఖ్య- 21507 [18 పర్వాలు/ 63 ఆశ్వాసాలు]
ఎఱ్ఱన గారు 'నృసింహ పురాణము'ను 'హరివంశము'ను రచించిన వారు.
తితిదే వారు ప్రచురించిన మహాభారతములో పుట xxviii [28] xxix[29] లలో తెలుగు భాష ప్రాచీనత పద్య కవితల ఘనత ఇట్లు పేర్కొవడం చూడగలము. [యథా తథాముగా తీసుకోబడినది]
" తూర్పు చాళుక్యులు తెలుగును రాజ భాషగా చేసి ప్రజల భాషను గౌరవించారు. సంస్కృతభాషతో పాటు తెలుగులో కూడ శాసనాలు వేయించారు. శాసనాలలో పద్యాలను వాడారు. సంపూర్ణచ్ఛందోబద్ధ శాసనాలు కూడా తూర్పుచాళుక్యులే వ్రాయించారు. ఆ కాలంలో వెలువడిన పండరంగని అద్దంకి శాసనంలో (క్రీ.శ.849) ఒక తరువోజ వాడబడి

ఉన్నా, అదే కాలంలోనే వేయించిన గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనం మొత్తం సీస పద్యమయంగా ఉండటం గమనించ దగింది. ఆ తరువాత యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో అయిదు మధ్యాక్కరలు వాడబడినవి. మొత్తం మీద క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దంలో వేసిన తెలుగు శాసనాలలో జాతులో, ఉపజాతులో, ప్రసిద్ధంగా ప్రయోగింపబడ్డాయి. క్రీ.శ.1000 ప్రాంతంలో నిలిపిన విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు కనపడుతున్నాయి. అంటే 11 వ శతాబ్ది నాటికి చంపకమాలాది వృత్తాలు, మధ్యాక్కర, సీసం, తేటగీతి, ఆటవెలది, కందం మొదలైన దేశి చ్ఛందస్సులూ శాసనాలలోనికి ఎక్కాయంటే పద్య కవిత్వం ప్రజలకు దగ్గరగా చేరి బాగా ప్రచారంలో ఉండేదన్నమాట! శాసనపద్యాలలో నన్నయపద్య శైలితో పోలినరచన ఒకింత గోచరించటం వలన నన్నయకు ముందు దాదాపు రెండు మూడు వందల యేండ్ల నుండి తెలుగు పద్యకవిత్వం ప్రజాదరణ పొంది ఉన్నదని తెలుస్తున్నది.

"మునుమార్గకవిత లోకంబున వెలయగ దేశి కవిత పుట్టించి తెనుం
గున నిలిపిరంధ్ర విషయంబునజన చాళుక్యరాజుమొదలుగ పలువుర్"

అని నన్నెచోడుడు తన 'కుమారసంభవ' కావ్యావతారికలో పేర్కొన్నాడు

**పీఠికలలో అవతారికలలో తొలి ఆశ్వాస ఆరంభములో కొన్ని ఆచార వ్యవహారములను అనుసరించుచూ, సంప్రదాయాలను గౌరవిస్తూ, ఇష్ట దేవతా స్తుతులను చేయడమైనది. కవులు దాదాపు తర్వాతి ఆశ్వాసాల/ స్కంధముల/పర్వముల ఆరంభములోకూడా స్తుతులను జేసినారు.**

**స్తుతులు పెరిగిన తీరు కొన్ని విశేషములకు నిలయములైనవి. అట్టివి కొన్ని పరిశీలించెదము.**

'కేయూరబాహు చరిత్ర' లో 'మంచెనకవి' కృత్యాదియందుతన కృతిభర్త యైన 'పోలమ గుండని'కి దేవతలందరూ చల్లగా చూతురుగాక, ఎల్ల సంపదలు ఇచ్చుదురని ఆశించుట చూడగలము.

మొదట శ్రీకారముతో ప్రారంభించిన ఉత్పలమాల పద్యములో మంగళకరమైన లక్ష్మి కృతిభర్త యగు పోలమగుండనికి, సుకవి సేవ్యుడైన వానికి సుఖములు కలుగ వలెనని ఆకాంక్షించడం కలదు.

ఉ. "శ్రీవసియించుగాక సుఖసిద్ధి వహించి యనేక బంధు హం
సావళియుం బ్రహృష్ట రసికార్థి సముత్కర షట్పదంబునై
జీవన మెప్పుడుస్ సుకవిసేవ్యమనంబొగడొంది సర్వ పు
ణ్యావహమైన గుండ సచివాగ్రణిగేహ సరోవరంబునస్" [1]

ఒకరకముగా చెప్పవలెనంటే ఇది మార్మిక కవిత. పదములలోని రహస్యమును గ్రహించిన కలుగు ఆనందం చెప్ప నలవి కానిది. ఆ పద్య మర్మమును ఛేదించుటకు కొంత శ్రమ, ఆలోచన అవసరము.

చ. "కరిముఖుడశ్వినుల్ శ్రుతులు కంజసముద్భవు మోములంబికే
శ్వరు మొగముల్ తదాత్మజుని వక్త్రములాదిమునీంద్ర మండలం
బురగ పతుల్ గ్రహంబులు పయోరుహనాభుడు తారకంబులుస్
బొరిబొరి నెల్లసంపదలు పోలమగుండనికిచ్చుగావుతస్" [2]

బింబ ప్రతిబింబములవలె యున్నవని కొన్ని పద్యములను తెల్పడ మున్నది. ఆ పరిశీలన ఇప్పటికి మనకు అవసరము లేదు. మన లక్ష్య సాధనకుపకరించునది ఇష్టదేవతా స్తుతి. ఇచ్చటి మార్మిక పద్యకవిత లోని విషయముచూచెదము. పద్యమును విభజించి చూచిన యెడల కరిముఖుడు అశ్వినుల్, శ్రుతులు, కంజసముద్భవు మోములు,

---

పాదసూచిక : [1] &[2] కేయూరబాహు చరిత్ర/ మంచెనకవి/ ప్రథమా 1, 2 పద్యాలు.

అంబికేశ్వరునిమొగములు, తదాత్మజుని వక్త్రములు, మునీంద్ర మండలం , ఉరగపతుల్, గ్రహంబులు, పయోరుహనాభుడు, తారకంబులుస్ -- అను పదముల అర్థములు పరిశీలిద్దాము.

*కరిముఖుడు* = గణపతి[ఒకడు],

*అశ్వినుల్* = అశ్వినీదేవతలు [ఇద్దరు]

*శ్రుతులు* =రుక్,సామ,యజుర్వేదములు [మూడు] { స్త్రియామృ క్సామ యజుషీ అని అమరకోశము పుట/124},

*కంజ సముద్భవుమోముల్* = కమలమందు జనించినవాడు బ్రహ్మ అతని మోములు [నాలుగు],

*అంబికేశ్వరు మొగముల్* = పార్వతీ పతియైన ఈశ్వరుని ముఖములు {సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన} [అయిదు], *తదాత్మజుని వక్త్రములు* = పైన చెప్పబడిన అంబికాపతియొక్కసుతుడు

అయిన కుమారస్వామి యొక్క ముఖములు అనగా [ఆరు] {షడాననుడు =ఆరు ముఖములు కలవాడు స్కందుడు},

*ఆదిమునీంద్ర మండలము* సప్తర్షులు [అనగా ఏడుగురు]

[ఎవరెవరు సప్తర్షులు అని చూడగా పలు రూపాంతరములున్నవి]

అమరకోశమునననుసరించి, "సప్తర్షయో మరీచ్యత్రిముఖాశ్చిత్ర శిఖండినః" సప్త ఋషయః మరీచ్యత్రిముఖాః చిత్ర శిఖండిన ఇత్యుచ్యంతే. మరీచిః అత్రిః అంగిరాః పులస్త్యః పులహః క్రతుః వసిష్ఠ శ్చేతి సప్తైతే ఋషయః"

అత్రి, అంగిరస్సు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - అను వీరు ఏడుగురు సప్తర్షులు.

*ఉరగపతులు* = సర్పరాజులు [ఎనిమిది] {అష్ట నాగములు అనగా అనంతుడు, వాసుకి, తక్షకుడు, శంఖుడు, కులికుడు, కర్కోటకుడు, పద్మడు, మహాపద్మడు అను ఎనిమిది మంది సర్ప రాజులు}

*గ్రహములు* = నవగ్రహములు [తొమ్మిది] గ్రహాలు 9 > ఆదిత్య, సోమ, కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు , శని, రాహు, కేతు – అనునవి.

*పయోరుహనాభుడు* [పయోరుహము = పద్మము, నాభుడు = నాభియందు కలవాడు] = విష్ణువు {మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన పరశురామ రామ కృష్ణ బుద్ధ కల్కి} అను దశ అవతారాలు ధరించినవాడు.

*తారకంబుల్*: 'అశ్వని' మొదలు 'రేవతి' వరకు గల 27 తారకలు అని గాని ఆకాశ వీధిలో సాక్షాత్కరించు లెక్కకు మిక్కిలిన నక్షత్రాలు కానీ ....

వీరందరూ గుండన మంత్రికి సంపదలనిత్తురు గాక యని ఆకాంక్ష.

సంఖ్యా వాచకమును ప్రయోగించి చేసిన చమత్కారము. ఒకటి నుండి ప్రారంభించి అనంతమైన తారకల వరకు అందరూ సంపదలందించ వలెనను ఆశ ఆవిష్కారం అయినది.

ఇట్టిదే మరొక మార్మిక పద్యం. పద్యమును చదివినప్పుడు సమస్యగా నుండును. కానీ వాటిలోని సంకేతములో, కవిసమయములో, ప్రసిద్ధాంశాలో, గ్రహించి వాటి ఆధారముగా సమస్యగా కనిపించు విషయమును విశ్లేషించినచో అసలైన విషయము ఆవిష్కరింపబడి, చదువరులకు ఆనందము కలిగించును.

"సలిల విహారులిద్దఱును సంతత కానన చారులిద్దఱున్
వెలయగ విప్రులిద్దఱును వీరపరాక్రమశాలులిద్దఱున్
పొలతుల డాయువాడొకడు భూమిని చరించువాడు నొక్కడున్
చెలువుగ మీకభీష్ట ఫలసిద్ధి ఘటింతు రనంతకాలమున్" [1]

ఇందులో మర్మమును కొంత పరిశీలించినచో మనకు లభించు భావము.

సలిల విహారులిద్దరు = జలచరాలైన మత్స్య, కూర్మ అవతారాలు

కానన చారులు = అడవిలో తిరుగు వరాహ, నరసింహ అవతారాలు

వెలయగ విప్రులు ఇద్దరు = వామన, పరశురామ అవతారాలు

-----------------------------------

పాదసూచిక : [1] తెలుగు చాటు కవిత్వ/డా. సం. నరసయ్య /పుట 88

వీరపరాక్రమ సొలులిద్దరు = శ్రీరామ, బలరామ అవతారాలు పొలతులడాయువాడు = కృష్ణ అవతారము, భూమి చరించెడువాడు = కల్కి అవతారము ఇట్లు ఈ అవతార మూర్తులు మీకభీష్టఫలసిద్ధి కల్గింతురు గాక. ఇట్టిదే మరొకటి చూద్దాం.

'పాండురంగని తన పదగుంఫనముతో అర్చించినవాడు, 'తెనాలి రామలింగకవి', 'పాండురంగ మాహాత్మ్యము'లో. ఇచ్చట కవి ఒక చమత్కారము చేసినాడు. నిగమశర్మ ఉపాఖ్యానంలో భార్యా పుత్ర వియోగంతో పరితపిస్తున్న నిగమశర్మ, సంగమ తీర్థములో స్నానం చేసి నృసింహస్వామిని పలుమార్లు చూచుచు, తాదాత్మ్యము చెందినాడు. ఇచ్చట నిగమశర్మచేష్టలు దశావతారములతో పోల్చడము కవి ఘనతకు దర్పణము పడుతున్నది. ఐతే ఇది కావ్యము మధ్యలో. ఆ పద్యమును ఒకసారి చూద్దాము.

సీ. ఒకింత ఱెప్పవేయక చూచు పెఱవారి - మత్స్యావతారం
తలగొట్టుకొని దుఃఖ జలధిమునుగు – కూర్మావతారం
బిలము తెఱవుమంచు పృథివిలోఁ చొరబాఱు – వరాహావతారం
సమదిక స్తంభోద్భవము గమించు – నృసింహావతారం
తిరియువాడును బోలె దెసలకు చేయి చాచు – వామనావతారం
తొరగు నస్రాంబుధి తొప్ప దోగు – పరశురామావతారం
'హా! పోయితే!' యని అఱచు భార్య గుఱించి – రామావతారం
బహు విధేరాసక్తి భ్రాంతి పొందు – బలరామావతారం
గీ. చేరగారాని దర్శనస్థితి వహించు - బౌద్ధావతారం
బాడబ స్ఫూర్తి లోగొన్న పగిది నుండు – కల్కి అవతారం
దానవారాతికొటూని తదవతార
దశకమును మున్నె తాల్చెనా ధరణి సుతుడు. [1]

------------------------------------------------------------

పాదసూచిక : [1] పాండురంగ మాహాత్మ్యము/ తెనాలి రామలింగకవి/ అశ్వాసము 3/102

9.3 *స్తుతులు పరమ ప్రయోజనాలు* : - స్తుతుల వలన కలుగు లాభాలేమిటి? స్తుతులను చేయుట వలన మనకు కలుగు పరమ ప్రయోజనాలేమి? అను అంశములను అధ్యయనము చేసినపుడు మనకు తోచు కొన్ని వివరములు ఈ రీతిగా పేర్కొనవచ్చును. మొదటే చెప్పినట్లు స్తుతిచే తృప్తి చెందని వారు లేరు. 'స్తోత్రం కస్య న తుష్టయే' అను కాళిదాస సూక్తి ననుసరించి స్తుతిచే ప్రసన్నులు కాని వారు విశ్వమునందెవ్వరూ ఉండరు. అందువలననే వేదములు, ఇతిహాసములు, పురాణములు, కావ్యములు అన్నియూ స్తోత్ర విలసి తములై అలరారుచున్నవి. స్తోత్రము ద్వార తాను చేరవలయుననుకొనులక్ష్యము చేరినచో చేసిన స్తోత్రమునకు ఫలము పొందినట్లే కదా! హిందూ సంప్రదాయములో చేయబడు పూజలందు ఫలానా ఫలమును పొందుటకై ఈ పూజ/ సేవ/ స్తోత్రము/ కైంకర్యము చేయుచున్నాని సంకల్పములో చెప్పడమున్నది.

ఇందులో భౌతికమగు సౌఖ్యములను మానవుడు ఆశించుచు భగవంతుని ప్రార్థన చేయుట మనము గమనింప వచ్చును. అనుదినము, పారాయణవలన, స్మరించుటవలన, పఠనమువలన, ఆరాధింపబడిన దేవతలు, ప్రసన్నులై తమను ఉపాసించు/ ప్రార్థించు/ ఆరాధించు భక్తులకు సర్వ శుభములను వలసిన సంపదలను, సుఖములను ప్రసాదించుదురు. ఇది ఈ దేశమందలి విశ్వాసము.

సంకల్పము/ ఉపాసన/ప్రార్థన/ - ఏదైనారెండు విధములుగా ఉండును.

ఒకటి *సకామ సంకల్పము* – ఇందులో యజమాని / భక్తుడు తనకు కలిగిన కష్టమును తొలగించమని చేయు పూజ/ప్రార్థన/ఉపాసన. ఆ సందర్భములో ఈ రీతిగా సంకల్పముండును > "మమ సర్వారిష్ట నిరసన పూర్వక సర్వ పాపక్షయార్థం, దీర్ఘాయురారోగ్య ధన ధాన్య పుత్రా పౌత్రాది సమస్త సంపత్ ప్రవృద్ధ్యర్థం ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం, శ్రుతి, స్మృతి, పురాణోక్త ఫల ప్రాప్త్యర్థం ...... (దేవ/దేవతా) ప్రీత్యర్థం ......పూజనమహంకరిష్యే"

పైన చెప్పబడిన సకామ సంకల్పములో యే దేవుని/దేవతను పూజిస్తున్నామో ఆ దేవుని/దేవతను మన కోరికను తీర్చమని అభ్యర్థించుట చేయుచున్నాము. ఈ సంకల్పములో మమ [ఏ భక్తుడైతే కోరికలు తీర్చమని అడుగుచున్నాడో వాని యొక్క] నాయొక్క, అన్ని అరిష్టములను నిరసించుచు, సకల పాపములు క్షయ [నశించుటకు] మగుటకు, దీర్ఘకాలము జీవించుటకు, ఆరోగ్యము కొరకు, ధనము కొరకు, ధాన్యము కొరకు, సత్సంతానము [పుత్రులు] కొరకు, సంతానముయొక్క సంతానము కొరకు [పౌత్రులు], అన్ని రకములైన సంపదల లభ్యతకొరకు, వాటి వృద్ధి కొరకు, నాలుగు విధములైన ధర్మ అర్థ కామ మోక్షములను పురుషార్థములకొరకు, శ్రుతులలో, స్మృతులలో, పురాణములలో చెప్పబడిన ఫలితముల కొరకు.... ఫలానా దేవుని / దేవత ప్రీతిగా పూజను అహం[నేను] చేయుదును.

ఇక రెండవ దైన "నిష్కామ సంకల్పము" : ఇచట 'కోరుట/ కోరిక ' లేదు కనుక సంకల్పము ఇట్లుండును. ఉదా. శివుని సంబంధ సంకల్పము

.........శుభతిథౌ || శ్రీ సాంబసదాశివముద్దిశ్య, శ్రీ సాంబసదాశివప్రీత్యర్థం, పార్థివలింగ పూజనమహం కరిష్యే. తత్రాదౌ కలశ పూజాం కరిష్యే. నిర్విఘ్నతా పరిసమాప్త్యర్థం మహాగణాధిపతి స్మరణం చ కరిష్యే| ఇలా ఉండును. { ఫలాన శుభ దినము/తిథి/ రోజున అంబతో కూడిన శివుని ఉద్దేశించి ఆ సాంబశివుని ప్రీతి కొరకు పార్థివ లింగమునకు పూజను చేయుదును. అట్టి పూజ మొదలిడి, సంపూర్తిగా ముగియుట కొరకై విఘ్నపతి యగు మహాగణపతిని స్మరించు చున్నాను}

ఈ రీతిగా నిష్కామ సంకల్పముతో జరుగు పూజ యుండును.

నవగ్రహములకు సంబంధించిన స్తుతులలో సకామ సంకల్పముతో జరుపబడు పూజవిషయమునిచట కొంత వివరించుట జరుగుచున్నది.

'ఆత్మపీడోపశాంతయే' సూర్యుని, 'మనః పీడోపశాంతయే' సోముని,

'రోగపీడోప శాంతయే' కుజుని, 'బుద్ధి పీడోప శాంతయే' బుధుని,

'పుత్ర పీడోప శాంతయే' గురుని, 'పత్ని పీడోపశాంతయే' శుక్రుని,

'ప్రాణ పీడోప శాంతయే' శనిని, 'చక్షుః పీడోపశాంతయే' రాహువును,

'జ్ఞాన పీడోప శాంతయే' కేతువును – సేవించ వలెనని పెద్దలనినారు.

పై విషయమును పరిశీలించినపుడు, ఒక్కొక్క గ్రహము మనపై చూపు ప్రభావమును గ్రహింప గలము. ఆ పూజ వలన కొంత వరకు ఆపదల నివారణ జరుగగలదని నమ్మకము/విశ్వాసము.

ఈ విషయమును దృష్టిలో పెట్టుకొని, కావ్యముల మొదట దేవతా స్తుతి చేయుట ఆరంభమైనది. తొలి కావ్యములలోప్రారంభమైన ఈ విధానము రాను రాను స్తుతుల సంఖ్యను పెంపు జేసినది. యయాతి చరిత్రలో పొన్నిగంటి వారు ఒక్క లక్ష్మిని మాత్రమే స్తుతించినారు. దీనికి కృతిభర్తను దృష్టిలో నుంచుకొని కావచ్చు. 'ధనమూలమిదం జగత్' అనబడు పలుకు కారణం కావచ్చు. సంపదలు అందరికిని అవసరమే కదా. ఐతే 'సంపద' అనుదానికి నిర్వచనమును జాగ్రత్తగా పరిశీలిస్తే కేవలము 'ధనము' అని పరిమిత అర్థములో గ్రహించ కూడదు. కొన్ని సంపదలు కంటికి కనిపించవు. ధనమును ఆశించువారి గురించి శ్రీసూక్తము 19 -21 సూక్తాలలో ఇట్లు చెప్పడమున్నది.

అశ్వదాయీ గోదాయీ ధనదాయీ మహాధనే|
ధనం మే జుషతాం దేవి సర్వకామాంశ్చ దేహి మే||
పుత్రపౌత్ర ధనం ధాన్యం హస్త్యశ్వాదిగవే రథమ్|
ప్రజానాం భవసి మాతా ఆయుష్మంతం కరోతు మామ్||
ధనమగ్నిర్ధనం వాయుర్ధనం సూర్యోధనం వసుః |
ధనమింద్రో బృహస్పతిర్వరుణం ధనమశ్నుతే||

దీని భావమును ఇట్లు చెప్పడము కలదు. " అశ్వ, గో, సంపదలను ధనాధిపతియగు మహాలక్ష్మి ప్రసాదించుగాక. పుత్ర పౌత్ర ధన, ధాన్య, హస్తి, అశ్వ, గో, రథాదులను ఇచ్చు

గాక. ఆయుష్మంతుని చేయుగాక. అగ్ని, వాయు సూర్య, వసువులూ, ఇంద్రుడు, బృహస్పతి, వరుణాదులు ధనమునసుభవించు చున్నారు. ఇందులో ఆయా దేవతలవద్ద కలిగిన వస్తువులు అనగా కాంతి, వాయువు, ఓజస్సు, బుద్ధి, వర్షాదులు అన్నియు ధనముగనే భావించతగును.ఈ రీతిగా స్తుతులవలన మనకు భౌతికమగు సంపదలు, ఆధ్యాత్మిక సంపదలు, దేవతా స్తుతివలన లభించుట పెంపొందుట జరుగును. కావ్య నిర్మాతలగు కవులకు, కృతిభర్తలకు, పాఠకులకు ఇహ పర సౌఖ్యములు కలుగునను భావన ఇష్ట దేవతా స్తుతుల పరమ ప్రయోజనముగా నిశ్చయింపవచ్చును.

9.4 దేవతా స్తుతులు – ఆధ్యాత్మికత : - సావధికునకు నిరవధికునకు [ జీవునికి – దేవునికి] మధ్యగల బంధము ఆత్మ అని పెద్దలమాట. జీవుడు ఆత్మ. దేవుడు పరమాత్మ. పరమాత్మ లోని అంశము ఆత్మ. దేవతాస్తుతులలో ఆధ్యాత్మికత యొక్క ప్రయోజనమేమిటి? అని ఆలోచన చేసినపుడు కొన్ని విశేషములు మనకు లభించును. అసలు దేవతా స్తుతులలో రూపములయొక్క ప్రసక్తి ఎందుకు అనునది మరొక అంశము. ధర్మ, అర్థ, కామ మోక్షములను చతుర్విధ పురుషార్థములను సాధించుట మానవుని కర్తవ్యము. ఇది పూర్వీకుల జీవన విధానము. కనుకనే కాళిదాసు రఘువంశములో [రాజుల] జీవిత లక్ష్యములను ఇట్లు పేర్కొనడ మైనది. " శైశవే2భ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణామ్, వార్ధకే మునివృత్తీనాం యోగేనాన్తే తనుత్యజామ్" జీవిత పరిధి పరిమితమైనదని తెలిసిన వారు సుఖమైనజీవితమును, భౌతిక విషయములలో అవసరమైనంత వరకు ప్రకృతిని, గౌరవభావముతో ఉపయోగించుకొని ఆనందమును పొందినారు. ప్రజలు, ప్రభువులు ప్రకృతి హితము కొరకు పాటుపడినారు. ఈ సందర్భములోనే ప్రకృతి నుండి కళలు, నేర్చుకొన్నారు. ఆధ్యాత్మికభావన పెంపు చేసికొన్నారు.

విశ్వజనీనమైన కావ్యమునకు విఘ్నములు కలుగకుండా వుండవలెనను తలంపుతో కావ్యాల ఆరంభములను కొన్ని నియమాలను పాటిస్తూ చేసినారు. అపరిమిత శక్తివంతుడైన, సకల శుభ లక్షణములు కలవాడైన భగవంతుని స్మరించుట లాభము, శుభమని తలచినారు. ఇది ఇహ పరములను సాధించగలదని నమ్మినారు. పోతనగారు విశ్వజనీనమైన ప్రార్థనను చేయుట చూడగలము. ఇది ఒక ప్రాంతమునకు, వ్యక్తికి, మతమునకు చెందినదికాదు. సర్వమానవాళికి చెందినది. దీనిని ఒక గజేంద్రుని (మృగ రూపి) ద్వారా చేయించుట విశేషము. మకరి బారిన పడిన కరి చేసిన స్తుతి.....

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై

యెవ్వని యందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూల కారణం

బెవ్వడనాది మధ్య లయుడెవ్వడు సర్వముదానయైన వా

డెవ్వడు వానినాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్"

నిరాకార స్వరూపమైనవాడు, నిరంజనుడైనవాడు, జగదాధారుడైనవాడు అయిన ఆ పరతత్త్వమును గుర్తించుటకై, అతి పరిమితమైన శక్తి, యుక్తులు కల జీవుడు కొన్ని ప్రయత్నాలను చేసినాడు. అందులకే మానసిక భావన చేయటము మొదలుపెట్టినాడు. తద్భావనలో కొన్ని రూపములను దర్శించినాడు. ఆ రూపాలను దేవతా రూపాలుగా నిర్ణయించుకొనినాడు. నిర్గుణుడైన దేవునికి కొన్ని గుణాలను ప్రతిపాదించినాడు. మానవుని ప్రగతి మార్గానికి అవరోధం కలిగించే స్వార్థ ప్రేయ మార్గమునుండి శ్రేయోమార్గమువైపు నడిపించే సముచిత పద్ధతి 'ఆధ్యాత్మిక భావన' ఈ ఆధ్యాత్మిక భావన, స్తుతుల ద్వారా చేసినపుడు కావ్య రచయితలకు, పాఠకులకు, శ్రోతలకు లభించి చక్కని లాభము చేకూర్చుతుంది. ఈ సన్మార్గములో పయనించిన రాముడు ఆరోహణా క్రమములో దేవుడు కావడము, ఉత్తమమైన వంశములో జననమంది, అవరోహణా క్రమములోదిగజారిన నడతతో పతనమైన వాడు రావణుడు. వీరి చరిత్రయే ఆధ్యాత్మ రామాయణము. తొలి భాగాలలో ప్రస్తావించినట్లు, కావ్యము శాశ్వతమైనది. రాజులేపోయినా, రాజ్యాలు పోయినా, కావ్యాలు అక్షరమై నిలచినవి. దీనికి ఉదాహరణగా మనము యెన్నైనా పేర్కొనవచ్చు. చాళుక్య వంశస్థుడు రాజరాజ నరేంద్రుడు, కాకతీయ ద్వితీయ ప్రతాపరుద్రుడు, విద్యా(విజయ) నగర శ్రీకృష్ణదేవరాయలు మొదలైనవారు. చాళుక్య, కాకతీయ, విజయనగర రాజ్యాల పెంపుసొంపులన్నీ కాలగర్భములో కలసిపోయినవి. కానీ ఆ రాజుల కాలములో గ్రథితమైన ఆంధ్రమహాభారతము, ప్రతాపరుద్ర యశోభూషణము, స్వారోచిష మనుసంభవము మున్నగునవి ఇప్పటికీ తమ ప్రతిభా వైభవ ప్రాభవమును కొనసాగిస్తూ ఉన్నాయి, కొనసాగిస్తూ ఉంటాయి. అందులో దేవతా స్తుతులు కావ్యావతారికలలో ముందుగా నిలచినవి. భగవదారాధనను సాధారణముగా రెండు విధముల చేయుట చూడగలము. ఒకటి సగుణోపాసన, రెండవది నిర్గుణోపాసన. ఈ సందర్భములో సంగీతరత్నాకరకర్త శార్ఙ్గదేవుని నాదపరమైన విషయము గుర్తుంచుకొనుట అవసరమే!

నాదము ఆహతమని, అనాహతమని రెండు విధాలు. ఇందులో అనాహతము కేవలము మోక్షమపేక్షించు మునులకు సులభమై యుండి, సాధారణ నరులకు ముదమును కూర్చనిదై యుండును. ఆహతము సర్వజన రంజకమై, భవభంజకమై యుండునని చెప్పడము చూడగలము. అదే రీతిలో నిర్గుణోపాసన అభ్యాసము చేసిన అసాధారణమైన వారికి ప్రయోజనకారి కాగలదు. అతి సామాన్యునికి కూడా ప్రయోజనకారి – సగుణోపాసన. కంటికి కనిపించుట, చెవులకు వినిపించుట మొదలైన భౌతిక చర్యల ద్వారా దీనిని సులభముగా గ్రహించుట/ ఆచరించుట చేయవచ్చు. దేవతాస్తుతులకు ఆధ్యాత్మ భావన చేకూర్చుటతో పాటు కవి తనయొక్క లక్ష్యమును కూడా ప్రస్తావించుట జరుగును. 'శ్రీవాణీగిరిజాశ్చిరాయ' అని తెలుగుమహాభారతము ఆరంభించిన నన్నయ్య భట్టారకుడు పురుషోత్తమ, అంబుజభవ, శ్రీకంధరులు శ్రేయస్సును చేకూర్చుదురుగాక యనిఆశీస్సులను అందించగా, తన నాటి పరి స్థితులలో మతపరమైన వైషమ్యాలు సమాజానికి శ్రేయము కూర్చవని హరి హరులకు మధ్య అంతరము లేదని, హరిహరులు ఒకటేనని, సిరి గౌరులు ఒకటేయని నూతన భావ మార్గమును అనుసరించినాడు తిక్కన. పోతన 'శ్రీకైవల్య పదంబు చేరుట' తన లక్ష్యముగా పేర్కొనుట తెలిసినదే! ఈరీతిగా అవతారికలలోని ఇష్టదేవతా స్తుతులు సమాజమునకు మంచి కలుగవలెనని కాంక్షించినవి. ఇందులో ఆయా ధర్మములను పాటించునపుడు మతప్రభావము కలవారు ఇష్ట దేవతా స్తుతులలో వారివారికి ఇష్టమైన దేవతా మూర్తులను ఆ దేవతా మూర్తుల లీలలను విపులముగా ప్రతిపాదించుట చూడగలము. అప్పకవీయములో అందరికన్నా అధికముగా దేవతాస్తుతులను చేసినట్లు చూడగలము. అందులో అష్ట దిక్పాలకులను, నవగ్రహాలను, శంకర, పార్వతి, గణపతి, స్కందులను, విష్ణు, లక్ష్మి, బ్రహ్మ, శారదలను స్తుతించుట కలదు. మరింతగా వెన్నుని పంచాయుధాలను, తుదకు పింఛమును, మురళిని, పీతాంబరమును, గరుడాదులను నుతించుట ఈఆధ్యాత్మికతాభావనకు పతాకస్థాయి.

**********************************స్వస్తి**********************************

# అనుబంధము I

# *అనుబంధము* I

## 1. దేవతా స్తుతులు – సంగణకయంత్రశాస్త్ర పరిశోధన – సమన్వయం :

ఏ రంగమైనా పాదుగొల్పబడాలి అనంటే దానికి శాస్త్రీయమైన ప్రతిపత్తి చాలావసరం. శాస్త్రానికి అనుగుణమైన భూమికలు ఆయా రంగాల్లో పోషింపబడిననాడు ఆ రంగాలన్నీ ప్రామాణ్యాన్ని పొందుతాయి. అందుకే సాహితీ వేత్తలు కూడా ఇటీవలి కాలంలో భాషా సాహిత్య పరికరాలతోనే కాకుండా శాస్త్రీయ విధివిధానాన్ని కూడా చొప్పిస్తూ వాఙ్మయాన్ని నిర్మిస్తున్నారు. ఇది కాలక్రమశాస్త్రాన్ని అనుసరించి జరుగుతున్న ఒక గొప్ప పరిశోధన. ఇలాంటి శాస్త్రీయమైన పరిశోధనలవల్ల సాహిత్యరంగానికి కూడా సమాజంలో ఒక విలువ ఏర్పడుతుంది. అందుకే అధ్యాత్మికతలో కూడా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిశోధనల్లో డా. చాగంటి రామారావుగారి పరిశోధన కూడా ఒకటి. ఫలితంగా వారు దేవతలకు ఎందుకు అష్టోత్తర నామాలు, సహస్రనామాలు ఉన్నాయని ఒక గొప్ప పరిశోధనను చేశారు. ఫలితంగా వారు ఆ దేవతల దివ్యరూపాలను రేఖాచిత్రాలలో కంప్యూటర్లో దర్శించారు. కాబట్టి ఇష్ట దేవతాస్తుతుల వల్ల ఆధ్యాత్మిక ప్రయోజనం కూడా ఉన్నదన్న మాట. వారు చేసిన పరిశోధన 2013 వ సంవత్సరంలో " ఋషిపీఠం" విశిష్ట సంచికలో ప్రచురితమైనది. ఇందులో వారి పరిశోధనావిధానం వివరింపబడింది. ఆ వివరణాత్మక వ్యాసాన్ని కూడా జత చేస్తున్నాను. పఠించగలరు.

డా॥ చాగంటి రామారావు

# అక్షరాలలో కనిపించే అక్షర రూపాలు!



మన సనాతన సంప్రదాయానికి ప్రతీకలుగా నిల్చిన పూర్వ ఋషులు వారి చుట్టూ ఉన్న ప్రకృతినీ దాని పరిణామ గతులను గూర్చి నిరంతరం ఆలోచిస్తూ, ధ్యానిస్తూ ఉండేవారు.

ఈ దృశ్యమాన జగత్తుకు మూలమైన ధర్మాలనూ వాటి ఆవిర్భావ స్వభావాది కారణాలనూ గూర్చిన వారి అధ్యయనం అంతా గహనమైన అంతర్ముఖ తపోసాధనాత్మకంగా జరిగిందని పెద్దలు, విజ్ఞులు వివరిస్తారు.

సునిశితమైన సూక్ష్మమైన మనస్సు అంతరంగాల లోతులను దాటుకుంటూ జగదావిర్భావ స్థిత్యంత కారణాలను స్పృశిస్తూ ఆయా కాలాల్లో ఆయా మహానుభావులు జరిపిన సాధనాత్మక ప్రయోగ ఫలితాలన్నీ మనకు వేదపురాణాదుల్లో గోచరిస్తాయి. వారు సిద్ధాంతీకరించిన సూత్రాలను వారి అనుభూతులకందిన నిత్య సత్య జ్ఞాన సంపదను ఎన్నెన్నో కథల రూపాల్లో, స్తోత్ర రూపాల్లో అందించబడిన విధానం గమనిస్తే పరమాశ్చర్యకరంగానూ, అద్భుతంగానూ ఉంటుంది.

ఆ మహా ఋషుల సాధనల్లో వారికి గోచరించిన, అనుభూతమైన అనంత పరబ్రహ్మజ్ఞాన స్వరూపాన్ని సాధారణ జనావళికి అందించడం కోసమని వారు అక్షరాలను, పదాలను ఆశ్రయించారు. ఆయా అక్షరాల్లో, పదాల్లో, చిన్న చిన్న వాక్యాలలో విశ్వావిర్భావ కారణాలను, వాటి రూపు రేఖలను, వాటి మహత్తత్త్వాన్ని సూక్ష్మ (Zipped form) రూపంలో నిక్షిప్తం చేశారు.

అటువంటి అర్థవంతమైన అక్షరాల, పదాల కూర్పులే మంత్రాలుగా, ఋక్‌లుగా, బీజాక్షరాలుగా విలసిల్లుతున్నాయి. ఆయా మహానుభావులకు అనుభూతమైన తత్త్వసారాన్ని, వారికా ప్రయత్నాలలో గోచరించిన అనేకానేక దివ్య రూపాలను వారు కీర్తిస్తూ, స్తుతిస్తూ మంత్రాలుగా, స్తోత్రాలుగా వెలువరించినట్లు కనిపిస్తుంది. వాటిని మన పురాణాల్లో అష్టోత్తరశత నామావళులుగా, సహస్రనామ స్తోత్రాలుగా అందించారు. వారు పొందిన అనుభవాన్ని, దర్శించిన నిత్యసత్యాన్ని వారికి గోచరించిన దివ్య రూపవిభవాన్ని మనలాంటి సాధారణ మానవులం అనుభవించగలమా? దర్శించగలమా? అనేది ఒక ప్రశ్న. అలాంటి అనుభవాలు కలగాలి అంటే తీవ్ర, కఠోర సాధనలుండాలని పరమహంసాదుల నిర్దేశం. ఇది సత్యం. గుర్వనుగ్రహంతో, భగవదాశీర్వాద బలంతో, శ్రద్ధాభక్తులతో కూడుకున్న తపనతో ఇది సాధ్యం అని అందరికీ సువిదితమే!!

అక్షరాలలో నిక్షిప్తం చేయబడ్డ శక్తి, దృశ్యాలు, రూపాలు, సత్యం, అనుభవాలు మొదలైనవి, మనం ఆ అక్షరాలను, నామాలను,

(పరిశోధనాత్మక రచన)

మంత్రాలను జపిస్తున్నపుడు, ధ్యానిస్తున్నపుడు, పారాయణ చేస్తున్న పుడు, మననాదులు చేస్తున్నపుడు తిరిగి దివ్యరూపాలుగా గోచరిస్తాయా? అనే దిశలో ఈ క్రింద వివరించిన పరిశోధనాత్మక ప్రయత్నం చేయడం జరిగింది.

### శబ్దం - మనస్సు

మనకు కల్గిన ఏదైనా ఒక అనుభవాన్ని గానీ, చూసిన దృశ్యాన్ని గానీ ఇతరులకు అందించాలని అనుకున్నప్పుడు వాటిని తెలిసిన శబ్దాల ద్వారాగానీ, వాక్యాల ద్వారాగానీ వివరిస్తాం. అపుడు ఆ యా అక్షరాల్లో లేక శబ్దాల్లో నిక్షిప్తం చేయబడ్డ ఆ యా అనుభవాలు, దృశ్యాలు కర్ణేంద్రియం ద్వారా మనసుకు చేరవేయబడుతాయి. అపుడు మనసు (brain) ఆ యా దృశ్యాలనీ, అనుభవాలనీ మనో ఫలకం మీద చూడడం చేస్తుంది. అంటే అక్షరాలలో నిక్షిప్తం చేయ బడ్డ దృశ్యంగానీ అనుభవం గానీ శబ్దం (Sound) నుండి విడగొట్ట బడి అటు దృశ్యంగానో అనుభవంగానో మనస్సుకు గోచరిస్తాయి. ఇక్కడ భౌతికమైన శాబ్దికమైన అక్షరాలు వాహకాలుగా పనిచేస్తూ అవి మోసుకొచ్చిన దృశ్యాలను మనోఫలకానికందిస్తాయి. ఈ విధమైన ప్రక్రియ మనం చదువుతున్నప్పుడు కూడా జరుగుతుంది. మానవ మస్తిష్కం (Brain) లో దృశ్యాలను అక్షరాల నుండి విడ దీయగలిగే సాంకేతిక పరిజ్ఞానం ఒకటి ఉన్నదని భావించవచ్చు. దీనిని Demodulation వంటి ఒక పద్ధతిగా మనం ఊహించు కోవచ్చు.

ఉదాహరణకు: "ఒక నల్లకుక్క వేగంగా నన్ను కరవాలని అరుస్తూ వెంటబడి తరుముకొచ్చింది. నేను భయంతో అరుస్తూ పరుగు లంఘించుకున్నాను. ఒళ్ళంతా చెమటలు, వణుకు, ఆయాసం....." అంటూ ఎవరైనా వారి అనుభవాన్ని వివరిస్తూ, లేక దానిని మనం చదువుతున్నా, వెంటనే మన మనోఫలకం మీద నల్లకుక్క, దాని పరుగు, వణికే మనిషి ఇత్యాదులు గోచరించడంతో పాటే ఆ అనుభవాన్ని పాక్షికంగా మనం కూడా అనుభవిస్తాం కదా!! అంటే అక్షరాలలో నిక్షిప్తం కాబడ్డ విషయాలను మనసు (Brain) లేదా మస్తిష్కం (i) శబ్ద అక్షర రూపాల నుండి విడగొట్టి (ii) పూర్వం శ్రోత లేక చదువరి మస్తిష్కంలో పొందుపరచబడ్డ ఆ యా రూపాలతో సమన్వయపరుస్తూ, మనకు రూప భావాలుగా ముద్రిస్తుంది. ఇది అందరికీ అనుభవమే కదా!

ఇలా వివిధ రూప దృశ్యాదులుగా విడగొట్టబడడం ఫోరియర్ విశ్లేషణ (Fourier Analysis) లాంటి ఒకానొక పద్ధతి ద్వారా మస్తిష్కం చేస్తున్నది. మన మస్తిష్కంలోకి ఇంద్రియాల ద్వారా చేర వేయబడుతున్న తరంగాత్మకమైన భౌతిక శక్తి క్షేత్రాలను ఆ యా పౌనఃపున్యాలు (Frequencies) గా విడగొట్టి, అవి మోసుకొచ్చే అనుభవాలను, దృశ్యాలను డీమోడ్యులేట్ చేసి మనోఫలకం మీద

## ఆచారాలు-అభీష్టసిద్ధులు



సోమనాథో వైద్యనాథో ధన్వంతరిరథాశ్వినౌ।
పంచైతాన్ యః స్మరేన్నిత్యం వ్యాధిస్తస్య నజాయతే॥

'సోమనాథుడు, వైద్యనాథుడు, ధన్వంతరి, అశ్వినీ దేవతలు (ఇరువురు) - ఈ ఐదుగురుని నిత్యం స్మరించు వారికి వ్యాధులు కలుగవు.'

అశ్వని దేవతల పేర్లు: నాసత్యుడు, దస్రుడు-అని కొన్ని పురాణాల వచనం.

మానవ మస్తిష్కం ముద్రిస్తుంది. విద్యుదయస్కాంత శక్తి తరంగ క్షేత్రం మీద ఆరోపించబడిన (modulate) శబ్ద, దృశ్య తరంగాలను రేడియో, టీవీ లాంటి గ్రాహక సాధనాలు, విద్యుదయస్కాంత క్షేత్రాన్ని విడదీసి మరల శబ్దంగానో దృశ్యంగానో ఏ విధంగా అందిస్తాయో (దీన్నే శాస్త్ర పరిభాషలో Demodulation అంటారు) అదే విధంగా మస్తిష్కంలోని సాంకేతిక పరిజ్ఞానం ఆయా అక్షరాల్లోని దృశ్యాల్ని విడదీసి చూపిస్తుంది.

ఈ భౌతిక శాస్త్ర సూత్రాలనాధారంగా చేసుకొని, మన సహస్ర నామ, అష్టోత్తరశతనామాలలో నిక్షిప్తం చేయబడ్డ దేవతా స్వరూపాలను ఆవిష్కరించడం జరిగింది. శ్రద్ధగా గమనించండి. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం.

ఈ పరిశోధనాత్మక ప్రయత్నంలోని ప్రాథమిక ఊహనములు (Assumptions).

1. మన సనాతన మహర్షులు, మహానుభావులు చెప్పినవన్నీ పరమ సత్యాలు కావచ్చుననే ఒక ప్రాథమిక నమ్మకంతో
2. అక్షరాలలో (తద్వారా పదాలలో) శక్తి, దృశ్యం, సత్త్వం, అనుభవం ఇత్యాదులు నిక్షిప్తం అవగలుగుతాయి అనే సాధారణ సత్యాన్ని నమ్ముతూ
3. మానవ మస్తిష్కం ఫోరియర్ విశ్లేషణ, నిర్గలనం (Filtering), డీమోడ్యులేషన్ వంటి విధాన పరిజ్ఞానంతో పనిచేస్తుందని తలపోస్తూ
4. సహస్రనామాలు, అష్టోత్తరశతనామావళులలో భగంతుని గుణాలను, విభవాలను, విభూతులను వివరించడమే గాక తత్సంబంధ దేవతా సగుణ రూపాకృతులు నిక్షిప్తం చేయబడ్డాయి అనే విశ్వాసంతో
5. ఈ నామాలను ఆధునిక శాస్త్రీయ పద్ధతి ద్వారా (మానవ మస్తిష్కం వాడే విశ్లేషణా పద్ధతులవంటి) విశ్లేషించినట్లైతే ఆ యా దేవతా రూపాలు ఆవిష్కరించబడగలవనే ఊహనం (assumption) తో
6. నామానికి, నామికి భేదం లేదన్న సనాతన ధర్మసూత్రం మీద సశాస్త్రీయమైన నమ్మకంతో


– ఈ క్రింది పరిశోధనాత్మక కార్యక్రమం చేయబడింది. ఈ పరిశోధనా ఫలితాల నుండి శ్రీ లలితాపరాభట్టారిక, గరుడారూఢ శ్రీమహావిష్ణువు, జ్యోతిర్లింగాంతర్గత అరుణాచల లింగ స్వరూపాకృతులు దర్శనమిచ్చాయి. గమనించండి.

**అనుసరించిన విధానపు సరళి**

నామాలు అక్షరాల మాలికలు కదా!! ఈ అక్షరాల మాలికలను సంఖ్యామాలికలుగా మార్చడమే ఇందులోని మొదటి మెట్టు (first step). మన భాషలోని అ నుండి క్ష వరకు గల అక్షరాలకు అంకెలను ఆపాదించడం జరిగింది.

అ=1, ఆ=2, ఇ=3, ఈ=4.... ఈ విధంగా ఒక్కొక్క అక్షరానికి ఒక సంఖ్యను నిర్దేశించాం. తరువాత ప్రతీ నామంలోని అక్షరాలను అంకెలు రూపంగా మార్చి కలుపగా వచ్చిన మొత్తం ఆ నామపు సంఖ్యగా ఉపయోగించబడింది. ఉదాహరణకు శ్రీ అనే అక్షరం శకార, రకార, ఈకారాల కలయిక కదా.

శ్రీ=శ+ర+ఈ=44+40+4=88. శ్రీ యొక్క సంఖ్య=88. ఈ విధంగా చేయగా; శ్రీమాతా = 88 + 40 + 2 + 31 + 2 = 163 అనే సంఖ్యతో నిర్దేశింపబడుతుంది. అలా ప్రతి నామాన్ని సంఖ్యగా మార్పు చేయడం జరిగింది. నామమాలిక సంఖ్యా మాలికగా పరివర్తనం చేయబడింది. అంటే అష్టోత్తరశత రూపం నామావళిలో 108 సంఖ్యలు (నామాలకు బదులుగా అన్నమాట), అదే విధంగా సహస్రనామాల్లో 1000 సంఖ్యలు ఉంటాయి. ఈ క్రింది చూపబడిన అరుణాచల అష్టోత్తరశతనామావళి (సంఖ్యా మాలికను) గ్రాఫును గమనిస్తే అది గజిబిజిగ్గా, ఎగుడుదిగుళ్ళతో కనిపిస్తుంది.




ఈ బొమ్మలో మనం ఏ విధమైన రూపాన్ని చూడలేక పోతున్నాం కదా!! ఇక్కడ X–అక్షం మీద నామం యొక్క సంఖ్య Y–అక్షం మీద ప్రతీనామం యొక్క మొత్తపు విలువ గుర్తించబడింది.


**భగవద్రూపం కనిపించాలంటే స్థితిని (Domain)ని మార్చాలి**


భగవద్దర్శనం కలగాలంటే లౌకిక స్థితి నుండి పారలౌకిక లేక సమాధి స్థితికి వెళ్ళాలని కదా మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

అదేవిధంగా శాస్త్రీయ పద్ధతులలో కూడా కొన్ని కొన్ని శక్తి క్షేత్రాలను సులభతరంగా అవగాహన చేసుకోవడానికి Space domain or time domain నుండి పౌనఃపున్య (frequency domain) స్థితిలోకి మార్చడం ఉన్నది. ఈ స్థితి మార్పువల్ల గుహ్యమైన, నిక్షిప్తమైన విషయాలు బయటపడతాయి. ఈ స్థితిమార్పు పద్ధతినే ప్రస్తుతం పైన బొమ్మలో చూపిన అష్టోత్తరశతనామావళి సంఖ్యామాలిక మీద వాడుదాం. ఈ విధంగా మార్పు చేయడానికి కంప్యూటర్, ఫాస్ట్ ఫోరియర్ ట్రాన్స్ఫామ్ (FFT) అనే ఒక ప్రోగ్రాము వాడబడింది.

ఈ విధంగా సంఖ్యామాలికను పౌనఃపున్య స్థితిలోకి మార్చినపుడు ఈ సంఖ్యామాలిక నాలుగు విధాలుగా విడగొట్టబడుతుంది. వీటినే సాంకేతిక పరిభాషలో నిజ (real component), ఊహాత్మక (imaginary component), కంపన పరిమితి (amplitude or energy component), దశ (phase component) గా పిలుస్తారు.

ఈ విధంగా రెండవ మెట్టులో సంఖ్యామాలిక పౌనఃపున్య సంఖ్యామాలికగా స్థితిమార్పు చేయబడుతుంది. ఇపుడు ఈ స్థితిలోని నిజ, ఊహాత్మక సంఖ్యలను ఒకదానిని X అక్షం మీద, మరొకదానిని Y అక్షం మీద గుర్తిస్తే మీరు రెండవ బొమ్మలో చూపిన






ఆవిష్కృతమవుతుంది. జాగ్రత్తగా గమనిస్తే, లింగాకృతి, అందులో అరుణగిరినాథుని రూపం కనిపిస్తుంది. ఈ బొమ్మను రంగుల స్థితిలోకి మారిస్తే మూడవ బొమ్మగా రూపాంతరం చెందింది. అది అరుణాచల అష్టోత్తర శతనామావళిలో నుండి ఆవిష్కరించబడిన అరుణగిరినాథుడని మా నమ్మకం.

భగవాన్ శ్రీరమణ మహర్షులవారు అరుణాచలేశ్వరుడే అరుణాచలంగా మారి అరుణగిరియోగిగా నిత్యం దర్శనమిస్తారని, ఈ అరుణాచల పర్వతానికి అరుణాచలేశ్వరునికి భేదం లేదని నిరంతరం చెప్తూండేవారు. వారి వచనాలు అసత్యం కావు అనడానికి ఇంతకన్నా ఋజువేం కావాలి. నామికి, నామానికి తేడా లేదనే సత్యం మరొక్కసారి ఋజువు కాబడింది కదా!!

గౌతమ మహర్షికి అరుణాచలేశ్వరుడు స్వయంగా ప్రత్యక్షమై అరుణాచల అష్టోత్తరశతనామావళి స్తోత్రాన్ని అనుగ్రహించాడని స్కాందపురాణాంతర్గత కథనం. అంటే ఎదురుగా ప్రత్యక్షమై సరూపంగా గోచరించగా గౌతమ మహర్షి ఆ తేజోలింగాంతర్గతమైన అరుణాచలేశుని చూస్తూ ఆ అనుభవసారాన్ని ఇలా 108 నామాల్లో నిక్షిప్తం చేశాడన్నది పురాణ సత్యం.

ఇది సత్యం గాబట్టి ఈ విశ్లేషణలో అది దృశ్యమానమైంది. జాగ్రత్తగా మూడవ బొమ్మను గమనిస్తే నందీశ్వరుడు కూడా దర్శనమిస్తాడు.

### శ్రీ లలితా పరాభట్టారికా దివ్య దర్శనం :-




వశిన్యాది వాగ్దేవతానీకము సింహాసన స్థితమైన శ్రీ లలితా పరాభట్టారికా దేవిని చూస్తూ తన్మయత్వంతో గానం చేసిన సహస్రనామ స్తోత్రావళిలో అమ్మవారు కనిపించాలని తపించగా, సరిగ్గా శరన్నవరాత్రులలో దుర్గాష్టమి పర్వదినాన మా అదృష్టం కొద్దీ కంప్యూటర్ స్క్రీన్‌మీద అమ్మవారు దర్శనం ఇచ్చారు.

తిలకించి పులకించాము మేము. తిలకించి తరించండి మీరు.

ఇది అమ్మవారి అనుగ్రహం కాక మరేమిటి?

### శ్రీ గరుడవాహనారూఢ మహావిష్ణు దర్శనం



మాధవమాసంగా పేరొందిన విష్ణుప్రీతికరమైన వైశాఖ మాస ప్రారంభ దినాన మా కంప్యూటర్ స్క్రీన్ మీద దర్శనం ఇచ్చిన ఈ దివ్య రూపాన్ని తిలకించండి. క్రింద రెక్కలు విప్పారుతూ, ఊర్ధ్వ దృక్కులతో స్వామిని వీక్షిస్తున్న గరుడుడు. పైన గజేంద్రుని రక్షణార్థం, ధరాతలానికి విచ్చేస్తున్న గరుడారూఢ ఆదినారాయణమూర్తిని మనసారా వీక్షించండి.

### మా మాట

నమ్మకం, భక్తి, శ్రద్ధ, ఆసక్తి, తపన అనే మానసిక ప్రవృత్తులతో, ఏకీకృతమైన ధ్యానంతో భగవత్సంబంధమైన స్తోత్రాలను ధ్యాన జపాదులుగా మార్చి, మనోఫలకాలను పరిశీలిస్తే ఆ యా అక్షరాలలో నిక్షిప్తంగాబడ్డ దృశ్యం దర్శించిన వీలు కలుగుతుందని మహాత్ములు చెప్పిన సత్యం ఋజువు గాబడిందని ఈ పరిశోధనా ప్రయత్నం ద్వారా సాధించిన ఫలితాలవల్ల మా నమ్మకం దృఢపడింది.

*(ఈ భగవద్దర్శనాలన్నీ ఆ భగవంతుని కృపా సౌభాగ్యాలుగా భావిస్తూ, ఈ పవిత్ర యజ్ఞంలో నిరంతరం, శ్రద్ధతో, భక్తితో సహచరించిన శ్రీమతి కొల్లూరి వేంకటలక్ష్మిగారికి హృదయపూర్వక ఆశీఃపూర్వక కృతజ్ఞతలు.*

*అదే విధంగా డా॥డి.వి. రమణ, శ్రీ ఆర్. కృష్ణకిషోర్, శ్రీ బుచ్చిబాబు మరియు శ్రీమతి పర్వీన్ బేగంలకు కృతజ్ఞతలు).*

# అనుబంధము II

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

# 'ఇష్టదేవతా స్తుతులు - పరిణామక్రమము'

- బోలుగద్దె అనిల్ కుమార్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

"శ్రీకారముతో కావ్యమును ఆరంభించుట నన్నయాది కవులనుండి పరంపరంగా వచ్చుచున్న సత్సంప్రదాయము. ఈ సంప్రదాయమును చిరస్థిరమొనర్చు సంకల్పముతోడనే తెలుగు వారు (ఛందోవేత్తలు) అంతకుముందు సంస్కృతాలం కారికు లెవ్వరూ పేర్కొనని 'శ్రీ' కారమునకు గల ప్రత్యేకతను తమ లక్షణ గ్రంథములలో ప్రకటించిరి. అది కృతికర్తకు, కృతిభర్తకు కల అన్యోన్య సమాశ్రయ సౌజన్య సంపత్తికి, ఉభయ నిష్ఠమగు ఐహికాముష్మికాభివృద్ధికి పరమ సాధనమని మన ప్రాచీనుల అభిమతము. అద్వైత భావ దర్శనమునకు, ముకుర సదృశము" అని డా॥ మల్లెల గురవయ్యగారు (తమ 'ఆంధ్రప్రభోధ చంద్రోదయము - అవతారికా విశేషములు' అను తమ సిద్ధాంత గ్రంథములో) వివరించినారు.

'అ' కారమునకు హరి హర చతురాననులు, శ్రీకార మున 'హరిప్రియేశనారీ చతురాస్యకాంతలు సూచితము. కావు ననే శ్రీకారము సర్వశక్తి సమీకృత చిహ్నముగా సంభావితమైనది' అనియు పేర్కొన్నారు.

ఈ పరిణామక్రమములో నన్నయగారు తెలుగు మహా భారతమును తొలి పద్యమును శ్లోకముగా కూర్చినారు. ఇది సంస్కృత భాషామర్యాదలను అనుసరించినది. తెలుగులో ఛందోవేత్తలు చెప్పిన ప్రాస, యతి నియమాలు అనుసరించ లేదు. కానీ 'మసజసతతగ' అను గణములు కూర్చబడినవి. నాలుగు పాదములచే నిర్మితమైనది. తొలుత సృష్టి స్థితి లయ కారకులగు త్రిమూర్తులను వారి పత్నులను శ్రేయస్సు కొరకై స్తుతించుట జరిగినది. ఇచట వరుసగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాక, విష్ణు, బ్రహ్మ, శ్రీకంధరులను పేర్కోవట మున్నది. మానవునికి తొలుత 'స్థితి' తర్వాత 'సృష్టి' కారణము, ఆపై 'లయము'ను తెలిసికోవడము జరుగును. ఆ క్రమమును అనుసరించి శ్లోకములో, 'శ్రీవాణీగిరిజా' స్మరణము జరిగినది. వీరిని త్రిమూర్తులు క్రమముగా హృదయమున, ముఖమున, శరీరమున ధరించినారు. శ్రీకారము యొక్క ఘనతను పైననే పేర్కోవటము గలదు. శక్తియుతమైనపుడే మానవుడు కార్య సాధన చేయగలడు. లక్ష్యమును చేరుకోగలడు. ఈ సందర్భాన ఆదిశంకరులవారు సౌందర్యలహరిలో చెప్పిన విషయము ఇట్లున్నది.

"శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి
అతస్త్వా మారాధ్యాం హరిహర విరించాదిభిరపి
*ప్రణంతుం స్తోతుం వా కథమకృతపుణ్యః ప్రభవతి*
॥(శ్లోకము -1)

శక్తితో కూడినపుడు విశ్వము సృజింప గల శివుడు, శక్తితో కూడనపుడు కనీసము కదలలేడు. త్రిమూర్తుల దారలు వారి భర్తల ఘనతకు గరిమకు కారణమైనారు. ఈ రీతిగా తొలుత ముగ్గురు మూర్తులను స్తుతించిన నన్నయగారు తర్వాత మరొక పద్యములో, (ఆదిపర్వము ఒకటవ ఆశ్వా సములో 21) త్రిమూర్తులతో పాటు ఇతర దేవతలను స్తుతించి నారు. అందులో పునః హరి హర అజులను, గజానన అర్క షడాస్యమాతృసరస్వతీ గిరిసుతాదిక దేవతా తతికి నమస్కారాల నర్పించినారు. అటుపై వాల్మీకిని (ప్రచేతసపుత్రుని), అటు తర్వాత మరొక పద్యములో పరాశరాత్మజుడగు 'మహాభారత నిర్మాత' యగు వ్యాసులవారిని కొల్చినారు. ఇది ఒక ప్రణాళికా బద్ధమైన నిర్మాణము. వైష్ణవ, శైవ, సౌర, గాణపత్య, కౌమార, శాక్తేయముల ప్రస్తావన కూడా ఉన్నట్లు గ్రహింప వీలున్నది. భారతదేశములో ఇవన్నియూ కలవు. వాటి ధర్మాలనను సరించు వారున్నారు. ఇది ఒక విశేషముగా మనము గుర్తింప గలము. తర్వాతి కవులు భిన్న విభిన్న మార్గాల ననుసరించి నారు. మార్పు కాలప్రవాహములో అతి సహజము. ఆ పై కావ్యావతారికలలో ముద్రవేసిన వాడు కుమారసంభవము కూర్చిన నన్నెచోడుడు. నన్నయ తెలుపని విషయములను చెప్పడము చేసినాడు. తన గురించి నన్నయ చెప్పినది కొంత మాత్రమే. అందులో తాను ముద్గల గోత్రములో జన్మించిన వాడని, అపస్తంబసూత్రుడని మాత్రమే కలదు. పరిమిత దేవతా స్తుతి కలదు. నన్నెచోడుడు శ్రీకారముతోనే కావ్యారంభము చేసినాడు. మగణముతో ప్రారంభమయినదైనను అది శార్దూలము కాదు. మరికొందరు ప్రాచీన కవులవలె ఉత్పల మాలతో పద్యమును కూడా కాకుండా 'స్రగ్ధర' వృత్తము వాడి నాడు. తనను గురించి, 'కాశ్యప గోత్రుడనియు, సూర్యవంశ క్షత్రియుడనియు, తల్లితండ్రులు శ్రీనతి, చోడబల్లి యనువారలనియు తెలుపుకొన్నాడు. తల్లి హైహయరాజ వంశమున జనించినదనియు, తండ్రి పాకనాటి పరిపాలకుడని తెలియజేయడము చూడగలము. ఇట్లు కొన్ని అంశాలను పరిశీలించినపుడు క్రమముగా కవులు తమను గురించి, ప్రభువులను గురించి, కృతిభర్తలను గురించి చెప్పడము జరిగినది. ఏ కొందరో కావ్యములను, గ్రంథములను దైవము

నకు అర్పించినారు. భాగవతకర్త పోతన శ్రీ కైవల్యసిద్ధికై, 'మహానందాంగనా డింభకున్' చింతించినాడు. అటు తర్వాత పలువురు కవులు పలు పోకడలు పోయినారు. రాజులను వారి ఇష్టదేవతలను స్తుతులతో కీర్తించినారు. ముద్దు పలుకుల తిమ్మన తన పారిజాతాపహరణ ప్రబంధములో తొలి పద్యముగా వేంకటపతిని స్తుతించినాడు. వాస్తవమునకు తిమ్మన గారు, శ్రీమదుమామహేశ్వర వర ప్రసాద లబ్ధ సార సారస్వతాభినందినంది సింగయామాత్య పుత్రుడు. తిమ్మన గారి కావ్య కృతిభర్త శ్రీకృష్ణదేవరాయలు, రాయలు పరమ వైష్ణవాభిమాని. ఆ రాయలు కూడా వేంకటపతిని స్తుతించినాడు.రాయల వంశమును తిమ్మనగారు స్తుతించినారు. రాయలవారి ఆస్థానములో ఉండినను, ధూర్జటి తన 'శ్రీకాళహస్తి మాహాత్మ్యమును' రాయలవారికి అంకితమివ్వక తన ఇష్టదైవము అయిన శ్రీ కాళహస్తీశునికి, వాయులింగ స్వరూపునికి అంకితమిచ్చాడు. ఆయన భవ పరాఙ్ముఖుడుగా ప్రసావింపబడినాడు. తిక్కన సోమయాజి మహాభారతమును విరాట పర్వముతో ఆరంభించినాడు. అది హరిహరనాథునికి అంకితమైనది. ఈ రీతిగా నన్నయ నుండి ఆరంభమైన దేవతా స్తుతులు కొంగ్రొత్త పోకడలను అనుసరించినవి. కొందరు దేవతలను, వారి పరివారమును స్తుతింప ప్రారంభించినారు. గణపతిని, సరస్వతిని, విఘ్నములను తొలగించుటకు, చక్కని పలుకులను ప్రసాదించవలయునని క్రమముగా స్తుతించినారు. భక్తి భావాలు వివిధ రీతులలో ప్రకటించినారు. పూర్వపు కవుల రచనలు చదివిన ఫలము, తమ బుద్ధి, భావనా బలముల, కాలానుగుణముగా వచ్చిన ఇతర మార్పుల కారణముల వలన ప్రస్తావించిన రీతులలో నూతనత్వము కనిపింపసాగింది. భాషాపరమైన చమత్కారములు మొగ్గలు తొడగినవి. అప్పకవి మహాశయుడు తన అప్పకవీయములో దాదాపు అందరికన్నా అధికముగా స్తుతులు చేసినట్లు చెప్పవచ్చు. ఆయన తన గ్రంథములో శ్రీదేవి, భూదేవి సహిత హరి స్తుతితో ఆరంభించి వెన్నుని కౌస్తుభమును, వైజయంతిని, శ్రీవత్సమును, మురళిని, పట్టు పుట్టమగు పీతాంబరమును, పాంచజన్యమును, సుదర్శనచక్రమును, కౌమోదకిని, నందకము, శార్ఙ్గమును, పింఛమును, వేర్వేరు పద్యాలలో స్తుతించినారు. అక్కడితో ఆగక తన జన్మస్థానమయినట్టి కమలమునకు సూర్యుని ద్వారా వెయ్యి కిరణాలనిచ్చి, కమలమునకు అహితుడైన చంద్రుననికి బహు తక్కువ సంఖ్యలో కాంతి కిరణాలను, అదియు కొద్ది కొద్దిగా ఇప్పించు ఏర్పాట్లు చేసిన విరించిని, విద్యాజాలవిశారద యగు శారదను స్తుతించినాడు. కనకాద్రిని చాపముగా వంచిన నీకు హిమాద్రిసుతయగు గిరిజను కరగించుట కష్టముకాదని మేల మాడబడిన శివుని, పరిణయవేళ పార్వతి పాదములను పట్టిన పశుపతిని కందర్పుని పగతీర్చినటులున్నదని చమత్కారముతో చేసిన స్తుతి కలదు. వీరేకాక అష్ట దిక్పాలకులను, నవగ్రహాలను, వెన్నుని దశావతారములను కుమారస్వామి గజాననుని స్తుతించుట చూడగలము. ఈ రీతిగా నన్నయ కావ్యములలో ఇష్టదేవతా స్తుతులారంభించిన విధాన, వినిర్మాణ ప్రక్రియల్లో పలు మార్పులు చోటు చేసుకున్నవి.

**ఆధార గ్రంథాలు :**

1. అవతారికల్లో ఇష్టదేవతాస్తుతి - శ్రీ దొప్పలపూడి పరిశుద్ధ శ్యామ్యూల్, సిద్ధాంత వ్యాసము - నాగార్జున యూనివర్సిటి - జనవరి 2009.
2. ఆంధ్ర కావ్యములు - అవతారికలు - సి బి పి అప్పారావు - తెలుగు యూనివర్సిటి, హైదరాబాదు - 2012.
3. కావ్యావతారికలు - ఆంధ్రదేశ చరిత్ర - డా॥ దీనావతి - హైదరాబాదు - 2008.
4. తెలుగు కావ్యావతారికలు - డా॥ నాగయ్య - మద్రాస్ - 1968.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(1) , December-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2004/12253



# ఇష్టదేవతా స్తుతులు కవుల విభిన్న దృకోణాలు

- బోలుగద్దె అనిల్ కుమార్
పరిశోధక విద్యార్థి తెలుగు విభాగం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

సప్త సంతానములలో ఖిలము కాకుండునది ధాత్రిలో కృతి యని చెప్పడము కలదు. కనుకనే శిరీష కుసుమ పేశల సుధామయోక్తులతో కృతిని రచించమని, ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు అడిగినపుడు – ఆంధ్రకవితా పితామహుడు, అల్లసాని పెద్దన 'స్వారోచిషమను సంభవమను' మహాప్రబంధమును ముదమందిన హృదయముతో కూర్చి రాయల వారికి అంకితమిచ్చినాడు.

కృతి/ గ్రంథము రాయుట ఆరంభించినప్పుడు మహాకవులు రెండు పద్ధతులను పాటించుట కలదు. అందులో "ఆశీస్సు" ఒకటి. రెండవది 'నమస్సు' ఒకటి. కృతికర్త కన్నా, కృతిభర్త చిన్నవాడైన ఆశీస్సును అందించుట కలదు. అందరికన్నా మిన్నయగు వాడు నిరవధికుడగు భగవంతుని స్తోత్రము చేయుట, స్తుతించుట, శుభములను ఆశించుట, నిర్విఘ్నముగా గ్రంథ రచన పరిసమాప్తి కావలెనని కోరుట చూడగలము.

సంప్రదాయమును అనుసరించి దాదాపు పూర్వ కవులు అందరూ కొన్ని లక్షణములను పాటించుట కలదు. 'శ్రీ' కారముతో రచన / కృతి ఆరంభించుట ఇందులో ఒకటి. 'మగణ' ముతో పద్యమును ఆరంభించుట పలువురు పాటించినారు. ఇతరులు కొందరు శు భగణముగా భావింపబడిన 'భ' గణముతో కొందరు కృతి తొలి పద్యమును ఆరంభించినారు. ద్విపదలను కూడా శ్రీకారముతో ఆరంభించినారు. సంప్రదాయమును గౌరవించి, శ్రీకారాదులతో కావ్య / కృతి నిర్మాణమును నవీన కాలపు పద్య నిర్మాతలు / కవులు కొందరు పాటించినారు. స్తుతుల విషయముగా ఎవరిని / ఏ రూపమందలి మూర్తిని ప్రార్థించుట? అను సందర్భమును పరిశీలించినపుడు 'కవులు' భిన్న విభిన్న రీతులను అనుసరించినట్లు చూడగలము. ఈ అంశమును కొంత వివరముగా ప్రస్తుతము పరిశీలిద్దాము. 'ఇష్టము' అను పదమునకు పలు అర్థాలు కలవు. –కోరబడినది, 'దేవతలు' అనగా పలు సల్లక్షణములు కలవారని చెప్పవచ్చును. జర రుజలు తెలియనివారు. ముప్పదివత్సరముల వయసుగలవారుఈ అమృతము పానము చేసినవారు. భక్తి పూర్వకముగా సమర్పించిన 'హవిస్సులను' లెస్సగా గ్రహించువారు. ఇత్యాది లక్షణాలను దేవతలు కలిగియున్నారని చెప్పడమున్నది. కవికులతిలకుడు కాళిదాసు 'స్తోత్రం కస్యన తుష్టయే' అని చెప్పినట్లు కలదు. అనగా స్తోత్రం ఎవ్వరిని సంతుష్టులను చేయదు? పొగడ్తలకు లొంగని వారెవ్వరూలేరు కదా? అని దీని భావము. స్తోత్రమనగా స్తుతి, నుతి, స్తవము మొదలగు పర్యాయ పదములు సమానార్థకముగా ప్రయోగింపబడుట కలదు. ఏకాగ్రతతో, స్థిమితమతితో ఒక లక్ష్యమును నిర్దేశించుకొని చేయునది –స్తోత్రము. విషయ విశేషజ్ఞులు, వాంఛిత ఫల ప్రదాతలు, శు భకరులగు దేవతల నుద్దేశించి చేయు ప్రార్థనను మనము స్తోత్రముగా భావించి వచ్చును. ఫలసిద్ధికై మానవుడు చేయు పలు ప్రయత్నములతో చతుర్విధ ఉపాయములు అందరికి తెలిసినవే. అందు మొదటిది సామము. తర్వాతవి దాన, భేద, దండ మనునవి. సామము అనగా అనుకూలముగా వర్తించుట. సామము అనుదానిలో కొన్ని విధములు కలవు. పరస్పరోపకారము కనిపింపచేయుట, మంచి చేయుట, గుణములను కొనియాడుట, బంధుత్వమును తెలుపుట, నేను నీవాడనని మంచిమాటలను పలుకుట, వైరభావమును తొలగించుట. ఋక్కులు – దేవతా స్తుతులు, పాపనాశనకారి సామముఈ దేవతలు అనగా (దీవ్యతీతి దేవ:) ప్రకాశించువారు, దివియందు ఉండువారు, ఆకాశము

ఆవాసముగా కలవారు. ఆశీస్సు అనగా హితమైనది కావలయుననుట, పాముకోఱ అని అర్థములు కలవు. 'ఒకవ్యక్తిని లేక శక్తిని' ఆరాధించుట అని కూడ భావము. ప్రణుతి చేయుతకు, స్తోత్రం స్తుతించుటకు తగు బలము / శక్తియున్ననే సాధ్యమని ఆదిశంకరా చార్యులవారు, తమ సౌందర్యలహరి రచన తొలి శ్లోకములో ఇట్లనినారు.

శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్త: ప్రభవితుం న చే
దేవం దేవో న ఖలుకుశల: స్పందితుమసి
అతస్త్వామారాధ్యాం హరిహరవిరించాదిభిరపి ప్రణంతుం
స్తోతుం వా కథమకృత పుణ్య: ప్రభవతి' కనుక

విశ్వశ్రేయమును కాంక్షించు కావ్యము, 'ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాసి తన్ముఖం' అను రూపములలో ఏదేని నొకదానిని ప్రస్తావించవలెను. అభ్యుదయావస్తు నిర్దేశోవాపి తన్ముఖం' అను రూపములలో ఏదేని నొకదానిని ప్రస్తావించవలెను. అభ్యుదయార్థము గ్రంథాదిని మంగళ కరముగా శ్రీకారము ప్రయోగించుట ఉత్తమము. అప్పకవిగారు, అప్పకవీయములో (–356) 'పదపడి శ్రీకారము కృతిమొదలనిలిచి దోషపుంజము నడంచి శుభంబొదవించు' నని పల్కినారు. మరియు మంచి గణములతో కావ్యములనారంభింప వలెనని పూర్వీకులు, 'మ, భ' గణములతో చాల వరకు తమ కావ్యముల ప్రథమ పద్యములను ఆరంభించుట తెలిసినదే. 'ఇష్టదేవతా స్తుతి' యనగా గ్రంథ / కావ్య నిర్విఘ్న సమాప్తి కొరకై విశ్వశ్రేయస్సును, తననాదరించు చున్న ప్రభువునకు సకల శుభములు కలుగవలెనని, కోరుచూ తనకు (కవికి) ప్రీతిగల లేక నమ్మకముగల దేవతలను ప్రసన్నము చేసికొను ప్రయత్నము / స్తుతి / పొగడ్త.

మానవుడు తన జీవిత కాలంలో అనుభవించు సుఖాలు, సౌఖ్యాలు, సంపదలు ఏవీ శాశ్వతం కాదు. ఆచరించిన ధర్మమొక్కటే శాశ్వతమైనది. పూర్వీకులు భౌతిక వాదులు కారు. " అనిత్యాని శరీరాణి విభవోనైవ శాశ్వత: నిత్యం సన్నిహితో మృత్యు: కర్తవ్యోధర్మ సంగ్రహ:" అని భావించినవారు. కవులు గుణరహితుడు నిరాకారుడు, అయిన నిరవధికునకు (భగవంతునికి) ఒక రూపమిచ్చి సగుణ రూపములో ఆరాధించినారు. పూర్వీకులు సంప్రదాయరీతులను, గౌరవించి, వారివారి అభిమత మతములను అనుసరిస్తూ, శైవ, వైష్ణవములను ప్రధానముగా ఆరాధించినారు. సృష్టి, స్థితి, లయ కారకులుగా చెప్పబడు విరించి, హరి, హరులను వారి దారనగు పలుకుల లలనను, కలుములలలనను, లలితలను స్తుతించినారు.

తిక్కనసోమయాజి నిర్వచనోత్తరరామాయణమును 'శ్రీరాస్తాం'యను సంస్కృత శ్లోకముతో ఆరంభించిననూ, 'శ్రీయనగౌరినాబరగు చెల్వకు చిత్తము' అని విరాటపర్వమును తెనుగుపద్యంతో మొదలిడినారు. అదియు హరిహరనాథ స్తుతితో. నన్నెచోడకవిశిఖామణి తన కుమార సంభవకావ్యమును స్రగ్ధరా వృత్తముతో ఆరంభించినారు. భానుమద్విజయమను తన రచనలో కృష్ణయామాత్యుడు త్రిమూర్తి స్తుతిని అందముగా ఒక కందపద్యములో అందించినాడు. ఆ పద్యమిది.

**కం. సకల ప్రకటన**
**ఘటనామహత్త్వభాసితయనగా**
**ప్రకరాకృతిగా మూల ప్రకృతిని**
**భావింతు తత్త్వ వాచాప్రౌఢిన్...**

ఈ రీతిగా పరిశీలించినపుడు నన్నయనుండి ప్రారంభమైన "ఇష్టదేవతాస్తుతి" కావ్యావతారికలలో పలువురు కవుల కలములనుండి జాలువారి పలు పోకడలను పోయింది. కొంగ్రొత్త సొగసులను స్వంతముచేసుకొన్నది.

**ఉపయుక్త గ్రంథములు:**

**1. ఆంధ్రకావ్యములు – అవతారికలు – శ్రీ. సి బి పి అప్పారావు – తెలుగు విశ్వవిద్యాలయం – 2012**
**2. ప్రాచీనాంధ్ర కవులు ఇష్టదేవతాస్తుతి – డా.పి. నరసింహా రెడ్డి – 1993**
**3. తెలుగు కవులు ఇష్టదేవతాస్తుతులు – విశేషాలు – బి. రాములు – 2015**
**4. తెలుగు కావ్యావతారికలు – డా.జి. నాగయ్య – 1968**

తిరుమల తిరుపతి దేవస్థానములు,కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీపీఠ సంయుక్త ఆధ్వర్యవములో

# విశిష్ట ఆధ్యాత్మిక భక్తి వాఙ్మయం-సమాలోచనం

(జాతీయ సదస్సు-2016 అక్టోబర్ 9,10,11 తేదీలు)

శ్రీసిద్ధేశ్వరీపీఠం,కుర్తాళం,తిరునల్వేలి(జిల్లా),తమిళనాడు-627802.

## ధ్రువపత్రం

శ్రీ/~~శ్రీమతి~~/చిరంజీవి ........బాలగద్దె అనిల్ కుమార్........గారు

మూడు రోజుల పాటు సిద్ధేశ్వరీపీఠం,కుర్తాళంలో జరిగిన విశిష్ట ఆధ్యాత్మిక భక్తి వాఙ్మయం-సమాలోచనం అనే జాతీయ సదస్సులో పాల్గొని....తెలుగు కావ్య వాఙ్మయం లో....

....ఇష్టదేవతాస్తుతుల పాత్ర............అనే అంశంపై పత్రసమర్పణచేసారు.

సదస్సు సంచాలకులు

( డా.వేదాంతం రాజగోపాలచక్రవర్తి )

# DEPARTMENT OF TELUGU, UNIVERSITY OF MADRAS

## INTERNATIONAL SEMINAR

## Certificate

This is to certify that శ్రీ బోలుగడ్డ అనిల్ కుమార్ has participated / presided a session / presented a paper on ఇష్టదేవతాస్తుతులు - విశేషాంశాలు in the International Seminar on "BHARATIYA BHAKTI SAHITYAM" (Sri Sri Sri Siddheswarananda Bharateeswamyvari Sahitya Vaibhavam) organized by the Department of Telugu, University of Madras, Chennai-600 005 on 1 - 2 March 2017.

DEPARTMENT OF TELUGU * UNIVERSITY * CHENNAI - 5.

Dr. M.SAMPATH KUMAR, M.A.,Ph.D.,D.Litt.
Professor & Head
Department of Telugu
University of Madras
Chennai - 600 005

M.S.

(M.SAMPATH KUMAR)
Seminar Director

# ఉపయుక్త గ్రంథాలు

# ఉపయుక్త గ్రంథములు


| క్ర.సం | గ్రంథము | రచయిత | ప్రచురణ వివరములు | ఇతర విశేషములు |
|---|---|---|---|---|
| 1 | అచలాత్మజా పరిణయము [ద్వ్యర్థి కావ్యము] | తిరుమల బుక్కపట్టణము కిరీటి వేంకటాచార్యులు | తెలుగు విజ్ఞాన పీఠం | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 1985 |
| 2 | అనర్ఘరాఘవము | బిజ్జుల తిమ్మభూపాలుడు | ఆం.ప్ర సా. అకాడెమి | హైదరాబాదు. ముద్రణ 1977 |
| 3 | అనిరుద్ధ చరిత్రము[యామిజాల పద్మనాభస్వామి సరసోపాయనముతో] | కనుపర్తి అబ్బయామాత్యుడు | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, పున. ముద్ర ప్రచురణ సంవ. 2013 |
| 4 | అన్నమాచార్యుల జీవిత చరిత్రము | చిన్నన్న | తి తి దే ప్రచురణ | తిరుపతి తృతీ ముద్ర 1978 |
| 5 | అప్పకవీయము | కాకునూరి అప్పకవి | వావిళ్ళ వారి ప్రచురణ | 1970 పునర్ముద్రణ |
| 6 | అవతారికల్లో ఇష్టదేవతా స్తుతి | శ్రీ దొప్పలపూడి పరిశుద్ధ శామ్యూల్ | సిద్ధాంతవ్యాసము | నాగార్జుననగర్ [ఆంధ్ర] జనవరి 2009 |
| 7 | అమరకోశము [సంస్కృతము ] గురుబాల ప్రబోధికావ్యాఖ్య [తెలుగులో వివరణ ] | అమరసింహుడు | జయలక్ష్మి ప్రచురణలు | వావిళ్ళ ప్రతికి పునర్ ముద్రణ .1996 |
| 8 | అలంకార సర్వస్వము [వరదార్చన వ్యాఖ్యతో] | రాజానక రుయ్యకుడు | తెలుగు అకాడ మి | హైదరాబాద్ ప్రథమ ముద్రణ నవంబర్ 2009 |
| 9 | అల్లసాని వానిఅల్లిక జిగిబిగి | విశ్వనాథ సత్యనారాయణ | విశ్వనాథ ప్రచురణలు విజయవాడ | ద్వితీయ ముద్రణ 2007 |
| 10 | అష్టమహిషీకల్యాణము | తాళ్ళపాక తిరు వేంగడనాథుడు | తి తి దే ప్రచురణ | తిరుపతి 1937 |

| | | | | |
|---|---|---|---|---|
| 11 | అష్టాదశ పురాణములు | వోలేటి వేంకటలక్ష్మీ నరసింహ శర్మ | శ్రీ కాళహస్తి తమ్మా రావు & సన్స్ | రాజమండ్రి 1973 |
| 12 | అష్టాంగయోగ సారము | తరిగొండ వెంగమాంబ | తి తి దేవస్థానములు | తిరుపతి /ము.2007 |
| 13 | అహల్యా సంక్రందనం [డి చిన్ని కృష్ణయ్య అనుశీలనముతో] | కృష్ణప్ప నాయకుడు | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ద్వితీయ ముద్రణ ప్రచురణ సంవ ఆగష్టు 2011 |
| 14 | ఆంధ్రకావ్యములు – అవతారికలు | శ్రీ. సి బి పి అప్పారావు | పొట్టిశ్రీరాములు తె విశ్వ విద్యాలయము | హైదరాబాదు. తృతీయ ముద్రణ 20 12 |
| 15 | ఆంధ్ర కువలయానందము | కంభంపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి | తి తి దే శ్రీ వేం ఓరి సిరీస్ 13 | తిరుపతి ద్వితీయ ముద్రణ 1952 |
| 16 | ఆంధ్రచంద్రాలోకము | ఆడిదము సూరకవి | వావిళ్ళ వారి ప్రచురణ | మద్రాసు.1952 |
| 17 | ఆంధ్రనామ సంగ్రహము, ఆంధ్రనామ శేషము , సాంబ నిఘంటువు | పైడిపాటి లక్ష్మణకవి, అడిదము సూరకవి, కస్తూరి రంగకవి | రోహిణి ప్రచురణలు రోహిణి ప్రచురణలు రోహిణి ప్రచురణలు | రాజమండ్రి [ఒకే పుస్తకముగ] ఏప్రిల్, 1995 |
| 18 | ఆంధ్ర ప్రబంధాలు –శృంగారం –ప్రయోగాలు | డా. బి జయరాములు | రచయిత స్వంత ప్రచురణ | ప్ర. ము 1991 |
| 19 | ఆంధ్రప్రశస్తి | సంకలనము ఆచార్య డి మునిరత్నం నాయుడు | పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాల | హైదరాబాదు. తృతీయ ముద్రణ 2013 |
| 20 | ఆంధ్రభారత కవితా విమర్శనము | కోరాడ రామకృష్ణయ్య | గంగాధర ప్రచురణలు | విజయవాడ ప్రథమ ముద్రణ 1981 |
| 21 | ఆంధ్రభోజీయము | మద్దూరి రామమూర్తి | రచయిత స్వంత ప్రచురణ | కర్నూలు, ప్రథమ ముద్రణ నవంబరు 2012 |
| 22 | ఆంధ్రమహాభారతము [1-18 పర్వాలు విపుల వ్యాఖ్యతో ] | కవిత్రయము [నన్నయ, తిక్కన, ఎఱ్ఱన] | తిరుపతి తిరుమల దేవస్థానములు | తిరుపతి TTD EO గారి ద్వారా ప్రచురణ 2008 |
| 23 | ఆంధ్రమహాభారత పీఠికలు | సంకలనము | పొట్టిశ్రీరాములు తె. విశ్వ విద్యాలయము | హైదరాబాదు. ప్రథమ ముద్రణ 2010 |

| | | | | |
|---|---|---|---|---|
| 24 | ఆంధ్ర శ్రీ విష్ణుపురాణము | పెన్నెలకంటి సూరన | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1955 |
| 25 | ఆంధ్ర సామ్రాజ్యము | పువ్వాడ శేషగిరిరావు | రచయిత బంధువుల ప్రచురణ | విజయవాడ ప్రథమ ముద్రణ 2016 |
| 26 | ఆంధ్ర వాఙ్మయ చరిత్ర | కాశీనాథుని నాగేశ్వరరావు | ఆంధ్ర గ్రంథ మాల | మదరాసు 1947 |
| 27 | ఆత్మ రామాయణము | లలితకవి మలుగూరు టి గురుమూర్తి | రచయిత స్వంత ప్రచురణ | హిందూపురము ప్ర.ముద్ర నవం 1965 |
| 28 | ఆధ్యాత్మ రామాయణము | వేదవ్యాసుడు | గీతా ప్రెస్ | గోరఖ్ పూర్ 9వ పునర్ ముద్రణ 2010 |
| 29 | ఆనంద రంగరాట్ఛందము | కస్తూరి రంగన్న కవి | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1922 |
| 30 | ఆనందవల్లి [ఉపనిషద్రాఘవము] | బాడాల రామయ్య | రచయిత స్వంత ప్రచురణ | మైసూరు ప్రథమ ముద్రణ డిసెంబర్ 1985 |
| 31 | ఆముక్తమాల్యద | శ్రీకృష్ణదేవరాయలు [వ్యాఖ్య వేదం ,వేం.శాస్త్రి] | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ప్రచురణ సం |
| 32 | ఆముక్తమాల్యద [ కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | శ్రీకృష్ణదేవరాయలు | యం.శేషాచలం &కో [EMESCO] | హైదరాబాదు. ప్ర. ముద్రణ 2009 |
| 33 | ఆముక్తమాల్యద | శ్రీకృష్ణదేవరాయలు | ఆం.ప్ర సాహిత్య అకాడెమి | హైదరాబాదు ద్వితీయ ముద్రణ 1984 |
| 34 | ఉత్తర రామాయణము | కంకంటి పాపరాజు | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1950 |
| 35 | ఉత్తరహరివంశము | నాచన సోమనాథుడు | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1937 |
| 36 | ఉద్భటారాధ్య చరిత్ర ము | తెనాలి రామలింగ కవి | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1926 |
| 37 | ఉపనిషత్ సుధాలహరి | సంకలనము | యువభారతి , | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 2011 |
| 38 | ఉషాపరిణయము | తాళ్ళపాక చిన్నన్న | తి తి దే | తితి దే ప్రెస్సు చెన్నై ముద్రణ 1938 |
| 39 | ఏకలవ్య ప్రబంధం | డా. ఆ వి ఆర్ ప్రసాద్ | రచయిత స్వంత ప్రచురణ | అనంతపురము [ఆంధ్ర] ప్ర ముద్ర ఆగష్టు 2013 |

| | | | | |
|---|---|---|---|---|
| 40 | కడపజిల్లా శాసనాలు సంస్కృతి చరిత్ర | డా.అవధానం ఉమా మహేశ్వర శాస్త్రి | సాహితీ సామ్రాజ్యము | ప్రొద్దుటూరు ప్ర.ము 1995 |
| 41 | కళ్యాణ రాఘవము | శ్రీమాన్ చిలుకమట్టి రామానుజాచార్యులు | రచయిత స్వంత ప్రచురణలు | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 1960 |
| 42 | కళాపూర్ణోదయము [సవ్యాఖ్యానము ] | పింగళి సూరనామాత్యుడు | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నై 2007 పునర్ముద్రణ |
| 43 | కళాపూర్ణోదయము 1&2 భాగములు [బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు సరస వాచవితో] | పింగళి సూరనామాత్యుడు | యం.శేషాచలం &కో [EMESCO] | హైదరాబాదు. ప్ర. ముద్రణ జనవరి, 2006 |
| 44 | కవికర్ణ రసాయనము | సంకుసాల నృసింహకవి | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1916 |
| 45 | కవిగజాంకుశము | భైరవి కవి | ఆం.ప్ర సా అకాడెమి | హైదరాబాదు. ము 1979 |
| 46 | కవిజనరంజనము | ఆడిదము సూరకవి | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1950 |
| 47 | కవిజనాశ్రయము | మల్లియ రేచన | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1950 |
| 48 | కవితానంద వాల్మీకి రామా యణము [సారకాండము] | సోంపల్లె కృష్ణమూర్తి | రచయిత స్వంత ప్రచురణ | అనంతపురము [ఆంధ్ర] ప్రథమ ముద్రణ 1940 |
| 49 | కవిత్రయ భారత జ్యోత్స్న [కవిత్రయ 112 పద్యాలకు వ్యాఖ్య] | ఆచార్య శలాక రఘునాథ శర్మ | రచయిత స్వంత ప్రచురణలు | రాజమండ్రి ద్వితీయ ముద్రణ ఫిబ్రవరి2014 |
| 50 | కవిరాజమనోరంజనము | కనుపర్తి అబ్బయామాత్యుడు | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1926 |
| 51 | కాలజ్ఞానము | నారేయణయతీంద్రులు | శ్రీ యోగినారేయణ యతీంద్రఆశ్రమ ట్రస్ట్ | కైవార [కర్నాటక] ముద్రణ 1994 |
| 52 | కావ్యాత్మ | శే.వేం.రా.అయ్యంగారు | ఆంధ్ర గ్రంథమాల25 | మదరాసు 1935 |
| 53 | కావ్యావతారికలు- ఆంధ్రదేశ చరిత్ర [క్రీ.శ1600 వరకు] | డా.బంధకవి [మానా ప్రెగడ] దీనావతి | రచయిత్రి స్వంత ప్రచురణ | హైదరాబాదు. ప్రథమ ముద్రణ 2008 |
| 54 | కావ్యాలంకార చూడామణి | మల్లియ రేచన | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1960 |
| 55 | కావ్యాలంకార సంగ్రహము [నరస భూపాలీయము] | శారదామూర్తి [భట్టుమూర్తి ] | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1938 |

| | | | | |
|---|---|---|---|---|
| 56 | కావ్యాలంకార సంగ్రహము [సన్నిధానం సూర్య నారాయణ శాస్త్రి వ్యాఖ్య] | శారదామూర్తి [భట్టుమూర్తి] | యం.శేషాచలం &కో [EMESCO] | హైదరాబాదు. ప్ర. ముద్రణ 2008 |
| 57 | కాశీఖండము | శ్రీనాథుడు | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1969 |
| 58 | కుమార సంభవము | నన్నెచోడుడు | వావిళ్ళ ప్రచురణలు | చెన్నై పు.ముద్ర 2010 |
| 59 | కువలయాశ్వ చరిత్రము | సవరం చిననారాయణ కవి | ఆం.ప్ర సా. అకాడెమి | హైదరాబాదు. ప్ర.ముద్రణ 1982 |
| 60 | కృష్ణ కథావిపంచి | బాడాల రామయ్య | రచయిత స్వంత ప్రచురణ | మైసూరు ప్రథమ ముద్రణ 1957 |
| 61 | కృష్ణరాయ విజయము | కుమార ధూర్జటి | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1929 |
| 62 | కేయూరబాహుచరిత్ర | మంచెనకవి | శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయపీఠం | తిరుపతి EO TTD ప్రథమ ముద్రణ 2012 |
| 63 | కైవల్యనవనీతము | శ్రీ విద్యానందనాథ | శ్రీసదాశివ బ్రహ్మేంద్రాశ్రమము | చిల్లకల్లు 521178 ఆంధ్ర ప్ర ము ఫిబ్ర. 2010 |
| 64 | క్రీడాభిరామము [బి.వి సింగరాచార్యపీఠికతో ] | వినుకొండ వల్లభ రాయడు | యం.శేషాచలం &కో [EMESCO] | హైదరాబాదు. ప్ర. ముద్రణ 2009 |
| 65 | ఘటికాచల మహాత్మ్యము | తెనాలి రామకృష్ణుడు | ఆం.ప్ర సాహిత్య అకాడెమి | హైదరాబాదు. ముద్రణ 1969 |
| 66 | చంద్రరేఖా విలాపము | కూచిమంచి జగ్గకవి | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1922 |
| 67 | చంద్రికాపరిణయము | సురభి మాధవరాయలు | ఆం.ప్ర.సా అకాడెమి | హైదరాబాద్ ప్రథమ.ముద్రణ 1982 |
| 68 | చాటుపద్య మణిమంజరి ద్వితీయభాగము ప్రథమ సంపుటము | శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి | శ్రీ ప్రభాకరపరిశోధక మండలి[ప్రచురణ 6] | ముక్త్యాల [కృష్ణా జిల్లా] ప్రథమ ప్రచురణ 1 952 |
| 69 | చిత్రభారతము | చరిగొండ ధర్మన్న | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1914 |
| 70 | చైత్రరథం | డా. ఆయాచితం న శర్మ | రచయిత స్వం ప్రచు | కామారెడ్డి ప్ర ము 2000 |
| 71 | చంధోదర్పణము[అనంతుని చంధము నామాంతరము] | అనంతామాత్యుడు | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి ముద్రణ 1921 |
| 72 | జగద్గురు విలాసం | డా. బాడాల రామయ్య | రచయిత స్వంత ప్రచురణ | మైసూరు ప్రథమ ముద్రణ డిసెంబర్ 1988 |

| | | | | |
|---|---|---|---|---|
| 73 | తాలాంక నందినీ పరిణయము | ఆ.మ.వేం. నరసింహాచార్య | ఆం ప్ర సా అకాడెమి | హైదరాబాద్ ప్ర.ము 198౦ |
| 74 | తెలుగు కవుల ఇష్టదేవతా స్తుతులు – విశేషాలు | బి. రాములు | సిద్ధాంతవ్యాసము | హైదరాబాద్ 2015 |
| 75 | తెలుగు కావ్యావతారికలు | డా. జి నాగయ్య | ఫ్రీడమ్ ప్రెస్ | మద్రాసు 1968 |
| 76 | తెలుగులో చాటు కవిత్వము | డా. సంగనభట్ల నరసయ్య | రచయిత స్వంత ప్రచురణ | ధర్మపురి కరీంనగర్[జి] ప్రథ.ముద్ర ఫిబ్ర.2006 |
| 77 | తెలుగు ఛందః పదకోశము | డా. కోవెల సుప్రసన్నాచార్య | తెలుగు అకాడెమి | హైదరాబాద్ పు.ము 2012 |
| 78 | తెలుగు పర్యాయ పద నిఘంటువు [ సం] | ఆచార్య జి.ఎన్. రెడ్డి | విశాలాంధ్ర ప్రచురణలు | హైదరాబాద్, మే, 2002 చతు. ముద్ర. |
| 79 | తెలుగు – తెలుగు నిఘంటువు | తెలుగు అకాడెమి | తెలుగు అకాడెమి | హైదరాబాద్ పు.ము 2009 |
| 80 | తెలుగు సాహిత్య కోశం | ఆధునిక సాహిత్యం | తెలుగు అకాడెమి | హైదరాబాద్ ప్ర ము 1999 |
| 81 | తెలుగు సాహిత్య కోశం | ప్రాచీన సాహిత్యం | తెలుగు అకాడెమి | హైదరాబాద్ ము 2005 |
| 82 | తెలుగు విజ్ఞాన సర్వస్వం 11 సంపుటం సాహిత్య విమర్శదర్శనము | సంకలనము | పొట్టిశ్రీరాములు తె. విశ్వ విద్యాల | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 2016 |
| 83 | దత్తాత్రేయం | డా.బాడాల రామయ్య | రాగరాగిణీ ట్రస్ట్ | మైసూరు ప్ర. ము2005 |
| 84 | దయానంద ప్రబంధము | మాచిరాజు శివరామరాజు | పరవస్తుచిన్నయ సూరిసాహితీ సమితి | నంద్యాల [కర్నూలు జిల్లా] ప్ర.ముద్ర 2016 |
| 85 | దశకుమార చరిత్రము | మూలఘటిక కేతన | ఆం.ప్ర సా అకాడెమి | హైదరాబాదు. 1967 |
| 86 | దశరథరాజ నందనచరిత్ర | మరింగంటి సింగరాచార్య | ఆం.ప్ర సా అకాడెమి | హైదరాబాదు. 1979 |
| 87 | దుర్గావైభవము | చాగంటి కోటేశ్వరరావు ప్రవచనము | ఎమెస్కో హైదరాబాద్ | హైదరాబాద్ ప్రథమ ముద్రణ జులై, 2015 |
| 88 | ధనాభిరామము | నూతనకవి సూరనకవి | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1950 |
| 89 | నరసభూపాలీయము[ కావ్యా లంకార సంగ్రహము] | శారదామూర్తికవి [రామరాజభూషణుడు] | వావిళ్ళ ప్రచురణలు | చెన్నై ముద్రణ 1938 |

| | | | | |
|---|---|---|---|---|
| 90 | నవనాథ చరిత్ర | గౌరనామాత్యుడు | ఆం.ప్ర సా.అకాడమి | హైదరాబాద్ ప్ర 1984 |
| 91 | నానార్థ రత్నమాల | ఇరుగప దండనాథ కవి | హరిహర ప్రచురణలు | విజయవాడ [పునర్ము ద్రణ] నవంబరు 1990 |
| 92 | నాసికేతోపాఖ్యానము | దగ్గుపల్లి దుగ్గన | ఆం.ప్ర సా.అకాడమి | హైదరాబాద్ ము 1977 |
| 93 | నిత్యకర్మ – పూజా ప్రకాశిక [ సంకలనము ] | వివరణ శ్రీ మదునూరి వెంకటరామ శర్మ | గీతా ప్రెస్ | గోరఖ్ పూర్ 6వ పునర్ ముద్రణ 2015 |
| 94 | నిత్య పూజా స్తోత్రాలు | సంకలనము | ఋషి ప్రచురణలు | విజయవాడ 2004 |
| 95 | నిరంకుశోపాఖ్యానము [స్వర్ణ సుబ్రహ్మణ్యకవి వ్యాఖ్యతో] | కందుకూరి రుద్రకవి | పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయము | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 1999 |
| 96 | నిర్వచనోత్తర రామాయణము | కవిబ్రహ్మ తిక్కనామాత్యుడు | REEM ప్రచురణలు | ప్ర.ము 2016 |
| 97 | నీలాసుందరీ పరిణయము | కూచిమంచి తిమ్మకవి | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు 1964 |
| 98 | నృసింహ పురాణము | ఎఱ్ఱాప్రెగడ | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నై పు.ము 2010 |
| 99 | పంచతంత్రము | దూబగుంట నారాయణ కవి | వావిళ్ళ ప్రచురణలు | చెన్నై పు.ము 1953 |
| 100 | పంచ సూక్తములు [సస్వరము] | సంకలనం- మదునూరి వెంకట రామ శర్మ | గీతా ప్రెస్ | గోరఖ్ పూర్ 3వ పునర్ ముద్రణ 2003 |
| 101 | పలనాటి వీర చరిత్రము | శ్రీనాథమహాకవి | విశాలాంధ్ర ప్రచురణ | హైదరాబాద్ 1972 |
| 102 | ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము | గణపవరపు వేంకటకవి | ఆం.ప్ర సా.అకాడమి | హైదరాబాద్ ము 1977 |
| 103 | పాంచాలీ పరిణయం | కాకుమాను మూర్తికవి | పొ.శ్రీ. రా తెలుగు వి విద్యాలయము | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 2009 |
| 104 | పాండురంగమాహాత్మ్యము [కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | తెనాలి రామకృష్ణుడు | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, ప్ర. ముద్రణ సంవ. 2006 జనవరి |
| 105 | పారిజాతాపహరణము [డా.అద్దంకి శ్రీనివాస్ లఘుటీక] | నంది తిమ్మన | యం.శేషాచలం &కో [EMESCO] | హైదరాబాదు. ప్ర. ముద్రణ 2012 |

| | | | | |
|---|---|---|---|---|
| 106 | పారిజాతాపహరణము [కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | ముక్కుతిమ్మనార్యుడు | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, ప్ర. ముద్రణ సంవ. 2008 ఫిబ్రవరి |
| 107 | పురాణనామ చంద్రిక | యెనమండ్రం వెంకటరామయ్య | ప్రాచీ ప్రచురణలు, హైదరాబాద్ | 1879 ప్రచురణ జనవరి 2006 పునర్ముద్రణ |
| 108 | ప్రబంధకవుల తిరుమల దర్శనం | ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు | రచయిత స్వంత ప్రచురణ | తిరుపతి ప్రథమ ముద్రణ 2015 |
| 109 | ప్రబంధ వాఙ్మయ వికాసము | డా. పల్లా దుర్గయ్య | పొ.శ్రీ రా తెలుగు వి విద్యాలయము | హైదరాబాద్ ద్వితీయ ముద్రణ 2012 |
| 110 | ప్రభావతీ ప్రద్యుమ్నము [కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | పింగళి సూరనామాత్యుడు | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, ముద్రణ సంవ. 2008 మార్చి |
| 111 | ప్రాచీనాంధ్ర కవుల ఇష్ట దేవతా స్తుతి | డా.పి. నరసింహారెడ్డి | శ్రీనివాస మురళీ ప్రచురణలు | తిరుపతి ప్రథమ ముద్రణ 1993 |
| 112 | ప్రాచీనాంధ్ర తెలుగు కావ్యాల్లో కృతికర్త – కృతిభర్త | సంకలన కర్త . డా. పాపి రెడ్డి నరసింహ్ రెడ్డి | శ్రీనివాస మురళీ ప్రచురణలు | తిరుపతి 1988 |
| 113 | బసవపురాణము | పాల్కురికి సోమనాథకవి | పొ.శ్రీ. రా తెలుగు వి విద్యాలయము | హైదరాబాద్ ద్వితీయ ముద్రణ 2016 ఫిబ్రవరి |
| 114 | బిల్హణీయము [స్వామి శ్రీశివశంకర స్వామి ఆలోకనముతో] | పండిపెద్ది కృష్ణస్వామి | యం.శేషాచలం &కో [EMESCO] | సికింద్రాబాద్/మద్రాసు/ మచిలీపట్నం, ముద్ర 1971 |
| 115 | బృందావన విహారము | వనం గంగాధర కవి | వనం కృష్ణమూర్తి | మదనపల్లె ప్ర.ము 1997 |
| 116 | భగవద్రామానుజ చరిత్రం | డా. బాడాల రామయ్య | రచయిత స్వంత ప్రచురణ | మైసూరు ప్రథమ ముద్రణ 2002 |
| 117 | భాగవత నామకోశం | ఉప్పలధడియం రామమూర్తి | జనని ప్రచురణలు | చెన్నై ప్రథమ.ముద్రణ 2013 |
| 118 | భాగవతము [తెలుగు] 5 భాగాలు | పోతనామాత్యుడు | E.O తి తి దే | తిరుపతి పు.ము 2008 |
| 119 | భారతీ వైభవము | సీతారామాంజనేయులు | యువభారతి ప్రచురణ | సికింద్రాబాద్ ముద్రణ 1975 |

| | | | | |
|---|---|---|---|---|
| 120 | భీమేశ్వర పురాణము | శ్రీనాథుడు | కల్యాణిగ్రంథ మండలి | విజయవాడ ముద్రణ 1958 |
| 121 | భోజరాజీయము | అనంతామాత్యుడు | ఆం.ప్ర సా.అకాడమి | హైదరాబాద్ ము 1969 |
| 122 | మణికంఠాభ్యుదయము | విద్వాన్ జి బాలన్న | రచయిత స్వంత ప్రచురణ | కర్నూలు , ప్రథమ ముద్రణ జులై 2002 |
| 123 | మనుచరిత్రము [కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | అల్లసాని పెద్దనామాత్యుడు | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, ముద్రణ సంవ. 2005, అక్టోబర్ |
| 124 | మను – వసు ప్రకాశిక | కాశీభట్ల బ్రహ్మయ్య | తెలుగు విశ్వవిద్యాలయము | హైదరాబాద్ ద్వితీయ ముద్రణ 1995 |
| 125 | మల్లికార్జున పండితారాధ్య చరిత్ర | పాల్కురికి సోమనాథుడు | తెలుగు విశ్వవిద్యాలయము | హైదరాబాద్ ద్వితీయ ముద్రణ 1990 |
| 126 | మహాకవి ధూర్జటి కవిత్వము – వ్యక్తిత్వము | డా. పొన్నెకంటి హనుమంతరావు | రచయిత స్వంత ప్రచురణ | హైదరాబాద్, ప్రథమ ముద్రణ 1986 |
| 127 | ముకుందవిలాసము | కాణాదం పెద్దన సోమయాజి | తెలుగు విజ్ఞానపీఠం | హైదరాబాద్, ప్రథమ ముద్రణ 1985 |
| 128 | మూర్తిత్రయోపాఖ్యానము [పరిష్క: డా.తిమ్మా కోదండరామయ్య] | దంతులూరి బాపకవి | ఆం.ప్ర.సా అకాడెమి | హైదరాబాద్ ప్రథమ.ముద్రణ 1981 |
| 129 | మేదినీకోశము [సంస్కృత నిఘంటువు] | శ్రీమేదినీకరః | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నపురి 1932 |
| 130 | మొల్ల రామాయణము [ బొమ్మకంటి శ్రీనివాసాచార్యుల వాచవితో] | ఆతుకూరి మొల్ల | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, ముద్రణ సంవ. 2008 మే |
| 131 | యయాతి చరిత్ర [అచ్చ తెనుగు] | పొన్నిగంటి తెలగనార్యుడు | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నపురి 1951 |
| 132 | యోగీశ్వరవిలాసము [ పరిష్కర్త వైద్యం వేంకటేశ్వరాచార్యులు ] | నందికొటుకూరు సిద్ధయోగి | అక్షరార్చన ప్రచురణలు | కర్నూలు [ఆంధ్ర] ప్ర.ముద్ర 2012 |
| 133 | రంగనాథ రామాయణము | రంగనాథుడు | సి.వి.కృష్ణాబుక్ డిపో | మదరాసు 1927 |

| | | | | |
|---|---|---|---|---|
| 134 | రఘునాథ విజయము | మొవ్వ వృషాద్రిపతి | రచయిత స్వంత ప్రచురణ | రేపల్లె [గుంటూరు జిల్లా] ప్రథమ ముద్రణ 2007 |
| 135 | రఘువంశము [సంస్కృతము] | కాళిదాసమహాకవి | జ్ఞానశ్రీ ఆర్షవిద్యా గురుకులము | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 2008 |
| 136 | రాఘవపాండవీయము | పింగళి సూరనామాత్యుడు | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్ర/1929 |
| 137 | రాజయోగ సారము [ద్విపద] | తరిగొండ వెంగమాంబ | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1950 |
| 138 | రాజశేఖరవిలాసము [భల్లాణ చరితము] | కూచిమంచి తిమ్మకవి | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1924 |
| 139 | రాణి దుర్గావతి | మొవ్వ వృషాద్రిపతి | రచయిత స్వంత ప్రచురణ | రేపల్లె [గుంటూరు జిల్లా] ప్రథమ ముద్రణ 2010 |
| 140 | రాధికా సాంత్వనము [ఆరుద్ర ప్రవేశికతో] | ముద్దుపళని | ఎమెస్కో సం. సాహితి | విజయవాడ ముద్ర.2009 |
| 141 | రామాభ్యుదయము | రామభద్రుడు | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్ర/1911 |
| 142 | రామాయణ సుధాలహరి [ఉపన్యాస మంజరి] | వివిధ పండితుల వ్యాసములు | యువభారతి | హైదరాబాదు. ప్ర. ముద్రణ డిసెంబరు 1976 |
| 143 | రుక్మాంగద చరిత్రము | ప్రౌఢకవి మల్లన | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్ర/1954 |
| 144 | రుక్మిణీ పరిణయము | కూచిమంచి తిమ్మకవి | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్ర/1923 |
| 145 | లలితకళా పదకోశం | సంకలనము | తెలుగు విశ్వ విద్యాలయము | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 1991 |
| 146 | లేపాక్షి స్వప్న దర్శనము | బాడాల రామయ్య | రచయిత స్వంత ప్రచురణ | మైసూరు 1970 ప్రచురణ |
| 147 | వసుచరిత్ర [సవ్యాఖ్యానము – శేషాద్రి రమణ కవులు ] | రామరాజభూషణుడు | వావిళ్ళ వారి ప్రచురణ | మద్రాసు. ప్రచు 1926 |
| 148 | వసుచరిత్ర | రామరాజభూషణుడు | తెలుగు విశ్వ విద్యాలయము | హైదరాబాద్ ప్రథమ ముద్రణ 1995 |
| 149 | వసుచరిత్ర[కవిసమ్రాట్ విశ్వ నాథ కమనీయ పీఠికతో] | రామరాజభూషణుడు | యం.శేషాచలం &కో [EMESCO] | హైదరాబాదు. ప్ర. ముద్రణ 2005 |

| | | | | |
|---|---|---|---|---|
| 150 | వసు స్వారోచిషోపాఖ్యనము (ద్వ్యర్థి కావ్యము) | క్రొత్తపల్లి సుందర రామయ్య | గాడేపల్లి సీతారామమూర్తి | అద్దంకి [ప్రకాశం జిల్లా, ఆంధ్ర] ప్ర.ము. 2001 |
| 151 | వాల్మీకి చరిత్రము | రఘునాథ నాయకుడు | పొ.శ్రీ రా తెలుగు వి విద్యాలయము | హైదరాబాద్ ద్వితీయ ముద్రణ 2008 |
| 152 | వికాసలహరి | పలువురు పండితులు | యువభారతి | హైదరాబాద్ , ప్ర. ముద్ర డిసెంబర్ 1973 |
| 153 | విక్రమార్క చరిత్రము | జక్కనకవి | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్ర 1926 |
| 154 | విజయవిలాసము [కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | చేమకూరి వెంకటకవి | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ, ప్రథమ ముద్రణ, అక్టోబరు 2005 |
| 155 | విజయవిలాసము[బులుసు వేంకటరమణయ్య వ్యాఖ్యతో] | చేమకూరి వెంకటకవి | వావిళ్ళ వారి ప్రచురణ | చెన్నపురి 1952 |
| 156 | వివేకచూడామణి | ఆదిశంకరాచార్యులు | గీతా ప్రెస్ | గోరఖ్ పూర్ 13వ పునర్ ముద్రణ 2013 |
| 157 | విశ్వకోశము[సంస్కృతాంధ్ర పదకోశము] | శ్రీ మహేశ్వర సూరి కృతము | రోహిణి ప్రచురణలు | రాజమండ్రి, ద్వితీయ ముద్రణ, అక్టోబర్,2008 |
| 158 | విష్ణుమాయావిలాసము | కంకంటిపాపరాజు | వావిళ్ళ ప్రచురణ | మద్రాసు 1955 |
| 159 | వేదభూమి | కే. సభా | శ్రీ రమణా ప్రచురణలు | చిత్తూరు [ఆంధ్ర] 1974 |
| 160 | వైజయంతీ విలాసము | సారంగు తమ్మయ్య | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ప్రచురణ సం 2009 |
| 161 | శబ్దార్థ చంద్రిక [ఆంధ్ర నిఘంటువు] పరిష్కర్త: శ్రీ వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి గారు. | మహాకాళి సుబ్బరాయుడు | వావిళ్ళ ప్రచురణలు | చెన్నై/హైదరాబాద్, 8 వ పునర్ముద్రణ 2009 |
| 162 | శబ్దార్థ రత్నాకరము [అనుబంధాలు, పునఃపరిశీలన ఏ సత్యనారాయణ గారిచే] | కూర్పరి: బహుజనపల్లి సీతారామాచార్యులు | విక్టరీ ప్రచురణలు | విజయవాడ, 5 వ పునర్ముద్రణ-అక్టోబర్,2009 |

| | | | | |
|---|---|---|---|---|
| 163 | శశాంక విజయము [బాలాంత్రపురజనీ కాంతరావు సమాలోచనతో ] | శేషము వేంకటపతి | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ప్రచురణ సం 2009 |
| 164 | శివలీలావిలాసము | కూచిమంచి తిమ్మకవి | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1930 |
| 165 | శివానందలహరి [సంస్కృతము] | ఆదిశంకరాచార్యులు | వావిళ్ళ ప్రెస్సు | చెన్నై ముద్రణ 1954 |
| 166 | శుక చరిత్ర [సవిమర్శక సమీక్ష] డా. నడిపినేని సూర్యనారాయణ | పరశురామ పంతుల రామమూర్తి | ఈశ్వరీ ప్రచురణలు | కందుకూరు [ప్రకాశం జిల్లా] ప్ర.ము 2004 సెప్టెంబర్ |
| 167 | శృంగార నైషధము [పరి : వేదము వేంకటరాయ శాస్త్రి] | శ్రీనాథమహాకవి | తెలుగు విజ్ఞానపీఠం | హైదరాబాద్, ద్వితీయ ముద్రణ 1985 |
| 168 | శృంగార నైషధము [కవిసమ్రాట్ విశ్వనాథ కమనీయ పీఠికతో] | శ్రీనాథమహాకవి | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ప్రథమ .ముద్రణ 2006 జనవరి |
| 169 | శృంగార శాకుంతలము [బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు సరళ పీఠికతో] | పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ప్రచురణ సంవత్సరం అక్టోబర్ 2013 |
| 170 | శ్రీకోరుకొండ నారసింహ శతకము | కోగంటి వీరరాఘవాచార్యులు | రచయిత స్వంత ప్రచురణ | గుంటూరు 2017 జనవరి |
| 171 | శ్రీగురప్ప స్వామి లీలలు | విద్వాన్ చలంకోట బురుజు మునస్వామి | రచయిత స్వంత ప్రచురణ | చిత్తూరు , ఆంధ్ర మే, 2016 |
| 172 | శ్రీ తులసీదాస ప్రబంధము | అవధాని ఆముదాల మురళి | ఎన్టీఆర్ ట్రస్టు | హైదరాబాద్ ప్రథమ ముద్రణ ఆగుష్టు 2013 |
| 173 | శ్రీ దుర్గా సప్తశతీ [సంస్కృతము] | పలువురు పండితుల వివరణ | గీతాప్రెస్ | గోరఖ్ పూర్ 2015 ద్వితీయ ముద్రణ |

| | | | | |
|---|---|---|---|---|
| 174 | శ్రీ నందనందనోపాఖ్యానము | విద్వాన్ ఆలూరు కృష్ణమూర్తి | రచయిత స్వంత ప్రచురణ | చిత్తూరు [ఆంధ్ర] ప్రథమ ముద్రణ ఆగష్టు 2014 |
| 175 | శ్రీ పాండురంగమాహాత్మ్యము | తెనాలి రామకృష్ణకవి | తెలుగు విశ్వ విద్యాలయము | హైదరాబాద్ విశ్వవిద్యా ప్రథమ ముద్రణ 1995 |
| 176 | శ్రీబుడ్డా వేంగళరెడ్డీయము | జి సుబ్రహ్మణ్య శాస్త్రి | సూరన సారస్వత సంఘము | నంద్యాల {కర్నూలు జిల్లా} ప్రథ ముద్రణ నవం 20 13 |
| 177 | శ్రీమద్దులేటి స్వామి చరిత్ర | విద్వాన్ జి బాలన్న | రచయిత స్వంత ప్రచురణ | కర్నూలు [ఆంధ్ర] ప్ర ముద్రణ ఫిబ్రవరి 2008 |
| 178 | శ్రీమద్భగవద్గీత [ వ్యాఖ్య జ. గోయందకా] | భారతము/వ్యాసమహర్షి | గీతాప్రెస్ | గోరఖ్ పూర్ పునర్ముద్రణ 11వ ముద్రణ1999 |
| 179 | శ్రీమద్రామాయణము 1,2,3 భాగములు [సంస్కృతము] | మహర్షి వాల్మీకి | గీతాప్రెస్ | గోరఖ్ పూర్ 2009 ముద్ర |
| 180 | శ్రీమద్రామాయణ కల్పవృక్ష అంతర్దర్శనం | జొన్నవిత్తుల రామకృష్ణ శర్మ | ప్రణవి ప్రచురణలు | హైదరాబాద్ 35. ప్రథమ ము.2008 ఆగష్టు |
| 181 | శ్రీ ముత్తుస్వామి దీక్షితుల కీర్తనలు [సంస్కృతము] | ముత్తుస్వామి దీక్షితులు | బాలసరస్వతి బుక్ డిపో | మదరాసు/ కర్నూలు [టాగూరుపబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్ ] 2008 |
| 182 | శ్రీరామకృష్ణ కర్ణామృతము | డా.మల్లేల గురవయ్య | సౌమ్యశ్రీ ప్రచురణలు | మదనపల్లె ప్ర ము 1986 |
| 183 | శ్రీ విష్ణు సహస్రనామము [సంస్కృ తము] తెలుగు వ్యాఖ్యతో | వ్యాసమహర్షి | రామకృష్ణమఠం | హైదరాబాద్ 19 75 |
| 184 | శ్రీశివలీలలు | మడిపల్లి భద్రయ్య | రచయిత స్వంత ప్రచురణ | నిర్మల్ ప్రథమ ముద్రణ మార్చ్ 2012 |
| 185 | శ్రీ శివానంద సరస్వతీ వైభవము | డా. మల్లెల . గురవయ్య | సౌమ్యశ్రీ ప్రచురణలు | మదనపల్లె ప్ర ము 1986 |
| 186 | సంకేతపద కోశము [సంకలనము] | రవ్వా శ్రీహరి, ఆంధ్రోపన్యాసకుడు, నిజాం కళాశాల | ఆంధ్రసారస్వత పరిషత్ | హైదరాబాద్ ముద్రణ1973 |
| 187 | సంగీత రత్నాకరము [సం] | శార్ఙ్గదేవుడు | పొ.శ్రీ తె వి.విద్యాల | హైదరాబాద్ జులై 2009 |

| | | | | |
|---|---|---|---|---|
| 188 | సంగీత విద్యా దర్పణము [కొత్త] | కూర్పు: ఏకా సుబ్బారావు | శ్రీ మహాలక్ష్మి బుక్ కార్పొరేషన్ | విజయవాడ ముద్రణ జనవరి 2007 |
| 189 | సంస్కృతాంధ్ర నిఘంటువు [తొలి ప్రచురణ 1893] | వెత్సా వెంకట శేషయ్య | ప్రాచీ ప్రచురణలు | ప్రాచీ పునర్ముద్రణ ఫిబ్రవరి,1995 |
| 190 | సమగ్ర నవగ్రహ అనుగ్రహము | సంకలనం. కందేపు సుధాకర్ | గొల్లపూడి వీరాస్వామి & సన్స్ | రాజమండ్రి నూతన ముద్రణ సెప్టెంబర్ 2013 |
| 191 | సమగ్రాంధ్ర సాహిత్యము 1,2 భాగాలు | ఆరుద్ర | తెలుగు  అకాడెమి | హైదరాబాద్  ప్ర ము 2003 |
| 192 | సమీరకుమారవిజయము | పుష్పగిరి తిమ్మన | వావిళ్ళ ప్రచురణలు | చెన్నపురి  ముద్రణ 1930 |
| 193 | సర్వవేద వాఙ్మయము [ప్రాథమిక పరిచయము] | విద్వాన్ గొట్టుముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి | గొల్లపూడి వీరాస్వామి సన్ | రాజమండ్రి  [ఆంధ్ర] ముద్రణ 2007 |
| 194 | సస్వరవేద మంత్రాలు [సంస్కృతము] | సంకలనము | శ్రీ రామకృష్ణ మఠం | హైదరాబాద్  ప్ర 2005 |
| 195 | సింహాసన ద్వాత్రింశిక | కొఱవి గోపరాజు | ఆం.ప్ర సా.అకాడమి | హైదరాబాద్  ప్ర 2005 |
| 196 | సీతారామాంజనేయ సంవాదము | పరశురామ పంతుల రామమూర్తి | వావిళ్ళ ప్రచురణలు | మద్రాసు. ప్రచు 1982 |
| 197 | సుగ్రీవ విజయము | కందుకూరి రుద్రకవి | పొట్టి శ్రీరాములు తె విశ్వ విద్యాలయము | హైదరాబాద్ జులై 1999 |
| 198 | సుదక్షిణా పరిణయము | తెనాలి అన్నయ కవి | వావిళ్ళ ప్రచురణ | మద్రాసు. ప్రచు 1941 |
| 199 | సుదర్శన చక్రరాజ శతకము | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | అక్షరార్చన ప్రచురణలు | కర్నూలు [ఆంధ్ర] 2009 విరోధి – విజయదశమి |
| 200 | సుభద్రా పరిణయము [పరిష్కు ఉన్నం జ్యోతివాసు] | కూచిమంచి జగన్నాథ [జగ్గ]కవి | DACRI ప్రచురణ | హైదరాబాద్  ప్ర. ము 2013 |
| 201 | సూర్యరాయాంధ్ర నిఘంటు సంపుటములు | సంకలనము | తెలుగు విశ్వ విద్యాలయము | హైదరాబాద్ తృతీయ ముద్రణ 1988 |
| 202 | సౌందర్యలహరి : విశ్లేషకులు పంచయజ్ఞం అగ్నిహోత్రావధానులు | ఆదిశంకరాచార్యులు | జే పి ప్రచురణలు | విజయవాడ /ప్రథమ ముద్రణ జూన్ 2008 |

| | | | | |
|---|---|---|---|---|
| 203 | సౌభాగ్యభాస్కరము [శ్రీలలితా సహస్రానామమునకు వ్యాఖ్య] | డా. నోరి భోగీశ్వర శర్మ | శ్రీనారాయణ శంకర భగవత్పాద సరస్వతీ సాహితీ సంస్థ | కొవ్వూరు [ఆంధ్ర] 534350 [పిన్] ద్వితీయ ముద్రణ: 2008 ఆగష్టు |
| 204 | స్తోత్ర రత్నావళి | సంకలనము | గీతాప్రెస్ | గోరఖ్ పూర్ 24 వ పునర్ ముద్రణ 2014 |
| 205 | హరవిలాసము [విశ్వనాథ పీఠికతో] | శ్రీనాథమహాకవి | యం.శేషాచలం &కో [EMESCO] | విజయవాడ ప్రచురణ సం 2006 |
| 206 | హరివంశము | ఎఱ్ఱాప్రెగడ | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1926 |
| 207 | హరిశ్చంద్ర నలోపాఖ్యానము [ద్వ్యర్థి కావ్యం] | రామరాజభూషణుడు | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1953 |
| 208 | హరిశ్చంద్రోపాఖ్యానము | గౌరన | వావిళ్ళ ప్రచురణ | చెన్నపురి ముద్రణ 1956 |
| 209 | English – Telugu Dictionary | Charles Philip Brown | Asian Educational Services | New Delhi Reprint 1983 |